పాలమూరు జిల్లా దేవాలయాలు

కపిలవాయి లింగమూర్తి

KABA 103B141

పాలమూరు జిల్లా ఆలయాలు

కపిలవాయి లింగమూర్తి

తిరుమల - తిరుపతి దేవస్థానం వారి
ఆర్థిక సహాయంతో ప్రచురించబడింది

"PALAMOORU ZILLA ALAYALU" - A Bird's eyeview of temples of Mahaboob Nagar District written by Kapilavai Lingamurthy, Retd. Telugu Lecturer, Nagar kurnool.

Published with the Financial Assistance of Tirumala - Tirupathi Devastanams, Tirupathi.

© Author

Vani Publication No. 10

ప్రథమ ముద్రణ :
ప్రజోత్పత్తి - చైత్రం

ప్రతులు : 1000

వెల : రూ. 100/-

ముఖచిత్ర రచన :
శ్రీ శీలా వీర్రాజు

లభించు చోటు :
కపిలవాయి లింగమూర్తి
15-84, వాణీ సదనం,
విద్యానగర్ కాలనీ,
నాగర్ కర్నూలు,
మహబూబ్‌నగర్ జిల్లా.
పిన్ కోడ్ - 509 209

ముద్రణ :
పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్
1-1-517/B/1 న్యూ బాకారం,
గాంధీనగర్, హైదరాబాద్.
ఫోన్ - 68418.

నివేదనం

మా తాలూకాలో వట్టెం ఒక చారిత్రక గ్రామం. దానికి ఆగ్నేయంగా ఉన్న అడ్డగట్టుక్రింద గుడ్లనర్వ నివాసి శ్రీ చింతకుంట నరసింహారావుగారు కుసుమహరనాథ బాబాగారి ఆశ్రమాన్ని స్థాపించినాడు. పాలెంలో వెంకటేశ్వరుడున్నాడు కాబట్టి కొంతకాలాని కాయనకు ఆకొండపై అలమేలుమంగను ప్రతిష్ఠించవలెననే సంకల్పం కలిగింది.

మానవులకు కలిగే సంకల్పాలన్ని నెరవేరటం అరుదు. చెట్టుకు పూసిన పూతఅంతా కాయగా మారదుగదా! తానొకటి తలచితే దైవమొకటి తలుస్తాడు. అందుచేత ఆయన సంకల్పం కార్యరూపం ధరించేవరకు అక్కడ స్వామివారు లేకుండా అమ్మవారు నిలువటం బాగుండదని ఆయననే ప్రతిష్ఠించే అందుకు నిశ్చయమై అపుడే రిటైరైన శ్రీ జి. నారాయణరావు I.A.S గారి అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పడింది. దానిలో స్థానికుడైన సందడి రంగారెడ్డిగారు ప్రముఖుడుగా ఉన్నాడు.

స్వామి ఎప్పుడెవరెని నిమిత్తమాత్రునిగా చేసి తన సేవ చేయించుకుంటాడో ఎవరు చెప్పగలరు? నరసింహుడన్నా నారాయణుడన్నా రంగడన్నా అభిధాభేదమేగాని అర్థభేదంలేదు కాబట్టి నరసింహారావుగారి సంకల్పం రంగారెడ్డిగారిలో కార్యరూపం ధరించింది. దానితో అక్కడ 4-11-1982 ఆశ్వయుజ బహుళ తదియనాడు శ్రీ పాలువాయి గోవర్ధనరెడ్డిగారు ఆలయానికి శంకుస్థాపన చేసి ప్రారంభ దుందుభిని మ్రోగించినాడు.

ఆ తర్వాత నేను క్రీ.శ. 1983 జూలైలో హరనాథబాబాగారి జయంతికి మిత్రుని ఆహ్వానాన్ని పురస్కరించుకుని అక్కడికి వెళ్ళినాను. అప్పటికే అక్కడ నిర్మాణం ప్రారంభమయింది.

ఆనాడక్కడికి శ్రీ జి. నారాయణరావుగారు, సందడి రంగారెడ్డిగారు, బత్తిని మన్నెపురెడ్డిగారు, ఇంకా మరికొందరు ప్రముఖులు వచ్చినారు. అపుడు

భజనానంతరం నరసింహారావుగారు నన్ను శ్రీ నారాయణరావుగారికి ఒక రచయితగా పరిచయం చేసినారు.

పూవు పుట్టగానేగాదు అది మెట్టినచోటనల్లా దాని తావి వ్యాపిస్తూనే ఉంటుంది. అలాగే కార్యశాలియైన వ్యక్తి ఎక్కడఉన్నా దాగడు.

శ్రీ నారాయణరావుగారికి సాంఘిక సంక్షేమ కార్యక్రమాలన్నా సంస్కృతీ సదస్సులన్నా కవులు కళాకారులన్నా ప్రాణం. తాను పనిచేసిన చోటనల్లా అటువంటి సంస్థలకు చేయూతనిస్తూనే వచ్చినాడు. ఆయనగుండా ఎందరో కవులకు కళాకారులకు గూడ ప్రేరణ లభించింది కాబట్టి ఆయన నాగురించి వినగానే వెంటనే అక్కడ తాము నిర్మించబోయే ఆలయాన్ని గురించి ఒక చరిత్ర వ్రాయించవలెనని అక్కడ స్వామిని ప్రధానంగా చేసుకుని మా జిల్లాలోని ప్రముఖ దేవాలయాలన్నిటిని దానిలో ఒక గృధ్రావలోకనంగా చూపించవలెనని సంకల్పించినాడు.

సాధారణంగా కార్యపరులకు కలిగిన సంకల్పం ఊరకపోదు. అందు చేత ఆయనగారపుడే నాతో కొన్ని ప్రసిద్ధక్షేత్రాలపేర్లు వ్రాయించి వెంకన్న కొండను ప్రధానంగా చేసికుని అవన్నీ దానిలో వ్రాయవలసిందని, గ్రంథం పూర్తిఅయితే దాన్ని అక్కడ స్వామివారి ప్రతిష్ఠనాటికే అచ్చులో తేగలమని చెప్పినాడు.

అపుడు వారామాట నాకు చెప్పేవరకు నాకీ రచనను గురించిన ఊహగాని వ్రాయవలెననే సంకల్పంగాని లేదు. కాని ఆయనగుండా అందిన ప్రేరణతో యిల్లుచేరి రచన ప్రారంభించినాను. ఇదివరకే నేను మా జిల్లాలోని కొన్ని ప్రసిద్ధమైన ప్రాచీనగ్రామాలను గురించి ఆలయాలను గురించి భారతి, అరాధన, మూసి, సప్తగిరి పత్రికలలో వ్రాసిఉన్నాను కాబట్టి తాలూకా వారీగా ఒక పథకం నిర్ణయించుకుని ఉత్సాహంగా ఆయాప్రదేశాలకు వెళ్లి మరికొన్ని దర్శించవలసిన స్థలాలు చూచి విశేషాలన్నీ సేకరించుకున్నాను.

మనదేశంలో సాధారణంగా చిన్నదో పెద్దదో ఏదోఒక గుడిలేని ఊరు లేదు. ఈ విషయంలో "అడుగడుగున గుడి ఉంది" అనే దేవులపల్లివారి మాట

ఎంతో సత్యతరంగా ఉంది. అందుచేత నేను మా జిల్లాలోని ప్రతిఆలయాన్నిగాక కొంతప్రాచీనచరిత్ర, లేదా అక్కడి దైవానికి ఏదోఒక మాహాత్మ్యంకలవానిని మాత్రమే దృష్టిలో పెట్టుకుని ఇది వ్రాసినాను. ఇక ఆలయాలనుగురించి చెప్పే అపుడు నా దృష్టికి అందినంతవరకు అక్కడి శిల్పవిశేషాలను గురించిగూడ తెలిపి ఇంకా ఇతరవివరాలకు అవసరమైనచోట అవి ప్రచురింపబడిన పత్రికల రెఫరెన్సులు గూడ యిచ్చినాను.

ఈవిధంగా నేను నా పథకం ప్రకారం దీన్నిపూర్తిచేసి క్రీ శ. 1986 నాటికి శ్రీ నారాయణరావుగారికి రెండు జిరాక్సుకాపీలు అందజేసినాను. కాని ప్రతిష్ఠనాటికి వారికి దీనిముద్రణకు వ్యవధికాని వ్యయంకాని చాలలేదు. అందువల్ల అప్పటికిది ఆగిపోయింది. ఇక ఆలయంలో స్వామివారి ప్రతిష్ఠమాత్రం క్రీ.శ. 19-5-1986 నాడు శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చినజియ్యరుగారి కరకమలాలతో అక్షయ వైభవంగా జరిగిపోయింది.

నేను దీన్నిపుడు ముద్రించలేమనే ఆలయకమిటీ వారి మాటలు విని పుస్తకాన్ని పట్టుకునివచ్చి అన్నిటితోపాటు అటకపై ఉంచినాను. అపుడు కొన్ని దినాలకు గద్వాలకాలేజీలో పనిచేస్తూ మన. జిల్లా గ్రామదేవతల జాతరలపై పరిశోధనచేస్తున్న శ్రీ జనార్దనభట్టుగారు విషయసేకరణకై నాదగ్గరకు వచ్చి దీన్ని చూచి 'ఇంత శ్రమపడినారుకదా! దీన్ని తిరుపతికి ఎందుకు పంపలేదు?' అని జ్ఞాపకం చేసినాడు. తిరుపతి దేవస్థానంవారు ఇంతవరకు నాకు-

1.	చక్రతీర్థ మాహాత్మ్యం	2.	చూతపురీ విలాసం
3.	శ్రీమద్భాగవత మాహాత్మ్యం	4.	శ్రీమత్ప్రతాపగిరి ఖండం
5.	సాలగ్రామ శాస్త్రం	6.	భువనమోహినీ విలాసం

అనే కృతులకు సహాయం చేసినాడు కాని అవి అన్నీ ఒక ఎత్తు, ఇది ఒక ఎత్తు. ఆ స్వామి నన్నెపుడూ నిరాకరించలేదు కనుక అన్నిటికీ అతడే ఉన్నాడన్న ధైర్యంతో దీన్ని గూడ పంపినాను. ఈ పర్యాయం నా నమ్మకం వమ్ము కాకుండా ఆ స్వామి ఉదారంగానే కరుణించి దీనికి పదివేలు మంజూరు చేసినాడు. అయితే ఇది యింకా నా అంచనాకు తక్కువేమరి.

రచనకు ప్రేరణ కలిగించినవాడు నారాయణరావుగారు కాబట్టి నేనీ విషయం మళ్ళీ వారికి తెలిపినాను. అపుడాయన సంతసించి 'మీరిక ఏ మాత్రం చింతించవద్దు. మన కన్నిటికీ ఆ శ్రీనివాసుడే ఉన్నా'డని వెన్నుతట్టి ఇక ముద్రణ పని ప్రారంభించండి అన్నాడు.

అయితే ఇప్పుడొక చిక్కేర్పడింది. నేను మొదట ఈ రచన చేసిన నాటికి 13 తాలూకాలుగా ఉన్న మా జిల్లా ఇపుడు 64 మండలాలుగా విభక్తమయింది. అందుచేత నేను ఎన్నుకున్న ఆలయాలు ఇపు దేయే మండలాలకు చెందుతున్నాయో చెప్పటానికి ఈ రచననంతా పునర్వ్యవస్థీకరించవలసివచ్చింది. ఈ లోపల నాకు ఆలయాలను గురించి మరికొంత సమాచారం గూడ తెలిసింది కాబటి దాన్ని చేర్చుతూ ఈ చరిత్రనంతా మళ్ళీ వ్రాసినాను. అయితే ఇప్పటికీ ఇది సమగ్రం అని చెప్పలేను. నాకు తెలియని విషయాలు ఇంకా ఎన్నో మిగిలి పోవచ్చు. ఇప్పటికి నాకు ఈ విషయ సేకరణలో—

1. అమరాబాదు ఆరణ్యకాలకు - శ్రీ రాజగిరి పరశురాముగారు - (వంకేశ్వరం)
2. ఆత్మకూరును గురించి - శ్రీ వైద్యం వెంకటేశ్వరాచార్యులు గారు - (కర్నూలు)
3. కొల్లాపురాన్ని గురించి - శ్రీ ప్రతికంఠం రాజుగారు - (భట్టుపల్లె)
4. గద్వాలను గురించి - శ్రీ కే. ప్రభాకరవర్ధన్‌గారు - (గద్వాల)
5. పాలమూరిని గురించి - శ్రీ యం. రంగారావుగారు - (నాగర్‌కర్నూలు)
6. వనపర్తిని గురించి - శ్రీ ఇటుకూరి బలభద్రయ్యగారు - (వనపర్తి)

ఇంకా ఇతర మిత్రులు శ్రీయుతులు చౌడూరి గోపాలరావుగారు, తాళ్ళపల్లి చంద్రయ్యగారు, అందోజు రామాచారిగారు, ఛాత్రులు మల్లేపల్లి శేఖరరెడ్డి,

అక్కల బాలకృష్ణయ్య గౌడు, వెలిదండ సత్యనారాయణ అడిగినంతనే ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా సంభాషణ ద్వారా ఎంతో విషయాన్ని సేకరించి అందించినారు.

నాకు ఈ రచనలో అలంపురాన్ని గురించి శ్రీ గడియారం వారి పుస్తకాల నుండి కావలసిన సమాచారం లభించింది. కాని నేను స్వయంగా చూసినవిపోగా ఎంత ప్రయత్నించినా మిగిలిన వానికోసం కొడంగలు - మక్తలు తాలూకాల నుండి నాకు ఆశించినంత సమాచారం అందలేదు.

ఇక నేను రచన ప్రారంభించే నాటికి కలువకుర్తిలోని కన్యకా పరమేశ్వరి ఆలయం, షాద్‌నగర్ వెంకటేశ్వరాలయం వంటివి లేవు. ఇపుడవేకాక మరికొన్ని ఆలయాలు పునరుద్ధరింపబడినవి, కొన్ని క్రొత్తవి వెలసినవి. ఉత్సవాలు గూడ ఏర్పడినవి. అవి నా ఈ రచనలోనికి రాలేదు. కాబట్టి పాఠకులు ఈ లోపాన్ని మన్నిస్తారనే ఆశిస్తున్నాను.

ఇక ఈ సందర్భంలో నేను మన హిందూసంస్కృతి రక్షణకు పాటు పడుతున్న విశ్వహిందూ పరిషత్తును గూడ స్మరించవలసివుంది. దాని ప్రేరణ ఎప్పుడూ నాకు ఉండనేవుంది. ఈ పరిషత్తు మా జిల్లాలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర, శ్రీలక్ష్మీచెన్నకేశవ, శ్రీరంగనాయక, ఉమామహేశ్వర, సంగమేశ్వర, కృష్ణవేణి అని ఇక్కడి ప్రసిద్ధదేవతలపేర ఆరువిభాగాలుగా పని చేస్తుంది. ఈ విభాగాలు వనపర్తి, పాలమూరు అని రెండు జిల్లాలుగా విభజింపబడినవి. వానిలో నేను వనపర్తికిచెందిన ఉమామహేశ్వర విభాగ్‌కు చెందుతాను కాబట్టి ఆ క్షేత్రాన్ని దీనికి ముఖచిత్రంగా స్వీకరించినాను. ఈ విభాగ్‌యొక్క సహాయకార్యదర్శి స్థానికుడైన శ్రీ లగిసెట్టి జగదీశ్వర్‌గారు ఈ రచనకు ఎంతో అభిమానిగా ఉండి తనవంతు సహాయాన్నిగూడ అందించినాడు. ఈలాగే తాండూరు మండలాధ్యక్షుడు రాములుగారు నా రచనలకు అభిమానిగా ఉన్నాడు.

మన పూర్వులు గ్రంథరచనమేగాని ముద్రణా ప్రయాసమెరుగరు. ఎవరో అభిరుచివున్నవారు ఆయారచనలకు కాపీలు వ్రాసుకునేవారు. కాని ఈనాడలాకాదు. పాఠకులకు ప్రతిని గ్రంథకర్తయే అందించవలసిఉంది. కాబట్టి

యిక దానిముద్రణకు వచ్చేవరకు శుద్ధప్రతిలేఖకులు, చిత్రకారులు, ఛాయాచిత్ర కారులు, అచ్చుశాలవారు, అచ్చుతప్పులు చూసేవారు ఈవిధంగా ఎందరో అవసర మౌతున్నారు. ఈనాడు ఇవన్నీగూడ ఒక్కొక్క కళగా ఉన్నవి కాబట్టి రచయిత వీనిలో ఒకటిరెండు కంటె ఎక్కువగా చూసుకోలేడు. అందుచేత అతనికి రచన ఒక ఎత్తయితే దానిముద్రణ మరోఎత్తుగావుంది.

పూర్వం వ్యాసమహర్షికి గణపతి, ఆంధ్రవ్యాసుడైన తిక్కనగారికి గురునాథుడు లేఖకులుగా ఉండిరట. ఈనాడు కవికి అటువంటి ఉక్తలేఖకులు గాకున్నా ప్రతిలేఖకులైనా అవసరం.

నాకు మొదట దీన్ని జాతీయపాఠశాల ఉపాధ్యాయుడు శ్రీ పాలమూరు వీరయ్యగారు, రెండవసారి శ్రీయుతులు మీనాప్రభాకరశర్మ, పద్మాలయా రామచంద్రాచార్యగారలు వ్రాసిపెట్టినారు. వీరిద్దరూ నాకు ఛాత్రప్రాయులైన M.A. పట్టభద్రులు.

ఈ విధంగా నేను దీన్ని రెండవసారి సిద్ధంచేసేవరకు వట్టెంలో మళ్ళీ స్వామివారి సన్నిధిలో ఆంజనేయ ప్రతిష్ఠ వచ్చింది. దాన్ని హైదరాబాదు నివాసి శ్రీ కబళవాయి రాధాకృష్ణగారు తమ కుమారుడైన సతీశ్‌గారితో 16-2-1990 నాడు చేయించినాడు. అదికూడ మళ్ళీ స్వామివారి ప్రతిష్ఠవలెనే శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చినజియ్యరు స్వామివారి సమక్షంలో ఎంతో ఘనంగా నడిచింది. ఈ ఆలయానికి అధ్యక్షుడుగాబట్టి అపుడు శ్రీ నారాయణ రావుగారు అక్కడికి వచ్చినారు. ఆ సమయంలో నేను వెళ్ళి ఆయన్ను కలిసి నాను. అపుడాయన దీనిముద్రణ విషయం సభాముఖంగా ప్రకటించి కొందరు దాతలతో శ్రీ జియ్యరు స్వామివారి యెదుట ఆర్థిక సహాయానికి వాగ్దానం చేయించినాడు. ఆ తర్వాత నేను మరికొందరిని కలిసినాను. ఇక మీరు వారి పరిచయాలనుగూడ చేసికోండి. నాకు దీని మొదటిదాత శ్రీ జి. నారాయణ రావుగారే కనుక వారితోనే దీన్ని ప్రారంభిస్తున్నాను.

వీరు హనుమకొండలో జయలక్ష్మి, లక్ష్మయ్యగారనే సదాచారులకు జనించి, ఉస్మానియానుండి క్రీ. శ. 1949 లో M.A. లో రసాయనశాస్త్రంలో

సర్వ ప్రథముడుగా నెగ్గి మొదట కొలదికాలం నిజాం కళాశాలలో ఉపన్యాస కుడుగా చేరి అనంతరం 1950 లో తహశీల్దారుగా వెళ్ళి 1973 నుండి I.A.S. ఆఫీసర్‌గా పురోభివృద్ధిని పొంది 1988 లో మా జిల్లానుండి విశ్రాంతినందినారు.

విద్యార్థి దశనుండియే వీరికి సాహిత్యాభిరుచి సంఘసేవాసక్తి అలవడింది. ఇపుడరువదిలో పడినా యిరువదేండ్ల చురుకుదనంతో సంఘసేవలో సాహితీ సదస్సులలో పాల్గొంటూ ఉంటారు. నగరంలోను దాని వెలుపలా ఎన్నో సంస్థలకు అధ్యక్షుకుగా ఉన్నారు. వానిలో మా తాలూకాలోని వట్టెం శ్రీ వెంకటేశ్వర దేవస్థానం, సిటీలో శ్రీశ్రీశ్రీ సుందరచైతన్యానంద స్వామివారి సత్సంగం ప్రముఖమైనవి.

వీరి సతీమణి కమలమ్మగారు పతిగారి పేరుకుతగిన యిల్లాలు. పురుషు డెంతో గొప్పవాడు కావచ్చుగాక కాని అతనికి పేరుకుతగిన యిల్లాలు దొరకటం ఒక అదృష్టం. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కూతురులు గలిగి నారు. అందరూ వివాహితులై కాపురాలు చేసుకుంటున్నారు. ఇక్కడ వీరితో పాటే చెప్పదగిన మరోవ్యక్తి-

2. శ్రీ కబళవాయి రాధాకృష్ణగారు

వీరు శ్రీ నారాయణరావుగారు ఒకే వర్గానికిచెంది ప్రస్తుతం ఒకేమార్గంలో జ్ఞాన్‌బాగ్ కాలనీలో ఉన్నారు. రాధాకృష్ణగారు సహజంగా కపిలవాయి వారేగాని కబళవాయివారు మాత్రంగాదు వీరి తలిదండ్రులు ధనలక్ష్మి సత్యనారాయణగారలు. ఈయన వసుపుత్రుడైనందుకు వాసవీభక్తుడై జగన్‌గూడ వాసవీకన్యకాలయానికి, భాగ్యనగరంలో శ్రీ వాసవీ మహిళాసంఘానికి, వాసవీ విద్యాలయానికి, వాసవీ మెడికల్ రిసెర్చి సెంటరుకు తనయొక్క అమూల్యమైన సేవనందిస్తూ ఆను వంశికమైన వసు-వెండి బంగారు నగల-వ్యాపారంలో భాగ్యనగరంలో పేరెన్నిక గన్నాడు.

వీరి సతీమణి పుష్పావతమ్మగారు తమ యింటిని బృందావనంవలె పుష్ప నిలయంగా తీర్చింది. అంతేగాక పతితోకలిసి సంఘసేవలోగూడ పాలు పంచ కుంటుంది.

క్రీ. శ. 1988 లో భాగ్యనగరంలో జరిగిన వాసవీ విశ్వశాంతియజ్ఞంలో కవిరత్న నీలా జంగయ్యగారీమెకు తమ "అగ్నిదీప్త" నంకితమిచ్చినారు. క్రీ. శ. 1989 లో హైదరాబాదు రాష్ట్ర వైశ్యసంఘ సమాఖ్యవారు శ్రీ రాధాకృష్ణ గారికి "వైశ్యరత్న" అనే బిరుదునిచ్చి వారి పరిచయాన్ని ప్రకటించినారు. పిమ్మట అయన క్రీ. శ. 1990 జూన్‌లో సతీసమేతంగా రెండు నెలలు అమెరికా యాత్రచేసిరాగా 1991 ఫిబ్రవరి 10 నాడు ఘనంగా సన్మానించి అయన యాత్రా పరిచయాన్నిగూడ ప్రకటించినారు.

ప్రస్తుతం వీరు హైదరాబాదులో నిర్వహిస్తున్న పదవులన్నీ చెబితే ఒక దండకం అవుతుంది. ఇపుడు వీరు వట్టెంలోని వెంకన్న కొండపై హనుమదాలయాన్ని కట్టించి అక్కడికి వచ్చే భక్తులకు, దాతలకు ముందు వరుసలో నిలుచున్నారు.

3. డాక్టర్ బి. బాలనారాయణగారు

ఈయన అచ్చంపేట తాలూకాలోని ఉప్పునూతల గ్రామవాసి. మాణిక్యమ్మ పరంధామయ్యగారలతని తల్లిదండ్రులు. ఈయన హైదరాబాదులోని ఉస్మానియా వైద్యకళాశాల నుండి M. B. B. S చేసి ప్రారంభంలో కొంతకాలం ప్రైవేటు ప్రాక్టీసుపెట్టి ఇపుడు ప్రభుత్వడాక్టర్‌గా కొనసాగుతున్నాడు.

బాలనారాయణగారికి బాల్యం నుండియే సదాశయాలు కలిగినవి కాబట్టి వృత్తిలోను కాపురంలోను నిరంతరం తలమునకలుగా ఉన్నా వాని బంధంలో చిక్కక సత్సంగాలతో అనుబంధం పెంచుకుని యింటిపేరు నిలిపినాడు. అచ్చంపేటలో మిత్రులతో కలిసి లయన్సు క్లబ్బు స్థాపించి దానిద్వారా వారు చేస్తున్న సేవ తాలూకావాసులెందరో పొందుతున్నారు.

ఈయన నాకు మా తాలూకాలో మొదటివాత. నాతో మొదటిసారిగా తమ గ్రామాన్ని గురించి "ఉప్పునూతల కథ" వ్రాయించినాడు. అనంతరం భాగవత కథా తత్వానికి ఉదారంగా ఆర్థిక సహాయం అందించినాడు. దానిలో ఈయన వంశం నేను సమగ్రంగా చెప్పినాను.

4. శ్రీ మాలె చంద్రమౌళిగారు

అచ్చంపేట అనే తాలూకా లక్ష్మికి డా॥ బాలనారాయణగారు కుచబంధంగా చంద్రమౌళి గారు తోమాలెగా తమ మండలాలకు గర్వకారణంగా ఉన్నారు. ఈ పరంపరలో శ్రీ జి. నారాయణరావుగారు, రాధాకృష్ణగారు, చంద్రమౌళిగారు వీరంతా లక్షీపుత్రులు. ఈయన వయసులో చిన్నవాడైనా మనస్సులో పెద్దవాడని పేరందినాడు.

చంద్రమౌళిగారు అమరాబాద నివాసి. మాలె ఎల్లయ్య లక్ష్మమ్మ గారల కుమారుడు. ఎల్లయ్యగారు తమ కాలంలో అమాయకత్వానికి ఎల్లగా ఉన్నాడు. ఇపుడు చంద్రమౌళిగారు తండ్రి గారికి ప్రతిరూపంగా ఉన్నాడు.

సంతానానికి దేవతలపేర్లు పెట్టుకుంటే వారి అంశ కొంతైనా తమ బిడ్డలలో ప్రతిఫలిస్తుందని భారతీయుల నమ్మకం. అందుకే వారు తరచుగా తమ సంతానానికి దేవతలపేర్లు పెట్టుకుంటూ ఉంటారు. అయితే యిది సర్వత్ర సార్థకం కాకపోవచ్చు గాని ప్రస్తుతం చంద్రమౌళిగారు మాత్రం పేరుకు తగినట్లు త్యాగంలో భోళాశంకరుడుగానే ఉన్నాడు. సరళహృదయుడు, సచ్ఛీలుడు అని పేరంది ప్రస్తుతం అమరాబాదు మండలానికి అధ్యక్షుడుగా ఉన్నాడు.

వీరి సతీమణి రూపగారు. ఈ దంపతులకిపుడు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్ళున్నారు. బాలనారాయణగారి వంశంవలె అమరాబాదులో వీరిది గూడ ఒక పెద్దవంశం; అందుచేత దాని సమగ్ర వివరానికి ఇక్కడ స్థలం చాలదు. అందుచేత దాన్ని నేను నా ప్రతాపగిరి ఖండంలో చేర్చుతున్నాను - దాన్ని అందుకోసంగానే ఉంచినాను.

5. డా. పాపిసెట్టి గోపాలుగారు

అమరాబాదులో మాలెవారితోపాటు ప్రసిద్ధమైన వారిలో పాపిసెట్టి వారి కుటుంబం గూడా ఒకటి. ఇది మాలెవారి కంటె విస్తృతమయింది. ఆ వంశానికి చెందిన గోపాలుగారు సీతమ్మ రంగయ్యగారల కుమారుడు. వీరి అన్నగారు పాండురంగంగారు కొంత కాలం నాకు సహోద్యోగిగాను తక్కిన సోదరులు విద్యార్థులుగాను ఉన్నారు.

గోపాలుగారు నలుగురు సోదరులు. వారిలో ఇతడు వయసుకు చిన్నవాడు హోదాకు పెద్దవాడుగా ఉన్నాడు. ఈయన శ్రీమతి చంద్రకళగారు పైచంద్ర మౌళిగారి సోదరి. ఆమె శ్రీకృష్ణునికి శిఖిపింఛంవలె ప్రియమైన భార్యగా సంస్కారం గల యిల్లాలుగా ఉంది. ఈ దంపతులకు నలుగురు కూతులు ఒక కుమారుడు ఉన్నారు.

డా॥ బాల నారాయణరావుగారు, మాలె చంద్రమౌళిగారు, ఈ గోపాలుగారు ముగ్గురు మా తాలూకా వారేగాక నన్ను ముఖ్యంగా అభిమానించి నా కృషికి ఒక ప్రోదిగా కూడా ఉన్నారు.

6. శ్రీ ఆకారపు బాలస్వామి గుప్తగారు

వీరు నాగర్‌కర్నూలు నివాసులు. లక్ష్మీకాంతమ్మ లక్ష్మీనరసయ్యగారి కుమారత్రయంలో జ్యేష్ఠులు. స్థానికంగా నన్నభిమానించినవారిలో ముఖ్యులు. వీరు ఇంటిపేరుకు తగినట్లు స్థానిక వైశ్య సంఘంలో కన్నాకై జీవించి కుడిచేతి దానం ఎడమచేతికి తెలియకుండా ఎన్నో ధర్మ కార్యాలలో పాలుపంచుకున్నాడు.

ఈయన ధర్మకార్యాలలో ముఖ్యంగా చెప్పదగింది పంచలింగ ప్రతిష్ఠ. కాశీయాత్ర చేసినందుకు ఫలితంగా అక్కడి నుండి అయిదు శివలింగాలు తెచ్చి ఒకటి స్వామి సర్వేశ్వరానందంగారికి, ఒకటి మీనాంబరానికి, ఒకటి పాలెం గ్రామానికి, ఒకటి దోమలపెంటకు యిచ్చి చివరది స్థానికంగానే ఆలయం కట్టించి ప్రతిష్ఠ చేసినాడు.

హిందూ మతంలో ఆలయానికి వెళ్ళి స్వామిని దర్శించటంతోపాటు దాని శిఖర దర్శనం గూడ ఒక పుణ్యంగానే భావించబడుతుంది. అందుచేత ఆయన కావేరమ్మపేటలో భ్రమరాంబ గుడికి, స్థానికంగా కన్యకా పరమేశ్వరి ఆలయానికి, సాయిబాబా మందిరానికి శిఖరాలు కట్టించినాడు. ఆయన చేసిన ఈ కార్యాలు అతని తాత్విక దృష్టికి నిదర్శనంగా ఉన్నవి.

వీరి సతీమణి లక్ష్మమ్మగారు వేంకటేశ్వరునికి అలమేలుమంగవంటి యిల్లాలు. ఈ దంపతులకు యిద్దరు కుమారులు ముగ్గురు కూతులు కలిగినారు. అందరూ వివాహితులై కాపురాలు చేసికుంటున్నారు.

7. డా. శ్రీ డి. నారాయణగారు

వీరు వరంగల్ జిల్లాలోని అరిపిరాల వాస్తవ్యులు; దాసా గోపయ్య లక్ష్మీ నరసమ్మ గారల తృతీయ పుత్రులు. వీరి అన్నగారింటి దగ్గర వ్యవసాయం వ్యాపారం చూస్తుంటారు. ఈయన సూర్యాపేటలో హైస్కూలు, ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో M.Sc (Ag) పూర్తి చేసి వృక్షాలలో జన్యు శాస్త్రంపై కోయంబత్తూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి పరిశోధనాపట్టం పుచ్చుకున్నాడు.

వీరికి చిరు ధాన్యాల అభివృద్ధి, నూతన వంగడాల సృష్టిపై మిక్కిలిప్రీతి. ఆ విషయాలపై ఇప్పటికి నూటికిపైగా జాతీయ అంతర్జాతీయ పరిశోధనా సంపుటాలలో వ్యాసాలు వ్రాసినారు. ప్రస్తుతం క్రీ.శ. 1982 నుండి పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో అసోసియేట్ డైరెక్టరుగా ఉన్నారు. ఈ కేంద్రం క్రింద ఆరు జిల్లాలున్నవి.

ఈయన ఉద్యోగిగా ఎంత ఉన్నతుడో వ్యక్తిగా అంత నిరాడంబరుడు, జనసులభుడు. వీరి శ్రీమతి పూలమ్మగారు పతికి తగిన యిల్లాలు. ఆమె పేరు పతికి తగినట్లుగా ఏ ఆడంబరం లేనిది కుసుమ-పువ్వు అనే వానికి చక్కని తెలుగు.

ఇపుడు వీరు పాలెంలో తోడి ఉద్యోగుల సహకారంతో తమ పరిశోధనా కేంద్రం ఎదుట ఒక హనుమత్ప్రతిష్ఠ చేసినారు. మునుముందు ఆ ఆలయాన్ని దాని ఆవరణను అరవిందుని యోగాశ్రమంవలె ధ్యాన కేంద్రంగా రూపొందించవలెనని వీరి అభిలాష.

8. శ్రీ సందడి రంగారెడ్డిగారు

సందడివారి మూలస్థానం గోపాలపేట. అక్కడి నుండి రంగారెడ్డిగారి తాతగారు నరసింహారెడ్డి వచ్చి వట్టెంలో స్థిరపడి అక్కడి పోలీస్ - మాలీపటేలు గిరీలు చూసినాడు.

రంగారెడ్డిగారి తండ్రి రాఘవరెడ్డిగారు. తల్లిగారు కిష్టమ్మ. వీరికి యిద్దరు కుమారులు కలిగినారు. ఈయన వారిలో జ్యేష్ఠుడు. ఇరువదేండ్లు P.W.D.లో అసిస్టెంటు ఇంజనీరుగా పనిచేసి వాలంటరీ రిటైర్మెంటు తీసుకుని

ఇపుడు శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చినజియ్యరుగారి శిష్యుడై వట్టెం వెంకటేశ్వరునికి అంకితమైనాడు. నిరాడంబరత్వం, దేవబ్రాహ్మణ గురుభక్తి, విద్యాభిమానం, కుటుంబప్రేమ ఇతనిలో చెప్పదగిన గుణాలుగా వున్నవి. తమ గ్రామంలో తండ్రిగారిపేర ఒక విద్యానిధిని నిలిపి ఏటా గ్రామంనుండి ప్రథమంగా నెగ్గినవారికి దానినుండి ఒక బహుమతి నిస్తున్నాడు. ఇది ఈయనగారి విద్యాభిమానానికి, ప్రస్తుతం అడ్డగట్టుపై రూపుదిద్దుకున్న వెంకటేశ్వరాలయం ఈయన దైవభక్తికి నిదర్శనంగా ఉన్నవి.

ఈయన సతీమణి అయినూలు శ్రీపురం వేంకటనారాయణగారి కూతురు, కుసుమగారు. అన్నివిధాల పేరుకుతగినయామె. రంగని అర్చనా కుసుమం. ఈ దంపతులకు నలుగురు కుమారులు కలిగినారు. వారందరూ ఉన్నత విద్యావంతులు.

9. శ్రీ కూచకుళ్ళ హనుమంతారెడ్డిగారు

ఈయన తూడుకుర్తి రామచంద్రారెడ్డిగారి కుమారుడు. తల్లిగారిపేరు కొండమ్మగారు. కానాపురం రెడ్డిరెడ్డి రామారెడ్డిగారు మగపిల్లలులేనందువల్ల దౌహిత్రుడైన ఇతనిని తమయింట ఉంచుకుని తమవంశీయుడైన గడ్డంపల్లి బారిష్టర్ దామోదరరెడ్డిగారి కూతురు సుకన్యను తెచ్చి వివాహం చేసినాడు. ఈ దంపతులకు నలుగురు కూతులు ఒక కుమారుడు ఉన్నారు.

హనుమంతారెడ్డిగారు సాధుహృదయుడు. కార్యదక్షుడు. కొంతకాలం సహకార సంఘాధ్యక్షుడుగా పనిచేసి ఇపుడు బిజనపల్లి మండలాధ్యక్షుడుగా ఉన్నాడు. సంఘసేవాపరుడు. ఎన్నో గ్రామాలలో గొట్టంబావులు త్రవ్వించినాడు. పాలెం నుండి తమ గ్రామానికి రోడ్డు వేయించినాడు. అక్కడ ఈయన వ్యవసాయక్షేత్రం చూడదగింది. దానిలో ఉసిరి, కొబ్బరి, జామ, దానిమ్మ, మామిడి మొదలైన ఫలవృక్షాలు, చేపల సరస్సులు, కోళ్ళగుడారాలు, ఆవుల, మేకలదొడ్లు కనువిందుగా ఉంటవి. ఫిష్‌పాండ్స్‌లో పారేనీటితో అక్కడ వరిసాగుకూడా జరుగుతుంది. వీనితోపాటు ఒక పాలసేకరణ కేంద్రం గూడా ఉంది. ఈ ప్రాంతంలో పరిశ్రమలవారికి ఈయన ఆదర్శప్రాయుడు. అందుచేత T.V. వారొకసారి ఈయన క్షేత్రాన్ని తమ తెరకెక్కించినారు.

ఈయనగారి కృషిలో అన్నిటికంటె ముఖ్యంగా చెప్పదగింది దత్తారామ పాఠశాల. అది వారు తమతండ్రిగారిపేర తమ ఊరిలో ఆశ్రమ పద్ధతిలో నడుపుతున్నారు.

10. శ్రీ తూము లక్ష్మీనరసింహారెడ్డిగారు

వీరు జడ్చర్ల తాలూకాలోని పోల్కంపల్లి నివాసులు. ప్రస్తుతం బూద పూరులో స్థిరపడి శ్రీసత్యసాయి గురుకులం నడుపుతున్నారు. వీరి తండ్రి వెంకట రామారెడ్డిగారు. తల్లిపేరు రత్నమ్మగారు. ఆమె పేరుకు తగిన గుణంకల మనిషి.

లక్ష్మీనరసింహారెడ్డి గారు క్రీ. శ. 1955 నుండి 62 వరకు జడ్చర్లలో భూతనఖా బ్యాంకు ప్రెసిడెంటుగా, 67 వరకు అక్కడి సమితి ప్రెసిడెంటుగా, 72 వరకు ఆ నియోజక వర్గానికి M.L.A. గా ఉండి అనంతరం రాజకీయ జీవితం విరమించుకుని 81 నుండి పై గురుకులాన్ని ప్రారంభించినాడు.

వీరి జీవితంలో ఇది ప్రారంభించటం గొప్ప మలుపు. ఆయన ఇదివర కటి జీవితం వేరు, ఇప్పటి జీవితం వేరు. ఇపుడాయన శ్రీసత్యసాయి మార్గంలో నడిచే ఒక చిత్తశుద్ధిగల బాటసారి. తన సర్వస్వాన్ని సాయి భగవానునికి అంకితం చేసిన త్యాగి.

ఈయన సతీమణి సుభాషిణిగారు వాక్పారుష్య మెరుగని సార్థక నామ రాలు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఒక కూతురు ఉన్నారు. వారందరూ ఉన్నత విద్యావంతులు, వివాహితులు.

వీరు నాతో క్రీ శ. 1988 లో తమ వంశాన్ని గురించి క్షేపాల గంగోత్రి అనే పుస్తకం వ్రాయించినారు. అందులో వీరి వంశ వివరం సవిస్తరంగా ఉంది. మా జిల్లాలో ఈయన నడిపే గురుకులం తప్పక చూడదగింది.

11. శ్రీ మంద జానారెడ్డిగారు

తెలకపల్లిలో గత శతాబ్దంలో మంద నారయ్యగారు గ్రామ పెద్దగా ప్రసిద్ధులు. వారి కుమారుడైన జానయ్యగారిభార్య సుశీలమ్మగారు. వీరి దాంపత్యం జ్ఞానం శీలం యొక్క ఏకత్వం వంటిది. అందుచేత వారికి కలిగిన నలుగురికి నలుగురూ ఉన్నత విద్యావంతులైనారు. పెద్దవా రిద్దరు డాక్టర్లు. చిన్నవారు

యింజనీర్లు. ఇది సాటివారిలో ఆ తండ్రిగారి విశేషం కాగా, సర్కారీ చదువు చదివినందుకు మళ్ళీ ఆ సర్కారుపైనే ఆధారపడకుండా స్వతంత్ర వృత్తులవలం బించటం ఆ కుమారుల విశేషంగా ఉంది.

పెద్దవాడు లక్ష్మారెడ్డిగారు క్రీ. శ. 1975లో M.B.B.S. చేసి అచ్చం పేటలో ప్రాక్టీసు చేస్తూ 79 నుండి 84 వరకు ఇరాన్ వెళ్ళవలసి వచ్చి తాను నడుపుతున్న "అనిలా నర్సింగ్ హోము"ను తమ్ముడైన పుల్లారెడ్డిగారికి అప్ప గించినాడు. ఆయన మళ్ళీ అన్నగారు రాగానే అక్కడనుండి దాని శాఖను నాగర్ కర్నూలుకు తెచ్చినాడు. ఇపుడది అక్కడ రోగులపాలిట మలయానిలంగా ఉంది.

మూడవవాడు రాజమహేంద్రరెడ్డి ఇంటర్‌చేసి రేము పైపుల ఫ్యాక్టరీ మేనే జింగ్ డైరక్టరుగా, నాల్గవ అతడు రవీంద్రరెడ్డి బి.ఇ. చేసి సాయిబాబా సివిలింజ నీరు కంట్రాక్టరుగా ఉన్నాడు.

వీరందరూ వివాహితులు. లక్ష్మారెడ్డిగారిభార్య సువర్ణగారు. వీరికి యిద్దరు కూతులు. పుల్లారెడ్డిగారి భార్య రమాదేవి, వీరికిద్దరు కుమారులు ఉన్నారు. ఈ సోదరులతోపాటు తిరుపతమ్మ అనే ఒక చెల్లెలుంది. ఆమెను మానాజిపేట మల్లేపల్లివారింటికిచ్చినారు.

12. శ్రీ మల్లేపల్లి శేఖరరెడ్డిగారు

ఇతడు అచ్చంపేట తాలూకాలోని రాకొండ నివాసి. జాతీయోన్నత పాఠశాల విద్యార్థి జిల్లా స్థాయిలో ఉత్తమోపాధ్యాయుడుగా పేరు పొందినాడు. నా రచన దుర్గాభర్గ శతకాలు తమ తలిదండ్రుల స్మృతిగా అచ్చు వేయించినాడు. అందుచేత దానిలో ఇతని వంశ వివరం చెప్పినాను.

ఒక్క మాటలో చెప్పవలెనంటే నా రచనలను గురించి నాకంటెకూడ ఎక్కువగా ముద్రణకు ఇతడే ప్రయత్నిస్తుంటాడు. నా ప్రతి రచనలో ఇతనిది ఏదో విధంగా సహాయంకూడా ఉంటుంది.

13. శ్రీ పొడుగు వెంకటలింగంగారు

నాగర్‌కర్నూలులో మున్నూరు కుటుంబాలెక్కువ. వారిలో పొడుగు వారికి కీర్తిప్రతిష్ఠలలోగూడ పొడుగుగానే ఉంది. అందుచేత ఈయన తండ్రిగారిని ప్రజలు సాహుకారి బాలయ్యగారని పిలిచినారు. ఆయన భార్య రాజమ్మగారు రాజగుణాల మనిషి. వారికి ముగ్గురు కుమారులు అయిదుగురు కూతులు కలిగినారు. ఇతడు వారిలో పెద్దవాడై తండ్రిగారిపేరు నిలిపినాడు.

బియస్సీ చేసినాడు కాని ఉద్యోగంకొరకు చూడలేదు. స్వతంత్రంగా ఈనాడు స్థానికంగా జిల్లాస్థాయిలో ఒక పెద్ద పౌల్ట్రీని నడుపుతున్నాడు. అయితే ఇతని వృత్తివేరు. ప్రవృత్తివేరు. స్థానికంగా మండల కాంగ్రెస్ కమిటీకి, టౌన్ విశ్వహిందూ పరిషత్తుకు, సరస్వతీ శిశుమందిర్‌కు అధ్యక్షుడుగా ఉన్నాడు. ముఖ్యంగా విద్యావిషయకంగా సంస్కృతీపరంగా శ్రద్ధగలవాడు ఆ రంగాలకు వీలైనంతసేవ తమ తలిదండ్రులపేర ధర్మకార్యాలు చేస్తున్నాడు.

ఈయన భార్య సరస్వతమ్మగారు పేరుకుతగిన మనిషిగా భర్తకు అన్ని పనులలో చేదోడువాదోడుగా ఉంటుంది. ఈ దంపతులకు ఒక కుమారుడు ఇద్దరు కూతులు ఉన్నారు.

14. శ్రీ నారాయణదాసు రామాచార్యులుగారు

వీరు కలువకొలనుకు చెందిన విశ్వజ్ఞవంశీయులు. ఈయన అన్నగారైన బొజ్జయాచారిగారు విశ్వబ్రాహ్మణులలో కులపెద్దగా సభాపతిగా ఉన్నాడు. రామాచార్యులుగారు అటవీశాఖలో పనిచేసినప్పటికి ఇంటితనాన్ని అనుసరించి జ్యోతిష యాజ్ఞికాలు కంఠతఃవచ్చినవి. అందుచేత ఉద్యోగ విరమణానంతరం ఇపుడు పాలమూరిలో మోనప్పగుట్టపై శ్రీ స్వామివారి పూజారిగా ఉండి రెండవవైపు రచనారంగంలోగూడ కాలుపెట్టినాడు. ఇంతవరకు వీరి కలంనుండి 1. కందుకూరి రుద్రకవి విజయం, 2. విశ్వబ్రాహ్మణ గురుపీఠములు, 3. విశ్వకర్మ పంచబ్రహ్మల యజ్ఞం, 4. గురుపుష్య యోగవ్రతం, 5. అచలఋషి గురుపీఠం అనే కృతులు వెలువడినవి. ఇవి ఈతని పరిశోధనాశక్తిని తెలుపుతూ ఉంటవి. వీనిలో గురుపుష్య యోగవ్రతం అనే మానేశ్వర చరిత్ర ముఖ్యంగా చెప్పదగిన గ్రంథం.

వీరి శ్రీమతి వెంకట శేషమ్మగారు. ఈ దంపతులకు నలుగురు కూతుళ్లు ఇద్దరు కుమారులున్నారు.

15. శ్రీ దమ్మోజు వీరశేఖరంగారు

దమ్మపదం ధర్మశబ్దానికి వికృతి. ఇది బౌద్ధ వాఙ్మయంలో తరుచుగా వాడబడినపదం కాబట్టి పేరునుబట్టి ఈ వంశ మూలపురుషుడు బౌద్ధ సంప్రదాయానికి చెంది ఉంటాడనవచ్చు. విశ్వబ్రాహ్మణులలో త్రిమతాలకు చెందిన వారేకాక దమ్మోజు రేచోజువంటిపేర్లు బౌద్ధ జైన ప్రభావాన్నిగూడ తెలుపుతూ ఉంటవి.

వీరశేఖరాచారిగారు మయబ్రహ్మ వంశీయుడు. ఈయన తండ్రి బ్రహ్మయ్యగారు రఘుపతిపేట నివాసి. తల్లి బాలకిష్టమ్మగారు.

వీరశేఖరంగారు సోదరు లైదుగురిలో చివరివాడు. ఈ సోదరు లందరు యంత్రస్థాపత్యంలో నిపుణులు. పెద్దవాడైన శ్రీ కృష్ణంగారు దారుశిల్పంలో సాటిలేనివాడు. ఇపుడు వీరందరూ వచ్చి నాగర్ కర్నూలులో విడివిడిగా కర్మాగారాలు ఏర్పరచుకున్నారు. వారిలో వీరశేఖరంగారు పెద్దన్నగారి పిమ్మట మళ్ళీ అంతటి పనితనం ప్రజాసన్నిహితం కలిగిఉన్నాడు.

వీరి శ్రీమతి కౌసల్యమ్మగారు. ఈ దంపతులకు అయిదుగురు కూతులు ఒక కుమారుడు కలిగినారు.

పుస్తకాలలో సామాన్యంగా దాతల లీస్టుమాత్రమే వేస్తుంటారు. మరి కొందరు వారి ఫోటోలు వేస్తారు. నేను ఆ చిత్రాలకు బదులు వారి వ్యక్తిత్వాన్ని పట్టియిచ్చే ఈ పరిచయాలు వేసినాను.

వీరందరికి ఆ వెంకటేశ్వరుడు ఆయురారోగ్య భాగ్యాలతో పాటు నిరంతర ధర్మకార్యాసక్తినిగూడ దయచేయవలెనని కోరుతున్నాను.

అభిప్రాయము

సుప్రసిద్ధ పరిశోధకులు పండితులు రచయితలు అయిన మిత్రులు శ్రీ కపిల వాయి లింగమూర్తిగారు విశేషకృషితో రచించిన గ్రంథము "పాలమూరు జిల్లా దేవాలయాలు". దీనిని ఉత్సుకతతో చదివి ఆనందించితిని.

చిరకాలము ప్రాచ్యకళాశాల అధ్యాపకులుగా ఉండినందున వీరికి విషయ మును సుబోధకముగా వచింపగల నైపుణ్యము అబ్బినది. ఈ గ్రంథములో పాలమూరు (మహబూబ్‌నగరం) జిల్లాలోని అనేకస్థలాలను చక్కగా పరిచయము చేసినారు. ఎన్ని స్థలాలను గూర్చి వ్రాసినారో గమనించినచో వీరి అపార పరిశ్రమ అవగతము కాగలదు. స్థూలముగా ఇందులో చూచిన కలుగు స్థల పరిచయ మిట్లుండును :

అచ్చంపేట తాలూకాలో 20 స్థలములు, అమరాబాదు పట్టీలో 22, అలం పూరు తాలూకాలో 24, ఆత్మకూరు తాలూకాలో 9, కల్వకుర్తి తాలూకాలో 19, కోడంగలు తాలూకాలో 6, గద్వాల తాలూకాలో 10, జడ్చర్ల తాలూకాలో 7, కొల్లాపురం తాలూకాలో 17, మహబూబ్‌నగర్ తాలూకాలో 2, జడ్చర్ల తాలూ కాలో 7, వనపర్తి తాలూకాలో 14, షాద్‌నగర్ తాలూకాలో 8, మఖ్తల్ తాలూ కాలో 21, మొత్తం 186 స్థలములలోని దేవాలయాల వివరములు ఇందున్నవి. ఇందు తాలూకా కేంద్రములలో స్థానికముగ ఉన్న ఆలయాలను చేర్చలేదు. అవి విడిగా వ్రాయబడినవి. ఇవికాక ఈ జిల్లాలోని గ్రామదేవతలు, ఆశ్రమాలు, పీఠాలు, సమాధులు మొదలైనవాటి వివరాలు గూడ ఉండుట ముఖ్య విశేషము.

ఈ జిల్లాలోని వెంకటేశ్వరాలయాలు 41, కన్యకాపరమేశ్వరి ఆలయాలు 7, వీరబ్రహ్మేంద్రస్వామి గుడులు 9, గ్రామదేవతల గుడులు 17, ఇతర దేవతల గుడులు 4, ఆశ్రమాలు 6, మఠాలు 8, సమాధులు 3, దర్శనీయ స్థలాలు 11 వివరించబడినవి.

ప్రతిష్ఠలమును గూర్చి తెలిసికొనదగిన అన్ని విషయాలను కొన్నిటిని ఆధారగ్రంథాల ద్వారా, కొన్నిటిని స్వయముగా వెళ్ళి పరిశీలించుటద్వారా సేకరించుట వారి శ్రద్ధాసక్తులకు నిదర్శనాలు.* వార్ధక్యమును గణింపక జిజ్ఞాసతో ఈ మహత్కార్యమును నిర్వహించిన గ్రంథకర్తకు ఆంధ్రదేశీయులు-ముఖ్యముగా మహబూబునగరం జిల్లా ప్రజలు-చాలా ఋణపడినారు. వీరినుండి ఇంకను ఇట్టి ఉత్తమ గ్రంథాలను ఆకాంక్షించుచున్నాను.

అలంపూరు
ప్రజోత్పత్తి, చైత్రము

గడియారం రామకృష్ణశర్మ

---

* బీచుపల్లి, బోరవెల్లి, రాజోలు, వేణిసోంపురం క్రీ.శ. 1948 లోనే అలంపూరు తాలూకాలో చేర్చబడినవి. అవి శ్రీ లింగమూర్తిగారు గమనించలేదు.

ఆచార్య ఎస్వీ రామారావు
అధ్యక్షులు, తెలుగు విభాగం
ఉస్మానియా విశ్వవిద్యాలయం

మున్నుడి

కపిలవాయి లింగమూర్తిగారు ఒక వ్యక్తి కాదు-బృహత్ సంస్థ. ఆయన రచనలు సాధారణ సామగ్రి సేకరణలు కావు - అవి విజ్ఞాన సర్వస్వాలు. పాలమూరు జిల్లాలోని అసంఖ్యాకమైన దేవాలయాల చరిత్రను త్రవ్వి వెలికి తీయడం ఒకరిద్దరి వల్ల సాధ్యపడేది కాదు లింగమూర్తిగారు అతి సాహసమైన ఈ కార్యానికి పూనుకొని విజయవంతంగా నిర్వహించారు.

ఒక వైపు శతక కావ్యాలు, ఇంకొక వైపు స్థల మాహాత్మ్యాది కావ్య పరిష్కరణలతో నిర్విరామకృషి సల్పుతున్న కపిలవాయిగారి కీర్తికి ఇది మరొక ఛాపుటా కాగలదు.

తెలుగు మాగాణంలో కొనసాగిన సంస్కృతీ సాహిత్యాల ఫలసాయంలో పాలమూరు కృషికి సముచిత స్థానం వుంది. ఎందరో సాహితీ మూర్తులను ప్రభవించిన పాటిగడ్డ అది. సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, కేశవపంతుల నరసింహశాస్త్రి మున్నగు విద్వాంసులెందరో ఈ నేలలో జన్మించి తమ ప్రతిభా దీధితులను వెదజల్లారు. గద్వాల, వనపర్తి, జటప్రోలు, ఆత్మకూరు మొ॥ సంస్థానాల ప్రభువుల ఆదరణలో ఈ ప్రాంతంలో సాహితీ సంస్కృతులలో లలితకళలు ఎంతగానో వర్ధిల్లినాయి.

ములకనాడుగా, వంగూరు విషయంగా, చోళవాడిగా వివిధ యుగాలలో, కాలాలలో పరిగణింపబడుతూ వస్తున్న పాలమూరు సీమలో దైవభక్తి గల పరిపాలకులూ, ప్రజలూ కట్టించిన ఆలయాలకూ, గుళ్ళకూ కొదువలేదు. పదమూడు తాలూకాలలో రెండున్నర వేల ఆలయాలున్నట్లు లింగమూర్తిగారి అంచనా. వీనిలో దక్షిణ కాశిగా పేరొందిన అలంపూరు తాలూకాది అగ్రస్థానం కృష్ణా, తుంగభద్రా నదీ తీరాలలో లెక్కకు మిక్కుటంగా వెలసిన ఆలయాలు ప్రశాంత వాతావరణానికే కాక, అత్యంత రమణీయమైన శిల్పకళకు కాణాచిగా

వెలుగొందాయి. వానిలో చాలావరకు శ్రీశైలం ప్రాజెక్టులో కలిసిపోయినా కొన్నయినా యథాతథంగా పునర్నిర్మింపబడటం మన అదృష్టం.

దేవాలయాలకు జాతి జీవన వికాసంలో విశిష్టమైన స్థానం వుంది. అవి ఆధ్యాత్మిక భావ బీజాలు వెదజల్లిన కేంద్రాలుగానే కాక లలితకళా పోషకాలుగా కూడా సమాజ ప్రగతిలో భాగస్వామ్యం వహించాయి.

'దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు?' (తాపీ ధర్మారావు), 'గుడిలో సెక్సు' (ఆరుద్ర) మొ॥ రచనలు హేతువాదంలోనుంచి జనించినా అవి పాక్షికమైన దృక్కోణంనుంచి వెలువడినవే కాని పరమ సత్యాలు కావు. అన్నింటినీ సెక్సుతో ముడిపెట్టటమే వాటి లక్ష్యం. దాని కతీతంగా నిరంతరంగా కొనసాగుతున్న జీవన స్రవంతిని అవి గమనించలేదు.

అయితే - ఇంత చరిత్రనూ ఒక్కచేతిమీదగా నిర్మించటం సులభసాధ్యం కాదు. పెక్కు ఆలయాల నిర్మాణానికి సంబంధించిన చారిత్రకాధారాలూ, సాక్ష్యాలూ లభించటం లేదు. అనూచానంగా వస్తూన్న స్థలపురాణాలూ, వినుకలి - కనుకలిపై కట్టుకున్న కథలే ఆధారంగా వున్నాయి. లింగమూర్తిగారు ఎంతో పరిశ్రమించి, విశేష సమాచారాన్ని సేకరించి స్పష్టమైనరీతిలో ఆలయాల చరిత్రకు అందించి ఈ రంగంలో మార్గదర్శకులైనారు. ఈ బృహత్ కార్యంలో ఒకటి రెండు నెలుసులు దొరలే అవకాశం లేకపోలేదు. ఉదా॥ జటప్రోలు ఆలయం గోపాలపురంలో కట్టబడింది. (పు. 116.) పానగల్లు వనపర్తి తాలూకాలో వుంది. (పు. 338)

జటప్రోలు ఆలయం గోపాలపురం సరిహద్దుకు దగ్గరగా వుంది కాని జటప్రోలు శివారులోనే నిర్మితమైంది. పానగల్లు వనపర్తి దగ్గరగా ఉన్నా కొల్లాపురం తాలూకాకు చెందింది. ఈ చిన్న చిన్న అంశాలు మలి ముద్రణలో సవరించుకోవచ్చు.

పాలమూరు జిల్లా ఆలయాల సమగ్ర చరిత్రను అందించి జిల్లా చరిత్ర నిర్మాణానికి నిరంతరం దోహదం చేస్తున్న కపిలవాయి లింగమూర్తిగారు పాలమూరు వాసులకే కాదు, తెలుగు భాషా సంస్కృతుల అభిమానులనందరినీ ఋణగ్రస్తులను చేశారు. వారి ప్రయత్నానికి జోహారు లర్పిస్తూ, ఈ రంగంలో ఇతోధికమైన కృషి సలపడానికి తగిన సహాయ సంపత్తి వారికి సమకూరాలని ఆశిస్తున్నాను.

కృతజ్ఞతలు

నాకు ఈరచనకు అవకాశం కలిగించింది శ్రీ వట్టెం వేంకటేశ్వరుడు. పిమ్మట ఆర్థిక సహాయం అందించింది తిరుపతి వేంకటేశ్వరుడు. దీన్ని ముద్రించింది పద్మావతీ ఆర్టు ప్రింటర్సువారు. అచ్చు తప్పులు చూచింది శేషగిరిరావుగారు. ఈవిధంగా ఈ కార్యం సర్వం నేననుకోకుండానే వేంకటేశ్వరమయమవుతూ వచ్చింది. అందుచేత-

నా రచనకు ప్రథమ ఫలప్రదాతయైన శ్రీ వేంకటేశ్వరుని పాదపద్మాలకు ప్రణమిల్లుతూ —

1. ఈ పుస్తకానికి నాకు ఉదారంగా ఆర్థికసహాయం అందించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థాన నిర్వహణాధికారిగారికి, ఆయన సిబ్బందికి-

2. నా మొదటి రచన పాండురంగశతకం. ముద్రణ గురించి ఏమీ తెలియని నా పుస్తక ముద్రణకు ఇంతవరకు తమ అమూల్య సహాయాన్ని అందిస్తూ వచ్చిన శ్రీ పాండురంగయ్యగారికి -

3. రచనలోని సాధకబాధకాలలో కర్తవ్యతామూఢత్వం కలిగినపుడు ఆత్మీయుడుగా సలహాల నందిస్తున్న శ్రీ రంగాచార్యగారికి -

4. మొదటినుండి నా పుస్తకాలన్ని ముద్రిస్తూ శ్రీనివాసుని దేవేరిపేరు వెలసిన పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్ అధినేత శ్రీనివాస్‌గారికి -

5. ముద్రణాదోషాలు సరిచూసిన శ్రీ చిమకుర్తి శేషగిరిరావుగారికి -

6. నా కోరిక మేరకు అందంగా ముఖచిత్రాన్ని గీసిన చిత్రరచయిత శ్రీ శీలా వీర్రాజుగారికి -

7. ఇంకా నేనుకోరినదే తడవుగా అభిమానంతో తమ అమూల్యాభిప్రాయాలందించిన -

i. అలంపురనివాసులు ప్రామాణిక చారిత్రక పరిశోధకులు శ్రీ గడియారం రామకృష్ణశర్మ గారికి -

ii. నాకు మిత్రులు ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖాధ్యక్షులుగాఉన్న శ్రీ S. V. రామారావుగారికి -

iii. ఇందులో తమ చిత్రాలు ప్రచురించుకోవటానికి అనుమతించిన పురాతత్వశాఖవారికి -

మనఃపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటూ, ముద్రణా వ్యవహారంలో సహకరిస్తు చేదోడుగా నిలిచిన మా చిరంజీవులు కె. కిశోరు బాబు, కె. అశోకు బాబుంను, కోడళ్ళు కె. భార్గవీదేవి, కె. సంధ్యలను, సిటీలోఉండి దీనిముద్రణలో పనిని అరిసికున్న ఛాత్రుడు ఇమాముద్దీనును ఆయురారోగ్యాభివృద్ధిగా దీవిస్తున్నాను.

విషయ సూచిక

1.	ప్రవేశిక	
2.	భగవత్తత్వం	... 3
3.	పాలమూరు జిల్లా పుట్టుక	... 8
4.	అచ్చంపేట తాలూకా ఆలయాలు	... 17
5.	అచ్చంపేట మండలంలోని ఆరణ్యకాలు	... 39
6.	అమరాబాదు పట్టిలోని ఆలయాలు	... 44
7.	అమరాబాదు సీమలోని ఆరణ్యకాలు	... 53
8.	అలంపురం సీమలోని ఆలయాలు	... 61
9.	కలువకుర్తి తాలూకాలోని గుడులు	... 82
10.	వెలిదండలో వెలసిన ఆలయాలు	... 99
11.	కొల్లాపురం తాలూకా కోవెలలు	... 106
12.	కోడంగల్ తాలూకాలోని గుడులు	... 131
13.	నాగర్ కర్నూలు తాలూకాలోని గుడులు	... 157
14.	వడ్లవాని సీమలో వర్ధిల్లిన ఆలయాలు	... 189
15.	పాలమూరు తాలూకాలోని ఆలయాలు	... 198
16.	మక్తల్ తాలూకాలోని మందిరాలు	... 207
17.	లోకయ్యపల్లె దొరలు కట్టించిన గుడులు	... 217
18.	వనపర్తి యిలాకా ఆలయాలు	... 219
19.	నాయక్ వంశీయులు కట్టించిన గుడులు	... 236
20.	గోపాలపేట యిలాకా కోవెలలు	... 244
21.	షాద్‌నగర్ తాలూకా దేవసదనాలు	... 248
22.	మా జిల్లాలోని కొన్ని వెంకటేశ్వరాలయాలు	... 257

23.	వాసవీకన్యకాంబ ఆలయాలు	... 32
24.	కొన్ని వీరబ్రహ్మేంద్రుని ఆలయాలు	... 328
25.	మన గ్రామదేవతలు	... 334
26.	ఇదమ్మ జాతరలు	... 337
27.	ఎల్లమ్మ జాతరలు	... 3:0
28.	మైసమ్మ జాతరలు	... 343
29.	ఇతర దేవతల జాతరలు	... 345
30.	ఆశ్రమాలు - మఠాలు - సమాధులు	... 354
31.	మఠాలు	... 360
32.	సమాధులు	... 365
33.	మా జిల్లాలో కొన్ని దర్శనీయ స్థలాలు	... 369

XXVIII

అడుగడుగున గుడి ఉంది

అడుగడుగున గుడి ఉంది - అందరిలో గుడి ఉంది
ఆ గుడిలో దీపముంది అదియే దైవం
ఇల్లూ వాకిలి వళ్ళూ మనసూ
ఈశుని కొలువనిపించాలి
ఎల్లవేళలా మంచుకడిగినా
మల్లెపూవులా ఉండాలి
దీపం మరిమరి వెలగాలి
తెరలూ పొరలూ తొలగాలి -

అడుగడుగున గుడి ఉంది
అందరిలో గుడి ఉంది

తల్లీతండ్రీ గురువుపెద్దలు
పిల్లలు కొలిచే దైవం
కల్లాకపటం తెలియని పాపలు
తల్లులు వలచే దైవం
ప్రతిమనిషే నడిచే దైవం
ప్రతిపులుగే ఎగిరే దైవం

అడుగడుగున గుడి ఉంది
అందరిలో గుడి ఉంది

—మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి

XXVIII

ప్రవేశిక

హిందూమతం ఒక ఇంద్రధనుస్సు. దానిలో నాలుగు ప్రధాన వర్ణాలు. మళ్ళీ ఒక్కొక్కదానిలో ఎన్నో అవాంతర భేదాలున్నవి.

మనలో ఒక్కొక్క వర్ణానికి ఒక మతం ఉంది. ఆ మతానికి ఒక ముఖ్య దైవం ఉన్నాడు. బ్రాహ్మణులలో శాంకరులు శివుని, రామానుజులు విష్ణువును, మాధ్వులు శివవిష్ణువులతో పాటు హనుమంతుని, శైవులలో ఆరాధ్యులు మల్లికార్జునుని, వీరశైవులు నందీశ్వరుని పూజిస్తారు.

అలాగే విశ్వకర్మలు కాళీమాతను, వైశ్యులు నగరేశ్వరుని, పద్మశాలీలు మార్కండేయుని, రైతులు భూలక్ష్మిని, కురవలు బీరప్పను, గొల్లలు కాటమరాజును, చాకళ్ళు మడివేలయ్యను, మాలలు చెన్నకేశవుని, చిందువారు జాంబవంతుని ప్రత్యేకంగా కొలుస్తారు.

ఆంధ్రదేశాన్ని పాలించిన శాతవాహనులు శివవిష్ణువులను సమానంగా సేవించినారు. వారి పిమ్మట వచ్చిన ఇక్ష్వాకులు మహాసేనానిని, విష్ణుకుండినులు శ్రీపర్వత స్వామిని, శాలంకాయనులు చిత్రరథుని, చాళుక్యులు మాతృగణాన్ని, రాష్ట్రకూటులు జనదేవుని, పల్లవులు శివుని, కదంబులు గోకర్ణస్వామిని, కాకతీయులు శివ పంచాయతనాన్ని, పద్మనాయకులు భైరవుని, రెడ్డి రాజులు నృసింహుని, విజయనగరాధిపతులు విఠలేశ్వరుని—

సామంతులలో చోళులు, గోన - మల్యాల - చెఱుకు వంశాల వారంతా శివుని పూజించినారు.

పాలకులీ విధంగా వివిధ దేవతలను ఆరాధించినారు కాబట్టి ఈనాడు మన దేశంలో ఎన్నో విధాల ఆలయాలు వెలసినవి. వాని ప్రభావం ప్రజలపై గూడా పడింది.

దేవునికి రూపమే లేదంటారు గదా! మరి అతనికిన్ని పేర్లు, ఇన్ని రూపాలు ఎందుకు? అతడు అనంతుడు, విశ్వరూపుడు కాబట్టి ఆ మహాపురుషునికి ఎన్ని పేర్లైనా ఎన్ని రూపాలైనా ఉండవచ్చు.

భక్తునికి చిత్తశుద్ధి కలిగి లక్ష్యం ఏకముఖంగా ఉన్నపుడే అనంతమైన నామరూపాల వెనుక అతనికి ఒక్కడైన ఆ పరమాత్మ తత్వమే భాసిస్తుంది.

ఆకాశాత్పతితం తోయం - యథాగచ్ఛతి సాగరం
సర్వదేవ నమస్కారం - కేశవం ప్రతిగచ్ఛతి.

నేలపైన పడిన ప్రతి వానచినుకు సముద్రాన్నే చేరినట్లు ఏ దేవుని పూజించినా అది ఒక్కడైన ఆ పరమేశ్వరునికే చెందుతుంది.

భగవత్తత్వం

హిందూమతం జీవేశ్వరులకు సాకార నిరాకారాలు రెండూ అంగీకరించినది. జీవుడు దేహంలో ఉన్నంతకాలం సాకారుడు. దాన్ని విడిచి మరోదేహం ధరించే కాలంలో నిరాకారుడు. అపుడతడేవిధంగా ఉంటాడో ఎక్కడ ఉంటాడో మనకు తెలియదు.

ఈశ్వరుడుగూడా అంతే. పరబ్రహ్మస్వరూపంలో నిరాకారుడు,నిర్గుణుడు, సర్వసాక్షి. మన ఊహలకందడు. విశ్వరచనా సందర్భంలో మాత్రం సాకారుడై మనకు కొంత అందుతున్నాడు.

సృష్టికర్తయైన అతనికి పర- వ్యూహ- విభవ- సర్వాంతర్యామి- అర్చావతారాలని పాంచరాత్రాగమం అయిదు రూపాలంగీకరించింది,

పరరూపంలో ఆతడు నారాయణుడు. సత్వగుణప్రధానుడై నిష్కళంకుడై శాంతుడై లక్ష్మీదేవి పాదసంవాహనం చేస్తుండగా ఆదిశేషునిపై క్షీరసాగరంలో శయనించి ఉంటాడు. అతనిని నిత్యసూరులు సేవిస్తూ ఉంటారు.

రెండవదైన వ్యూహస్థితిలో జగత్సృష్టికొరకు అతడు చేసికొన్న నియమం ప్రకారం వాసుదేవ- సంకర్షణ-ప్రద్యుమ్న- అనిరుద్ధ అనే నాలుగు రూపాలు ధరించి ఆయా వ్యూహం నధిష్టిస్తాడు.

మూడవదైన విభవంలో తాను సృష్టించిన జగద్రక్షణకొరకు నేడు మనం ప్రసిద్ధంగా చెప్పుకునే దశావతారాలు, వానితో కలసిన చతుర్వింశతి అవతారాలు ధరించినాడు.

ఇక సర్వాంతర్యామిగా అతడందరి హృదయాలలో ఉండనే ఉన్నాడు. కాని ఈనాడు ఆత్మసాక్షిగా నడుచుకొనేవారరుదు.

అవతారాల మాటకు వస్తే అవి ఆయాదేశ కాలాలకే పరిమితాలు కాని సార్వకాలికాలు, సార్వదేశికాలు కాలేదు. అందుచేత సర్వేశ్వరుడు అన్ని కాలాలకు, అన్ని దేశాలకు అనుకూలం కోసమై అయిదవదైన అర్చారూపాన్ని

స్వీకరించి ఆయా ప్రదేశాలలో వెలసినాడు. వానినే ఇపుడు మనం క్షేత్రాలని, అక్కడి హరి నివాసాలను ఆలయాలని వ్యవహరిస్తున్నాం.

సాధకునికి లేదా భక్తునికి భగవంతుని యొక్క పర - వ్యూహ విభవ స్వరూపాలు సులభంగా అందటం కష్టం. అందుచేత పాంచరాత్రం భగవంతుని సేవించి తరించటానికి అతని అర్చామూర్తి ఒక్కటే పరమ సాధనంగా పరిగణించింది. అందుచేత దానికి ఏకాయన శాస్త్రమని పేరుకూడా ఉంది

ఈశ్వరుని యొక్క అర్చామూర్తులు స్వయంవ్యక్తాలు, ప్రతిష్ఠితాలు అని రెండు విధాలు.

స్వయంవ్యక్తాలు వ్రేళ్ళమీద లెక్కించదగిన కొన్ని మాత్రమే ఉన్నవి. అందుచేత వాని దగ్గరకు వెళ్ళలేని వారికొరకు ఆయా కాలాలలోని మహా పురుషులు కొందరు తపంచేసి తమతమ యిష్టదైవాలను ప్రసన్నం చేసికొని ఆయా పవిత్ర స్థలాలలో ప్రతిష్ఠించినారు.

స్వయంవ్యక్త మూర్తులలో బింబం స్పష్టంగా లేకున్నా నారాయణుడు వానిలో నిత్య సన్నిహితుడనై ఉంటానని చెబుతాడు.

తక్కిన మూర్తులకు ప్రతిమలని పేరు. ప్రతిమ అంటే సాటిలేనిది అని తాత్పర్యం. సాధకుని కోరిక ననుసరించి నిర్మింపబడిన ఈ దేవతా ప్రతిమలు రూపనిర్మాణంలోగాని, వేషభూషలలోగాని సాటిలేనివై ఉండవలె - అపుడే అవి భక్తుల చిత్తాన్ని ఆకట్టుకొనగలుగుతవి.

అంతేకాక అవి శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ చేయబడవలె. వానిలో నిహితమైన దైవీయశక్తి నిత్యార్చనాదులతో దినదినం ఉద్దీప్తం పొందుతూ ఉండవలె. అపుడే దైవం ఆ మూర్తితో సన్నిహితుడైయుండి భక్తుల కోరికలు తీరుస్తాడు.

ఆలయ తత్వం

ఈనాడు మనం చూసే ఆలయాలు శ్రీ మహావిష్ణువు శయనించిన శేషునికి, ఆతడు సృష్టించిన బ్రహ్మాండానికి, అతడు ప్రసాదించిన ఈ మానవ దేహానికి సంకేతంగా ఉన్నవి.

అనంతకాశంలో గల పాలవెల్లిలోని బ్రహ్మాండాలవలె మన భారతదేశంలో ఎన్నో ఆలయాలు వెలసినవి.

బ్రహ్మాండంలో మొదట ప్రవేశించిన వానికి విరాట్పురుషుడని వ్యవహారం. ఇక ఆ బ్రహ్మాండంలోని అనంతసృష్టి అంతా ఆతని నుండి పుట్టిన దేవతల చేతనే జరుగుతుంది ఆలాగే ఆలయంలో మొదట ప్రతిష్ఠించబడిన స్వామికి మూల విరాట్టనిపేరు. తరువాత దానిలో అతని ననుసరించే పరివార దేవతలందరూ ప్రతిష్ఠింపబడుతారు.

మన బ్రహ్మాండం ఒక పెద్ద అండం. దానిపై పంచభూతాలు, మహత్తు, అవ్యక్తం, ఒకదానికంటె ఒకటి పదింతల మందంగా పొరలుగా ఉన్నవి. వానికి సప్తావరణలని పేరు. దాన్ని అనుసరించే మానవ దేహానికి గూడా సప్తావరణ లున్నవి. శ్రీరంగంవంటి ప్రసిద్ధాలయాలన్ని సప్తావరణల నడుమనే కట్టబడినవి.

పాలవెల్లిలోవుండే బ్రహ్మాండాలన్ని ఒకేమోస్తరుగాదు. కొన్ని చిన్నవి, కొన్ని పెద్దవిగా ఉన్నవి. ఆలాగే వానిపై ఆవరణల సంఖ్యలలో గూడా తేడా వుంది. హనుమంతుడు ఏకపాదరుద్రుడుగా ఉన్నపుడు మూడు ఆవరణాలుకల మరో బ్రహ్మాండంలో ఉన్నట్లు సమీర కుమార విజయంలో చెప్పబడింది.

ఈనాటి మన ఆలయాలు గూడ పై బ్రహ్మాండాలవలెనే కొన్ని చిన్నవిగా కొన్ని పెద్దవిగా కొన్ని సంపూర్ణంగా మరికొన్ని అసంపూర్ణంగా ఉన్నవి.

హిందూ దేవాలయం దాని ప్రాకారం శేషునియొక్క స్వరూపంగా భావించ బడుతుంది. "అదిగో అల్లదిగో హరివాసము, పదివేల శేషుల పడగల మయము" అని అన్నమాచార్యుడు తిరుపతి వేంకటేశ్వరుని ఆలయాన్ని కీర్తించినాడు.

ఆలయప్రాకారం శేషునికి, ముఖద్వారంపై ఉండే గోపురం శేషుడు తలపై ధరించిన లోకానికి సంకేతాలు.

హిందూ పురాణాల ప్రకారం లోకాలు పదునాలుగు. ఒక్కొక్క లోకంలో ఒక్కొక్క విధమైన దేవతా జాతులుంటారు. కాబట్టి ఈనాడు ఆలయ గోపురాలను

గూడా పదునాలుగంతస్తుల వరకు కట్టి ఒక్కొక్క భాగంలో ఒక్కొక్క రక మైన దేవతా శిల్పాలను రచిస్తారు.

మన బ్రహ్మాండానికి అన్నిటికిపైన ఒక త్రిఖండ సోపానం. అట్టడుగున మరో త్రిఖండ సోపానం ఉన్నవి. పై త్రిఖండ సోపానంలో కేవల ముక్తజీవు లుంటారు. వారు హిరణ్యరూపులు. అందుచేత ఆలయగోపురాలపై స్వర్ణకలశాలు నిలుపుతారు. అట్టడుగు త్రిఖండ సోపానంలో గ్రామ్యవాసనాలంపటులైన పాప జీవులుంటారు. అందుచేత ఆలయ గోపురాలపై అడుగు భాగంలో గ్రామ్యశిల్పాలు చెక్కబడుతూ ఉంటవి.

మన బ్రహ్మాండంలో దేవతలు మేరువుపై ఉంటారు. అది బంగారుకొండ. మన ఆలయాలలో గర్భాలయంపై ఉండే శిఖరానికి విమానం అని పేరు. అది మేరువుకు సంకేతం. అందుచేతనే వానికి బంగారుపూత పూసే ఆచారం ఉంది.

"దేహో దేవాలయ ప్రోక్తః జీవో దేవస్సనాతనః"-ఈ దేహమే ఒక దేవా లయం, ఇందలి జీవుడే దేవుడు అని హిందూ ధర్మశాస్త్రాలు చెబుతవి. అందు చేత దేవాలయం యొక్క పాదపీఠం పాదాలు, జంఘలు జంఘలు, స్తంభాలు బాహువులు, శుకనాసం నాస, గవాక్షాలు నేత్రాలు, శిఖరం శిరస్సు, గర్భాలయం హృదయం, ఘంట జిహ్వ అని ఈ విధంగా మన దేవాలయంపై దేహభావన చేయబడింది.

ఆలయం అన్నపుడు దానికి శిఖరం, అర్ధమంటపం, మంటపం, ధ్వజ స్తంభం, బలిపీఠం, ప్రాకారం, మహాద్వారం ఉండవలె కాని ఈనాడు ఎన్నో ఆలయాలు అసంపూర్ణ స్థితిలోనే ఎదిగీ ఎదగకుండా నిలిచినవి.

మానవత్వం సంపూర్ణంగా వికసించిన వ్యక్తులు అరుదైనట్టే సంపూర్ణ లక్షణాలు గల ఆలయాలు గూడా అరుదు. అయితే మానవత్వం సంపూర్ణంగా వికసించనంత మాత్రాన అతనిని మానవుడు కాదని ఏ విధంగా అనలేమో అలాగే సంపూర్ణ లక్షణాలు లేని గుడిని కూడా గుడి కాదని అనలేం.

అందుచేత అసంపూర్ణ వ్యక్తులను పూర్ణ వ్యక్తులనుగా తీర్చవలసిన బాధ్యత సామాజిక సంస్కర్తలపై ఉన్నట్లు తమ తమ గ్రామాలలోని ఆలయాలను పూర్ణ స్వరూపంతో దిద్దుకొని వానిని సజీవంగా ఉంచుకొనవలసిన బాధ్యత ఆయా గ్రామవాసులపై ఉంది.

మన ఆరాధనా స్థానాలలో ఆలయాలు, బృందావనాలు, ఆశ్రమాలు అని మూడు విధాలు ఉన్నవి. దేవతా ప్రతిష్ఠలు గలవి ఆలయాలు లేదా దేవాలయాలు. వ్యక్తులు సమాధి పొందినవి బృందావనాలు. ఆశ్రమం గ్రహించి నివసించినవి ఆశ్రమాలు. ఈ మూడు స్థానాలలో గూడా ఏదో విధమైన పూజలు జరుగుతూనే ఉంటవి. అందుచేత నేను దీనిలో ఆ మూడిటిని గురించి చెప్పినాను.

ఈ జిల్లాలో మొత్తం రెండున్నర వేల ఆలయాలున్నవి. వానిలో స్థాలీపులాకన్యాయంగా యిందులో కొన్నిటిని మాత్రమే స్పృశించటం జరిగింది. వీనిలో ఒక్కొక్క దానికి పురాణాకరం - జానపదుల కథ - స్థల చరిత్ర ఉన్నవి. వానిలో ఏది లభించినచోట దానిని ఉటంకించినాను.

పాలమూరు జిల్లా పుట్టుక

ఈ జిల్లా మొదట తూర్పు డివిజన్‌లో చేరి నల్గొండ జిల్లాలో ఉన్నది. అపుడా డివిజన్‌లో దీనితో పాటు ఖమ్మం, వరంగల్లు జిల్లాలు కూడా చేరివున్నవి. అయితే నల్గొండ జిల్లా ఈ విధంగా చాలా పెద్దదై దాని పరిపాలన కష్టంగా ఉండడంచేత మొదటి సాలార్‌జంగ్ గారు పరిపాలనా సౌకర్యం కొరకు సన్ 1292 లో ఆ జిల్లానుండి గద్వాల-వనపర్తి - జడ్చర్ల - అమరచింత - గురుగుంట - నాగర్‌కర్నూలు అనే ఆరు తాలూకాలను వేరు చేసి వానికి నాగర్ కర్నూలును కేంద్రంగా చేసి కొత్త జిల్లాను సృష్టించినారు.

పిమ్మట ఈ జిల్లాకు సన్ 13 వందలలో అమరాబాదు, కలువకుర్తి అనే మరో రెండు, సన్ 1302లో మరో రెండు చేర్చి, సన్ 1312 లో జిల్లా కేంద్రాన్ని నాగర్ కర్నూలు నుండి మహబూబ్‌నగర్‌కు మార్చినారు. ఇపుడీ జిల్లాలో 13 తాలూకాలున్నవి.

ఈ జిల్లా యొక్క భౌతిక స్వరూపము

ఈ జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో - ఉత్తర అక్షాంశాలు 58-52' నుండి 17° - 20'-తూర్పు రేఖాంశాలు 770 నుండి 79° - 12 నడుమ 633 చదరపు మైళ్ళు విస్తీర్ణంగా వ్యాపించి ఉంది. దీనికి తూర్పు, దక్షిణాలలో కృష్ణానది పశ్చిమంలో తుంగభద్ర పారుతూ గుంటూరు, కర్నూలు జిల్లాలనుండి దీనిని వేరు చేస్తున్నవి. ఇక్కడి నేల వాయువ్యం నుండి ఆగ్నేయానికి ఏటవాలుగా ఉంది. ఉత్తర పశ్చిమ భాగాలు బాగా ఎత్తుగా ఉన్నవి జిల్లాలోని ఆగ్నేయ భాగంలో ఉత్తరం నుండి దక్షిణానికి వ్యాపించిన ఒక గుట్టల వరుస ఉండి వాని పైభాగం విశాలంగా ఉంది.

ఇక్కడి ఉత్తర భాగం అగ్నికీలలతో కూడిన రాతిప్రదేశం. తక్కిన భాగం కృష్ణశిలామయం. ఇది శిలాప్రదేశం కాబట్టి యిక్కడ గాజు పరిశ్రమకుపయోగపడే చలువరాయి మక్తల్ తాలూకాలోని బసవపల్లె, పూంపేట, మహ

బూబ్‌నగర్ తాలూకాలోని మణికొండ, గాజులపేటలలో; కురువిందరాయి అచ్చం పేట తాలూకాలోని అమరాబాదులో దొరుకుతుంది.

పూర్వం ఈ జిల్లాలోని పెంట్లవెల్లి - అమరగిరి - బొల్లారం, ఇప్పలపల్లి వజ్రాలు లభించే ప్రదేశాలుగా ప్రసిద్ధి పొందినవి. చరిత్ర ప్రసిద్ధమైన గోల కొండ వజ్రాలు ఈ జిల్లాలోని భూములలోనే లభించినవి.

ఇది పర్వత ప్రదేశం కాబట్టి ఇక్కడ అడవులెక్కువ. ఇక్కడి భూమిలో 17% అడవులున్నాయి. అమరాబాదు, కోయలకొండ తాలూకాలు అడవులకు ప్రసిద్ధి. ఈ అడవులలో ఇప్ప-నల్లమద్ది-టేకు-తుమ్మ-మామిడి-చింత-వెదురు బాగా పెరుగుతవి.

ఈ జిల్లాలోని ఫరహాబాదు,పానుగల్లు ప్రదేశాలు సముద్రమట్టానికి 1800 అడుగుల ఎత్తున్నవి.

ఇక్కడి ఉష్ణోగ్రత అత్యధికం 91" ఫారన్‌హీటు, అత్యల్పం 74" ఫారన్‌హీటు; వర్షపాతం సగటున అత్యధికం 39.42 అంగుళాలు, అత్యల్పం 28.4 అంగుళాలుగా ఉంటవి.

ఇక్కడి పశ్చిమ భాగం వేడి కలిగి ఆరోగ్యవంతంగాను, తూర్పుభాగం చిత్తడినేలలతో అనారోగ్యంగా మన్యపుజ్వరాలకు ఆటపట్టుగాను ఉంటవి.

ఈ జిల్లాలో దెంది - చంద్రవాగు - పెద్దవాగు - చిన్నవాగు జలాధారాలుగా ఉన్నవి. ఇపుడు దెందికి డిండి ప్రాజెక్టు, చంద్రవాగుకు చందసాగర్, పెద్ద వాగుకు కోయిల్‌సాగర్, చిన్నవాగుకు సరళాసాగర్ కట్టబడినవి.

ప్రాచీన చరిత్రలో పాలమూరు జిల్లా

తెలుగువారికి కృష్ణా గోదావరులు దేశనిర్ణయానికి, శ్రీశైలం దిఙ్నిర్ణయానికి సంధ్యావందనంలో నిత్యసంస్మరణీయాలుగా ఉన్నవి. సమాసవిధిచేత కాక కృష్ణానది భౌతికంగాకూడ గోదావరికంటె ముందే పుట్టింది అంటారు. చరిత్ర ప్రసిద్ధమైన శ్రీకాకుళం, శ్రీశైలం, అమరావతి, విజయపురి మొదలైన ప్రసిద్ధ రాజధానులన్ని దాని తీరంలోనే వెలసినవి. వానిలో శ్రీశైలం ఈ జిల్లాకు ఆగ్నేయంగా, విజయపురి ఈశాన్యంగ సరిహద్దులపై నిలచినవి.

ఉత్తరభారతంలో మగధసామ్రాజ్యం బాగా ప్రసిద్ధిపొందింది. తెలుగు దేశంలోని నంది మండలం మగధను పాలించిన నవనందుల పేరనే ఏర్పడిం దంటారు. అది ఈ జిల్లాకు దక్షిణ హద్దుగా ఉంది. నందవంశం పిమ్మట వచ్చిన మౌర్యవంశంలో అశోకుడు ప్రసిద్ధుడు. అతని ధర్మలిపులు రాయచూరు జిల్లాలో లభించినవి. ఆ జిల్లా దీనికి దక్షిణ పశ్చిమంలో ఉంది.

మౌర్యుల పిమ్మట వచ్చిన శుంగవంశాన్ని అంతంచేసి ఆంధ్రదేశంలోని ప్రప్రథమ శాతవాహన వంశం రాజరికానికి వచ్చింది. వారి జన్మభూమిని గురించి నేటి బళ్ళారి ప్రాంతమని, అలంపురం తాలూకాలోని సాతానికోట ప్రాంతమని రెండు మతాలు ఉన్నవి.

సాతానికోటనే ఒకవేళ శాతవాహనుల జన్మభూమి అయితే తెలుగుదేశం లోని మొదటి రాజవంశానికి జన్మనిచ్చిన గౌరవం ఈ జిల్లాకే దక్కుతుంది. ఈ వంశంలోని ప్రసిద్ధ చక్రవర్తి గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణి కాలంలో ఆచార్య నాగార్జునుడు జీవించి విజయపురిని బౌద్ధమత కేంద్రంగా మార్చినాడు.

గౌతమీపుత్ర శాతకర్ణి తల్లి గౌతమీబాలశ్రీ వేయించిన నాసికా శాసనంలో అసిక - అసక - ముళక - సురఠ - కుకుర - అపరాంత. అనూప - విదభ - అకరావంత అనే రాష్ట్రాలు పేర్కొనబడినవి. కాబట్టి వానిలోని ముళకనే కాల క్రమంలో ములక నాడుగా మారిందని అంటారు. ములకనాడు నేటి పాలమూరు జిల్లాకు ప్రాచీన నామంగా ఉంది.

శాతవాహన వంశం క్షీణదశకు రాగా ఆ వంశంలో నాలుగవ పులోమావిని ధిక్కరించి వాశిష్ఠీపుత్ర శాంతమూలుడు విజయపురి రాజధానిగా చేసికొని ఇక్ష్వాకు రాజ్యాన్ని స్థాపించినాడు. వీరు శ్రీపర్వత పూర్వాపరక్షితి పరంపరా హారులమని చెప్పుకున్నారు.

ఈ వంశంలోని ఎహువుల శాంతిమూలుని సేనాపతి ఏలిశ్రీయే కృష్ణా తీరంలోని నేటి ఏలేశ్వరాన్ని ప్రతిష్ఠించి ఉంటాడని చారిత్రకుల మతం. అది ఈ జిల్లాకు ఉత్తరంగా ఉంది.

ఈ సామ్రాజ్యం బలహీనపడడం చూసి సామంతుడైన అధిరాజేంద్రవర్మ వారి నెదిరించి మూసీనదీ తీరంలోని ఇంద్రపాల నగరాన్ని రాజధానిగా చేసుకొని మరో క్రొత్త రాజ్యాన్ని స్థాపించినాడు. విష్ణుకుండినులనే ఈ వంశీయుల జన్మభూమి ఏలేశ్వరం లేదా మున్ననూరు ప్రాంతమని శ్రీ బి. ఎన్. శాస్త్రిగారి మతం. ఈ మున్ననూరు ఇపుడు ఇక్కడి అచ్చంపేట తాలూకాలో, వీరి రాజధానియైన ఇంద్రపాల నగరం దాని ప్రక్కన ఉన్న మిర్యాలగూడెం తాలూకాలో నున్నవి.

ఇదంతా ఈ జిల్లా చుట్టు అల్లుకున్న చరిత్ర. విష్ణుకుండినులు సామంతులుగా ఉన్నప్పుడు అమరాబాదు ప్రాంతాన్ని పాలించినారు. వారి శాసనాలలోని అమరపురం - అమరావతి ఈనాటి అమరాబాదు అని పరిశోధకు లంటారు.

అమరాబాదు మొదట కందారప్రభువులకు చెంది ఉన్నది. వారిపిమ్మట అది అనుమకొండను స్థాపించిన ఎరుకు దేవరాజుకు ఈయబడింది. అతనిపిమ్మట ఆ భూమిని సోమవంశప్రభువులు పాలించినారు. సోమవంశానికి చెందిన చంద్రగుప్తునిపై విష్ణుకుండిన నాలుగవ మాధవవర్మ దండెత్తి ఓడించినాడు. తరువాత ఆ మాధవవర్మను వనవాసినుంకి చాళుక్యవంశానికి చెందిన రెండవ పులకేశి దండెత్తి వధించి విష్ణుకుండిన రాజ్యాన్ని వశపరచుకొన్నాడు.

చాళుక్యులు శ్రీపర్వతీయ పూర్వాపరక్షితిపరులమని చెప్పుకున్నారు. వారి జన్మస్థానమైన చాళుక్యవిషయం ఈనాడు కొంత పాలమూరు, కొంత కర్నూలు జిల్లాలకు చెందుతుంది. వీరికాలంనాడు ఈ జిల్లాకు వంగూరు విషయమని పేరు. దాన్ని రెండవ పులకేశిపై పల్లవ నరసింహవర్మ దండెత్తి జయించుకోగా పులకేశి కుమారుడైన విక్రమాదిత్యుడు తమ పినతండ్రియైన కుబ్జవిష్ణువర్ధనుని సహాయంతో పదమూడేండ్లు పల్లవులతోపోరి, తండ్రి పోగొట్టుకున్న రాజ్యాన్ని మళ్ళీ వశపరచుకున్నాడు. ఈ మహారాజు మనుమడైన వినయాదిత్యునికి పానగల్లు (వనపర్తిలోనిది) స్కంధావారంగా ఉన్నది అలంపూరులోని బ్రహ్మేశ్వరాలయ నిర్మాణం వీరికాలంలోనే జరిగింది.

ఈ వంశంలో కీర్తివర్మ బలహీనుడు కావడంచేత రాష్ట్రకూట దంతిదుర్గుడు దండెత్తి అతనిని జయించినాడు, దానితో రెండువందల సంవత్సరాల

కాలం కీర్తివర్మ వంశీయులైన పశ్చిమ చాళుక్యులు రాష్ట్రకూటులకు సామంతులుగా ఉండవలసి వచ్చింది.

ఈ కాలంలో రేనాటిని చోళులు పాలిస్తున్నారు. వారి ప్రక్కన వైదుంబులున్నారు. ఆ యిద్దరికి రాజ్యవిస్తరణకై కలహాలు జరుగుతూ ఉండేవి. ఆ యుద్ధాలలో వైదుంబులవెనుక రాష్ట్రకూటులు చోళులవెనుక చాళుక్యులు ఉండేవారు. ఒక పర్యాయం అదునుచూచి వైదుంబులు విజృంభించి రేనాటిని జయించుకున్నారు. దానితో అక్కడి చోళులు పలుప్రాంతాలకు వలసలు వెళ్ళవలసి వచ్చింది.

వీరికి జరిగిన ఈ యుద్ధానికి 'చోళవాడిక్షయ్యం' అనిపేరు. తెలుగుదేశంలో జరిగిన పెద్ద పెద్ద యుద్ధాలలో ఇదొకటి. అపుడు వారికి చోళవాడి గడి మండలంగా ఉన్నది. ఈ చోళవాడి ఈనాడు పాలమూరు, నల్లగొండ జిల్లాలకు చెందుతుంది.

వైదుంబులు రేనాటిని జయించుకున్నారు. కాని వారి విజయం అక్కడ ఎంతో కాలం నిలువలేదు. చాళుక్యతైలపుడు అచిరకాలంలోనే విజృంభించి రాష్ట్రకూట కక్కరాజును జయించి రాజధానిని వశపరచుకొని స్వతంత్రుడైనాడు. దానితో వైదుంబుల బలం సన్నగిల్లింది.

తైలపుడు స్వతంత్రుడైనప్పటినుండి వీరి వంశం పశ్చిమ చాళుక్య వంశంగా గుర్తించబడింది. వారు వైజయంతీపురాన్ని రాజధానిగా చేసికున్నారు. అపుడు వీరికి ఈ జిల్లాలోని గంగాపురం రెండవ రాజధానిగా ఉన్నది. చాళుక్యులు వైజయంతీ పురంలో నిలచిన పిమ్మట చోళవాడి నుండి చీలిన వారిలో ఒక శాఖ వచ్చి వారి నాశ్రయించి ఈ జిల్లాలోని కోడూరులో నిలచి కోడూరు పురవరేశ్వరులైనారు. వీరే తరువాతి కాలంలో కందూరు చోళులుగా ప్రసిద్ధి పొందినారు. వీరు పొత్తపి చోడుల శాఖ అనబడినారు ఏఱువ మండలం నుండి వచ్చినారు కాబట్టి ఏఱువ చోళులని గూడా వీరికి వ్యవహారం.

పశ్చిమ చాళుక్యులు ఇక్కడ నిలదొక్కుకున్న కాలంలో అక్కడ వేంగిలో పెద్ద కల్లోలం జరిగింది.

వేంగీ చాళుక్యులలో అమ్మరాజు ప్రసిద్ధుడు. రాజమహేంద్రవరాన్ని అతడే స్థాపించినాడు. కాని అతనిలో ఒక దోషం ఉంది. తండ్రిగారి పిమ్మట అన్నగారిని త్రోసిరాజని తాను సింహాసన మెక్కినాడు. అపుడది సహించక అన్నయైన దానార్ణవుడు తమ్ముని వధించి సింహాసన మెక్కినాడు. అది చూచి అమ్మరాజు బావమరిది జటాచోడ భీముడు దానార్ణవునిపైకి ఎత్తిపోయి వధించి సింహాసనమును ఆక్రమించి యిరువదేండ్లు అక్కడ తిష్ఠ వేసినాడు. ఇతడు పెదకంటి చోళుడు. అపుడిక ఆంధ్ర దేశానికి రాజధాని లేదు. పాలమూరులోని గంగాపురమే చెప్పదగినదిగా ఉన్నది.

ఆ కాలంలో దానార్ణవుని కుమారులైన శక్తివర్మ - విమలాదిత్యులు వెళ్ళి తమిళదేశంలో మేనమామగారి యింట తలదాచుకున్నారు. ఆ పరిస్థితిచూసి మొదటి రాజరాజు శక్తివర్మకు సైన్యాన్ని యిచ్చి జటాచోడ భీమునిపైకి పంపి అతనిని వధింపించి, శక్తివర్మను అక్కడ గద్దె నెక్కించినాడు. పిమ్మట తన కూతురు కుందవ్వను విమలాదిత్యునికిచ్చి అతనిని యువరాజును చేసినాడు.

విమలాదిత్యుడు అన్నపిమ్మట రాజ్యానికి వచ్చినాడు. కాని అతనికి మరో భార్య కూడా ఉండేది. ఆమె జటాచోడ భీముని కూతురు. ఈమెకు విజయాదిత్యుడు, కుందవ్వకు రాజరాజ నరేంద్రుడు అనే కుమారులు కలిగినారు. తండ్రిగారి పిమ్మట మళ్ళీ ఈ ఇద్దరికి సింహాసనం కొరకు పోటీ ఏర్పడింది.

రాజరాజ నరేంద్రుడు వెళ్ళి తన మేనమామ నాశ్రయించగా విజయాదిత్యుడు వచ్చి పశ్చిమ చాళుక్య మొదటి సోమేశ్వరుని ఆశ్రయించినాడు. అపుడతడు విజయాదిత్యుని పక్షంగా తమిళ చోళులతో పది యుద్ధాలు చేయవలసి వచ్చింది. వానిలో నాలుగవది ఈ జిల్లాలోని పూడూరు దగ్గర; అయిదు, ఆరు, ఏడు, ఎనిమిది, పదవ యుద్ధాలు కృష్ణాతీరంలో కుప్పం దగ్గర జరిగినవి.

కుప్పం ఇదే జిల్లాలోనిది. నేటి కొల్లాపురం తాలూకాలో ఉన్న ప్రదేశం. ఈ పశ్చిమ చాళుక్య మొదటి సోమేశ్వరుని కాలంనుండియే కాకతీయులు రంగం పైకి వచ్చినారు.

త్రిభువన మల్లుని మరణానంతరం అతని జ్యేష్ఠ పుత్రుడు కేంద్రంలో ఉండగా తమ్ముడైన కుమారతైలపుడు యువరాజై కందూరు నుండి రాజ్యవ్యవహారాలు చూచినాడు. ఇతని కాలంలో కందూరు చోళులు నల్లగొండ పానగల్లు నుండి వర్ధమానపురానికి మారినారు.

పాంమూరు జిల్లాలో ఏరువ చోళుల మొదటి రాజధాని కోడూరు. పశ్చిమ చాళుక్యులపై వారి సామంతులపై తమిళ చోళుల దాడులు చాలా జరిగినవి. కాబట్టి మన్యం తిప్పయ్య అనే సేనాపతి కోడూరు చోళులపై ఒకపుడు దండెత్తి ధ్వంసం చేసినాడు. అపుడు కోడూరు చోళులు ఆరవ విక్రమాదిత్యునితో కందూరిని పొంది కందూరు చోళులైనారు. పిమ్మట ఆ వంశంలోని ఉదయన చోడుడు తన రాజధానిని పానగల్లు నుండి వర్ధమాన పురానికి మార్చుకున్నాడు.

వడ్డవానికి ఏన్నూటి అనిపేరు. అప్పటికి దేశంతో కంపణం - బాడం అనే విభాగాలున్నవి. కంపణం అంటె 40 నుండి 70 గ్రామాలు గల విభాగం.

అప్పుడు వడ్డవానిలో ఎత్తపి తొంబదిర కంపణం, కూళకిళి పదమూడు, రేబళియ పన్నెండు, అన్మనపల్లె పదకొండు, చవున్‌పల్లె తొమ్మిది, వర్వ తొమ్మిది అనే చిన్న చిన్న విభాగాలు చాలా ఉన్నవి.

కుమార తైలపుడు వర్ధమాన పురానికి మారిన ఉదయన చోడుని కొడుకుల సహాయంతో స్వతంత్రుడై గంగాపురంలో పట్టాభిషేకం చేసుకున్నాడు. అది తెలిసి అన్నయైన జగదేకమల్లుడు కాకతి రెండవప్రోలుని పంపగా అతడు తైలపునిపై దండెత్తివచ్చి నేటి పాపకల్లు ప్రదేశంలో అతనితో యుద్ధం చేసి ఓడించి పట్టుకొని కల్యాణికి పంపినాడు.

ప్రోలుని పిమ్మట వర్ధమాన పురంపై కాకతిరుద్రుడు దండెత్తి భీమ చోడుని ఓడించి అక్కడ గోన మల్యాల వారిని సామంతులుగా నిలిపి వెళ్ళినాడు. వారు ఒకరి పిమ్మట ఒకరు వడ్డవానిని పాలించినారు.

కాకతిరుద్రునికి ఈ దండయాత్రలో సహాయం చేసిన చెరుకు రెడ్లు ఆమరాబాదు, కలువకొలను పరగణాలను పాలించినారు.

కాకతీయుల పిమ్మట నేటి తెలంగాణా భాగాన్ని రాచకొండ వెలమలు పాలించినారు. వారందరూ వీరులు. ఈ వంశంలో అయిదవ తరంలోని సింగమ నాయుడు జీలుగుపల్లె దగ్గర మయ రుద్రనాయని సంహరించినాడు. తొమ్మిదవ తరంలోని లింగమనాయడు అదే జీలుగుపల్లె దగ్గర ఓబళరాజును గణపవరంలో గోన కోటారెడ్డిని, హోలపల్లె దగ్గర ఆనెమరాజును, వడ్డెవాని దగ్గర జాజువఖానును సంహరించి అవంచెదగ్గర చెన్నరాజు రాఘవరాజును జయించి

నాడు. బాణాలకోటను కాల్చి కోవెలకొండను జయించినాడు. ఈ గ్రామాలన్ని యిపుడీ జిల్లాలో యింకా అదే పేర్లతో ఉన్నవి.

ఈ వంశంలో ఎనిమిదవ తరం వాడైన కుమారమాదానాయని కాలంలో నేటి వనపర్తిలోని పానగల్లు విజయనగర ప్రభువుల వశమయింది. దానికొరకు మొదటి దేవరాయలతో ఫీరోజు షాహ, శ్రీకృష్ణ దేవరాయలతో సుల్తాన్ కులీ కుతుబ్‌షాలు పోరి విఫలమైనారు.

రక్షస తంగెడ యుద్ధానంతరం దేశం మహ్మదీయాక్రాంతం కాగా ఈ జిల్లా మొదటిసారిగా బిజాపుర ప్రభువుల చేతికి వెళ్ళి అనంతరం గోలకొండ ప్రభువులకు ఈయబడింది.

ఇక అప్పటినుండి యిది భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేవరకు హైదరాబాదు రాష్ట్రంలోనే యున్నది.

పాలమూరు జిల్లాలోని తాలూకాలు - వాని వైశాల్యం - మరియు గ్రామాలు - ఆలయాలు

నెం.	తాలూకా పేరు	వైశాల్యం	గ్రామాలు	ఆలయాలు
1.	అచ్చంపేట	1126.4 చ మై.	91	61
2.	అలంపురం	435.2 చ. మై.	100	437
3.	ఆత్మకూరు	446.7 చ. మై.	122	170
4.	కల్వకుర్తి	907.00 చ. మై.	147	281
5.	కొల్లాపురం	661.1 చ. మై.	127	118
6.	కోడంగల్	460.8 చ. మై.	156	316
7.	గద్వాల	517.8 చ. మై.	102	278
8,	నాగర్‌కర్నూలు	561.3 చ. మై.	139	118
9.	మఖ్తల్	532.5 చ. మై.	130	222
10.	మహబూబ్‌నగర్	460.2 చ. మై.	80	81
11.	జడ్చర్ల	—	92	—
12.	వనపర్తి	535 2 చ. మై.	134	194
13.	షాద్‌నగర్	487.5 చ. మై.	126	97
	మొత్తము		1546	2362

ఇవి 1961 నాటి లెక్కలు. అప్పటివరకు జడ్చర్ల వేరుగా తాలూకాగా లేదు. ఆ పిమ్మట అది మహబూబ్‌నగర్ జిల్లాను రెండుగా చేసి వేరుచేయబడింది. ఇపుడీ పదమూడు తాలూకాలు 64 మండలాలుగా విభజింపబడినవి.

ఈ గ్రామాల సంఖ్యలో మజరాలు చేరలేదు. స్వాతంత్ర్యానంతరం ఈ నలువదేండ్లలో చాలా మజరాలు స్వతంత్రగ్రామాలైనవి. అంతేగాక ఈ పట్టికలో ఇచ్చిన ఆలయాల సంఖ్యగూడ 1950 ప్రాంతం నాటిది. అప్పటికి ప్రభుత్వం అన్ని గ్రామాలు సరిగా పరిశీలించి అక్కడి ఆలయాల వివరాలు నమోదు చేయ లేదు కాబట్టి ఈ జిల్లాలో యిపుడు సుమారుగా రెండున్నర వేల ఆలయాలు ఉంటవి.

మనరాష్ట్రంలో మొత్తం 31,937 ఆలయాలు ఉన్నట్లు ప్రభుత్వ పట్టికలు తెలుపుతున్నవి కాని ఇది కూడ పాతకాలపు లెక్కనే. ఈ లెక్కను జిల్లాకు సరాసరిని 1389 ఆలయాలున్నట్లు చెప్పవచ్చు. అందుచేత సరాసరికంటె ఈ జిల్లాలో ఆలయాలు ఎక్కువగా కనిపించటం దీని విశేషాలలో ఒకటి.

అచ్చంపేట తాలూకా ఆలయాలు

అచ్చంపేట - ఇది మొదట అమరాబాదు తాలూకాలో చేరిన గోదలు పట్టిలో గల ఒక సాధారణ గ్రామం.

అమరాబాదు పరగణా క్రీ. శ. 18వ శతాబ్ది ప్రారంభంలో అలంపూరు బిజ్జలవారి పరిపాలనలో ఉన్నది కాబట్టి ఈ గ్రామాన్ని ఆ వంశానికి చెందిన అచ్చమ్మగారు స్థాపించిందని, దేచినేని వంశానికి చెందిన అచ్చమ్మ దొరసాని కట్టించిందని రెండు మతాలున్నవి.

దేచినేని వారిది గుంటూరు సీమ. వారు కృష్ణదాటి ఈవలికి వచ్చి మొదట మున్ననూరులో నివసించినారు. ఆనాటికి అదొక బస్తీ. పిమ్మట వారు సురభిదొరల దగ్గర నేటి "కొండనాగుల" స్థలాన్ని కొని నివసించి ఆ గ్రామానికి కారకులైనారు.

దేచినేని వారిని పేర్కొనే శాసనం ఒకటి ఉమామహేశ్వరంలో ఉంది. అచ్చమ్మ దొరసానిగారు అక్కడ ఊరు స్థాపించే నాటికి వలపట్ల-తంగాపురం అనే రెండు గ్రామాలున్నవి. అంతేగాక బాబాజీ మఠం పేర ఒక పెద్ద సాధుమఠం గూడ ఉన్నది.

ఈ గ్రామానికి క్రీ. శ. 1898 విళంబి వత్సరంలో అమరాబాదు నుండి మునసబు, 1939 ప్రమాదీచ వత్సరంలో తహశీలు కచేరీలు వచ్చినవి. అప్పటినుండి యిది ఒక తాలూకా కేంద్రమై వలపట్ల తంగాపురంలు కలుపుకొని విస్తరించింది. ఇపుడింకా దినదినాభివృద్ధిలో ఉంది.

ఇక్కడ గ్రామానికి తూర్పున బాబాజీ మఠం ఉంది కాబట్టి ఊరు దాన్ని దాటి విస్తరించలేదు. ఇపుడా మఠంలో రెండు ప్రాచీన సమాధులున్నవి. ఒకటి గోపాలస్వామిది మరొకటి అతని శిష్యునిది అని చెబుతారు. గోపాలస్వామికి జడల బాబాజీ అని, శిష్యుడైన నారాయణస్వామికి గోర్ల బాబాజీ అని జనవ్యవహారాలు. ఈ గురు శిష్యులను పేర్కొనే శాసనం మున్నూరులోని విజయ గోపాలాలయంలోని గరుడకంబంపై ఉంది.

పూర్వం ఈ ప్రాంతంలో అచ్చంపేట లక్ష్మీపేట, దేవరకొండ బంగారుకొండ అని సామెత. ఇక్కడ మొదట ముప్పది వైశ్య కుటుంబాలుండేవి. వారు బాగా ధనవంతులు. ఆ కాలంలో దొరలు ఒక ఊరివారు మరో ఊరిపై దౌడుకొట్టి కొల్లగొట్టేవారు. అది ఇక్కడి వైశ్యులు కొందరు గమనించి తమ ధనం వ్యర్థంగా దొంగల పాలు చేయటం దేనికని గ్రామానికి నాలుగు వైపులా నాలుగు పెద్ద పెద్ద కోనేరులు తవ్వించి వానిలో ఆలయాలు సత్రాలు కట్టించినారు. అవిపుడున్నవి. తూర్పు కోనేరు - ఇది కందూరు వారనే వైశ్యులు త్రవ్వించి కొంత కాలానికి పంతులవారనే నందవరీకులకు దానం చేసినారు. ఈ వైశ్యులు ఇక్కడి ప్రభువుల దగ్గర మంత్రులుగా ఉన్నారు.

దక్షిణం కోనేరు - దీన్ని ఆనాటి ప్రభువులు గుంతవారనే వైశ్యులకు యినాముగా ఇచ్చినారు. దీనిలో ఉత్తర దక్షిణాలు రెండు వైపులా సత్రాలున్నవి. ఇపుడు స్థితి తప్పింది. ప్రేతబంధువులు మాత్రం దీనిలో స్నానం చేస్తారు.

పడమటి కోనేరు - దీన్ని ఇరువెంటివారనే వైశ్యులు త్రవ్వించి లోపల ఒక శివాలయం - ఒక విష్ణ్వాలయం కట్టించినారు. శివాలయం దక్షిణాభిముఖంగా ఉంది. దీని విమానం సోపానక్రమంలో ఉంది. విష్ణ్వాలయం ప్రాఙ్ముఖంగా ఉంది. దీని విమానంపై అమలకాలు ఒక దానిపై ఒకటిగా మూడున్నవి. ఇపుడీ స్వామిని వేంకటేశ్వరునిగా వ్యవహరిస్తున్నారు.

ఈ కోనేరును వారు కొంత కాలానికి ఒక బోయవాని కీయగా అతనినుండి పెద్దివారనే వైశ్యుల చేతికి వచ్చింది. ఇపుడిది వారి అధీనం లోనే ఉంది.

ఉత్తరం కోనేరు - దీనికి రామేశ్వరం కోనేరని పేరు. ఇది గూడా ఇరువెంటివారు త్రవ్వించిందే. ఇందులో ఉత్తరంగా ఒక ఆలయం దానిలో ప్రాఙ్ముఖంగా శివప్రతిష్ఠ, దక్షిణాభిముఖంగా హనుమత్ప్రతిష్ఠ ఉన్నవి. ఇది మూడు సందుల కప్పు. వాస్తుకారులు శివ హనుమంతులున్న సందులపై కత్తెర బండల కప్పులు వేసినారు.

దక్షిణంగా కల్యాణమంటపం వంటశాల ఉన్నవి పూర్వం గ్రామంలోని వివాహాలన్ని యిక్కడనే జరిగేవట కాని ఇపుడీ కళ్యాణ మంటపం స్థితి తప్పింది.

ఈ కోనేర్లే కాక ఇక్కడ గ్రామానికి నాలుగు వైపులా నాలుగు పెద్ద పెద్ద బావులు కూడా ఉన్నవి.

ఇక గ్రామంలో అంబగుడి - శివుని గుడి, హనుమదాలయం ఉన్నవి. అంబగుడి పోకల ముత్యాలుగారి కాలంలో కట్టబడింది అంటారు. కాని ఎవరు కట్టించింది తెలియలేదు. దీనిలో ఇటీవల బూసి వాసుదేవుడు నవగ్రహ ప్రతిష్ఠ, సిద్ధాపురం రాగయ్యగారు రామలక్ష్మణ ప్రతిష్ఠ చేయించినారు. ఇందులోని దేవి ఆలయంలో నంది పానవట్టం ఒకే శిలలో హంసపాదువలె మలచిన చిత్రశిల్పం ఉంది.

గ్రామస్థులిపుడీ ఆలయాన్ని పునరుద్ధరించినారు. కాబట్టి ఇది గ్రామానికి సాంస్కృతిక వేదికగా ఉంది.

హనుమదాలయం సామాన్యంగా ఉండగా బూసి పర్వతాలుగారు దీనికి రాతికప్పు వేయించినారు.

శివాలయం సామాన్యంగా ఉంది. ఇపుడు బాబాజీమఠంలో స్థానిక విశ్వ బ్రాహ్మణులు వీరబ్రహ్మేంద్రుని ఆలయం కట్టించినారు.

ఉమామహేశ్వరం

ఇది ఒక సిద్ధక్షేత్రంగా, ఉమాశక్తి పీఠంగా చెప్పబడుతూ శ్రీశైలానికి ఉత్తర ద్వారంగా ప్రసిద్ధిచెందింది. రావణవధానంతరం శ్రీరాముడు శ్రీశైల ప్రదక్షిణం ఈ క్షేత్రంనుండే ఆరంభించినట్లు శ్రీశైల స్థలపురాణం చెబుతుంది.

ఇది చరిత్ర ప్రసిద్ధమైన తిరుపతి, అహోబిలం - మహానంది, శ్రీశైలం మొదలైన పుణ్యక్షేత్రాలు గల నల్లమల పాయలో అచ్చంపేట మండలంలోని రంగాపురానికి దక్షిణంగా మూడు కిలోమీటర్ల దూరానఉంది.

ఇక్కడ కొండ విల్లువంపు తిరిగి దానిపై సుమారు అర్ధక్రోశం పొడవుగా ఒకదానిపై ఒకటి రెండు దరులు ఏర్పడినవి. మొదటి దరిపై రెండవది ఇరువదడుగుల ఎత్తుపై ఉంటుంది. క్రింది దరి విశాలంగా ఉండగా పైది అయిదడుగుల వెడల్పు మాత్రమే కలిగి యిరుకుగా గూడ ఉంటుంది. ఈ దరులలో వేర్వేరు పేర్లతో జలధారలున్నవి. వాని క్రింద లింగప్రతిష్ఠలుండటం ఇక్కడి విశేషం.

ఇక్కడి ప్రధాన ధారకు రుద్రధార అని పేరు. ఈ క్షేత్రంలోని ముఖ్య దైవమైన ఉమామహేశ్వరుడా ధారక్రిందనే ప్రతిష్ఠింపబడినాడు. కాని ఇపుడది ఆలయ రక్షణ దృష్టితో పైనుండి మున్ననూరులోని దురాయి చెరువులోనికి మలుపబడింది.

ఇది పశ్చిమాభిముఖాలయం. కాకతీయులనాటివరకు ఇక్కడ ఆలయమేది లేదు. దరి క్రింది భాగాన్నే మూడు గదులుగా చేసి నడిమి గదిలో స్వామిని, అతనికి కుడివైపుగా పార్వతిని, ఎడమవైపు వీరభద్రుని ప్రతిష్ఠించినారు. ఇక్కడ దరి సుమారు ఏబదడుగుల వైశాల్యం ఉంటుంది.

రెండవదరిపై ఉత్తరపు కొనన "పాపనాశిని" అనే గుండం ఉంది. అక్కడ రాతిపొర క్రిందినుండి నీరు ఊరుతుంది. బండపై ఒక చిన్న గుండం తొలువబడింది. గుండం చిన్నదైనా నీటికి కొదువ ఉండదు. ఎంతగా ముంచితే అంతగా ఊరుతుంది.

ఈ పాపనాశినివరకు ఎక్కటానికి రాతి మెట్లున్నవి. పూర్వం యాత్రికులు అక్కడ స్నానంచేసి అలాగే పైదరినుండి సాగివచ్చి ప్రస్తుతం ఉన్న ఆలయానికి ఎడమవైపు నుండి దరిని దిగేవారు. దానితో వారికి ఆలయ ప్రదక్షిణ ఫలం కలసివచ్చేది. కాని ఇపుడీ దిగే స్థలం శిథిలమైపోయింది కాబట్టి పాపనాశినిలో స్నానం చేసి జనం వెనుకకు తిరిగివచ్చి స్వామిని దర్శించుకుంటారు.

ఈ ప్రదక్షిణ వలయంలో కూడా పూర్వం చిన్న చిన్న ధారలు, వాని క్రింద లింగ ప్రతిష్ఠలు, వాని నడుమ ఆనాటి సన్యాసులు తపస్సు చేసికున్న గదులు ఉన్నవి కాని ఈనాడు అవి అన్ని స్థితి తప్పినవి.

కాకతీయులనాడు ఈ క్షేత్రం మహావైభవంగా ఉన్నట్లు పండితారాధ్య చరిత్రవల్ల తెలుస్తుంది. పండితారాధ్యుని శిష్యుడు దోనమయ్య ఈ దారిననే శ్రీశైలానికి వెళ్ళినాడు. అప్పటికి ఉమా మహేశ్వరం ఒక పురంగా ఉన్నట్లు చెప్పబడింది.

గణపతిదేవుని కాలంలో అమరాబాదు ప్రాంతాన్ని చెఱకు బొల్లయరెడ్డి అనే అమరనాయకుడు పాలించినాడు. ఆయన భాండాగారాధ్యక్షుడు కరణం రామయ్యగారు, ఆయన భార్యలు, కుమారులు ఇక్కడ అనేకమైన నిర్మాణాలు చేయించినారు.

రామయ్యగారు మహేశ్వరునికి పెండ్లిమేడ కట్టించి ఒక తేరు కూడా చేయించినాడు. కాని ఈనాడు ఇవి లేవు.

భోగ మహేశ్వరం

ఉమామహేశ్వరంలో కొండ క్రింది స్థలానికి భోగమహేశ్వరమని వ్యవహారం. పూర్వం యాత్రికులంతా పైకి వెళ్ళి స్వామిని దర్శించుకుని మళ్ళీ క్రిందికి వచ్చి అక్కడనే తమ వంటలు మొదలైనవి చేసికునేవారు. ఆ కారణంగా అక్కడ ఒక గ్రామం కూడా ఉన్నది.

క్రీ. శ. 1280 లో కరణం రామయ్యగారు ఇక్కడ - భోగ మహేశ్వరంలో - కాకతి రుద్రమదేవి పేర చలమర్తిగండ రుద్రేశ్వర ప్రతిష్ఠ చేసినాడు. అపుడాయన భార్యయైన మల్లసాని రామనాథ దేవర - చెన్న సోమనాథ దేవర - చెన్నమల్లినాథ దేవర - పోచేశ్వర దేవరల పేర గుడులు కట్టించి లింగ ప్రతిష్ఠలు చేయించింది. ఈ అయిదు లింగ ప్రతిష్ఠలు ఒకే ఆవరణలో ఉన్నవి కాబట్టి వానికి పంచ లింగాలని వ్యవహారం.

ఇవిగాక రామయ్యగారు ఇంకా ఇక్కడ మహేశ్వరానికి ఉత్తరాన గల శివదేవపురానికి పడమట బండమీద మరో పంచలింగాల గుళ్ళు, శృంగారం తోటలో చెన్న మల్లికార్జున దేవర గుడి, నవలింగాల గుళ్ళు మహేశ్వర దేవరకు తూర్పున చెన్న సోమనాథ దేవర గుడి, పంచధారల దగ్గర మరో గుడి కట్టించినాడు. ఈనాడు ఇవి ఎక్కడెక్కడ ఉన్నవో గుర్తించే దశలో లేవు.

రామయ్య కొడుకు పోచయ్య భోగమహేశ్వరంలో ఒక బావి త్రవ్వించి దానికి ఆగ్నేయంగా పంచ మహామఠాలు కట్టించినాడు. ఈనాడు ఈ బావి మాత్రం ఉంది. మఠాలు శిథిలమైనవి.

కాకతీయుల పిమ్మట ఈ ప్రదేశం దేవరకొండ రాచకొండలను పాలించిన వెలమల క్రిందికి వచ్చింది. అపుడిది రాచకొండ ప్రభువులైన అనపోతానాయక మాదానాయకుల తండ్రియైన సింగభూపాలునికి కొంత కాలం రాజధానిగా ఉన్నట్టు డా॥ శ్రీ బి. రామరాజుగారు చెబుతున్నారు.

మాచానాయకుడు రాచకొండలో రాజ్యాన్ని స్థాపించుకున్న పిమ్మట క్రీ. శ. 1376 లో ఉమామహేశ్వరం కొండకు ఇపుడున్న మెట్లు వేయించి పైన ప్రస్తుతం ఉన్న ఆలయం, దానికి రెండువైపులా ఉన్న గుండాలు, ఇంకా ఇతర నిర్మాణాలు కూడా చేయించినాడు.

అతని పిమ్మట క్రీ. శ. 1398 లో భారతీ సంప్రదాయానికి చెందిన సదానందస్వామి శిష్యులు పురుషోత్తముడు- హనుమడు, రంగడు అనేవారు వావిలేటి బసవయ్యగారి కుమారులతో పార్వతి - వీరభద్ర - మహిషాసురమర్దని- నందీశ్వరులను చేయించి ప్రతిష్ఠించినారు. ఈ ప్రతిష్ఠలన్ని కొండపైన ఉన్నవి.

మాధవ నాయకుడు కట్టించిన మంటపానికి పశ్చిమద్వారం-ఉత్తర ద్వారం రెండూ ఉన్నవి. యాత్రికులు మెట్లదారిగుండా పశ్చిమద్వారం దగ్గరకే చేరతారు.

ఈ ఆలయానికి ఉత్తరంవైపు స్థలం విశాలంగా ఉంది. కాబట్టి అక్కడ ఆలయంయొక్క కార్యాలయం నివాసగృహం ఏర్పరచి విశాలమైన ఆవరణం కట్టినారు.

ఇది ప్రకృతి రామణీయక ప్రదేశం కాబట్టి పూర్వం ఎందరో మునులిక్కడ తపం చేసికున్నారు. క్రీ. శ. 1235 లో ఇక్కడ శ్రీశైల శిఖర సింహాసనారూఢుడైన ఓంకారరాసి పండితుడు మహేశ్వరదేవునికి స్థానాధిపతిగా ఉన్నాడు. అతని ఆశ్రమం ప్రదక్షిణ వలయంలో సరిగా మహేశ్వరుని గుడిపైనే ఉంది. ప్రస్తుతం అక్కడ అతని మునిగల్లు కూడ ఉంది. ఆనాడు దీనికి ఇరువది గ్రామాల గడిబండికాద్రవ్యంపై అధికారమున్నది.

క్రీ. శ. 1398లో భారతీ సంప్రదాయానికి చెందిన సదానంద స్వామిగూడ ఇక్కడనే ఉన్నాడు. ఆనాడు ఆయన ఆశ్రమం ఆలయానికి ఉత్తరంవైపుననే ఉన్నది కాబట్టి ప్రస్తుతం అతనిసమాధి ఉత్తరంవైపు గల ఆవరణలో ఉంది.

ఇక్కడికి క్రీ. శ. 1938లో పల్నాడులోని రాయవరంనుండి బంయనప్రగడ విశ్వనాథరావు అనే కరణంగారు సంచారవశంగావచ్చి 53 వరకు నివసించి దీని జీర్ణోద్ధరణకై ఎంతో కృషి చేసినాడు.

పిమ్మట క్రీ. శ. 1954 నుండి కామసానిపల్లె మర్యాద గోపాల్ రెడ్డిగారు దీనికి ధర్మకర్తగా వచ్చినాడు. ఆయన కాలంలో ఈ క్షేత్రం గణనీయమైన అభివృద్ధిని పొందింది.

క్రీ. శ. 1964 నుండి ఈ క్షేత్రంయొక్క ప్రస్తుతాభివృద్ధి ప్రారంభమయింది.ఆయన జిల్లా పరిషత్తుతో ఆర్థిక సహాయాన్ని పొంది ఆలయం ముందు కూలిపోతున్న రాతితెట్టెను మళ్ళీ కట్టించి ఆ స్థలాన్ని విశాలపరచి బండలు పరిపించి క్రీ. శ. 1?-8-1967 నాడు శ్రీశ్రీశ్రీ జగద్గురు శృంగేరి శారదా పీఠాధిపతిగారిచేత పడిపోయిన ధ్వజస్తంభాన్ని పునఃప్రతిష్ఠ చేయించినారు.

అనంతరం ఆలయందగ్గరకు గుట్టపై ఘాటురోడ్డు వేయించి దేవాదాయ ధర్మాదాయ శాఖవారి సర్వశ్రేయోనిధినుండి ఆర్థిక సహాయాన్ని పొంది భోగ మహేశ్వరంలో శిథిలమైన పంచలింగాల గుడులు పునరుద్ధరించి వానికి రాజగోపురం కట్టించడానికి 8-11-1979 నాడు శ్రీశ్రీశ్రీ శ్రీ మదభినవోద్దండ నృసింహ భారతీ స్వాములవారి ఆధ్వర్యంలో రవాణాశాఖామాత్యులు శ్రీ ఎ. వెంగళరెడ్డి గారి చేత శంకుస్థాపన చేయించి ఆ గోపురం మహామంటపం మొదలైన నిర్మాణాలు చేయించినాడు.

తాను శ్రీశైల దేవస్థాన కమిటీలో సభ్యుడుగా ఉండి వారిచేత, జిల్లా పరిషత్తు వారిచేత రెండు ధర్మసూత్రాలు కట్టించినారు.

కొండపై ఉమామహేశ్వర ఆలయ మంటపంపైన సిమెంటు శిల్పాలు వేయించినాడు. పాపనాశనం దారి బాగుచేయించి స్నానఘట్టాలు కట్టించినాడు. అయినా ఇక్కడ ఇంకా ఎంతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్మాణాలు జరుగవలసి ఉన్నవి. ఈ క్షేత్రంలో ప్రతియేటా ఆషాఢ శుద్ధ ఏకాదశికి భజనలు జరుగుతవి. సంక్రాంతికి ప్రభలు వస్తవి. శివ రాత్రికి కళ్యాణోత్సవం నడుస్తుంది. వానిలో ప్రభల ఉత్సవం, కళ్యాణో త్సవం ముఖ్యంగా చూడదగినట్లుగా ఉంటవి.

శివాలయాలు - ఉలుపర, మొలుగర

ఇవి దెందితీరంలో ఉన్న జంటగ్రామాలు. ఇపుడుప్పనూతల మండలంలో ఉన్నవి. వీనిలో మొలుగర శివాలయం ప్రాచీనమయింది. అది గ్రామం వెలుపల దెందిలో ఒక రాతి చట్టుపై ఉంది. తూర్పు ముఖంగా ఉన్న ఈ గుడిలో పానవట్టం నంది మంచి పనితనంగా ఉన్నవి. కాని శివలింగం మాత్రం సామాన్యంగా ఉంది.

దీనికి చుట్టు గోడల వెలుపలివైపు దక్షిణంగా బాల భైరవుడు అతని ప్రక్కన చెంబుతో కూర్చున్న యువతి, పడమట అడ్డంగా చక్కగా పడగ విచ్చుకున్న నాగు, ఉత్తరం గోడపై ఒక పెద్ద చేప దాని ప్రక్కన జంతు మానవ సంయోగ శిల్పం ఉన్నవి. ఈ జంతువు ఎలుగు వలె ఉంది. ఇక్కడ ఇదొక విశేషం.

పూర్వం ఈ గుడికి శిఖరం ముఖమండపం కుడివైపున సత్రాల శాల ఉండెనట. ఆ కాలం నాడిక్కడ గ్రహణ స్నానాలుచేసి తర్పణాలు విడిచేవారట. పంటలు కూడా చేసికునేవారట.

క్రీ. శ. 1908 కీలకలో భారీ వర్షాలవల్ల మూసీ పొంగి హైదరాబాదు కొట్టుకొనిపోయింది. అపుడిది కూడా మునిగి దీని శిఖరం ముందు మండపం కొట్టుకొనిపోయినవంటారు. ప్రక్కనఉన్న సత్రంగూడ అపుడే కూలిందట. ఈ ప్రాంతంలో ఇదొక అపురూపమైన ఆలయం కాబట్టి తప్పక ఉద్ధరించదగింది.

ఇక ఉలుపర దీని సమీప గ్రామం. అక్కడ ఇల్లిందల ముదిగొండయ్య అనే వైశ్యుడున్నాడు. వారి పూర్వులది రఘుపతిపేట. ముదిగొండయ్య తల్లి అయ్యమ్మగారు మంచి ధర్మాత్మురాలు. ఆమె రఘుపతిపేట, రంగాపురం, మొలుగర గ్రామాలలో శివాలయాలు కట్టించి కోనేరులు త్రవ్వించింది. అందుచేత ఆమెకొడుకు తల్లిగారి జ్ఞాపకంగా అక్కడ 250 చింతలు నాటించి శా. శ. 1703 ప్లవ ఆశ్వీయుజ శుద్ధ దశమి నాటికి తల్లిపేర భగవదర్పితంగా శివాలయం కట్టించి కోనేరు త్రవ్వించినాడు. ఇక్కడ గ్రామంలో ఒక ప్రాచీన శివాలయం ఉంది. దానిదగ్గర అపుడే ఆశ్వీయుజ బహుళ పంచమినాడు తండ్రియైన శరభన్నగారిపేర ఒక వంటశాల కట్టించినాడు.

ఇపుడాయన నాటించిన చింతలు లేవు. అవి ప్రభుత్వవశమైనవి కాని అక్కడి గుడిమాత్రం ఉంది. దానిముందు దీపస్తంభం దానిపై రాతి కడీలతో నిలిపిన గూడు ఉంది. ఆ స్తంభానికి క్రిందివైపున తూర్పున భైరవ, దక్షిణంలో నాగ-పశ్చిమంలో వలమురి గణపతి, ఉత్తరంలో దేవీ ప్రతిష్ఠలున్నవి. ఈ ప్రాంగణంలో ఉత్తరంగా హనుమదాలయం కూడా ఉద్ధరించదగినవానిలో ఒకటి.

కోదండ రామాలయం - లింగాల

పదకొండవ శతాబ్దిలో ఇది కందూరు మండల సగ్రామం. ఇపుడు అచ్చంపేట తాలూకాలో చేరి ఒక మండలానికి కేంద్రంగా ఉంది.

పూర్వం ఇక్కడ అయిదు లింగ ప్రతిష్ఠలుండెనట. అందుచేతనే దీన్ని లింగాల అన్నారు కాని ఇపుడా గుడులు లేవు. వానిలో ఒక్కటి మాత్రం జీర్ణావస్థలో మిగిలింది.

క్రీ. శ. 1168 లో దీన్ని తాండ అనే సామంతుడు పాలించి నాడు. అతడు వర్ధమానపుర చోళులకు సగోత్రుడైన సామంతుడు, అతడు కారుపాములలో వర్ధమానపుర భీముని పేర విష్ణ్వాలయాన్ని, గోకర్ణుని పేర సూర్యాలయాన్ని, తండ్రి పేర శివాలయాన్ని కట్టించినాడు. ఇవిగాక రాకొండ గుట్టపై గల అలయాన్ని లింగాల కోదండ రామాల యాన్ని గూడా అతడే కట్టించినాడని చెబుతారు.

లింగాల రామాలయం, శ్రీశైల మార్గంలోని బౌరాపురం చెరువు దగ్గరగల భ్రమరాంబ గుడి రెండూ పూర్తిగా ఒకే తీరుగా ఉన్నవి.

ఇక్కడి రామాలయం వెనుకనుండి చూసినపుడు గర్భగుడి శిఖరం పిరమిడ్ ఆకారంగా కనిపిస్తుంది. దీనిలో అర్ధమండపం, కళ్యాణ మంటపం, సభామంటపం, ధ్వజస్తంభం, బలిపీఠం, ప్రాకారానికి ముఖ మంటపం ఉన్నవి. ఇది ప్రాఙ్ముఖాలయం.

గర్భమంటపానికి ద్వారపాలికలు, అర్ధమంటపానికి జయవిజ యులు ఉన్నారు. ద్వార పాలికలలో ఎడమవైపు ప్రతిమకు మాత్రమే కుచబంధం ఉంది.

ఆలయానికి కుడివైపున సగం శిథిలమైన ఆళ్వారు సన్నిధి ఉంది. అందులో మూర్తులు లేవు. ఎడమ వైపున యాగశాల ఉంది.

14 వ శతాబ్దంలో అమరాబాదుతో బాటు చింతకుంట ప్రభువులు దీన్ని కూడా పాలించినారు. ప్రస్తుతం అమరాబాదులో ఉన్న ఉత్సవ మూర్తులు ఇక్కడి మూర్తులు వారే చేయించినారు. ఇక్కడి మూర్తుల గద్దెలపై వానిని చేయించినవారి పేరు తేదీలు చెక్కబడిఉన్నవి. కాని అవి చోరగ్రస్తమై గ్రామస్థులిపుడు మళ్ళీ కొత్తవి తెచ్చినారు.

ఈ గ్రామంలో క్రీ.శ. 1880 పిమ్మట నిజాంరాజ్యంలో సదరె నాజం కొత్వాల్ (ఇన్‌స్పెక్టర్ జనరల్)గా పనిచేసిన హ్యాంకిన్ దొరగారు సెటిల్‌మెంటు ఏర్పాటు చేసి పధ్నాలుగు జిల్లాలలోని నేరస్థులందరిని తెచ్చిఉంచి వారికి తగిన కట్టుదిట్టం చేసినాడు.

ఈ గ్రామాభివృద్ధిలో హ్యాంకిన్ దొరగారి పాత్ర చాలా ఉంది. ఆయన కాలంనాటి వరకు ఇక్కడ ఆలయంలో నికరమైన పూజారిగా రెవ్వరూ లేరు. హైదరాబాదులోని వట్టిపల్లి నివాసి కిడాంబి దరూరు నరసింహాచార్యులు పోస్టుమాస్టర్‌గా ఉన్నాడు. అవసరాన్ని బట్టి ఆలయంలోని పూజాదికాలు అతడే చూసేవాడు. హ్యాంకిన్ దొరగారికి అతని ప్రవర్తన నచ్చింది. అందుచేత ఆయన లింగాల రామాలయం సర్వేశ్వర శివాలయం పూజారితనాలు ఆయనకు వ్రాసి యిచ్చినాడు.

నరసింహాచార్యులు గారు శాశ్వత పూజారి అయిన పిమ్మట ఆలయాభివృద్ధికి ఎంతో కృషిచేసి నిత్యార్చన, బ్రహ్మోత్సవం, వాహన సేవలు, రథోత్సవం ఏర్పాటు చేసినాడు. ఆయన తలపెట్టిన కార్యక్రమాలన్ని చక్కగా నడుస్తుండగా ఒకప్పటి ఉత్సవ సందర్భంలో దురదృష్టకరమైన సంఘటన ఒకటి జరిగింది.

పూర్వం రథోత్సవ సందర్భంలో దానిముందు తుపాకులు పేల్చే ఆచారం ఉండేది. అది ప్రభువులు దేవునికి యిచ్చే సైనిక వందనం. తుపాకులు పేల్చిన పిమ్మట తేరు కదిలేది.

తేరిపై స్వామిని వేంచేపుచేసి నరసింహాచార్యులు ఎక్కినాడు. అతనితోబాటు చిన్నకొడుకు గూడా ఎక్కి కూర్చున్నాడు. తుపాకివాడు బారునింపి భుజాన పెట్టుకొని దొరగారి ఆజ్ఞకై చూస్తున్నాడు. ఇంతలో ప్రక్కన నిలిచిన దివిటీవాని మిణుగురు ఒకటి తుపాకి మూతిపై బడి అప్రయత్నంగా అది ప్రేలి ఆచార్లవారి కుమారుని కంఠానికి సూటిగా తగిలింది.

పిల్లవాడు అలాగే తేరిపై ఒరిగి ఉత్సవం ఆగిపోయింది. ఇది జరిగిన పిమ్మట ఆయనకిక అక్కడ ఉండటానికి మనస్కరించలేదు. స్వామివారు తన సేవ నంగీకరించలేదని జ్ఞాతియైన రాకొండ నివాసి దరూరి కస్తూరి రంగాచార్యులను పిలుచుకొని తనకు దొరగారిచ్చిన సనదు సన్ 1331 బహెమన్ చం. 22 నాడు అతనికి వ్రాసి యిచ్చి స్వస్థానానికి వెళ్ళిపోయినాడు.

ఇక ఇపుడుడక్కడ రాకొండవారే పూజారులుగా ఉన్నారు. చైత్రశుద్ధ సప్తమి మొదలు బహుళ పాడ్యమి వరకు బ్రహ్మోత్సవం జరుగుతుంది.

సర్వేశ్వరంలో చైత్ర పూర్ణిమకు జరుగుతుంది. పూజారి ఆనాడు అక్కడికి వెళ్ళివస్తాడు.

ఇక్కడ మూలవిగ్రహాలు నల్లరాతివి. సీతారామలక్ష్మణ ప్రతిమలు వేరువేరుగా ప్రభలతో బాటు మలచబడి మిక్కిలి సుందరంగా ఉన్నవి. అయితే కాలాంతరంలో సీతాప్రతిమ ఏలాగో నడుముదగ్గర సన్నని యిటుక వాసింది.

క్రీ. శ. 1972 లో ఇక్కడికి కర్నూలు ప్రాంతం నుండి యజ్ఞ రామయ్య అనే సన్యాసి వచ్చి కొంతకాలం ఆలయంలో మకాం పెట్టినాడు. అయనకేలాగో అమ్మవారి మూర్తి పగ్గి విచ్చిందన్న సంగతి తెలిసి అది పూజకు పనికిరాదని కొత్తమూర్తిని చేయించవలెనని గ్రామస్థులతో పెద్ద ఎత్తున చందాలు వసూలుచేసి, అక్కడి చెరువులో ఉన్న ఒక నల్లరాతితో అచ్చంపేట నివాసి కంచరి బోజయ్యాచారి గారితో మరోమూర్తిని చేయించి ప్రతిష్ఠించినాడు. కాని అది మొదటి మూర్తి అంత సుందరంగా లేదు. అదిపుడు పూర్తిగా విరగగొట్టబడి ఆలయం వెలుపల ఉంచబడింది. కర్ణకుండలాలతో హారాలతో కుచబంధంతో ఎంతో మనోహరంగా ఉంది.

నాగలింగేశ్వరాలయం-కొండనాగుల

పూర్వం ఇక్కడ గ్రామం లేదు. అడవి నాగులు తిరిగే ప్రదేశం. ఇక్కడ గుట్టలవంటి రెండు గుండ్లున్నవి. ఒకటి చిన్నది. ఒకటి మరి కొంత పెద్దది. దానిపై ఒక గుండంకూడా ఉన్నది. ఆ గుండాన్ని ఆధారంగా చేసికొని దానిపై ఆలయం కట్టినారు. ఈ గుడి విశాలంగా ఉంది. దానిలో ఆరు వరుసలుగా మొత్తం నలుబది స్తంభాలున్నవి. గుడికి చుట్టు ప్రాకారం ముఖద్వారం కూడా వున్నవి.

సాధారణంగా గుడి విష్ణువుదైతే ద్వారపాలకులుగా జయవిజయులు, ఆవరణపై గరుడులు, శివునిదైతే ద్వారం దగ్గర శృంగి, భృంగి; ఆవరణపై నందులు; నృసింహునిదైతే ఆవరణపై సింహాలు లేదా సింహతలాటాలు ఉండటం వరిపాటి. ఇక్కడ ఆ విధంగా కాక ద్వారంపై జయ విజయుల స్థానంలో నాగాలు అమలకంపై నలువైపుల పడగలు తీర్చబడినవి.

తెలంగాణంలో ఒకటి అరా నాగప్రతిమలు నరనాగాలు లేని గ్రామం లేదు కాని ఆలయంపై ఆపాద మస్తకం నాగచిహ్నాలే ఉండటం అపురూపం.

పూర్వం ఈ ప్రాంతాన్ని నాగవంశీయులు పాలించినారు. నాగపురం, నాగులవరం, నాగులపల్లె, నాగులపాడు,నాగులకుంట, నాగేశ్వరం, గడినాగులవంటి పేర్లు నాగ ప్రభావాన్ని తెలుపుతవి. కాబట్టి ఈ ఆలయాన్ని ఆనాటి నాగ ప్రభువులే స్థాపించి ఉంటారు. గుడిని ప్రతిష్ఠించిన పిమ్మట ఈ గుండు పెద్దగుడిబండ అయింది.

మొదట ఇది గోదలు పట్టీలోనిది. దాన్ని సురభి దొరలు పాలించినారు. ఆ కాలంలో దొరలు తమ అవసరాలకు గ్రామాలను అమ్ముకుంటు

గూడా ఉండేవారు. అదేకాలంలో మున్నూరులో దర్రన్న-బుర్రన్న అని యిద్దరు సోదరులున్నారు. వారు దేచినేని వంశానికి చెందినవారు. ధనవంతులు. దర్రన్నగారు యౌవనంలో ఒక వేశ్యను చేరదీసి కొంత కాలానికి సురభి ప్రభువులదగ్గర నేటి కొండనాగులు స్థలాన్ని కొని వచ్చి ఆక్కడ నివసించినాడు. ఈ చోటు పెద్దగుడిబండకు ఉత్తరంగా కిలోమీటరు దూరంలో ఉండేది. ఆ విధంగా దర్రన్న వారిదగ్గర క్రమంగా పన్నెండు గ్రామాలు కొని మఖ్తేదారు అనిపించుకున్నాడు. అన్నగారిని చూచి తమ్ముడు గూడా ఇక అక్కడికే వచ్చినాడు. వారక్కడ నివసించిన కొద్ది కాలానికి దానికి అనతిదూరంలో గల బిల్ల కల్లు బాణాల గ్రామాలలో భయంకరమైన మహామారి వ్యాపించింది. అపుడక్కడి వారు భయపడి వచ్చి దర్రన్నగారి చుట్టు స్థలం కొని నివసించినారు. ఇట్లా ఆ గ్రామం ఏర్పడి పాములున్న ప్రదేశం కాబట్టి కొండనాగుల అని రూఢి నిలిచింది.

పూర్వం శ్రీశైలానికి ఇక్కడినుండి దారి ఉండేది. ఈ దారిలో ఇదే చివరి ఊరు. అప్పటికి శ్రీశైలం అంతా అడవి కాబట్టి అక్కడి పంచమఠాల జంగాలు ఇక్కడనే ఉండేవారు. ఇపుడు సారంగ మఠంవారు మాత్రం మిగిలినారు.

ఈ గ్రామంలో నాగలింగేశ్వరాలయమే కాక ఇంకా పరమేశ్వరాలయం, చెన్న కేశవాలయం, ఆంజనేయాలయం, శివాలయంకూడా ఉన్నవి.

1. నాగలింగేశ్వరాలయాన్నిపుడు రామలింగేశ్వరాలయం అంటున్నారు. దీనిలో స్వామికి ఒకవైపు అమ్మవారు మరోవైపు వీరభద్రుడు ఉన్నారు. ఎదురుగా బసవేశ్వరుడున్నాడు. సారంగమఠం వారు దీని పూజారులు.

పూర్వం ఈ స్వామికి ఇరువదైదు తలల పెద్ద ఇత్తడి పడగ ఉండెనట. దానిని ఏ గరుత్మంతుడో తన్నుకొని పోగా గ్రామస్థులిపుడు మరొకటి చేయించినారు. ఏటా స్వామికి శ్రావణంలో ఘటాభిషేకం జరిపి సంతర్పణ చేస్తారు. ఆనాడు కుండలతో గుండంలోని నీటిని ముంచి ఆలయంలో స్వామి మునిగేటట్లు పోసి తెల్లవార్లు భజన చేస్తారు. మరునాడు అన్నదానం జరుగుతుంది. స్వామికి అభిషేకం చేసిననాడు తప్పక వర్షం వస్తుందని వారి నమ్మకం.

2. పరమేశ్వరాలయం తూర్పున గ్రామం వెలుపల చింతలక్రింద ఉంది. ఇపుడు దాని అవశేషాలు మాత్రమే మిగిలినవి. ఇక్కడి నంది తల కోలగా ఉంది.

3. చెన్నకేశవాలయాన్ని కొందరు కోదండ రామాలయమని కూడా అంటారు. ఇది చిన్నగుడిబండపై ఉంది. పైకి ఎక్కటానికి మెట్లున్నవి. ఆలయంచుట్టు విశాలమైన ప్రాకారం, గోపురం, గర్భాలయం ముందు మంటపం ఉన్నవి.

ఆలయంలో స్వామి శ్రీదేవి భూదేవితో కూడి ఉన్నాడు. మూల విగ్రహాలు నల్ల సరపు రాతివి. విడివిడిగా మలచబడినవి. ఉత్సవ మూర్తులు పంచలోహానివి. ఇక్కడ వైష్ణవులు పూజారులుగా ఉన్నారు.

4. హనుమదాలయం సాధారణంగా గ్రామానికి దక్షిణంగా ఉండటం దక్షిణాభిముఖంగా ఉండటం పరిపాటి. ఇక్కడి ఆలయం ఊరి చివరన ఉంది. దాన్ని స్థానిక వర్తకసంఘంవారు కట్టించినారు.

5. ఈ ఆలయం ప్రక్కనే యిపుడు కొత్తగా శివాలయం నిర్మించి హెడ్మాష్టరు రామచంద్రయ్యగారి బావిదగ్గర గల శిథిలాలయం లోని శివలింగాన్ని తెచ్చి దానిలో ఉంచినారు. ఈ ఆలయం ఆయన గారి శ్రద్ధతోనే కట్టబడింది.

6. ఈ గ్రామంలో బెస్తలెక్కువ. వారు వంటలలో నిపుణులు. సుమారు మూడు వందల మంది మద్రాసులో వివిధ వృత్తులలో ఉన్నారు. వారి కులదైవం గంగాదేవి. అందుచేత వారు క్రీ.శ 1980 లో గాని గంగా భవాని ఆలయాన్ని కట్టించి ఫిబ్రవరిలో ఉత్సవం సాగించినారు. వారు మొదట రామలింగేశ్వర స్వామి ఆలయంలో కళ్యాణం చేయించి పిమ్మట గంగమ్మ తలంబ్రాలు పోయిస్తారు. రాత్రికి గంగా శివులను వైభవంగా ఊరేగిస్తారు. ఇక్కడగూడా సారంగ మఠం వారే పూజారులు.

ఇక్కడ చెన్నకేశవ హనుమదాలయాలలో గంగాభవాని ఆలయంలో నిత్యపూజలు నడుస్తవి. శ్రావణమాసంలో ఊరిలోని స్త్రీలు నాగులకుంట వెనుక గల నాగులను పూజించివస్తారు.

గ్రామ వివరాలకు చూ. ఆరాధన. 1974 జూలై పు. 22.

నృసింహాలయం - మామిళ్ళపల్లె

అచ్చంపేట తాలూకాలో చేరిన ఈ గ్రామం ప్రస్తుతం ఉప్పునూతల మండలంలో రాకొండకు ఉత్తరంగా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. అచ్చంపేట నుండి అక్కడికి బస్సులుంటవి.

ఇక్కడి నృసింహాలయం గోకర్ణమహారాజు కట్టించినట్లు చెబుతారు. ఉదయన చోడుని తండ్రియైన ఈ మహారాజు క్రీ.శ. 1136-76 నడుమ పానుగంటి నుండి (నల్లగొండ) పాలించినాడు. ఇతనిని స్మరించే శాసనం ప్రస్తుతం మామిళ్ళపల్లిలో ఉంది.

ఇక్కడ నృసింహాలయమే గాక గ్రామానికి తూర్పున వెంకటేశ్వర స్వామి ఆలయం, దక్షిణాన భైరవుని గుడి, పడమట సప్తమాతృకా ప్రతిష్ఠ, ఉత్తరంలో గణపతిగుడి ఉన్నవి కాని యిప్పుడవేవీ మిగులలేదు.

వేంకటేశ్వరాలయం నృసింహాలయం కంటె శిల్పసుందరంగా ఉన్నట్టు దాని ద్వారబంధాలు తోరణశిల ఇంకా మరికొన్ని అవశేషాలు చాటుతున్నవి. అవిపుడు నృసింహాలయం దగ్గరనే పడి ఉన్నవి.

నృసింహాలయానికి దక్షిణంగా ఒక కోనేరుంది. దాన్ని ఒకపుడు పూడిక తీయగా దానిలో పరమ సుందరమైన ఒక గరుడాళ్వారు ప్రతిమ దొరికింది. ఆనాటి వేంకటేశ్వరాలయ శిల్ప సౌందర్యానికి ఉదాహరణం ఈ ఒక్కమూర్తి చాలు. అదిపుడు ఆలయంలో గరుడస్తంభం దగ్గర ఉంది.

దక్షిణంగా ఉన్న భైరవమూర్తి ఆలయం కూల్చి స్వామిమూర్తి విరుగగొట్ట బడింది. పడమట గల మాతృకా మూర్తులలో ఒక్కటి మాత్రమే మిగిలింది. ఉత్తరంగా ఉన్న గుడి కూలినా దానిలోని గణపతి ఒక గుండుకు మలచబడింది కాబట్టి నిలిచిపోయింది. అక్కడ ఉన్న శివుని పెరికి నందిని విరుగగొట్టి ప్రక్కన ఉన్న బావిలో పడవేసినట్లు చెబుతారు.

నృసింహుని కంటె మొదటిది శ్యామలా పీఠం. తర్క సంగ్రహ కర్త అన్నంభట్టు యొక్క జన్మగ్రామం ఇదేనని పరిశోధకుల మతం. వారి కాలంలో యిక్కడ దేవీసప్తశతి పారాయణం చండీయాగం నడిచే వట. ఆ అమ్మవారిపుడు గర్భాలయంలోనే స్వామి వారి ప్రక్కగా ఉంది.

నృసింహుడిక్కడికి సోదరి యింటికి వచ్చినట్లు కైఫియత్తులు చెబుతవి. ఆ స్వామి మొదలిక్కడ రాఘవయ్య అను బ్రాహ్మణుని మామిడితోటలో ఒక గున్న క్రింద వెలసెనట

ఇక ఆలయం ఎపుడు ఏర్పడింది, దానిలో ఈ మూర్తి ఎపుడు ప్రతిష్ఠించబడింది స్పష్టంగా తెలియదు.

ఈ ఆలయంలో గర్భ మంటపం శుకనాసం ప్రధాన మంటపం ఉన్నవి. ఇది ఉత్తరాభిముఖమైన ఆలయం. ప్రవేశద్వారంపై మకర తోరణం చెక్కబడింది అర్ధమంటపానికిరువైపులా అనంత గురుడాళ్వారులు మలచబడినారు. గర్భాలయద్వారానికి యిత్తడి కవచం ఉంది. దాన్ని రంగాపురం నివాసి గున్న సీతారామరెడ్డిగారు చింతోజు వీరయ్యగారితో చేయించెనట. ఈ కవచంపై ద్వారపాలకులుగా చామర పాణులైన స్త్రీలున్నారు.

ఉదయనచోడుని పిమ్మట అతని కుమారులైన భీమ గోకర్ణచోడులీ ఆలయానికి దానధర్మాలు చేసినారు. వారిపిమ్మట దీన్ని ఉద్ధరించినవారిలో తెలకపల్లి నివాసులైన సురభి దొరలు చెప్పదగినవారు.

సురభి నరసరాయడు ఈ స్వామిపై ఎల్లూరి నరసింగ కవితో చూతపురీ విలాసం అనే యక్షగాన ప్రబంధాన్ని రచింపచేయగా ఆయన ధర్మపత్ని వెంకమ్మగారు ప్రాకారద్వారంపై గాలిగోపురం కట్టించింది.

ఆలయం ఉత్తరాభి ముఖంగా ఉండగా ప్రాకారం యొక్క మహా ద్వారం పూర్వాభిముఖంగా ఉంది. ఈ ద్వారంపై వెంకమ్మ దొరసాని కట్టించిన గోపురం దక్షిణాది పద్ధతిలో శిల్ప విరాజితమై అయిదంతస్తులు కలిగి ఆమె కీర్తికి పతాకగా నిలిచింది.

ఆలయ మంటపంపై తూర్పు వైపు శిల్పి యశోదా కృష్ణులను ఉత్తర వైపు మకరతోరణం చెక్కినాడు. ప్రాకారంలో ఉత్తరం వైపు హనుమదాలయం కూడా ఒకటి ఉంది

పద్దెనిమిదవ శతాబ్దిలో తెలంగాణంలోని సంకీర్తనాచార్యుడైన రాకమచెర్ల వెంకటదాసు మొదట ఈ స్వామినే సేవించి అనంతరం అక్కడికి వెళ్ళినాడు. ఇపుడు మళ్ళీ అతని పౌత్రకోటిలోని వాడైన శ్రీ ఎమ్ రంగారావుగారు దీనికి ధర్మకర్తగాఉండి స్వామిని సేవిస్తున్నాడు.

ఆయన ఈ స్వామిపై బ్రహ్మశ్రీ తెలకపల్లె రామచంద్ర శాస్త్రిగారి చేత సుప్రభాతం, ఈ రచయిత చేత క్షేత్ర చరిత్ర వ్రాయించి ఆలయం వైపునుండి ముద్రింపించినాడు.

ఇక్కడ ఏటా ఫాల్గుణ శుద్ధ పంచమి నుండి పూర్ణిమ వరకు బ్రహ్మోత్సవం, వైశాఖంలో నృసింహ జయంతి, ఇంకా తిరునక్షత్రాలు కూడా జరుగుతవి. ఒకప్పుడీ తిరునాళ్ళకు ఈ ప్రాంతంలో సాటిలేదు. రెండవ సింహాచలం అనిపించేది. ఇప్పుడు మళ్ళీ ధర్మకర్తల మండలి ఉత్సవాభివృద్ధికి యత్నిస్తున్నారు.

మరికొన్ని వివరాలకు చూ. నృసింహప్రియ
1980 మార్చి. పు. 30.
ఆరాధన - 1981 మే. పు. 22

కేదారేశ్వరాలయం - ఉప్పునూతల

ఇది అచ్చంపేట తాలూకాలోని గ్రామం. ఇప్పుడొక మండల కేంద్రం. ఈ తాలూకాలోని ప్రాచీన గ్రామాలలో ఇది ఒకటి. ఇక్కడికి అచ్చంపేటనుండి బసులున్నవి.

పూర్వం ఈ గ్రామంలో చాలా ఆలయాలున్న దాఖలా ఉంది కాని ప్రస్తుతం కేదారేశ్వరాలయం ఒకటి మాత్రమే మిగిలింది. ఇది ద్వికూటాలయం. దీనిలో కేదారేశ్వరునితోపాటు చెన్నకేశవ ప్రతిష్ఠ గూడా ఉంది. రెండు ఆలయాలకు కలిపి ఒకే మంటపం ఉంది. ఆలయానికి రెండు ప్రధాన ద్వారాలున్నవి. కేదారేశ్వర ప్రతిష్ఠ ప్రాఙ్ముఖంగా, చెన్నకేశవ ప్రతిష్ఠ దక్షిణాభిముఖంగా ఉంది. ఈ ఆలయానికి ప్రాకారం ఉండి తూర్పు ద్వారంపై ముఖమండపం కూడా ఉంది. అది అమరాబాదు శివాలయంవలె ఉంటుంది.

ఇదిగాక ఇక్కడ గౌరిదేవి గుడి, వినాయకాలయం, పోతురాజు గుడి, హనుమదాలయం ఉన్నవి. ఇవన్నీ ఏక కూటాలయాలు. వీనిలో వినాయకాలయం ప్రాచీనమయింది. అందలి మూర్తి మిక్కిలి సుందరంగా ఉంది.

వీనితోపాటు పూర్వం ఇక్కడ మ్రొక్కుడు గుడి కూడా ఉండేది. దాని అవశేషాల నిపుడు ముక్కిడి గుడి అంటున్నారు. మ్రొక్కుడు గుడిని పూర్వం పీఠాధిపతులు ప్రజలకు దర్శనమిచ్చే స్థలంగా చెబుతారు కాని ఇక్కడ ఉన్న ఆచార్యుడెవరో తెలిసిరాలేదు.

ఇక్కడి కేదారేశ్వరాలయాన్ని కట్టోజు అనే శిల్పి నిర్మించినాడు. అతని దస్తూరి యింకా ఈ ప్రాంతంలో ఎక్కడెక్కడ ఉందో చెప్పలేం.

ఈ ఆలయంలో చాలా వీరగల్లులున్నవి. వానిపై పేర్లు గూడా ఉన్నవి. వానినిబట్టి ఇక్కడ ఏ కాలం నాడైనా ఏదైనా విప్లవం జరిగిం దేమో చెప్పలేం. ఈ విధంగా పేర్లున్న వీరగల్లులు ఈ ప్రాంతంలో ఇంకా అక్కడక్కడ ఉన్నవి.

ఈ గ్రామంపై స్థానికుడైన బాలనారాయణ డాక్టరుగారు ఈ రచయితతో "ఉప్పునూతల కథ" అనే గ్రామచరిత్ర వ్రాయించి ముద్రింపించినాడు.

ఇక్కడి కేదారేశ్వరాలయం వినాయకాలయం తప్పక ఉద్ధరించ దగినవి.

రామలింగేశ్వరాలయం - రాకొండ

ఇది అచ్చంపేట తాలూకాకు చివరి గ్రామం. ఇప్పుడు తెలకపల్లి మండలంలో చేరి అచ్చంపేట రోడ్డున మామిళ్ళపల్లికి ముఖద్వారంగా ఉంది.

ఇక్కడ గ్రామానికి తూర్పుగా అర కిలోమీటరు దూరంలో ఒక గుట్ట, దానిపై ప్రాచీనమైన ఏకకూటాలయం ఉన్నవి. దీన్ని లింగాలను పాలించిన "తాండ" కట్టించినట్లు చెబుతారు. ఇది అంతరాళం ముఖ మండపం కలిగి నిరాడంబరంగా ఉంది.

మొదట ఈ ఆలయంలో లక్ష్మీనారాయణ ప్రతిష్ఠ ఉండెనట. ఈ గుట్ట ఉప్పరపల్లె రాకొండ గ్రామాలకు సరిహద్దు. అందుచేత ఒకప్పుడు పశువులను మేపుకోవటంలో ఉభయ గ్రామాలవారికి తగాదా వచ్చి ఉప్పరపల్లెవారు ఈ ఆలయాన్ని పడగొట్టి దానితో మూర్తిని తీసుకువెళ్ళి రామగిరి కోనేటిలో వేసిరట. దానిలో యిక్కడ అర్చనాదులు పడిపోగా ఉత్సవ మూర్తులను పందుగుల రామాలయంవారు అడిగి తీసికుని వెళ్ళిరట.

ఇపు డీ ఆలయాన్ని స్థానికుడైన మల్లేపల్లి శేఖరరెడ్డి గ్రామస్థుల సహకారంతో పునరుద్ధరించి ఆ సమీపంలో లభించిన శివ లింగాన్ని క్రీ.శ. 1982 దుర్మతి శివరాత్రినాడు ఆ ఆలయంలో మళ్ళీ ప్రతిష్ఠించినాడు. అనంతరం దుందుభి చైత్రంలో అతనికి ఒకనాడు స్వామి కలలో కనిపించి నేను ఒక్కనినే యిక్కడ ఉండలేను. వెళ్ళిపోతాను అని చెప్పగా ఆ యేటి నుండి అక్కడ యిపుడు శ్రీరామనవమినాడు శ్రీరామ కల్యాణం గూడ ప్రారంభించినారు ఇపుడక్కడ రామనవమి శివరాత్రి ఉత్సవాలు రెండూ నడుస్తవి.

ముందు మామిళ్ళపల్లికి ముఖద్వారం వేయవలసి వస్తే ఈ గుట్ట దగ్గరవేస్తే అది ఈ రెండింటికి గూడ ఒక్కటిగానే ఉంటుంది.

అచ్చంపేట మండలంలోని అరణ్యాకాలు

1. గణేశ్వరం:

ఇది చిన్నపాటి ఉమామహేశ్వరం వంటి స్థలం. నడిమిపల్లి పట్టీలోని లక్ష్మీపురానికి ఆగ్నేయంగా మూడు కిలోమీటర్ల దూరంలో అడవిలో ఉంది. ఇక్కడ ఒక గుడి, దానిలో వినాయక శివప్రతిష్ఠలున్నవి. నీటికొఱకు ఇక్కడ గూడా ఒక గుండం ఉంది. శ్రావణంలోను ఏకాదశి, శివరాత్రి దినాలలోను ప్రజలు వెళ్ళి స్వామిని పూజిస్తారు.

2. ఋషుల చెరువు:

కొండనాగుల నుండి శ్రీశైలం దారిలో ఇది పదకొండు మీటర్లపై ఉంది. ఈ ప్రాంతంలో ఇదొక పెద్ద చెరువు. దీని వెనుక ఋషమ్మ గుడి ఉంది. దానికి గోపురం లోపల లింగప్రతిష్ఠ నాలుగు పాకోళ్ళ జతలున్నవి.

దీనికి ఫర్లాంగు దూరంలో మైసమ్మగుట్ట, దానిపై ఒక చెట్టు క్రింద ఒక మైసమ్మదేవర ప్రతిష్ఠకూడ ఉంది.

3. నందుల కురువ :

ఋషులు చెరువుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఒక కురువ, దానిపై ఎదురెదురుగా రెండు నందులున్నవి. వాని నడిమినుండి ఒక దారి ఉంది. ఈ పొలాన్ని నందుల చెలుక అంటారు.

4. పాపమ్మ గుడి :

దీన్నిపుడు పాపనాశేశ్వరం అంటారు. నందుల కురువ దాటిన పిమ్మట నాలుగు కిలోమీటర్ల దూరంలో ఒక బండపై ఈ గుడి ఉంది. దాని ముందు ఒక గుండు కూడా ఉంది. దీనిలో పాపమ్మ విగ్రహంతో

బాటు అనేకమైన విగ్రహ శకలాలున్నవి. ఈ గుడి శిఖరం ఓంకారేశ్వ రాలయ శిఖరంవలె ఉంటుంది. ఈ దారిని శ్రీశైలం వెళ్ళేవారు ఈ దేవిని దర్శించకుండా వెళ్ళరు.

ఇక్కడికి సర్వేశ్వరం నాలుగు కిలోమీటర్లు. దానికి అయిదు కిలోమీటర్లమీద బుగ్గవాగు ఉంది. అది బయలుదేరే చోట శిల్పి ఒక ఆలయం కట్టినాడు. ఈ వాగు ఆ గుడిలోని లింగం క్రిందనుండి వచ్చినట్లు కనిపిస్తుంది.

5. ఒంటి వీరన్న గుడి :

బుగ్గవాగుకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఒక వీరభద్రాలయం ఉంది. దానిలో వీరభద్రుడు ఒక్కడే ఉన్నాడు. కాబట్టి దాన్ని ఒంటి వీరన్నగుడి అంటున్నారు.

6. భ్రమరాంబ చెరువు :

ఒంటి వీరన్న గుడికి మూడు కిలోమీటర్ల మీద ఒక పెద్ద చెరువుంది. అక్కడ భ్రమరాంబాదేవి ఆలయం ఉంది కాబట్టి దాన్ని భ్రమరాంబ చెరువని పిలిచినారు. ఈ ఆలయాలనికి ప్రాకారం ఉంది. గుడిలో అమ్మవారి మూర్తి సుందరంగా ఉంది. ఆమె కెదురుగా చెరువు గట్టుపై నిలువెత్తు వీరభద్రుడున్నాడు.

దీనికి దూరంగా నలువైపులా ఇంకా ఇతరమైన చిన్న చిన్న గుడులు కూడా ఉన్నవి.

7. మేడిమ్రాకుల :

ఈ ప్రదేశం భ్రమరాంబ చెరువుకు ఎనిమిది కిలోమీటర్లు ఉంటుంది. పూర్వం ఇదొక పట్టణం. ఆనాటి దుర్గావశేషాలింకా యిక్కడ ఉన్నవి. శిథిల విగ్రహాలు కూడా ఉన్నవి.

ఈ పీఠభూమిపై ఇంకా పదర మున్ననూరు వటవ్రేళ్ళపల్లి గూడా రాజధానులుగా ఉన్నవి. రాజధానులుగా ఉన్నచోట సాధారణంగా చాలా ఆలయాలు వెలయటం కద్దు. అమరాబాదులో ఇపుడున్న శివకేశవా లయాలు గాక ఇంకా మైలారదేవ - సిద్ధ మహాలక్ష్మి - గణపతి ఆలయా లున్నట్టు శాసనాలవల్ల తెలుస్తుంది. ప్రస్తుతం అవి యిక్కడ మిగులలేదు.

ఆనాటి మైలారదేవర గుడి యిపుడు గ్రామానికి ఉత్తరంగా గుడి గడ్డన ఉందికాని దానిలో దేవుడు లేడు. గణపతి ఆలయం గ్రామానికి తూర్పుగా ఉన్నదికాని ఇపుడా ఆలయం లేదు. దానిలోని గణపతి ఊరి వెలుపల వెంకయ్య బావి దగ్గర పడిఉన్నాడు. అక్కడ పూర్వం గణపతితో పాటు గంగా పార్వతులుకూడా ఉన్నారుకాని ఇపుడా మూర్తులు లేవు.

శివాలయ - రామాలయాలు - అమరాబాదు

ప్రతాపగిరి సీమకు కేంద్రమైన అమరాబాదుకు, అమరాపురం, అమరావతి, అమరాది అని నామాంతరాలు. విష్ణుకుండినులకు ఇది ఒకప్పుడు రాజధాని. సాధారణంగా రాజధాని నగరాలలో అనేక ఆల యాలు వెలయటం కద్దు. వానిలో యిపుడు పై రెండు గుడులు మాత్రమే మిగిలినవి.

ఇక్కడి గుడులలో శివాలయం ప్రాచీనమయింది. అది చాళుక్యుల నాటిది. ప్రస్తుతం ఊరిలోనే ఉంది. దాని ప్రాకారం చాలా పెద్దది. ఈ ఆలయానికి క్రి. శ. 1212 లో పెద్ది బొల్లిసెట్టికొడుకు, మాడిసెట్టి ముఖ మండపం కట్టించినాడు. ఉప్పునూతల కేదారేశ్వరాలయం ముఖమండపం కూడా పూర్తిగా దీనివలెనే ఉంది.

ఇందులోని స్వామికి మల్లయ్య - మల్లికార్జునుడు అని వ్యవహారం. అంతరాళానికి కుడివైపున వినాయకుడు, ఎడమ వైపున కుమారస్వామి ఉన్నారు. కాని, కుమారుని ప్రతిమ యిపుడు లేదు.

ఆలయ మండపంలో రెండు ఎత్తైన శివలింగాలున్నవి. వాని పానవట్టాలు చతురస్రమై సోపానక్రమమైన గద్దెలపై ఉన్నవి. ఒక పెద్ద నందికూడ ఉంది. ఈ శిల్పాలన్ని చక్కని పనితనంతో అలరారుచున్నవి.

ఇక్కడ క్రీ. శ. 1264 రక్తాక్షి జ్యేష్ఠ శుద్ధ పంచమి శుక్రవారం నాడు సామంతుడైన ఇమ్మడి విశ్వనాథుడు సిద్ధ మహాలక్ష్మిని ప్రతిష్ఠించి చక్కని గుడి కట్టించినాడు. కాని, అది యిపుడు జుమ్మామసీదుగా మారి నిలిచింది. ఊరికి తూర్పున గణపతిని గూడ ఇతడే ప్రతిష్ఠించినాడు.

పూర్వం ఈ గ్రామంలో శిథిలమైన నందులు కూడా చాలా ఉండేవి. ఈనాటి పంచాయతీ ఆఫీసు పునాదులలో పద్మాసనాసీనమైన జైన ప్రతిమలు లభించినవి. వాని తలలు విరిగి ఉన్నవి. నాలుగు ముఖాలు గల ఒక బ్రహ్మ తల కూడా లభించింది. అవి చాలుగా కాక నాలుగు వైపుల నాలుగు ఉన్నవి. ఈ దేవతల కందరికి ఆనాడు ఆలయాలు ఎక్కడెక్కడ ఉన్నవో తెలియదు.

గ్రామస్థులు శివాలయాన్ని మాత్రం ఇపుడుద్ధరించినారు. దీనికి కుడి వైపున ప్రాకారాన్ని ఆనుకొని రామాలయం ఉంది. దాన్ని క్రీ. శ. 14వ శతాబ్దిలో అమరాబాదును పాలించిన చింతకుంట దొరలు కట్టించినారు. ఆనాడు ఇది వారి కోటలోనే ఉన్నది ఆలయానికి కుడి వైపున పెద్ద కోనేరు ఉంది.

శివాలయం ముందు కూడా పెద్ద కోనేరుంది. అది చతురస్రంగా ఉండగా ఇది తూర్పు పడమర పొడవుగా ఉంది.

ఈ ఆలయానికి గూడ విశాలమైన ప్రాకారం ముఖమండపం ఉన్నవి. శివాలయ ముఖమండపంపై మరో చతురస్ర మండపం శిఖరం ఉండగా ఈ మండపంపై దక్షిణాది పద్ధతిలో గోపురం కట్టబడింది.

ఆలయం ఎదురుగా నిలువెత్తు ప్రపత్తి అంజనేయుడున్నాడు. అతనికి మంటపం గూడ ఉంది.

చింతకుంటవారు వెలమలు. వైష్ణవులు. వారి గురువులు గండికోట వైష్ణవులు ఈయుణ్ణివారు. ఆలయం కట్టించిన పిమ్మట వారు తమ ఆచార్య పురుషులను అక్కడికి కొని వెళ్ళి, దాని అర్చకత్వం అప్పగించినారు. వారు క్రి. శ. 1522 లో యిచ్చిన సన్నదు యొక్క నకలు ప్రస్తుతం పూజారియైన శ్రీ రామాచారిగారి దగ్గర ఉంది. వారు అదే వంశానికి చెందినవారు. ప్రస్తుతం కీర్తిశేషులు.

ఇక్కడ ఏటా శ్రీరామనవమికి రామాలయంలో, శివరాత్రికి శివాలయంలో తలంబ్రాలు నడుస్తవి. రామనవమికి మూడు దినాల ఉత్సవం రథోత్సవం గూడ జరుగుతుంది.

పరశురామేశ్వరాలయం-పదర

పదర భద్ర శబ్ద భవం- ఈ గ్రామం అమరబాదుకు పది కిలో మీటర్ల దూరంలో ఉంది. అచ్చంపేట నుండి ఇక్కడికి నేరుగా బస్సు లున్నవి.

ఈ గ్రామాన్ని రాజధానిగా చేసికొని చేపూరువారు అనే బ్రాహ్మణులు అమరాబాదు సీమను పాలించివారు. ఆ వంశంలోని చివరి ప్రభువు పద్మనాభరాజు ఎట్టోదేశాయి గారు. అతనిపై ఒక అనంత పద్మ నాభ చతుర్దశినాడు ఆకస్మికంగా చింతకుంట వెలమ ప్రభువులు దండెత్తి వధించి రాజ్యాన్ని వశపరచుకున్నారు.

ఆ దండయాత్రలో గ్రామం నాశనం కాగా మిగిలిన ప్రజలు అడుగుమారి ప్రస్తుతం ఉన్న గ్రామాన్ని మళ్ళీ కొత్తగా కట్టుకున్నారు. అక్కడి కోటకు ముగ్గు పోసినవాడు పెండ్యాల కాంతావధానులు గారు. ప్రస్తుతం వీరి వంశం అక్కడ ఉంది.

ఈ గ్రామంలో ఊరి వెలుపలగల విశాలమైన బండపై వరశు రామేశ్వరాలయం పేర ఒక గుడి ఉంది గర్భాలయం ధ్వజ స్తంభంతప్ప దీనికి అంతరాళం గాని మంటపంగాని మరేవిలేవు.

ఈ ఆలయవిమానం మహాబలిపురంలోని రాతిరథం నమూనాలో ఉంది. ఇది గచ్చుతో కట్టబడింది. ఏ కాలంలో ఎవరు నిర్మించింది తెలియదు.

ఆలయానికి చుట్టూ ఒక సామాన్య ప్రాకారం ఎడమ వైపున దాని వెలుపలబండపై ఒక పెద్ద గుండం ఉన్నవి. ఇది ఈశాన్యంగా కొంచెం దూరంగా ఉంది.

ఏకాదశి శివరాత్రి సందర్భాలలో గ్రామస్థులు ఈ స్వామి నర్చిస్తారు.

చెన్నకేశవాలయం-రాయని గండి

గండి పదానికి నిఘంటువు సందు అనే అర్థాన్నిచ్చింది. అమరా బాదు నుండి పదరకు వెళ్ళే దారిలో ఈ గండి ఉంది. అక్కడ రోడ్డుకు ఎడమవైపున ఉన్న ఒక పెద్ద గుట్టపై అమరాబాదును పాలించిన చింత కుంట ధర్మరాయని తమ్ముడు రంగరాయడు క్రీ. శ. 1532 దుర్ముఖి భాద్రపదంలో ఈ ఆలయాన్ని కట్టించినాడు.

అంతవరకు ఆ గుట్టకు పగిడి గుట్ట అని పేరు. అతడు దాన్ని సువర్ణగిరి అని మార్చినాడు. అతడు ఆలయం కట్టించి నప్పటినుండియే ఈ ప్రదేశానికి అతని పేర రాయని గండి అనే రూఢి ఏర్పడింది.

చెన్నకేశవుడు పలనాటి ప్రభువుల దైవం. బ్రహ్మనాయడు మలిదేవాదులతో అరణ్యవాసానికి శ్రీశైల భూమికి వచ్చినపుడు అతడీ ప్రాంతాలలో సంచరించివాడని పూర్వులు నమ్మేవారు కాబట్టి అతడు ప్రతిష్ఠించినవి అని చెప్పబడే గ్రామాలు, గుడులు ఈ సీమలో చాలా ఉన్నవి. అట్టివానిలో ఇది ఒకటి.

రంగరాయడు బహుశః అంతవరకు అక్కడ బ్రహ్మనాయుడు నిల్పిన ఆ దేవునికే ఈ గుడి కట్టించి ఉండవచ్చు.

ఈ ఆలయం నిరాడంబరంగాను హుందాగాను ఉంది. గుట్టపైకి ఎక్కడానికి మెట్లు, గుట్టపై ఆలయానికి ఈశాన్యంగా కోనేరు. అంతేగాక యాత్రికులకు వసతిగూడా ఉన్నవి.

రంగారాయడు ఈ గుడిని కట్టించి దీనికి అమరాబాదు గడిబండికా ద్రవ్యాన్ని నిత్యార్చనాదులకై సమర్పించి యిక్కడ శాసనం గూడా వేయించినాడు. ఈ శాసనం ఆలయంలో ఇపుడుంది.

పూర్వం దీనిలో ఆళ్వారు సన్నిధి కూడా ఉన్నది. కాని యిపుడా మూర్తులు లేవు. ఈ ఆలయాన్ని మొలుకమామిడి వాసులైన మాలవారు చూస్తుంటారు. ఇక్కడి పూజారులు గూడా వారే. ఏటా శివరాత్రికి స్వామివారి ఉత్సవమూర్తులను మొలుకమామిడినుండే ఊరేగింపుగా తీసుకు వెళ్ళుతారు.

ఇపుడీ ఆలయం దేవాదాయ ధర్మాదాయశాఖ వారితో పునరుద్ధరింపబడుతుంది.

ఈ స్వామిపై నడిమిపల్లిలో ఒక కవిగారు శతకం రచించినాడు. అది ముద్రితం.

నవనారసింహాలయం-లక్ష్మీపురం

ఈ గ్రామం వంకేశ్వరానికి ఆగ్నేయంగా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. అచ్చంపేట నుండి యిపుడక్కడికి నేరుగా బస్సు లున్నవి. అక్కడ గ్రామానికి పశ్చిమంగా ఒక పెద్ద కొండ, దాని ననుసరించి ఒక వాగు ఉన్నవి. ఆ కొండపై విశాలంగా ఆరడుగుల ఎత్తుగా ఒక దరి ఏర్పడింది. పూర్వులా దరిలోపలి స్థలాన్ని గదులుగా విభజించి ఇక్కడ ఈ ప్రతిష్ఠలు చేసినారు.

ఇపుడు దీన్ని మరో అహోబలం అనవచ్చు. స్వామిని బట్టి ఈ కొండను నరసింహులకొండ అని, వాగును నరసింహుల వాగు అని అంటారు.

ఇక్కడ నృసింహ - వరాహ - బాల - వృద్ధ - ఉగ్ర - యోగ - శాంత - ప్రసన్న - వరద నారసింహ నామాలతో నవ నారసింహ ప్రతిష్ఠలుండేవి కాని, ప్రస్తుతం నృసింహ-వరాహ - వృద్ధ - ఉగ్ర - యోగ - అనే పంచ ప్రతిష్ఠలు మాత్రమే మిగిలినవి.

అవిగాక హయగ్రీవ - హనుమంత - శివ - మహిషమర్దని - భైరవ ప్రతిష్ఠలున్నవి. వానితోబాటు ఆళ్వారు సన్నిధి కూడా ఉంది. ఇవన్నీ ఆ దరి క్రిందనే చిన్న చిన్న గదులలో ఉన్నవి.

ప్రధానాలయంలో నృసింహమూర్తి, అతని కెదురుగాఉన్న గదిలో వరాహమూర్తి ఎదురెదురుగా పద్మాసనాసీనులై ఉన్నారు. స్వామి వారికి ఎడమవైపున వేర్వేరు గదులలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అనే దేవేరులున్నారు. చెంచులక్ష్మి చేతిలో విల్లమ్ములు ధరించి ఉంది. ఈ లక్ష్ముల మూలంగానే గ్రామం లక్ష్మీపురం అయింది.

ప్రధానాలయానికి కుడివైపున గల క్రింది దరిపై మహిషమర్దని ఉంది. ఆమె వాహనం యిక్కడ యాళీ సింహం. ఇది ఒక క్రొత్త.

ఈ క్షేత్రానికి పాలకుడైన భైరవుడు అందరికంటె పైన ఉన్నాడు. అతడు ప్రీడాకటీరుడు, ఈ భైరవునికి తప్ప తక్కిన మూర్తులన్ని కృష్ణ శిలా నిర్మితాలు. అవి పిండస్ఫూర్తితో జీవకళలుట్టి పడుతూ ఉంటవి.

శిల్పి ఇక్కడి స్త్రీ ప్రతిమలకు శ్రవోభూషణాలకు నాసాభరణాలకు చెవులకు ముక్కులకు సన్నని రంధ్రాలుకూడా చేసినాడు. ఇది అతని పనితనానికి ఒక ఉదాహరణం.

ఇక్కడ శాసనాలేవీ లేవుగాని మహిషమర్దని ఆలయపార్శ్వ శిలలపై త్రైలోక్యాదిత్య ధర్మదిత అని రెండు బంతులు ఉన్నవి. ధర్మ

దిత అర్థవంతం కాదు కాబట్టి అది ధర్మోదిత లేదా ధర్మాదిత్య కావచ్చును. శిల్పి పొరపాటుగా చెక్కినాడేమో. చాళుక్యులు ఆదిత్య వాచ్యులు కాని ఈ పేర్లు మాత్రం ఇప్పటికి చరిత్రకు క్రొత్తగా ఉన్నవి. ఈ పేర్లతోబాటు మూడు శిఖరాలుగల ఒక ఛత్ర చిహ్నం గూడా వానిపై ఉంది.

ఇక్కడి ప్రధాన మండపానికి ముందుగల మంటపం తర్వాత కట్టబడింది. ఇక్కడి ద్వారపాలక మూర్తులు రాయనిగండి ద్వారపాలక మూర్తులవలెనే ఉంటవి కాబట్టి ఈ మంటపం రంగరాయని నిర్మాణమే కావచ్చు. వారిక్కడ వైష్ణవవ్యాప్తికి కృషిచేసినారు. కాబట్టి ఆళ్వారు సన్నిధి కూడా అతనిదే అనవలె.

ఇక్కడ యేటా వైశాఖంలో నృసింహజయంతికి ఉత్సవం జరుగుతుంది. ఇది తప్పక ఉద్ధరించదగిన క్షేత్రం.

ఉదంకేశ్వరాలయం - వంకేశ్వరం

వంకేశ్వరం పదరకు మూడు కిలోమీటర్లు ఉంటుంది. పదర బస్సు ఇంతవరకు వస్తుంది.

ఇక్కడ గ్రామానికి వెలుపల పడమట అర కిలోమీటరుపై విశాలమైన బండపైన పై ఆలయం కట్టబడింది.ఇదిగూడా ఏకకూటాలయమే కాని పదర, వంకేశ్వరం సమీప గ్రామాలైనా ఈ ఆలయవిమానం వరశు రామేశ్వరాలయంవలె ఉండక సోపానక్రమంలో ఉంది.

ఇక్కడ గూడా ఆలయానికి ఎడమవైపున ఒక గుండం ఉంది. దానిలో నీరు అన్ని కాలాలలోను ఉంటుంది. ఈ గుండాన్నిబట్టియే బహుశః ఈ స్వామి ఉదంకేశ్వరుడు కావచ్చు. ఉదంకేశ్వరం ప్రజల పలుకుబడిలో ఈనాడు వంకేశ్వరం అయింది. ఇది చేపూరువారికి చివరిదశలో సన్ 1322 వరకు మఖ్తాగా ఉన్నది.

ఈ రెండు ఆలయాలిక్కడ ప్రత్యేకంగా కనిపిస్తవి కనుక చెప్పినాను.

అమరాబాదు సీమలోని అరణ్యకాలు

అమరాబాదు పీఠభూమి శ్రీశైలానికి ఎడమవైపున అదే కొండలపై ఉంది. అందుచేత దాన్ని శ్రీపర్వతభూమి అని శ్రీశైల గర్భమని వ్యవహరించినారు. ఈ పీఠభూమిపై అయిదారు మైళ్ళకొక పల్లె, కృష్ణా తీరం వెంట పది పన్నెండు మైళ్ళకొక గ్రామం ఉన్నవి.

పూర్వం ఇదంతా అరణ్య ప్రాంతం కాబట్టి ఈ భూమిపైగల జలధారాల సమీపాలలో అనేకులైన ఏకాంతవాసులూ మునులూ ఆశ్రమా లేర్పరచుకొని నివసించి తమ తమ ఇష్టదైవాలను ప్రతిష్ఠించినారు. కాబట్టి ఈ కొండలపై అరణ్యాలలో పదుల కొలది పవిత్ర స్థానాలు, ప్రతిష్ఠలు వెలసినవి.

అరణ్యవాస కాలంలో పలనాటి వాడైన బ్రహ్మనాయడు మలిదేవాదులతో ఈ భూమిలోనే ఉన్నాడంటారు. అతడు నిలిపినవని చెప్పబడే గ్రామాలు, ఆలయాలు గూడ ఇక్కడ ఎన్నో ఉన్నవి. అట్టివి కొన్ని పరికించండి.

1. భైరవుని గుండం :

అమరాబాదుకు ఆగ్నేయంగా పరువు దూరంలో పాలకురువ అనే గుట్టల వరుస ఉంది. దాని దడకన ప్రకృతిసిద్ధమైన ఒక గుండం ఉంది. దానిలో ఎల్లకాలం నీరుంటుంది. అది చూచి పూర్వం ఎవరో అక్కడ భైరవ ప్రతిష్ఠచేసి, దానికి భైరవుని గుండం అని పేరు పెట్టినారు. పూర్వం అమరాబాదులో ఉన్న త్ర్యంబక స్వామి ప్రతిదినం అక్కడికి స్నానానికి వెళ్ళేవాడట. ఇపుడక్కడ ఆనాటి భైరవుడు లేడు

గాని గుండం మాత్రం మిగిలింది. పూర్వం శివరాత్రికి జనులక్కడికి స్నానానికి వెళ్ళేవారు.

2. అంతరగంగ :

అమరాబాదుకు వాయవ్యంగా మూడు మైళ్ళ పైన అయ్యనవోలు దారిలో ఉన్న పెద్ద కురువన పావురాల దరి క్రింద సుమారు అయిదడు గుల వెడల్పు అయిన పొడుగాటి తంతె, దానిపై చిన్న అంతరగంగ, పెద్ద అంతరగంగ అని రెండు జలధారలున్నవి. దరి అదిరినపుడు ఆ ఊటల యొక్క ప్రవాహం పెరుగుతుంది. అది గమనించిన శిల్పి అక్కడ రెండు సోమసూత్రాలు నిలిపి వానిలో శివలింగాలు ఏర్పాటు చేసినాడు. ఈ పాన వట్టాలు పూర్తిరంధ్రంగా ఉండి వానిలో శివలింగాలు పొత్తరంవలె గుండ్రంగా తిరుగుతవి. అక్కడికి వెళ్ళిన యాత్రికులు ఆ పొత్తరాలను కొన్ని నిమిషాలు పానవట్టంలో దుబ్బినట్టుగా తిప్పితేచాలు-దరి క్రిందినుండి ఊరే జలధారఉబికి దానిపై తొలిచిన గుండాలు నిండుతూ ఉంటవి. ఆ నీటిలో తైర్థికులు స్నానపానాలు తీర్చుకుంటూ ఉంటారు.

ఇపుడు పెద్ద అంతరగంగ పట్టిపోయి చిన్నది మాత్రమే మిగిలింది. ఆ గట్టున జీవించే ప్రాణికోటికి, అక్కడికి మేతకు వచ్చే మేకలకు ఇపుడా నీరే ప్రాణాధారంగా ఉంది.

3. నాగేశ్వరం :

అమరాబాదు పీఠభూమిపై పదర ఒక ప్రసిద్ధ గ్రామం. ఆ గ్రామానికి ఈశాన్యంగా రెండుమైళ్ళ దూరాన అడవిలో ఒకడొంక, దానిలో ఒక నది పారుతున్నవి. ఆ నదీతీరంలో ఈ క్షేత్రం ఉన్నది. ఇక్కడి ఆలయం ఇక్ష్వాకుల నాటిదని పరిశోధకుల మతం. బహుశః ఆ కాలంలో ఈ ప్రాంతాన్ని సామంతులుగా పాలించిన నాగులీ స్వామిని ప్రతిష్ఠించి ఉంటారు.

ఇక్కడ బండపై ఒక జాలు పుట్టి ఇక్కడినుండి పారే వాగులో కలుస్తుంది. ఆ జాలును శిల్పి గర్భాలయం క్రిందికి చేసి ఈ గుడిని కట్టినాడు. గుడి క్రింది నుండి వచ్చే జాలు ప్రక్కన ఉన్న గుండం నిండి పారి వాగులో కలుస్తుంది. ఇక్కడికి వచ్చిన వారా గుండంలో స్నానం చేసి స్వామిని పూజిస్తారు.

ఈ ఆలయంలో శివునితోపాటు మహిషమర్దని - నాగ - నంది - నందీశ్వర ప్రతిష్ఠలున్నవి. పూర్వం ఈ ఆలయానికి ముఖమంటపం ప్రక్కన మరో మంటపం కూడా ఉన్నది. కాని ఇపుడవి లేవు.

పూర్వం చేపూరు వంశీయులైన బ్రాహ్మణ ప్రభువులు పదరను రాజధానిగా చేసికొని ఈ పీఠభూమిని పాలించినారు. వారీ స్వామికి పెంచికలపాడు అనే గ్రామాన్ని దానం చేసినారట కాని ఇపుడా ఊరు కూడా లేదు.

గ్రామస్థులు ఏటా శ్రావణంలో కార్తీకంలో ఈ స్వామిని పూజించి వెళుతుంటారు. గ్రామానికి దూరమైనా మంచి ప్రదేశంలో ఉంది కాబట్టి ఇది ఉద్ధరించదగిన ఆలయం.

4. భైరవుని సెల :

నాగేశ్వరానికి మరో మైలు దూరంలో ఒక పెద్ద లోయ ఉంది. దానికి భైరవ సెల అని పేరు. పూర్వం ఇక్కడ ఏదో ఒక మహా ప్రవాహం ఉండి, అది దూకి ఈ లోయ ఏర్పడింది. ఇది రెండు మెట్లుగా ఉంది. మొదటి మెట్టు బాగా విశాలంగా ఉండి దాని వెన్నుగోడ ప్రవాహం యొక్క దూకుడుకు తొలుచుకొని గుహవలె ఏర్పడింది. అది బాగా విశాలంగా ఉంది. కాబట్టి పూర్వం ఆ గుహలో భైరవప్రతిష్ఠ చేసి దానికి భైరవ సెల అని పేరు పెట్టినారు. భైరవునితోపాటు ఇందులో వేణుగోపాల స్వామి ప్రతిష్ఠ గూడ ఉండేదట. ఆ మూర్తులు పరమ సుందరమని

చెబుతారు. కాని ఇపుడవి లేవు. ఎవరో హరించుకునిపోయినారు. ఇపుడొకపాటి శివలింగం మాత్రం అందులో మిగిలి ఆ గుహ క్రూర జంతువుల నిలయమయింది.

ఈ లోయలో రెండవ మెట్టు పూర్తిగా దిగి ఒక పరువు దూరం వెళ్ళితె దేవరకొండ సివారు వస్తుంది. పూర్వం దేవరకొండను పాలించిన వెలమలు భైరవోపాసకులు కాబట్టి ఇక్కడి భైరవ ప్రతిష్ఠలన్ని వారి కాలంలోనే జరిగి ఉంటవి.

ఈ లోయలో ఒక చిన్న నది కూడ ఉంది. ఇక్కడి ప్రకృతి మనోహరంగా గంభీరంగా ఉంటుంది.

5. మఠం బుగ్గ :

అమరాబాదు పీఠభూమిపైగల దారి పదర నుండి చీలి ఒకటి మద్దిమడుగు, రెండవది సిద్ధాపురం వెళ్ళుతవి. మద్దిమడుగుకు కృష్ణ ఎనిమిది మైళ్ళు ఉంటుంది. అది దాటితె పల్నాటిలో ప్రవేశిస్తారు. సిద్ధాపురం దగ్గర దెంది ఉంది. అది దాటితె దేవరకొండ సీమలో అడుగుపెడతారు.

మద్దిమడుగు దారిలో వంకేశ్వరం దాటగానే చిట్టెంకుంట వస్తుంది. అది ఆ పీఠభూమిపై ఒక అయోక్షేత్రం. దానికి తూర్పున మూడు మైళ్ళపై ఒక బుగ్గ ఉంది. బుగ్గ అంటె నేల నుండి పైకుబికే జలధార. అక్కడ దాన్ని ఆధారం చేసికొని శైవులు ఒక మఠాన్ని స్థాపించి శివప్రతిష్ఠ చేసినారు. ఇపుడా మఠం లేదు. గాని శివప్రతిష్ఠ మిగిలింది. చుట్టుపట్లవారు శివరాత్రినాడు అక్కడికి వెళతారు.

6. దొమ్మర్ల గొంది :

ఈ దారిని బస్సు ఇప్పలపల్లి నుండి ఉడిమిళ్ళను తాకి వెళుతుంది. ఆ గ్రామానికి మూడున్నర క్రోసుల దూరంలో దొమ్మర్ల గొంది అనే

పెద్ద లోయ ఉంది. అక్కడ దుందుభీనది కృష్ణలో కలుస్తుంది. కాబట్టి ఆ సంగమ స్థానంలో దుందుభీశ్వర ప్రతిష్ఠ ఉంది.

ఇక్కడ నల్లమలపై విశాలమైన దరి ఉంది. ఈ పీఠభూమిపై యింత విశాలమైన దరి మరొకటి లేదు. ఈ సంగమ స్థానానికి నాలుగు మైళ్ళ దూరంలో ఒక చిన్న ఆలయ సమూహం మరొకటి ఉంది.

7. జంగం ఊడు :

ఇదే దారిని ఇప్పలపల్లి దాటగానే మారడుగు వస్తుంది. దానికి పడమట ఏడుమైళ్ళ దూరంలో మరో చిన్ననది కృష్ణలో కలుస్తుంది. కాబట్టి పూర్వం జంగాలక్కడ ఒక మఠం నెలకొల్పి, శివమహిషమర్దని, వినాయక ప్రతిష్ఠలు చేసినారు. ఇపుడా మఠం లేదుకాని ప్రతిష్ఠలు మాత్రమున్నవి. శివరాత్రికి ప్రజలు అక్కడికి వెళ్ళి పూజిస్తుంటారు.

8. సోమశిల :

ఈ పేరుతో ప్రసిద్ధ క్షేత్రం ఒకటి కొల్లాపురం తాలూకాలో ఉంది. ఇది దానికన్న వేరు. ఇక్కడ ఏ దేవాలయం లేదు కాని ప్రకృతి చల్లగా ఆహ్లాదకరంగా ఉంటుంది.

ఈ ప్రదేశం మద్దిమడుగుకు మూడుమైళ్ళ దూరంలో ఉంది. ఇప్పుడు మద్దిమడుగు వరకు బస్సు వెళుతుంది.

9. గుప్తకదళీవనం :

ఇది కృష్ణానదీ సమీపంలో ఇదే దారిన అకితి రేవుల దగ్గర ఉంది. అక్కమహాదేవి ఇక్కడికి వచ్చిపోతూ ఉండేదని అక్కడివారు చెప్పుకుంటారు.

10. నిత్యవాన :

పదరనుండి రెండవదారి సిద్ధాంతపురం వెళుతుంది. ఈ మార్గంలో రెండు మైళ్ళు వెళ్ళిన పిమ్మట అక్కడ ఒక నిత్యవాసస్థలం, దాని దగ్గర ఒక చిన్న గుడి ఉన్నవి.

ఇటువంటిది మరొకటి అక్కవరం దగ్గర దెంది తీరంలో ఉంది.

11. గుఱ్ఱాలబండ :

ఈ పేరున ఈ తాలూకాలో రెండు స్థలాలు ఉన్నవి. ఒకటి లొద్ది మల్లయ్య దారిలో ఉంది. పూర్వం అక్కడికి వెళ్ళు యాత్రికులు తమ గుఱ్ఱాలనక్కడ కట్టివేసి అక్కడినుండి యిక లొద్దిలోనికి దిగేవారు.

రెండవది సిద్ధాపురం దారిలో అయ్యనికురువ, తడక కురువ దాటిన పిమ్మట ఉంది. ఈ బండపై శ్రీరాముని పాదాలు, వాని చుట్టు గుఱ్ఱపుడెక్కల గుర్తులున్నవి.

అక్కడివారు శ్రీరాముడు ఒక పర్యాయం గుఱ్ఱాన్నెక్కి అక్కడికి వచ్చి ఆ బండపై కొంతసేపు విశ్రాంతి తీసికొని, అక్కడి నుండి సిరుసన గండ్ల (కలువకుర్తి)కి వెళ్ళినాడని చెప్పుకుంటారు. అందుచేత వారా పాదాలను పవిత్రంగా భావిస్తారు.

12. దేవర శిల :

గణపవరం నుండి అక్కవరానికి వెళ్ళేదారిలో పది మైళ్ళ మీద దెందిలోని ఒక పాయ కృష్ణలో కలుస్తుంది. ఆ సంగమాన్ని ఆధారం చేసికొని పూర్వులిక్కడ శివప్రతిష్ఠ చేసినారు.

ఇది సస్యరోగనివారణా క్షేత్రంగా ప్రసిద్ధి. పంటలకు తెగులు తగిలిన వారిక్కడికి వచ్చి ఈ నీటితో వంట చేసి దాన్ని దేవునికి నివేదించి ఆ అన్నాన్ని, ఈ ఆలయం చుట్టుగల చెట్ల ఆకులను తీసుకు

వెళ్ళి తమ పొలాలపై చల్లుకుంటారు. దానితో తెగులు విడుస్తుందని వారి నమ్మకం.

13. బుగ్గ మల్లప్ప :

అక్కవరానికి పడమట రెండు మైళ్ళ దూరంలో ఒక కొండ గుహ ఉంది. దానిలో ఎల్లపుడూ మోకాలిబంటి నీరు ఉంటుంది. ఆ నీటిలో ఇక్కడ శివప్రతిష్ఠ చేయబడింది. ఇది ఝరిణీ నృసింహం వంటి స్థలం. యాత్రికులు నీటిలోనే వెళ్ళి ఈ స్వామిని పూజిస్తారు.

వేసవిలో ఈ ప్రాంతంలో ఈ గుహలో తప్ప మరెక్కడా నీరుండదు.

శ్రీశైలానికి క్రీ.శ. 1965 నుండి బస్సులారంభమైనవి. కాని అంతవరకు కాలి దారిననే వెళ్ళవలసి ఉండేది. ఈ తాలూకాలో కొండ నాగుల, మున్ననూరు, అమరాబాదు అనే మూడు గ్రామాలనుండి మూడు దారులున్నవి. ఈ దారుల వెంటకూడా అనేకమైన దర్శనీయ స్థలాలున్నవి.

14. మల్లెల తీర్థం :

అమరాబాదుకు దక్షిణంగా ఆరుమైళ్ళ దూరంలో ఉంది. కొమ్మని పెంటనుండి అక్కడికి వెళ్ళవలసి ఉంటుంది. ఇక్కడ చక్కని వాగు, దాని తీరంలో విశాలమైన బండ, దానిపై ఒక చిన్న ఆలయం, దానిలో శివ ప్రతిష్ఠ ఉంది. ఇక్కడి వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

15. కదళీవనం :

అమరాబాదు మున్ననూరు దారులు రెండూ పాత ఊరి బయలు దగ్గర కలసి పోతవి. ఈ దారిలో రాచమల్లు బావి, పట్టుకురువ, తపసి పెంట మిక్కిలి సుందరమైన ప్రదేశాలు. అవి దాటిన పిమ్మట కదళీ వనం వస్తుంది. అది అక్కమహాదేవి తపస్సు చేసిన ప్రదేశం. అక్కడ ఆమె గుడి ఉంది. ఇది మున్ననూరికి ముప్పదైదు కిలోమీటర్లు ఉంటుంది.

16. జాతరరేవు :

అమరాబాదు మున్ననూరుల నుండి వెళ్ళేవారు పూర్వం ఇక్కడి నుండి కృష్ణను దాటేవారు. ఈ రేవుకు పడమరగా ఆరు మైళ్ళపైన ప్రసిద్ధమైన అక్కన్న-మాదన్నగారల మందిరం ఉంది. అక్కడి వాతావరణం కూడా ప్రశాంతంగా ఉంటుంది కాని దారి దుర్గమంగా ఉంది.

17. రామ పాదాలు :

వటవేళ్ళపల్లెకు ఈశాన్యంగా నంది పెంట ఉంది. దానికి మైలు దూరంలో ఒక కొండ దరిపై నందీశ్వర ప్రతిష్ఠ ఉంది. ఆ దరికి ఒక పెద్ద గంట కట్టబడింది. ఇక్కడ బండపై పాదాలున్నవి కాబట్టి దీన్ని రామ పాదాలు అంటారు.

ఇక్కడికి సమీపంలో కొల్లం పెంట ఉంది. అక్కడ గూడ ఒక శివప్రతిష్ఠ, నందీశ్వరుడు ఉన్నారు. అది కూడ చూడదగిన వానిలో ఒకటి

సర్వేశ్వరం :

సామాన్యులు దీనిని సలేశ్వరం అని పిలుస్తారు. ఇది మున్ననూరు అచ్చంపేట పొలిమేరపై ఒక కొండ దరిపై ఉంది. అక్కడికి మున్ననూరు నుండి, కొండనాగుల నుండి, లింగాలనుండి దారులున్నవి.

మున్ననూరు నుండి శ్రీశైలం దారిలో 16 కిలోమీటర్లు వెళ్ళి అక్కడినుండి ఆరు కిలోమీటర్లు కుడివైపు అడవిలోనికి వెళ్ళవలసి ఉంది. అక్కడ రామాపురం తాండ అనే గ్రామం వస్తుంది. అంతవరకు జీపులు సర్వీసులు వెళ్ళుతవి. క్షేత్రం అక్కడికి ఆరు కిలోమీటర్లు ఉంటుంది. నాలుగు కిలోమీటర్లు నడిచి రెండు కిలోమీటర్లు దిగవలసి వుంటుంది. ఈ దారి క్షేత్రం వెలసిన పర్వతాన్ని చుడుతుంది.

ఇక్కడ కొండకు ఒక విశాలమైన దరి ఏర్పడింది. దాని క్రిందనే స్వామి ప్రతిష్ఠింపబడినాడు. స్వామికి ఎదురుగా సుమారు మూడు వందల అడుగుల ఎత్తు నుండి ఒక అంతర్వాహిని దూకుతూ క్రింద గుండం ఏర్పడింది. యాత్రికులు స్నానానికి క్రిందికి దిగి అందులో స్నానంచేసి మళ్ళీ పైకి వచ్చి దైవ దర్శనం చేసికుంటారు.

ఇక్కడ ప్రతియేటా చైత్ర పున్నమకు ఉత్సవం జరుగుతుంది. అపుడు వందలకొలది జనం వెళ్ళి స్వామిని దర్శిస్తారు. ఇక్కడ యాత్రికు లకు రాత్రికి వసతి ఉండదు కాబట్టి స్వామిని దర్శించగానే మళ్ళీ పైకి వస్తారు.

ఈ గుట్టపైన కాలిబాట ప్రారంభంలో ఒక బుగ్గ ఉంది. దానికి కాశిబుగ్గ అని పేరు. ఆ బుగ్గ దగ్గర తప్ప దారిలో మరెక్కడా నీరు దొరకదు. ఉత్సవ సమయంలో ఈ బుగ్గ దగ్గర నాగర కర్నూలు - వనపర్తి - కొల్లాపురం వైశ్యులు ఉచిత అన్నసత్రాన్ని నిర్వహిస్తారు.

ఇక్కడ లోయలోనికి దారి కేవలం ఒక్కరు మాత్రమే పోగలిగి నట్లుగా ఉన్నా ఇంతవరకు ఎన్నడూ ఏ ప్రమాదం జరుగలేదట. ఇది ప్రజలు ఆ స్వామి మహిమగా చెప్పుతారు. లోనికి వెళ్ళే అపుడు 'వస్తున్నా లింగమయ్యా!' అని తిరిగి వచ్చే అపుడు 'పోతున్నా లింగమయ్యా!' అని స్వామికి అప్పనాలు చెబుతుంటారు.

ఈ క్షేత్రం శ్రీ పర్వత పురాణంలో పేర్కొనబడింది. చూ. ఆ. 3.

తారక బ్రహ్మదేవాలయం - ఆలంపురం

అలంపురం సీమలోని ఆలయాలు

అలంపురం సీమ కృష్ణా తుంగభద్ర నదుల నడుమగల ప్రదేశం. దానికి కేంద్రమైన అలంపురానికి పూర్వం హలంపురం, హతంపురం, హేమలాపురం, ఎల్లమ్మపురం అని నామాంతరాలున్నావి. ఇది తుంగభద్రా తీరంలో ఉంది. ఇది ప్రసిద్ధ క్షేత్రమే కాక తాలూకా కేంద్రంగా, ఈనాడు మండల కేంద్రంగా ఉంది. ఇక్కడికి కర్నూలు నుండి హైదరాబాదు నుండి నేరుగా బస్సులున్నవి. పూర్వం దీనికి అయిజెనాడు అని వ్యవహారం.

ఇది భారతదేశంలోని పది భాస్కర క్షేత్రాలలో, పద్దెనిమిది శక్తి పీఠాలలో ఒకటై, శ్రీశైలానికి పశ్చిమ ద్వారంగా దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెంది, పాలమూరు జిల్లాకు ఎల్లగా ఉంది.

ఆంధ్రదేశంలో ఇక్కడ ఉన్నన్ని ఆలయాలు మరెక్కడా లేవు కాబట్టి దీన్ని ఆంధ్రదేశం యొక్క భువనేశ్వరం అనవచ్చు.

కాశీలో గంగాతీరం వెంట ఉన్నట్టు ఇక్కడ తుంగభద్ర తీరం వెంట అరువది నాలుగు స్నాన ఘట్టాలున్నవి. వానిలో 43 మొదలు 50 వరకు తీర్థాలు, 11 మొదలు 18 వరకు మహాతీర్థాలని స్థలపురాణాలు చెబుతవి.

మన దేశంలో బ్రహ్మకు పుష్కరిణి (అజ్మీర్) లో, సరస్వతికి బాసరలో తప్ప మరెక్కడ ఆలయాలు కనిపించవు. కాని ఇక్కడ నవబ్రహ్మల పేర ఆలయాలు వెలయటం ఈ క్షేత్రం యొక్క ప్రత్యేకత.

ఈ నవబ్రహ్మలు పురాణ నవబ్రహ్మలు కాక వేరుగా ఉండడం, వారికి మూర్తి కల్పనలేక ఆ పేర లింగ ప్రతిష్ఠలుండడం మరో ప్రత్యేకత. ఇవిగాక ఇక్కడ చతుర్ముఖ బ్రహ్మమూర్తులు గూడ ఉన్నవి.

ఇక్కడి నవబ్రహ్మలలో విశ్వబ్రహ్మ ఒకడు. కాశిలో విశ్వ కర్మేశ్వర లింగం. భువనేశ్వరంలో విశ్వకర్మ లింగం, అజంతాలో విశ్వకర్మ గుహ - ఇవి ఆనాడు విశ్వకర్మలకు గల ప్రాధాన్యాన్ని చాటుతవి.

ఈ క్షేత్రంలో జోగుళాంబా బాలబ్రహ్మేశ్వరులు ప్రధాన దేవతలు. జోగుళాంబ యోగినీశక్తి. ఆమె రూపం గూడ సుందరంగా కాక భీక రంగానే ఉంటుంది. ఇక బాల బ్రహ్మేశ్వర లింగం శివమూర్తిగాదు. అది సాలగ్రామాలు రుద్రాక్షలు కలిపి అట్టెం వంటి పదార్థంతో చేయబడిన మూర్తి. ఈ మూర్తిపై చిన్న చిన్న గుంటలుంటవి.

శ్రీశైలంలోని వృద్ధమల్లికార్జునునిపై, నివృత్తిసంగమేశ్వరంలోని సంగమేశ్వరునిపై, మహానందిలోని మహానందీశ్వరునిపై, శ్రీకాకుళంలోని ముఖలింగేశ్వరునిపై గూడా ఇటువంటి గుంటలే ఉన్నవట. ఇవి రసవాదానికి సంబంధించినవని పరిశోధకుల మతం. పూర్వం అలంపురంలో శైవంలోని రసేశ్వర సంప్రదాయం ఉన్నది.

అలంపురంలోని శివలింగంపై చిన్న గుంటలు, కాశీవిశ్వనాథునిపై నాగచిహ్నలు వాని ప్రత్యేకతలు.

ఈ క్షేత్రానికి సంబంధించిన స్థలపురాణంలో స్కాందంలో ద్వాదశఖండ పరిమితంగా ఉంది. దానిప్రకారం ఇక్కడి బ్రహ్మేశ్వరాలయాల నిర్మాణ వృత్తాంతం ఈ విధంగా ఉంది:

పూర్వం కాశీవిశ్వేశ్వరుని ఆజ్ఞానుసారం ఒక రససిద్ధు డిక్కడ తపం చేసినాడు. అపుడతనికి బ్రహ్మ శిరస్సునుండి, జోగుళాంబ ముఖం నుండి, గణేశ్వరుని నాభినుండి, పార్వతి వామపాదం నుండి, భైరవుని దక్షిణభాగం నుండి ఒక దివ్యరసం లభించింది. దానితో అతనికి రస వాదం సిద్ధించింది. ఆ రసప్రభావంచేతనే అతడిక్కడ నవబ్రహ్మల ఆలయాలు నిర్మించినాడు. అపుడది చూచి ఈ ప్రాంతాన్ని పాలించే

విలసద్రాజు అనే ప్రభువు ఆ సిద్ధుని మహిమకు అసూయపడి ఆ రసాన్ని ఏ విధంగానైనా కాజేయవలెనని దండెత్తిరాగా, అది తెలిసి ఆ సిద్ధుడు బాలబ్రహ్మేశ్వరాలయంలోనికి వెళ్ళి ఆ స్వామి మూర్తిలో అదృశ్యమై పోయినాడు.

ఈ విధంగా రససిద్ధుని ప్రయత్నానికి విఘాతం కలిగించటంతో విలసద్రాజు రాజ్యభ్రష్టుడై అడవిపాలైనాడు. అప్పుడు ఒక జింక మనుష్య వాక్కులతో అతనికి ఆ దుర్దశ కారణం, దాని విమోచనం చెప్పింది. అది విని అతడు తన తప్పు తెలిసికొని అలంపురానికి వచ్చి ఆ క్షేత్రానికి మహాద్వారం కట్టించి దానిపై తన గాథను గూడ చెక్కించి శాప విముక్తుడైనాడు.

సంస్కృత భారతాన్ని తెలుగువారి కందించడానికి వ్యాస మహర్షియే మళ్ళీ తిక్కనగా అవతరించినాడంటారు. అలాగే కాలగర్భంలో మరుగుపడిపోయిన ఈ క్షేత్ర చరిత్రను లోకానికి చాటడానికి బాల బ్రహ్మేశ్వరునిలో ఐక్యమైపోయిన రససిద్ధుడే ఈనాడు మళ్ళీ శ్రీ గడియారం రామకృష్ణశర్మగారి రూపంలో అవతరించినాడనవలె. లేకుంటే ఈ క్షేత్ర చరిత్ర ఇంత తొందరలో మళ్ళీ లోకానికి వెల్లడి అయ్యేదికాదు.

రామకృష్ణశర్మగారు సంస్కృతీ పరిశోధకుడు, శిల్పపరిశోధకుడే గాక గొప్ప చరిత్ర పరిశోధకుడు. ఆయన ఆనాడు రససిద్ధునిపై దండెత్తిన విలసద్రాజు ఆనాడు పూడూరును పాలించిన త్రిభువనమల్లుని సామంతుడు హల్లకరుసు కావచ్చునని అంటున్నారు.

హల్లకరుసు జైనుడు. వారు స్యాదస్తిస్యాన్నాస్తివాదులు కనుక విలసచ్ఛబ్దంలోని 'స్యాత్' శబ్దం అతడు స్యాదస్తివాదానికి చెందిన వానినిగా సూచిస్తుందని అతని అభిప్రాయం.

పురాణకథనం తప్ప ఇంతవరకు ఇక్కడి ఆలయాలు ఏ ప్రభువులు కట్టించినారో తెలియటంలేదు. శాతవాహనుల పిమ్మట ఈ ప్రాంతం పల్లవుల, కదంబుల, చాళుక్యుల, రాష్ట్రకూటుల, బాదామి చాళుక్యుల, కాలచుర్యుల, కాకతీయుల, విజయనగర ప్రభువుల పరిపాలన క్రిందికి వచ్చింది కాబట్టి ఆయా కాలాలలో ఎందరో ప్రభువులు వారి సామంతులు ఇక్కడ ఎన్నో ఆలయాలు ప్రతిష్ఠించినారు. ఆ కారణంగా ఇక్కడ షణ్మతాలకు, వాని అంతశ్శాఖలకు చెందిన ఆలయాలెన్నో వెలసినవి.

క్రీ. శ. ఏడవ శతాబ్దివరకే ఇక్కడి బ్రహ్మేశ్వరాలయాలు ప్రసిద్ధాలు. వానికి క్రీ. శ. 704 లో వినయాదిత్యుని కుమారుడు విజయాదిత్యుడు ప్రాకారం కట్టించినట్లు శాసనాలు తెలుపుతున్నవి. కాని ఈనాడా ప్రాకారం లేదు. దాని స్థానంలో కోట ఉంది.

అలంపూరులో చూడదగిన స్థలాలు :

1. కోట :

ఇది తుంగభద్రా నదీ తీరంలో ఉంది. ఇక్కడ విజయాదిత్యుడు 8 వ శతాబ్దారంభంలో ఆలయాలకు ప్రాకారం కట్టించినాడు. అది ధ్వంసమైన పిమ్మట ఈ కోట కట్టబడింది. దీనికి ఆ ప్రాకార శిల్పాలమర్చబడినవి. ఇది పశ్చిమాభిముఖమైన దుర్గం. తూర్పువైపున నది లోనికి అయిదు ద్వారాలున్నవి. దీనికి నాలుగు ప్రాకారాలున్నవి. ఉత్తరంగా బయటికి ఒక ద్వారం ఉంది. ప్రసిద్ధాలయాలన్నీ ఈ కోటలోనే ఉన్నవి.

2. జుమ్మా మసీదు :

ఇది కోట చివరి ద్వారం దాటగానే ఎడమ చేతివైపున ఉంది. దీన్ని (హిజరీ 1229) క్రీ.శ. 1810 లో షాయారుల్ ముల్కు అనే రాజబంధువు కట్టించినాడు. ఇతనికి అలంపురం క్రీ శ. 1821 లో జాగీరుగా ఉన్నది.

3. డుంఠి గణపతి :

ఈ గుడి బ్రాహ్మణవీధిలోగల రాగిచెట్టుకు ఎదురుగా ఉంది అలంపురం దక్షిణకాశి అనటానికి ఈ గణపతి ఒక ప్రమాణం. భక్తులు ఈ స్వామికి వినాయక చతుర్థికి పెద్ద ఉత్సవం, ఊరేగింపు చేస్తారు.

4. కామాక్షీదేవి :

ఈ ఆలయం బ్రహ్మేశ్వరాలయానికి పశ్చిమ ద్వారంలో ఉంది. ఈ గుడి క్రీ.శ. 1353 లో పెర్మాడిరాయని మంత్రి అయింతరాజు కట్టించినాడు. ఈ దేవి కెదురుగా ఏకామ్రేశ్వరుడున్నాడు. వీరిద్దరు కంచిలో ముఖ్యదేవతలు.

5. దర్గాథడ్ :

కామాక్షీదేవి గుడిదాటగానే ఇది కుడివైపున ఉంది. ఇది షా అలీ పాదుషా కబంధంపై కట్టబడిన సమాధి. షా అలీగారు ఖాజా బందేనవాజ్ గేసూదరాజ్ గారి అల్లుడు. గేసూదరాజ్ అనగా దీర్ఘకేశుడని అర్థం.

మామగారి మరణం పిమ్మట మత ప్రచారం కొరకై వచ్చి ఈ మహనీయుడు ఇక్కడనే కాలధర్మం చెందినాడు. ఆయనకు హిందూ మహమ్మదీయులిద్దరూ శిష్యులుగా ఉన్నారు. కాబట్టి మరణానంతరం ఎవరి మత ప్రకారం శరీరం సమాధి చేయవలెననే పేచీ వచ్చి అతని తలను మహమ్మదీయులు, మొండేన్ని హిందువులు పంచుకొని, ఎవరి మత ప్రకారం వారు సమాధులు చేసుకున్నారు. ఇక్కడ జలఖాత్ నెలలో ఖాజా బందెనవాజ్ ఉర్సు తరువాత ఎనిమిది దినాలకు గేసూదరాజ్ ఉర్సు జరుగుతుంది. అపుడు గుల్బర్గానుండి ఫకీర్లు ఇక్కడికి గంధం తెస్తారు. ఈ ఉర్సులో పహిల్వానుల వేషాలు ప్రత్యేకం.

6. నవబ్రహ్మాలయాలు :

బాలబ్రహ్మ ఇక్కడి ప్రధాన దైవం. ప్రస్తుతం ఈ ఒక్క ఆలయమే ఇక్కడ సువ్యవస్థితంగా ఉంది. గరుడ బ్రహ్మాలయం వేంకటేశ్వరాలయం ప్రక్కన - స్వర్గ బ్రహ్మాలయం దక్షిణపు తోట ముందర - పద్మబ్రహ్మాలయం రామలక్ష్మణుల లింగాల దగ్గర - తారక బ్రహ్మాలయం దర్గాకెదురుగా ఉన్నవి.

అర్కబ్రహ్మాలయం నేటి బాలఖిల్లా మసీదు - కుమార బ్రహ్మాలయం అశ్వత్థం కట్టకుత్తరంగా - వీర విశ్వబ్రహ్మాల గుడులు మసీదు కుత్తరంగా తోటలో ఉన్నవి.

ఈ ఆలయాలన్నీ ఒకే తీరుగా ఉంటవి. వీనిలోని మూర్తులు విగ్రహాలు కావు. అన్నీ శివలింగాలు. బాలబ్రహ్మేశ్వర లింగం మాత్రం శిలా నిర్మితం కాక సాలగ్రామాలు రుద్రాక్షలు కలిపి అష్టెంతో చేయబడింది. ఈ మూర్తికి ఎన్ని కడవల నీరు అభిషేకం చేసినా బయటికి పారదు. అది ఎక్కడ పోతుందో తెలియదు. ఇదొక వింత. ఈ స్వామికి యేటా శివరాత్రి నుండి అయిదు రోజుల ఉత్సవం నడుస్తుంది.

7. జోగుళాంబ :

ఈ క్షేత్రంలోని ప్రధాన దైవం ఈమె అనే అంటారు కాని ఇపుడీమె మూర్తి ఆలయం యొక్క మొగసాలలో ఉంది. ఈ దేవికి యేటా శరన్నవరాత్రి వేడుకలు చేస్తారు.

8. రససిద్ధుడు :

ఇతడే ఇక్కడి ఆలయాలు కట్టించినవాడు. ఏ కాలం వాడో తెలియదు. ఇతని మునిగల్లు బ్రహ్మేశ్వరాలయ ద్వితీయద్వారం దాటిన పిమ్మట కుడివైపున మూలన ఉంది. అక్కడ ఇంకా మునుల ప్రతిమలు ఉన్నవి.

9. వేంకటేశ్వరాలయం :

ఇది బ్రహ్మేశ్వరాలయానికి దక్షిణంగా ఉంది. దీన్ని నూటయేబది ఏండ్లక్రింద నరసింగరావు అనే మధ్వ బ్రాహ్మణుడు కట్టించినాడు. దీనిలో అనేకమైన సుందర విగ్రహాలున్నవి. ఈ స్వామికి శరన్నవ రాత్రులలో కళ్యాణోత్సవం, ఊరేగింపు జరుగుతవి.

10. దత్తాత్రేయస్వామి గుడి :

ఇది బ్రాహ్మణవీథిలో ఉంది. ఈ గుడి మొదట నాగేశ్వరాలయం. బాలసుబ్బయ్యగారు కాశి నుండి దత్తాత్రేయ ప్రతిమను తెచ్చి దీనిలో ప్రతిష్ఠించినాడు. అప్పటినుండి ఇది దత్తాత్రేయాలయం అయింది.

11. నృసింహాలయం :

ఇది కోటలో దక్షిణంగా ఉంది. ఈ గుడిని పూడూరు హల్లకరుసు ప్రతీహారి నాగనాయని భార్య చాకమ్మ జీర్ణోద్ధారం చేయించినట్లు శాసనం ఉంది. ఈ స్వామికి వైశాఖపూర్ణిమకు ఉత్సవం జరుగుతుంది.

12. కోటమీది ఆంజనేయస్వామి :

ఈ గుడి దక్షిణపు కోట గోడమీద ఉంది. ఇందులోని స్వామి ఆత్మారామాంజనేయమూర్తి. ఈ గుడి శిథిలంకాగా దాన్ని శ్రీనివాసులు అనే సంగీత విద్వాంసుడు స్వార్జితంతో జీర్ణోద్ధారం చేయించినాడు. ఈ స్వామి అలంపూరు ఆంధ్ర యువజన నాట్యమండలివారి ఆరాధ్యదైవం. ఇతనికి కార్తికంలో పూజలు, రామనవమికి ఊరేగింపు జరుగుతవి.

13. సూర్యనారాయణస్వామి ఆలయం :

ఇది బ్రాహ్మణవీథిలో రాగిచెట్టు అరుగుకు దక్షిణపు త్రోవలో ఉంది. దీనిలో నందీశ్వర, విఘ్నేశ్వర, పరశురామ మూర్తులున్నవి. ఇవన్ని మిక్కిలి సుందరంగా ఉన్నవి. రథసప్తమికి యిక్కడ ఉత్సవం జరుగుతుంది.

14. బసవేశ్వరాలయం :

కోటలోనుండి పోస్టాఫీసుకు వెళ్ళే సందులో ఉంది. బసవేశ్వరుడు వేదికపై ప్రతిష్ఠింపబడి మిక్కిలి సుందరంగా ఉన్నాడు

15. నీలకంఠేశ్వరాలయం :

ఇది బసవేశ్వరాలయానికి సమీపంలో ఉంది. దీనిలోని ఉత్సవాదులన్ని అలంపూరు వైశ్య సంఘం వారి యాజమాన్యంలో జరుగుతవి.

16. సిర్ ముబారక్ :

ఇది షా ఆలీ పాదుషాగారి శిరస్సుమీద కట్టిన సమాధి. బహర్ పేటలో ఉంది - దీని ద్వారబంధం శిథిలంకాగా క్రీ. శ. 1807 లో మళ్ళీ బాగుచేయించినారు.

69

అష్టాదశ తీర్థాలు

కాశిలోవలె అలంపురంలోగూడా తుంగభద్రానది వెంట అరువది నాలుగు తీర్థాలున్నవని చెప్పినాను. అవి పంచలింగాల నుండి కూడలి సంగమేశ్వరం వరకు గల నడిమిప్రదేశంలో విస్తరించి ఉన్నవి. వాటిలో ముఖ్యమైన కొన్నిటిని తిలకించండి

అంతరగంగ :

ఇది సింగవరం దగ్గర ఉంది. ఇక్కడొక చిన్న పుష్కరిణి, దాని గట్టున చిన్నలింగప్రతిష్ఠ. ప్రక్కన ఒక అమ్మవారు కూడా ఉంది. పూజ జరుగుతుంది.

పాపనాశిని :

ఇది యిక్కడి తీర్థాలలో కెల్లా ముఖ్యమయింది. అంతరగంగకు ఉత్తరంగా ఆరు ఫర్లాంగుల దూరంలో ఉంది. ఈ ఆవరణలో చాలా గుడులున్నవి. ప్రధానాలయంలో పాపనాశేశ్వరుడున్నాడు. అది చాలా పెద్దలింగం. ఈ ఆవరణలో గదాధరుడున్నాడు గాబట్టి యాత్రికులిక్కడ గయలో వలె శ్రాద్ధాలు పెడతారు.

గదాధరుడే కాక ఇక్కడ ఇంకా సప్తమాతృకలు, గణేశ్వరుడు, మహిషమర్ధని ఆలయాలు ఉన్నవి. గణేశ్వరాలయం వెనుక ఇరుకుసందు దారిలో కొంత దూరాన హిరణ్యకశిపుని చీరుతున్న నృసింహుడు, అగ్నికుండంలో కాలుపెట్టిన బిందుమాధవుడు ఉన్నారు.

ప్రథమబ్రహ్మ - ఛాయా మల్లికార్జునాలు :

ఈ రెండు తీర్థాలు పాపనాశిని ముందర నదీతీరంలోని మెట్లకు దక్షిణంగా ఉన్నవి. ఈ రెండు గూడా లింగప్రతిష్ఠలే. యాత్రికులు మొదట ఈ లింగాలను పూజించిన పిమ్మటనే పాపనాశేశ్వరుని పూజించవలసి ఉంటుంది.

వేదాసంగమ తీర్థం :

ఇది గ్రామం నుండి పాపనాశికి పోయేదారిలో పడమట ఉంది. పూర్వం ఇక్కడ వేదానది అనే చిన్నపాయ తుంగభద్రలో కలిసేది. కాని యిపుడా పాయగాని యిక్కడ లింగ ప్రతిష్ఠగాని లేవు ప్రస్తుతం ఇది చాకిరేవు.

గణికా సిద్ధేశ్వర - మోక్షేశ్వరాలు :

ఈ రెండు తీర్థాలు వేదసంగమానికి తూర్పున తుంగభద్రానదీ తీరంలో సవల్ తోటలో ఉన్నవి. ఇపుడీ ప్రదేశం ఆకుతోటలు.

భుజంగ తీర్థం :

ఇది గణికా సిద్ధేశ్వరం గుడులకు ఉత్తరంగా త్రోవనానుకుని ఉంది. ఈ గుడి చుట్టు ఇప్పుడు చాలా నాగమూర్తులున్నవి. కాబట్టి దీన్ని నాగతోట అంటున్నారు.

బ్రహ్మనారాయణ తీర్థం :

ఇది భుజంగతీర్థానికి ఈశాన్యంగా తుంగభద్రా నదీతీరంలో ఉంది. ఇక్కడ రెండు గుడులున్నవి. ఒకదానిలో శివలింగ ప్రతిష్ఠ, మరోదానిలో రుద్రపాదం ఉన్నవి. బ్రాహ్మణిలీ సమీపంలోనే శవ దహనం చేసి, స్నానానంతరం ఈ స్వామిని దర్శిస్తారు.

మణికర్ణిక :

ఇది బ్రహ్మనారాయణ తీర్థానికి వెనుక కాలిబాట నానుకొని ఉంది. ఇక్కడ ఒక పుష్కరిణి, దాని తీరంలో ఒక గుడి ఉన్నవి. ఈ పుష్కరిణి నదీ మట్టానికి ఇరువది గజాల ఎత్తున ఉన్నా దీనిలో ఎప్పటికీ నీరు ఉంటుంది. కాశీలో గూడా మణికర్ణిక గంగామట్టానికి ఎత్తుపైననే ఉంటుంది. కాని దానిలో నీరుండదు.

ఇక్కడ బ్రాహ్మణులు దీని ఎదురుగా ఉండే మైదానంలోనే శవ దహనం చేస్తారు. కాబట్టి యిక్కడ పూజ లేదు.

ప్రయాగ మాధవతీర్థం :

ఇది నృసింహాలయం నుండి నదిలోనికి దిగే ద్వారానికి ఎదురుగా ఉంది. మంటపంలో మాధవుడున్నాడు కాని, ఆతనికి పూజ లేదు.

దేవద్రోణి :

ఇక్కడి తీర్థాలలో పాపనాశిని పిమ్మట ఇది మరో ముఖ్య తీర్థం. బ్రహ్మేశ్వరాలయం నుండి నదిలోనికి దిగితే ఈ తీర్థం కనిపిస్తుంది. ఇక్కడ పూర్వపు మెట్లు శిథిలంకాగా, పుల్లూరు నివాసి శ్రీ చల్లా వెంకట రామరెడ్డిగారు తమ తండ్రిగారి జ్ఞాపకంగా వానిని మళ్ళీ కట్టించినారు. ఈ మెట్లపై ఒకేసారి వందమంది స్నానం చేయువచ్చు. ఈ మెట్ల నడుమ ఒక పెద్ద లింగం ఉంది. యాత్రికులు ఇక్కడ స్నానంచేసి, మొదట ఈ స్వామిని పూజించిన పిమ్మటనే బాలబ్రహ్మేశ్వరుని దర్శించవలసి ఉంటుంది.

అగ్నీశ్వరతీర్థం :

ఇది మొదట నదీతీరంలో ఉండేది. కాని కోటగోడ రావటంతో బాలబ్రహ్మేశ్వరాలయావరణలో చేరి, కుమారశాస్త్రిలు గారి సమాధికి దక్షిణంగా చింతక్రింద ఉంది. ఇది పల్లపుప్రదేశం కాబట్టి నీరు నిలుస్తూ పూజ లేకుండాపోయింది.

శుక్రేశ్వరం :

ఇది గొందిమళ్ళకు పోయేదారిలో ఉన్న అనుగొండి తోటలో నది వైపున ఉంది. ప్రస్తుతం పూజ లేదు.

నాగభోగేశ్వరం :

ఇది శుక్రేశ్వరానికి ఉత్తరంగా మిక్కిలి దగ్గరగానే ఉంది. ఈ ఆలయంలో లింగంకాక శివమూర్తి త్రిముఖమై చతుర్భుజాలతో ఉన్నాడు. ఈ ఆలయద్వార బంధం, శివమూర్తి మిక్కిలి సుందరంగా ఉన్నవి.

సోమ సిద్ధేశ్వరం :

ఇది నాగభోగేశ్వరానికి ఉత్తరంగా గొందిమళ్ళ త్రోవలో బుగ్గ రాజు వెంకయ్యగుడికి దక్షిణంగా ఉంది. దీన్నిపుడు కొండారెడ్డి దేవాలయం అంటారు. బాలబ్రహ్మేశ్వర ఆలయగోపురం పిమ్మట ఈ గోపురమే చెప్పదగింది. ఇంత పెద్దగోపురం తీర్థాలలో మరేగుడికి లేదు.

నాదా సంగమేశ్వరం :

ఇది భైరనిపల్లికి ఉత్తరంగా ఉంది. దీని సమీపంలో నాదావతి అనేనది తుంగభద్రలో కలుస్తుంది. కాబట్టి ఈ ఆలయానికి నాదా సంగమేశ్వరం అనే పేరు ఏర్పడింది. ఈ ఆలయంలో శివలింగంకాక చతుర్భుజ మహేశ్వర మూర్తి ఉంది.

కలకలేశ్వరం :

ఇది నాదా సంగమేశ్వరం వెనుక ఇరువది గజాల దూరంలో ఉంది. ఇక్కడి మందిరం కూలిపోయింది కాని, దానిలోని భైరవమూర్తి మాత్రం భ్రష్టం కాలేదు. ఈ భైరవునిబట్టియే ప్రక్కగ్రామానికి భైరవుని పల్లె అనే పేరేర్పడింది. కాని ఇపుడా పల్లె దూరంగా జరిగింది.

ఇపుడు నాదా సంగమేశ్వర కలకలేశ్వరాల చుట్టు కోటగోడ, దానిపై నలువైపులా నాలుగు కూలిన బురుజులు కనిపిస్తవి

(అలంపూరుకు సంబంధించి చూడదగిన స్థలాలు అష్టాదశ తీర్థాలు అనే వివరాలు అలంపూరు శిథిలములు అనే గ్రంథం నుండి గ్రహింప బడినవి. ఇంకా వివరాలకు పాఠకులా పుస్తకం చూడగోరుతాను.)

చెన్నకేశవాలయం – ఉండవెల్లి

ఉండవెల్లి ఉత్తర భారతంలోని హుండేలికి మారురూపం. ఈ గ్రామం అలంపూరు స్టేషనుకు మూడు మైళ్ళు ఉంటుంది. ఇపుడిది మానవపాడు మండలంలో చేరింది.

ఈ గ్రామంలో శివాలయం, చెన్నకేశవుని గుడి, ఆంజనేయాలయం, హేమలాంబ గుడి ఉన్నవి. వీనిలో ఇక్కడ చెన్నకేశవస్వామియే ప్రసిద్ధంగా ఉన్నాడు.

కేశవమూర్తి విష్ణువు యొక్క చతుర్వింశతి రూపాలలో ఒకటి. ఇది వాసుదేవ వ్యూహానికి చెందిన ప్రకాశమూర్తి విష్ణువుకు కుడిచేతిలో శంఖం, ఎడమచేత చక్రం ఉన్నపుడది కేశవమూర్తిగా భావింపబడుతుంది.

ఇక్కడి స్వామి నల్లరాతిది. అది మిక్కిలి మనోహరంగా ఉంటుంది. ఈ స్వామికి పుష్యంలో పూర్ణిమనుండి తదియవరకు నాలుగు దినాలు ఉత్సవం నడుస్తుంది మొదటినాడు కళ్యాణం, రెండవనాడు ప్రభ, మూడవనాడు పారువేట, నాల్గవనాడు తీర్థావళి జరుగుతవి.

చెన్నకేశవునితోపాటు ఈ గ్రామంలో హేమలాంబ గూడ ప్రసిద్ధంగా ఉంది. హేమలాంబ ఎల్లమ్మ యొక్క సంస్కృత రూపం ఇక్కడ ఆ దేవి యొక్క తల పూజింపబడుతుంది.

అలంపురం ఎల్లమ్మ క్షేత్రమని పూర్వుల నమ్మకం. అక్కడ ఎల్లమ్మ యొక్క కబంధం, పరశురామ ప్రతిష్ఠ ఉన్నవి కాబట్టి పూర్వం అతడు తల్లి తల నరుకగా, అది ఎగిరి వచ్చి యిక్కడ పడెనని స్థల పురాణం చెబుతుంది.

రామేశ్వరాలయం - తక్కశిల

ఉత్తర భారతంలోని అయోధ్య ఉజ్జయిని తక్షశిలా నగరాలకు ఈ జిల్లాలో అయిజ ఉజ్జలి తక్కశిల అనే ప్రతిరూపాలు వెలయటం దీని ప్రత్యేకత. ఇది అలంపూరు మండలంలోని గ్రామం.

అలంపూరు స్టేషన్‌కు ఆరు మైళ్ళు ఉంటుంది. ఈ గ్రామం చుట్టు గల కోట మిక్కిలి బలిష్ఠమయినది.

ఈ గ్రామంలో రామేశ్వరస్వామి, కేశవస్వామి, ఆంజనేయ స్వామి - శివ - విష్ణు - శక్తి ఆలయాలు, సుంకాలమ్మ గుడి ఉన్నవి. వీనిలో రామేశ్వరాలయం పురాతనమయింది. మొదట ఇందులో స్వామి ఒక్కడే ఉండగా, తరువాతి కాలంలో గ్రామస్థులు పార్వతిని ప్రతిష్ఠించి ఉత్సవం ప్రారంభించినారు. ప్రతి ఏటా చైత్రశుద్ధ చతుర్దశి నుండి విదియ వరకు ఇక్కడ ఉత్సవం జరుగుతుంది.

శివాలయంతోపాటు వీరభద్రాలయం గూడా ఉంది. శ్రావణంలో ఈ స్వామికి నిత్యాభిషేకం - నందికోల ఉత్సవం నడుస్తవి. చివరినాడు గ్రామస్థులంతా చందాలతో పెద్ద సమారాధన చేస్తారు.

సుంకాలమ్మ గ్రామదేవత. ప్రజ లీమెకు మొదట ముడుపు కట్టి, కోరిక తీరిన పిమ్మట పూజిస్తారు.

చెన్నకేశవస్వామి - పల్లెపాడు

ఈ గ్రామం మానవపాడు స్టేషన్‌కు ఆరుమైళ్ళు ఉంటుంది. మానవపాడు మండలంలోనే ఉంది. ఇక్కడ చాళుక్య వినయాదిత్యుని శాసనం లభించటంతో ఈ గ్రామం చరిత్ర ప్రసిద్ధమయింది.

ఇక్కడ చెన్నకేశవస్వామి, నాగేశ్వరస్వామి గుడులున్నవి. వానిని పూర్వం బిజ్జల వంశీయులైన జాగీర్దారులు కట్టించినట్లు చెబుతారు. చెన్నకేశవుడు ఇక్కడి ప్రధాన దైవం ఈ స్వామికి చైత్ర పూర్ణిమ

నుండి తదియవరకు ఉత్సవం సాగుతుంది. రథోత్సవంనాడు అన్నదానం గూడా చేస్తారు. అలంపూరు తాలూకాలో ఇది బాగా పేరుపొందిన జాతర.

ఉట్లతిరుణాల - పుల్లూరు

ఈ గ్రామం అలంపూరు స్టేషనుకు అయిదు మైళ్ళలో ఉంది. అలంపుర క్షేత్రం ఇక్కడి నుండి ప్రారంభమవుతుంది పూర్వం అక్కడి ఆలయాలకు ప్రతిదినం పూలు ఇక్కడి నుండి వెళ్ళేవి. అందుచేత ఇది పూల ఊరు-ఇపుడు పుల్లూరు అయింది. ఇది తుంగభద్రా తీరగ్రామం.

ఇక్కడ గూడా చెన్నకేశవుడే ప్రసిద్ధికాని, అతనితోపాటు ఇక్కడ సూర్యనారాయణ - బదరీనారాయణ - శంకరనారాయణ మూర్తులు, శివ - విష్ణు - ఆంజనేయ విగ్రహాలు ఉన్నవి

ఈ గ్రామంలో నారాయణ మూర్తులది ఒక ప్రత్యేకత. ఈ ప్రాంతంలో త్రిమూర్తులు మరెక్కడా కనిపించవు.

ఇక్కడి దైవం చెన్నకేశవుడైనా ప్రతి ఏటా గోకులాష్టమికి ఉట్ల ఉత్సవం ఘనంగా నడుపుతారు.

వెంకట నారాయణస్వామి - రాజోలు

ఇది గూడా తుంగభద్రాతీరప్రాంతం. ఈ గ్రామం అలంపూరుకు ఇరవై మైళ్ళు ఉంటుంది. ఈ ప్రాంతంలోని ప్రాచీన గ్రామాలలో ఇది ఒకటి. ఇపుడిది వడ్డేపల్లి మండలంలో ఉంది.

ఈ గ్రామంలో వెంకటనారాయణ స్వామి ఆలయం ప్రసిద్ధి అన్నవరంలోని స్వామి వీరవెంకట సత్యనారాయణ. ఆ స్వామి వారికి మీసాలు ఉంటవి. కాని ఇతని కవిలేవు.

వెంకట నారాయణస్వామి, వెంకటేశ్వరునికి ప్రతిరూపమైనా తెలంగాణకు ఈ స్వామి క్రొత్త. ఇక్కడ ఇతని ఉత్సవం జ్యేష్ఠ పూర్ణిమ నుండి విదియ వరకు నడుస్తుంది.

ఆత్మకూరు తాలూకా ఆలయాలు

ఆత్మకూరు జిల్లాకేంద్రానికి 30 కిలోమీటర్లుంది అక్కడికి కర్నూలు 45 కి. మీ. ఉంటుంది

క్రీ. శ. 1816 వరకీ గ్రామం లేదు. ఇక్కడొక చిన్నపల్లె ఉన్నది. అక్కడ నివసించిన గాజులవారు తమ పొలం దున్నుకుంటూ ఉండగా వారికి ఒక లింగం దొరికింది. అపుడు వారు దానికి ఒక చిన్న గుడి కట్టించి ప్రతిష్ఠించి ఆత్మలింగమని పేరు పెట్టినారు. దానితో ఆ పల్లె ఆత్మాపురం అయింది.

ప్రస్తుతం ఆ గుడిని పరమేశ్వరాలయం అంటున్నారు. అక్కడ ఇపుడున్న గుడి సర్వారెడ్డిగారి కుమారుడు తిమ్మారెడ్డిగారి కాలంలో కట్ట బడింది. అప్పటికి కూడా ఇది యింకా గ్రామదశ నందుకోలేదు. వారి రాజధాని అపుడు అమరచింతలో ఉన్నది.

అనంతరం ఇపుడున్న గ్రామాన్ని అక్కడ పెద్ద వెంకటరెడ్డిగారు స్థాపించి, కేశవాలయం కట్టించి, తిప్పడంపల్లినుండి తమ రాజధానిని ఇక్కడికి మార్చినారు. నాటినుండి ఇది ఆత్మకూరుగా ప్రసిద్ధి పొందింది.

ఇపుడీ గ్రామంలో పరమేశ్వరాలయం, కేశవాలయాలే కాక వేణుగోపాల, వేంకటేశ్వరాలయాలు, అయిదు ఆంజనేయాలయాలు, పోచమ్మ - గజ్జెలమ్మ - కట్టమ్మ - ఊరిదమ్మ - మశమ్మ - బీరప్ప - దొరయ్య గుడులు ఉన్నవి.

శివరాత్రి సందర్భంలో పరమేశ్వరాలయంలో ఇక్కడ పెద్ద ఉత్సవం సాగుతుంది అపుడు పరమేశ్వరుని ప్రభ ఊరేగుతుంది.

సంస్థాన ప్రభువుల కాలంలో ఈ ఉత్సవంలో కవి పండిత సభలు దానికి ఒక ప్రత్యేకాలంకారంగా శోభిల్లేవి

శ్రీ రామాలయం - అమరచింత

ఈ గ్రామం ముక్కర వంశీయులకు ఆత్మకూరు కంటె మొదటి రాజధాని. ఇపుడిది ఆత్మకూరు మండలంలో ఉంది.

ఇక్కడ శ్రీరామ - ఆంజనేయ - రామలింగేశ్వర - ఈశ్వర - కాళికాలయాలున్నవి. వానిలో శ్రీరామాలయం ఇపుడు ప్రసిద్ధంగా ఉంది. దానిలోని మూలమూర్తులు పాలరాతివి. అవి కాశినుండి తెప్పించి ప్రతిష్ఠించినారు. క్రీ. శ. 1959 నుండి ఈ ఆలయంలో పద్మశాలీల ఆధ్వర్యంలో ఏటా చైత్ర శుద్ధ సప్తమి నుండి దశమి వరకు ఉత్సవం జరుగుతుంది.

కృష్ణానది ఇక్కడికి ఆరుమైళ్ళు. ఉత్సవ సందర్భంలో ఆ నది నీరు తెప్పించి స్వామివారికి అభిషేకం చేస్తారు.

రామలింగేశ్వరాలయం - ఏదులాపురం

ఇది ఆత్మకూరు నుండి పాలమూరు రూటులో చింతకుంట దాటిన పిమ్మట ఉంది. ఇక్కడ రామలింగేశ్వరాలయం ప్రసిద్ధి కాని, అది ఆ గ్రామంలో లేదు. ఏదులాపురం చింతకుంట నడుమ అరణ్యంలో ఉంది. ఆలయానికి తూర్పున ఫర్లాంగు దూరంలో ఒక చిన్న వాగుకూడ వుంది. దాన్ని "ఊక సెట్టి వాగు" అంటారు. కొందరు "బంగారుతీగె వాగు" అని కూడ అంటారు.

ఇక్కడి ఆలయంలో స్వామిమూర్తి పెరుగుతూ ఉందట. ఇదొక అద్భుతమైన విషయం. మొదలీమూర్తి నేలకు జేనెడే ఉండేదని అంటారు ఇపుడు మూరెడు ఎత్తుగా ఉంది.

స్వామి మహిమ చూసి ఏదులాపురం - చింతలకుంట, అప్పం పల్లె ప్రజలు కలిసి గుడి కట్టించి, యిప్పుడు పూజాదులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా వైశాఖంలో యిక్కడ ఉత్సవం జరుగుతుంది అపుడు పున్నమనాడు అగ్నిగుండాలు గూడా త్రొక్కుతారు.

శివాలయం - గట్టు

ఆత్మకూరు తాలూకాలోని ఈ గ్రామం మక్తల్ నుండి రాయచూరు రూటులో పదేను కిలోమీటర్లపై ఉంది

ఇక్కడ "చంద్రగడె" అనే గ్రామం ఉంది కాబట్టి దీన్ని "చంద్రగడె గట్టు" అని అంటారు. దీనిపై పురాతనమైన ఒక కోట, దానిలో రామలింగేశ్వరాలయం ఉన్నవి. దానికి ముఖమంటపం కూడ ఉంది. ఆలయం ముందున్న గండశిలలు పగిలి, ప్రకృతి సిద్ధమైన ఒక కోనేరు ఏర్పడింది. దాన్ని ఆధారంగా చేసికొనే ఇక్కడ ఈ ఆలయం కట్టబడింది. ఇది ఇక్కడి పురాతనాలయాలలో ఒకటి. ఇపుడీ గట్టుపైకి రోడ్డుగూడా ఉంది.

ఈ ఆలయ ప్రాకారం విశాలంగా ఉండి, నిరాడంబరంగా ఉంది. శ్రావణ శుద్ధ పంచమికి ఇక్కడ ఉత్సవం జరుగుతుంది.

ఈ పేరున గద్వాల తాలూకాలో ఒక గ్రామం కూడా ఉంది. అదిపుడు ఒక మండల కేంద్రం.

శివాలయం - గుండాల

ఇది ఒక క్షేత్రం. జూరాల ప్రాజెక్టుకు పశ్చిమంగా అయిదు మైళ్ళ మీద ఉంది. జూరాల ఆత్మకూరు మండలంలో ఉంది. ఇక్కడి ప్రకృతి దృశ్యం మనోహరంగా ఉంటుంది. తిరుపతిలోని ఆకాశగంగ వలె ఇక్కడ కొండపై నుండి ఆకాశగంగ మూడు పాయలుగా దూకుతూ

క్రింద గుండా లేర్పడినవి. వాటి నాధారంగా చేసికొని యిక్కడ శివాలయం కట్టబడింది. ప్రాచీనాలయాలలో ఇది కూడా ఒకటి

యాత్రికులు ఇక్కడికి ఏకాదశి, శివరాత్రి మొదలైన పుణ్య దినాలలో వచ్చి, గుండాలలో స్నానంచేసి స్వామిని పూజిస్తారు.

ఈ పేరుతో మరో క్షేత్రం కలువకుర్తి తాలూకాలో గూడ ఉంది.

వేణుగోపాలాలయం - నర్వ

ప్రస్తుతం ఇది ఒక మండల కేంద్రం. ఈ గ్రామంలో వేణు గోపాలాలయం ప్రసిద్ధి. అది గ్రామానికి ఈశాన్యంగా ఉంది. ఈ ఆలయం చక్కని శిల్పసంపదతో ఒప్పుతూ ఉంది ఇందలి స్వామి చతుర్భుజుడు. రెండు చేతులలో శంఖ చక్రాలు ధరించి, తక్కిన రెండు చేతులతో వేణువు ఊదుతున్నాడు. వెనుక ప్రక్కగా గోమాత నిలిచి, అతని పాదాన్ని నాకుతూ ఉంది. పరమ సుందరమైన ఈ మూర్తి రెండడుగుల ఎత్తుఉంటుంది.

ఈ ఆలయంలో గోకులాష్టమి వేడుక వైభవంగా జరుపబడుతుంది. ఇదిగాక ఇంకా యిక్కడ వేంకటేశ్వరాలయం, శివాలయం, ఆంజనేయా లయం కూడ ఉన్నవి. వానిలో కూడా ఉత్సవాలు నడుస్తుంటవి.

శివాలయం - నారదగడ్డ

ఇది కృష్ణానదిలోని చిన్న దీవి. కురుగడ్డ పిమ్మట ఉంది. దీని నారగడ్డ, నారదగడ్డ అని పిలుస్తారు. ఈ గడ్డపై శివాలయం, చెన్న బసవ స్వామి మఠం ఉన్నవి. ఇక్కడి శివుని నారదమహర్షి ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. ఈ క్షేత్రం ఆత్మకూరుకు ముప్పది కిలోమీటర్లలో ఉంటుంది.

ఈ ఆలయంలో శివుడు - నందీశ్వరుడు ఉన్నారు. ఈ స్వామి ఉత్సవం ఫాల్గుణ శుద్ధ చవితి నుండి పున్నమవరకు సాగుతుంది. ఈ ప్రాంతంలో ఇది చాలా పెద్ద జాతర.

ఇక్కడ పశువుల సంత ప్రసిద్ధి. వానికి ఒక పందెం కూడ ఉంటుంది. పశువులతో ఒక పెద్ద బాడను లాగిస్తారు. దాన్ని ఏది ఎక్కువ దూరం లాగ్గిగే దానికి బహుమతి ఉంటుంది.

బ్రహ్మేశ్వరాలయం - పెద్ద కడుమూరు

ఈ గ్రామం ఆత్మకూరు తాలూకాలోని నర్వ మండలంలో ఉంది. ఈ గ్రామంలో బ్రహ్మేశ్వర - మల్లికార్జున- కేశవ ప్రతిష్ఠలున్నవి. వానికి క్రీ. శ. 1116 జయలో శ్రావణ అమావాస్య సూర్యగ్రహణంనాడు గోకర్ణదేవుని సామంతుడు సౌదరి బొల్ల నాయకుడు ఒక భూదానం చేసినట్లు శాసనం ఉంది. కాబట్టి ఈ ఆలయం చోళుల నాటి నిర్మాణం అనవలసి ఉంది. ఆ కాలం నాటి నిర్మాణాలలో ఇంతటి శిల్ప విరాజిత మైన ఆలయం ఈ జిల్లాలో మరొకటి లేదు.

ఇక్కడి ఆలయాలలోనికెల్ల ఈ బ్రహ్మేశ్వరుని ఆలయమే చెప్ప దగింది. ఇపుడిది గ్రామ మధ్యంలోనిది అయింది కాని, పూర్వం ఇది గ్రామం వెలుపల పురప్రవేశ మార్గానికి ఎదురుగా ఉండి, ఎంత దూరం నుండి వచ్చేవారైనా దీని స్తంభాలలో ప్రతిఫలించి కనిపించేవారట. అది చూచి గ్రామస్థులు వారిని శత్రువులో మిత్రులో గుర్తించి, శత్రువులైతే వారు పురప్రవేశం చేయకుండానే ఎదురు వెళ్ళి ఎదుర్కొనేవారట. అది చూచి శత్రువు లొకపుడు ఏమరుపాటున గ్రామంపైబడి ఈ ఆలయాన్ని గడ్డిమేటలు వేసి తగులబెట్టినారని గ్రామస్థులు చెప్పుకుంటారు

అయితే ఇక్కడి ఆలయ స్తంబాలలో దూరంగా ఉన్నవారు ప్రతిఫలించటం ఎంత నిజమో కాని, శిలా స్తంబాలలో ఎదుటగా ఉన్న వారు ప్రతిఫలించే పనితనం మాత్రం ఇప్పటికీ ప్రాచీనాలయాలలో కొన్ని స్థలాలలో కనిపిస్తూనే ఉంది.

ఈ ఆలయం ఇపుడు గ్రామంలోపలిది కావటమే కాక శోభా విహీనం గూడ అయింది. అయినప్పటికి దర్శింపదగిన ఆలయాలలో ఇది ఒకటి.

కోదండరామాలయం - వీరరాఘవపురం

ఇది ఆత్మకూరు మండలంలోని గ్రామం. ఇక్కడి కోదండ రామాలయం పురాతనమయింది. ఆ స్వామి పేరుమీదనే గ్రామం వీరరాఘవ పురంగా పిలువబడింది ఇక్కడ యేటా చైత్రశుద్ధ దశమి నుండి బహుళ విదియ వరకు స్వామివారికి బ్రహ్మోత్సవం జరుగుతుంది. శ్రీమాన్ మండపాకం కృష్ణమాచార్యులవారి బ్రహ్మోత్సవాలు ఏర్పాటు చేసినట్లు చెబుతారు. వీరు శ్రీవైష్ణవులు. ఇక్కడ పాంచారాత్రాగమ ప్రకారం అర్చనలు జరుగుతవి. రథోత్సవంనాడు అన్నదాన వితరణం కూడా జరుగుతుంది.

ఇదిగాక ఇక్కడ ఆంజనేయాలయం, పెద్దమ్మ గుడి, పోచమ్మ గుడి ఉన్నవి.

కలువకుర్తి తాలూకాలోని గుడులు

అచ్చంపేట, కలువకుర్తి తాలూకాలను దుందుభినది వేరుచేస్తుంది. ఈ ప్రాంతాన్ని సామంతులుగా ఎక్కువకాలం ఏఱువ చోళు లేలినారు. వారి పిమ్మట చెప్పదగినవారు గోనరెడ్లు, చెఱకురెడ్లు. ఆ కాలంలో ఇది చరికొండసీమకు చెంది ఉన్నది.

ఏఱువ చోళులు ఆవుదూడ గుర్తుగలవారు. వీరు శివకేశవు లిద్దరినీ సమానంగా ఆరాధించినారు. గోనరెడ్లు రామలింగేశ్వర భక్తులు. త్రిశూల లాంఛనులు. చెఱుకు వారు శైవులు. ఢమరుక లాంఛనులు.

ఈ వంశాలవారు స్థాపించిన గ్రామాలు, చేసిన ప్రతిష్ఠలు దుందుభి యొక్క ఉభయ తీరాలలో అనేకం ఉన్నవి.

ఈనాటి కలువకుర్తి ప్రాంతానికి పూర్వం చరికొండసీమ అని పేరు. దీనికి ఉత్తరంగా ఉన్నదానిని తంగెడసీమ అనేవారు.

తాలూకా కేంద్రమైన కలువకుర్తికి సమీపంలో ఒక చిన్నగట్ల వరుస ఉంది. పూర్వం దానిక్రింద ఒక జాలు ఉండి, అందులో కలువలు పూచేవి. ఆకారణంగా అక్కడ ఏర్పడిన గ్రామానికి కలువకుఱ్ఱు - కలువకుర్తి అనే పేరేర్పడింది. ఆ తర్వాత ఇది తన ప్రశస్తితో కవుల కుర్తి, కవుల కీర్తి అని గూడ వర్ణింపబడింది.

1. కపిలేశ్వరుని గుడి :

ఇక్కడ పోల్కంపల్లి దారిలో ఒక కిలోమీటరు దూరంలో గుట్టపై కపిలేశ్వరాలయం ఉంది. ఇది ఇక్కడి ఆలయాలన్నిటిలో ప్రాచీన

మయింది. ఇది ఏకకూటాలయం. నిరాడంబరంగా ఉంది. గ్రామస్థులిపు డిక్కడికి కరెంటు కూడా తీసికొని దాన్ని బాగుచేసినారు.

శివరాత్రి మొదలైన పర్వదినాలలో గ్రామస్థులా దేవుని పూజిస్తారు.

2. హనుమదాలయం :

గ్రామం ఇది పెద్దదే అయినా ఇక్కడ చెప్పదగిన ఆలయాలు లేవు. ఈ హనుమదాలయంకూడా ప్రాచీనం కాదు. దీన్ని లక్ష్మణదాసు అనే ఒక భక్తుడు స్థాపించగా గ్రామస్థులిపుడు దాన్ని విస్తృతపరిచినారు. ఇది పాత బజారులో ఉంది. ఇపుడు గ్రామస్థుల ప్రయోజనాలన్ని దాని లోనే జరుగుతవి.

లక్ష్మణదాసు ఒక తామస భక్తుడు. అతడీ విధంగా చాలా గ్రామాలలో హనుమత్ప్రతిష్ఠలు చేయించినాడు.

3. గజ్జెల పాపమ్మ గుడి :

తెలంగాణంలో గజ్జెల పాపమ్మ తవాయి క్రీ.శ. 1900 ప్రాంతంలో వికారి సంవత్సరంలో వచ్చింది.ఆమె ఆవేశించిన వారికి స్వప్నంలో సన్నని గజ్జెల చప్పుడు, కంజరీ చప్పుడు వినిపించి పూనకం వచ్చేది. గ్రామ దేవతలలో గజ్జెల పాపమ్మ, మోదెంపల్లి ఎల్లమ్మ-వీరిద్దరూ మధురాహారం కోరే దేవతలు.

ఈమె గుడి ఇక్కడ పందుగుల దారిలో హరిజనవాడకు ఆనుకుని ఉంది. ఇదికూడ ప్రాచీనంగాదు. ఇటీవల గ్రామస్థులు కట్టిన ఆలయమే.

ఇపుడిక్కడ గ్రామస్థులు బృహత్తరమైన కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. అది రెండు అంతస్తులుగా ఉంది. క్రింద కల్యాణ మంటపం, పైని అమ్మవారి ప్రతిష్ఠతో వెలుస్తుంది.

వీరభద్రాలయం - అన్నసాగరం

ఇది వంగూరు మండలంలోని మరో గ్రామం. ఆమనగల్లునుండి హైదరాబాదు రూటులో కోనాపురం స్టేజికి కిలోమీటరు దూరంలో ఉంది.

ఇక్కడ గ్రామ సమీపంలో గల గుట్ట మీద ఈ ఆలయం కట్టబడింది. గుట్ట క్రింద కోనేరుంది. ఈ ప్రాంతంలోని ప్రాచీనాలయాలలో ఇది ఒకటి.

ఆలయంలో వీరభద్ర, శివ ప్రతిష్ఠలున్నవి. భక్తులు క్రింద కోనేటిలో స్నానం చేసి కొండ ఎక్కి స్వామిని దర్శిస్తారు.

హనుమదాలయం - ఊరుకొండపేట

"కొట్ర - తంగ్డ - వెల్దంగ్ర - ఊరుకొంగ్ర" అని ఈ ప్రాంతంలో ఒక విచిత్రమైన లోకోక్తి ఉంది. అయితే ఈ ఉక్తిలో ఉన్నవన్నీ దూషణ వాక్యాలు కావు. గ్రామవాచకాలు. దీనిలోని ఊరుకొండపేట గూడ జడ్చర్లనుండి కలువకుర్తి రూటులో ఉన్న గ్రామమే.

రోడ్డుకు దగ్గరగా ఊరుకొండ (గ్రామం), దానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఊరుకొండపేట ఉన్నవి. ఆ రెండు గ్రామాల నడుమ పెద్ద కొండ ఒకటి ఉంది దాన్నిబట్టియే ఇక్కడి గ్రామాలు ఊరుకొండ-ఊరుకొండపేట అయినవి. వాస్తవానికి ఈ కొండ ఊరుకొండ కాదు. ఉరుగొండ అనగా పెద్దకొండ అని అర్థం. ఇక్కడి ఆంజనేయ స్వామిని గట్టుఉప్పలపల్లి విశ్వకర్మలు ప్రతిష్ఠించినట్లు చెబుతారు. ఆ ఉదంతం ఈ విధంగా ఉంది:

నేటి హైదరాబాదును కదుతున్న కాలంలో నైజాం నవాబులు కృష్ణాతీరం నుండి భోజరాయలు, సింగరాయలు, బ్రహ్మరాయలు అనే

ముగ్గురు సోదరులను పిలుచుకున్నారు. వీరు మధ్వ సంప్రదాయానికి చెందినవారు. హైదరాబాదులోని పత్థర్‌ఘట్టి, ఇంకా ఆ కాలంనాటి రాజ భవనాలన్నీ అక్కడ ఈ సోదరులే కట్టినారు అందుకు వారికి నవాబులు తమ రాజ్యంలో పది వేల ఎకరాల భూమిని యిచ్చినారు.

పెద్దవాడైన భోజరాయలు తమ్ములకు చెరి మూడేసి వేల ఎకరాలు యిచ్చి తాను నాలుగు వేల ఎకరాలు తీసికున్నాడు. వారు వేరై తరువాత తమ భూములలో గ్రామాలు స్థాపించుకున్నారు. అవి ఎవరివి వారి పేరనే పిలువబడినవి.

పెద్దివాడైన భోజరాయలు స్థాపించిన గ్రామం భోజరాయపల్లె ఆయన గ్రామాన్ని ఏర్పరచిన పిమ్మట కొద్ది దినాలకు సింగరాయలు వచ్చి ఆయనతోనే చేరి పోయినాడు. అపుడు వారి యిద్దరివి కలిసి ఒకే ఉడ్డాగా నిలచి, సింగరాయపల్లె అన్నగారి గ్రామానికి మజరా అయింది.*

భోజరాయపల్లెకు దక్షిణంగా అమ్మపల్లె ఉన్నది. అక్కడ ముస్లిము లెక్కువ. ఒకపుడు ఏదో విషయంపై ఆ రెండు గ్రామాల వారికి పెద్ద కలహం జరిగి, భోజరాయపల్లెవారు వెళ్ళి అమ్మపల్లెను తగుల బెట్టినారు. దానితో వారువచ్చి వీరి గ్రామాలను అంటించినారు. ఈవిధంగా ఆ రెండూ ఒకేసారి పరశురామప్రీతి అయినవి.

తన గ్రామం కాలిపోయిన పిమ్మట భోజరాయపల్లెవారు అడుగు మారి తమ భూమిలోనే మరికొంత దూరంలో గట్లనడుమ మరో గ్రామాన్ని కట్టుకున్నారు. అపుడది గట్లనడుమ యిప్పలలో ఉన్నది. కాబట్టి "గట్టు యిప్పలపల్లె" అయింది.

---

* సింగరాయపల్లెను అతని తరువాత మరో పురుషుకు తన పేర దాన్ని వీరన్న పల్లెగా మార్చినాడు అదిపుడుంది బ్రహ్మరాయపల్లె బ్రహ్మరాసి పల్లె, బొమ్మరాసిపల్లె అయింది అదిగూడా ఇపుడు అడుగుమారి కట్టు కున్నారు.

ఈ భోజరాయ సింగరాయసోదరులు శివోపాసకులు. అందుచేత తాము కొత్తగా స్థాపించిన గ్రామంలో కాళికాదేవితోపాటు పంచలింగ ప్రతిష్ఠలు చేసి మధ్వ సంప్రదాయానికి చెందిన వారు కాబట్టి అక్కడొక పెద్ద హనుమన్మూర్తిని ప్రతిష్ఠించవలెననుకొని ఉరుకొండపై తగినశిలను చూచి ప్రతిమను మలచినారు. కాని ముహూర్తసమయానికి హనుమంతుడు శిల్పికి కలలో కనిపించి తన నక్కడనుంచి తరలించ వద్దని, అక్కడనే ప్రతిష్ఠించమని ఆదేశించినాడు. దానితో వారిక ఆ స్వామిని అక్కడే నిలుపగా అది తెలిసి అక్కడి గ్రామస్తులు ముందుకు వచ్చి స్వామివారికి ఇపుడుండే ఆలయం కట్టించినారు.

ఈ స్వామి ప్రపత్తిమూర్తి ఆరడుగులుంటాడు. అతనికి తగినట్లు గర్భాలయం కూడా ఎత్తుగా ఉంది. ప్రాగ్దక్షిణాలకు రెండు వైపులకు ప్రధాన ద్వారాలున్నవి. ఆలయం చుట్టు విశాలమైన ప్రాకారం. యాత్రికులకొరకు సత్రాలుకూడా ఉన్నవి. ఈ సమూహం ఇక్కడ చూపరులకు రాజుదర్బారువలె ఠీవిగా కనిపిస్తుంది.

గ్రామంలో ఆలయ కమిటీ ఉంది. వారు నిర్వహణపై చక్కని శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇక్కడ పుష్య బహుళ ద్వాదశికి ఉత్సవం నడుస్తుంది. అపుడు స్వామివారి చుట్టు బండ్లు తిరుగుతవి. రథోత్సవం గూడ జరుగుతుంది. ఇక్కడి తేరు పూర్తిగా ఇనుపది.

ఇక్కడి పూజారులు నంబివారు. తూర్పు పెనిమిళ్ళ నంబి నారాయణగారు ఈ స్వామిపై ఒక శతకం రచించినాడు.

రామలింగేశ్వరాలయం - గుండాల

ఇది వెలిదండ మండలంలోని గ్రామం. కేంద్రానికి తూర్పున రెండుమైళ్ళలో ఉంటుంది. అక్కడ గ్రామం వెలుపల ఒక పెద్ద రాతి చారికలో ఏడు గుండా లేర్పడినవి. వానిలో నాలుగు ఒక చోట, మూడు ఒకచోట ఉన్నవి. అవి ఎంత లోతుగా ఉన్నవో ఎవరికీ తెలియదు. ఈ

బండ నేల సమంగా ఉంది కాబట్టి ఈ గుండాలు పుష్కరానికి ఒకసారి పొంగివచ్చి స్వామివారి పాదాలు తాకిపోతుంటవి.

గుండాల గుండంలో బెత్తం వేస్తే గుడిబండ గుండంలో తేలు తుందని వాడుక కాని, గుడిబండలు చాలా ఉన్నవి కాబట్టి ఈ సంబంధం ఎక్కడి నుండి ఎక్కడికి ఉందో తెలియదు. ఈ గుండాలను బట్టియే గ్రామాన్ని "గుండాల" అన్నారు.

ఇక్కడ ఈ గుండాల నాధారంగా చేసికొని రామలింగస్వామి ఆలయం కట్టబడింది. అది గుండాలకు ప్రక్కగానే ఉంది. ప్రాఙ్ముఖా లయం. దీనిలో శివుడు, పార్వతి, గణపతి ఉన్నారు.

ఇక్కడి ఉత్సవ మూర్తులు వెలిదండ రంగనాథాలయంలో ఉంటవి ప్రతి ఏటా ఇక్కడ పుష్యంలో ఉత్సవం సాగుతుంది. అపుడు ఉత్సవ మూర్తులను పల్లకిలో లాంఛనాలతో మంగళవాద్యాలతో ఇక్కడికి తెస్తారు.

పూర్వం గుండాలలో అంబా శంకరయ్యగారనే సాధకుడు ఉండెనట. ఆయన ఎల్లప్పుడు ఇక్కడి ఆలయంలో తపం చేసికుంటూ ఉండగా ఒకనాటి రాత్రి అతనికొక యక్షిణి కనిపించెనట. అతడామెను పట్టుకొనబోగా ఆమె ఒక గుండంలో దూకెనట. అతడామెతోబాటు దానిలో దూకి పెనుగులాడగా ఆమె శాటియొక్క కొంత ముక్క మాత్ర మతని చేతిలోనికి వచ్చి ఆమె అదృశ్యమాయెనని అనంతరం ఆ శాటివల్ల అతనికి కూడ కొన్ని మహిమలు కలిగెనని, పూర్వులు చెప్పేవారు.

ఇక్కడి గుండాలు నిట్రంగా ఉన్నవి కాబట్టి, వానిలో తరుచుగా పశువులు, మనుష్యులు జారిపడుతూ ఉండగా గ్రామస్థులిపుడు మూడిటిని రాతికడీలు కప్పి పూడ్చినారు. గ్రామస్థులిపుడు కమిటీ ఏర్పడి, ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు.

ఈ స్వామిపై సరికొండ లక్ష్మీనరసింహకవి రామలింగ శతకం రచించాడు.

రామాలయం - చిలువేరు

ఇది పూర్తిగా దుందుభీ తీరగ్రామం.

ఇక్కడ గ్రామానికంటె మొదట దుందుభీ తీరంలో ఒక పెద్ద అజగరం ఉండి, అది పశువులను మింగేదట. అజగరాన్ని తెలుగులో కొండచిలువ అంటారు. కాబట్టి దాన్ని చంపి ఇక్కడ గ్రామం కట్టినందుకు ఇది చిలువేరు అయిందట.

పూర్వం ఇక్కడ కొండచిలువ ఉంటె ఉండవచ్చు గాక. కాని చిలువ + ఏఱు = చిలువేరు నదీవాచకం కాబట్టి ఈ పేరు ఇక్కడ దుందుభీ నదికే ఉండవచ్చు ననిపిస్తుంది.

ఈ గ్రామంలో ప్రాచీనమైన శివాలయం, ఆంజనేయాలయం ఉన్నవి. అవి నిత్యపూజలతో విరాజిల్లుచున్నవి.

ఇక్కడికి రెంటచింతలనుండి కొత్త కాపులు వచ్చి స్థిరపడి కాలనీ కట్టుకున్నారు. తమ కాలనీలో వారిపుడు కొన్ని లక్షల వ్యయంతో పెద్ద రామాలయం కట్టించినారు. గుంటక సర్వారెడ్డి గారు ముందుకు వచ్చి ఈ ఆలయాన్ని నిర్మింపచేసినాడు. దానిలో ఇపుడు ప్రతి ఏటా రామ నవమి ఉత్సవం జరుగుతుంది:

వేణుగోపాలాలయం - చుక్కాపురం

ఇది తలకొండపల్లె మండలంలోని గ్రామం. అక్కడ ఇపుడు వేణుగోపాలాలయం ప్రసిద్ధంగా ఉంది. దానికి సంబంధించిన కథ ఈ విధంగా ఉంది.

ఈనాటి షాద్‌నగర్ తాలూకాలోని కమ్మదనానికి పూర్వం కామెవల్లి అని పేరు. అక్కడ వేణుగోపాలస్వామి ఆలయం ఉన్నది.

ఆ తాలూకాలో ప్రస్తుతం ఉన్న మధురాపురంలో ఒక దొరసాని ఉన్నది. ఆమెకు "రాజమాత" అని పేరు. ఆమె శ్రీకృష్ణ భక్తురాలు. ఒకపుడామెకు కృష్ణుడు కలలో కనిపించి తన ప్రీతిగా ఒక గ్రామాన్ని స్థాపించి అక్కడ తనకు ఉత్సవం ఏర్పాటు చేయమని ఆదేశించినాడు.

అపుడామె ఆ తాలూకాలో ఇపుడున్న గోపాలపురం, రేపల్లె అనే రెండు గ్రామాలు స్థాపించి శ్రీకృష్ణుని జన్మోత్సవం ఏర్పాటు చేసింది. మధురాపురంలోని కోటలో మొదట జన్మాష్టమినాడు రాత్రివేళ అతని జన్మోత్సవం, ఆ మరునాడు గోపాలపురంలో ఉట్లపండుగ, అనంతరం రేపల్లెలో జలక్రీడ జరిగేది.

రేపల్లె ఒక వాగుదగ్గర ఉంది. అది జమ్ము ఉన్న వాగు. గ్రామస్థులు దాన్ని జమ్మన్నవాగు అంటారు. మధురాపురంలో ప్రారంభమైన శ్రీకృష్ణ జన్మోత్సవం ఈ గ్రామంలో ముగిసేది. అపుడు శ్రీకృష్ణుని ఉత్సవమూర్తిని తెచ్చి ఇక్కడి వాగులో ఓలలాడించేవారు. అపుడిది యమునానది ప్రతిరూపాన్ని ధరించేది.

ఆమె అనంతరం ఒకపుడు పీర్ల పండుగ, కామునిపున్నమ రెండూ కలిసి వచ్చినవి. అపుడు ఏదో విషయంపై వర్గకలహం రేగి, తురకలు కామునిపున్నమనాడు కామునితోపాటు కామెపల్లిని గూడ కాల్చినారు. అపుడు దుండగులు అక్కడి ఆలయంపైన గూడ పడగా, పూజారులు ఆ రాత్రి ఏలాగో స్వామిని, అతని ఆభరణాలను, అర్చాసామగ్రిని తీసికొని గుడినుండి తప్పించుకుని ఆ రాత్రి అంతా ప్రయాణం చేసినారు.

అపుడు ఆ స్వామి పూలమాల దారిలో ఒక గ్రామంలో పడిపోయింది. అందుచేత ఆ గ్రామం నాటినుండి యిపుడు "పూమాలపల్లె" అయింది. కామదహనంనాడు కాలబెట్టబడిన కామెపల్లి నాటినుండి "కామదహనం" అయి, ఇపుడు "కమ్మదనం"గా మారింది.

ఆ రాత్రి వేణుగోపాలుని తీసికొని ప్రయాణం చేస్తున్న పూజారులు తెల్లవారిన పిమ్మట కలికిదొనకు చేరినారు. అక్కడికి వచ్చేవరకు వారు అలిసినారు గూడ. అక్కడికి చేరగానే అప్పుడు వారికి స్వామి తానక్కడనే నిలుస్తానని అంతరంగంలో స్ఫురింపజేసినాడు. దానితో ఇకవారు స్వామిని అక్కడనే ప్రతిష్ఠించి ఆలయం కట్టించినారు.

వారు అక్కడికి వచ్చినపుడు అక్కడ "కలికిదొన" అనే గ్రామం ఉన్నది. అది కాలాంతరంలో నష్టమై యిపుడక్కడ "చుక్కాపురం" అనే గ్రామం వెలిసింది. స్వామివారి ఆలయం ఇవుడు ఆ గ్రామం సివారులోనే ఉంది.

ఈ ఆలయం ఇపుడు ప్రాకార, గోపుర, మంటపాలతో చక్కగా ఉంది ఈ స్వామికి ఏటా ఫాల్గుణ పూర్ణిమకు ఉత్సవం జరుగుతుంది. దాన్ని వంతులవారీగా ఒక ఏడు చుక్కాపురం వారు, ఒక ఏడు తలకొండ పల్లెవారు నిర్వహిస్తారు.

ఈ స్వామిపై జంధ్యాల సుబ్రహ్మణ్య శర్మగారు ఒక శతకం గూడా రచించినాడు.

మల్లికార్జునుని గుడి - చెన్నవరం

తలకొండపల్లిలోగల ఈ గ్రామం ఆమనగంటికి పడమరగా ఎనిమిది కిలోమీటర్లలో ఉంది ఇక్కడ గ్రామానికి తూర్పున రెండు కిలో మీటర్ల దూరంలో ఒక గుట్ట, దానిపై ఈ ఆలయం ఉన్నవి.

గ్రామస్థు లీ గుట్టను మల్లప్పగుట్ట అంటారు. దీనిపైగల గుడి ప్రాచీనం. అది ఏకకూటాలయం. లోపలి స్వామి స్వయంభువు.

ఈ గుడిముందు ఒక గుండం ఉంది. దానిలో నీరు ఎల్లకాలం ఉంటుంది. స్వామి దర్శనానికి వెళ్ళినవారు అందులోనుండి నీరు చేదుకొని స్నానం చేస్తారు శివరాత్రికి యిక్కడ ఉత్సవం జరుగుతుంది.

ఈ గుట్ట వెనుక పశ్చిమంగానే 'నేరెళ్ళ కోలు' అనే వాగు ఉంది. అది వేసవిలో పశువులకు, వర్షాకాలంలో సేద్యానికి జలాధారంగా ఉంటుంది

మల్లికార్జునాలయం - తరణికల్లు

ఇప్పుడిది కలువకుర్తి మండలంలోని గ్రామం; నాగర్ కర్నూలు నుండి కలువకుర్తి సర్వీసు రూటులో ఉంది.

పూర్వం యిది సౌరక్షేత్రం. వర్ధమానపుర శాసన కర్తలైన అభినవ మయూర సూరి వంశీయులు ఈ గ్రామవాసులు. మయూరుడు సూర్యోపాసకుడు కనుక సౌరక్షేత్రమైన ఇక్కడి కవులు మయూరనామం తమకు బిరుదుగా స్వీకరించినారు.

షణ్మతాలలో సౌరంకూడా ఒకటి. శివపంచాయతనంలో ఆదిత్యునిదే మొదటి స్థానం. అందుచేత ఈ జిల్లాలో ప్రత్యేకంగా సూర్యాలయాలు కూడా వెలసినవి.

పూర్వం ఈ గ్రామంలో రామాలయం, సూర్యాలయం, శివాలయం, దేవీ ఆలయం, భైరవాలయం, వేణుగోపాలాలయం అని ఆలయాలు చాలా ఉన్నవి కాని, ప్రస్తుతం వీనిలో ఏ ఒక్కటి సువ్యవస్థితంగా లేదు.

మల్లికార్జునాలయంలో నిత్యార్చన ఉంది కాని అందలి మూర్తి శివునిది కాదు. అది ప్రసన్న భైరవునిది. భైరవునితోబాటు భైరవికూడా ఉండడం ఇక్కడి విశేషం ఈ స్వామిని నిలిపిన ఆధార పీఠం సూర్యునిది. దానిపై సప్తాశ్వాలున్నవి. ఆలయం కోదండ రామునిది ద్వారపాలకులుగా ధనుష్పాణులున్నారు.

ఆంజనేయాలయంలోనే శివుడు, నందీశ్వరుడు ఉన్నారు. వేణుగోపాలాలయంలో మూర్తి గోపాలునిదే కాని, ఆ ఆలయం మాత్రం

శివునిది. ఇక్కడి భైరవమూర్తులు మిక్కిలి సుందరంగా ఉన్నవి. అవి ఈ ఆలయం వెలువల పడి ఉన్నవి.

ఈ విధంగా ఇక్కడి గుడులన్నీ ప్రస్తుతం నష్టాశ్వ దగ్గరథ న్యాయంగానే ఉన్నవి. ఇంకా వివరాలకు. చూ. మూసీ. 1981 అక్టోబర్. పు. 53.

రామాలయం - తలకొండపల్లె

ఈ గ్రామం ఒక మండల కేంద్రంగా ఉంది.

ఇక్కడ ఊరికి ఈశాన్యంగా ఒక కొండ, దానిపై ఒక పెద్ద గుండు-మనుష్యుని తల ఆకారంలో ఉన్నవి. ఆ గుండునుబట్టి గ్రామాన్ని తలకొండ అని, తలకొండ సమీపంలో ఉంది కాబట్టి ఈ గ్రామాన్ని తలకొండపల్లె అని పిలిచినారు. ఇపుడిది మండల కేంద్రం.

ఈ గ్రామంలో రామాలయం ప్రసిద్ధి. అది పురాతనమయింది. ప్రతి ఏటా అక్కడ రామనవమి ఉత్సవం నడుస్తుంది.

గట్టు ఇప్పలపల్లె ఇపుడిదే మండలంలో ఉంది.

కోదండరామాలయం - పందుగుల

ఇది కలువకుర్తి తాలూకాలోని గ్రామం. కేంద్రానికి 6 కిలోమీటర్ల దూరంలో ఉంది.

పూర్వం ఇక్కడికి కడప జిల్లాలోని నెరవెట్లనుండి ఒక రెడ్డిగారు తమ పరివారమైన ఒక కమ్మరి, ఒక చాకలి, ఒక బంటు, ఒక మాదిగతో వచ్చి గ్రామాన్ని స్థాపించినాడు. అది అపుడు అయిదు కులాలవారిచేత ఏర్పడింది కాబట్టి ప్రజలు దాన్ని "పంచకుల" అన్నారు. అది క్రమంగా నేటి "పందుగుల"గా మారింది.

ఇక్కడికి వచ్చిన రెడ్డిగారు ఒంటిమిట్ట కోదండరాముని భక్తుడు. కాబట్టి ఆయన ఇక్కడ ఒక ఆలయం కట్టించి, దానిలో కోదండరాముని ప్రతిష్ఠించినాడు.

ఆయన వెంట వచ్చిన బంటుకు తెప్పవారని పేరు. అతని పూర్వులు కావేరీ నదిలో తెప్పనడిపేవారట. అందువల్ల వారికది యింటి పేరుగా నిలిచింది. గత శతాబ్దిలో మా జిల్లాలో పేరు చెందిన వేపూరు హనుమద్దాసు ఈ తెప్ప వంశానికి చెందినవాడు. అందుచేత ఆయన తనను ఒంటిమిట్ట కోదండరాముని భక్తుడనని చెప్పుకున్నాడు.

ఒకనాడు ఆయన ఇక్కడికి వచ్చి ఆలయం ముందు అరుగుపై కూర్చోగా కొందరు కొంటెవారు ఆయన వేషాన్ని చూచి హేళన చేసిరట. అపుడాయన అక్కడనే కూర్చుని "వింటివే రామయ్యా, కొంటెముండ కొడుకుల జోలి" అని ఆశువుగా ఒక కీర్తన చెప్పినాడు.

ఇపుడిక్కడ ఏటా శ్రీరామ కల్యాణం నడుస్తుంది.

హరిహరాలయం - భైరంపల్లె

ఇది జడ్చర్ల నుండి కలువకుర్తి రోడ్డులో ఉంది. ఇక్కడ గ్రామం వెలుపల ఒక గుట్ట, దానికి దక్షిణం వైపున నిలువెత్తు భైరవ విగ్రహం ఉంది. కాబట్టి అతని పేర గ్రామం భైరవుని పల్లె - భైరంపల్లె అయింది. ఇది మిడిజిల్ల మండలంలోనిది.

పూర్వం ఈ ప్రాంతమంతా లోకాయపల్లె వారి సంస్థానం. వారు భైరవోపాసకులు కనుక ఇది వారి కులదైవం పేర వెలసిన గ్రామం కావచ్చు.

ఇక్కడ ఊరి వెలుపల గుట్టదగ్గర రెండు గుడులు ఉన్నవి. వానికి హరిహరాలయాలని పేరు. అవి భైరంపల్లె తిరుమలరాయ కవి శా. శ. 1811 లో కృష్ణార్పణంగా కట్టించినట్లు ఆలయ ముఖ మండపం లోని శాసనం చెబుతుంది.

ఈ రెండు ఆలయాలు జతగా ఉన్నవి. విష్ణ్వాలయానికి మాత్రమే ముఖమండపం ఉంది

ఈ కవిని గురించి గోలకొండ కవుల సంచికలో ఉంది. వీరు మధ్వులు తిరుమలరాయకవి తల్లిదండ్రులు గోదమ్మ, శేషయ్యగారలు. కవిగారి అన్నగారు కృష్ణరాయలు సోదరుడైన తిరుమలరాయలు చతుర్థాశ్రమం స్వీకరించి తనకు భవబంధ మోచనానికై ఈ ఆలయాలు కట్టించి, ఒక కోనేరు త్రవ్వించి, తోట వేయించి వానిని కృష్ణార్పణం చేసినాడు. కోనేరు ఈ గుడుల వెనుక ఉంది, శిథిలమయింది కాని, ఆలయాలు చక్కగానే ఉన్నవి. స్వామి ప్రతిష్ఠలుగూడా ఉన్నవి.

ప్రస్తుతం కవిగారి వంశం అక్కడలేదు కాని, గ్రామస్థులు శ్రద్ధ తీసుకొని ఈ ఆలయాలకు నిత్యార్చన బ్రహ్మోత్సవాదులు గూడా నిర్వహించినట్లయితె చక్కగా రాణించగలవు.

కోదండరామాలయం - మాధవవరం

ఇది మిడిజిల్ల మండలంలోని గ్రామం. నాగర్‌కర్నూలు నుండి జడ్‌చర్ల సర్వీసు రూటులో ఉంది. దీనికి మఖామాధారం అని పేరు. ఈ గ్రామంలో కోదండరామాలయం ప్రసిద్ధి ఇక్కడి రామాలయాన్ని గొబ్బూరు రామారావుగారు అనే కరణంగారు కట్టించినాడు.

ఇది దక్షిణాభిముఖాలయం. సాధారణంగా రామాలయాలు దక్షిణాభిముఖంగా ఉండవు కాబట్టి ఇది దీని ప్రత్యేకత. ఇది విశాలమైన ఆవరణలో శిల్పశోభితంగా ఉంది. ఈ ఆలయానికి మహాద్వారం, విమానం ఉన్నవి.

ఆలయంలోని మూలమూర్తులు నల్లరాతివి మనోహరంగా జీవకళతో ఒప్పారుచున్నవి.

ఈ ఆవరణలోనే శివప్రతిష్ఠ, నవగ్రహప్రతిష్ఠ కూడా ఉన్నవి. శివాలయంలో గణపతి-పార్వతి-నందీశ్వర ప్రతిష్ఠలు కూడ ఉన్నవి. ఇది ప్రాఙ్ముఖంగా ఉంది.

గ్రామస్థులు ఈ ఆవరణలో ఆలయంచుట్టూ కొబ్బరచెట్లు పెంచి దీనికి చక్కని ఆరామ వాతావరణం కూడా కల్పించినారు.

ప్రాకారంలో యాత్రికుల కొఱకు మూడువైపులా సత్రాలున్నవి. ఈ ఆవరణ ఊరుకొండపేట ఆలయంకంటే విశాలంగా ఉంది. ఇది రావిచేడు దారిలో ఉంది. పూర్వం రావిచేడు పాపకవి ప్రసిద్ధుడు. అతని పేరు జటప్రోలులోని జటేశ్వరాలయంలో ఉంది.

శివాలయం - మిడిజిల్ల

జిల్లెళ్ళ - మిడిజిల్ల వృక్షవాచకాలు. మిడిజిల్లెడు ఆకులు,పూరేకులు మామూలు జిల్లెడు కంటె కొంత పలుచగా చిన్నగా ఉంటవి. జిల్లెడును అర్క అంటారు. కాబట్టి అది సూర్య సంబంధి. అయితే దీన్ని చంద్ర సంబంధిగా భావిస్తారు.

ఈ గ్రామంలో ప్రాచీనమైన శివాలయం ఉంది. లోపల ప్రతిష్ఠ బాగానే ఉంది కాని ప్రాకారం కూలిపోయింది.

తంత్ర విధానంలో శివుని జిల్లెడు పూలతో కూడ పూజిస్తారు. ఇప్పటికి ఉజ్జయినిలో మహాకాలుని ఆలయం ముందు గల పూలదండల వారు వానిలో జిల్లేడు పూలు కుచ్చుతారు.

బహుశః ఇక్కడ పూర్వం ఉండే జిల్లెడు చెట్లను అనుసరించియే ఇక్కడ ఈ శివప్రతిష్ఠ చేసివుంటారు. కాబట్టి గ్రామస్థులిది తప్పక ఉద్ధరించుకోదగిన ఆలయం.

ఇపుడీ గ్రామం ఒక మండల కేంద్రం.

హనుమదాలయం - రాచూరు

ఇది కూడా వెలివండ మండలంలోని గ్రామం. జడ్చర్ల నుండి కలువకుర్తి రోడ్డులో రెండవ స్టేజి. పాలమూరువారి సూర్యలక్ష్మి కాటన్ మిల్స్ దగ్గర దిగవలె. అక్కడికి గ్రామం 9 కిలోమీటర్లు ఉంటుంది. ఈ దారిలో వెంగంపల్లె అనే మరో పల్లె కూడ తగులుతుంది.

రాచూరు ప్రాచీన గ్రామం. అక్కడ చెఱుకు బొల్లయరెడ్డిగారి వియ్యంకుడు వావిలాల రుద్రిరెడ్డి వేయించిన శాసనం ఒకటి ఉంది. అది క్రీ. శ. 1087 నాటిది పూర్వం ఇక్కడ అందరూ రాజబంధువు లుండ వచ్చు. అందుచేతనే ఇది రాచ ఊరు అయింది.

ఈ గ్రామంలో హనుమదాలయం ప్రసిద్ధంగా ఉంది. అది గత శతాబ్దంవరకు నేలలో పూడి ఉన్నది. పైన ఒక దిబ్బ మాత్రం కనిపించేది. అలా ఉండగా అక్కడి కరణం కోవూరి రాంరావుగారికి ఒకపుడా దిబ్బ క్రింద ఆలయం ఉన్నట్టు కల వచ్చింది.

సాధారణంగా సదాచారులకు వచ్చే స్వప్నాలు వ్యర్థంకావు. అందు చేత ఆయన తనకు కలిగిన కలననుమానించి మరునాడాదిబ్బను కొంత త్రవ్వించి చూచినాడు. ఆలయం యొక్క పై భాగం కనిపించింది. దానితో ఇక ఆయన ఆ దిబ్బనంతా త్రవ్వించి, ఆలయాన్ని పూర్తిగా బయటికి తీయించినాడు. ఇది ఎనుబదేండ్ల నాటి మాట.

ఇది దక్షిణాభిముఖాలయం. దీనిలో ప్రధానమూర్తి హనుమంతుడు. అతనికి కుడివైపున వెంకటేశ్వరుడు, ఎడమవైపున లక్ష్మీదేవి ఉన్నారు. వారికి ఆలయాలు వేరువేరుగా ఉన్నాయి.

ఇదిగాక ఇక్కడ రంగనాథాలయం కూడా ఉంది.

నృసింహాలయం - వెలిజాల

ఇది తలకొండ మండలంలోని గ్రామం. ఇది కలువకుర్తి జడ్చర్ల రూటులో ఉంది.

పులిజాల - వెలిజాల జలవాచకాలతో వెలసిన గ్రామాలు. పులి జాల దగ్గర ఊరి ముందు పులినీరు వంటి జాలుంది. వెలిజాల గ్రామం చుట్టు గుట్టలున్నవి. వర్షాకాలంలో ఇక్కడ రెండు పెద్ద గుట్టల నడుమ నుండి తెల్లని పాలవంటి నీటి ప్రవాహం వస్తుంది. అందుచేత ఈ గ్రామాన్ని 'వెలిజాలు' అని పిలిచినారు. పూర్వం యిక్కడ యజుర్వేదు లెక్కువ కాబట్టి గ్రామాన్ని "యజురాల" అనిగూడ అనేవారు.

ఇక్కడ శివాలయం, రంగనాథాలయం, నృసింహాలయం-ఇవి గాక గ్రామానికి నలువైపులా నాలుగు ఆంజనేయాలయాలున్నవి. వానిలో ఉత్తరం దిక్కుగల ఆంజనేయుని చింతక్రింది హనుమాండ్లు అంటారు. గ్రామస్థులీ స్వామినే ఎక్కువగా పూజిస్తుంటారు.

కార్తీకంలో వైశ్యులలో ఒక వర్గంవారు దక్షిణం ఆంజనేయునికి, మరో వర్గంవారు ఉత్తరం ఆంజనేయునికి ఆకు పూజులు చేస్తారు.

ఇక్కడి వానిలో శివాలయ రంగనాథాలయాలు పురాతనాలు. శివాలయం ఊరిలోనే ఉంది. చక్కగా ఉంది కాని, నిత్యపూజ మాత్రం లేదు. రంగనాథాలయం గ్రామానికి తూర్పుగా ఒక గుట్టపై ఉంది. ఇది చోళుల నాటిది. ఏకకూటాలయం. మూలస్వామి శేషశాయి. పాదాల దగ్గర శ్రీదేవి, భూదేవి ఉన్నారు. ఇవి చిక్కని చక్కని మూర్తులు కాని విరుగ కొట్టబడినవి.

ఇక్కడి నృసింహస్వామి స్వయం వ్యక్తుడు. అతడు గ్రామం ముందుగల ఒక గుండుకు చిన్నపాటి గుహ ఏర్పడి దానిలో వెలసినాడు. గ్రామస్థులు దాని చుట్టు గుండ్రని గోడకట్టి ఆలయ రూపమిచ్చినారు. అది తప్ప ఇక ప్రాకారమని, వేరే గుడి అని మరేదీ లేదు.

గ్రామస్థులీ గుహ ఏటేటా పెరుగుతుంది అంటారు. ఒకప్పుడు లోపలికి వెళ్ళరాకుండా ఉండేదట కాని ఈనాడు మనిషి వెళ్ళి దానిలో కూర్చోవచ్చు. ఇక్కడ మరో గుండుపై స్వామి వారి పాదముద్ర ఉంది. స్వామి ఆ గుహలోనికి వెళ్ళేముందు అక్కడ కొంతసేపు కూర్చున్నాడని ప్రజల నమ్మకం.

గ్రామస్థులు ఏటా ఈ గుట్టపై నృసింహజయంతి వైభవంగా చేస్తారు. అంతేగాకుండా కృష్ణాష్టమినాడు ఉట్లు కూడ ఇక్కడనే కొడతారు. దసరానాడు ఈ గుడిక్రిందనే జమ్మికొమ్మను పాతి పూజిస్తారు.

చింతక్రింద హనుమాండ్లు గుడి ఈ గుట్టక్రిందనే ఉంది. ఆ గుట్ట ప్రక్కనుండి పైకి వెళ్ళడానికి మెట్లు కట్టినారు. అవి యిరువది ఉన్నవి. వానిముందొక ప్రకృతిసిద్ధమైన చిన్నగుండం కట్టినారు. మెట్లముందుండే దానిలో మాత్రం నీరు ఎప్పుడూ ఉంటుంది.

ఈ స్వామిపై స్థానికుడైన శ్రీ ఎన్. గోపాలరావుగారు ఒక చక్కని స్తుతికావ్యం వ్రాసినాడు.

ఈ గుడిముందు ఒక పెద్దగుండు ఉంది. సుమారు నూరేండ్లనాడు అది నిలువునా విచ్చుకున్నది. ఈ గుట్టలోని గుహలోవలెనే ఆ రాతి పగులులో శ్రీరామపట్టాభిషేకం రూపు దిద్దుకుంటుంది అని ప్రజల నమ్మకం.

౧౧

వెలిదండలో వెలసిన ఆలయాలు

ఇది కలువకుర్తి తాలూకాలోని గ్రామం. ప్రస్తుతం ఒక మండల కేంద్రం.

ఈ గ్రామాన్ని గురించి ప్రజల్లో ఈ క్రింది కథ ప్రచారంలో ఉంది. పూర్వం ఇది రెడ్డి దొరల గ్రామం. దేశం తురుష్కాక్రాంతమైనపుడు వారిపై ఒక తురక సరదారు దండెత్తి ఆక్రమించుకొని, దీనికి 'సుల్తాన్‌పూర్' అని పేరు పెట్టినాడు. అపుడిక్కడ ఉన్న దొరలు తమ కోటను విచ్చుకొని కాకునూరికి వెళ్ళిపోయినారు. కాని వారి మంత్రి మాత్రం ఎక్కడికీ వెళ్ళలేదు. దాన్ని ఆక్రమించుకున్న నవాబుగారి దగ్గరనే దివాన్‌జీగా కుదిరినాడు.

గ్రామాన్ని ఆక్రమించుకున్న కొన్నేండ్లకు నవాబుగారికి మక్కా వెళ్ళాలని బుద్ధి పుట్టింది. ఆయన గ్రామాన్ని మంత్రిగారికి అప్పగించి నిశ్చింతగా వెళ్ళి వచ్చినాడు కాని, ఆయన వచ్చే నాటికి దివాన్‌జీగారు ప్రజలనందరినీ కూడ గట్టుకొని అతనిపై తిరుగబడినాడు. అపుడు నవాబుగారు నైజాంగారి దగ్గరకు వెళ్ళి, తనకు దివాన్‌జీగారు చేసిన ద్రోహం చెప్పగా ఆయన అతనికి సైన్యాన్ని సహాయంగా యిచ్చినాడు.

నవాబు సైన్యాన్ని తీసికొనిరాగానే దివాన్‌జీ అదిచూసి కోటనుండి తప్పించుకొని పారిపోగా సైన్యం అతనిని పట్టుకొని తల నరికింది. అపుడు వారతని కుటుంబాన్ని మొత్తం ఆ విధంగా నరుకుతూ ఉండగా ఆ దారుణం చూడలేక ఆ గ్రామంలోని ఒక కమ్మరి వనిత ఏలాగో ఆ కుటుంబంలోని ఒక బాలుని తమ యింటిలోనికి తీసికొని వెళ్ళి రక్షించినదట. ఆ పిల్లవాడే పెరిగి, తరువాతి కాలంలో ఈ ప్రాంతంలోని వెలిదండ వారనే నియోగులకు మూలపురుషుడైనాడట.

మరో కథ ప్రకారం నవాబు నైజాంగారి దగ్గరకు కాక దాని సమీపంలోని మునుల గుట్టపై తపం చేసికునే మునుల దగ్గరకు వెళ్ళి దివాన్‌జీగారు తనకు చేసిన విశ్వాసఘాతం చెప్పుకోగా వారు జాలి తలచి ఒక యోగదండాన్ని మంత్రించి యిచ్చినారు. దాన్ని తీసుకొని వచ్చినాడు. ఆ యోగదండం సుదర్శనంవలె దివాన్‌జీ కుటుంబాన్ని బయటికి తరిమింది. అపుడు వారు పారిపోతుండగా నవాబు ఒకచోట వారి తలలు కొట్టినాడు. ఆ స్థలం తలకొట్లపల్లెయై ఇపుడు తలకొండపల్లె అయింది.

అక్కడినుండి తప్పించుకుని పారినవారిని మరోచోట పట్టుకొని కడసారిగా తలలు నరికినాడు. అది "కడతల"యై ఇపుడు "కడ్తాల" అని పిలువబడుతుంది.

ఈ విధంగా అతడు శత్రువులను నిశ్శేషంగా వధించి గ్రామానికి వచ్చి తనకు యోగదండం యిచ్చిన మునులను ఘనంగా సత్కరించి వారికి వెండితో పెద్ద పెద్ద దండలు చేయించి వేసి ఊరేగించినాడు. ఆనాటినుండి సుల్తాన్‌పూరు 'వెండిదండలు'అయి, ఇపుడు "వెలిదండ"గా నిలిచింది.

ఇటువంటి కథలు మన గ్రామాలలో చాలావాటికి ఒక్కటో అరో ఉండనే ఉన్నవి. ఇక్కడ మచ్చుకు ఒకటి చెప్పినాను. కాని ఈ గ్రామ నామం నిజానికి వెండిదండలు కాని, వెలితండగాని కాదు. "వెలితాంద్ర." ఇది వృక్షవాచకం.

ఈ గ్రామంలో ప్రస్తుతం-

3 హనుమదాలయాలు	3 విష్ణ్వాలయాలు
2 శివాలయాలు	1 వీరభద్రాలయం
2 పోచమ్మ గుడులు	1 మైసమ్మ గుడి
8 మసీదులు	1 గుంబద్ 1 కుతుబ

ఉన్నవి. ఇక్కడి విష్ణ్వాలయాలలో రెండు రంగనాథాలయాలు, ఒకటి చెన్నకేశవాలయం. గ్రామకంఠంలో మాదిగ పోచమ్మ ఉంది. ఆమెను హరిజనులు, పాటిగడ్డన ఉన్న పోచమ్మను హరిజనేతరులు పూజిస్తారు.

పాటిగడ్డ గ్రామకంఠానికి రెండు ఫర్లాంగులపై ఉంది. అది గ్రామానికి మొదటి పీఠం. అక్కడ ఆంజనేయుడు-పోచమ్మకు పడమరగా మైసమ్మ ఉన్నారు. కాని ఈ ఆంజనేయునికి పూజ లేదు.

ఈ ఆంజనేయునికి దక్షిణంగా చెన్నకేశవాలయం ఉంది. దానిలో మూర్తి లేదు. ఆలయం ముందుగల కోనేరులో సత్రాలున్నవి. వానిలో ఒకదాని స్తంభంపై దశావతారాలున్నవి. ఒకప్పుడీ కోనేట పూడిక తీస్తుండగా కోదండరాముని హస్తం, మూతి విరిగిన హనుమంతుడు, మురళీకృష్ణుని పాదాలు, ఆళ్వారుల కబంధాలు బయటపడినవి.

ఈ పాటిగడ్డ అంతా గుట్టలమయం. ఇక్కడ రెండవ గుట్టపై రంగనాథాలయం ఉంది. అందులోని మూర్తి శేషశాయి మిక్కిలి సుందరంగా ఉంది.

గ్రామానికి పడమటి కంతలో వీరభద్రాలయం ఉంది. ఊరికి ఉత్తరంగా రెండవ వీథి దగ్గర మరో రంగనాథాలయం ఉంది. ఈ ఆలయాలలో పూజలున్నవి.

గుండాలలోని స్వామిని ఈ రంగనాథాలయంలోనే ఉంచి, ఏటేటా అక్కడికి పల్లకిలో తీసికు వెడతారు.

మరిన్ని వివరాలకు చూ. భారతి. 1977 మే.

చెన్నకేశవాలయం - వెలుగోమ్ముల

ఇది మిడిజిల్ల మండలంలోని గ్రామం. ఇక్కడ చెన్నకేశవాలయం ప్రసిద్ధంగా ఉంది. ఇది చాలా పెద్ద ఆలయం.

ఈ గ్రామం ప్రాచీనమయింది. పూర్వం ఇక్కడ యుద్ధభటు లుండేవారని అంటారు.

ఇక్కడి చెన్నకేశవునిపై వెంకటాచలకవి సత్యహరిశ్చంద్ర నాటకాన్ని రచించినాడు. దాన్ని వెలుగొమ్మల వరవర వెంకటనారాయణ గారు 1939 లో శ్రీ శారదా ముద్రణాలయంలో అచ్చువేయించినాడు.

వేణుగోపాలాలయం - సరికొండ

ఇది కలువకుర్తి తాలూకాలోని "ఆమనగల్లు" మండలంలో ఉన్న ఊరు. పూర్వం ఇక్కడ దొరలున్నారు. ఇపుడు వారి కోట గ్రామ సమీపంలోని గుట్టపై ఉంది. అందుచేత దాన్ని ఖిల్లా గుట్ట అంటారు. ప్రాచీనమైన వేణుగోపాలాలయం ఆ ఖిల్లాలోనే ఉంది. దాని వెనుక "కల్లెడవాగు" పేర ఒక వాగుకూడ ఉంది. దాని తీరంలో శివాలయం ఉంది.

ఈ ఆలయం చక్కగానే ఉందిగాని కోట విడిచిపెట్టినారు కాబట్టి గ్రామస్థులిపుడు ఊరిలో మరో వేణుగోపాలాలయం కట్టించినారు. అది విశాలంగా అన్ని హంగులతో ఉంది.

ఈ ఆలయంలో కన్యా సంక్రమణంలో శ్రవణా నక్షత్రంనాడు నిగమాంత మహా దేశికులవారి "దేశికర్" ఉత్సవం, ఫాల్గుణంలో బ్రహ్మోత్సవం నడుస్తవి.

పూర్వం ఈ తాలూకాలో సరికొండ పెద్దమ్మ ప్రసిద్ధి ఆమె భయంకరురాలు అని చెప్పేవారు.

ఒకపుడు ఇక్కడ భట్రాజులున్నారు. వారి కుటుంబం కవిత్వానికి ప్రసిద్ధిగా ఉండేది. వీరు అప్పకవికి సమకాలికులని, ఆ కాలంలోనే ఇక్కడినుండి పల్నాడుకు వెళ్ళినారని చెబుతారు.

శ్రీరామాలయం - సిరుసనగండ్ల

ఇది కలువకుర్తి తాలూకాలో చేరిన వంగూరు మండలంలోని గ్రామం. ఈ గ్రామం కలువకుర్తి నుండి చారగొండ రూటులో ఉంది. ఆలయం గ్రామానికి రెండు మైళ్ళ దూరంలో ఒక గుట్టపై ఉంది. ఈ గుడి దగ్గరకు సిరుసనగండ్ల నుండి గాని చారకొండ డాగుబంగ్లా దగ్గర దిగికాని వెళ్ళవచ్చు.

ఈ పేర హుజూరునగర్ తాలూకా (నల్లగొండ)లో గూడా ఒకటి వుందికాని అది నృసింహ క్షేత్రం ఇది శ్రీరామ క్షేత్రం. దీన్ని గిట్టు అని సామాన్యులు పిలుస్తారు.

ఈ గట్టుపై శ్రీరాముని కంటె మొదట పోచమ్మ ఉంది, అతని నక్కడికి రానీయలేదట. అపుడు లక్ష్మణుడు కోపించి ఆమె ముక్కు-కోసెనని - అది అతని అలవాటు - దానితో ఆమె ముక్కిడి పోచమ్మ ఆయెనని వదంతి. ఇపుడీమె గుడి రామాలయానికి దక్షిణంగా కొంచెం దూరంలో ఉంది.

లక్ష్మణుడు ముక్కుకోసి ఆమెను తరిమివేయగా - శ్రీరామునితో ఆమె నేనీచోట తరతరాల నుండి ఉంటున్నాను, ఇక్కడ నుండి వెళ్ళితె నా గతి యేమిటి అని అడిగెనట. అపుకు రాముడామెపై కరుణించి, అయితె నీవు మాకు దూరంగా ఇక్కడనే ఉండు. ప్రజలు మొదట నిన్ను పూజించిన పిమ్మటనే నన్ను పూజిస్తారు అని సెలవిచ్చినాడట. ఈ కథను శ్రీమాన్ వంగూరు లక్ష్మణాచార్యులు గారు హరికథగా రచించినారు. అది ముద్రితం.

సామాన్యులిక్కడి పోచమ్మకు కోళ్ళను బలి యిస్తారు ఈ దేవతకు కుమ్మరులు పూజారులు.

ఇక్కడి రామాలయం పెద్దగా ఉంది, దానిచుట్టు విశాలమైన ప్రాకారం ఉంది. పాలమూరు జిల్లాలో ఎండవెట్ల ఫకీరగారు ధర్మకార్యాలకు ప్రసిద్ధి. ఆయన ఒకపుడు కలువకుర్తి మాములాకు మ్రొక్కి వెళ్ళినాడు. అతనికి పని అమలయింది. దానితో అతడు ఇక్కడ గుట్ట అంచున కోనేరు త్రవ్వించినాడు. గుడి ప్రాకారాల నడుమ కోలెడు పొడవు, మూరెడు వెడల్పు, పూటు మందంగల కాసెబండలు తీయించి పరిపించినాడు.

ఈ ఆలయం చుట్టూ తాళ్ళు ఉండి వానిలో మర్రిపిల్లలు పుట్టగా వాటిని నరికించి, మర్లను తీయించి మూడెకరాలలో పెద్ద మర్రివనం పెట్టించినాడు.

ఆ మర్రితోటలో తూర్పు పెనిమెళ్ళ దొరసాని శారదమ్మగారు, నా ..క్ కర్నూలు చిప్పవారు సత్రాలు కట్టించినారు.

అక్కడ ఇపుడున్న తేరుగూడా ఫకీరగారే చేయించినాడు. అంత వరకు అక్కడ ఇంకా పెద్ద తేరున్నది కాని, అది విరిగివుండగా దీన్ని చేయించి దాని చక్రాలే ఈ తేరుకు సరిపడ చిన్నగా మలిపించినాడు.

ఈ స్వామికి కైంకర్యాలు చేసిన పిమ్మటనే ఫకీరగారికి మొదటి సంతానం కలిగినదట

ఈ క్షేత్రం మన్నెంకొండకంటే మొదటిది. ఇక్కడి అర్చామూర్తులను రంగాపురం గున్నసీతారాంరెడ్డిగారు చేయించినారు. వానిని ఆ గ్రామ నివాసియేయైన చింతోజు వీరయ్యగారు చేసినాడు.

ఈ ఆలయానికి ధేరంవారు అనువంశికమైన పూజారులుగా ఉన్నారు. రంగాపురంలోని పప్పువారు గూడా పూజాదికం నిర్వహిస్తుం

టారు. ఈ వంశంలోని పప్పు లక్ష్మణాచార్యులుగారు మంచి వేపురికార్డరు. ఆయనకు గాంధీ, నెహూౄ, శాస్త్రి మొదలైన మహనీయుల యొక్క వివిధ భాషల ఉపన్యాసాలన్ని కంఠస్థంగా ఉన్నవి. వారి బాణీలోనే అవి అప్పజెబుతాడు. ఇదొక అద్భుతం.

ఈ క్షేత్రస్వామిపై తాళ్ళవల్లి నివాసి ఇమ్మడిజెట్టి చంద్రయ్య గారు మనోహరమైన బృహత్కావ్యం రచించినాడు. అది ఒక స్థల చారిత్రక ప్రబంధం.

ఈ పేరున నల్లగొండ జిల్లాలోని హుజూర్‌నగర్ తాలూకాలో గూడ ఒక గ్రామం ఉంది. మరింగంటి కవులందరూ అక్కడ ఉన్న నరసింహస్వామి భక్తులు.

కొల్లాపురం తాలూకా కోవెలలు

కొల్లాపురం తాలూకాకు పూర్వం జటప్రోలు సీమ అని పేరు. జటప్రోలు అక్కడికి కొంతదూరంలో ఉంది. అది కృష్ణాతీర గ్రామం కాబట్టి ఇపుడు శ్రీశైలం ప్రాజెక్టు మునకకు గురయ్యింది.

కొల్లాపురం గూడ క్రీ. శ. 1840 ప్రాంతంవరకు రాజధాని గాదు. కొలుములపల్లె అనే సామాన్య గ్రామం. అంతవరకు దాని రాజధాని ఎల్లూరు. అక్కడినుండి దాన్ని రాజా వెంకట లక్ష్మారావుగారు ఇక్కడికి మార్చి దానిని అభివృద్ధి చేసినారు.

ఎల్లూరు కృష్ణాతీరంలోని అగస్తేశ్వరం, సోమేశ్వరం ఆలయాలు కట్టిన శిల్పులకు ఈయబడిన స్థలం. ఎల్లోజు, మల్లోజు, సోమోజు అని వారు ముగ్గురు సోదరులు.

ఎల్లూరు స్థలాన్ని పొందిన పిమ్మట ఈ సోదరులు అక్కడ ఒక గ్రామాన్ని స్థాపించుకొని, కొంత కాలం ఆ ప్రాంతానికి దొరలుగా చెలామణి అయినారు. వీరి రాజ్యం నేటి సింగపట్నంవరకు వ్యాపించి ఉన్నది.

పెద్దవాడైన ఎల్లోజు పేర వారు ఎల్లూరును స్థాపించి, అక్కడ పెద్ద కోట కట్టి, దానిలో విశ్వకర్మను, అతనితోబాటు సానగ మహర్షిని ప్రతిష్ఠించి, ఆ ఆలయం ముందు విశ్వకర్మ స్తూపం ఎత్తించినారు ఇపు డెల్లూరిలో ఆ కోట యొక్క తూర్పు ద్వారం, పశ్చిమ భాగంలో ఆ స్థూపం మాత్రం మిగిలినవి.

విశ్వకర్మాలయం నష్టం కాగా ఈనాడా ఆలయంలోని మూర్తులు కొల్లాపురంలోని రాణి యిందిరాదేవి జూనియర్ కాలేజీలో ఉంచబడినవి.



మల్లేశ్వరం ఆలయాలు - కొల్లాపురం తాలూక

1063

విశ్వకర్మలలోని అయిదు దాయిలలో కమ్మరం అన్నిటికంటె మొదటిది. అది అన్నిటికి తండ్రి కాబట్టి పెద్దవాడైన ఎల్లోజు అపుడు వారి కవసరమైన కొలుములు నడిపిన స్థలం కొలుములపల్లెయై ఇపుడు కొల్లాపురం అయింది.

రెండవవాడైన మల్లోజు అగస్తేశ్వరానికి పని చేసినాడు. ఆనాటి ఆయన శిల్పశాల అక్కడి అగస్తేశ్వరాలయానికి దక్షిణంగా ఉన్నది. అందులో ఆనాటి శిల్ప విద్యార్థులకు విద్యాబోధనకూడ జరిగేది. అందుచేత అపుడు దాన్ని వారు గురుకులం అని పిలచినారు. అందులో సరస్వతీదేవి ప్రతిష్ఠగూడ ఉన్నది. ఇపుడా సరస్వతి మూర్తి అగస్తేశ్వరాలయంలో ఉంది.

మల్లేశ్వరంలోని ఈనాటి చతుర్వేదాలయం ఆనాటి విశ్వకర్మల వేదపాఠశాల అని చెబుతారు. మల్లేశ్వరంలోని తోరణస్తంభం మల్లోజు స్వయంగా నిర్మించినాడట.

మూడవవాడైన సోమోజు సోమేశ్వరానికి గూడా పనిచేసినాడు. కాలాంతరంలో ఈ వంశంవారు ఆచార భ్రష్ఠులై, తమ గ్రామాలను సురభి దొరలకు అమ్ముకొని వెళ్ళిపోయినారు అని జటప్రోలు కరణం శ్రీ కిషన్‌రావుగారు చెప్పినారు. ఇక ఎల్లోజు సోదరుల వృత్తాంతం శ్రీ రాయపల్లి విశ్వనాథాచారిగారు తెలిపినారు.

నందికోటీశ్వరాలయం - కలువకొలను

ఆంధ్రదేశంలో కలువ కొలనులు చాలా ఉన్నవి. వానిలో ఇది పెద్దకొత్తపల్లి మండలంలో నాగర్‌కర్నూలు నుండి కొల్లాపురం రూటులో ఉంది.

ఊరికంటె మొదలిక్కడ ఒక కలువలకొలను ఉన్నది. దాన్ని ప్రధానంగా చేసుకొని జయలక్ష్మీపతి రాయడనే గోన ప్రభువు అక్కడ

నందికోటీశ్వరాలయం, శివాలయం, ముకుందాలయం అనే మూడు గుడులు కట్టించి, కోట - పేట అనే రెండు భాగాలుగా ఈ గ్రామాన్ని స్థాపించి నట్లు స్థానికుడైన విశ్వబ్రాహ్మణ బొజ్జయ్యాచారిగారు వ్రాసిపెట్టుకున్న కైఫియత్తువల్ల తెలుస్తుంది.

జయలక్ష్మీపతిరాయడు సింహ పద్మావతీదేవి భక్తుడై, కలువ కొలను, నంది వడ్డెమాను, నంది వనపర్తి, చిన్న పూడూరు, పెద్ద పూడూరు కోటలను పాలించినాడట కాని, అతని కాలం తెలియదు.

తమిళనాడులోని తిరువల్లిక్కేణిని అక్కడగల పార్థసారథి కోవెల ముందుగల కొలనులోని తెల్లకలువలనుబట్టి కైరవిణీపుగం అన్నారు. అలాగే ఈ గ్రామాన్ని పూర్వం కైరవ కాసారపురం అనేవారు. అనాటి కాసారం అడుగు పాతకోటలో యిప్పటికీ ఉంది.

క్రీ.శ. 13 వ శతాబ్దిలో ఈ గ్రామం కాకతీయ సామంతులైన చెఱకు రెడ్లకు రాజధానిగా ఉన్నది. దీన్ని ప్రోలయరెడ్డిగారు పాలిస్తుండగా అతనిపై తాత పిన్నమరాజు కుమారుడు సోమదేవరాజు దండెత్తి సంహ రించి కోటను వశపరచుకొన్నట్లు శాసనాలవల్ల తెలుస్తుంది.

ఆ విధంగా మొదటికోట నాశనం కాగా పానుగంటి బ్రాహ్మణ ప్రభువులు దానికి తూర్పున మరో ఈశ్వర చెన్నకేశవ ప్రతిష్ఠలు చేసి క్రొత్త గ్రామాన్ని స్థాపించినారు. ఈ వంశీయులు క్రీ శ. 1432 వరకు పాలించినారు. వారిలో చివరివాడు శేషాచలపతి రావుగారు. అతనిని కర్నూలు నవాబులు తమకు సామంతుడవు కమ్మని వత్తిడి తెచ్చినారు. అపు డతనికి తురకలకు లొంగటం యిష్టంలేక, మైసూరు ప్రభువులతో సంప్రదిస్తుండగా ఆ సంగతి తెలిసి కుతుబ్‌షాహీ ప్రభువు అతనిని సకుటుంబంగా చెరపట్టి తీసికొని వెళ్ళినాడు. అనంతరం ఈ గ్రామం తురకల వశమయింది.

108a

సోమశిల దేవాలయాలు - కొల్లాపురం తాలూకా.

ఇపుడిక్కడ గ్రామం వెలుపల ఉన్న నందిగుడి, గ్రామంలో రెండు చెన్నకేశవాలయాలు ప్రసిద్ధంగా ఉన్నవి.

ఇక్కడ నందిగుడిలో శివలింగానిది ఒక ప్రత్యేకత. అవి ఒక దానిపై ఒకటిగా ఏడున్నవట. శిల్పి పానవట్టాలను లింగంతోసహా గిన్నెలవలె మలిచి ఒకదానిపై ఒకటి ఉంచినాడంటారు. పానవట్టాలకు లింగంచుట్టూ సన్నని రంధ్రాలుండి, అభిషేకజలం ఒకేతూరి ఏడిటికి అందుతూ అర్చకులకు సప్తలింగాభిషేకఫలం ఒకేతూరి దక్కుతుంది.

మహమ్మదీయుల దండయాత్రలలో వారిక్కడి లింగాన్ని పగుల గొట్టి వెళ్ళగా గ్రామస్థులా బొచ్చెలను తొలగించినారు. వానిక్రిందగల మరో లింగం ఇపుడు పూజింపబడుతూవుంది.

ఇక్కడి నంది గూడా మిక్కిలి పెద్దది. నంది వడ్డెమాను, నంది వనపర్తి, కలువకొలను నందులు మూడు దాదాపు ఒకే పరిమాణంలో ఉన్నవి. ఒక్కరవ్వ యింకా ఇక్కడి నందియే పెద్దది.

ఇక్కడ రెండు దశల నందులున్నవి. మొదటి దశకు చెందినవి పెద్దగా నిరాడంబరంగా ఉండగా, రెండవ దశకు చెందినవి శిల్పసౌంద ర్యంతో, నిండైన అలంకారాలతో ఉన్నవి. ఇట్టిది ఒక నంది యిక్కడ భూగర్భంలో దొరకగా గ్రామస్థులు దానిని చెన్నకేశవాలయంలో ఉంచి నారు. ప్రభుత్వం ఇపుడు దానిని పాలమూరులోని పిల్లలమర్రికి తరలిం చింది.

నందిగుడి ముందు మరో నంది నడుమువరకు విరుగగొట్టబడి రెండు ముక్కలుగా ఉన్నది. గ్రామస్థులు ఆ ముక్కలను మామూలుగా ఉంచినారు. కొంతకాలంవరకు వానినడుమ అరచేయిదూరే సందున్నది. కాని అవిపుడు కరుచుకొని పగులు గుర్తించరాకుండా అఖండ శిల్ప మయింది. ఇదొక విచిత్రం.

ఈ గుడి దగ్గర చాలా వీరగల్లులు, శాసనాలు కూడా ఉన్నవి. ఒక వీరగల్లుపై కూడ శాసనం చెక్కబడి ఉంది. ఇక్కడి శాసనాలలో ఒకటి పూర్వచాళుక్య లిపిలో కూడ ఉంది.

కలువకొలను తురకల జాగీరైన పిమ్మట ఈ ఆలయం చుట్టూ అడవి బలిసింది. అపుడు సుమారుగా అరువదేండ్ల క్రింద ఈ స్వామి బెక్కెంలోని జంగం లింగయ్యగారికి స్వప్నంలో కనిపించి, నా ఆలయాన్ని ఉద్ధరించు-నీకు సంతానం కలుగుతుంది అని చెప్పినాడు.

ఆయన కప్పటికి సంతానం లేదు. స్నప్న ప్రకారానికి ఆశ్చర్యపడి అతడిక్కడికివచ్చి దాని చుట్టుగల చెట్లను నరికి స్వామికి నిత్యపూజ నారంభించినాడు. ఆయన ఆ విధంగా పూజ ప్రారంభించగానే ఈస్వామి కూడా తన మాట నిలుపుకున్నాడు.

జంగం లింగయ్య గారి అనంతరం ఈ ఆలయానికి క్రీ. శ. 1933 లో ధర్మరాజు అనే ఒక సన్యాసి వచ్చినాడు. ఆయన యిక్కడ అయిదు సంవత్సరాలుండి, దాని అభివృద్ధికి ఎంతో పాటుపడి, అనంతరం కాశికి వెళ్ళిపోయినాడు.

ఆయన పిమ్మట ఇపుడు దీన్ని చెన్నపురావుపల్లె నివాసి సారంగ మఠం వీరభద్రయ్యగారు చూస్తున్నారు. ఆయన ఈ స్వామిపై ఒక శతకం గూడా రచించినాడు.

ఇక్కడ ఏటా శివరాత్రికి పెద్ద ఉత్సవం నడుస్తుంది.

దీనివలెనే ఇక్కడ గ్రామంలో గల చెన్నకేశవాలయం గూడ ప్రాచీనమయిందే. మొదట దానిలోని దేవునికి ప్రసన్న వల్లభ దేవర అని వ్యవహారం. ఇపుడు ప్రజలు చెన్నకేశవుడంటున్నారు.

రెండవ చెన్నకేశవుని ఇతనికి ప్రతిగా హరిజనులు నిలుపుకున్నారు. పూర్వం ఈ గ్రామంలో మ్రొక్కుడు గుడి కూడా ఉన్నది. దానికి ఎనిమిది వైపులా ద్వారాలున్నవి. కాని కాలాంతరంలో అది శిథిలం కాగా, ఆ రాయిని గ్రామస్థులు ఇండ్లకు వాడుకున్నారు.

చౌడేశ్వరీదేవి ఆలయం - కల్వరాల

ఇది పానగల్లు మండలంలోని గ్రామం. ఇక్కడ ప్రాచీనమైన చౌడేశ్వరీ దేవి ఆలయం ఉంది. చౌడేశ్వరి నందవరీకుల దేవత. ఆ దేవి ఆలయాలలో ఇది ప్రాచీనమయింది. చక్కగా గోపురంతో విలసిల్లుతూ ఉంది.

ఇదిగాక ఇక్కడ శివాలయం గూడ ఉంది. దానిలో పార్వతి - వీరభద్ర ప్రతిష్ఠ లున్నవి.

ఇక్కడి ఆంజనేయాలయం గూడ ప్రాచీనమయింది. మాఘపూర్ణిమకు నందవరీకులు చౌడేశ్వరికి ఉత్సవం జరుపుతారు.

ముప్పది లక్షల గుడులు - గోపాలపురం

శ్రీశైలం ప్రాజెక్టువల్ల అగస్త్యేశ్వరం - మల్లేశ్వరం-సంగమేశ్వరం అనే ప్రాచీన క్షేత్రాలు కృష్ణానది ముంపుకు గురియైనవి. కాబట్టి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అక్కడి వానిలో మేలైన గుడుల నెన్నిక చేసి గోపాలపురం దగ్గరకు తరలించింది

ఆలయాలను సురక్షితంగా ఒక చోట నుండి మరో చోటికి తరలించటానికి దేశంలో యిదే ప్రథమం. కొల్లాపురం నుండి పెబ్బేరుకు వెళ్ళే రోడ్డున గోపాలపురందగ్గర రోడ్డుకు దక్షిణంవైపున మదనగోపాల, ఉత్తరంవైపున మల్లేశ్వరాలయాలు నిర్మింపబడినవి.

మొదటి సమూహంలో —

1. జటేశ్వరాలయం, 2. భ్రమరాంబా మల్లేశ్వరాలయం, 3. వీరభద్రాలయం, 4 వేణుగోపాలాలయం, 5. మదనగోపాలాలయం, అనే గుడులున్నవి. ఇవన్నీ ప్రస్తుతం రాజావారి నిర్వహణ క్రింద ఉన్నవి.

రెండవ సమూహంలో—

1 ద్వారమండపం, 2 అగస్త్యేశ్వరాలయం, 3. అనంత పద్మనాభస్వామి ఆలయం, 4. అమ్మవారి ఆలయం, 5. ఉమామహేశ్వర స్వామి ఆలయం, 6. కాశీశ్వరాలయం, 7. గంగాధరేశ్వర స్వామి ఆలయం, 8 చతుర్వేదాలయం, 9 భీమేశ్వరస్వామి ఆలయం, 10. భైరవస్వామి ఆలయం, 11. మల్లేశ్వరస్వామి ఆలయం, 12. రాజరాజేశ్వరస్వామి ఆలయం, 13. రామలింగేశ్వర స్వామి ఆలయం, 14. విశ్వేశ్వర స్వామి ఆలయం, 15 వీరభద్ర స్వామి ఆలయం, 16. సాంబశివస్వామి ఆలయం, 17. శంభులింగేశ్వరస్వామి ఆలయం ఉన్నవి.

ఈ రెండవ సమూహంలో అగస్త్యేశ్వర, మల్లేశ్వరాలయాలు ప్రసిద్ధమైనవి. కాబట్టి వాని పేర ఇవి అగస్త్యేశ్వరం లేదా మల్లేశ్వర స్వామి గుడులని పిలువబడుతున్నవి.

ఈ ఆలయాల నిర్మాణానంతరం ఇక్కడ మదన గోపాల స్వామివారి పునః ప్రతిష్ఠ శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జియ్యర్ స్వాములవారి ఆధ్వర్యంలో 15-2-1989 బుధవారంనాడు— మల్లేశ్వరస్వామివారి పునః ప్రతిష్ఠ శ్రీ శ్రీ శ్రీ జగద్గురు భారతీయతీంద్ర సరస్వతి వారి ఆధ్వర్యంలో 15-5-89 సోమవారంనాడు జరిగినవి.

ఈ ప్రతిష్ఠలకు ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావుగారు కూడా వచ్చినారు. విగ్రహాల స్థాపన దేవాదాయ ధర్మాదాయ స్థపతి శ్రీ గణపతి స్థపతిగారి పర్యవేక్షణలో డిప్యూటీ స్థపతి పెరుమాళ్ళుగారు తిరుమల నంబిగారు, రాయనిపల్లె విశ్వనాథాచారిగారు, బైరోజు దామోదరాచారి గారులు చేసినారు.



సంగమేశ్వరం ఆలయాలు - ఆలంపురం తాలూకా

1128

జక్కన విక్రమార్క చరిత్రలో మొదట లక్ష్యాన్ని భేదించిన వానికంటె రెండవసారి ఆ రూటులో దూరవేసిన వానిదే ప్రజ్ఞ అంటాడు. కాబట్టి ఇది కూడ అంతే. ఈ ఆలయాలు మొదట నిర్మించిన వారికంటె వానిని విచ్చి మరోచోట అదే విధంగా పేర్చిన వారిదే గొప్ప పనితనం అనవలసి ఉంది.

ప్రభుత్వానికి వీని పునర్నిర్మాణానికి ముప్పది లక్షలు పట్టింది. ఆలయాలు పూర్తియై ప్రతిష్ఠగూడ జరిగింది. కాబట్టి మునుముందు ఈ ప్రదేశం చక్కని యాత్రా స్థలంగా అభివృద్ధి చెందగల అవకాశం ఉంది.

ఆంజనేయాలయం - కొప్పునూరు

ఇది వీపనగండ్ల మండలంలోని గ్రామం. ప్రాచీనమైన ఈ గ్రామం శ్రీశైలం డాంమునకలో పోగా గ్రామస్థులిపుడు మళ్ళీ క్రొత్తగా కట్టుకున్నారు. ఇది మంచాలకట్ట సమీప గ్రామం కాబట్టి కృష్ణాతీరంలోని "కుప్పం" ఇదే కావచ్చునని కొందరి మతం.

ఇక్కడి పురాతన గ్రామంలోని శివాలయాన్ని అలంపూరు తాలూకా వాసులైన "గుజ్జువారు" అనే రెడ్లు కట్టించినారు.

ఇప్పటి గ్రామంలోని ఆంజనేయుడు 12 అడుగులున్నాడు. ఈ మూర్తిని బైరోజు దామోదరాచారిగారు చేసినాడు.

వేణుగోపాలస్వామి ఆలయం-జంగమయ్య పల్లె

జంగమయ్య పల్లె కొత్తకోట మండలంలోని గ్రామం. ఇది ప్రాత ఊరు, క్రొత్త ఊరు అని రెండు భాగాలుగా ఉంది. పాత జంగమయ్య పల్లెలో వేణుగోపాలాలయం ప్రసిద్ధి. ఈ ఆలయం చక్కగా ఉంది కాని, లోపలి స్వామి మూర్తి మాత్రం తల విరుగ గొట్టబడింది.

ఈ గ్రామంపై పూర్వం కర్నూలు నవాబు దండెత్తినట్లు, అపుడు గొప్ప యుద్ధం జరిగినట్లు చెబుతారు. కాబట్టి బహుశః అపుడు ఈ ఆలయంలోని మూర్తి భిన్నం కావచ్చు.

వేణుగోపాలాలయం కాక యిక్కడ చెన్నకేశవాలయం గూడా ఉంది. పూర్వం దానికొరకు ఇక్కడ గ్రామ సమీపంలోగల గట్టు దగ్గర శిల్పి ధ్వజం కొరకు చాలా పెద్ద రాతి స్తంభాన్ని తీసినాడు కాని, ముహూర్త సమయానికి అతనికి మాతృ వియోగం కలిగి స్వగ్రామం వెళ్ళిపోయినాడట దానితో అది అలాగే ఆగిపోయింది.

పూర్వం ఈ గ్రామంలో భాగవతుల రామక్క అనే విశ్వ బ్రాహ్మణ భక్తురాలున్నది. ఆమె వెండితో వేంకటేశ్వరునికి ప్రభావళి, పూజా పాత్రలు, చామరాలు, కాయికోలాలు చేయించింది. అవి ఆమె పేరుతో ఇప్పటికీ ఉన్నవి. ఈ స్వామికి పుష్యంలో పెద్ద తిరణాల జరుగుతుంది.

కొత్త జంగమయ్య పల్లెలో రెండవ రామేశ్వరరాయలు వేంకటేశ్వర - ఆంజనేయాలయాలు కట్టించినాడు.

జటేశ్వరాలయం - జటప్రోలు

జటప్రోలుకు జటాయు క్షేత్రమని పురాణ వ్యవహారం. అది భవిష్యోత్తర పురాణంలోని విష్ణు రహస్య ఖండంలో మదన గోపాల మాహాత్మ్యం క్రింద చెప్పబడింది. ఈ వృత్తాంతం యాత్రలు చేస్తున్న పాండ్యరాజుకు కశ్యపాది మహర్షులు చెప్పినట్లుంది.

అగస్త్య క్షేత్రం మూడు యోజనాలుంది. దానిలో పశ్చిమంగా గవ్యూతి మాత్ర దూరంలో జటాయు క్షేత్రం ఉంది. అది కృష్ణానదికి ఉత్తరతీరంలో ఉందని మదనగోపాల మాహాత్మ్యంలో చెప్పబడింది.



జటప్రోలు మదనగోపాల మందిరం - కొల్లాపురం రాయాక

114A

1140

అది పన్నెండు అధ్యాయాలు, 537 శ్లోకాలుగల గ్రంథం. స్థల పురాణం ప్రకారం ఇది జటాయువుయొక్క రెక్క తెగిపడిన స్థలం. అందుచేత అతని స్మారకంగా శ్రీరాము డిక్కడ జటేశ్వర లింగాన్ని ప్రతిష్ఠించినాడు.

ఈ ఆలయం ఇపుడు కోటలో ఉంది. ఇక్కడి కోట మిక్కిలి విశాల మయింది. పల్లవుల నాటిది అంటున్నారు కాని ఎవరు కట్టించింది తెలియదు. అది అంతా నాపరాయితో కట్టబడింది దానికి ఈశాన్యంగా తూర్పుగా కృష్ణానది ఉండగా తక్కిన వైపులలో లోతైన కందకం ఉంది.

ఈ గ్రామంలో మదన గోపాలాలయం ప్రసిద్ధి. ఇక్కడి శ్రీకృష్ణుడు రుక్మిణీ సత్యభామా సమేతుడు. అంతేకాక, అతని వెనుక గోవు, పొన్నచెట్టుకూడా ఉన్నవి. కృష్ణుడు రుక్మిణీ సత్యభామలతో కూడి నపుడు మాత్రమే మదనగోపాలుడు, లేని యెడల వేణుగోపాలుడు అనబడుతాడని ఇక్కడి స్థానాచార్యులు చెబుతారు.

ఈ ఆలయాన్ని ఎవరు కట్టించింది తెలియదు. వల్లభరాయడు అనే ప్రభువు కట్టించినట్లు చెబుతారు. అతడు రాజ్యం చేస్తుండగా ఆ పట్టణానికి ఒకపుడు కాశినుండి ఒక వృద్ధ బ్రాహ్మణుడు వచ్చినాడు. రాజుగారతనిని దర్శించి నమస్కరించి తనకేదైనా చెప్పుమని కోరినాడు.

అపుడతడు ఆముక్తమాల్యదలో బాటసారి పాండ్యరాజుగారికి వినిపించిన శ్లోకం చదివి వివరించినాడు. అది విని అతడు గూడా పాండ్యరాజువలె పశ్చాత్తాపపడి, నేను ముక్తికొరకేది చేసుకోలేక పోయితినే అనుకున్నాడు. అపుడా రాత్రి అతనికి మదనగోపాలుడు కలలో కనిపించి నేనిక్కడ నిర్మలా నదీ తీరాన వెలసి ఉన్నాను. కాబట్టి అక్కడ నాకొక ఆలయం కట్టించు అని ఆదేశించినాడు. అది విని మరునాడతడు శిల్పులను రావించి ఇపుడున్న ఆలయం కట్టించినాడు. కాని ఈ రాజుగారి వంశం గాని, కాలంగాని తెలియదు.

ఈ ఆలయం ఆపాదచూడం సౌందర్యం రాసి పోసినట్లుగా ఉంటుంది. శిల్పి దీని విమానంపై కొణిగెల క్రింద జటాయువులను తీర్చినాడు. ఇతర స్థలాలలో అయితే ఈ చోట పావురాలను నిలుపుతారు.

ఈ ప్రాంతంలో కోతులెక్కువ. అందుచేత ఆలయం మూలలపై నిజమైన కోతులంత కోతులను పైకి దూకటానికి సిద్ధంగా ఉన్నట్లు మలిచినాడు. వానిని చూస్తే అవి నిజమైనవాః అన్న భ్రమ కలుగుతుంది.

జట అంటే వేణి - కాబట్టి ఈ విమానంపై శిల్పి పెద్ద పెద్ద జడలు గల ఋషులను గూడా తీర్చినాడు. ఈ విధంగా ఇక్కడ అతడు తన కల్పనా చాతుర్యంతో ఇది జటప్రోలు అని సూచించినాడు. ఇపుడిది గోపాలపురంలో కట్టబడింది.

వీరభద్రాలయం - తీగలపల్లె

ఈ గ్రామం తీగన్న అనే గొల్లవాని చేత స్థాపింపబడిందట. ఇపుడిది కోడేరు మండలంలో నాగర్ కర్నూల్‌నుండి వెళ్ళే కొల్లాపురం కోడేరు లైనులో ఉంది. ఇక్కడి ప్రాచీన గ్రామాలలో ఇది ఒకటి. ఈ గ్రామం ఉమామహేశ్వరంలోని కరణం రామయ్యగారి శాసనంలో పేర్కొనబడింది.

(చూ. Hy. A.S.N. 19. M.N. No. 41 5th Face)

నాగర్‌కర్నూలు తాలూకాలో గుడిపల్లె నుండి నాగపూరు, రావిపాకుల, రేపల్లె, తీగలపల్లె మొదలైన గ్రామాల మీదుగా కొల్లాపురం తాలూకాలోని కృష్ణాతీరం వరకూ ఒక గుట్టల వరుస వ్యాపించి ఉంది. వాటిని ఏ ఊరి దగ్గర ఆ ఊరిపేర పిలుస్తారు.

తీగలపల్లె గుట్ట గ్రామానికి తూర్పుగా పరువు దూరంలో ఉంది. దానిపై సుమారు మూడెకరాల చదరం నేల ఉంది. అది కాకతీయులనాటి సైన్యావాసం. పూర్వం ఆ గుట్టపై సైనికులు, గుట్టక్రింద గ్రామం ఉండేవి,

కాని ఈనాడు గ్రామం అక్కడినుండి చాలా దూరం వెళ్ళింది. పాత అడుగున ఆనాటి మహిషమర్దని ఆలయ శిథిలాలున్నవి.

ఇక్కడి గట్టును వీరన్నగట్టు అంటారు. దానిపై ఒక గుండు ఉత్తరాభిముఖంగా దరివలె సాగింది. దాన్ని గర్భాలయంగా చేసి పూర్వ లిక్కడ ఆలయం కట్టినారు. ఈ గుట్టపైకి ఎనుబది మెట్లున్నవి.

దరిక్రింది భాగాన్ని రెండు సమభాగాలు చేసి మొదటి గదిలో వీరభద్రుని, అతని ఎడమ భాగంలో భద్రకాళిని ప్రతిష్ఠించారు.

వీరభద్రునికి కుడివైపున దరి లేదు. అందువల్ల ఆ వైపున ఒక అరుగువేసి దానిపై గణపతిని నిలిపినారు. భద్రకాళికి ఎడమవైపున మరో గది నిర్మించి దానిలో శివప్రతిష్ఠ చేయబడింది. ఈ శివలింగం మిక్కిలి నునుపు. స్వామివారికి ఈశాన్యంగా అమ్మవారి మూర్తి ప్రతిష్ఠించబడింది. ఆమె ద్విభుజ - కుడిచేతిలో పద్మషండం ధరించి ఉంది. మండపంలో వీరభద్రుని కెదురుగా ఒక చిన్ననంది, శివుని కెదురుగా పెద్దనంది ఉన్నవి. ఈ మూర్తులన్ని చక్కని పనితనం కలిగి, జీవకళలతో తొణికిస లాడుతున్నవి

ఈ గుడికి పడమర నుండి రాతి తెట్టెగట్టి భరంతి నింపి ముందు భాగంలోని స్థలాన్ని కొంత విశాలపరచి ధ్వజస్తంభాన్ని నిలిపినారు.

ఇక్కడి వీరభద్రుని గద్వాల వైశ్యులు నిలిపిరట కాని వారి వివరాలు తెలియలేదు. మైలారదేవుడు-వీరభద్రుడు-సైనికుల దేవతలు. కాకతీయుల కాలంలో వారి ఉత్సవాలు గొప్ప వీరావేశంతో జరిగేవి.

ఇక్కడ సంక్రాంతికి శివరాత్రికి ఉత్సవాలు జరుగుతవి. శివరాత్రికి గుల్బర్గ, తాడూరు, కర్నూలు మొదలైన దూర దూరాలనుండి భక్తులు వస్తారు. అపుడు భజనలు, నందికోల, కోలాటం ఘనంగా జరుగుతవి.

సంక్రాంతికి స్వామిని కురువ గొల్లలు పూజిస్తారు. ప్రస్తుతం ఈ ఆలయ నిర్వహణ కరణం అన్నమరాజు రామచంద్రరావు గారు భక్తి ప్రపత్తులతో చూస్తున్నారు వీరు స్థానికులు. ఇటీవల ఈ గుట్టపై క్రీ.శ. 1972 నుండి వీరభద్రుని కెదురుగా కొంత దూరంలో చెన్నకేశవుడు గూడా వెలసినాడు. ఆతనిని మాలవారు నిలుపుకొని పూజిస్తున్నారు.

వివరాలకు చూ. మూసి. 1985 మే. పు. 27.

శివకేశవాలయాలు - పెంట్లవెల్లి

ఇది గూడా కృష్ణాతీర గ్రామాలలో ఒకటి. ప్రస్తుతం కొల్లాపురం మండలంలో ఉంది. హైదరాబాదు నుండి బయలుదేరిన కొల్లాపురం బస్సు పెంట్లవెల్లి వరకు వెళ్ళుతుంది.

పూర్వం ఇక్కడొక చిన్న వాగు ఉండేది. దానికి పెంటలవెల్లి అని పేరు. ఇపుడది నామమాత్రమై ఆ పేర గ్రామం మాత్రం మిగిలింది. ఇది మొదలొక సామాన్య గ్రామం. కాని సురభివంశంలో తొమ్మిదవ వాడైన చిన్న మాధవరావు ఇక్కడి నుండి జటప్రోలు సీమను పాలించి నాడు. అపుడీ గ్రామం కోట పేటలుగా విభజింపబడి అభివృద్ధి గావింప బడింది.

ఇక్కడి శివకేశవాలయాలు చిన్న మాధవరావుగారే కట్టించినట్లు చెబుతారు. కాని కేశవాలయం చాళుక్యరీతిలో ఉండడంచేత పరిశోధకులిది పురాతనాలయమని, మాధవరావుగారు పునరుద్ధరించి బ్రహ్మోత్సవాలు ఏర్పాటు చేసి ఉంటాడని అంటున్నారు.

ఈ ఆలయాలు రెండూ విశాలమైన ప్రాకారాలతో చక్కగా ఉన్నవి. ఇవిగాక ఇక్కడ వేంకటేశ్వరాలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, విశ్వ బ్రాహ్మణ సత్రం ప్రసిద్ధమైనవి.

ఇటీవల ఈ గ్రామంలో హరిజనేతరులు 1966 లో ఒక సుంకు లమ్మను ప్రతిష్ఠించగా 1976 లో హరిజనులు మరో సుంకులమ్మను ప్రతిష్ఠించుకున్నారు. ఈ దేవిని కొందరు పోశమ్మ అని కూడా అంటారు. తట్టు లేదా అమ్మవారికి పోత అని పేరు. "పిల్లవానికి తట్టు పోసింది" అనటం మామూలు కాబట్టి "పోసే అమ్మ" "పోసెమ్మ" అయింది.

సుంకులమ్మనే కాక ఇక్కడ గంగాదేవిని, పద్మశాలీలు భద్రా వతి భావనారాయణులను గూడా ప్రతిష్ఠించుకున్నారు.

ఈ మూర్తులను స్థానికుడైన బైరోజు దామోదరాచార్యులు చేసినాడు.

బెక్కేశ్వరుడు - బెక్కెం

ఇది కృష్ణాతీర గ్రామం. ఇక్కడికి నది ముక్కాలు మైలు కాబట్టి ఇది ఇపుడు నీటి మునకకు గురి అయింది. కాని ఇదొక ప్రాచీన చరిత్ర గల ఊరు. దీనికి తూర్పున పది మైళ్ళలో కృష్ణకు ఈవలావల కపిలేశ్వరం, మల్లేశ్వరం, సంగమేశ్వరం, సిద్ధేశ్వరం, సోమేశ్వరం అనే పంచేశ్వరాలయాలు ఉన్నవి. కాబట్టి ఒకపుడు వాటితోపాటు ఇది కూడ ఈశ్వర స్థానంగా ఉన్నదట.

బెక్కెం కంటె మొదలక్కడ నరసింగయ్య పల్లె - గొల్లగూడెం అనే రెండు గ్రామాలున్నవి. నరసింగయ్యపల్లెలోని ఒక ఆసామి ఆవులను గొల్లగూడెంలోని ఒక కాపరి కాస్తున్నాడు. ఒకనాడతనికి ఒక విచిత్ర దృశ్యం కనిపించింది. తమ ఆవులలో ఒకటి సమీపంలోని తాటి తోపులోనికి వెళ్ళి ఒక పుట్టపై పాలు కురుస్తుండగా దానిలోనుండి ఒక పిల్లికూన బయటికి వచ్చి వానిని తాగుతున్నది. అది చూచి అతడు గ్రామంలో చెప్పగా మరునాడు కొందరు వచ్చి అది కనులార చూచి, అది అడవి పిల్లి కావచ్చు దానిలో చేరిందని ఆ పుట్టను త్రవ్వినారు. అపుడందులో ఒక శివలింగం బయటపడింది.

కన్నడంలో పిల్లిని బెక్కు అంటారు కాబట్టి అపుడు ప్రజలా స్వామికి బెక్కేశ్వరుడని పేరు పెట్టినారు. ఆ విధంగా అక్కడ స్వామి వెలసిన పిమ్మట ప్రజలతనికి గుడి కట్టినారు. నరసింగయ్యపల్లె అక్కడికి జరిగి స్వామిపేర బెక్కెంగా మారింది.*

గ్రామం ఏర్పడిన పిమ్మట అక్కడ చెరువుకూడ వేసినారు. అది చాలా పెద్దది. దానితో బెక్కేశ్వరాలయం తటాక గర్భంలోనికి వచ్చింది. అయినా అది దుర్గమంగా లేకున్నది. కాబట్టి అనంతర కాలంలో గ్రామస్థులు కాశినుండి మరో రెండు లింగాలను తెప్పించి వానికి మోక్షేశ్వరుడు - సాక్షీశ్వరుడు అని పేరుంచి అక్కడే ప్రతిష్ఠించి ఆ మూడింటికి గుడులు విమానాలు కట్టించినారు.

ఇవిగాక గ్రామంలో మరో జనమేజయ ప్రతిష్ఠ ఉంది. పుష్కరిణికి ఈవలావల శివకేశవ ప్రతిష్ఠలున్న దానిని ఈ ప్రాంతంలో జనమేజయ ప్రతిష్ఠ అంటారు. ఇవి పశ్చిమాభిముఖాలయాలు.

బెక్కెం గ్రామానికి మైలు దూరంలో పూర్వపు గొల్లగూడెం ఉంది. దానికి పడమట 'మూకగుళ్ళు' అనేపేర పదకొండు ఆలయాల సమూహం ఉంది. వానిలో ఒకటి కాళిక- ఒకటి నటరాజ- ఒకటి భైరవ- ఒకటి సూర్య - ఒకటి మహిషమర్దని ఆలయాలు. తక్కినవి ఈశ్వర నామాలతో ఉన్న శివలింగ ప్రతిష్ఠలు

---

* ఈ గ్రామంలో మార్జాలముఖి మార్జాలవాహనయైన దేవత ఉంది. ఇది ఇక్కడి ప్రత్యేకత. పూర్వం ఈ ప్రాంతంలో ఆ దేవతను ఉపాసించిన వారు గూడా ఉన్నారు. వారిలో మనిగండ్ల బెక్కు లింగప్ప ప్రసిద్ధుఖ. అతడక్కడ చెన్నకేశవాలయం కట్టించినాడు. దానిపై పిల్లి బొమ్మలు కూడ ఉన్నవట.

మల్లికార్జున పండితారాధ్యుడు పానుగంటిలో ఉదయనుని శపించిన పిమ్మట బసవేశ్వరుని దర్శనం చేసికొని శ్రీశైలం వెళ్ళదలచి శిష్యులతో కదలి వనిపురం చేరేవరకు బసవేశ్వరుడు లింగైక్యం చెందినట్లు తెలిసింది. దానితో అతనికి మిక్కిలి దుఃఖం కలిగింది. అపుడు వెల్లగొండ మహదేవయ్య అతనిని తన గ్రామానికి కొనివెళ్ళుతూ ఉండగా దారిలో వెల్లటూరికి చేరేవరకు అతనికి శ్రీశైలం లింగాకారంగా దర్శనమిచ్చింది. అది చూచి అది శివలింగాకారం కాబట్టి దానిపై కాలుమోపటం పాపమనుకుని తన శిష్యులను దోనమయ్యతో అక్కడికి పంపి తాను వెల్లటూరిలోనే నిలిచినాడు.

అపుడతనికి అక్కడ బెక్కెం నివాసియైన శాంతరామయ్య అనే మహేశ్వరునితో పరిచయం ఏర్పడింది. దోనమయ్య శ్రీశైలం వెళ్ళి పండితుని మ్రొక్కు చెల్లించి వచ్చిన పిమ్మట శాంతరామయ్యగారు అతనిని బెక్కెం తీసికొని వచ్చినాడు. అక్కడికి వచ్చిన పిమ్మట అతడు మూకగుళ్ళను చూచి ముగ్ధుడైనాడు. అక్కడి వాతావరణం తనకు నచ్చింది అందుచేత బెక్కెం ఊరి వెలుపల ఒక స్థలాన్ని చూసికొని ఆశ్రమం ఏర్పరచుకొని దానిలో ఒక బావినిగూడ త్రవ్వించి అక్కడ నిలిచినాడు.

అతడక్కడ ఉండగానే అంత్యకాలం సమీపించి శివైక్యం చెందినాడు. అపుడు భక్తులతనిని అక్కడదే సమాధి చేసినారు. ఈ సమాధిని ప్రజలిపుడు మల్లెదేవర సమాధి అని, బావిని మల్లెదేవర బావి అని పిలుస్తున్నారు.*

---

* వివరాలకు చూ. స్వధర్మ 1-2-1960 పు. 24
,, ,, 1-3-1960 పు. 7.
,, పరిశీలన 4-3-1980 పు. 2.

పండితుని అనంతరం ఆయన శిష్యుడైన శాంతరామయ్య గూడ గురువుగారి అంతటివాడు అనిపించుకున్నాడు. శివైక్యం చెందిన పిమ్మట భక్తులతనిని గ్రామంలోని శివాలయంలో సమాధి చేసినారు. ఆయన కిపుడు ఏటేటా కార్తీకమంతా సేవలు జరిగి, మార్గశిర శుద్ధ పాడ్యమినాడు రథోత్సవం నడుస్తుంది. అపుడు పూజారంభంనాడు భక్తులు మొదట మల్లెదేవర సమాధిని పూజించి వస్తారు. సేవనాడు రథం గూడా అంత వరకు వెళ్ళుతుంది.

ఈ గ్రామాన్ని శా. శ. 1033 లో చాళుక్య త్రిభువనమల్లుని సామంతుడు బిజ్జరుసు పాలించినాడు. అతడు జీమూతవాహన వంశీయుడు. తెలుగుదేశంపై శాతవాహనుల కాలంలో కళింగంనుండి దండెత్తిన ఖారవేల మహారాజు గూడా జీమూతవాహను వంశీయుడే.

బిజ్జరుసు తనను శాసనంలో 'ఉదగారపోషణుడు' అని చెప్పు కున్నాడు. ఇక్కడి చెరువు చాలా పెద్దది కనుక ఈ ఉదగార పోషణ బిరుదం గురించి ఆలోచించవలసి ఉంటుంది.

ఇది జటప్రోలు సంస్థానానికి చెందిన గ్రామం కాబట్టి సురభి మాధవరాయల అనంతరం ఆయన కుమారులలో పెద్దవాడైన నారాయణ రావు రాజధానిలో ఉండగా మొదటి తమ్ముడైన తిరుమలరావు ఇక్కడ నుండి, రెండవ తమ్ముడైన నరసింగరావు మ్రరూరు నుండి అన్నగారికి సహాయంగా ఉండి రాజ్యాంగ వ్యవహారాలు చూసినారు.

ఇపుడీ గ్రామం మునకకు గురి అయింది. అందుచేత గ్రామస్థులు ఊరిని కొత్తగా కట్టుకొని అక్కడ సీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీరామ చంద్రుని, మరొక వీరాంజనేయుని, సుంకులమ్మను 1987 లో ప్రతిష్ఠించుకున్నారు ఈ మూర్తులు శ్రీ బైరోజు దామోదరాచార్యులుగారు చేసినారు.

మాధవస్వామి ఆలయం - మంచాల కట్ట

దీనికి పూర్వం మంచాల - మంత్రాల కట్ట అని గూడా వ్యవహారాలు. మొదట ఈ గ్రామం పెంట్లవెల్లికి అయిదు కిలోమీటర్లలో ఉండేది. ఇపుడు కృష్ణ మునకకు గురి అయింది.

చరిత్రలో ఈ గ్రామానికొక ప్రత్యేక స్థానం ఉంది. క్రీ. శ. 1064 డిసెంబరు 24 నాటి పులిజాల శాసనం మొదటి సోమేశ్వరుని పంపున గంగ పెర్మాడి విక్రమాదిత్యుడు, నోలంబ పెర్మాడి జయసింహుడు మంచాళను నేలవీడుగా చేసికొని చోళుల (వీర రాజేంద్ర) దాడిని త్రిప్పికొట్టినట్లు చెబుతుంది. ఈ శాసనంలో ప్రసక్తమైన మంచాళ నేటి మంచాల కట్టనే అని పరిశోధకుల మతం. అందుచేత చాళుక్యులకు, తమిళ చోళులకు గడిమండలంగా ఉన్న సంగమేశ్వరం, యుద్ధ రంగంగా ఉన్న కుప్పం ఈ ప్రాంతంలోని నివృత్తి సంగమేశ్వరం - కొప్పునూరు అనే స్థలాలే అనటానికి వీలుంది.

ఇక్కడ గల మాధవస్వామి ఆలయం ప్రసిద్ధి. అది అన్ని విధాలా మదన గోపాలాలయం వలెనే ఉంటుంది అంతేకాక, ఆ రెండు ఏక కాలాలు, ఏక నిర్మితాలు.

పరిశోధకులిది చాళుక్యుల కాలంనాటి నిర్మాణం అంటున్నారు. పులిజాల శాసనాన్ని బట్టి ఈ స్థలానికి చాళుక్య సంబంధం లేకపోలేదు. కాని స్థానిక కైఫియత్తులు మాత్రం జటప్రోలు - మంచాల కట్ట గుడులను చంద్రికా పరిణయ కర్తయైన మాధవ రాయలు కట్టించినట్లు చెబుతవి.

ఇప్పుడీ ఆలయం కొల్లాపురం వెలుపల 'వద్యాల' (వడిద్యాల) అనే ప్రదేశంలో పునర్నిర్మించబడింది.

శివాలయం - మునిగిళ్ళ

ఇది పెద్ద మందడి మండలంలోని గ్రామం. పూర్వం ఈ గ్రామానికి మునిగండ్ల అనిపేరు. ఇక్కడ మునులు తపం చేసికుంటూ ఉండేవారని చెబుతారు. మొదట యిది ఒక బలిజవారి జాగీరు. ఆపిమ్మట బ్రాహ్మణాగ్రహారం అయింది.

ఇక్కడ శివాలయం ప్రసిద్ధి. ఇది ఏకశిలా నిర్మితం. అంటే మూడు వైపుల గోడలు మూడు అఖండ శిలలు. అందుచేత దీన్ని ఏకశిలా నిర్మితం అంటారు దీనిలో శివలింగం కూడా చాలా పెద్దదిగా నిద్దంగా ఉంది. హారతియిచ్చే అపుడు దీనిలో ప్రతిబింబం కనిపిస్తుంది.

ఇక్కడ గ్రామానికి పశ్చిమంగా చెన్నకేశవాలయం ఉంది. అది భూగర్భంలో కట్టబడింది. ఈ ఆలయం సువిశాలంగా ఉంది. దానిలోపలికి మెట్లుదిగి దివిటీ సహాయంతో వెళ్ళవలసి ఉంటుంది.

ఇది శిల్పశోభితమైన గుడి. లోపలి స్వామిగూడ నయనాభిరామంగా ఉన్నాడు. ఈ విధంగా ఇక్కడి రెండు ఆలయాలు రెండు ప్రత్యేకతలు కలిగి ఉన్నవి.

పూర్వం ఇక్కడ సదానంద స్వామి అనే యోగి ఉన్నాడు. ఆయన మొదటి రామకృష్ణరాయల గురువు. ఇక్కడి చెన్నకేశవస్వామిపై

"చిరతరోల్లాస సంతత శ్రీనివాస, విగత భవపాశ, మునిగండ్ల వెంకటేశ" అని చక్కని శతకం రచించినాడు.

శివకేశవాలయాలు - మద్రూరు

జటప్రోలు సీమలో ఈ పేర చిన్న మద్రూరు - పెద్ద మద్రూరు అనే రెండు గ్రామాలున్నవి. ఇవి వటవాచకాలు. ఈ రెండు గ్రామాలు గూడా ఇపుడు పీపనగండ్ల మండలంలోనే ఉన్నవి. ఇవి కృష్ణాతీర గ్రామాలు.

క్రీ. శ. 660 ప్రాంతంలో మద్రూరు, వంగూరువిషయంలో ఉన్నట్టు ఆముదాలపాడు శాసనంలో ఉంది. అందువల్ల యిది ప్రాచీన గ్రామాలలో ఒకటి అని తెలుస్తున్నది. ప్రస్తుతం శ్రీశైలం డాము మునకలో పోగా గ్రామస్థులిపుడు వేరేచోట ఊరును కట్టుకున్నారు.

గ్రామ ప్రాచీనతను బట్టి పురాతత్వ శాఖ వారిక్కడ త్రవ్వకాలు జరిపించినారు. అపుడిక్కడ పురాతనమైన అస్థిపంజరాలు బయట పడినవి.

ఈ గ్రామంలో శివాలయం - కేశవస్వామి ఆలయం, తిమ్మప్ప స్వామి గుడి ప్రసిద్ధాలు.

ఆంజనేయాలయం - మాచిపల్లి

ఇది కోడేరు మండలంలోని గ్రామం. పూర్వం ఇది "కొంకల వారు" అనే బోయసరదారుల గ్రామం. వీరు గద్వాలలోని హనుమప్ప నాయని వంశానికి చెందినవారు. "కొంకల" అలంపూరు తాలూకాలోని గ్రామం. అక్కడినుండి వీరు గోపాలపేట ప్రభువుల పిలుపుపై ఈ తాలూకాలోనికి వచ్చినారు.

ఇక్కడి ఆంజనేయాలయం మిక్కిలి ప్రాచీనమయింది. ఇక్కడ గ్రామం చుట్టుపట్ల ప్రాచీనమైన శిల్పాలు, వీరగల్లులు చాలా దొరికినవి. అవి అన్ని యిపుడు పట్వారి శ్రీ సీతారాంరావుగారి శ్రద్ధచేత హనుమదాలయంలో ఉంచబడినవి. ఇవి ప్రాంతీయ పరిశోధకులు చూడదగినవి.

రామాలయం - రామతీర్థం

ఇది కృష్ణా తీర క్షేత్రం. పెంట్లవెల్లికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉంది. మంచాల కట్టగూడ ఇక్కడికి అంతే ఉంటుంది.

మంచాల కట్టను మంచాల - మంత్రాలకట్ట అనిగూడ అంటారు. ఈ మంచాల "పులిజాల" శాసనంలో పేర్కొనబడింది. పశ్చిమ చాళుక్యులకు తమిళ చోళులకు యుద్ధరంగంగా కూడ ఉన్నది.

పూర్వం ఇక్కడ సోమనాథ సిద్ధుడు. ఆచిదానంద సిద్ధుడు అని యిద్దరు గురుశిష్యులున్నారు. వారు శిల్పులు. అంతేగాక యోగ సిద్ధులు.

ప్రస్తుతం ఇక్కడ ఉన్న రామాలయం ఆనాడు వారు కట్టిందే అంటారు. అదేగాక ఇక్కడ పంచముఖేశ్వర - నవలింగ ప్రతిష్ఠలుగూడ ఉన్నవి. వానికి కొంత దూరంలో వీరి సమాధులుగూడ ఉన్నవి.

శిథిలమైన ఇక్కడి రామాలయాన్ని పెంట్లవెల్లి మంచాలకట్ట ప్రజలు కలిసి పునరుద్ధరించినారు. ఇది ఏకాంతంలో ప్రశాంత వాతావరణంలో ఉన్న నిర్మల క్షేత్రంగాని యిపుడు శ్రీశైలం డాం మునుకకు గురి అయింది.

ఇక్కడికి కృష్ణ రెండు కిలోమీటర్లు ఉండేది. ఇపుడు వేసవిలో వెళ్ళవచ్చు నంటారు.

"రామతీర్థం" అనే పేరుకు తగినట్లు ఇక్కడ "రామదండు" ఎక్కువ.

శివాలయం - రేమద్దుల

మద్ది వృక్షవాచకం. శాస్త్రజ్ఞులింతవరకు దీనిలో తెలుపు నలుపు భేదాలే గుర్తించినారు కాని ఎఱుపు గూడా ఉంది. పూర్వం ఇది అంతా అరణ్య ప్రాంతం కాబట్టి ఎఱ్ఱని మద్దులు పెరిగే చోట వెలసిన ఈ గ్రామం రేమద్దుల అయింది. ఇపుడిది పానగల్లు మండలంలో ఉంది.

పూర్వం ఇక్కడ సూగూరువారనే కరణాలు ప్రసిద్ధులు. ఆ వంశంలోని వెంకటాచలమయ్య అనే ఆయనమరణం, గోపాలపేట రాణి కేశమ్మగారి మూలంగా జరిగింది. అందుచే ఆమె పశ్చాత్తాపంతో ఆయన స్మరణగా ఇక్కడ ఈ శివాలయం ప్రతిష్ఠించింది. ఇది గ్రామానికి వెలుపల ఉంది. దీన్ని అనుసరించి గ్రామస్థులిపుడు కందూరప్ప గుడి కూడ కట్టినారు.

కందూరప్ప కంచూరు నివాసి. అక్కడి దొరల కుటుంబానికి చెందినవాడు. సర్వసంగ పరిత్యాగి అయిన వేమనవంటి తత్వజ్ఞాని. అతడు తన సంచారంలో ఇక్కడ మరణించినాడు. కాబట్టి గ్రామస్థులతనికి గుడి కట్టి సిమెంటు బొమ్మను చేయించి పెట్టినారు.

ఈ గ్రామంలో ప్రాచీనమైన రామాలయం కూడ ఉంది. అది శిథిలమై ఉండగా శివచరణ బ్రహ్మచారి అనే సాధువు దాన్ని పునరుద్ధరించి అందులో రామప్రతిష్ఠ చేసినాడు. ఇపుడీ ఆలయం చక్కగా నడుస్తుంది.

నృసింహాలయం - సింగ పట్టణం

దీన్నిపుడు సింగోటం అంటున్నారు. ఇది కొల్లాపురం మండలం లోని గ్రామం. నాగర్‌కర్నూలు నుండి కొల్లాపురం రూటులో ఉంది. అది కూడా కోడేరు ద్వారా వెళ్ళే రూటులోనే వస్తుంది బస్సు ఈ ఆలయం ప్రక్కనుండే వెళ్ళుతుంది.

ఈ క్షేత్ర ప్రసక్తి మదనగోపాల మాహాత్మ్యం అనే స్థల పురాణంలో ఉంది. దాని ప్రకారం దీనికథ ఈ విధంగా ఉంది: పూర్వం ఇది అరణ్యప్రాంతం. కాశినుండి సింహవటువు అనే బ్రహ్మచారి ఈ దారిని అహోబలం వెళ్ళుతున్నాడు. అపుడతని కాలికి ఒక రాయి తగిలి మూర్ఛ వచ్చింది. ఆ మగతలో అతనికి "నీవు అహోబలంవరకు రానక్కరలేదు.

ఇక్కడనే ఉండి తపం చేయి" అనే ఆదేశం వినిపించింది. అది విని అతడిక అక్కడనే ఒక పురాతన వటాన్ని ఆశ్రయించి తపం సాగించు కున్నాడు. అపుడు కొన్ని దినాలకు స్వామికతనిపై అనుగ్రహం కలిగి పొదిలె కొండపై పాదం మోపినట్లు అక్కడి గుట్టపై కూడా పాదం మోపి అతనికి దర్శన మిచ్చినాడు.

ఇక్కడి నృసింహమూర్తి ప్రతిమ కాదు. ఒక బాణలింగం. తెలంగాణంలో చాలాచోట్లలో నృసింహస్వామి ఈ రూపంలోనే పూజింప బడుతున్నాడు. వికారాబాదు సమీపంలోని అనంతగిరిలో నృసింహస్వామి ఈ విధంగానే ఉంటాడు. జానపదుల కథ ప్రకారం ఈ మూర్తి ఒక నృసింహ జయంతినాడు ఆ సమీపంలోని పుల్లరి పొదలోఉండి పొలాన్ని దున్నుకుంటున్న మున్నూరు వెంకటయ్యగారి నాగలికి తగిలింది. వెంటనే అతనికి స్వామి ఆవేశమై తాను నృసింహస్వామినని చెప్పుకున్నాడు. అపుడతడా మూర్తిని తలపై ఎత్తుకొనివచ్చి మొదటిసారిగా ఇపుడు స్వామి వారి పాదాలున్నచోట దించినాడు.

ఆ సమయంలో అక్కడి అడవికి రేచెర్ల సింగమనాయడు వేటకు వచ్చి ఉన్నాడు. అపుడు కొందరు ప్రజలు వెళ్ళి ఆయనకీ సంగతి తెలిపి నారు. అది విని ఆయన వేటను మాని గుఱ్ఱాల బండినెక్కి అక్కడికి వచ్చి అప్పటికప్పుడే స్వామికొక చిన్నగుడి కట్టించి అందులో నిలిపి గ్రామానికి కూడా స్థలంచూపి వెళ్ళినాడు.

ఇక సాహిత్యాధారం ఈ రెండు కథలకు భిన్నంగా ఉంది. మంచాలకట్ట వేణుగోపాల మందిరం, జటప్రోలు మదనగోపాలాలయం, సింగపట్టణ నృసింహాలయం- ఈ మూడు చంద్రికా పరిణయ కర్తయైన సురభి మాధవరాయలు నిర్మించినట్లు "నృసింహ విలాసం" అనే కావ్యం చెబుతుంది.

సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశం కూడా ఇదే విషయాన్ని చెప్పింది కాని మంచాల కట్ట, జటప్రోలు ఆలయాలకు దీనికి ఏ పోలికా లేదు. అవి ప్రాచీనాలు. ఇది అర్వాచీనం. ఇక్కడ నృసింహ సాలగ్రామం లభించ గానే సింగమనాయడు స్థానికుడైన ఓరుగంటి నృసింహ దీక్షితులను పిలిపించి ఆయనతో ప్రతిష్ఠింప చేసినాడు. అందుచేత ఈ గుడికి ప్రస్తుతం ఓరుగంటివారు ముతవల్లీలుగా ఉన్నారు. వారి దగ్గర ఉన్న సన్నదు ప్రకారం ఈ ఆలయానికి మాచినేనిపల్లె దగ్గరగల 240 ఎకరాల మెట్ట నరసింగాపురం అనే పేర సన్ 1245 లో చందూలాలుగారు ఆనాటి పూజారులైన నరసయ్య వగైరాలకు అర్చకానికి వ్రాసి యిచ్చినారు.

ఈ సన్నదు ఆలయం ఏర్పడిన ముప్పదేండ్లకు పుట్టిందట. దాన్ని బట్టి ఈ ఆలయం సన్ 1215 అనగా క్రీ. శ. 1795 లో నిర్మింపబడి నట్లు తేలుతుంది. అపుడు కొల్లాపురాన్ని రాజా జగన్నాథరావుగారు పాలిస్తున్నారు.

ప్రజలు చెప్పే కథను బట్టి ఇక్కడి స్వామి పూర్వుడే కాని ఆలయం మాత్రం అపుడు కట్టబడవచ్చు. ప్రస్తుతం ఇక్కడ తొలినాటి గర్భాలయం ఆలాగే ఉంచి దానికి చుట్టు రూపురేఖలు దిద్దినారు.

ఇది దక్షిణాభిముఖాలయం. ఇక్కడ స్వామి వెలసిన గుట్టకు శ్వేతాద్రి అని పేరు. దానిపై ప్రస్తుతం ఉన్న నిర్మాణాలన్నీ భక్తులే చేయించినారు. ఈ స్వామికి నైజాం ప్రభుత్వం ఉత్సవానికి ఏటా కొంత ధనం యిచ్చేది. దాన్ని పదకొండు సంవత్సరాలు సురభిదొరలు అట్లే ఉంచి స్వామికి యిపుడుండే శిలామంటపం వేయించినారు.

ఇక్కడి సత్రశాలను కర్నూలు నివాసి కటుకం బొర్రయ్య సెట్టి కుమారుడు బారయ్యసెట్టి కట్టించినాడు. అది శా.శ. 1819 హేవిలంబిలో కట్టించబడింది.

ఇక తక్కిన వాని కాలక్రమం ఈ విధంగా ఉంది:

1. శా.శ. 1854 లో కొల్లాపురం రాణి వెంకట రత్నమాంబగారు స్వామికి గోపురం కట్టించింది.
2. 1857 లో ఎదురుగా ఉన్న ఎర్రరాళ్ళ గుట్టకు రత్నగిరి అని పేరు పెట్టి దానిపై రత్నలక్ష్మి దేవాలయం, పద్మనిలయమనే విలాస భవనం కట్టించి తోట వేయించింది.
3. శా.శ. 1881 లో భక్తులు తేరు చేయించగా దానికి ఎదిరె నర్సింగ రావుగారు రథశాల కట్టించినాడు.
4. శా. శ. 1886 లో సురభి వెంకట జగన్నాథరావుగారు ఆలయానికి కుడివైపున ఉన్న స్నానాల గుండానికి మెట్లు కట్టించినాడు.
5. 1890 లో ధర్మపత్ని శ్రీమతి ఇందిరాదేవిగారి స్మారకంగా నృసింహ సాగరానికి కాలువను కట్టించినాడు.

ఇక్కడ సంక్రాంతికి ఏటా పదేను దినాలు అతివైభవంగా ఉత్సవం నడుస్తుంది. ఈ ఆలయానికి ఎదురుగా రత్నగిరి, దానిపై ఉత్తరాభిముఖంగా కల లక్ష్మీదేవి ఆలయం, దానికి ఎదురుగా ఎడమ వైపున విలాస భవనం.

నృసింహాలయానికి ఎడమవైపున విశాలమైన నృసింహ సాగరం-కుడివైపున ఈతకొలను, పంట కాలువలు, పచ్చని పొలాలు, జలజలమని పారే చిన్న కాలువలు ఎంతో మనోహరంగా కనిపిస్తవి. కాబట్టి ఈ వాతావరణాన్ని మరికొంత అభివృద్ధి పరచితే ఇది విద్యార్థుల విజ్ఞాన యాత్రలకు, సినిమావారికి విలాస యాత్రల చిత్రీకరణకు ఎంతో అనువుగా ఉండగలదు.

విలాస భవనం ఈ మధ్యకాలంలో పాతబడిపోయింది. దానిపై ధేవాదాయ ధర్మాదాయశాఖవారు శ్రద్ధ చూపించిన అది అత్యంత సుందర భవనంగా రూపుదిద్దుకోవటమేకాక అక్కడినుండి చుట్టు గ్రామాన్ని, ప్రకృతి దృశ్యాలనూ చూచే జనులకు, యాత్రికులకు అద్భుత దృశ్యాలు గోచరించి నయనానందకరం కలిగించవచ్చు.

కొడంగల్ తాలూకాలోని గుడులు

ఇది పూర్వం తాలూకా కేంద్రం. ఇపుడు మండల కేంద్రం. జిల్లాకు ముప్పదైదు కిలోమీటర్ల దూరంలో ఉంది.

ఈ ప్రాంతం పూర్వం రెండు తడవలు కన్నడ ప్రాంతానికి చెంది మళ్ళీ తెలంగాణాకు చెందినట్లు స్థానిక కైఫియత్తులవల్ల తెలుస్తుంది.

అనంతగిరి కొండ లిక్కడికి పన్నెండుమైళ్ళుంటవి. పూర్వం ఇదంతా అరణ్యమయం. ఇక్కడి అడవిలో అడవి పందులు, కోనెంగలు ఎక్కువ. అడవి పందిని సంస్కృతంలో క్రోడమంటారు. అందుచేత పురాణకాలం నాడిది వరాహక్షేత్రమని, అందుచేత దీనికి 'క్రోడంగళ్' అని వ్యవహార మేర్పడిందని ప్రాచీనులమతం.

తెలుగులో కోనెంగను 'కొడెంగ' అనికూడ అంటారు. కాబట్టి "కొడెంగలు" క్రమంగా కొడంగలుగా మారిందని జానపదుల కథనం, ఈ జంతువులలో మొదటిది శ్రీహరి అవతారమైతే రెండవది అతనిబంటు.

ఇది కన్నడ దేశానికి చెందిఉన్నపుడు నృపతుంగ మహారాజిక్కడ కేశవాలయం కట్టించి గ్రామానికి "కేశవపురం" అనిపేరు పెట్టినాడు. కాని అది నిలువలేదు. కేశవపురం అనే నామాంతరం ఈ జిల్లాలో గంగాపురానికి కూడా ఉన్నదికాని అది అక్కడకూడా నిలువ లేదు.

కన్నడంలో శైవ ప్రభావం ఎక్కువ. అందుచేత ఆ కాలంలో యిక్కడ నిరంజన మఠం అనే పెద్ద శైవమఠంగూడా ఉన్నది. అది ఈ ప్రాంతానికంతా పెద్దదై, దాని క్రింద చాలా గ్రామాలున్నవి కాని ఇపుడది కూడా నామమాత్రమయింది.

తెలంగాణాకు చెందిన పిమ్మట మొదట ఇది బీదర్ (విదుర) రాజ్యానికి చెంది ఉన్నది. దాన్ని మహమ్మద్‌షా పాలించే కాలంలో ఢిల్లీ సుల్తానులతని దగ్గరకు సుల్తాన్ కులీకుతుబ్‌షాసు పంపినారు. అంతవర కతడు తండ్రి వెంట రెండు తడవలీ ప్రాంతానికి వచ్చినాడు. అపుడత నికిక్కడి వాతావరణం నచ్చి నివసించవలెనని మనసు పడింది.

అలా ఉండగా మహమ్మద్‌షా ఒక పర్యాయం ఇక్కడి అడవికి సపరివారంగా వేటకు వచ్చినాడు. అపుడతని వెంట అందరు సరదారులతో పాటు కుతుబ్‌షాగూడా వచ్చినారు. అపుడందరికంటె అతనివేట పాదుషా గారికి బాగా నచ్చింది. దానితో అతనికి అన్ని పరికరాలతో నూటా ఏబది అరబు గుఱ్ఱాలను ఇచ్చి ఖిల్లతుకూడా దయచేసి వానిపోషణకు కొడంగలు ప్రాంతాన్ని అతని జాగీరుగా ప్రకటించినాడు.

మునుముందు ఈ కుతుబ్‌షాయే హైదరాబాదులో కుతుబ్‌షా వంశానికి స్థాపకుడైనాడు. అతడు సుబేదారుగా కాక జాగీరుదారుగా ఉన్నపుడు చాలాకాలం యిక్కడనే నివసించి పెద్ద కోట, రాజభవనం కట్టించుకున్నాడు. వాని అవశేషాలిపుడిక్కడనే వున్నవి.

ఇది గోలకొండకు చెందిన పిమ్మట వారితో యిది లోకాయపల్లె ప్రభువుల కీయబడింది. అపుడు వారిక్కడ ఒక శివాలయాన్ని కట్టించి నారు. అది యిపుడుంది.

పూర్వం యిది వరాహక్షేత్రం అన్నాను. తిరుపతి గూడ మొదట వరాహ క్షేత్రమే. అక్కడ కోతు లెక్కువ. ఇక్కడ కోనెంగ లెక్కువ. అందుచేతనే కాబోలు ఇపుడిక్కడికి తిరుపతి వేంకటేశ్వరస్వామి లక్ష్మీ దేవితో వచ్చి వెలసినాడు. ఇక్కడ అతని అర్చనాదికం, బ్రహ్మోత్సవం తిరుపతికి ఏమాత్రం భేదంలేకుండ జరుగుతవి. ఆ కారణంగా యిపుడు దీన్ని కొండపైలేని తిరుపతి అంటున్నారు.

మల్లికార్జునాలయం - దుద్యాల

ఈ గ్రామం కోడంగలుకు తూర్పున పది కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇపుడు బొమ్మరాసిపల్లె మండలంలో చేరింది.

పూర్వం ఇది ఒక మఖ్తా. ఆనాటి దొరగారి కోటగూడ యిపుడు శిథిలావశేషాలలో ఇక్కడ ఉంది.

ఇక్కడి శివాలయం గ్రామానికి అరకిలోమీటరు దూరంలో ఉత్తర దిశన ఏకాంత స్థలంలో ఉంది. ఆలయం విశాలంగా వసతిగా ఉంది గాబట్టి చుట్టు ప్రక్కల వారక్కడ పెండ్లిండ్లుగూడ జరుపుకుంటారు.

ఏటా శివరాత్రికి పెద్ద ఉత్సవం జరుగుతుంది. అపుడు తోకాపురం, పోలెపల్లి, గౌరారం, లగచెర్ల, హకీంపేట, కోసిగి, పర్సాపురం, హస్నాబాదు, చంద్రవంచ మొదలైన గ్రామాలనుండి ప్రజలువచ్చి మొక్కులు చెల్లిస్తారు.

ఇదిగాక గ్రామంలో ఆంజనేయాలయం ఉంది. దానిలో ఏటా శ్రీరామ కల్యాణం నడుస్తుంది. ఈ రెండు ఆలయాలకు ఒక్కరే పూజారిగా ఉన్నారు.

చెన్నరాయని గుడి - బోగారం

ఇది కోసిగి మండలంలోని ఊరు. కోడంగలుకు ఇరవై కిలోమీటర్ల దూరం ఉంది. ఇక్కడ గ్రామ సమీపంలో ఉండే గుట్టపై ఈ ఆలయం ఉంది. ఇక్కడికి మహబూబ్‌నగర్ నుండి తాండూరు వెళ్ళే రూటులో జానంపల్లి గేటు దగ్గర దిగి కూడా వెళ్ళవచ్చు. అక్కడికి నాలుగు కిలోమీటర్లు ఉంటుంది. ఇదిగాక కోడంగలు నుండి గూడ బస్సులుంటవి.

ఇది ఏకకూటాలయం. ఇక్కడ గుట్టపై చిన్నపాటి గుడి మంటపం మాత్రం ఉన్నవి. అక్కడ ప్రతి యేట శ్రావణంలో శనివారం

నాడు మాత్రమే ఉత్సవం జరుగుతుంది. ప్రజలు వచ్చి స్వామిని దర్శించి పూజించి వెళ్ళిపోతారు. రాత్రికి అక్కడ ఎవరూ ఉండరు. రాత్రివేళ ఈ స్వామిని మునులు వచ్చి పూజిస్తారని ప్రసిద్ధి.

చెన్నకేశవునికి సాధారణంగా మాలవారు పూజారులుగా ఉంటూ ఉంటారు కాని ఇక్కడ ఈ సమీపంలోగల వాగులాయపల్లెలోని విశ్వబ్రాహ్మణులు పూజారులుగా ఉన్నారు.

భీమాంజనేయాలయము - మోదంపల్లి

ఇది కోడంగలు తాలూకాలోని బొమ్మరాసిపల్లె మండలంలో ఉన్న గ్రామం. కృష్ణానదికి ఉత్తరంగా పదారు కోసుల మీద ఉంది.

పూర్వం ఈ ప్రదేశానికి పాలాశవనం అని పేరు. ఆ వనంలో కాలాంతరంలో గ్రామం వెలసింది కాబట్టి దాన్ని మోతుకుపల్లి, మోదుగు పల్లె అన్నారు. అది క్రమంగా ఈనాడు మోదంపల్లె అయింది.

ఇది బీచుపల్లివలె ప్రసిద్ధ హనుమత్ క్షేత్రం. ఇక్కడ ఉన్న ఆంజనేయునికి భీమాంజనేయుడని పేరు. ఇతని పాదాల క్రింద జంబుమాలి అనే రక్కసుడున్నాడు. ఈ స్వామి స్వయంవ్యక్తుడని, ఇక్కడి వారి నమ్మకం.

ఈ స్వామివారికి ఉపబర్హణుడనే గంధర్వుడు పార్వతీదేవి శాపం చేత శూద్రుడై పుట్టి, రాజై ఇపుడున్న ఆలయాన్ని కట్టించి పుష్కరిణిని నిర్మింపించి శాపవిముక్తుడైనట్లు స్థలపురాణం చెబుతుంది. కాని మానవుడై పుట్టిన ఆ గంధర్వరాజు పేరేదియో అది చెప్పలేదు.

ఇక్కడి ఆలయం విశాలంగా చక్కగా మంటప గోపురాలతో ఉంది. ఏటా మార్గశిర శుద్ధ త్రయోదశినాడు ఉత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవం వారం దినాలు నడుస్తుంది.

ఈ స్వామివారి మాహాత్మ్యాన్ని శ్రీ లోకుర్తి రాఘవేంద్రాచార్యులు గారు "శ్రీ మోదంపల్లి హనుమద్భీమ మాహాత్మ్యం" అనే పేరుతో రచించినారు అది స్కాంద పురాణంలో ఉందని చెప్పినారు.

భవాని ఆలయం - రుద్రవరం

ఇది కోడంగల్ మండలంలోని గ్రామం. కోడంగల్ నుండి యాదగిరికి వెళ్ళే బస్‌రూటులో ఉంది. రావులపల్లి స్టేజి దగ్గర దిగి రుద్రవరం వెళ్ళవలసి ఉంటుంది. రుద్రవరం గ్రామాలు కాకతి రుద్రమదేవి ప్రతాపరుద్రుని పేర వెలసిన గ్రామాలని పరిశోధకుల మతం. అయితే యిక్కడ భవాని ఆలయం ప్రసిద్ధి కాబట్టి ఇది తప్పక రుద్రమదేవి పేర వెలసిన గ్రామమే అనవలసి ఉంది.

ఏకాంబరేశ్వరాలయం

ఈ ఆలయం రుద్రవరానికి అయిదు కిలోమీటర్ల దూరంలో తెలంగాణా కర్నాటక సరిహద్దు మీద ఉంది.

ఇక్కడ సుమారు ఇరవై గజాల పొడవుగల కోనేరుంది. దానిలో ఎల్లప్పుడూ రొమ్ములబంటి నీరు ఉంటుంది. ఏకాంబరేశ్వరాలయం ఈ కోనేరులో కట్టబడింది. మహంకాళీ మహేశ్వరంలో రాజరాజేశ్వరాలయం కూడా ఇలాగే శివగంగ అనే కోనేటిలో కట్టబడింది. అయితే ఈ స్వామి దగ్గరకు వెళ్ళటానికి అక్కడ ఒడ్డు నుండి స్వామి వారి వరకు వంతెన ఉంటే ఇక్కడ నీటి అడుగున గుడివరకు బండలు పరుపబడినవి. వేసవి అయితే ఈ నీరు మోకాటి బంటి అవుతుంది.

ఇది ఈ ప్రాంతంలో మిక్కిలి ప్రసిద్ధమైన క్షేత్రం. చుట్టుపట్ల వారు శివరాత్రికి యిక్కడికి వచ్చి స్వామిని పూజిస్తారు.

కోటకదిరె చంద్రమౌళీశ్వర స్వామివారి జన్మగ్రామం చిలుముల మైలవరం అతనికి ఈ స్వామిని దర్శించిన పిమ్మటనే ఆధ్యాత్మిక ప్రేరణ కలిగింది. కాబట్టి ఈ ఆలయం "పురుషోత్తమానంద విజయం" అనే కావ్యంలో పేర్కొనబడింది

గద్వాల తాలూకాలోని ఆలయాలు

ఈనాటి గద్వాల అడుగు మొదట ఉప్పేడుకోట నవాబు సయ్యదు దావూద్‌మియాగారి ఆధీనంలో ఉన్న అరణ్య ప్రదేశం. అక్కడికి ఒకపుడు పెద్ద సోమనాద్రి వేటకువచ్చి, కృష్ణాతీరంలోగల ఆ స్థలాన్ని చూసి అక్కడ కోటకట్టి తర్వాత రాజధానిని అక్కడికి మార్చినాడు. అంతవరకు వారికి మొదట పూడూరు, ఆ తర్వాత రాజోలి రాజధానులుగా ఉన్నవి.

ఇక్కడి కోట నిర్మాణాన్ని గురించి ఈ క్రింది ఉదంతం ప్రసిద్ధంగా ఉంది. సోమనాద్రి కోట పని ప్రారంభించి గోడను పెట్టిస్తుం డగా అది ఎంతకూ నిలవలేదు. కూలి పడుతూ ఉండేది. అపుడు ఒక నాడు అతడు ఆలోచిస్తూ నిద్రించగా కలలో, ఒక పురుషుడు కనిపించి దానికి ఒక బ్రాహ్మణుని బలి యిచ్చినట్లయితే గోడ నిలుస్తుందని చెప్పినాడు.

ఆ స్వప్న ప్రకారాని కతడు మేలుకొని చింతిస్తుండగా ఆ ఉదంతం చుట్టుపట్ల గ్రామాలకు తెలిసింది. అపుడొక గ్రామంలో పునుక నెత్తి బాపడున్నాడు. తెలంగాణంలో తల ఆకారానికి తగినట్లుగాకాక పీలగా ఉన్న వానిని పునుకనెత్తి వాడంటారు.

అతడు బ్రాహ్మణుడైనా విశేష బుద్ధిబలం లేక జాతిమాత్రోప జీవిగా ఉన్నాడు. అతనికి పిల్లనుగూడ ఎవరీయలేదు. అతడు ప్రభువుగారి స్వప్నవృత్తాంతం తెలుసుకున్నాడు. అతని దగ్గరికి వెళ్ళి, కోటకు బలికి తాను సిద్ధమని, అయితే కోటలో తనపేర ఒక ఆలయం నిర్మించి, దానిలో వేదోక్త విధంగా పూజ జరిగే అట్లు ఏర్పరచవలెనని కోరినాడు. అది విని

సోమనాద్రి అతని కోరిక నంగీకరించి ఒక సుముహూర్తంలో అతనిని బలియిచ్చి, కోట పూర్తియైన పిమ్మట దానిలో అతని పేర యిపుడక్కడ ఉన్న కేశవాలయాన్ని ప్రతిష్ఠించాడు.

ఇక ఈ కోటస్థలాన్ని దావూద్ మియాగారికి మొదట కప్పం చెల్లిస్తానని తీసికొని కోట సిద్ధమైన పిమ్మట అతనిని జయించి వశపరచుకున్నాడని శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు చెప్పినారు. ఈ స్థలానికి మొదట "గద్దగూడెం" అనిపేరు.

కేశవాలయం

గద్వాల పట్టణం మతత్రయం వారికి నిలయం. అందుచేత అక్కడ శివ కేశవులకు వారి పరివార దేవతలకు ఎన్నో ఆలయాలు వెలసినవి. వానిలో చెన్నకేశవాలయం అన్ని విధాలా చెప్పదగినట్లుగా ఉంది.

గద్వాల ప్రభువులకు పూడూరి చెన్నకేశవుడు కులదైవం అందుచేత చారిత్రకులు సోమనాద్రి అక్కడి స్వామినే తెచ్చి యిక్కడ ప్రతిష్ఠించినాడని అంటారు కాని దీనికి ప్రజా కథనం వేరుగా ఉంది.

ప్రస్తుతం ఖిల్లా గణపురం దగ్గర అల్లీపేట గుట్ట ఉంది. దానిపై చోళులనాటి ఒక ప్రాచీనాలయం ఉంది. దాన్ని అక్కడివారు యదునాథాలయమంటారు. అది అమరాబాదు శివాలయంపలె ఉంది. ఒకపుడు దానిలో ఉత్సవం చాలా ఘనంగా సాగేదట కాని గణపురాన్ని మహమ్మదీయులాక్రమించుకొన్న పిమ్మట ఆ ఉత్సవం పడిపోయింది.

ఆలయం పూజా పురస్కారాదులు లేకుండా కాగా సోమనాద్రి అక్కడి స్వామిని తెచ్చి తాను నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించినాడట. అపుడాయనకు అక్కడి బోయలు అడ్డుతగులగా, ఆయన స్వామివారు మా దగ్గర ఉన్నా ఆయన తేరులాగే అధికారం మీకే యిస్తానని వారిని సమాధానపరచి స్వామిని కొని వెళ్ళినాడట.

దీనికి నిదర్శనంగా గద్వాల జాతరలో గణపురం బోయలే తేరు లాగేవారు. చాలా కాలం ఈ ప్రథ సాగింది. చివర కొంత కాలానికి వారు చాలా మంది వెళ్ళటం మాని, లాంఛనంగా ఒక్కడు మాత్రం వెళ్ళేవాడు. క్రమంగా అతడు గూడా మాని, గద్వాలవారు గణపురం బోయలు వచ్చినారని చెప్పటం మాత్రం ఆచారంగా మిగిలింది. ఆ పేరైనా చెప్పకుండా అక్కడి తేరు కదలదట.

ఈ ఆలయానికి పెద్ద సోమనాద్రి పిమ్మట చిన్న సోమనాద్రి క్రీ. శ. 1770 లో తన భార్య పేర విమానాన్ని, 1779 లో ఒక రామాలయాన్ని. 1788 లో ఒక భూదేవి ఆలయాన్నిగూడా కట్టించినాడు.

చిన్న సోమభూపాలుని పిమ్మట మూడవ సోమభూపాలుని భార్య రాణీ వెంకట లక్ష్మమ్మగారు క్రీ. శ. 1849 లో మహాద్వారం తక్కిన గోపురాలు కట్టించింది.

ఈవిధంగా యిది ముగ్గురు ప్రభువులతో పూర్తి అయింది. అయితే ఆ ముగ్గురు ఒకే పేరు కలవారు కావటం విశేషం.

ఈ ఆలయం విశాలమైన ప్రాకారంతో ఎత్తయిన గోపురాలతో చూపరులకు గంభీరంగా కనిపిస్తుంది ఇందలి గుడులన్నీ చక్కగా ఉన్నవి. ఈ గోపురాలపై ప్రతిమాశిల్పం లేదు కేవలం స్తంభాలు మాత్రమే తీర్చి కట్టినారు.

రామకృష్ణాపురం - అగ్రహారం

ఇది గద్వాలకు రెండు మైళ్ళ దూరంలో కృష్ణాతీరంలో ఉంది. ఒకప్పుడు కృష్ణాతీరానికి చిన్న సోమభూపాలుడు విహారానికి వెళ్ళగా అక్కడ అతనికి ఒక ఎత్తైన గుండుపై రామావధూత అనే యోగి తీవ్రమైన తపస్సమాధిలో కూర్చుని ఉండి కనిపించినాడు. అది చూచి రాజావారక్కడ అతనికొక మఠాన్ని కట్టించినాడు.

ఆ తర్వాత ఈనాడక్కడ చాలా ఆలయాలు వెలసినవి. గద్వాల వారికి శుభాశుభ కార్యాల కన్నిటికి ఇపుడది ఒక ముఖ్య స్థానంగా ఉంది.

ప్రస్తుతం ఈ అగ్రహారం గద్వాలలో ఒక భాగమయింది.

రామలింగేశ్వరాలయం - చాగదొన

చాగదొనకు పూర్వం చ్యవనకాశ్రమమని పేరు. ఇది వేణీ సోంపురం దగ్గర ఉంది. ఈ దొన యిపుడు గట్టు మండలంలోని గ్రామం.

ఇక్కడ ఒక విశాలమైన బండపై రామలింగేశ్వరాలయం ఉంది. దాని వెన్నుగోడకు ఉన్న శాసనాన్నిబట్టి అది చ్యవన మహర్షిచే ప్రతిష్ఠితమైనట్లు తెలుస్తుంది.

చ్యవన మహర్షి ఆ స్వామిని ప్రతిదినం వేణీ సోంపురం దగ్గరగల నదీజలాన్ని తెచ్చి అభిషేకించేవాడట. ఒకనాడతడు ఆ నదికి వెళ్ళలేక అక్కడ బండపై కూర్చుని భగవద్ధ్యానం చేయగా అక్కడ దానిపై అపుడా దొన ఏర్పడెనట.

దానిలో ఎల్లపుడు నీరుంటుంది. చ్యవన మహర్షిచే ఏర్పడింది కాబట్టి అది చ్యవన దొన అని పిలువబడేది. కాలక్రమేణ ఇపుడు చాగదొన అయింది.

ఆంజనేయాలయం - చింతరేవుల

ఇది గద్వాల తాలూకాలోని గ్రామం. ప్రస్తుతం దరూరు మండలంలో ఉంది. గద్వాలకు ఆరుమైళ్ళ దూరంలో కృష్ణాతీరంలో ఈ ఆంజనేయాలయం వెలసింది. దానికి చింతరేవుల సమీపం కాబట్టి ఈ స్వామిని చింతరేవుల ఆంజనేయుడు అంటున్నారు.

ఈ ఆలయం అయిదువందల ఏండ్లనాటి దంటారు. చంద్రికాచార్యులనే వ్యాసరాయలు ఈ స్వామిని ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. ఇక్కడి

స్వామి ఊర్ధ్వదృష్టి కలవాడు. ఊర్ధ్వదృష్టికల ప్రతిమలలో ఉగ్రత్వం ఉంటుందని వాడుక.

దానికనుగుణంగానే ఇక్కడ తరచుగా పూజారులు అకాల మరణం పాలవుతూ ఉండేవారు. అది చూచి మొదలికల్లు నివాసియైన శేషదాసుల వారు వచ్చి యిక్కడ కొంతకాలం తపంచేసి, స్వామివారి ఉగ్రత్వాన్ని శాంతింప జేసినాడు. నాటినుండి ఇక్కడ పూజారుల మరణం ఆగింది.

అయినా యిక్కడి స్వామికి మాత్రం ఇంకా ఉగ్రత్వం తగ్గలేదు. పూజారులతో ఏకొద్ది అపచారం జరిగినా స్వామివారు కడవముందు నాగసర్పరూపంలో ధర్శనమిస్తూనే ఉంటారు.

ఇక్కడి పూజారులు మధ్వాలు.

కేశవాలయం-పూడూరు

ఈ గ్రామం రాజధానికి ఏడు మైళ్ళ దూరంలో దక్షిణ రైల్వే మార్గంలో ఉంది. ఈ తాలూకాలో ఇది మిక్కిలి చరిత్రప్రసిద్ధి గల గ్రామం. శాసనాలలో దీనికి పుండ్రపురమని నామాంతరం. పుండ్ర పురాన్ని చంద్రకేతు మహారాజు పాలించినాడని గంగాపుర మాహాత్మ్యం, పూడూరును జయలక్ష్మీపతి రాయడు పాలించినాడని కలువకొలను కైఫియత్తు చెబుతవి కాని వీరేకాలం నాటివారో వివరాలు తెలియవు.

క్రీ.శ. 9 వ శతాబ్దిలో యిది పశ్చిమ చాళుక్యులకు రాజప్రతినిధి పురంగా ఉన్నది. ఆనాడిది ఒక గొప్ప జైనక్షేత్రం. పశ్చిమ చాళుక్య మొదటి సోమేశ్వరునిపై అధిరాజేంద్రుడు జరిపిన దండయాత్రలో అతని సైన్యం ఈ పట్టణాన్ని పట్టుకొని యిక్కడి మేడలు కూల్చి గాడిదలతో గ్రామాన్నిదున్ని వరాంతికం విత్తులు చల్లినట్లు శాసనాల వల్ల తెలుస్తుంది.

వీరశైవం విజృంభించిన కాలంలో వారిక్కడి జైనులపై ఆక్రమణచేసి పార్శ్వనాథాలయాన్ని వీరభద్రాలయంగా మార్చుకున్నారు.

అపుడు వారికి జరిగిన యుద్ధోదంతం ఆ ఆలయానికి ఉత్తరపుగోడలో ఉన్న వీరగల్లులను బట్టి తెలుస్తుంది ఈ ఆలయ విమానం సోపాన క్రమంలో పైకి వెళ్ళగా వెళ్ళగా సన్నబడింది. దానిలో యిపుడు పార్శ్వనాథ - యక్షిణీ ప్రతిమలకు బదులు శివ - వీరభద్ర ప్రతిమలున్నవి.

గద్వాల పెద్ద సోమనాద్రి యిక్కడి నాడగౌడుల యొక్క వారసుడననియే చెప్పుకొని తన పునాదులు పటిష్టం చేసికున్నాడు. అతడు పోకనాటి వంశానికి చెందిన వీరుడు.

ఈ గ్రామంలో కేశవాలయం ప్రసిద్ధి. దాన్ని యిక్కడ పెద్ద సోమనాద్రియే కట్టించినాడంటారు దాని ద్వారం అక్కడ ఒక పొలం దున్నుతూ ఉంటే దొరికిందట.

పూర్వం యిక్కడ చాలా ఆలయాలున్నవి. ఆయా కాలాలలోని యుద్ధాలలో అవి ఎన్నో నేలమట్టమయినవి. కాబట్టి ప్రస్తుతం చెన్నకేశవాలయానికి అమర్చిన ద్వారం ఏ గుడిదో తెలియదు.

ఆంజనేయాలయం - బీచుపల్లె

ఈ గ్రామం కృష్ణాతీరంలో వనపర్తినుండి గద్వాల రూటులో గద్వాల తాలూకాకు చెంది ఉంది. ఇక్కడి ఆంజనేయస్వామి ప్రసిద్ధుడు.

కృష్ణానది గోదావరికంటె మొదటిదని పరిశోధకుల మతం. యమునాతీరం వెంట ఉన్నట్టు ఇక్కడ దీని తీరం వెంట గూడ ఎందరో మహర్షులు తపం చేసిన ప్రదేశాలున్నవి. అటువంటి వానిలో ఇది గూడా ఒకటి. పూర్వం ఈ ప్రదేశానికి కణ్వాశ్రమ మని వ్యవహారం.

దక్షిణదేశంలో నదీతీరాల్లో తపం చేసిన ఈ కణ్వాదు లార్యావర్తంలో కనిపించే ఋషులుగాదు. ఆ పేరుగల మరొకరు. ఇప్పటికీ యిక్కడి నదుల తీరాలలో తపోనుకూలమైన ప్రదేశాలెన్నో ఉన్నవి.

బీచుపల్లెలోని ఆంజనేయస్వామిని వ్యాసరాయలు ప్రతిష్ఠించినాడని చెబుతారు. శ్రీకృష్ణదేవరాయలు సింహాసన మధిష్ఠించిన పిమ్మట క్రీ. శ. 1521 వ సం॥న అతనికి కుహూయోగం ప్రారంభమాయెనట. అపుడు మహారాజు శ్రీ వ్యాసరాయల నాశ్రయించగా, ఆయన క్రీ. శ. 1521 నుండి 24 వరకు మూడేండ్ల కాలం తానే శ్రీకృష్ణ ముద్రతో రాజ్య పాలనముచేసి అనంతర మతని సామ్రాజ్య మతనికి దానం చేసెనట. అపుడు రాయలు వ్యాసరాయలను సత్కరింపదలచి మదనపల్లి జిల్లా నంతటి నతనికి దానం చేసిరట. అప్పటినుండి ఆ ప్రదేశానికి వ్యాస సముద్రం అని రూఢియైనదట. చూ. ద్వైతమతము - హరిదాసుల సేవ పు. 41, 42.

శ్రీకృష్ణదేవరాయలచే వ్యాసరాయలు "వ్యాస సముద్రం" దానం గ్రహించిన పిమ్మట ఆ దోష పరిహారార్థం 378 ప్రాణ దేవరల ప్రతిష్ఠలు చేసినాడట కాబట్టి ఇక్కడి ప్రతిష్ఠ వానిలో ఒకటిగా భావింప బడుతుంది. వ్యాసరాయల ప్రతిష్ఠలో హనుమంతుని కిరువైపులా శంఖ చక్రాలుంటవి.

వ్యాసరాయలు దినమొక హనుమత్ప్రతిష్ఠ చేయకుండా భుజించే వాడు కాదని కూడా ఒక వాడుక ఉంది. ఆయన ఇక్కడ హనుమంతుని ప్రతిష్ఠించి మొదట ఎవరు స్వామి దర్శనానికి వస్తే, వారినే పూజారిగా నియమించమని సెలవిచ్చినాడు. అపుడక్కడ స్వామి దర్శనానికి మొదట బీసన్న అనే బోయపిల్లవాడు స్వామి దర్శనానికి వచ్చినాడు. అందువల్ల బీచుపల్లిలో యిపుడు ప్రథమపూజ బోయవారిదిగా ఉంది.

వారు బీచుపల్లికి సమీపంలో నియత్ఖాపురంలో ఉంటారు. అక్కడ స్వామి నర్చించేవారు నాలుగు కుటుంబాల వారున్నారు. వారికి స్వామి అర్చనకుగాను ఒక్కొక్క మగపిల్లవాడు మాత్రమే యిప్పటివరకు

కలుగుతూ వస్తున్నాడు. ఆడసంతానం ఎందరైనా కలుగవచ్చు కాని పురుష సంతతి మాత్రం కుటుంబానికి ఒక్కొక్కడే కలుగుతున్నాడు. ఇదొక విచిత్రం.

ఈ బోయవారు స్వామిని వంతుల ప్రకారం పూజిస్తుంటారు. స్వామిని పూజించే రోజులలో వారు చాలా నియమనిష్ఠలతో ఉంటారు.

క్రీ.శ. 1961 లో అష్టగ్రహకూటం సంభవించినపుడు గద్వాల నివాసియైన శ్రీ కె పి వర్ధన్ గారు ఇక్కడ గొప్ప శ్రీ రామకోటి యాగం చేసినారు. దానితో ఈ క్షేత్రం దేశవ్యాప్తంగా తెలిసివచ్చింది. ఈ క్షేత్రాన్ని గురించి శ్రీ గడియారం రామకృష్ణశర్మగారు ఒక స్థల చరిత్ర కూడా రచించినారు.

ఇక్కడ జాతీయరహదారిపై రంగాపురం దగ్గర కృష్ణపై పెద్ద వంతెన కట్టబడింది. అది ఈ క్షేత్రానికి అంచుననే ఉంది కాబట్టి దానితో వనపర్తి, గద్వాలకు నేరుగా సంబంధం ఏర్పడటంతో పాటు అది ఈ క్షేత్రాభివృద్ధికి కూడా ఎంతో దోహదం చేసింది.

చెన్నకేశవాలయం - బోరవెల్లి

ఇపుడిది గద్వాల మండలంలోని గ్రామం. ఒకప్పుడిది గూడ ఆ ప్రభువులకు రాజధాని. గద్వాలరాణి గిరెమ్మగారు కట్టించినకోట, చెన్నకేశవాలయం ఈ గ్రామానికి పెట్టని ఆభరణాలు.

ఇక్కడి చెన్నకేశవాలయానికి గచ్చుగాని, మన్నుగాని ఉపయోగించలేదు. పెద్ద పెద్దరాళ్ళు ఇనుప కడ్డీల సాయంతో నిలిపినారు. ఈ ఆలయం ఆరే ఆరు దినాలలో పూర్తిచేయబడింది. ఇది దీని ప్రత్యేకత. చరిత్రలో ఇంత తొందరగా పూర్తిచేసిన ఆలయం మరొకటి లేదు.

ఇక్కడ ఏటా పుష్యమాసంలో పూర్ణిమనుండి విదియవరకు చెన్న కేశవస్వామి బ్రహ్మోత్సవం జరుగుతుంది. అపుడు స్వామిని తేరుపై ఊరేగిస్తారు. ఇది చాలా పురాతనమైన జాతర.

ఈ గ్రామంలో ఇదిగాక ఇంకా సోమేశ్వరస్వామి,వీరభద్రస్వామి, మాధవస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నవి.

ప్రోలుగంటి సోమేశ్వరస్వామి గూడ గద్వాల ప్రభువులకు ఇలువేలుపు.

మరో గద్వాల - రాజవోలు

ఇది గద్వాల ప్రభువులకు రెండవ రాజధాని.గద్వాలకు సోమనాద్రి యిక్కడి నుండియే వెళ్ళినట్లు చెబుతారు.

ఇక్కడ తుంగభద్ర రెండు పాయలుగా చీలి, ఒక లంకవలె ఏర్పడింది. ఇపుడిక్కడ డైవర్షన్ స్కీమ్ క్రింద తుంగభద్రానదికి ఒక ప్రాజెక్టు కట్టబడుతున్నది.

రాజప్రోలు అనగా రాజుల యొక్క పట్టణం. గద్వాల ప్రభువుల పిమ్మట దీన్ని వారి జ్ఞాతులు పాలించినారు.

ఇక్కడ గద్వాల వలెనే కోట, దానిలో సభామంటపం, కోటచుట్టు కందకం ఉన్నవి. కోటలో వీరనారాయణస్వామి ఆలయం, కేశవాలయం, వేణుగోపాలాలయం, శ్రీదేవి భూదేవి ఆలయాలు, శివాలయం ఉన్నవి.

నదీతీరంలో రామేశ్వరాలయం ఉంది.

ఇపుడిక్కడ రాజోలిబండ ప్రాజెక్టు పేర తుంగభద్ర డైవర్షన్ కాలువ త్రవ్వబడింది. దీని నీరు కొంత మైసూరు పట్టణానికి కూడా అందుతుంది.

వేణుగోపాలాలయం - వల్లూరు

ఇది ఇటిక్యాల మండలంలోని గ్రామం. మానవపాడు స్టేషన్‌కు రెండున్నర మైళ్ళ దూరంలో ఉంది. ఇక్కడ గల వేణుగోపాలాలయం ప్రసిద్ధి.

వల్లూరు గద్వాల తాలూకాలోని ప్రాచీన గ్రామాలలో ఒకటి. ఇక్కడ గల ఒక శాసనాన్నిబట్టి, అది గణపతిదేవుని సామంతుడైన గంగయసాహిణికి అనంతరం రుద్రమదేవి, ప్రతాపరుద్రుల సామంతుడైన త్రిపురాంతకునికి రాజధానిగా ఉన్నట్లు తెలుస్తుంది.

ఇక్కడి వేణుగోపాలస్వామిని శ్రీ వ్యాస తత్వజ్ఞులు ప్రతిష్ఠించినట్లు చెబుతారు. ఈ స్వామికి చైత్రశుద్ధ పంచమి నుండి దశమివరకు అయిదు రోజుల ఉత్సవం జరుగుతుంది.

వేణుగోపాలాలయం-వేణిసోంపురం

ఇది అయిజ మండలంలోని గ్రామం. గద్వాలకు పదేనుమైళ్ళలో తుంగభద్రా నదీ తీరంలో ఉంది.

పూర్వం ఈ ప్రదేశానికి చ్యవనకాశ్రమమని ప్రసిద్ధి. చ్యవన మహర్షి ఇక్కడ తపం చేసినట్లు స్థలపురాణం చెబుతుంది. తెలుగుభాషలో అనేక వేదాంత గ్రంథాలను రచించిన శ్రీ వ్యాస తత్వజ్ఞు లిక్కడనే తపస్సిద్ధి పొందినట్లు చెబుతారు.

ఆయన ఇక్కడ ఒక చెరువు వేయిస్తుండగా నేలలో రెండు వేణుగోపాల విగ్రహాలు దొరికినవట. అపుడు వానిలో ఒకటి వల్లూరులోను, మరొకటి ఇక్కడ ప్రతిష్ఠించినట్లు చెబుతారు.

జడ్చర్ల తాలూకాలోని గుడులు

దీనికి మొదట జలచెర్ల అనిపేరు. ఈ గ్రామం మొదట నీటి ఎద్దడిలో ఉండగా అక్కడి తెలుగువారు కొందరు ఒకచోట చెరువు వంటి బావిని త్రవ్వుకొని అక్కడ నివసించినారు. వారిని చూచి క్రమంగా అక్కడ జనంచేరి అది జలచెర్లగా పిలువబడింది.

ఇక్కడ నీటి ఎద్దడేకాక అది మంచిదికాదట కూడ. అందుచేత దీన్ని మొదట చెడుచెర్ల అని పిలిచేవారని, అదే నేటి "జడ్చర్ల" అయింది అనికూడ ఒక వాడుక ఉంది. ఇపుడీ గ్రామానికి నీటివసతి యేర్పడింది.

సన 1892 లో నల్లగొండ నుండి పాలమూరు జిల్లాను వేరు చేసినారు. అపుడు దానిలో అమరచింత, గద్వాల, గురుకుంట, జడ్చర్ల, నాగర్‌కర్నూలు, వనపర్తి అనే ఆరు తాలూకాలున్నవి. వానిలో జడ్చర్ల డివిజనుగా, నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రముగా ఉన్నది.

క్రీ.శ. 1904 లో పాలమూరికి రైలు ప్రారంభమయింది. అయితే అది క్రీ.శ. 1916 నాటికిగాని ఆ దారిపై సంపూర్ణంగా నడువలేదు.

మొదట రైలు షంషాబాదు వరకే ఉండేది. ఆ కాలంనాడు నల్లగొండ పాలమూరు జిల్లాలకు అదే పెద్ద మార్కెట్టు. వ్యాపారపు పంటలన్ని బండ్లమీద అక్కడికే వెళ్ళేవి. గ్రామస్థులు ఒకేసారి ముప్పద నలువది మంది కలిసి సాయుధులై తమ ఛకడీబండ్లను తోలుకొని వెళ్ళే వారు. అపుడు దారిదోపిడిగాండ్రు ఎక్కువ కాబట్టి రైతులకు అదొక పెద్ద సాహసయాత్రగా ఉండేది. అటువంటి కాలంలో ఇక్కడ రైలు మార్గం పడింది.

అపుడు రైలు స్టేషన్ ఏర్పడినచోట ప్లేగు వ్యాపిస్తుందని సామాన్యులభయం. అందుచేత సర్కారు ఎక్కడైనా ఆ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నపుడు గ్రామస్థు లాక్షేపించేవారు. అందుచేత తొలిదినాలలోని రైలు స్టేషన్లన్ని ఆ యా గ్రామాల పేరుతో ఉన్నా ఊరికి పరువు రెండు పరువుల దూరంలో ఉండేవి. అందుచేత జడ్చర్లగూడ అలాగే స్టేషనుకు చాలా దూరంలో ఉన్నది. అక్కడ అప్పటికి ఈనాటి బాదేపల్లి లేదు. కాని ఈనాడు రంగనాథాలయం ఉన్న గట్టుమాత్రం ఉంది. దానిపై ఇప్పటి రంగనాథాలయం వెనుక ఒక గుండుకు నిలువెత్తు వీరభద్ర మూర్తి గండరింపబడింది. అతనిముందు గూడ ప్రకృతిసిద్ధమైన కొలను ఉంది. వీరభద్రుడున్నాడుగాబట్టి దానికి భద్రగిరి అనిపేరు.

జడ్చర్లపేర అక్కడ రైల్వేస్టేషను పడిన పిమ్మట అక్కడి వ్యాపారులు షంషాబాదు వంటి మార్కెటు అక్కడ తెరిచితే రైతులకు సౌకర్యంగా, తమకు లాభంగా కూడ ఉంటుందని ఆలోచించి, ఆ స్టేషన్ సమీపంలో భాగ్యేశ్వరిపాలెం పేర ఈనాటి గంజ్ ప్రారంభించినారు. వారు గ్రామం ఆరంభించిన వేళా విశేషం మంచిది కాబట్టి భాగ్యేశ్వరి అనుగ్రహంచేత ఆ గ్రామం అచిరకాలంలోనే అభివృద్ధిని పొంది, ఈనాడు జడ్చర్లను మీరిపోయింది. ఇపుడు దీన్ని బాజేపల్లి, బాదేపల్లి అని రెండు విధాలుగా పిలుస్తున్నారు.

ఇక్కడ భాగ్యేశ్వరీదేవి ఆలయమేకాక మరో రెండు శివాలయాలు, ఒక ఆంజనేయాలయం ఉన్నవి.

భాగ్యేశ్వరీ ఆలయం స్థానికులైన కరణంవారు కట్టించినారు.

ఒకపుడు శ్రీ కంచి పెద్దస్వామి వారిక్కడికి వచ్చి, గట్టుపై ఉన్న వీరభద్రుని చూచి "శ్రీ రాజార్కకిరీట భద్రగిరి బాజేపల్లి గౌరీశ్వరా" అనే మకుటాన్ని యిచ్చి, దీనితో ఎవరైనా శతకం వ్రాయండి అని ఆదేశించినారట. అపుడు అక్కడి నివాసియైన "కాశీ రామశర్మ" గారు దానిని రచించెనట. కాని అది అముద్రితం.

శివాలయం - కొల్లూరు

ఇది ఊటుకూరు మండలంలోని గ్రామం.

ఇక్కడి శివాలయం బాగా పేరు చెందింది. ఇది మిక్కిలి పెద్ద ఆలయం. ఏటా శివరాత్రికి ఇక్కడ గొప్ప ఉత్సవం జరుగుతుంది. అపుడీ ఆలయాన్ని వందల కొలది భక్తులు వచ్చి దర్శిస్తారు.

ఇది కురివిసెట్టివారు అనే ఒక జాతివారి పీఠంగా కూడా ఉంది. వారి గురువు ఒక జంగందేవరగారు. ఆయనగారే ఈ ఆలయానికి పూజారిగా ఉన్నాడు.

చెన్నకేశవాలయం - గంగాపురం

పాలమూరు మండలంలో వర్ధమానపురం - గంగాపురం రెండూ పెద్ద చారిత్రక నగరాలు. వర్ధమాన పురానికి వడ్డవాని అని, గంగాపురానికి కేశవపురం, మాయాపురం అని మొదటి పేర్లు.

వర్ధమాన మహావీరుడు జినుడు కనుక అది జైనమత కేంద్రమని, మాయాదేవి బుద్ధుని తల్లి కనుక గంగాపురం బౌద్ధమత కేంద్రంగా ఉండ వచ్చునని చారిత్రకు లూహించినారు. కాని గంగాపురం దగ్గర జరిగిన త్రవ్వకాలలో జైన ప్రతిమలు, వడ్డవాని ప్రక్కనగల ధర్మారంలో అవలోకితుని ప్రతిమ లభించినవి.

పౌరాణికంగా గంగాపుర ప్రశస్తి స్కాందపురాణంలోని తీర్థ ఖండంతో ఉందని గంగాపుర మాహాత్మ్యం అనే కావ్యం చెబుతుంది.

వీర హోంబాళుడనే చాళుక్య ప్రభువు ఒకప్పుడు గండకాద్రికి వెళ్ళి అచటగల చెన్నకేశవ మూర్తినిచూచి దాన్ని తమ నగరానికి తేవటానికి ప్రయత్నించగా అక్కడి ప్రభువైన వీరసేను డడ్డుపడినాడు. అపుడు హోంబాళుడు సూర్యు నారాధించి మెప్పించగా అదిచూచి వీరసేనుడు



గంగాపురం చెన్నకేశవాలయం - జడ్చర్ల తాలూకా

సంతోషించి స్వామిని కొని వెళ్ళమని ఆజ్ఞనిచ్చినాడు. అపుడతడు కేశవ స్వామిని తెచ్చి అక్కడ ప్రతిష్ఠించి అనంతరం వీరసేనుని కూతురు పద్మావతిని వివాహం చేసుకున్నాడు.

ఇక్కడి ఆలయాన్ని గురించి గంగాపుర మాహాత్మ్యంలో మల్లారెడ్డి చెప్పిన కథ ఈ విధంగా ఉంది.

పూర్వం ద్వాపరయుగాంతంలో మయుని కుమారుడైన దుర్జయుడు గండకాద్రిపై దండెత్తగా అక్కడి మునులు వచ్చి గంగాపురంలో ఉన్న వీరనారాయణస్వామికి మొరపెట్టుకున్నారు. అపుడు స్వామి అది విని ఇక్కడ అంతర్ధానమై గండకాద్రికిచేరి దుర్జయుని వధించి అనంతరం అక్కడనే నిలిచిపోయినాడు. స్వామి ఇక్కడ మాయమైపోయినాడు కాబట్టి ఆనాటినుండి గంగాపురానికి మాయాపురం అనే పేరు వచ్చింది.

కలియుగం వచ్చిన పిమ్మట ఆ పట్టణాన్ని చంద్రవంశానికి చెందిన పుణ్యశీల మహారాజు పాలించినాడు. చారిత్రకులితనిని ఆహవమల్ల బిరుదాంచితుడైన మొదటి సోమేశ్వరుడని గుర్తించినారు. వీరి రాజధాని వైజయంతీపురం. తెలంగాణంలోని గంగాపురం రెండవ రాజధానిగా ఉన్నది. ఈ మహారాజు క్రీ. శ. 1043-68 నడుమ రాజ్యం చేసినాడు. ఒకనాడు అతని ఆస్థానానికి ఒక బ్రాహ్మణుడు వచ్చి, కుంతల దేశ రాకుమారి వీరవర్మ కూతురు సుప్రభ మిక్కిలి అందగత్తె అని చెప్పినాడు. సోమేశ్వరుడది విని ఆమె స్వయంవరానికి వెళ్ళి రాక్షస వివాహంలో తన శౌర్యాన్ని అంకువజేసి ఆమెను కొనివచ్చి వివాహ మాడినాడు.

వీరికి వీరకంబాళుడు - భువనైకమల్లుడు - త్రిభువనమల్లుడు - చాళుక్యమల్లుడు అని నలుగురు కుమారులు కలిగినారు కాని చరిత్రలో భువనైకమల్ల - త్రిభువనమల్లు లిద్దరే ప్రసిద్ధులైనారు.

ఒకపుడతనికి జ్యోతిష్కులు నీకు కలిగిన రెండవ కుమారుడు గొప్ప పరాక్రమశాలి, ప్రసిద్ధుడూ అవుతాడు అని చెప్పినారు. అదివిని ఆయన రెండవ కుమారుని కొరకు చాలా ఆతురతగా ఎదిరి చూసినాడు. కాని రాణిగారికి రెండవ సంతానం చాలా ఆలస్యంగా కలిగింది.

అనంతరం ఒకపుడు పుణ్యశీలుడు యాత్రలుచేస్తూ మీనాంబరం దగ్గరకు రాగా అక్కడ అతనికి మరో బ్రాహ్మణుడు తటస్థపడి, పూర్వం గంగాపురంలో వీరనారాయణస్వామి ఉండేవాడు కాని, ఇపుడతడు అంతర్ధానమైనాడని చెప్పినాడు. అదివిని మహారాజు ఆ రాత్రి ఆ స్వామి ఎక్కడ ఉన్నా తెచ్చి ప్రతిష్ఠించవలెనని సంకల్పించి నిద్రించగా, అతడు స్వప్నంలో కనిపించి, నేను గండకాద్రిలో ఉన్నాను, కొనివచ్చి ప్రతిష్ఠించు అని చెప్పినాడు.

అంత మహారాజు ఆశ్చర్యపడి మేలుకొని ఆ ఉదయమే తన కుమారులను పిలుచుకొని స్వప్న విషయం చెప్పి వీరకంబాళుని వెళ్ళి స్వామివారిని వేంచేపు చేసికొని రమ్మని త్రిభువన మల్లునితో స్వామికి ఆలయమంటపాలు, చాణుక్య మల్లునితో ప్రాకారగోపురాలు కట్టించమని ఆజ్ఞాపించి భువనైక మల్లునితో ఈ ఏర్పాట్లన్నీ చూడమని చెప్పినాడు. ఆతరువాత ఆలయ నిర్మాణం స్వామివారి ప్రతిష్ఠ అతడనుకున్నట్లు జరిగినవి. వివరాలకు చూ. సమాలోచన. 1-8-1987 గంగాపుర మాహాత్మ్యం.

ఈ ఆలయం ప్రాకారంతో పాటుగా ఎత్తైన వేదికపై కట్టబడింది. దక్షిణ దేశంలోని బేలూరు సోమనాథ పురాలలోని చెన్నకేశవాలయాలు గూడ ఈలాగే కట్టబడినవి. ఇది చతురస్రంగా ఉండి, విమానం సోపాన పద్ధతిలో ఉంది. ఇక శిల్పనైపుణ్యానికి దీనికిదే సాటి. శిల్పులు ద్వార బంధాలపై స్తంభాలపై చూపిన పనితనం అద్భుతం గొలుపుతుంది.

గంగాపురం - పాపగల్లు - ఆవంచ సమీప గ్రామాలు. ఆవంచ దుందుభీ తీర గ్రామం. అక్కడ పూర్వం నాలుగు పెద్ద పెద్ద రాజ ప్రాసాదాలున్నవి. ఈ మూడు గ్రామాలలోని ఆలయాల శిల్పం ఒకే తీరుగా ఉంది కాబట్టి అవి ఏకకాలాలు, ఒకే దస్తూరివి అనిపిస్తుంది. కాని ఈ శిల్పులెవరో తెలిసిరాలేదు. వారు మాత్రం జక్కనాచార్యుని వంశీయులంటారు. వారి శాఖ ఒకటి ఇపుడు కలువకుర్తి తాలూకాలోని బైరాపురంలో ఉంది.

మొదలిక్కడ స్మార్తులు పూజారులుగా ఉన్నారు. తానీషాపై మొగలాయీల దండయాత్ర పిమ్మట అప్పటి తురుష్కులిక్కడి ఆలయాలపై బడినారు. అపుడిక్కడి పూజారి కుటుంబం వెళ్ళిపోయింది. వారి వంశాలిపుడు మేడిపూరు, గుండూరు, గోపాలపేటలలో ఉన్నవి. వారిని గంగాపురం వారనే పిలుస్తారు.

స్మార్తుల పిమ్మట ఈ ఆలయాన్ని దేవరకొండ సీమలోని. మరింగంటివారు వచ్చి, సంప్రోక్షణ చేసి పూజారులుగా నిలిచినారు. ఆ వంశానికి చెందిన మరింగంటి వెంకట రాఘవాచార్యుల వారిక్కడ ఆచార్యులుగా ఉన్నాడు. ఆయన కేశవస్వామి శతకం ఇక్కడి చెన్నకేశవునిపైననే రచింపబడింది.

అతడే కాక ఈ స్వామిపై పెన్గలూరి వెంకటాద్రి మొదలైన మరి కొందరు కవులు గూడా శతకాలు, స్తుతులు రచించినారు.

వేణుగోపాలస్వామి ఆలయం - ధన్వాడ

ఇది ప్రస్తుతం జడ్చర్ల తాలూకాలోని గ్రామం. ఒక మండల కేంద్రంగా గూడ ఉంది. ఈ గ్రామంలో వేణుగోపాలాలయం ప్రసిద్ధి. ఈ ఆలయం సామాన్యంగా ఉన్నా లోపల స్వామిమూర్తి మాత్రం మిక్కిలి సుందరంగా ఉంది. ఏటా కృష్ణాష్టమికి ఇక్కడ ఉత్సవం జరుగుతుంది.

ఈ మండలంలో మర్రికల్లు అనే గ్రామం ఒకటి ఉంది. అక్కడ శివాలయా లెక్కువగా ఉన్నవి. ఈ జిల్లాలో మర్రికల్లు అనే గ్రామాలు గూడ ఎక్కువగానే ఉన్నవి.

రంగనాథాలయం - బాదేపల్లి

బాదేపల్లి పాలమూరు జిల్లాలో పేరు చెందిన వ్యాపార కేంద్రం. అంతేకాక, దీని ప్రక్కనగల జడ్చర్ల ప్రసిద్ధమైన బస్సుల కూడలి. హైదరాబాదునుండి కొల్లాపురం, శ్రీశైలం వెళ్ళే బస్సులన్నీ బాదేపల్లిపై నుండియే వెళ్ళుతవి.

ఈ గ్రామంలో రంగనాథాలయం ప్రసిద్ధి. అదిపుడు బస్‌స్టాండ్ వెనకగల గుట్టపై ఉంది. ఈ గుట్ట గూడ ఎత్తయినదే. దానిపైగల రంగనాథాలయం చోళుల నాటిది. ప్రస్తుతం దానిముందు మంటపానికి కప్పులేదు. అది ఏ కాలంలో ఎవరు విప్పుకొనిపోయినారో తెలియదు. అనంతరం గ్రామస్థులు రెండు మూడు పర్యాయాలు దాని కప్పుకొరకు ప్రయత్నం చేస్తే అది నిలువలేదట. అందుచేత ఇక ఊరుకున్నారు.

ఇందులో ఉన్న మూర్తి శేషశాయి. అది సుందరంగా ఉంది.

తెలుగు రామాయణాలలో రంగనాథరామాయణానికి ఒక ప్రత్యేకత ఉంది. దాని కర్త రంగనాథుడు ఈ స్వామిపేరే కలవాడని, అతడీ ఆలయంలోనే కూర్చుని వ్రాసినాడని స్థానికుల మతం. భాస్కర రామాయణం శివునికి అంకితం. భాస్కరు డితని సమకాలికుడేనని, అతడు గూడా ఈ ప్రాంతం వాడేనని, ఈనాడు రామగిరిలో ఉన్నది ఒకపుడు శివాలయమని, భాస్కరుడందులో కూర్చుని తన రామాయణ రచన చేసినాడని, కాలాంతరంలో భాస్కరుడిక్కడినుండి వెళ్ళిపోయినాడని ఇక్కడివారు చెప్పుకుంటారు.

ఈ ప్రాంతంలో గంగాపురంలోని చెన్న కేశవాలయం బాగా ప్రసిద్ధి, అందులో ఉన్న స్వామిని గురించి ఈ ప్రాంతంలో ఒక ప్రసిద్ధమైన జానపద కథ ఉంది.

పూర్వం ఇక్కడ కురుమయ్య, చెన్నయ్య అని ఇద్దరు సోదరులున్నారు. చెన్నయ్య గొప్పవీరుడే కాక మంచి అందగాడు. ఆనాడు అతని పరాక్రమం, అందం చూసి ఆ ప్రాంతాన్ని పాలిస్తున్న నవాబు కూతురు అతనిని వలచింది. అది తెలిసి చెన్నయ్య ఆమెను చేరదీసినాడు. నవాబు అది సహించక వెళ్ళి అలంగీరు పాదుషా వారితో చెప్పుకున్నాడు. అపుడాయన ఆ నవాబుకు కొంత సైన్యాన్ని సహాయంగా ఇచ్చి పంపినాడు. నవాబు సైన్యంతో వచ్చి చెన్నయ్య ఇల్లు ముట్టడించగా అతడేలాగో తప్పించుకొని సైన్యం చూస్తూండగానే వారికి చిక్కకుండా పరుగెత్తి ఇపుడు గంగాపురంలోని చెన్నకేశవాలయం దగ్గర ఉన్న కోనేటిలో దూకినాడు. అతని వెంట అపుడు సైనికులు కూడా దానిలో దూకినారు. కాని అతడు వారికి ఇక చిక్కలేదు. ఆ నీటిలో ఏదో మూలన దాగి వారు వెళ్ళిన పిమ్మట బయటికి వచ్చి వెళ్ళి బాడేపల్లి గట్టుపై ఉన్న రంగనాథాలయంలో దాగినాడు.

తిరిగి వచ్చిన సైనికులు అన్నయైన కురుమయ్యను పట్టుకుని తమ్ముని జాడ చెప్పమని చిత్రహింసలు పెట్టినారు. అపుడు అతడు వానికి తట్టుకోలేక తమ్ముడు బాదేపల్లి గట్టుపై దాగినట్టు చెప్పినాడు. అపుడు వారు వెళ్ళి ఆ ఆలయాన్ని చుట్టుముట్టి చెన్నయ్యను పట్టుకొని తల నరికినారు. పిమ్మట అది తెలిసి గ్రామస్థులు కురుమయ్యను పట్టుకుని తమ్ముని మర్మం చెప్పినందులకు వృషణచ్ఛేదంచేసి చంపినారు. ఆ విధంగా చనిపోయిన ఆ సోదరు లిద్దరు అనంతర కాలంలో దేవతలైనారు. ప్రస్తుతం గంగాపురంలో ఉన్న స్వామి ఈ చెన్నయ్యనే. ఇది ఇక్కడి జానపదుల కథ. ఇది వారిలో పాటగా కూడా ఉంది.

ఇపుడు మనం ఈ స్వామిని చెన్నకేశవుడంటున్నాం కాని స్థానికంగా ఈ ప్రాంతంలో ఉన్న చెన్నకేశవాలయాలలో స్వామికి చెన్నరాయడనే వ్యవహారం. ఇది గమనింపదగిన అంశం. చెన్నయ్య చచ్చిన పిమ్మట గూడా ఎందరికో దర్శనమిచ్చినాడట.

పూర్వం గంగాపురం జాతరకు వెళ్ళే వారంతా బాదేపల్లి మార్గం గానే వెళ్ళేవారు. వారిక్కడ రంగనాథుని దర్శించకుండా చెన్నకేశవుని దర్శించకూడదని నమ్మేవారు. అంతేకాక, కొందరు భక్తులిక్కడి నుండే శివం నిండిగూడా అక్కడికి వెళ్ళేవారు. కాని ఇపుడీ ఆచారం లేదు.

ఈ ఆలయం కూడా మధ్యకాలంలో ఏ కారణం చేతనో కూలి పోగా మళ్ళీ అమర్చినారని పరిశీలకులంటారు.

ఇదికాక బాదేపల్లి గ్రామంలో భాగ్యేశ్వరీదేవి ఆలయం ఉంది. ఆ దేవిపై ఒక శతకంగూడా ఉంది. గ్రామానికి పూర్వం భాగ్యేశ్వరీపురం అని పేరున్నట్టు ప్రాచీనులు చెబుతారు. ఈ భాగ్యేశ్వరి గుడికూడా ప్రాచీనమయిందే.

వేణుగోపాలాలయం - బాలానగరం

ఇదిపుడు జడ్చర్ల తాలూకాలో చేరి ఒకమండల కేంద్రంగా ఉంది పూర్వం ఇది షాద్‌నగర్ తాలూకాలోని బూర్గుల జాగీరులోనిది. అక్కడ ఒక మహమ్మదీయుడు జాగీర్దారుగా ఉన్నాడు. ఆయన ఈ గ్రామాన్ని జూలపల్లివారు, పుల్లమరాజువారు అనే రెండు కరణం వంశాలవారికి కలిపి మఖ్తాగా యిచ్చినాడు.

ఆనాడు ఇక్కడ పెద్ద కోట ఉన్నది. దాని అవశేషాలు ఇపుడు కూడ ఉన్నవి.

ఈ గ్రామానికి తూర్పున దెందివాగు పారుతూ ఉంది. కాబట్టి దాని దగ్గర ఇక్కడి పుల్లమరాజువారు - అనగా బూర్గుల రామకిషన్ రావుగారి

తాతగారు అక్కడ ఇపుడున్న ఆలయాలు కట్టించి నాడంటారు. ఇవి ఎత్తుగా అరుగులు వేసి వానిపై కట్టబడినవి.

వీని నిర్మాణం మహబూబ్ నగర్‌కు రైల్వేలైను పడుతూ ఉన్నపుడు జరిగింది. ఇవి చక్కగా ఉన్న గుడులు కాబట్టి అభివృద్ధి పరచదగినవి.

పరుసవేదీశ్వరుడు - మీనాంబరం

మీనాంబరం అనేది ఇక్కడ గల నదీనామం. దుందుభీనదికి గంగాపురం దగ్గర దేవసేన అని అది దాటిన పిమ్మట ఆలవానిపల్లె దగ్గర మీనాంబరం అని వ్యవహారాలు. ఈ గ్రామం ఇపుడు జడ్చర్ల మండలంలో ఉంది.

పూర్వం నలచక్రవర్తి అరణ్యవాసంలో ఒకపుడిక్కడికి వచ్చి ఈ నదిలో చేపలను పట్టుకొని వండించుకోగా ఉడికిన పిమ్మట అవి నదిలో పడి మళ్ళీ సజీవమై వెళ్ళిపోయినవట. అందుచేత దీనికి "మీనాంబరి" అనే వ్యవహారం నిలిచిందని గంగాపుర మహత్మ్యంలోనే ఉంది.

వీరకంబాళుడు గంగాపురంలో చెన్న కేశవుని ప్రతిష్ఠించిన పిమ్మట శంకరుడా స్వామిని దర్శించటానికి మిండజంగం రూపంలో రాగా అతనికీ నదీతీరంలో "ఇంగి - తంగి" అనే ఇద్దరు గొల్లపడుచులు తారసపడినారట. అతడు వారి రూప లావణ్యాలకు ముగ్ధుడై వారితో కామకేళితేలి నేనీ నదీతీరంలో పరుసవేదీశ్వరుడనై నిలుస్తాను. మీరు ఇనుప బిందెలు తెచ్చి నాకు తాకించండి. అవి బంగారంగా మారుతవి. దానితో మీరు నాకు ఇక్కడ గుడి కట్టించి నన్ను సేవిస్తూ ఉండండి. మీకు సమస్త సంపదలు కలుగుతవి అని సెలవిచ్చినాడు. ఈ కథ గూడ గంగాపుర మాహాత్మ్యంలోనిదే.

ఈ కథలో శంకరుని మాట ఎలా ఉన్నా ఇది గంగాపురం తరువాత దానికి ప్రతిగా వెలసిందని, దీన్ని ఆ కాలపు భక్తులైన

గొల్లలెవరో కట్టించినారు అనవచ్చు. చరిత్రలో స్త్రీలు ఆలయాలు కట్టించటం అరుదేమీ కాదు. అందునా ఈ ప్రాంతంలో కురువ - గొల్లలు కట్టించిన గుడులింకా గూడ ఉన్నవి.

ఈ గుడి మొదట చాలా విశాలంగా ఉన్నది. కాని తెలంగాణాలో గోలకొండ ముట్టడి ప్రసిద్ధి. అది క్రీ. శ. 1185 లో జరిగింది. ఎనమిది నెలలు సాగిన ఆ ముట్టడికి ఔరంగజేబు అజం - మువాజం అనే తన కుమారులను పంపినాడు. అపుడు వారి ఆధ్వర్యంలో గోలకొండను ముట్టడించిన సైన్యం తుకిడీలు తుకిడీలుగా చుట్టూ ఉండే ప్రసిద్ధాలయాలపై దాడుకొట్టి దోచుకున్నారు. ఆలయాలను గూడ ధ్వంసం చేసినారు. అపుడిది నాశనానికి గురి అయిందని స్థానిక వృద్ధుల కధనం.

ఇపుడిక్కడ గర్భాలయం. దాని ముందు మంటపం మాత్రం మిగిలినవి. ఈ గుడిలో శివలింగం మిక్కిలి ఎత్తుగా ఉంది. దీనికి పరుసవేదీశ్వరుడని పేరు. గంగాపురం మొదలుకొని అలంపురం వరకు ఈ ప్రాంతంలో పరుసవేదికి సంబంధించిన కథలు చాలా ఉన్నవి.

ఇక్కడ ముఖమండపంలో పదమూడు పేర్లుగల పెద్ద గంట ఉంది. దాన్ని బానూరు రామయ్యగారు లింగంపేటలోని ఆర్కవల్లి చిన్న చిరుతయ్యచేత ప్రజోత్పత్తి శ్రావణంలో చేయించినట్లు దానిపై ఉంది కాని ఈ ప్రజోత్పత్తి ఎప్పటిదో తెలియదు. గత శతాబ్దిలో నాగర్ కర్నూలులో బానూరు నాగన్న ప్రసిద్ధుడు.

ఈ ఆలయ ముఖమండపం కూలిఉండగా దీన్ని క్రీ.శ. 1959లో గంగాపురంలోని గంధం రామచంద్రయ్య బాలయ్యగారలు బాగుచేయించి అరుగు వేయించి మెట్లు కట్టించినారు.

గంధంవారు వైశ్యులు. పూర్వం నాగర్‌కర్నూలులో గూడా వీరు ప్రసిద్ధులు.

నాగర్‌కర్నూలు తాలూకాలోని గుడులు

ఈ గ్రామం పాలమూరి జిల్లాకు మొదటి కేంద్రం. జిల్లా ప్రారంభ మైననాడు ఈ భూభాగం నల్లగొండ జిల్లాకు చెంది ఉన్నది. తూర్పు డివిజన్‌లో చేరిన నల్లగొండ జిల్లా ఆనాడు అన్నిటికంటె పెద్దది కావటం చేత మొదటి సాలారుజంగు సన్ 1292లో నల్లగొండను చీల్చి నాగర్ కర్నూలు జిల్లాను వేరు చేసినాడు.

మొదట ఇది ఆరు తాలూకాల తో ప్రారంభింపబడింది. పిమ్మట సన్ 1300 లలో ఎనిమిదిటికి, 1302 లో పదిటికి పెరిగింది. అనంతరం 1312 అక్టోబర్‌లో జిల్లాను ఇక్కడి నుండి పాలమూరికి మార్చి దానికి మహబూబ్‌నగర్ అని నామకరణం చేసినారు. జిల్లాను అక్కడికి మార్చిన పిదప క్రీ. శ. 1928లో ఒకసారి 1956లో ఒకసారి పునర్వ్యవస్థీకరించినారు. అపుడిది రెండవసారి పదినుండి పన్నెండు తాలూకాలకు పెరిగి ఇపుడు పదమూడు తాలూకాలుగా నిలిచింది.

నేటి నాగర్‌కర్నూలుకు మొదట నాగనవోలు కందనవోలు అని పేరు. ఆరెండు జంటగ్రామాలు వానిని వర్ధమానపురం పాలించిన గోనవారి సేనాపతులైన నాగన-కందన అనే సోదరులు స్థాపించినట్లు చెబుతారు. మొదటి కాలంలో ఈ గ్రామాల్లో కందనవోలికంటె నాగనవోలికే ఎక్కువ పేరు. కాని కందనవోలిని జిల్లాగా చేసినపుడు అంతవరకు కర్నూలు జిల్లా గూడా నైజాంవారి ఆధీనంలోనే ఉన్నది కాబట్టి ఆ రెండింటికి భేదం తెలిసే అందుకై దాన్ని పెద్ద కందనవోలు అని దీన్ని 'నాగరకందనవోలు' అని మార్చినారు.

స్థానికంగా ఉన్న గుడులు

ఈ గ్రామంలో హనుమదాలయం, ఇదమ్మగుడి, సీతారామస్వామి ఆలయం, కన్యకావరమేశ్వరి దేవళం, శివుని గుడి, బాలీశ్వరాలయం, ఉమాత్ర్యంబకేశ్వరాలయం, కాశీ విశ్వేశ్వరాలయం ఉన్నవి.

ఇక్కడి గ్రామదేవత పేరు "కాళమ్మ". బహుశః ఆమెను గ్రామానికి పునాది పోసినవారే స్థాపించి ఉంటారు కాని ఈ దేవతకు ప్రత్యేకమైన ప్రతిమగాని గుడిగాని లేవు. కాళమ్మ పేర ఒక నల్లని నిలుపురాయి మాత్రం పూజింపబడుతుంది. ఈ దేవత ఇపుడు పాత ఊరిలో తమ్మశివారి ఇండ్ల దగ్గర ఉంది. పూర్వం ఈ దేవత ముందు ఒక చేదబావి ఉండేది. అదిపుడు లేదు. కూలి పూడిపోయింది. ఆస్థానంలో ఇపుడిల్లు కట్టబడింది.

ఇక్కడి ఆలయాలలో హనుమదాలయం ప్రాచీనమయింది. ఆ స్వామిని గూడా ఎవరు ప్రతిష్ఠించినారో తెలియదు. బహుశః గ్రామాన్ని కట్టించినవారే ఆ దేవుని ప్రతిష్ఠించి ఉంటారు. ఇపుడున్న శిలామంటపం మాత్రం ఈడిగ కేశవులుగారు గత శతాబ్దంలో వేయించి నట్లు చెబుతారు. ఇపుడిది గ్రామస్థులచేత చాలా అభివృద్ధి చెందింది.

ఇదమ్మ గుడి :

ఈ దేవి నిక్కడ పిప్పళ్ళవారు అనే మహారాష్ట్ర బ్రాహ్మణులు తెచ్చి నిలిపినట్లు చెబుతారు. వీరు లోకయపల్లె దొరలకు బంధుకోటిలోని వారు. ఈ గ్రామానికి పోలీసు పటేండ్లుగా ఉన్నారు. వీరు దేవీ ఉపాస కులు. అందుచేత తమ కులదైవమైన దేవిని తెచ్చి యిక్కడ నిలిపినారు.

ఈ ఆలయం క్రీ. శ. 1977లో స్థానిక రైతు సంఘంచేత పునరుద్ధరింపబడింది. ఇపుడిది నిమ్నజాతులందరికీ ప్రజా వేదికగా ఉంది. వారి నుద్దేశించిన ఏ కార్యక్రమమైనా యిపుడిక్కడనే జరుగుతుంది.

సీతారామస్వామి ఆలయం :

ఇది గూడా పిప్పళ్ళవారి భూమిలోనే వెలసింది. గత శతాబ్దిలో యిక్కడికి తూర్పు దేశంనుండి రామదాసు, కృష్ణదాసు అనే యిద్దరు గోసాయీలు వచ్చి గ్రామానికి పశ్చిమంగా ఉన్న పిప్పళ్ళవారి మామిడి తోటలో తపం చేసికుంటూ ఉండగా ఒకపుడు వారికి శ్రీరాముడు కలలో కనిపించి తన నక్కడ ప్రతిష్ఠించవలసిందని ఆదేశించినాడు.

అపుడు వనపర్తి ప్రభువుల దగ్గర వామన్‌నాయక్‌గారు దివాన్‌జీగా ఉన్నాడు. ఆయన గొప్ప భక్తుడు. నాగర్ కర్నూలు యొక్క ఆబ్‌కారీని అపుడాయన మంది చూసేవారు

రామదాసు, కృష్ణదాసు గారలు వెళ్ళి వామన్‌నాయక్‌గారికి తమ స్వప్న ప్రకారం విన్నవించుకోగా ఆయన అక్కడ రామాలయం కట్టుకొమ్మని ఆర్థిక సహాయం చేసినాడు. దానికి భూమిని పిప్పళ్ళవారే ఇచ్చినారు. అంతవారు ఒక సామాన్యమైన మట్టిగదిని కట్టి శ్రీరాముని ప్రతిష్ఠించినారు.

ఆగుడిని సన్ 1351 లో అబ్దుల్ అజీజ్ అనే మినిష్టర్‌గారు తన దౌరాలో చూచి పునరుద్ధరణ కొరకు రకం మంజూరు చేసినాడు. అపుడు దాన్ని పట్వారియైన చెరువు రామారావుగారు వకీలు నరసింగరావు కలిసి ఆ మట్టిమిద్దెను విచ్చి శిలామంటపం వేయించినారు.

అనంతరం క్రీ శ. 1972 లో గ్రామస్థులు దాన్ని పునరుద్ధరించి యిపుడున్న రూపం యిచ్చినారు.

కన్యకా పరమేశ్వరి ఆలయం :

ఇది గ్రామానికి దక్షిణంగా ఉంది. ఈ గ్రామంలో పూర్వాల కొండూరు వారు అనే వైశ్యులు ధనవంతులు ధర్మ కార్యాసక్తులై ఉన్నారు ఆవంశంలో శాయన్నగారనే ఆయన బాగా పేరు చెందినాడు. అతడు

ఒక పర్యాయం కాశీయాత్రచేసి అక్కడి నుండి శివలింగాన్ని తెచ్చి దానికి ఆలయ నిర్మాణం తలపెట్టి ఇప్పుడక్కడ ఉన్న కోనేరు త్రవ్వించి ధర్మశాలలు వేయించిన పిమ్మట ఆనాటి ప్రభుత్వం అతనికిక ఆలయానికి అనుమతించలేదు.

అంతటితో అది ఆగిపోగా గ్రామంలోని వైశ్య సంఘం దాన్ని చేతికి తీసికొని క్రీ.శ. 1971 ఆలయాన్ని పూర్తిజేసి దానిలో విరోధి మాఘశుద్ధ దశమినాడు అమ్మవారితోపాటు శివ-నవగ్రహ - ఆంజనేయాది వివిధ ప్రతిష్ఠలు చేసినారు.

ఇపుడీ ఆలయంలో దేవీ నవరాత్రులు ఘనంగా జరుగుతవి.

శివాలయాలు

నాగర్ కర్నూలు గ్రామంలో ప్రస్తుతం అయిదు శివాలయాలున్నవి. వానిలో నాలుగు శివలింగాలు కాశి నుండి తేబడి ప్రతిష్టింపబడినవే. వానిలో

1. మొదటిది మిడిదుడ్డి వారి శివాలయం :-

ఇపుడిది మార్కెటు యార్డులో ఉంది. మిడిదుడ్డి వారిది ఈ గ్రామంలో ప్రాచీనమైన వైశ్య కుటుంబం. ఆ వంశంలోని రామయ్య గారి కుమారుడు వెంకయ్యగారు కాశీయాత్రచేసి అక్కడనుండి ఒక శివలింగాన్ని తెచ్చి ప్రస్తుతం ఉన్నచోట చిన్నగుడి కట్టించి ప్రతిష్ఠించినాడు. దీన్ని తరువాతి కాలంలో బాదం లక్ష్మమ్మగారు అభివృద్ధి పరచ చూచింది కాని ఆమె ప్రయత్నం తుదిముట్ట ఫలించలేదు. ఆకారణంగా అదిపుడు ఎదుగుబొదుగు లేకుండా నిలచింది. ఇది ఉద్ధరింప బడినట్టయితే మార్కెట్టుకు మంచి కళ రాగలను.

ఈ ఆలయం క్రీ. శ. 1900లో ప్రతిష్ఠింపబడింది.

2. కొండూరి వారి శివాలయం :

ఇది ప్రస్తుతం శ్రీ సీతారామస్వామివారి ఆలయావరణంలో ఉంది. దీనిని శాయన్నగారి భార్య సీతమ్మగారు క్రీ. శ. 1950లో కాశీయాత్ర చేసి అక్కడినుండి శివలింగాన్ని కొనివచ్చి క్రీ. శ. 1952లో రామాలయావరణంలో ఇపుడున్న ఆలయం కట్టించి, దానిలో ప్రతిష్ఠ చేయించింది.

3. బాలీశ్వరాలయం :

ఇదిపుడు పాత బస్‌స్టాండులో పోస్టాఫీసు ఎదురుగా గల షాపింగు సెంటరులో ఉంది. ఈ గ్రామంలో ఆకారపువారిది చెప్పదగిన మరో ప్రసిద్ధమైన కుటుంబం వీరు వైశ్యులు. ఆ వంశంలోని బాలస్వామి సోదరులు ఇక్కడ ఒక సత్రాన్ని కట్టించి, దానిలో ఈ ఆలయాన్ని కట్టించినారు.

బాలస్వామిగారు అనేక ధర్మకార్యాలు చేసినాడు. ఆయన కాశీయాత్ర చేసి, అక్కడినుండి శివలింగాన్ని తెచ్చి, క్రీ. శ. 1981 రౌద్రి మాఘ శుద్ధ పాడ్యమినాడు తమ సత్రంలో ఆలయానికి శంకుస్థాపన చేసి గుడి కట్టించి, దానిలో తమ తండ్రిగారైన లక్ష్మీనరసయ్యగారి పేర ఈ ప్రతిష్ఠ చేసినాడు.

4. శ్రీపరమేశ్వరాలయం :

ఈ ఆలయాన్ని మాజీ M. L. A. శ్రీ M. శ్రీనివాసరావుగారు తమ స్వగృహ ప్రాంగణంలో క్రీ. శ. 1982 దుర్మతి ఫాల్గుణ శుద్ధ తదియనాడు పుష్పగిరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ నృసింహభారతీ స్వామివారిచేత శంకుస్థాపన చేయించి ప్రతిష్ఠించినాడు. దీనికి ఉమా త్ర్యంబకేశ్వరాలయమని పేరు.

దీన్నిపుడు అంగన్‌వాడి శివాలయం అంటున్నారు.

5. విశ్వేశ్వరాలయం :

ఈ ఆలయాన్ని శ్రీ చింతపట్ల మురహరి ఆచారిగారు గ్రామాన్ని అనుసరించిన తమ పొలంలో ప్రతిష్ఠించినారు. దీనికి శ్రీ కాశీ విశ్వేశ్వ రాలయమని పేరు.

మురహరి ఆచారిగారు ఒక పర్యాయం ద్వాదశ జ్యోతిర్లింగ యాత్ర, రెండు సార్లు ఆసేతుశీతాచలయాత్ర, మూడు తడవలు కాశీయాత్ర చేసి షష్టిపూర్తి సప్తతి పూర్తిచేసికొని ఆ సందర్భంలో విభవ మాఘ బహుళ విదియ గురువారం 23-2-1989 నాడు ఈ ప్రతిష్ఠ చేసినాడు.

6. పాండురంగాలయం :

ఇది హనుమదాలయావరణంలో ఉంది. స్థానికుడైన శ్రీ చిక్కపల్లి రామచంద్రరావుగారు పాండురంగని భక్తులు. అందుచేత క్రీ. శ. 1974 లో ఈ ఆలయాన్ని కట్టించి, అదే యేట అనగా వికృతి నామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ ఏకాదశినాడు శ్రీ రుక్మాబాయి సహిత పాండురంగని ప్రతిష్ఠ చేయించినాడు.

7. సుబ్రహ్మణ్యాలయం :

ఇదే సంవత్సరంలో స్థానికుడైన శ్రీ గోవిందరాజుల సుబ్బారావు గారు వినోబా నగర్ కాలనీలో పశ్చిమంగా ఉన్న ఒక రాతి చట్టుపై గుండ్రని ఆలయం కట్టించి, సుబ్బారాయషష్ఠినాడు శ్రీ సుబ్రహ్మణ్య స్వామిని ప్రతిష్ఠ చేయించినాడు.

8. సాయిబాబాగారి ఆలయం :

ఈ గ్రామంలోని సాయిబాబా భక్తమండలి ఏర్పరచినవాడు కొల్లాపురం నివాసి శ్రీ బుచ్చయ్య పంతులుగారు. ఆయన అక్కగారు బాబాగారికి అంకితమై జీవితమంతా అక్కడవే గడిపిన ధన్యురాలు.

అందుచేత బుచ్చయ్యగారికి బాల్యంనుండే బాబాగారి భక్తి ఏర్పడింది. ఆయన యిక్కడ క్రీ. శ. 1966 నుండి భక్తమండలి ఏర్పరచి, దాని ఆధ్వర్యంలో హనుమదాలయం ప్రక్కగా బాబాగారి మందిరం కట్టించినాడు. దానిలో 30-3-1979 శ్రీ సిద్ధార్థి చైత్రశుద్ధ తదియనాడు బాబాగారి కరకమలాలతో షిర్డీ బాబాగారిని ప్రతిష్ఠించడం జరిగింది. ఇది పాలమూరు జిల్లాలో బాబాగారిచేత ప్రతిష్ఠించబడిన ప్రథమాలయం.

9. గీతా మందిరం :

నాగర్ కర్నూలు గ్రామంలో గీతాపారాయణ సంఘం ఏర్పడటానికి కారకుడు శ్రీ చిప్ప లింగయ్యగారు. ఆయన మంచి తాత్వికుడు. క్రీ. శ. 1969 నుండి ఆయన యిక్కడ గీతాపారాయణ సంఘాన్ని ఏర్పరచి, మొదటి యేడు గీతా మకరంద ప్రవచనం చేసినాడు. పిమ్మట వారితో ప్రతి ఆదివారం ఒకరి యింటిలో గీతాపారాయణం చేసే నియమం ఏర్పరచినాడు. అది దినదినాభివృద్ధియై ఇప్పటికీ అవిచ్ఛిన్నంగా నడుస్తుంది.

ఈ పారాయణ సంఘం ఏర్పడిన పిమ్మట క్రీ. శ. 1970 లో శ్రీ చిక్కేపల్లి రామచంద్రరావుగారు శ్రీ సీతారామస్వామి ఆలయావరణంలో ఉత్తరంగా గీతా మందిరాన్ని కట్టించినాడు. దానిలో 19-12-1986 నాడు శ్రీ పార్థసారధి ప్రతిష్ఠ జరిగింది. ఈ ప్రతిష్ఠ ఇంతవరకు ఈ జిల్లాలో మరెక్కడా లేదు.

ఇవి కాక యిపుడు ఇక్కడ ఒక వీరబ్రహ్మేంద్రుని ఆలయానికి, ఒక వెంకటేశ్వరాలయానికి నిర్మాణ ప్రయత్నాలు జరుగుతున్నవి.

ఇవిగాక ఇక్కడ రెండు సమాధులు కూడా ఉన్నవి. వానిలో మొదటిది సుబ్బారాధ్యుల వారి సమాధి.

ఆరాధ్యుల సుబ్బయ్యగారు లచ్చుపేట నివాసి. స్థానికులైన మిడిదుడ్డివారు అనే వైశ్యుల యొక్క గురువు. ఆయన ఒకపుడు శిష్య సంచారంలో ఈ గ్రామంలో 1930 ప్రమోదూత కార్తీక బహుళ ఏకాదశినాడు శివైక్యమందినాడు. అపుడు శిష్యులాయనను ఇక్కడ నేటి మార్కెటు స్థలంలో సమాధి చేసినారు.

ప్రతియేటా కార్తీక బహుళ ఏకాదశినాడు వారి సమారాధన చేస్తారు. మొదట ఈ ఆరాధన చాలా గొప్పగా జరిగేది కాని, యిపుడు సన్నగిల్లింది రెండవది చీకటిమామిడి రాఘవాచార్యుల వారి సమాధి.

రాఘవాచార్యులు తెనహల శాఖకు చెందిన వైష్ణవుడు. మంచి కథకుడు. ఆయన హిందీ, తెలుగు రెండు భాషలలో గూడా హరికథా గానం చేసేవాడు. ఆనాడు ఆయనగారు కథ చెప్పటం అంటేనే ఆ గ్రామానికి అది ఒక ఘనత క్రింద ఉండేది.

ఆయనకు శిష్య సముదాయం కూడా చాలా ఉన్నారు. నాగర్ కర్నూలు వారు అతని కక్కడ ఒక యింటినికూడా దానం చేసినారు. అందుచేత తన సంచారంలో ఎక్కువ భాగం యిక్కడనే గడుపుతూ క్రీ. శ. 1949 సర్వధారి మాఘ శుద్ధ పంచమినాడు పరమపదించినాడు. ఈయన భౌతిక కాయంగూడ నేటి మార్కెటు యార్డులోనే సమాధి చేయబడింది.

ఈయన కీ గ్రామంలో బూదపురి వారు ముఖ్య శిష్యులు కాబట్టి యిపుడు బూదపురి మల్లయ్యగారు ఆయన సమాధిపై చక్కని మండపం ఒక సత్రశాల కూడ కట్టించినాడు.

ఏటా మాఘ శుద్ధ పంచమినాడు ఇక్కడ సమారాధన జరుగుతుంది. అపుడాయన యొక్క శిష్య ప్రశిష్యులందరూ ఇక్కడికి వస్తారు.

నృసింహాలయం - అప్పాజిపల్లె

ఈ గ్రామం ఇపుడు బిజనపల్లె మండలంలో జడ్చర్ల రోడ్డుపై కోడుపర్తి మిట్టకు 3 కిలోమీటర్లలో ఉంది. ఈ గ్రామాన్ని తిమ్మాజిపేటను కట్టించిన రుక్మాజీరావుగారి కుమారుడు స్థాపించినట్లు స్థానిక కైఫీయతులు చెబుతవి.

ఇక్కడ ఊరి వెలుపలగల ఒక గుట్టపైగల చారికలో నృసింహ స్వామి వెలసినాడు. సింహాద్రి గుట్టపై గల స్వామి అప్పన్న అయితే అప్పాజిపల్లె గుట్టపైగల ఈ స్వామి సింహన్న అయినాడు. అది ఇక్కడి విశేషం.

దీనిపైగల చారికలో స్వామి ఉన్నట్టు మొదట చిలుక రామకృష్ణా రెడ్డిగారు కనిపెట్టినాడు. ఆ చారిక మనిషి ప్రాకి వెళ్ళవలసినట్లుగా ఉండేది. దానిలో స్వామి ఉన్నాడని తెలిసిన పిమ్మట స్థానికులైన జల్లివంశీయులు బోయ కిష్టయ్య, నరసింహ అనే వారు దాన్ని మొలలతో మనుష్యులు వంగి వెళ్ళగలిగినంత విశాలం చేసినారు. పిమ్మట దాని ముందు మంటపం కట్టటానికి జిల్లెళ్ళ కిష్టారెడ్డిగారు రాతి కడీలు తీయించి ఇచ్చినాడు. స్వామివారి నిత్య నివేదనకై నరువ రాఘవరావుగారి పత్ని బుచ్చమ్మగారు కొంత భూమిని ఇచ్చింది.

ఇక్కడ క్రీ.శ. 1978 లో కరెంటు తీసుకున్నారు. అపుడు ఒక చోట స్తంభం కొరకు గోయి త్రవ్వుతూ ఉండగా మంచి గుండం ఒకటి బయట పడింది. ఈ విధంగా ఇక్కడి గుహాలయానికి సమగ్రరూపం ఇపుడేర్పడింది.

ఈ స్వామికి మొదట వాసుదేవయ్య అనే విశ్వబ్రాహ్మణుడు పూజారిగా ఉన్నాడు. అతడిపుడు వెళ్ళిపోయి, తిమ్మాజిపేట జోషివారు అర్చకులుగా ఉన్నారు. ఏటా ఇక్కడ సంక్రాంతికి మూడు దినాల

ఉత్సవం జరుగుతుంది. అపుడు చుట్టుపట్ల గ్రామాలనుండి వందల కొలది బండ్లు వచ్చి స్వామికి ప్రదక్షిణ చేస్తవి.

ఇపుడీ ఆలయాన్ని చిలుక వాసుదేవరెడ్డిగారు, నల్లపురెడ్డి రఘురాంరెడ్డిగారు అభివృద్ధి పరుస్తున్నారు.

వాసుదేవరెడ్డిగారు ఆలయాన్ని కనిపెట్టిన రామకృష్ణారెడ్డిగారి కుమారుడు. రామకృష్ణారెడ్డిగారు మంచి సంకీర్తన కవి. ఆయన హరిభజన కీర్తనలు రచించినాడు. అవి రాకమచెర్ల కీర్తనలవలె పద పుష్టితో కూడి ఉంటవి. వివరాలకు చూ. ఆరాధన-అప్పాజిపల్లె సింగన్న.

ఆలయాల మంచె - ఆవంచె

ఆవంచ ప్రస్తుతం తిమ్మాజిపేట మండలంలోని గ్రామం. జడ్చర్లకు పన్నెండు కిలోమీటర్లు ఉంటుంది. నాగర్ కర్నూలు నుండి జడ్చర్ల సర్వీసు రూటులో ఉంది. ఒకప్పుడిది పశ్చిమ చాళుక్యుల రాజ ప్రతినిధి పురం. అందుచేత ఇది చాళుక్య - చోళ ప్రభువుల నెందరినో చూసింది.

సాధారణంగా రాజధానులుగా ఉన్న గ్రామాలలో ఆలయాలకు కొదువ ఉండదు. ఇది దుందుభీ తీర గ్రామం దాని తీరంలో ఇక్కడ పూర్వం మనోహర శిల్ప శోభితమైన నాలుగు రాజభవనాలున్నవి. కాని ఇపుడవి లేవు. వాని మొసల ద్వారాల ముందు గల ఏనుగులు మాత్రం ఇపుడు గ్రామంలో పడి ఉన్నవి.

ఇక్కడ గ్రామంలోనికి ప్రవేశిస్తూండగా భైరవుడున్నాడు. అతడు తల విరియబోసికొని కరాళంగా ఉన్నాడు. గ్రామానికి తూర్పున ఒక పెద్ద గణపతి మూర్తి ఉంది. అంతటి మూర్తి ఈ ప్రాంతంలో మరెక్కడా లేదు.

గ్రామం వెలుపల నిర్బృతి దిశన కొంత దూరంలో రెండాలయా లున్నవి. వానికి రాజగోపాలాలయం అని పేరు. రాజగోపాలుడు అనే ప్రభువు కట్టించినట్లు చెబుతారు. అతడెవరో తెలియదు. ఈ పేరు ఈ ప్రాంతానికి క్రొత్తదే. ఈ పేరుగల ఆలయం ఈ ప్రాంతంలో మరొకటి లేదు.

పూర్వం వీనిపై చక్కని విమానాలున్నవి. కాని అవి కూలిపడగా ఆ ఇటుక తెచ్చి గ్రామస్థులు ఇపుడూరిలో ఉన్న పాఠశాలను కట్టినారు.

గ్రామానికి వాయువ్య దిశన హనుమదాలయం ఉంది. ఇక్కడ కుమార తైలపుని శాసనం ఉంది.

గ్రామంలో ప్రస్తుతం ఒక భ్రమరాంబ గుడి ఉంది. దానిలోని మూర్తి స్వయంవ్యక్తం అంటారు. అది ఒక బండరాయికి మలచబడి ఉంది. ఆ దేవిని ఖమ్మం ప్రాంతీయుడు చాముండయ్య అనే ఆరాధ్యుడు ప్రతిష్ఠించెనట. ఆమె అక్కడ వెలసినప్పుడు ఒక అయిదేండ్ల బ్రాహ్మణ కన్యకు కనిపించి ఆవేశించి తనను చెప్పకొనెనట. అపుడు గ్రామస్తు లంద రామెకు హడావుడిగా పెద్ద ఉత్సవం చేసి ప్రతిష్ఠించిరట. ఈ విషయం ఆవంచ భ్రమరాంబ పంచవింశతి వల్ల తెలుస్తుంది. దాన్ని పులి జాల పట్టాభికవి రచించినాడు.

గ్రామస్థు లిపుడీ గుడిని మళ్ళి బాగుచేసినారు. దేవికి నిత్యపూజ నడుస్తు ఉంటుంది.

చూ. ఆవంచ భ్రమరాంబ పంచవింశతి - మూసి సాంస్కృతిక మాస పత్రిక - మార్చి - 1982.

ఇంద్రేశ్వరాలయం - ఇంద్రకల్లు

ఇది ఈ తాలూకాలోని ప్రాచీన గ్రామాలలో ఒకటి. ఇపుడు తాడూరు మండలంలో ఉంది.

పూర్వం ఈ గ్రామం గంగాపురానికి యజ్ఞవాటికగా ఉండేదట. గంగాపురం వైభవంగా ఉన్నకాలంలో ఇక్కడ నిరంతరం యజ్ఞాలు జరుగుతూ, వానికి గంగాపురం నుండి సామగ్రి వస్తుండేదని చెబుతారు.

గంగాపురంలో పూర్వం జైనం వర్ధిల్లింది. ఇంద్రకల్లులో కూడా జైన ప్రతిమలు చాలా బయటపడినవి. రాష్ట్రకూటులు జైనులు. వారిలో ఇంద్ర నామములతో ముగ్గురున్నారు. కాబట్టి ఇంద్రనామాంకితమైన ఈ గ్రామం వారిచే ఏర్పడింది కావచ్చు.

ఇక్కడ పూర్వం ఏదో మహా సంగ్రామం జరిగి, మొదటి నగరం నాశనమై, దానిపై ఇపుడున్న గ్రామం వెలసిన జాడలున్నవి. భూగర్భంలో భిన్నమైన శిల్ప సంపద చాలా దాగి ఉంది. దీనితోపాటు ఆనాటి మట్టి పాత్రలు, గాజుపూసలు, శంఖాలు మరెన్నో చెల్లాచెదరుగా దాగి ఉన్నవి; కాబట్టి వాటన్నిటిని సమగ్రంగా వెలికి తీస్తే ఒక పెద్ద ప్రదర్శన శాల కాగలదు.

పూర్వం ఇది కొలనుపాకవంటి పెద్ద జైన క్షేత్రం. ఇక్కడ ఉన్న చెన్నకేశవాలయ ద్వారంపై ద్వారపాలకుల స్థానంలో పద్మాసనాసీన మైన ప్రతిమలున్నవి. దీని శిఖరం సోపాన క్రమంలో ఉంది. దీన్ని చూచి శ్రీ ఘంటా జవహర్లాలుగారు మొదట ఇది తప్పక జైనాలయమే అని అభిప్రాయపడినారు.

తెలంగాణంలో జైనాన్ని రూపుమాపి శైవం ఆక్రమించింది. ఆ కాలంలో ఇక్కడ గ్రామానికి నలువైపులా నాలుగు శివాలయాలు, అష్ట దిక్కులలో అష్ట భైరవ ప్రతిష్ఠలు కూడా ఉన్నవట. కాని ఈనాడు అవేవీ మిగులలేదు.

ఇక్కడ ఉన్న శివాలయాలలో ఈశాన్యంగా ఉన్నదానికి నందీశ్వరాలయం, ఆగ్నేయంగా ఉన్నదానికి ముక్కంటీశ్వరాలయం, నైఋతిదానికి ఇంద్రేశ్వరాలయం, వాయువ్యంలో గలదానికి భీమేశ్వరాలయం అని పేర్లు.

వీనిలో ఇపుడు ముక్కంటీశ్వరాలయం, ఇంద్రేశ్వరాలయం మాత్రమే మిగిలినవి. వానిలో ఒక్క ఇంద్రేశ్వరాలయంలోనే ఇపుడు పూజాదులున్నవి. ఈ స్వామికి వర్థమానపురాన్ని పాలించిన ఉదయన చోడుడు-అతని కుమారుడు చేసిన దాన శాసనాలు దీనిలోని స్తంభాలపై ఉన్నవి.

ప్రస్తుతం ఈలాగే ఒక ఇంద్రేశ్వరాలయం ఇందూరులో, ఇంద్రనాథాలయం పుష్పగిరిలో ఉన్నవి. కాని ఇవి సమకాలికాలు అవునో కాదో చెప్పలేము.

దీని గత వైభవాన్ని బట్టి చూడగా పూర్వం ఇది ఒక క్షేత్రంగానే కాక సామంత రాజధానిగా కూడా ఉన్న చిహ్నాలున్నవి. ఇక్కడ యుద్ధం జరిగిన స్థలం, రాణులు అగ్ని ప్రవేశం చేసిన అగ్ని గుండం, వీర లింగన్న అనే ఒక యోధుని వీరగల్లు కూడ ఉన్నవి.

దీని ప్రక్కన గల అయితవోలులో ఒకప్పుడు బంగారుగండపెండేరం దొరికెనట. గండపెండేరం సామాన్యులు ధరించరు గదా! గంగాపురం శాసనాలలో ఆదిత్య భట్టోపాధ్యాయుని ప్రసక్తి ఉంది కాబట్టి, ఒకప్పుడిది అతని అగ్రహారం అయినా కావచ్చు.

వర్ధమాన పురాన్ని పాలించిన గోన గణపిరెడ్డి మంత్రి భీమన్న ప్రగడ ఇపుడక్కడ ఉన్న కుంట వేయించినట్లు చెబుతారు.

పూర్వం ఇక్కడ సహస్ర నాగప్రతిష్ఠ ఉండేదట. ఇపుడీ గ్రామంలో నాగశిల్పాలకు కొదవ లేదు. కాని ప్రస్తుతం ఇంద్రేశ్వరాలయం చెన్నకేశవాలయం రెండు మాత్రమే నిత్యపూజలలో ఉన్నవి.

వివరాలకు చూ. భారతి. జన-1977

భీమేశ్వరాలయం - ఎండవెట్ల

ఎండవెట్ల నాగర్ కర్నూలులోని కేసరి సముద్రానికి అవతలి కొమ్మున గల గ్రామం. ఆ ఊరికి తూర్పున గ్రామకంఠంలో విశాలమైన బండరాయి, దానిపై ప్రకృతి సిద్ధమైన ఒక గుండం ఉన్నవి.

ఇక్కడి బండ అంచులపై కాలిన వంకాయపై ఏర్పడే ముడుతల వంటి ముడుతలున్నవి. ఈ బండపై గల గుండం ఎప్పుడూ ఎండిపోదు. లోతుగా చూడటానికి కొంత భయంకరంగా ఉంటుంది. "దారుణం భీషణం భీష్మం ఘోరం భీమం భయానకం" అని అమరం.

జనం ఈ గుండం యొక్క భయానక లక్షణాన్నిబట్టి దాన్ని భీమగుండం అన్నారు. అది ప్రధానంగా చేసికొని యిక్కడ భీమేశ్వ రాలయం కట్టబడింది.

భీమ శబ్దం పుంలింగమైనపుడు శివుడు పాండవ భీముడు అనే అర్థాలున్నవి. పూర్వులకు పురాణాలపై మక్కువ ఎక్కువ. కృష్ణాతీరం లోని సంగమేశ్వరాన్ని, అగస్త్యేశ్వరాన్ని పాండవులు దర్శించినట్లు ఆ స్థల పురాణాలు చెబుతవి. అపుడు వారీ దారిని వెళ్ళుతూ ఉండగా ధర్మరాజుల వారు దప్పిగొని భీముని దాహం తెమ్మనెనని, అతడపుడు చుట్టుపట్ల చూడగా ఎక్కడా జలం కనిపించకపోగా ఈ బండపై తన గదతో పొడిచి ఈ గుండం ఏర్పరచినాడని ఇక్కడి స్థలపురాణం చెబుతుంది. అందుచేత దీనికి భీమగుండమని పేరు ఏర్పడెనట. ఇక్కడి ఆలయం దీన్ని ఆధారంగా చేసికొని వెలసింది.

తెలుగుదేశంలో భీమేశ్వరాలయాలు చాలా ఉన్నవి. అవి మిక్కిలి ప్రాచీనాలు. చాళుక్య యుగంలో మొదటి దశకు చెందినవిగా భావిస్తారు. కాని యిక్కడి ఆలయం ఎవరు కట్టించినారో తెలియదు.

ఇది ఉత్తరాభిముఖమైన ఏకకూటాలయం. ప్రాకారద్వారబంధంపై లంబపాదం గల శివపార్వతుల ఆసీనమూర్తులున్నవి. ఈ ప్రాకారంలో చిన్న గర్భాలయం, దానిముందు మండపం ఉన్నవి. ఈ గుడికి తూర్పు వాకిలికి అవకాశం లేదు. అందుచేత ఆ వైపు ఒక కిటికీ ఉంచి దాని ఎదురుగా ధ్వజస్తంభాన్ని నిలిపినారు.

ఆలయ దక్షిణ కుడ్యంపై వెలుపల పెద్ద పెద్ద మత్స్య, కూర్మ, వరాహ చిహ్నాలున్నవి. ఇది శివాలయం. కాబట్టి ఆలయంపై ఈ చిహ్నాలుండటం విచిత్రం.

పూర్వం ఇక్కడ భీమవరం అనే గ్రామముండేది. కాని యిపుడు లేదు. ఈ ఆలయాన్ని చోళరావితి శ్రీపర్వత ఋషి, విభూతి గౌరయలు దర్శించినట్లు ఇక్కడి లేఖనాలు తెలుపుతున్నవి. దీని ఆవరణలో కందూరు ఉదయన చోడుని శాసనం కూడా ఒకటి ఉంది. అది క్రీ. శ. 1148 విభవ వత్సరంనాటిది సిరికొండ శాసన సమకాలికం.

ఉదయన చోడుని కుమారులైన భీమ గోకర్ణులు వర్ధమాన పురాన్ని పాలించినారు. ఈ భీముడు మాతృగమనుడని హనుమకొండ శాసనం చెబుతుంది. అతడా పాపపరిహారార్థం శివరాత్రులలో ఈ స్వామిని పూజించేవాడట.

పూర్వం నాగర్ కర్నూలులో గంధం వారనే వైశ్యులు ఉన్నారు. వారు ధనవంతులు, ధర్మకార్యనిరతులు. కాబట్టి, ఈ ఆలయానికుండే ప్రాకారాన్ని వారు కట్టించినట్లు చెబుతారు.

ఈ ఆలయం గచ్చుతో సామాన్యమైన శిఖరం ఉండేది. దాన్ని తరువాత దుండగులు ఏదో ఉద్దేశం చేత కూలగొట్టినారు. అయితే అది వారు కూల్చటమే మంచిదయింది. ఇపుడు గ్రామస్థులు సిమెంటుతో శిఖరాన్ని చక్కగా కట్టించినారు.

వారిస్వామిని ఏకాదశి శివరాత్రి దినాలలో ఇక్కడికి వచ్చి గుండంలో స్నానం చేసి పూజిస్తుంటారు.

నృసింహాలయం - ఎండవెట్ల

తెలుగులో గుట్టను మెట్ట అని కూడా అంటారు. ఈ గ్రామం చెట్టూ చేమా లేకుండా ఎండలు సూటిగా పడే మెట్ట ప్రక్కన ఉంది. కాబట్టి దీన్ని ఎండవెట్ల అని పిలిచినారు. ఇక్కడ ఊరి ననుసరించి దక్షిణంగా ఉన్న గుట్టపై నృసింహ ప్రతిష్ఠ ఉంది. ఇది ప్రాచీనమైన ఏకకూటాలయం. ఇక్కడ స్వామి ఒక పెద్ద గుండుక్రింద వెలసినాడు. దాన్ని గర్భంగా చేసి ఇక్కడి ఆలయం ముందుకు విస్తరించబడింది. దీనిలో రెండు దశల నిర్మాణం ఉంది.

మొదటి దశలో గుండుక్రింది స్థలం గర్భం కాగా, దాని ముందు గల చిన్న మంటపం మాత్రం కట్టినారు. మంటపానికి ఉత్తరపు గోడపై వెలువల ఒక చేప, ఒక మిధునమూర్తి చెక్కబడినవి. ఇపుడీ మంటపం అర్ధమంటపంగా ఉంది.

ఈ ఆలయాన్ని నిర్మించినవారెవరో తెలియదు కాని ఎదురుగా ఉన్న దీపస్తంభంపై మాత్రం అతని బొమ్మ ఉంది. అతడు రాజ చిహ్నాలతో ఉన్నాడు.

ఇది పూర్వాభిముఖాలయం. రెండవ దశలో మొదటి మంటపానికి సమానంగా ఉత్తరం తూర్పుదిశలలో రాతి తెట్టెగట్టి ఉద్ధిపోసి స్థలాన్ని విస్తరించి దానిపై మొదటి మంటపం ముందు విశాలమైన సభామంటపం, దానికి ఎడమవైపున మరోమంటపం, దక్షిణంగా ఒక గది ఏర్పరచినారు. అంతేగాక, మొదటి మంటపానికి ఉత్తరంగా యాగశాల, ఆ ప్రక్కన కోనేరు, దానిలోనికి మెట్లు కట్టించబడి, చుట్టూ ప్రాకారం గూడ ఎత్తించబడింది.

ప్రస్తుతం నాగర్‌కర్నూలులో ఉన్న చెరువు ఈ స్వామి పేర కేసరి సముద్రం అని పిలువబడుతుంది. నాగనవోలు, కందనవోలు గ్రామాలు స్థాపించిన సామంతుల ప్రియురాండ్రు నాకసాని కందనసాని ఈ గ్రామాలలోని చెరువులు వేయించినట్లుగా చెబుతారు. నాగనూలు చెరువును ఇపుడు నాగ సముద్రం అంటారు. ఆ ప్రకారంగా ఇది కంద సముద్రం కావలెకాని కేసరి సముద్రంగా నిలిచింది.

ఈ చెరువుకు మొదట శిఖేశ్వర సముద్రం అని పేరు. దీన్ని వేసిన నాటి శిఖేశ్వరాలయం పాదు ఈనాడు ఈ చెరువులో తిరుమలా పురం త్రోవన ఉంది. ఎండవెట్లలో నృసింహాలయం కట్టబడిన పిమ్మట ఇది ఆ స్వామి పేర కేసరి సముద్రంగా మారింది. ఈ చెరువు చాలా పెద్దది. పూర్వం దీనిలో 40 అడుగుల నీరు ఉండేదట. ఇపుడు సగానికి తరిగింది. ఈ చెరువుకు నాలుగు తూములున్నవి. మొదటి దానికి కుక్కల తూము, రెండవ దానికి బారుసావుల తూము మూడవ దానికి మశమ్మ తూము నాలుగవ దానికి నరసింహుల తూము అని పేరు. ఇది ఎండవెట్ల వైపు ఉంది.

మల్లయ్య గుడి - కుమ్మెరగట్టు

కుమ్మెర ఇపుడు తాడూరు మండలంలోని గ్రామం. నాగర్ కర్నూలుకు వాయవ్యంగా 9 కి. మీ. దూరంలో ఉంది. అక్కడికి బస్సు కూడా వెళ్ళుతుంది. ఈ గ్రామం దగ్గర ఒక పెద్ద గట్టు ఉంది. దానిపై ఇక్కడ మల్లయ్య వెలసినాడు.

పూర్వం ఈ గ్రామం ఈ ప్రాంతంలో చాలా పెద్ద పట్టణంగా ఉన్న ఆధారాలున్నవి. వెనుక ఒకపుడు కొంకణ దేశంలో కుమార నరపాలుడు అనే ప్రభువున్నాడు. అయన సోదరి ఒకామె శివభక్తురాలై నేను శ్రీగిరి మల్లయ్యనే వివాహమాడెదనని యింటినుండి బయలుదేరింది.

అపుడామెవెంట అన్నగారు కొంత బలగంతో బయలుదేరినాడు. ఆ రాకుమారికి ఒక భ్రమరం అపుడు దారి చూపసాగింది. ఆమె ఆ భ్రమరం ఎటు వెళ్ళితే అటుగా పయనిస్తూ కొన్ని దినాలకు కుమ్మెర గట్టు చేరింది.

తుమ్మెద అక్కడ మూడు దినాలున్నది. అపుడా మూడు దినాలు ఆమె అక్కడ ఒక గుహలో ధ్యానమగ్నురాలై ఉన్నది.

నాలుగవనాడు తుమ్మెద మళ్ళీ బయలుదేరి, శ్రీశైల మార్గం పట్టింది. రాకుమారి మళ్ళీ దాన్ని అనుసరించింది. ఈ పర్యాయం తుమ్మెద సర్వేశ్వరం చేరి, అక్కడ ఒక గుహలోనికి వెళ్ళింది. అపుడు దాన్ని అనుసరించి రాకుమారి గూడా ఆ గుహలో ప్రవేశించింది. అపుడు వెంట ఉన్న అన్నగారు గుహముందు నిలిచి కొంతసేపు చెల్లెలికొరకు నిరీక్షించి ఆమె ఎంతకూ రాకపోగా చెల్లెలిని కేకవేస్తూ దానిలోపలికి వెళ్ళినాడు. అపుడతనికి కొందరు మునులు ఎదురుపడి నీ చెల్లెలు ఇక్కడ కనిపించదు. నీవు శ్రీశైలం వెళ్ళు. అక్కడ భ్రమరాంబ గుడిలో దర్శనమిస్తుంది అని చెప్పినారు. అది విని అతడు వెనుదిరిగి శ్రీశైలం వెళ్ళి భ్రమరాంబ ఆలయంలోనికి ప్రవేశించగా అపుడతనికి తన చెల్లెలు అక్కడ కనిపించి, అన్నానే నిక్కడ శివునిలో ఐక్యమైపోతున్నాను అని పలికి అంతర్ధానమై పోయింది.

అది విని కుమార నరపాలుడు తిరిగివచ్చి తమ చెల్లెలు మూడు దినాలు నిష్ఠతో గడిపిన కుమ్మెర గట్టు క్రింద ఆమె స్మారకంగా ఒక పట్టణాన్ని స్థాపించినాడు. అది అతని పేర కుమార రాయని పట్టణం అని పిలువబడుతూ, దిన దిన ప్రవర్ధమానమై మహా పట్టణం అయ్యింది.

ఈ ప్రాంతంలో ఇప్పటికీ ఎక్కడ ఏంజరుగుతుందో తెలియని స్థలాన్ని కుమ్మరి రాయని పట్టణం అని వాడడం పరిపాటి. దాన్నిబట్టి

ఆనాడు అది ఎంత విశాలమైన పట్టణంగా వ్యాపించి ఉండేదో ఊహించ వచ్చు. ఇపుడీ పట్టణం జాడలు కుమ్మెర గట్టుక్రింద ఉన్నవి.

ఈ కుమారనరపాలుని వంశం అక్కడ ఎంతకాలం పాలించింది తెలియదు కాని ఆ వంశంలోని చివరివాడు వసంత నరపాలుడు. అతడు స్థాపించిన వసంతాపురం ఉంది. అక్కడ ప్రతిష్ఠించిన వసంతేశ్వరుడు ఇపుడా గ్రామం ప్రక్కన ఉన్నాడు.

ఈ వసంత నరపాలునిపై ఒక పర్యాయం శత్రువులు దండెత్తి నారు. ఆ యుద్ధంలో అతడు నిహతుడు కాగా కుమారుడైన పరశురామ నరపాలుడు భయంతో శ్రీశైలాటవులకు పారిపోయినాడు. అపు డతనికి అక్కడ పుణ్యవశంగా ఒక సాధువు కనిపించి సకల కామదమైన "సురభి" మంత్రాన్ని ఉపదేశించాడు.

పరశురామ నరపాలుడు అది సిద్ధి పొందినంతవరకు శ్రీశైలం లోనే ఉండి, అనంతరం వచ్చి సకల సంపదలతొ తులతూగి సురభి పట్టణాన్ని స్థాపించినాడు. ఇది కుమ్మెర వృద్ధులు చెప్పిన కథ.

శత్రువుల దాడితో కుమారరాయని పట్టణం నశించిన పిమ్మట వర్ధమానపురాన్ని పాలించిన గన్నయరెడ్డిగారి కాలంలో అతని సేనాను లైన అయ్యన - బయ్యన అనే వారిక్కడి కొండపై కోటకట్టుకొని నివ సించినారు. ఈ స్థానిక వీరులపై ఒక ఒగ్గుకథ కూడా ఈ ప్రాంతంలో ఉంది. వారికాలంలో ఇపుడు ఉన్న గ్రామం ఏర్పడింది.

ఇక్కడి గట్టుపై మల్లయ్యగట్టు, వానగట్టు, ఊరగట్టు అనే మూడు భాగాలున్నవి. వానిలో మల్లయ్యగట్టుపై ఆనాడు కుమార నర పాలుని సోదరి మూడుదినాలు మౌనంగా కూర్చున్న దరి ఉంది. ఆ దరి క్రిందనే ఇపుడు మల్లయ్యదేవుని ప్రతిష్ఠ ఉంది.

ఈ గట్టుపై సాధారణంగా కురువలు గొఱ్ఱెలు, మేకలు మేపుకునే వారు. అలావుండగా ఒకపుడవి మూడుదినాలు మేత నీళ్ళు ముట్టకుండా మతిలేకుండా పడినవి. అపుడు కురువలు భయపడి, ఇక్కడ వెలసిన ఓ అజ్ఞాత దేవతా! నీవెవరో చెప్పుకొని మా గొఱ్ఱెలను కాపాడమని మ్రొక్కుకున్నారు.

అపుడు వారికి ఆ గుట్టపైగల దరి క్రింద తనను నిలుపుకొని పూజించవలసిందిగా ఆ దేవత చెప్పుకున్నది. నాటినుండి వారక్కడ దేవతను నిలుపుకొని కొలువ నారంభించినారు. అనంతరం కొంతకాలానికి ఇక్కడ ఉండేలవారనే రెడ్లు వచ్చి, తమ కులదైవమైన మల్లయ్య దేవుని ఈ గుట్టపై నిలిపినారు.

ఉండేల వారిది గార్లపాడు. అది కర్నూలు జిల్లాలోనిది. ఒకపుడు వారికి అక్కడి నవాబుతో ఒక యువతి విషయమై తగాదా వచ్చి, నవాబు వంశంలోని ఆమెను తీసికొని పారివచ్చి, తమను వెన్నంటిన నవాబును ఓడించి, మొదట వారు వనపర్తివారి సైన్యంలో చేరి, వారికి అనేక యుద్ధాలలో తోడ్పడినారు.

తరువాత వారు అక్కడనుండి గోపాలపేటకు వచ్చినారు. అక్కడ అష్టభాషా గోపాలరావు వారి సేవలకు మెచ్చి, గరుడ తలాటం, చామరాలు, పగటిమశాల్తి దయచేసి గౌరవించి తుమ్మల సూగూరు, యాదిరెడ్డిపల్లె భూములు ఈనాముగా యిచ్చినాడు.

అపుడు వారు మొదట తుమ్మల సూగూరుకు వచ్చినారు. అప్పటి కది బేచిరాగు. వారు దాన్ని పునరుద్ధరించుకొని అక్కడ నిలిచి తమవెంట తెచ్చుకొన్న కులదైవమైన శ్రీగిరి మల్లయ్యను కుమ్మెరగట్టుపై నిలిపి నారు. దానితో అక్కడ దేవీ ప్రాధాన్యం తగ్గి, క్రమంగా మల్లయ్య ప్రాధాన్యం పెరిగింది.

మొదలక్కడ నిలిచిన రాకుమారి కూడ శ్రీగిరి మల్లయ్యనే వలచి ఉన్నది కాబట్టి ఆమె అక్కడ అతని ప్రాధాన్యాన్ని అంగీకరించింది.

మల్లయ్య దేవుడిక్కడ ఆనాడు రాకుమారి తపం చేసిన చారిక క్రిందనే నిలచినాడు. అతడు నిలచిన పిమ్మటనే ఈ గట్టును మల్లయ్యగట్టు అని పిలిచినారు.

ఈ గట్టు దురారోహంగా ఉంది. అందుచేత గత శతాబ్దంలో ఈ దేవుని చేరటానికి ఎండవెట్ల పకీరుగారు స్వామివారివరకు మెట్లు కట్టించినాడు. ఇక్కడ ప్రతి యేడు శివరాత్రికి మూడు దినాలు గొప్పగా ఉత్సవం సాగుతుంది.

ఇపుడిక్కడ మూడు లక్షలతో ఆలయ పునరుద్ధరణం ప్రారంభ మైంది. 1. బుర్రి మల్లారెడ్డిగారు సబ్ ఇన్‌స్పెక్టర్, 2. ఉండేల రామారెడ్డి సర్పంచ్, 3. కృష్ణయ్య సాహుకారి, 4. కారుకొండ నారాయణరెడ్డి, 5. కురువ బంగారయ్యగారలు ఆలయ పునరుద్ధరణ కమిటీగా ఏర్పడి ఆ పని చేపట్టినారు. ఇపుడు ప్రధానాలయ మంటప నిర్మాణం జరిగినది.

ఈ స్వామిపై వంగూరు రామచంద్రయ్యగారు అనే ప్రధానోపాధ్యాయుడు నివేదన అనే ఒక కావ్యం వ్రాసినాడు.

సీతారామాలయం - గంగవరం

నాగర్ కర్నూలు తాలూకాలోని గంగవరం మహాదేవునిపేట గోనరెడ్లనాటి గ్రామాలు. ఒకప్పుడివి వర్ధమాన పురానికి చెంది ఉన్నవి. ఇపుడు బిజినపల్లె మండలంలో ఉన్నవి. ఇక్కడికి నాగర్‌కర్నూల్ నుండి బస్ ఉంది.

ఈ గ్రామానికి పడమట పెద్ద రాతిగుట్టలున్నవి. వర్ధమాన పురాలయాలకు రాయి అక్కడే తీసిరట. ప్రస్తుతం అక్కడ కాసెవాని బోడుపై ఒకపెద్దరాయి నిలువుగా పగిలి సగంమాత్రమే నిలిచి ఉంది. తక్కిన సగం మాత్రం పచ్చెనే వర్ధమాన పురాలయాలకు సరిపోయిందట. ఇక మీరా రాయిపరిమాణం ఊహించుకోవచ్చు.

పూర్వం ఇక్కడి గుట్టలనుండి ఒక జాలు బయలుదేరి ఒకచోట మడుగు కట్టింది. దాన్ని ఆధారంగా చేసికొని వర్ధమానపురం గోనరెడ్లు అక్కడ గంగేశ్వరుని ప్రతిష్ఠించి గ్రామానికి ముగ్గు పోసినారు.

ఈ గ్రామాన్ని ప్రతిష్ఠించిన వారెవరో స్పష్టంగా తెలియదు కాని గోన గన్నయ్యరెడ్డి గారికి గంగయరెడ్డి అనే నామాంతరం కూడా ఉంది.

గోనవారి పిమ్మట వడ్డవాని కూచకుళ్ళవారు అనే రెడ్ల చేతికివచ్చి దాని క్రింది గ్రామాలన్ని వారి సేరీలుగా మారినవి. అయితే గంగ వరాన్ని వారు క్రీ. శ. 1800 ప్రాంతంలో అమ్ముకున్నారు.

ప్రస్తుతం అక్కడ ఉన్న సీతారామాలయం కూచకుళ్ళ వంశానికి చెందిన వెంకమ్మగారనే దొరసాని కట్టించింది. అది శిల్పశోభితం కాకున్నా శిలానిర్మితమే. చుట్టూప్రాకారం ముఖద్వారంతో గంభీరంగా ఉంది.

ఈ ఆలయముఖద్వారం కానాపురం రామారెడ్డిగారి భార్య వెంకట రామమ్మగారు కట్టించటానికి పూనుకోగా ఆనాటి నైజాం ప్రభుత్వం అనుమతించలేదు. అందువల్ల ఆమె ఆ ప్రయత్నం మానుకుని ఇపుడు స్వామివారికున్న తేరు చేయించింది. పిమ్మట ఈ ముఖద్వారాన్ని దానిపైగల గోపురాన్ని చిల్లకంటి బంగారయ్యగారు అనే వైశ్యుడు క్రీ.శ. 1963లో కట్టించినాడు.

ఇక్కడి ఉత్సవమూర్తులు వీరు చేయించినవి కావు. వేరేగ్రామంలో లభించగా అవి ఈ ఆలయానికి ఇచ్చినారు. ఇక్కడ అహోబల పీఠాధిపతి 36 వ వారు తీర్థపరిగ్రహం చేసినారు. ఈ ఆలయంలో ఏటా చైత్రశుద్ధ నవమికి తలంబ్రాలు నడుస్తవి.

దీనికి ఎడమవైపున పూర్వంనాటి శివాలయం ఉంది. దానికి ఆవరణ, ఆలయంవెనుక కోనేరు దానిప్రక్కన విశాలమైన తోటగుడ్డం ఉన్నవి. కాని ఇది ఉద్ధరణ లేక వెలవెల బోతుంది.

ఈ గ్రామం గంగవరం కాబట్టి నిజానికిక్కడ గంగా శంకరులే ముఖ్యులు. సీతారాములు వారింటికి వచ్చిన చుట్టాలు మాత్రమే.

హిందూ మతానికి శివకేశవులిద్దరూ రెండు కన్నులు. ఏ గ్రామం లోనైనా ఆ రెండు ఆలయాలు జతగా ఉండటం ఒక విశేషం. సీతా రాముల గుడితోపాటు ఇది కూడా ఉద్ధరించదగింది.

శివాలయం - గుడిబండ - గుంతకోడూరు

గుంతకోడూరు తాడూరు మండలంలోని గ్రామం. అక్కడ గ్రామానికి కొద్ది దూరంలో విశాలమైన బండ ఉంది. దానిపై గొల్ల రామ దాసు శివాలయం కట్టించి ప్రక్కగా సమాధి కట్టించుకుని తన 52 వ ఏట దానిలో ప్రవేశించి మూసికున్నాడు.

ఈయన శిష్యుడు తాడూరు లక్ష్మణదాసు. అతడు వేపూరు హనుమద్దాసు చెల్లెలి కొడుకు. బంటు లక్ష్మయ్య అని మొదటి పేరు. భార్యావియోగం కలిగి సర్వసంగపరిత్యాగియై గురువుగారి సమాధి దగ్గ రనే ఉన్నాడు. క్రీ. శ. 1964 క్రోధి సంవత్సరం నుండి అతడక్కడ అఖండదీపంగూడ నడుపుతున్నాడు.

ఈ శివాలయానికి సంక్రాంతికి బండ్లు వెళ్ళుతవి.

నృసింహ పంచాయతనం - మేడిపూరు

ఇది కూడ తాడూరు మండలంలోని గ్రామం. కేంద్రమైన తాడూరు గూడ చారిత్రక గ్రామం. పూర్వం ఈ గ్రామంలో పల్లా చంద్రశేఖర

శాస్త్రిగారి గురువు భోగలింగ చయనులు అనే మహనీయుడున్నాడు. ఆయన సమాధి ఉండెనట కాని ఇపుడు లేదు.

ఇక్కడ ప్రాచీనమైన శివకేశవాలయాలు గూడ ఉన్నవి.

ఈ మండలంలోని మేడిపూరు గూడ ఒక ప్రసిద్ధ గ్రామం. 17 వ శతాబ్దంలో అక్కడ జోగయ్యగారనే సిద్ధపురుషుడు ఉన్నాడు. ఆయన విశ్వబ్రాహ్మణుడు.

ఈ గ్రామంలో గంగాపురం వారనే స్మార్తులు ప్రసిద్ధులు. గంగాపుర చెన్నకేశవాలయంలో మొదట ఈ వంశీయులే పూజారులుగా ఉండిరట. అందుచేత వారికి గంగాపురం వారనే పేరు స్థిరపడింది. ఈ వంశీయులు అనేక యజ్ఞయాగాలు చేసినారు

గత శతాబ్దంలో ఈ వంశంలో ఇక్కడ నరసింహయ్య దీక్షితులు ప్రసిద్ధుడు. ఆయన దుందుభీతీరంలో ఒక ఆలయం కట్టించి దానిలో విష్ణు పంచాయతనం ప్రతిష్ఠించినాడు.

పంచాయతనంలో ఆదిత్యుడు, అంబిక, గణపతి, శివుడు, విష్ణువు ఉంటారు. వారిలో ఎవరిని నడుమ ప్రతిష్టిస్తే అది ఆ పంచాయతనం అనబడుతుంది.

ఈ ఆలయంలోని పంచాయతనానికి దీక్షితులుగారు "శంనో రగదే" అని పేరుంచినాడు.

అనగా శంకరుడు, నారాయణుడు, రవి, గణపతి, దేవి, అని దాని తాత్పర్యం.

నరసింహస్వామి - వలుంపల్లె

ఇది పెద్దాపురానికి నైరుతి దిక్కున ఉన్న బేచిరాగు. ఇక్కడ నరసింహస్వామి వెలసినాడు. అతనికి గుట్ట నరసింహస్వామి అని పేరు

ఇక్కడ పూర్వం ఒక రైతు పొలం దున్నుకుంటూ ఉండగా ఒక గుండు కనిపించింది. దాన్ని అతడు గుంటుకపై పెట్టుకునేవాడు. కాని అది రాత్రికి మళ్ళీ ఎలాగో యథాస్థానానికి చేరేది. అది చూచి ఒకనాటి రాత్రి రైతు దాన్ని కాపలా కాచినాడు. అపుడతనికి స్వామి ఆవేశించి నేను నృసింహస్వామిని ప్రతియేటా సంక్రాంతికి యాదగిరినుండి ఈ దారినే సింగపట్నానికి వెళ్ళుతూ ఉంటాను చూదువు రమ్మని ఒక బండ దగ్గరకు కొనివెళ్ళి చూపినాడు. దానిపై అతనికి అడుసులో త్రొక్కినట్లుగా అచ్చుపడిన కుడికాలు కనిపించింది. అది స్వామి దక్షిణానికి నడిచి వెళ్ళినట్లుగా ఉన్నది. ఎడమ కాలి గుర్తు కొంచెం జారింది.

అది చూచిన పిమ్మట ఆ రైతుకు స్వామిపై నమ్మకం కలిగి అక్కడొక చిన్నగుడికట్టి తనకు కనిపించిన గుండును నిలిపినాడు. ఆ గుండు, సింగపట్నంలోని స్వామి మూర్తి రెండూ ఒకేతీరుగా ఒకే పరిమాణంలో అచ్చుగుద్దినట్లుంటవి. ప్రజలతనిని ఆ దారినే సింగపట్నానికి వెళ్ళి పెండ్లికొడుకవుతాడని నమ్ముతారు.

రైతు అక్కడ స్వామికి గుడికట్టిన పిమ్మట ఒకనాడు ఆ దారిని దేవరల కొలుపుచేసే బైండ్ల నరసింహ ఏదో కొలుపుకు వెళ్ళి వస్తూ త్రాగిన మైకంలో నీవు నరసింహుడవే, నేను నరసింహుడనే! నీకు నాకు భేదమేమిటని స్వామిని గుడినుండి తీసి వెలుపల పారవేసి వెళ్ళినాడు. అపుడు అతని భార్య గర్భవతిగా ఉన్నది. ఆ పర్యాయం ఆమెకు బిడ్డకాక అదే రాతి అంత పరిమాణంకల మాంసం ముద్ద పుట్టింది. అది చూచి అతడు గాబరాపడి స్వామి దగ్గరకు వెళ్ళి లెంపలు వేసుకొని క్షమాపణ చెప్పుకొని ఈ తడవ కొడుకు పుడితే నీపేరే పెట్టుకుంటానన్నాడు. అది విని స్వామి అతని మ్రొక్కు చెల్లించినాడు. దానితో స్వామి మహిమ ఇక ఆ చుట్టుప్రక్కల అంతా తెలిసిపోయింది.

దానితో అక్కడి సర్పంచు ఇంకా గ్రామస్థులు కలిసి స్వామికి గుడి చక్కగా కట్టినారు. పెద్దాపురం నరసింహరాయని కుమారుడు ప్రకాశరావుగారు శ్రద్ధ తీసుకొని ఏటేటా సంక్రాంతికి ఇపుడు గొప్ప ఉత్సవం నడుపుతున్నాడు.

ఇక్కడి పూజారులుగా దొంతరమోని వారు అనే తెలుగు వారున్నారు. ఇదొక విశేషం.

మార్కండేశ్వరం - శాయనపల్లె

నాగర్‌కర్నూలు తాలూకాలోని ముమ్మాయపల్లె - శాయనపల్లె రెండూ జతగా ఉన్న గ్రామాలు. వానిని గోనరెడ్ల దగ్గర ఉన్న ముమ్మాయ - శాయన్న అనే ఆశ్రితులు స్థాపించినట్లు చెబుతారు. ఇవి ఇపుడు బిజనపల్లె మండలంలో వనపర్తి రోడ్డుపై ఉన్నవి. శాయనపల్లె ముమ్మాయపల్లెకు రెండు కిలోమీటర్లు ఉంటుంది.

శాయనపల్లెకు పడమట మైలున్నర దూరంలో ఒక గుట్ట, దాని ప్రక్కన ఒక పెద్ద చెరువు ఉన్నవి. దానికి మొగుళ్ళ చెరువని వ్యవహారం. దానిపై మొగులయితే తప్పక వానపడుతుందని గ్రామస్థుల నమ్మకం.

ఇది సాధకులకు చక్కని ఏకాంత ప్రదేశం. అందుచేత పూర్వం ఎవరో ఇక్కడ ఒక మార్కండేశ్వర ప్రతిష్ఠ చేసినారు. మార్కండేశ్వరుని పేర ఇక్కడ ఉన్న శివలింగం చక్కగా ఉంది.

మార్కండేయుడు పద్మశాలీలకు కులదైవం. అంతేకాక, అతడు చిరంజీవి కాబట్టి వ్యక్తులు తమ జన్మదినంనాడు అతనిని పూజించవలసి ఉంది.

ఇక్కడ ఈ ప్రతిష్ఠ గుట్టపై ఒక ఎత్తయిన పడిగరాతి క్రింద ఉంది. మొదట స్వామికి ఏ గుడి గుహ లేకుండగా సుమారు తొంబదేండ్ల

క్రింద శాయనిపల్లె నివాసి బిల్లకంటి పుల్లయ్యగారనే వైశ్యుడు ఆ దరికి రెండు వైపులా గోడలు పెట్టించి స్వామివారి నివాసానికి ఒక ఆలయ రూపమిచ్చినాడు. ఇప్పుడిక దాన్ని ముమ్మయపల్లె నివాసి కూచకుళ్ళ రామచంద్రారెడ్డి గారు చక్కని ఆలయంగా కట్టించినాడు.

ఇక్కడ మార్కండేశ్వరుని ముందు మరో దరి క్రింద లక్ష్మీ నారాయణుల ప్రతిష్ఠ ఉంది. ఆ దరి రెండు గుండ్లు ప్రకృతి సిద్ధంగా నిలిచి ఏర్పడింది. ప్రజలీ స్వామినిపుడు లక్ష్మివెంకటేశ్వరుడని పిలుస్తున్నారు. ఇపుడా దరిపై గూడ శిఖరం కట్టబడింది.

ఇక్కడ ఉత్సవాలేవీ జరుగవు కాని, సమీప గ్రామస్థులు ఏకాదశి, శివరాత్రుల సందర్భాలలో ఇంకా ఇతర పండుగ సందర్భాలలో వచ్చి పూజిస్తుంటారు.

ప్రక్కన చెరువుంది కాబట్టి ఇక్కడ నీటికి కొరతలేదు. అభివృద్ధి పరచితే ఇదొక దర్శనీయ స్థలంగా రూపొందగలదు.

ఇక్కడి స్వామిపై కల్లపు రామలింగయ్యగారి తాతగారు పాపకంటి పుల్లమరాజుతో గౌరీకల్యాణం - రామలింగయ్యగారు ఇమ్మడిజెట్టి చంద్రయ్య గారితో మృత్యుంజయ శతకం వ్రాయించినారు. ఈ శతకం క్రీ శ. 1978 లో ముద్రితమయింది.

రంగనాయకాలయం - శ్రీపురం

శ్రీపురం నాగర్‌కర్నూలు తాలూకాలో అదే మండలానికి చెందిన గ్రామం. కేంద్రానికి 8 కిలోమీటర్లు ఉంది. ఈ తాలూకాలో ఇక్కడి రంగనాయకాలయం ప్రసిద్ధి.

శ్రీపురం కంటే మొదలక్కడ లక్ష్మీపురం అనే గ్రామం ఉన్నది. అది రూపరి ఇపుడీ ఊరేర్పడింది. ఈ గ్రామం మొదట జోషి

వెంకయ్యగారనే స్మార్తుని అగ్రహారం. జోషివారు పూర్వం ఈప్రాంతంలో పంచాంగకర్తలు.

ఇక్కడి రంగనాయకాలయం కట్టించినవాడు వింజమూరి నరసింహాచార్యులనే వైష్ణవుడు. వింజమూరు నెల్లూరుసీమలోని గ్రామం. ఈ వంశానికి మూలపురుషుడు నరసింహాచార్యులుగారు. ఆయన ఇక్కడికి గురుపీఠంగా వచ్చినాడు. అతని వంశంలోని నాలుగవ నరసింహాచార్యులు గారు ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించినాడు. ఈయన అహోబిలం పీఠ సంప్రదాయానికి చెందినవాడు.

ఆయనగారి మేనమామ గ్రామం ధర్మపురి. కరీంనగరంలోని ధర్మపురి వేదవిద్యలకు నిలయం. కాబట్టి ఆయన అక్కడ బాగా చదువుకుని దోమకొండ సంస్థానం వెళ్ళి అక్కడ పండితపదవి సంపాదించి అక్కడనే ఈ స్వామివారిని ప్రతిష్ఠించవలెనని శ్రీరంగయాత్ర చేసి స్వామిని వేంచేపు చేసుకుని వస్తుండగా మార్గమధ్యంలో తమ గ్రామాన్ని సమీపించే వరకు మనసు మారి స్వామివారిని ఇక్కడ ప్రతిష్ఠించినాడు.

వింజమూరివారు గద్వాల ప్రభువుల ఆశ్రితులు. అందుచేత నరసింహాచార్యులు శ్రీపురంలో ఆలయ నిర్మాణానికి సహాయం కోరగా వారు కొంత చేసినారు. ఈ తాలూకాలో గుడిపల్లి ప్రక్కనగల పెద్దాపురం దగ్గర గుడిమిట్ట అని ఒక స్థలం ఉన్నది. అక్కడ పూర్వం ఒక పెద్ద ఆలయం ఉండి శిథిలమయింది. ఆ శిథిలభాగాలు ఇక్కడ మరెన్నో ఆలయాలకు ఉపకరించినవి. ఇక్కడి రంగనాయకాలయానికి గుడిమిట్ట ఆలయ శిలలు చాలా తెచ్చి ఉపయోగించినారు.

నరసింహాచార్యులు ఇక్కడ స్వామివారిని జ్యేష్ఠ పూర్ణిమనాడు ప్రతిష్ఠించి పిమ్మట ఆశ్రమ స్వీకారం చేసి ఒక ఫాల్గుణ శుద్ధ చతుర్దశి నాడు సమాధిలో ప్రవేశించినాడు.

స్వామి అక్కడ జ్యేష్ఠంలో ప్రతిష్ఠింపబడినాడు. కాబట్టి అపుడు రథోత్సవం. పుష్యంలో అధ్యయనోత్సవం ఫాల్గుణంలో సమాధి ఆరాధన జరిగేవి. ఈ తాలూకాలోని పెద్ద ఉత్సవాలలో ఇది ఒకటి.

ఈ స్వామికి ఏటా గద్వాల, కొల్లాపురం, గోపాలపేట ప్రభువులు ఉత్సవానికి సరిపోను అర్చనా సామగ్రి పంపేవారు.

నరసింహాచార్యుల పిమ్మట ఆయన కుమారుడు వెంకట కృష్ణమాచార్యులు నిర్వహణాధికారిగా వచ్చినాడు. ఆయన మంచి వ్యవహారవేత్త కాబట్టి తండ్రిగారి అనంతరం ఈ ఆలయానికి ఎన్నో ఆస్తిపాస్తులు సమకూర్చి ఈ స్వామివారిపై రాకొండ లక్ష్మణాచార్యుల చేత పరకాల విజయం అనే ఒక యక్షగానం కూడా చెప్పించినాడు.

కాలంతోపాటు ఇపుడీ ఆలయ వైభవం గూడా సన్నగిలింది. ఫాల్గుణంలో మాత్రమే ఇపుడుత్సవం నడుస్తుంది.

దేవుడు లేని గుడి - సిరసవాడ

సిరసవాడ ఇపుడు తాడూరు మండలంలోని గ్రామం. దుందుభీ తీరంలో ఉంది. స్థానికంగా ఇది పెద్ద చరిత్రగల గ్రామం. మొదట ఇది గంగాపురానికి శిరోవాటిక కాని ఇపుడా రెండు గ్రామాల నడుమ పాపకల్లు, నేరెళ్ళపల్లి. బుద్ధ సముద్రం అనే గ్రామాలు వెలసినవి.

గంగాపురంలో ఇప్పటికి బొడ్రాయి లేదు. హనుమంతుడు లేడు. వారు సిరసవాడకు వచ్చి బొడ్రాయిని ఆలవానిపల్లెకు వెళ్ళి హనుమంతుని పూజిస్తారు. ఆలా పోలేని పక్షంలో ఆయా గ్రామాలవైపు తిరిగి దండం పెట్టుకుంటారు.

సిరసవాడకు శ్రీవాటిక అని గూడా వ్యవహారం. పూర్వం ఇక్కడ బ్రాహ్మణులెక్కువ. ఇపుడిక్కడికి హైదరాబాదునుండి నేరుగా బస్ ఉంది.

ఇక్కడ పూర్వాభిముఖమైన ఒక ప్రాచీనాలయం ఉంది. దాని ప్రధాన ద్వారంపై ఢమరుక, త్రిశూలపాణులు, తోరణంపై గజలక్ష్మి, గర్భాలయ ద్వారానికి దండపాణులు ఉన్నారు. వీరు ద్విభుజులు. లోపల అధిష్ఠానపీఠంపై గరుడాళ్వారున్నాడు.

గ్రామస్థులిది చెన్నకేశవాలయమని, వేణుగోపాలాలయమని రెండు విధాలుగా చెబుతారు. కాని ఇపుడు ఇందులో ఏ ప్రతిష్ఠ లేదు. ఉన్నంతలో అధిష్ఠాన పీఠానికి ద్వారపాలకులకు ఐక్యత లేదు.

ఈ ఆలయ శిఖరం ఆవంచలోని రాజగోపాలాలయ శిఖరం వలె ఉంది. ఇంతవరకు ఇది ఎక్కడా చెక్కుచెదరలేదు. ఆలయంలో ఒక స్తంభంపై చిన్న శాసనం కూడా ఒకటి ఉంది.

ఈ గుడి ముందు ఒక శిథిల మంటపం ఉంది. అది కల్యాణ మంటపం, లేదా మరొకటి కావచ్చు. గ్రామస్థు లెరిగినంత వరకు ఆ మంటపం మట్టి ఉవ్వపోసి స్తంభాలు మాత్రం నిలుపబడి అసంపూర్ణం గానే ఉండిపోయింది. ఇపుడా మట్టిని గ్రామస్థులు ఇండ్లకు తోలుకోగా కంభాలు కూలిపడినవి.

ఊరి వారెరిగినంతవరకు దానిలో ఏ ప్రతిష్ఠ జరుగలేదు. ఈ గుడిలో గర్భాలయం ఎదురుగా ఒక బావి ఉంది ఇది ఇక్కడి ప్రత్యేకత. ఇది ఏ సంప్రదాయమో తెలియదు.

ప్రతిమలకు ప్రాణప్రతిష్ఠా సందర్భంలో ధాన్యాధివాసం జలాధివాసం అనే తంతులున్నవి. కాబట్టి ఇక్కడ జలాధివాసం కోసం మంటపంలో బావి త్రవ్వబడిందని, ప్రతిష్ఠామూర్తులు జలాధివాసంలో ఉండగా ఏదో అంతరాయం కలిగి ప్రతిష్ఠ నిలిచిపోయి ఉంటుంది అని గ్రామస్థులు అభిప్రాయపడుతారు.

పదారవ శతాబ్ది పిమ్మట పాలమూరు జిల్లాలో లోకయ్యపల్లె సంస్థానం పేరు చెందింది దానికి సంబంధించిన గ్రామాలు నేటి కలువ కుర్తి నాగర్‌కర్నూలు తాలూకాలలో గూడా ఉన్నవి. నాగర్‌కర్నూలు తాలూకాలోని గ్రామాలకు ఈ సిరసవాడ కేంద్రంగా ఉన్నది. ఇక్కడ ఆనాడు - వారి కోట, గజశాల ఉన్నవి.

లోకయ్యపల్లె వారి వంశంలో శ్యాంరావుగారి భార్య వెంకమ్మ గారు సన్ 1020 హిజరీలో ఈ గ్రామం ప్రక్కగా ఉన్న అయితోలును ఇరువెంటి రామన్నగారికి మఖ్తాగా ఇచ్చింది. ఆమె ఆ వంశంలో అయిదవ తరానికి చెందింది. ఇక్కడే నివసించింది. ఆమె పిమ్మట ఇక్కడ ఉన్న రాధమ్మ దొరసాని గారు చివరది. ఆమె ఏడవ తరానికి చెందిన ఆమె ఉప్పాజీ రావుగారి భార్య క్రీ. శ. 1660 ప్రాంతంలో ఉన్నది.

వీరిదగ్గర రంగాపురం గున్నవారు దివాంజీలుగా ఉన్నారు. అక్కడినుండి రంగాపురం వచ్చిన వీరి మూలపురుషుడు భద్రారెడ్డిగారు. ఆయన వంశంలో ముత్తారెడ్డిగారు అనే వ్యక్తి మిక్కిలి భక్తిపరుడై ఇక్కడి ఆలయాభివృద్ధికి కృషి చేసినాడు.

వీరి గురువులు దరూరివారనే వైష్ణవులు. రాకొండ నివాసులు. ముత్తారెడ్డిగారు తమ గురువుల వారిని పిలుచుకొని ఆలయాన్ని అప్పగించి అక్కడ నిలుపుకున్నాడు. అపుడాయన గుడిలో దేవుడు లేకుండటం చూచి ఒక చింతకర్రతో వెంకటేశ్వరుని చేయించి నిలిపి బ్రహ్మోత్స వాలారంభించినాడు. అవి కొంతకాలం జరిగినవి.

సిరసవాడ అంగడి ఊరు. ఒకపుడా అంగడికి సమీపంలోని తాండనుండి - పూర్ణగర్భిణియైన ఒక లంబాడి వనిత వచ్చింది. ఆమె సరుకులు కొని ఇంటిదారి పట్టిన పిమ్మట ప్రసవవేదన ఆరంభమయింది. అది సాయంకాలం. అపుడు వెంట ఉండేవారు అపద్ధర్మంగా ఆమెనా గుడిలోనికి కొనివెళ్ళినారు. ఆ రాత్రి ఆమె అక్కడ ప్రసవించింది.

తెల్లవారి గ్రామస్థులకది తెలిసి వారు వెళ్ళి ఆ లంబాడిని నానా మాటలని గుడినుండి బయటికి గెంటినారు. ఈ లోపల ఆమె భర్త బండి కట్టుకొనివచ్చి తన భార్యను కొనివెళ్ళినాడు. పిమ్మట గ్రామస్థులా మంటపంలోని బావి లంబాడీ రక్తంతో మైలపడిందని దానిపై ఒక బండను కప్పి పూడ్చినారు.

ఆలయంలో ఇట్టివి జరగరాదు. కాని జరిగితే సంప్రోక్షణాది ప్రాయశ్చిత్తాలున్నవి. కాని గ్రామస్థులవేవీ తలపెట్టకుండా స్వామివారి పూజలు మానివేసినారు. అదిచూసి దుండగులెవరో స్వామివారి మూర్తిని హరించుకొని పోయినారు. దానితో అది మళ్ళీ యథాపూర్వంగా నిలిచింది.

ఈ ఆలయం ఒక పుణ్యనదీ తీరంలో ప్రశాంతమైన వాతావరణంలో ఉంది కాబట్టి తప్పక ఉద్ధరించదగింది. ఇంకా వివరాలకు - చూ. ఆరాధన - అగ - 1986 - పు. 33.

ఇదికాక ఇక్కడ మరో రెండు హనుమదాలయాలున్నవి. వానిలో ఒకటి ప్రాచీనం. ఆ స్వామి గంగాపురం నాటివాడు. అతడు గ్రామానికి ప్రాత అడుగున ఉండగా గ్రామస్థులు కొనివచ్చి ఆలయం కట్టి నిలిపినారు.

ఈ గ్రామానికి క్రీ. శ. 1956 ఫిబ్ర. 29 నాడు వినోబాగారు వచ్చినారు. అపుడాయన సమక్షంలో గ్రామంలోని హరిజనులు ఆలయ ప్రవేశం చేసినారు. ఆయన వెళ్ళిన పిమ్మట ఆలయం అపవిత్రమయిందని గ్రామ పురోహితుడైన శివరామయ్యగారి కుమారుడు ఇరువదేండ్ల యువకుడు స్వామివారిని తాటియాకుల మంటచేసి కాల్చి పునీతం చేసినాడు. అనంతరం మూడు నెలల కతడు మరణించినాడు. గ్రామస్థులది అతడు స్వామివారిని కాల్చిన ఫలమని చెప్పుకున్నారు.

ఆ గుడిని అతడు అగ్నిపునీతం చేసిన పిమ్మట అక్కడి దొరగారైన సుధాకరరెడ్డిగారి తల్లిగారు దాన్ని మళ్ళీ బాగు చేయించి ధ్వజస్తంభం కూడా ఎత్తించింది. ఇపుడది చక్కగా నడుస్తుంది.



వర్ధమానపురం త్రికూటాలయాలు - నాగర్ కర్నూలు తాలూకా.

వడ్డవాని సీమలో వర్ధిల్లిన ఆలయాలు

వడ్డవాని గ్రామాలు ఈ జిల్లాలో ఆత్మకూరు తాలూకాలో రెండు, నాగర్‌కర్నూలు తాలూకాలో ఒకటి ఉన్నవి. ఇపుడు ఆత్మకూరు తాలూకాలోనిది చిన్నచింతకుంట మండలంలో, ఈ తాలూకాలోనిది బిజినపల్లి మండలంలో చేరినవి.

ఈ తాలూకాలోని గ్రామం కేంద్రానికి పశ్చిమంగా తొమ్మిది కి.మీ. దూరంలో ఉంది. అక్కడికి బస్సుల సర్వీసులు గూడా ఉన్నవి. ఈ గ్రామం క్రీ.శ. 9 నుండి 14వ శతాబ్దం వరకు ఒక సీమ కేంద్రంగా ఉండి వేరు వేరు రాజవంశాలతో పాలింపబడింది.

రాజధానిగా ఉన్న గ్రామాలలో ఆలయాలు ఎక్కువగా ఏర్పడటం మామూలు. అందుచేత యిక్కడ ఊరికి తూర్పున వీరభద్రాలయం, ఆగ్నేయంగా త్రిమూర్త్యాలయం, పడమట రావగుళ్ళు, ఉత్తరంగా పాత కోట. దాని అడుగున నంది గుడి, గ్రామ మధ్యంలో నాగేశ్వర, చెన్న కేశవాలయాలున్నాయి.

వీరభద్రాలయం ఇపుడు లేదు. ఆ అడుగున సుందరమైన వీరభద్ర ప్రతిమ మాత్రం కొంతపూడి నిలిచింది.

త్రిమూర్త్యాలయంలో ఏ ప్రతిష్ఠలు జరిగినట్లులేదు. అది ప్రతి కూటాలయం. కాకతీయ శైలిలో ఉంది. దాని స్తంభాలు నిద్దంగా అద్దం వలె ఉన్నవి. ఈ ఆలయాలను ఆనాటి ప్రభువుల వేశ్యలు కట్టించినట్లు వాడుక. వీనిలో పూర్వం దక్షిణంలోని ఆలయం నుండి గుడిపల్లె గట్టు వరకు సొరంగం ఉండెనట. ఇపుడు దానిని పూడ్చినారు.

కురువ గుడులు ద్వికూటాలయం. వానిని పూర్వం అక్కడి కురువలు కట్టించినట్లు చెబుతారు. అక్కడ విరిగిపడిన మూర్తులను బట్టి వానిలో ఖడ్గపాణియైన దేవి ఉన్నట్లు తెలుస్తుంది.

ప్రస్తుతం పాతకోట అని చెప్పబడుతున్న అడుగు ఆనాడు కాకతి రుద్రుడు దండెత్తి దహించిన రాజభవనంగా చెప్పబడుతుంది. ఈ అడుగులోనే ఈ ప్రాంతానికల్లా ప్రసిద్ధమైన నందిగుడి ఉంది. దీనిలోని నంది మిక్కిలి పెద్దగాను సుందరంగాను ఉంది. అందుచేత దీన్నిబట్టి ఈ గ్రామాన్ని 'నంది వడ్డెమాను' అని పిలిచినారు. ఈనాడు రంగారెడ్డి జిల్లాలోని నందివనపర్తి గూడా ఒకపుడీ జిల్లాలోనిదే. కలువ కొలనులో నందికోటీశ్వరాలయం ఉంది. మున్నూరిని నంది వంశీయులు పాలించి నారు. ఈ వంశం అనంతర కాలంలో కుంతలదేశం వెళ్లిపోయినట్టు తెలుస్తుంది. ఈలాగే యిక్కడ కనిపించే మరొకవంశం నాగవంశం. నాగపురవరేశ్వరులమని చెప్పుకున్నవారి శాసనాలు అమరాబాదు పీఠ భూమిపై ఉన్నవి. ఈ నాగపురం ఇపుడు నాగర్‌కర్నూలు తాలూకాలో ఉన్నదే అని పలువురి అభిప్రాయం,

వడ్డవానిలో ఇపుడొక నాగేశ్వరాలయం ఉంది. అది చాలా ప్రాచీనమయింది. దానికి మల్యాల గుండయగారు క్రీ. శ. 1246 జనవరి 19 నాడు ప్రాకార శిఖరాలు కట్టించి సువర్ణ కలశం ఎత్తించినట్లు అక్కడి శాసనం వల్ల తెలుస్తుంది.

ఈ తాలూకాలో నాగుల శాసనాలు లభించలేదు కాని ఈఆలయం ఈ ప్రాంతాన్ని పాలించిన నాగులే స్థాపించి ఉంటారు. ఇది చాలా విశాలమైన ఆలయం. దీన్ని పునరుద్ధరించటం అవసరం. ఈ గ్రామంలో గల చెన్నకేశవాలయం గూడా పునరుద్ధరించవలసినదిగా ఉంది. ఇది గూడా బాగా విశాలమైన ప్రాంగణంగల గుడి.

కాకతి రుద్రుని పిమ్మట ఇక్కడికి వచ్చిన గోన గణపిరెడ్డి ఒక లక్ష్మీనారాయణ ప్రతిష్ఠ చేసినట్లు అతని శాసనం చెబుతుంది. కాని గ్రామస్థులు ప్రస్తుతం ఇక్కడ ఉన్న కేశవమూర్తి ఏదుట్ల అడవిలో లభించినట్లు చెబుతారు.

వైష్ణవంలో దశావతారాలకు మిక్కిలి ప్రాముఖ్యం ఉంది. వైష్ణవ భక్తి శతకాలన్నిటిలో దశావతారాలు తప్పక దర్శనమిస్తవి. పోతనగారు గూడా ఆ అవతరాలపై మక్కువచేత భాగవతంలో వీలుచిక్కినప్పుడల్లా ధ్వన్యాత్మకంగా చెబుతూనే పోయినాడు. అయితే వీనికి సాహిత్యంలో ఇంత ప్రాధాన్యత లభించినా ఆరాధనలో మాత్రం లభించలేదు. అందు చేత శిల్పులు విష్ణుప్రతిమనెక్కడ మలిచినా దాని చుట్టు ప్రభలో ఈ అవతారాలను సంకేతంగానైనా చూపి విడుస్తారు.

ఈ వడ్డవానిలో అలాకాక అవతారమూర్తులన్ని విడివిడిగా శిలలపై గండరించబడినవి. ఇది ఇక్కడి ప్రత్యేకత. గోన గణపిరెడ్డి ఈ అవతారాలకు దానం చేసినట్లు చెప్పబడింది కాని ప్రతిష్ఠించినట్లు లేదు. బహుశః ఇవి ఇక్కడ అతనివరకే ఉన్నాయేమో!

ఆదిలాబాదు జిల్లాలోని చెన్నూరు దగ్గర గల అడవిలో సుందరమైన పెద్ద అవతారమూర్తులు ఉన్నవట. అవి ఆ విధంగా విడివిడిగా ఉండటం అరుదు కాబట్టి అట్టివానిని రక్షించవలసి ఉంది.

ఈ అవతారాల ప్రసక్తి శాసనాలలో మొదటిసారిగా పెద్ద కడుమూరు శాసనంలో ఉంది. అది చా. వి. శ. 40 అనగా క్రీ. శ. 1119 నాటిది.

కాకతి రుద్రదేవుని దండయాత్ర పిమ్మట ఇక్కడికి సామంతుడుగా వచ్చిన గోన గణపిరెడ్డి చేత అతని రాజ్య సముద్ధరణుడైన భీమన ప్రగడ క్రీ. శ. 1224 ఫిబ్రవరి 1 నాడు తమ ప్రభువు చేత—

బుద్ధేశ్వర - సహస్రలింగ గణపతీశ్వర తమ తండ్రుల పేర లక్ష్మీనరసింహ - నారాయణ దేవర, ఇంకా ఏక వింశతి లింగ ప్రతిష్ఠ, ప్రసన్న భైరవ ప్రతిష్ఠ చేయించినాడు. ఆ దేవతల కందరికి విడివిడిగా వేర్వేరు స్థలాలలో భూదానాలు కూడా చేయించినాడు.

భీమన ప్రగడ ఆనాడు చేయించిన ఈ ప్రతిష్ఠలన్ని కేవలం వడ్డవాని గ్రామంలోనే కాక ఆ సీమ అంతటా వ్యాపించి ఉన్నవి.

భీమేశ్వరుడు - చెర్ల ఇటిక్యాల

ఇది నాగర్‌కర్నూలుకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇటికెల పేర ఇక్కడ చెర్ల యిటికెల - దేశి యిటికెల అని రెండు గ్రామాలున్నవి. ఇటికలు చేయటానికి మట్టి అన్ని స్థలాలలో పనికిరాదు కాబట్టి పూర్వం ఇవి ఇష్టికా క్షేత్రాలు.

ఈ ఊరు మొదట పల్లెగడ్డ అనేచోట ఉండగా 'భీమన ప్రగడ' అనే బ్రాహ్మణుడు గ్రామాన్ని ఇపుడున్న చోటికి మార్పించి అక్కడ చెరువు వేయించి దానిలో ఇపుడున్న శివాలయం కట్టించినట్లు పూర్వులు చెప్పేవారు.

ఈ ఆలయంలోని శివలింగం చాలా పెద్దది. ఇంత మాదిరిది ఈ చుట్టు ప్రక్కలలో మరొకటిలేదు.

ఈ భీమన ప్రగడనే ఇంద్రకల్లులో నాగులకుంట వేయించి చెన్నకేశవ ప్రతిష్ఠగూడ చేయించినట్లు చెబుతారు. ఇపుడు ఆ చెన్న కేశవునికి గుడిలేదు. మిక్కిలి సుందరమైన ఆ మూర్తి ఆ కుంటలోనే ఒక వైపున పడిఉంది.

ఇటికెలలో చెరువు దగ్గర మిక్కిలి పెద్ద పెద్ద ఇటుకలున్నవి. అందుకే ఈ గ్రామాన్ని ఇటికెల అని పిలిచినారు. ఇక్కడ క్రీ.శ. 1875 ప్రాంతంలో గ్రామస్థులైన కరణం సీతయ్య-నరసయ్య గారనే సోదరులు హనుమత్ప్రతిష్ఠ చేయించినారు. అది ఇపుడు ఉంది.

బుద్ధేశ్వరుడు - బుద్ధవరం

వడ్డవాని సీమలో గోన గణపిరెడ్డి తమ తండ్రిగారి పేర ఒక గ్రామాన్ని కట్టించి ఒక పెద్ద చెరువు వేయించినాడు. అతడు స్థాపించిన గ్రామానికి బుద్ధవరమని చెరువుకు 'బుద్ధ సముద్రము' అని పేరు. ఇపుడిది కూడా ఒక గ్రామమై తిమ్మాజిపేట మండలంలో ఆవంచకు తూర్పున 8 కి. మీ.పై ఉంది.

బుద్ధవరం బిజినపల్లి మండలంలో చేరి వనపర్తి రూటులో 12 కి. మీ.పై ఉంది. అక్కడ ప్రాచీనమైన బుద్ధేశ్వరాలయం గ్రామానికి పడమరగా ఊరి వెలుపల ఉంది.

ఇది ఏకకూటాలయం. చిన్నగా నిరాడంబరంగా ఉంది. గ్రామస్థులు ఏకాదశికి శివరాత్రికి స్వామిని పూజిస్తుంటారు.

సహస్రలింగ గణపతీశ్వరుడు - గణపురం

గణపురం గోన గణపిరెడ్డి తమ ప్రభువు కాకతి గణపతిదేవుని పేరు, తనపేరు కలసి వచ్చేటట్లుగా స్థాపించిన గ్రామం. ఇపుడు దీన్ని ఖిల్లాగణపురం అంటున్నారు. ప్రస్తుతం ఒక మండలంగా కూడా ఉంది.

గణపురానికంటె మొదలక్కడ నాగినేనిపల్లె అనే గ్రామం ఉన్నది. గణపిరెడ్డి అక్కడగల గుట్టపై కోటను, గుట్టక్రింద గణపతీశ్వరాలయాన్ని కట్టించి గ్రామాన్ని తమపేర మార్చినాడు.

ఇక్కడి గణపతీశ్వరాలయం పేరుకు తగినట్లుగా ఎంతో రాజ ఠీవిగా ఉంది. కాని గణపురంపై అలావుద్దీను దండయాత్ర జరిగినట్లు స్థానికులు చెబుతారు. ఆ యుద్ధంలో ఈ ఆలయాన్ని మహమ్మదీయులు వశపరచుకొని మసీదుగా మార్చినారు. అయితే అదిపుడు మసీదుగా కూడా లేదు.

పురాతత్వ శాస్త్రజ్ఞులు దాన్ని ప్రాచీన కట్టడంగా గుర్తించి దర్శనీయ స్థలంగా ఉంచినారు. ఇక్కడ ఇదికాక ఇంకా చాలా ఆలయాలున్నాయి.

కమ్మరిగేరిలో ఒక శివాలయం ఉంది. ఆ గుడిలోని దేవిమూర్తి కుడిచేతి ఖడ్గం, ఎడమచేత చక్రం ధరించి ఉంది. ఆమె పాదాలక్రింద మూడు తలలున్నవి. ఈ దేవికి రెండువైపులా ఒంటెలు, కుడివైపున సూర్యుడు. శివలింగం ఎడమవైపున చంద్రుడు గణపతి గండరించబడి ఉన్నాడు.

ప్రజలీదేవిని మొమ్మాయి - మహామాయ - కామాక్షి అని చెబుతారు. మున్నూరుగేరిలో వేణుగోపాల ఆలయం ఉంది. అదిపుడు వేణుగోపాలుని గుడి అయినా పూర్వం సూర్యాలయం, స్వామివారి పాదపీఠంపై యిపుడు సప్తాశ్వాలున్నవి.

గ్రామంలో ఇంకా ఇక్కడ గ్రామం అంచునగల గుట్టపై వీరభద్ర - చౌడేశ్వరి - నృసింహ ప్రతిష్ఠలు కూడా ఉన్నవి. కాని అవి ఏవీ యిపుడు సజీవంగా లేవు.

ఇంకా ఈ గ్రామ వివరాలకు చూ. ఆంధ్రపత్రిక - భారతి - సారస్వతానుబంధం. 25-2, 11-3-1987 సంచికలు.

లక్ష్మీనరసింహ ప్రతిష్ఠ

ఈ ప్రాంతంలో తెలకపల్లె - పెద్దూరు - వడ్డవాని మొదలైన అనేక గ్రామాలలో లక్ష్మీనరసింహ ప్రతిష్ఠలున్నవి. ఈనాడు వాని అడుగులు మాత్రం మిగిలినవి. కాని గుడులు లేవు. అందుచేత ఆనాడు గణపిరెడ్డి చేసిన ఈ ప్రతిష్ఠ ఎక్కడ ఉండెనో తెలియటం లేదు.

నారాయణ దేవర ప్రతిష్ఠ - మార్కండేశ్వరం

బిజినపల్లి మండలంలో వనపర్తి రోడ్డుపై మమ్మాయపల్లె అనే గ్రామం ఉంది. దానికి దక్షిణంగా ఒకటిన్నర కి. మీపై ఒక గుట్ట ఉంది. అది సాధకులకు మంచి ఏకాంత స్థలం.

దానిపై శివకేశవ ప్రతిష్ఠలు రెండూ ఉన్నవి. అక్కడ ఉన్న శివునికి మార్కండేశ్వర స్వామి అని, కేశవునికి లక్ష్మీ వేంకటేశ్వర స్వామి అని వ్యవహారాలు. కాని ఇక్కడి స్వామి వేంకటేశ్వరస్వామి మూర్తిగాదు. నారాయణమూర్తి. ఈ మూర్తి ఏటవాలుగా ఒకదాని కొకటి ఆనుకొని నిలిచిన రెండు గుండ్ల క్రింద ఉన్నాడు. స్వామికి ఆలయం నిర్మించే అవకాశం లేదు కాబట్టి ఇపుడా గుండ్లపై శిఖరం కట్టించినారు.

ఇక్కడ తప్ప మరెక్కడా ఈ ప్రాంతంలో మరెక్కడైనా చెన్నకేశవమూర్తులే కాని నారాయణ స్వామి మూర్తులులేవు. కాబట్టి ఆనాటి గణపిరెడ్డి ప్రతిష్ఠించిన నారాయణదేవర ఇతడే కావచ్చు.

ఏకవింశతి లింగ ప్రతిష్ఠలు - కుమ్మెర

వడ్డవానికి ఉత్తరంగా ఈనాడు కుమ్మెర అనే గ్రామం ఉంది. అది నాగర్‌కర్నూలుకు వాయువ్యం అవుతుంది. ఈనాటి కుమ్మెర ఒకప్పుడు పెద్ద నగరం. కుమారరాయని పట్టణం అని దానికి పేరు. ఆ పట్టణంలో అనేక వీథులున్నవి. "అండిపేట" అనేది ఆనాటి పట్టణంలోని ఒక వీథి. ఇదిపుడు కుమ్మెరకు తూర్పున ఉంది. గ్రామస్థు లొకప్పుడు అక్కడ రైసుమిల్లు వేదామని పునాదులు త్రవ్వగా చాలా పానవట్టాలు బయలుపడినవి. అదిచూచి వారు వానిని అలాగే పూడ్చి ఆ ప్రయత్నం మానుకున్నారు.

పూర్వం అక్కడ శైవమఠాలు కూడా చాలా ఉన్నట్లు చెబుతారు. ఇపుడా అడుగును మఠాల చెలుక అంటున్నారు. కనుక ఈ దాఖలాలను బట్టి గోనగణపిరెడ్డి చేసిన ఏక వింశతి లింగప్రతిష్ఠ ఇక్కడనే ఉండవచ్చు అనిపిస్తుంది. కాని అతడేకారణంగా అన్ని లింగాలను ప్రతిష్ఠించింది తెలియదుకాని వానికి సాక్షిగా ఇపుడు వడ్డవాని కుమ్మెర నడుమ 'గుడ్లనర్వ' అనే గ్రామం ఉంది. "గుడ్ల" అనేది పూర్వం గుడుల యొక్క అనే షష్ఠ్యంతం. నర్వ అనగా దారి. గణపిరెడ్డి ప్రతిష్ఠించిన శివాలయాల దారిలో ఏర్పడింది కాబట్టి ఈ గ్రామాన్ని గుడ్లనర్వ అని పిలిచినారు.

ప్రసన్నభైరవ ప్రతిష్ఠ

ఈ ప్రాంతంలో ధర్మాపురం - బిజ్జనపల్లె - వట్టెం గ్రామాలలో భైరవ ప్రతిష్ఠలున్నవి.

ధర్మపురం వడ్డవానికి ఉన్న మజరా; ప్రస్తుతం బేచిరాగు. రికార్డులో మాత్రమే ఈ గ్రామం మిగిలింది కాని నేలపై మిగులలేదు. అయితే ఒకపుడిది ప్రసిద్ధ గ్రామంగా ఉన్న జాడలున్నవి. ఇక్కడి త్రవ్వకాలలో విడివిడిగా ఉన్న పెద్దపెద్ద మాతృకా మూర్తులు బయలు పడినవి. వానిని పిల్లలమర్రికి కొనివెళ్ళినారు.

ఇక్కడ ఒక అవలోకితేశ్వరుని ప్రతిమగూడా లభించింది. దానిని కూడా అక్కడికే కొనివెళ్ళినారు. కాబట్టి గ్రామం వైభవంగా ఉన్నపుడిక్కడ యింకా ఏయే ఆలయాలు ఉన్నవో తెలియదు. ఇపుడు ఒక్క భైరవాలయం మాత్రం మిగిలింది.

బిజ్జనపల్లిలో గ్రామానికి దక్షిణంగా ఉన్న శివుని గుట్టపైకూడా మరో భైరవ ప్రతిష్ఠ ఉంది. ఈ మూర్తి పరమసుందరం కాని విరుగగొట్టబడింది. ఇక్కడ గోన గన్నయరెడ్డి గారిది ఒక చిన్న శాసనం

గూడా ఉంది. అంతేగాక ఇక్కడగల ఒక గుండుపై ఒక పెద్ద ద్వారం, దానిపై త్రిశూల చిహ్నం చెక్కబడినవి. గోనరెడ్లు త్రిశూల చిహ్నం కలవారు కాని, ఈ ద్వారం చిహ్నం దేన్ని తెలుపుతూ ఉందో ఆలోచించవలసి ఉంది.

వట్టెం గ్రామంలో నారదాచలం ప్రసిద్ధి. అది ఒకే గుట్టకాదు. నాలుగుగుట్టల సమూహం. వానిలో ఒకదానిపై వింధ్యవాసినీదేవిని, ఒకదానిపై భైరవుని, ఒకదానిపై నృసింహస్వామిని, ఒకదానిపై వెంకటేశ్వరుని వేర్వేరు కాలాలలో భక్తులు ప్రతిష్ఠించినారు.

వీనిలో వింధ్యవాసిని భైరవ ప్రతిష్ఠలు ప్రాచీనం కాబట్టి వద్ద వాని చుట్టుగల ఈ భైరవ ప్రతిష్ఠలలో గణపిరెడ్డి చేయించిన భైరవ ప్రతిష్ఠ ఏదో ఇపుడు గుర్తించే వీలులేదు.

భీమనప్రగడ తమప్రభువుతో ఈ ప్రతిష్ఠలేకాక తాను గూడా కొన్ని చేయించినట్లు చెబుతాడు.

పాలమూరు తాలూకాలోని ఆలయాలు

ఇపుడీ గ్రామానికి మహబూబ్‌నగర్ అని పేరు. పాలమూరికంటె మొదలిక్కడ రుక్కమ్మపల్లె అనే పల్లె ఉన్నది. ఆ గ్రామాన్ని లోకాయపల్లె ప్రభువైన శ్యాంరావుగారి భార్య రుక్కమ్మగారు క్రీ. శ. 1650 ప్రాంతంలో తన పేర స్థాపించింది. అనంతరం దాని ప్రక్కన ఇపుడున్న పాలమూరు వెలసింది. పాలమూరు యొక్క మొదటి పేరు పాలమర్రి.

మర్రిచెట్లలో పాలమర్రి - పగిడిమర్రి - ఎర్రమర్రి - నల్లమర్రి - గున్నమర్రి - చాగమర్రి అని చాలా భేదాలున్నవి.

పాలమర్రిమాను తెల్లగా ఉండి వెండిపూతవలె నిగనిగలాడుతూ ఉంటుంది. పసిడి మర్రిమాను మామూలుగానే ఉంటుంది గాని పండు పసుపురంగుతో తీయగా ఉంటుంది. నల్లమర్రిమ్రాను ఆకు ఈనెలు నల్లగా ఉంటవి. హైదరాబాదు నుండి చేవెళ్ళ రోడ్డున ఇవి ఉన్నవి. హైదరాబాదు కలువకుర్తి రోడ్డున గున్నమర్రులున్నవి. ఇవి ఎంత కాలానికి ఎత్తు పెరగవు.

ఇక్కడి మర్రిని గురించి ఒక కథ ఉంది. పూర్వం ఇక్కడ అమ్మపల్లెలో ఒక భక్తుడున్నాడు. ఆయన తగిన గురువు కొరకు వెదకుతూ ఉండగా ఒకనాడు ఆయన ఇంటికి వచ్చిన అతిథి వాకిట ఉన్న ఒక ఎండుగుంజను చూపి, మీ యింటికి వచ్చిన సాధుభిక్షువులందరికి పాదాలు కడిగి ఆ నీరు దీనికి పోస్తూ ఉండు. ఇది ఎవరి పాదజలంచేత చిగిరించితే నీవు వారితో ఉపదేశం తీసికో అని చెప్పినాడు.

198A

పిల్లలమర్రి - ఆవరణ ప్రవేశద్వారం - మరియు మర్రి. (మహబూబ్‌నగర్)

১৯৪৫

ఆ సలహా అతనికి నచ్చింది. నాటినుండి ఇంటి ముందు కెవరైనా సాధువులు భిక్షకు వచ్చినపుడు వారి పాదాలు కడిగి ఆ గుంజకు పోయ సాగినాడు. అలా ఉండగా ఒకపుడిద్దరు సాధువులు భిక్షకు వచ్చినారు. ఇంటి ఆయన తన నియమం ప్రకారం వారికి గూడా కాళ్ళు కడిగి ఆ జలం వాకిటిలోని గుంజకు పోసినాడు. వారు భిక్ష గ్రహించి వెళ్ళిన వారం దినాలకు ఆశ్చర్యకరంగా ఇక్కడ గుంజకు చిగురు వచ్చింది. అది చూచి యింటి యజమాని ఇక వారిని వెదకుతూ వెళ్ళినాడు. అపుడు వారతనికి మన్నెం కొండపై ఒక గుహలో కనిపించినారు. అపుడాయన వారి దగ్గరకు వెళ్ళి సాష్టాంగపడి శిష్యుడై, అనంతరం తమగ్రామానికి తోడు కొని వచ్చి తమ వాకిటిలో చిగిర్చిన గుంజను తీసికొని వెళ్ళి గ్రామానికి దూరంగా ఒకచోట నాటి, అక్కడ తమ గురువులకు ఆశ్రమం ఏర్పాటు చేసినాడు. ఆ విధంగా అతడానాడు నాటిన చెట్టే ఈనాటి పిల్లలమర్రిగా ప్రసిద్ధిపొందింది.

ఆ చెట్టు పెరిగిన పిమ్మట దాని నీడన అక్కడి పశుల, కాపరు లుండేవారు. ఆనాడు బూదపురం, ఆవంచ, ఆలవానిబావి మొదలైన స్థలాల నుండి గంగాపురం ప్రభువులకు పాలు వెళ్ళుతూ ఉండేవి. అవి ఇక్కడ ఈ మర్రికి ఉట్లు కట్టి నిలువ చేస్తుండేవారు. కాబట్టి దానికి పాల మర్రి అని వ్యవహారం నెలకొని క్రమంగా అక్కడ వెలసిన గ్రామం పాలమూరు అయింది.

ఈ గ్రామానికి క్రీ.శ. 1904 లో రైలువచ్చింది. అపుడు జిల్లా కేంద్రాన్ని నాగర్‌కర్నూలు నుండి యిక్కడకు మార్చి ఆనాటి ప్రభువు గారి పేర దీనికి మహబూబ్‌నగర్ అని నామకరణం చేసినారు.

ఇపుడీ గ్రామంలో చిన్నవి పెద్దవి కలిసి సుమారుగా నలువది ఆలయాలున్నవి. వానిలో హనుమంతునివి అన్నిటి కంటె ఎక్కువ. వానిలో పన్నెండు కేవలంగాను, మరో అయిదు ఇతర ఆలయాలతోను కలిసి ఉన్నవి.

హనుమదాలయాలు :

పోలీస్ స్టేషన్‌లోని హనుమదాలయం ఈ గుడులలో ప్రాచీన మయిందిగా చెబుతారు. ఎఱ్ఱకుంట దక్షిణం కొమ్మున ఒకటి, ఆ కుంట వెనుక బండ్లగేరి వైపు మరొకటి ఉన్నవి. కమ్మరి గేరిలో మరొకటి ఉంది. దాన్ని శ్యాంరావు గారనే ఉపాధ్యాయుడు కట్టించినాడు.

వేపూరుగేరి కోనేరు వద్దకూడ ఒక ఆంజనేయాలయం ఉంది. మరొకటి శేషగిరిరావుగారి కాంపౌండు దగ్గర మర్రిచెట్టు క్రింద ఉంది. దాన్ని శేషగిరిరావు గారి పూర్వులు కట్టించినారు. దీన్నిపుడక్కడి వారు బాగా అభివృద్ధి చేసినారు.

తిరుమలదేవుని గుట్టపై మరో ఆంజనేయాలయం ఉంది అది స్థానికులైన వడ్డె వారు కట్టించినారు. అదే గుట్టపై మధ్యభాగంలో దరిపల్లె రోడ్డున మరొకటి ఉంది. దాన్ని మఖ్తల్ తాలూకాలోని కిష్టాపురం నివాసి గొల్ల బాలయ్య కట్టించినాడు. ఈ బాలయ్య మొదట ఒక హమాలి. అతనిపైకి ప్రతి శనివారం స్వామి ఆవేశించేవాడు. దానితో అతడీ ఆలయం కట్టించి, కాలాంతరంలో గొప్పవాడైనాడు.

కలెక్టరు బంగ్లావెనక ప్రస్తుతం ఒక హనుమంతుడున్నాడు. కాని అతనికి గుడిలేదు. రైల్వేస్టేషను దగ్గర మరొకటి ఉంది. దాన్ని రైల్వే ఉద్యోగులు కట్టించుకున్నారు. ఇంకొకటి ఇండస్ట్రియల్ ఎస్టేటుకు పశ్చిమంగా ఉంది. దాన్ని గ్రామస్థులు కట్టించినారు. షాసాహెబ్ గుట్టపై మరొకటి ఉంది. అదికూడా స్థానికులు కట్టించిందే. ఈ విధంగా యిక్కడ హనుమదాలయాలు చాలా వెలసినవి.

ఇతర ఆలయాలు

నగరేశ్వరాలయం :

ఇది తూర్పు కమాను దగ్గర ఉంది. మొదట ఈ గుడి వీథికంటె చాలా తగ్గుగా ఉండి వర్షాకాలంలో వరదనీరు శివునిపై రెండు మూడు అడుగులలోతు నిలిచేది. అందుచేత గ్రామస్థులిందులోని పూర్వప్రతిష్ఠను తీసి స్థలం బాగా ఎత్తులేపి పునః ప్రతిష్ఠ చేసినారు. అపుడిందులో శివునితో పాటు దత్తాత్రేయ నవగ్రహ ప్రతిష్ఠలుగూడ చేయబడినవి.

శ్రీ సీతారామాంజనేయాలయం

ఇది గూడ తూర్పు కమాను దగ్గరే ఉంది. దీనిలో సీతాలక్ష్మణ సమేతుడైన శ్రీరాముడు ఉన్నాడు. పూర్వం దీని వెనుక గూడా ఒక హనుమదాలయం ఉండేది కాని అదిపుడు దీనిలోనే చేరింది.

రామమందిరం :

తూర్పు కమాను చౌరస్తా దగ్గర ఉన్న ఆలయాలలో ఇది ఒకటి. దీన్ని స్థానికుడైన నూకల చంద్రయ్యగారు కట్టించినారు. ఆయన మంచి వేదాంతి. ఈయనగారి గురువు కృష్ణావధూతగారు.

పాలమూరు నూకల చంద్రయ్యగారు, కుమ్మెర మహాదేవయ్యగారు, గోపాలపేట గజ్జెల దాసుగారు, సాతాపురం సింహయ్యగారు ఈ ప్రాంతంలో పేరొందిన వేదాంతులు. వీరందరూ వైశ్యులు. నూకల చంద్రయ్యగారి సమాధి ప్రస్తుతం గ్రామానికి పశ్చిమంగా ఉన్న రైల్వే గేటు సమీపంలోని శివాలయంలో ఉంది. అక్కడ ఏటా సమారాధన జరుగుతుంది.

ఆయనగారు కట్టించిన రామమందిరం ప్రక్కన మరో శివాలయం ఉంది. దాన్ని బస్తీలోని వైశ్యులు కలకొండ బుచ్చన్న, ఆకారపు చంద్రమౌళిగారి సహకారంతో కట్టించినాడు.

పాండురంగాలయం :

ఇది పాత సివిల్ హాస్పిటలు దగ్గరుంది. పూర్వం అక్కడ కోనేరుండగా దాన్నిపూడ్చి మేస్త్రీలీగుడిని నిర్మించినారు. పాండురంగనితో పాటు దానిలో గూడ ఒక హనుమదాలయం ఉంది.

పోచమ్మగుడి :- ఈమె గ్రామాధిదేవత. ఈగుడి జాంద్రగేరిలో ఉంది.

వీరన్నపేటలోని గుడులు :

వీరన్నపేటను గురించి స్థానికంగా ఈ క్రింది కథ వ్యాప్తిలో ఉంది. కాలజ్ఞానకర్త వీరబ్రహ్మేంద్రుడు జగమెరిగిన గురువు. ఆయన శిష్యుడైన సిద్ధడు తొలిజన్మలో ఆనందభైరవుడనే యోగి. అతనికొక సందర్భంలో గోహత్యా దోషం సంక్రమించింది. అపుడు గురువుగారి ఆజ్ఞతో తీర్థయాత్రలకు బయలుదేరి, నిలిచినచోటనల్లా యజ్ఞాలు చేస్తు నేటి పాలమూరు ప్రాంతం చేరినాడు.

బండమీదిపల్లె ఇపుడు పాలమూరులో ఒక కాలనీ. కాని ఆనాటికి అది అరణ్యమయం. ఆనందభైరవుడాస్థలంలో నిలిచి ఒక యజ్ఞం చేసినాడు. అపుడు సమీప గ్రామంలోని రామయ్య అనే విశ్వకర్మకు ఒక మూగి పిల్లవాడు దొరికినాడు. ఆయన ఆ బాలునికి మాటలు వచ్చే వైద్యంచేస్తూ ఒకపుడు మూలికల కొరకు ఈ అడవికిరాగా అతనికి ఆనందభైరవునితో పరిచయం కలిగింది. అతని అనుగ్రహంచేత ఆ మూగబాలునికి మాటలుకూడ వచ్చినవి.

పిమ్మట కొన్ని దినాలకు రామయ్య గతించి ఆ బాలుడు ఆనందభైరవుని చేరినాడు. కొంత కాలానికి అతనికి కూడా అంత్యకాలం సమీపించి తన శిష్యులకు సెలవిచ్చినాడు. అపుడు వారు లోకాయపల్లెకు వచ్చి తమ గురువుగారు యజ్ఞం చేసిన స్థలం అక్కడి దొరల నడిగి యిప్పించుకొని అక్కడనే నివసించినారు.

ఆనందభైరవుడు యజ్ఞం చేసిన స్థలంలో ఒక గుట్ట ఉంది. దానికి కనకాద్రి అని పేరు. అతని శిష్యులలో వీరప్ప అనే ఆయన ఆ గుట్టపై ఒక శివాలయాన్ని ప్రతిష్ఠించి పిమ్మట దాని ప్రక్కన తన పేర వీరన్న పేటను స్థాపించినాడు.

ఈ కనకాద్రి సమీపంలో మరో గుట్ట ఉండేది. ఆనందభైరవుని శిష్యుడైన మూగపిల్లవానికి మౌనప్ప అని పేరు పెట్టినాడు. ఆ మౌనప్ప వీరప్పను చూసి రెండవ గుట్టపైన తన పేర ఒక శివ ప్రతిష్ఠ చేసినాడు. కాలాంతరంలో అదిపుడు మౌనేశ్వరాలయం అయింది.

వీరప్ప వీరన్నపేటను స్థాపించిన పిమ్మట ఎందుకో తాను కొన్ని దినాలకు అక్కడినుండి దూరంగా వెళ్ళి మరో చోట నివసించినాడు. అక్కడ బండ ఉండేది కాబట్టి తర్వాత అక్కడ ఏర్పడిన గ్రామం బండమీదిపల్లె అయింది. ఆ స్థలం మొత్తం సర్వే నెం. 611 గల వేయి ఎకరాల గాయిరాన్. అది క్రీ. శ. 1979 లో శివజంగాలకు నాల్గవతరగతి ఉద్యోగులకు, 1980 లో బలహీనులైన మరో ఏబది నాలుగు నిమ్న జాతి కుటుంబాలకు ప్రభుత్వంచేత పట్టాగా ఈయబడింది. ఇపుడా స్థలంలో సుమారు 700 ఇండ్లేర్పడినవి. ఈ కాలనీలో క్రీ. శ. 1983 విజయదశమి నాడు అభయ వీర హనుమత్ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది. ఇపుడు దానికి రాష్ట్ర దేవాదాయశాఖ సర్వశ్రేయోనిధి నుండి ఆర్థిక సహాయం కూడా లభించి అభివృద్ధి చెందుతుంది.

వి. చూ. ఆరాధన అగ - 89 పు 36.

వీరప్పగుడి

వీరన్నపేటను స్థాపించిన వీరప్ప అక్కడ తనపేర వీరభద్రుని గూడ ప్రతిష్ఠించినాడు ఇపుడీ స్వామిని వీరప్ప అంటున్నారు. ఈ దేవుని కురువలు పూజిస్తారు.

శివాలయం :

వీరన్నపేటలో గాక గ్రామంలో ఒక శివాలయం ఉంది. దాన్ని భోగం వెంకటరాములు గారి కుమారుడు జానకిరాములు గారు ప్రతిష్ఠించినారు.

ఇదిగాక రైల్వేగేటు అవతల శ్మశానం దగ్గర మరొకటి ఉంది. ఇది పురాతనమయింది. దీనిలో శివునితోపాటు దత్తాత్రేయ ప్రతిష్ఠగూడా ఉంది. ఇదిగాక మరో దత్తాత్రేయాలయంకూడా ఉంది. ఈ విధంగా యిక్కడ మూడు దత్త ప్రతిష్ఠలున్నవి.

మోనప్పగుడి :

ఇది ఇపుడు కలెక్టరు బంగ్లాకు దక్షిణంగా ఒక చిన్న గుట్టపై ఉంది. దీన్ని ఆనందభైరవుని శిష్యుడు మోనప్ప ప్రతిష్ఠించినట్లు, రాయచూరు నివాసులైన లింగవంతులగు విశ్వకర్మలు ప్రతిష్ఠచేసినట్లు చెప్పబడుతుంది. వీరి వంశం ఇపుడు లేదు.

మోనప్ప వీరగురుని కంటె మొదటివాడు. కర్ణాటక దేశంలోని తింత్రిణీ నివాసి దీర్ఘకాలం జీవించి అనేక మహిమలు ప్రదర్శించి అంత్యంలో సమాధియైనాడు. ఈయన సురపురం ప్రభువులైన పెద్ద నాయకుని వంశీయులకు కులదైవంగా కూడా ఉన్నాడు.

తింత్రిణిలో ఇపుడితని సమాధి ఆలయం ఉంది. అక్కడ ఏటా గొప్ప ఉత్సవం జరుగుతుంది. ప్రస్తుతం ఇక్కడ ఉన్న గుడి కొరకు స్థానికులైన పాలకొండ బుచ్చయ్య, వీరభోజయ్యగారలు చాలా పాటుబడి పునరుద్ధరించినారు. వారి పిమ్మట కలువకొలను బొజ్జయ్య గారక్కడ పూజారిగా ఉండి దానికి ఆస్తిని చేకూర్చి రక్షించినాడు. ఇపుడు వారి తమ్ముడు శ్రీరాములుగారు దీని అభివృద్ధికి ఎంతో పాటుబడుతున్నాడు.

నృసింహాలయం :

ఇది క్రొత్తగంజులో ఉంది. స్థానికులైన వ్యాపారులు కట్టించి నారు. ఆధునిక పద్ధతులతో అందంగా ఉంది.

హయగ్రీవాలయం :

ఇది వేంకటేశ్వరకాలనీలో వరకాలమఠం యొక్క శిష్యులచేత కట్టబడింది. ఇందులో హయగ్రీవునితోబాటు హనుమత్ప్రతిష్ఠ గూడా ఉంది.

రాఘవేంద్ర మఠం :

ఇది మెట్టుగడ్డలో ప్రభుత్వ వైద్యశాలకు ఎదురుగా ఉన్నతిప్పపై కట్టబడింది ఆ తిప్పకు వారు పరిమళగిరి అని పేరుపెట్టినారు. దీనిలో రాఘవేంద్రస్వామితోపాటు హనుమత్ప్రతిష్ఠగూడా ఉంది. ఈ ఆలయం విశాలమైన ఆవరణలో అన్ని వసతులతో అందంగా తీర్చబడింది. దీన్ని స్థానికులైన మధ్వభక్తులందరు మంత్రాలయంవారి సహకారంతో స్థల సేకరణ చేసి నిర్మించినారు.

ఎల్లమ్మగుడి :

ఈమె ఊరికి మరో గ్రామదేవత. ఈగుడి కలెక్టరాఫీసు యొక్క ఆవరణలో ఉంది. ఇది నామమాత్రంగా ఉండి పాతబడిపోగా ఇక్కడ కలెక్టరుగా ఉన్న శ్రీ కాశీ పాండ్యన్‌గారు దాన్ని పునరుద్ధరించి చక్కగా కట్టించినారు.

తెలుగుతల్లి :

ఈమె ప్రక్కనే తెలుగుతల్లి విగ్రహం ఉంది. ఈమె ఆంధ్ర దేశంలో తెలుగుతల్లికి మొదటిసారిగా రూపకల్పన అని చెబుతారు. ఇది కూడా కాశీ పాండ్యన్‌గారి కాలంలోనే జరిగింది.

అంబా భవాని ఆలయం :

ఇది అశోక్ టాకీసు వెనుక ఉంది. ఇదికూడా ఇక్కడి వానిలో ప్రాచీనమయింది.

అంబాభవాని, నాయక్ వంశీయుల ఇలవేల్పు. ప్రస్తుతం ఇక్కడ శేషగిరిరావు కాంపౌండు ఉంది. శేషగిరి, నాయక్ వంశానికి చెందినవాడే కాబట్టి ఈ గుడిని ఆ కాంపౌండులోని హనుమదాలయంతో పాటు వారే కట్టించి ఉంటారు.

శివాలయం :

పాత ఊరికి ఈశాన్యంగా మైదానంలో ఈ ఆలయం ఉంది. ఇది పురాతనమయింది. గ్రామస్థు లిటీవల పునరుద్ధరించి గోపురం కట్టి నారు. ఇపుడిది వివాహాలకు మంచి వసతిగా ఉంది.

శ్రీరామాలయం - రామకొండ

ఇది కోయలకొండ మండలంలో కేంద్రానికి అరమైలు దూరంలో ఉన్న ఎత్తయిన కొండ. ఈ కొండపై ఒక గుహలో ఈ ప్రతిష్ఠ చేయబడింది. దానికిముందు మండపంవేసి దీనికి ఆలయ రూపమిచ్చినారు. ఈ ఆలయం ముందు ప్రకృతిసిద్ధమైన పెద్ద కొలనుంది. దానిలో ఎల్లపుడూ ఎర్రకలువలు ఉంటవి.

ఈ ఆలయం మిక్కిలి ప్రశాంత వాతావరణంలో ఉంది కాబట్టి యిది ఏకాంతవాసులకు తగిన స్థలం.

గ్రామస్థు లిపుడీ ఆలయాన్ని ఉద్ధరించి, ఇక్కడ ఉత్సవం నడుపుతున్నారు. ప్రతి ఆదివారం ప్రజలు ఇక్కడికి శ్రీరాముని పాదాలు దర్శించటానికి వస్తుంటారు.

మక్తల్ తాలూకాలోని మందిరాలు

మక్తల్‌కు ముఖస్థలి - మగతల అని వ్యవహారాలు. పూర్వం ఇక్కడ అగ్నికార్యంచేసే బ్రాహ్మణ కుటుంబాలు చాలా ఉండేవి. వారికి నైజాం ప్రభుత్వ కాలంలో ఈనామియాలు కూడా ఉన్నవి కాబట్టి వారి నిరంతర యజ్ఞాలచేత దీనికి ముఖస్థలి అని పేరేర్పడిందని ఒక మతం.

ఇక రెండవ దాని ప్రకారం మగతల తెలుగు పేరు. పూర్వం ప్రభువులు మరణ శిక్ష ఇచ్చిన దోషుల తలలు ఇక్కడ ఛేదించబడేవట. దాన్ని అనుసరించి మగవారి తలలు నరికే ప్రదేశం కాబట్టి మగతల అయిందని మరో కథనం. ప్రభుత్వం ఇచ్చిన మరణశిక్షను అమలుపరిచే వారు గత శతాబ్దంవరకు ఇక్కడనే ఉండేవారు అంటారు.

పూర్వం ఇది కాశీనుండి కన్యాకుమారి వెళ్ళేదారిలో ఉన్న ఊరు. ఇపుడీ దారిని గోవాకు వెళ్ళే బండ్లు వెళ్ళుతవి.

ఇక్కడికి కృష్ణానది పది కిలోమీటర్లు ఉంటుంది. నది అవతలి భాగం కర్నాటకం కాబట్టి ఇక్కడ తెలుగుతోపాటు కన్నడం కూడా నడుస్తుంది.

ఈ మగతల పరగణా దేవగిరి యాదవుల ఆధీనంలో ఉండగా వారినుండి కాకతీయులు జయించుకున్నారని స్థానిక వృద్ధులు చెప్పేవారు. ప్రతాపరుద్రుని కాలంలో దీన్ని రాజధానిగా చేసుకొని, శా. శ. 1219 లో శ్రీ మన్మహారాయ గజసాహిణి మాదయరెడ్డి పాలించినాడు. ఆయన 1220 లో కాలధర్మం చెందగా తమ్ముడైన అన్నయలెంక అన్నగారికి అక్షయ పుణ్యం కొరకు ఇక్కడి స్వయంభూదేవునికి కొంత భూదానం చేసినాడు.

కాకతీయుల పిమ్మట తెలంగాణంలోని నేటి పాలమూరు జిల్లా భూభాగం దేవరకొండ ప్రభువుల ఆధీనంలోనికి వచ్చింది. ఆ వంశానికి చెందిన పెద్ద సింగమనాయుడు ఇక్కడికి ఎత్తివచ్చి, మచ్చవంశానికి చెందిన రుద్రుని నిహతుని చేసినట్లు వెలుగోటివారి వంశావళి చెబుతుంది.

ప్రస్తుతం ఇక్కడ గ్రామ మధ్యంలో లింగోజి కోట అనే అడుగు ఉంది. అతడీ ప్రాంతాన్ని పాలించినట్లు గ్రామవృద్ధులు చెప్పేవారు. లింగోజి తెలుగు పేరుగాదు. కాబట్టి మచ్చరుద్రుడుగాని, ఈ లింగోజిగాని ఎవరో తెలిసి రాలేదు.

కాకతీయుల కాలంలో ఈ జిల్లాలోని అలంపురం - జడ్చర్ల - పానుగల్లు - మగతల పెద్ద వర్తక వ్యాపార కేంద్రాలుగా ఉన్నవి. అంతే గాక రాజధానులుగా కూడ ఉన్నవి. రాజధానులుగా ఉన్న నగరాలలో సాధారణంగా ఆలయా లెక్కువ. కాబట్టి ఆ కారణంగా ఇక్కడ చిన్నవి, పెద్దవి కలిసి మొత్తం నలువది రెండాలయాలున్నవి. వానిలో ఇక కొన్నిటిని దర్శించండి.

స్థానికంగా ఉన్న గుడులు

శివాలయాలు :-

ఈ గ్రామంలో ఉన్నవానిలో శివాలయాలెక్కువ. ఆత్మలింగేశ్వర ఈశ్వరాలయాలు అతి పురాతనమైనవి. వానిని ఎవరు ప్రతిష్ఠించినారో తెలియదు. కుంభేశ్వరాలయం ప్రస్తుతం ఊరినడుమ ఉంది. దీన్ని కాకతీయులు ఈ గ్రామాన్ని జయించి ప్రతిష్ఠించినారని చెబుతారు. ఇది చక్కని శిల్పంతో అలరారుతూ ఉంది. ఇది పూర్వాభిముఖాలయం. సూర్యుని ప్రథమ కిరణాలు స్వామిని స్పృశించే అట్లు నిర్మించబడిందట. కాని ఇపుడు దాని ముందుండే కోనేరును పూడ్చి, తురకలు దాని కడ్డంగా మసీదును కట్టుకున్నారు.అందుచేత ఆలయానికి సన్ననిబాటమాత్రం ఉంది.

ఈ మూడు గుడులలో ఏటా మహాశివరాత్రికి అభిషేకాలు జరుగుతవి.

మల్లికార్జునస్వామి ఆలయం :

ఈ దేవుని మల్లినాథస్వామి, స్వయంభూ దేవర అనికూడా వ్యవహరిస్తారు. ఈ స్వామివారి గర్భాలయం పూర్వాభిముఖంగాను ఆలయం ఉత్తరాభి ముఖంగాను ఉన్నవి. ఇదిగూడ మిక్కిలి ప్రాచీన మయింది. చోళ చాళుక్య పద్ధతిలో ఉంది. కాకతీయుల కాలంలో దీన్ని వారి సామంతుడైన గుండయనాయని పరివారంలోని విక్కరి నాయకుడు క్రీ.శ. 1297 లో జీర్ణోద్ధారం చేయించినాడు. విక్కరి విక్రమాదిత్యునికి వికృతరూపం. ఇపుడు విక్కరి ఇక్కడు అనే రూపాన్ని పొందింది.

ప్రతాపరుద్రుని కాలంలో దీన్ని శ్రీమన్మహారాయ గజసాహిణి మాదయరెడ్డిగారు పరిపాలించినాడు. అతడు కాలధర్మం చెందగా తమ్ముడైన అన్నయలెంక అన్నగారికి అక్షయ పుణ్యంగా ఈ స్వామికి క్రీ.శ. 1298 లో కొంత భూదానం చేసినాడు. అపుడీ స్వామికి ఆస్తులున్నవి కాని అర్చన మాత్రంలేదు.

నగరేశ్వరస్వామి గుడి :

ఇది వేణుగోపాలస్వామి ఆలయం వెనుక ఉంది. పూర్వాభిముఖమైన ఆలయం. నకరం అంటే వర్తక సంఘం. కాబట్టి నగరేశ్వరుడు వైశ్యులకు ముఖ్యదైవమైనాడు. ఇపుడీ ఆలయంలో శివకేశవ ప్రతిష్ఠలు రెండూ ఉన్నవి. అంతేకాక, ఈ ఆలయానికి చుట్టూ ప్రాకారం, దానిలో సత్రం బావి ఉండి, యాత్రికులకు మంచి వసతిగా ఉంది. వైశ్యుల యాజమాన్యంలో నడుస్తూ నిత్యపూజలతో విరాజిల్లుతుంది.

విష్ణ్వాలయాలు :

ఇక్కడి విష్ణ్వాలయాలలో జనార్దన స్వామి ఆలయం. వేంకటేశ్వర స్వామి గుడి, వేణుగోపాలాలయం ముఖ్యమైనవి. వేణుగోపాల స్వామి ఆలయాన్ని శ్రీకృష్ణుని గుడి అని కూడా అంటారు. ఇది గూడా గ్రామంలో ఉత్తర దిశగానే ఉంది. ఆలయం మాత్రం దక్షిణాభిముఖం. దీనిపై గల విమానం అలంపురం సమీపంలోని పాపనాశని ఆలయాల పద్ధతిలో ఉంది. ఇక్కడ కృష్ణాష్టమినాడు ఉట్ల పండుగ మనోహరంగా జరుగుతుంది.

వెంకటేశ్వర స్వామికి ఆశ్వీజంలో విజయదశమినాడు ఉత్సవం జరుగుతుంది.

పడమటి అంజనేయుడు :

ఈ గ్రామంలో పూర్వం నాలుగువైపుల నాలుగు హనుమత్ప్రతిష్ఠ లుండెనట కాని, వానిలో ఇపుడు పశ్చిమంలో ఉన్న హనుమదాలయం మాత్రమే నిత్యపూజలతో నడుస్తుంది. గ్రామస్థులీస్వామిని జాంబవంతుని అవతారమని విశ్వసిస్తారు. ఇదొక అపూర్వ విషయం.

ఇక్కడి స్వామి మూర్తి బాగా ఎత్తయింది. అది ఎడమ వైపుకు కొంచెంగా వంగి ఉంది. దానికి గొడగూచి వంటి ఒక ముగ్ధ భక్తుడైన బాలుని కథను చెబుతారు. స్వామి అతడు తెచ్చిన నైవేద్యాన్ని తినటానికి ఆవిధంగా వంగినాడట.

ఇది ఉత్తరాభిముఖాలయం. స్వామికి పైన కప్పు లేదు. గర్భాలయంలో స్వామిగూడా పశ్చిమాభిముఖంగానే ఉన్నాడు. గుడికి తూర్పు వైపున గూడ మరో ద్వారం ఉంది. ఈ స్వామికి ప్రతి శనివారమే కాక మార్గశిర శుద్ధపూర్ణిమకు వైభవంగా రథోత్సవం నడుస్తుంది. వారం దినాలు జాతర సాగుతుంది.

వీరభద్రస్వామి ఆలయం :

వీరభద్రుడు శైవులకు ముఖ్యమైన దైవం. ఈ దేవునికి ఇక్కడ చైత్రంలో ఉత్సవం జరుగుతుంది. అపుడు శుద్ధ పంచమినాడు రథోత్సవం సాగుతుంది.

ఖండేరాయని గుడి :

మహారాష్ట్రులు వీరభద్రుని ఖండోబా - ఖండేరాయడు అంటారు. దీన్ని ఉజ్జిలి ప్రభువుల కట్టించినట్లు చెబుతారు. ఈ గుడికి క్రీ.శ. 1815లో శ్రీ మలహరి మార్తాండ బాలాజీరావు ముఖద్వారాన్ని ఎత్తించినాడు. ఇది నగరేశ్వరాలయం వెనుక ఉంది.

ఉజ్జిలి ఈ తాలూకాలో ఉజ్జయినికి బదులుగా వెలసిన మహా కాళేశ్వరుని క్షేత్రం. దీన్ని క్రీ.శ. 1179-90 నడుమ చాళుక్య నాలుగవ సోమేశ్వరుడు పాలించినాడు. అతని సేనాపతి భానుదేవుడు అక్కడ ఉన్న చెన్న పార్శ్వనాథుని పూజకై ఇంద్రసేన పండితునికి ఒక దానము చేసినాడు.

అనంతరం ఇది మహారాష్ట్రుల వశమయింది. దీని సమీపంలోని లోకయ్యపల్లె ప్రభువులు గూడ మహారాష్ట్రులే కాని, వారికి వీరికి ఉన్న సంబంధం తెలియదు. కాని ఇక్కడి శాసనంలో పేర్కొనబడిన మలహరి రావు, మార్తాండరావు, బాలాజీరావు అక్కడి ప్రభువులు కావచ్చు.

ఇపుడు ఉజ్జిలిలో చాలా ప్రాచీనాలయాలున్నవి.

నల్లజానమ్మ గుడి :

ఈ దేవత ఇక్కడ ఒక ప్రత్యేకమైన దైవం. ఈమెకు గూడా వెంకటేశ్వరునితోపాటే ఆశ్వియుజ శుద్ధ దశమినాడు పల్లకిసేవ జరుగుతుంది కాని, ఈమె ఎవరో వివరాలు తెలియవు.

నెల్లూరు జిల్లాలోని గూడూరులో "నల్ల జానమ్మ" పేర ఒక దేవత పూజింపబడుతుంది. ఆమె ఉదంతాన్ని శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారు మనోహరంగా కావ్యీకరించినాడు కాని, ఆమెకు ఈమెకు ఏమైనా సంబంధం ఉందో లేదో తెలియదు.

శివాలయం - జక్కులేరు

ఇది మక్తల్ మండలంలో మహబూబ్‌నగర్ నుండి మక్తల్ వెళ్ళే రోడ్డులో ఉంది. గ్రామం రోడ్డుకు కిలోమీటరు దూరం ఉంటుంది. ఇది ఈ తాలూకాలోని పురాతన గ్రామాలలో ఒకటి. ఇక్కడ ఉన్న శివాలయం ప్రసిద్ధం. అది గ్రామానికి ఉత్తరంగా చెరువు ప్రక్కన ఉంది.

ఈ ఆలయంగూడా ప్రాచీనమయింది. దీని విమానం సోపాన క్రమంలో ఉంది. గర్భాలయంలోని శివలింగం పానవట్టం చక్కని పనితనంతో ఉన్నవి. ఈ ఆలయం దగ్గర నాగులు, వీరగల్లులు చాలా ఉన్నవి కాబట్టి, ఇది ఒక చారిత్రక గ్రామం అనవలె.

ఇక్కడ ఏటా శివరాత్రికి ఉత్సవం జరుగుతుంది.

లక్ష్మీనారాయణాలయం - నారాయణపేట

మక్తల్ తాలూకాలో నారాయణపేట ప్రసిద్ధమైన గ్రామం. ఇది డివిజనుగాను, ఇపుడు మండల కేంద్రంగాను ఉంది. పూర్వంలో కాయపల్లె అనే సంస్థానం దీని సమీపంలోనే ఉన్నది. ఆనాడు నారాయణపేట లేదు. "ఏళ్ళ" అనే పేర చిన్న గ్రామం ఉండేది. లోకాయపల్లె ప్రభు వంశంలో వెంకట నారాయణరావులు చాలా మంది ఉన్నారు. ఆ వంశంలోని ఒక నారాయణరావు దీన్ని కట్టించినట్లు వాడుక. ఇక్కడి లక్ష్మీనారాయణాలయాన్ని గూడా అతడే ప్రతిష్ఠించినాడంటారు. మొదట లోకాయపల్లె వారి కార్యవర్గ బలగమంతా ఇక్కడనే ఉండేది. అందుచేత ఈ గ్రామంలో ఆలయాలు చాలా వెలసినవి.

ఇక్కడ గల బారం బావి చెప్పదగింది. ఇదొక విశాలమైన కోనేరు. దానికి నాలుగు వైపులలో మెట్లున్నవి. దీనిలో ఒకే పర్యాయం వేయి మంది స్నానం చేయవచ్చు. ఇటువంటి కోనేరులు అమ్మపల్లిలో గూడ ఉన్నవి. ఇది నడికుడ దగ్గర ఉంది. దీని తీరంలో గల శనీశ్వరాలయం ఇక్కడ ప్రసిద్ధం.

శనీశ్వరాలయం :

మందపల్లి పిమ్మట పూర్వం శనీశ్వరాలయం ఇక్కడనే ఉండే దంటారు. శనికి నువ్వులనూనె దీపం వెలిగించవలె. నూవులలోనే పంచ దార కలిపి ప్రసాదం పెట్టవలె. స్వామికి ఎదురుగా నిలిచి దండం పెట్ట గూడదు. ఏదో ఒకవైపు మాత్రమే నిలువవలె. ఇవి ఇక్కడి నియమాలు. వీనిని పాటిస్తూ ప్రతిదినం భక్తులిక్కడ స్వామిని పూజిస్తుంటారు.

సీతారామాలయం :

ఇది బ్రాహ్మణవాడిలో ఉంది. దీనిలోని ప్రతిమలు పాలరాతివి. చూడటానికి మనోహరంగా ఉన్నవి. ఈ ఆలయం సుందరంగాను ప్రశాంతంగాను ఉంది.

బసవేశ్వరాలయం :

మక్తలు, నారాయణపేటలు కన్నడ సరిహద్దు గ్రామాలు కాబట్టి ఇక్కడ బసవేశ్వరుని ప్రభావం ఎక్కువ. బసవేశ్వరుని శైవులు నందీశ్వరుని అవతారంగా భావిస్తారు కాబట్టి అతని పేర ఈ ప్రాంతంలో నందీశ్వర ప్రతిష్ఠలు వెలసినవి -

ఇక్కడ బసవేశ్వరాలయంలో వీరశైవులు భజనలు, ఆరాధనలు చేస్తుంటారు.

సత్యనారాయణాలయం :

ఇక్కడి గుడులలోనికెల్లా ఇది చెప్పదగింది. ఇది గ్రామానికి ఉత్తరంగా ఉంది. దీన్ని ఒక గౌడుగారు కట్టించినాడు. ఆధునిక పద్ధతులలో ఇది ఆకర్షణీయంగాను శుభ్రంగాను ఉంది. ఈ గుడిపేర గౌడుగారు టాకీసునుగూడ కట్టించినాడు. కాబట్టి దాని ఆదాయంతో ఇది నిరాటంకంగా నడుస్తుంది. ఆలయ కమిటీవారు దీన్ని చక్కగా నిర్వహిస్తున్నారు.

హనుమదాలయం :

హనుమంతుడు మధ్వ సంప్రదాయం గలవారికి ముఖ్యమైన ఆరాధ్యదైవం. ఇక్కడ ఆ ఆలయం ముంజెవారు అనే మధ్వుల ఇంటి దగ్గరనే ఉంది. ఈ స్వామిని అక్కడివారు స్వయంవ్యక్తుడని నమ్ముతారు. ఈ ఆలయం నిరాడంబరంగా ఉంది కాని, గ్రామంలోనికెల్ల దీనినే ప్రాచీనమైనదిగా చెబుతారు.

రామలింగేశ్వరాలయం - పులిమామిడి

ఈ గ్రామం జక్కులేరుకు మూడు కిలోమీటర్లు ఉంటుంది. ఇక్కడ గ్రామానికి తూర్పున ఒక పెద్ద గుట్ట, దానిపై రామలింగేశ్వరాలయం ఉన్నవి. ఇది చోళులనాటి ఆలయం. ఆలయం శిల్పశోభితంగా ఉండి, ముఖమండపంలో దిక్పాలక ప్రతిమలున్నవి. ఇక్కడ ఏటా శ్రావణంలో మాస శివరాత్రికి, మహాశివరాత్రికి ఉత్సవాలు జరుగుతవి.

ఇక్కడ ఊరికి ఉత్తరంగా "తిప్పగుట్ట" అనే మరో గుట్ట ఉంది. దీనిపై శివ హనుమత్ప్రతిష్ఠలున్నవి. కాని ప్రస్తుతం వానికి ఆలయాలు లేవు. గ్రామస్థులు ఇక్కడి స్వామి మహిమ కలవాడని అంటారు.

ఇవికాక గ్రామంలో ఇంకా

శివాలయం - మార్కండేయాలయం - బసవేశ్వరాలయం - హనుమదాలయం ఉన్నవి. ఇక్కడి ప్రజలలో శైవులెక్కువ. వారు ఏరువాక పున్నానికి ఎద్దులను విశేషంగా అలంకరించి ఊరేగిస్తారు. శ్రావణంలో నెల దినాలు బసవేశ్వరుని గుడి ముందు నందికోల ఆడి, చివరినాడు అగ్ని గుండాలు త్రొక్కి, సంతర్పణం పెడతారు. ఇక్కడ ఈ నందికోల - అగ్నిగుండాలు త్రొక్కటం చూడదగినట్టుగా ఉంటుంది.

పులిమామిడి, మాగులూరు నడుమ ఒక పొలంలో కత్తుల కత్తెన్న అనే ఖడ్గపాణి ఉన్నాడు. అతడు ఆరడుగల నల్లరాతిమూర్తి. ఆలయం ఏదీలేదు. ఆరుబయటనే నిలిచినాడు. అక్కడ చెనిగచేలు ఎక్కువ కాబట్టి పొలాల వారాస్వామికి పచ్చి చెనిగకాయ నివేదించి పోతుంటారు.

లోకయ్యపల్లె దొరలు కట్టించిన గుడులు

ఔదుంబరేశ్వరాలయం - లోకాయపల్లె

ఇది నారాయణపేటకు మూడు కిలోమీటర్ల దూరంలోగల చిన్న గ్రామం. ఈ గ్రామ సమీపంలో ఒక కొండపై ఈ ఆలయం ఉంది.

లోకాయపల్లె ప్రభు వంశంలో లక్ష్మమ దొరసాని మిక్కిలి ప్రసిద్ధురాలు. ఆమె దానధర్మాలను, భక్తిని గురించి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నవి. పాలమూరు జిల్లా కంటె మొదట ఈ సంస్థానం ప్రసిద్ధంగా ఉన్నది.

ఆమె చాలా గ్రామాలలో శివకేశవాలయాలు గూడ కట్టించినట్లు చెబుతారు. ఆమె వృద్ధురాలైన పిమ్మట ఒకనాడు కాశీవిశ్వనాథుని తలచుకొని, స్వామీ, దగ్గరకు రాలేకపోతున్నాను అనుకున్నదట. అపుడు స్వామి కలలోనే కనిపించి, నేనే అక్కడికి వస్తాను. నన్ను ఒకచోట ప్రతిష్ఠించు అని చెప్పినాడట.

అది విని ఆమె మరునాడు ఔదుంబరం అనే కొండపైకి వెళ్ళి చూచి అక్కడ ఈ గుడి కట్టించింది అంటారు.

ఇక్కడ రెండు పెద్దకొండలు జతగా ఉండి, దాని నడుమ పెద్ద లోయ ఉంది. అందులో ఒక చిన్నపాటి నదికూడ పారుతుంది. శిల్పులు ఆ లోయలో రెండు అడ్డుగోడలు కట్టి వాని నడిమి ప్రదేశానికి పుష్కరిణి రూపమిచ్చి, కుడివైపు కొండపై ఆలయం కట్టినారు. ఆలయానికి పుష్కరిణి గోడపై నుండియే దారిఉంది.

ఇది శిలానిర్మితం; ఏకాంత ప్రదేశంలో సుందరంగా కట్టబడింది. దీనిలో సింహతలాటా లెక్కువగా ఉన్నవి. ఇది శివాలయమైనా దీని గోడలపై పెద్ద పెద్ద దశావతార చిత్రాలున్నవి.

ఆలయం పూర్తి అయిన పిమ్మట లక్ష్మమ్మగారు దీనిలోని శివ లింగాన్ని కాశినుండి తెప్పించి ప్రతిష్ఠించిందట.

శ్రావణంలోను, శివరాత్రి ఏకాదశి పర్వాలలోను ప్రజలు వెళ్ళి, స్వామిని పూజిస్తుంటారు. ఇది ఏ వాహనం వెళ్ళే దారిగాని, రాత్రివేళ వెళ్ళే దారిగాని కాదు.

ఈ ప్రభువుల వంశం చివరకు నిస్సంతుకాగా చివరి దొరసాని నాగర్‌కర్నూలులోని పిప్పళ్ళ వారినుండి ఒక బాలుని దత్తు తీసికున్నదట. కాని ఆనాటి ప్రభుత్వం దాన్ని అంగీకరించలేదు. అంతటితో ఇక ఆ వంశం అంతరించింది.

వీరి దివాంజీల వంశం ఇపుడు వాడాలలో ఉంది.

హనుమదాలయం - వాడాల

ఆడాలు ఒక ధాన్యవిశేషం. ఇవి విశల్యకరణి. సంస్కృతంలో వీనిని "చంద్రశూర" అంటారు. నేటి వాడాల పూర్వం అవి పండే ప్రదేశం కాబట్టి దాన్ని చాళుక్యుల కాలంలో ప్రభువులు యుద్ధభటులకు కాళ్ళు చేతులు విరిగినప్పుడు వారికి ఈ ఓషధీ ధాన్యం సరఫరా చేసే అందుకై బంటులకు ఇచ్చిన భూమి అంటారు.

లోకాయపల్లె ప్రభువంశం పతనమైన పిమ్మట వారి దివాంజీలు వచ్చి యిక్కడ నివసించినారు. ఇది యిపుడు కలువకుర్తి తాలూకాలో ఉంది.

సాధారణంగా ప్రభువులందరు కవుల నాదరించి కావ్యాలే వ్రాయించినారు. నాటకరంగంవైపు చూచినవారు లేరు. పాలమూరు జిల్లాలో ఆ కీర్తి వీరికి దక్కుతుంది. నాటక రంగానికి ఈ వంశీయులు చేసిన సేవ గొప్పది. నాటకాలు లేని ఆకాలంలో వీరు బళ్ళారి, అనంతపురం ప్రాంతాలనుండి నటులను పిలిపించి, ఇక్కడి వారికి నాటకాలు నేర్పించి నాటకాలు వ్రాసేవారిని ప్రోత్సహించినారు.

వారితోపాటు తోలుబొమ్మలవారికి సహాయంచేసి, వారికి ఆయా గ్రామాలలో మాన్యాలిప్పించినారు. యక్షగానాలు నేర్పించినారు. వీరి ఈ సేవ రజాకారు ఉద్యమంవరకు అవిచ్ఛిన్నంగా సాగింది.

ఈ వంశంలో శేషోరామాజీరావు చెప్పదగినవాడు. ఆయన స॥ 1276 ఫసిలీలో ఇక్కడ ఒకహనుమదాలయం కట్టించినాడు. అదిపుడు గ్రామం వెలుపల ఏకాంతంగా నిలిచింది కాని, అపుడు గ్రామం దీనిచుట్టే ఉండేదట.

జడ్చర్లలో వెంకటేశ్వరాలయం కట్టించిన రుక్మాజీరావు రెండవ కుమారుడైన ఉప్పాజయ్య ఈ వంశంలో ఆరవతరంవాడు.

వనపర్తి యిలాకా ఆలయాలు

పానుగంటిలో ఉదయనుని శపించి మల్లికార్జున పండితారాధ్యుడు వనిపురి చేరినట్లు, అతనిని వనిపురి శంకరయ్య మొదలైన భక్తులు ఎదురుగా వచ్చి తోడ్కొని వెళ్ళినట్లు పండితారాధ్య చరిత్ర చెబుతుంది అతడక్కడి నుండి వెల్లటూరికి వెళ్ళినాడు. ఆ గ్రామం ఇపుడు కొల్లాపురం తాలూకాలో ఉంది కాని వనపర్తికి సమీపమే అవుతుంది. అందుచేత ఆనాడు పండితుడు చేరిన వనిపురి ఈనాటి వనపర్తియేనని పరిశోధకుల నమ్మకం.

ఈ వనిపురికి పూర్వం "వనంపర్రు" అని వ్యవహారం. అది ఖిల్లా పానుగంటికి చెందిన భూమి. దట్టమైన అరణ్యంగా ఉండి, స్థానిక ప్రభువులకు వేటలకు ఆటపట్టుగా ఉండేది. నైజాం రాజబంధువులు గూడ అపుడపుడు అక్కడికి వేటకు వచ్చేవారు. ఆ అడవిలో చెట్లు ఎక్కువ. ఎప్పుడూ వాని ఆకురాలి నేలపై దట్టంగా అయిదారంగుళాల మందంగా పడి, నడిచేటపుడు పెళపెళమని చప్పుడు వచ్చేది. అందుచేత అక్కడికి వేటకు వచ్చే ప్రభువులు మొదట ఆ ఆకునంతా వెట్టివారితో ఏరించి కుప్పలు పోయించి కాల్పించేవారు. అపుడు వనిపురి ఆ అడవిలో ఒక చిన్న పల్లె.

వనపర్తి వారికి సూగూరు, శ్రీరంగాపురం, కొత్తకోట క్రమంగా రాజధానులుగా ఉన్నవి. మొదటి రామకృష్ణరాయలు ఇక్కడికి తమ రాజధానిని మార్చే నాటికి ఈ ప్రాంతమంతా రాయచూరుకు చెందిన లింగాయతుల జాగీరు. అక్కడక్కడా వారి మఠాలు కూడా ఉన్నాయి. ఈ తాలూకాలోని మనిగిళ్ళ, భళ్ళేవారు అనే బలిజవారి జాగీరు. వారు భృంగీశ్వర గోత్రులు. నీలకంఠయ్య గంగాధరయ్యగారలు ఇక్కడి చివరి దొరలు. వారి అనంతరం అది బ్రాహ్మణాగ్రహార మయింది.

ఈ అనంతర కాలంలో ఈ వనపర్తి భూమినంతా సూగూరు ప్రభువులు కొన్నారు. రామకృష్ణ రాయలు ఇక్కడికి రాజధానిని మార్చే నాటికి యిక్కడ పురాతనమైన దుర్గం ఒకటి ఉండేది. దానికి ప్రాతకోట అని పేరు. మొదట ఇది ప్రాతకోట కనుకనే ప్రభువులు క్రొత్తకోట మరొకటి కట్టుకున్నారు.

స్వాతంత్ర్యానంతరం ఈ పట్టణం కోట నానుకొని కృష్ణరాయ నగర్, అగ్నేయంగా వల్లభనగర్ అనే పేర విస్తరించి, క్రొత్త శోభలు సంతరించుకున్నది. ఇప్పటి వరకీ గ్రామంలో ఇరువదైదు ఆలయాలు వెలసినవి. వీనిలో పది ఆంజనేయాలయాలు, ఆరు శివాలయాలు, అయిదు వివిధ రూపాలలో వెలసిన విష్ణ్వాలయాలు. తక్కినవి ఇతరాలు. ఇకవాని వివరాలు చూడండి:

స్థానికంగా ఉన్న ఆలయాలు

ఇక్కడి ప్రధాన వీధికి ప్రస్తుతం శంకర్‌గంజ్ అని వ్యవహారం. ఈ వీధిలో డాక్టర్ వెంకటేశ్వర్లుగారి యింటి ముందున్న ప్రవర్తి ఆంజనేయాలయాన్ని చవులకాయ బృందమ్మగారు కట్టించింది.

ఈ వీధిలోనే ఆచార్ల కృష్ణమాచారిగారు అనే వైష్ణవుడు వేణుగోపాలాలయం కట్టించగా, దానిలో ఇటుకూరు వెంకటయ్యగారనే వైశ్యుడు ఆళ్వారు సన్నిధి, నాగప్రతిష్ఠ, ధ్వజప్రతిష్ఠ చేయించినాడు.

ఈ ఆలయం పరకాల మఠానికి చెందిందికాని, ప్రస్తుతం గుడిలో అర్చనాదులేవీ లేవు.

దీనికి కొంత దూరంలో గజ్జలదాసుని మఠం ఉంది. అందులో నృసింహ అంజనేయాలయాలున్నవి. వాని స్థాపనా ఉదంతం ఈ విధంగా ఉంది :

పూర్వం తాటిపర్తిలో ఒక నృసింహాలయం ఉన్నది. ఒకపుడారె దండు ఆ గ్రామంపై పడి దోచుకొని, ఆ గుడిలో ప్రవేశించి స్వామివారి తల విరుగగొట్టి పారవేసి వెళ్ళినారు. అది ఒక వాగుదగ్గర పడి ఉన్నది.

కోట కదిరలో చంద్రమౌళీశ్వరస్వామి ప్రసిద్ధి. ఆయన క్రీ. శ. 1902లో కైవల్యం చెందినాడు. ఆయన శిష్యులలో గోపాలపేట నివాసి వాడకట్టు గజ్జలదాసు ఒకడు. ఆయన వనపర్తిలో ఇపుడాలయం ఉన్న దగ్గర ఒక ఆశ్రమం నిర్మించుకుని సంచారం చేస్తుండగా ఒకనాడతనికి ఆరెదండు విరుగగొట్టి పారవేసిపోయిన నృసింహస్వామి తల కనిపించింది. అపుడతడు దానిని తమ ఆశ్రమానికి కొనివచ్చి రెండు గుడులు కట్టించి, ఒకదానిలో నృసింహస్వామిని, ఒకదానిలో అంజనేయస్వామిని ప్రతిష్ఠించినాడు.

అతడు నృసింహస్వామి దేహాన్ని గచ్చుతో చేయించి దానికి తనకు లభించిన తలను పొదిగించినాడు. ఆ ప్రతిమను చేసే అపుడు దానిలో రెండు నృసింహసాలగ్రామాలు ఒక టెంకాయచిప్పలో ఉంచి మరొకటి పైన బోర్లించి లోపల పెట్టించినాడు. ఇక ఆవిధంగా గచ్చు శరీరంతో ఆ స్వామి ఇంతకాలంవరకు పూజింపబడినాడు. ఇటీవల క్రీ.శ. 1985లో ఆ ఆలయం పునరుద్ధరించ బడింది. అపుడు దాసా రంగయ్యగారు 13-10-85నాడు ఆ మృణ్మూర్తిస్థానంలో శిలామూర్తిని ప్రతిష్ఠించినాడు.

ఈ ఆలయంలో ఇటుకూరి వెంకటయ్యగారి కుమారుడు బలభద్రయ్యగారిచేత నగరేశ్వర ప్రతిష్ఠ చేయబడింది.

ఇదే వీధిలో బాబాజీ మఠం ఒకటి ఉంది. ఈ బాబాజీ కర్నాటకలోని హుబ్లీజిల్లావాడు. గద్వాల సమీపంలోని కాకులవరం జాగీర్దారు వనపర్తి ప్రభువులాయన మహిమ చూచి పిలుచుకుని తమ సంస్థానంలో గూడా కొంత భూమినిచ్చినారు. ఆ స్థలంలో అయన మఠం ఏర్పరచుకుని దానిలో బాలాజీ హనుమత్ప్రతిష్ఠలు చేసి గుడులు కట్టించినాడు.

ఈ మఠంలో తాళాల వెంకటేశ్వర శర్మగారు శివ పంచాయతన, ఈశ్వర ప్రతిష్ఠలు చేయించినారు.

ఇపుడు దీనిలో క్రొత్తగా సాయిబాబాగారి మఠం, గణేశాలయం కట్టబడినవి.

ఈ వీథిలోనే క్రొత్తకోట కరణం దివాంజీ లక్ష్మయ్యగారు మరో హనుమదాలయం కట్టించినాడు. ఈయన వనపర్తి ప్రభువుల దగ్గర చాలా కాలం దివాంజీగా ఉన్నాడు కాబట్టి, దివాంజీ లక్ష్మయ్య అన్నారు.

ఇదే వీథిలో రాచాల హనుమంత రాయడు అనే మరో కరణం గారు క్రీ.శ. 1785 లో ఒక హనుమత్ప్రతిష్ఠ, ఒక శివప్రతిష్ఠ చేయించినాడు. ఈ శివాలయం నాయక్ సాహెబుగారి యింటి ముందు ఉంది.

ఈ వీథిలోనే శ్రీనివాస గోవింద నాయర్‌గారు ఒక పాండురంగాలయం కట్టించినాడు. వీరు జాగీరుదార్లు. దీని ఉదంతం ఈవిధంగా ఉంది :

ఈ గోవింద నాయక్‌గారి తమ్ముడు వెంకోబ నాయక్‌గారు. ఈయనను గురించి అంబా భవాని ఆలయ వృత్తాంతంలో కొంత చెప్పినాను. ఇతడు పెద్ద రామేశ్వరరాయలను విడిపించుకొని వచ్చిన పిమ్మట ఒకనాడు గ్రామానికి పశ్చిమంగా మూడు పర్లాంగుల దూరంలో ఒక రాగి చెట్టు క్రింద నేలలో ఒక స్వామి ఉన్నట్టు, అతడు తనను వెలికి తీసి ప్రతిష్ఠించమని చెప్పినట్లు కల వచ్చింది. మరునాడతడు రాజాస్థానానికి వచ్చి తన స్వప్న వృత్తాంతం చెప్పినాడు. ఆనాడక్కడికే ఏదో పనిమీద కొల్లాపురం - గద్వాల ప్రభువులు కూడ వచ్చి ఉన్నారు. వారదివిని ఇటువంటి కలలు చాలా వస్తవి అని తీసివేసినారు. అయినా వారు మళ్ళీ దాని నిజానిజాలు పరిశీలించుదామని వెళ్ళి అక్కడ త్రవ్వి చూడగా నిజంగానే ఒక శిలాప్రతిమ లభించింది. అపుడా స్వామిని కొని వచ్చి వెంకోబ నాయక్‌గారు విఠలాలయం కట్టించి దానిలో ప్రతిష్ఠించినాడు. ఈ స్వామికి

కొల్లాపురం ప్రభువు అచ్యుతాపురం, గద్వాల ప్రభువు గార్లపాడు, వనపర్తి ప్రభువు మాపర్ల గ్రామాలు యిచ్చినారు.

పెద్ద రామేశ్వరరాయలు చెరనుండి వచ్చిన పిమ్మట రాణీ శంకరమ్మగారు ఇదే బజారులో ఒక ఆంజనేయ ప్రతిష్ఠచేయించింది. అది యిపుడు గ్రామ దేవాలయంగా ఉంది.

పిమ్మట రాజా రామేశ్వరరాయలు క్రి. శ. 1700 లో తమ కోటలో ఒక హనుమదాలయం, ఒక లక్ష్మీదేవి ఆలయం కట్టించినాడు.

ఇదే బజారులోని తంగిళ్ళపల్లివారి వీథిలో హొసదుర్గం కృష్ణమాచార్యులుగారు బాలాంజనేయ ప్రతిష్ఠ చేయించినాడు.

శ్రీమంతు గోపాలరాయ ప్రభువు వీరభద్ర చెన్నకేశవాలయాలు కట్టించినాడు. ఈ రెండు ఒకే ఆవరణలో ఉన్నవి. ఇపుడు వీరభద్ర ప్రతిమ భిన్నం చేయబడింది.

ఇదే వీథిలోని పాతబజారులోగల వైశ్యుల వీథిలోనూ నూకల తులశప్పగారనే వైశ్యుడు కన్యకా పరమేశ్వరి ఆలయం కట్టించి, దానిలో నవగ్రహ ప్రతిష్ఠ చేయించినాడు.

వల్లభనగర్‌లోని దేవాలయాలు—

వనపర్తిలో రాజావారి కోటకు ఆగ్నేయంగా ఉన్నభూమి అయలూరు వారనే వైష్ణవులది ఆ భూమిలో ఇపుడు వల్లభనగర్ అనే కాలని వెలసింది. అక్కడ అయలూరు శ్రీనివాసాచార్యులు ఒక ఆంజనేయాలయం, నరసింహాచార్యులు వెంకటేశ్వరాలయం కట్టించినారు.

ఈ గ్రామానికి పశ్చిమ దిశన ఉన్న పెద్దదండు వారలో కప్పగంతుల శినయ్యగారు ఒక శివాలయం కట్టించినాడు. ఈయన లక్ష్మణ శాస్త్రిగారి తాతగారు.

ఇదే వైపున నాగవరం దగ్గర కంబాలపురం వీరయ్య గారనే వైశ్యుడు ఆనంద సరోవరం అనే కోనేరు త్రవ్వించి, తండ్రిపేర ఒక సత్రం, ఒక శివాలయం కట్టించినాడు ఇక్కడ చైత్ర శుద్ధ పున్నమకు ఆరాధన జరుగుతుంది.

ఇవి ఇక్కడ ఇంతవరకు వెలసిన ఆలయాలు. ఇపుడు ఇక్కడ విశ్వకర్మ వంశీయులు కృష్ణదేవరాయనగర్‌లో పెద్ద యెత్తున వీర బ్రహ్మేంద్రుని ఆలయం నిర్మిస్తున్నారు.

నృసింహాలయం - అంకూరు

అంకూరు వనపర్తిమండలంలోని గ్రామం. ఇది గణపురం రూటులో ఉంది. పూర్వం ఇక్కడ రామయ్యావల్లె అనే ఊరున్నది. దాని అడుగు ఇప్పుడు ఈగ్రామ సమీపంలోని మర్రిగట్టు చిట్టేని కుంటలనడుమ ఉంది. దానికి సంబంధించిన శ్రీరామ ప్రతిష్ఠ ఇప్పటికీ అక్కడ నిలిచి ఉంది.

గణపురాన్ని అల్లాఉద్దీను జయించిన పిమ్మట, అతని సరదారు లక్కడ నిలిచినారు. వారు ద్రాక్షాసవ ప్రియులు కనుక, ఆ తోటలకు తగిన భూమి కావలసి వచ్చింది. దాని ఫలితంగా రామాయవల్లె భూము లలో ద్రాక్షతోటలు వెలసినవి.

తురకలు ద్రాక్షను "అంగూర్" అంటారు. ఆరంభంలో ఆ తోటల దగ్గర కావలాదారులు మాత్రమే ఉన్నా అపుడపుడు సరదారులు వస్తూ ఉండటంతో క్రమంగా అక్కడ ఊరేర్పడి, అంగూర్ అనే పేరు అంకూరుగా నిలిచింది.

ఇక్కడ గ్రామానికి ఈశాన్యంగా కిలోమీటరు దూరంలో గుండ్ల గట్టు ఉంది. దానిపై పూర్వం ఒకప్పుడొక కరణంగారు సింగపట్నం వెళ్లుతూ, మార్గవశంగా నిద్రించి, స్వామీ, వృద్ధుడనైపోతున్నాను.

ఇక మీ దర్శనానికి రాలేను అనుకున్నాడట. అపుడతనికి స్వామి కలలో కనిపించి,నీవిక నా దగ్గరకు రానక్కరలేదు. ఇక్కడ నీవు నిద్రించిన చోట ఒక పుట్ట ఉంది. దాన్ని త్రవ్వు. అందులో ఏ శిల దొరికితే అదే నేనుగా భావించి ఇక్కడే ప్రతిష్ఠించుకుని పూజించు అని చెప్పినాడు.

ఆ స్వప్న ప్రకారానికతడాశ్చర్యపడి, ఆవర్యాయం సింగపట్నం వెళ్ళివచ్చి ఒక మంచిదినం చూచుకొని వచ్చి అక్కడి పుట్ట త్రవ్వినాడు. అపుడతనికి అందులో ఇపుడాలయంలో ఉన్న భావనామూర్తి లభించినది. దాన్ని ఆయన అక్కడ మట్టితో ఒక ఆలయంకట్టి ప్రతిష్ఠించి పూజించ నారంభించినాడుకాని, అతడేనాటివాడో తెలియదు.

ఈ స్వామి ఆపదలో ఆదుకునేవాడని ప్రసిద్ధి. పెద్దరామేశ్వర రాయలు ఒక పర్యాయం నిజాం ప్రభువు చేత బందీయై తాను విడివడిన పిమ్మట కొమ్ములగట్టు - గుండ్ల గట్టుపై వెలసిన దేవతలకు గుడులు కట్ట సంకల్పించుకున్నాడు. అయితే ఆసంకల్పం అతని కాలంలో నెరవేర లేదు.

రెండవ రామేశ్వరరాయల కుమారుడైన కృష్ణదేవరాయలు ఇక్కడి మట్టి గుడిని తొలగించి, శివాలయం నిర్మింపించినాడు. ఈ గుడి ఒక పెద్ద గుండుపై ఉంది. శిల్పశోభితంకాదుకాని, శిల శోభితంగా ఉంది.

ఆలయంలో స్వామివారి అమ్మవారి ప్రతిమలు రెండూ ఒకే తీరుగా ఉన్నవి. వీనికి రాతిలోనే ప్రభలుకూడా ఉన్నవి. గర్భాలయం ముందు అర్ధ మంటపం గూడా ఉంది. ఆలయం వెనుక ఎడమవైపున గుండ్ల చెరువు. గర్భాలయానికి ఎదురుగా ఒక శివప్రతిష్ఠ ఉన్నవి.

ఇక్కడి దీప స్తంభం ఎత్తులోను, పనితనంలోను చెప్పదగింది. దీనిపై క్రింది వరుసలో అర్చనావసర నృత్య భంగిమలున్నవి. స్తంభ తలంపై ఇటుకలతో దీపపు గూడు కట్టబడింది. దీనిలో పెద్ద ప్రమిద ఉంది. అందులో దీపం వెలిగిస్తే వనపర్తికి కనిపిస్తుందంటారు.

ఈ గుడి చిన్న కుంటపల్లి, అంకూరు గ్రామాల నడుమ ఉంది. కాబట్టి ఉత్సవం ఏటా ఒకరు నిర్వహిస్తారు.

ఇక్కడి పూజారులు నంబులు. స్వామివారికి విశేషార్చనలు జరుపుతుంటారు.

ఈ ఆలయం కట్టించిన కృష్ణదేవరాయల భార్య సరళాదేవిగారు తర్వాతి కాలంలో సరళాసాగర్ నిర్మింపచేసింది.

వివరాలకు. చూ. నృసింహప్రియ-సెప్టెం. 1985. పు 24

రామలింగేశ్వరాలయం - కందూరు

చిన్నపిల్లా! చిట్టిపిల్లా! జాతర పోదం -
కందూరి రామసామిని కన్నుల చూతం -

అని మా జిల్లాలో జానపదులు పాడుకుంటూ ఉంటారు. ఈ కందూరు జడ్చర్ల తాలూకాలో చేరి, మూసాపేట మండలంలో ఉంది.

ప్రాచీనమైన శిలా పర్వతాలపై గల శిలలకు తెల్లగా లేదా నల్లగా పెద్ద పెద్ద చారికలు లేదా మచ్చలు ఉండటం కద్దు. ఆ విధంగా మచ్చలు గల రాయి ఉన్న గ్రామాన్ని కందూరని, గ్రామం చుట్టు కందకం గల గ్రామాన్ని కందుకూరని సామాన్యులు వ్యవహరిస్తుంటారు.

ఈ గ్రామం ముందు ఒక వాగు ఉంది. దీనికి బుగ్గవాగు, కొమ్మిరెడ్డిపల్లెవాగు అని పేర్లు. ఈ తాలూకాలోని సరళాసాగర్ ఈ వాగుకే వేయబడింది.

ఈ బుగ్గవాగు బ్రిడ్జి దాటిన పిమ్మట శాఖాపురం స్టేజి వస్తుంది. బస్సులో వెళ్ళేవారు అక్కడ దిగవలె. కందూరు కిలోమీటరు దూరం ఉంటుంది.

ఇది పెద్ద చారిత్రాత్మకమైన గ్రామం. చోళులు కోడూరును విడిచిన పిమ్మట ఇక్కడికి వచ్చియే కందూరు చోళులైనారు. ఆనాడు వారు కట్టించిన కోట యొక్క అవశేషాలు, వారు త్రవ్వించిన బావులు ఈ గ్రామంలో ఇప్పటికీ ఉన్నవి.

ఈ గ్రామం చుట్టు ఏడు గుట్టలున్నవి. ప్రతిదానిపై ఏదో ఒక దేవుడున్నాడు. ఇక శిథిల మూర్తులు గ్రామం నిండా పడి ఉన్నవి. పూర్వం ఇక్కడ శతలింగ ప్రతిష్ఠ ఉండేదని గ్రామస్థులు చెబుతారు.

ఇక్కడి వానిలో రామలింగేశ్వరాలయం ప్రసిద్ధి. అది గ్రామానికి నైఋతిగా ఒక పెద్ద గుట్టక్రింద ఉంది. ఈ స్వామి మొదట ఇక్కడ గుట్టపైననే ఉండి, ఉత్సవసమయంలో తేరుకూడా అక్కడనే స్వామి వెలసిన గుండు చుట్టూ తిరిగేదట.

సాధారణంగా శివలింగం సోమసూత్రంపై ఉండటం రివాజు కాని, దుందుభీ తీరంలో చతురస్ర పీఠం పైననే శివలింగాలున్నవి. ఇక ఇక్కడ ఆ విధంగా కాక రథచక్రంలో శివలింగ ప్రతిష్ఠ ఉంది. ఇది ఇక్కడి ప్రత్యేకత. దీనికి ఈ క్రింది కథ ప్రచారంలో ఉంది :

పూర్వం ఇక్కడి పూజారియైన తమ్మళి దినదినం కొండనెక్కి-స్వామి నర్చించి వచ్చేవాడు. అతని వెంట అతని భార్య కూడా వెళ్ళేది. ఒకపుడామె గర్భం ధరించి నెలలు నిండసాగిన పిమ్మట పూజకు వెళ్ళినప్పుడు, స్వామి, నేనిక మీ దర్శనానికి రాలేను. మళ్ళీ ఎంత కాలానికి మిమ్ము సేవించుకుంటానో అని చెప్పుకున్నది.

అది విని స్వామి, నీవు రాలేకుంటే నేనే నీ వెనుక వస్తాను తిరిగి చూడకుండా కొండ దిగి వెళ్ళు. ఎక్కడ నిలుస్తావో నిలువు అన్నాడు. అది విని ఆమె స్వామి ఆజ్ఞ మేరకు కొండ దిగుతూ ఉండగా వెనుక స్వామి రథారూఢుడై బయలుదేరినాడు. కొంత దూరం దిగిన పిమ్మట ఆమె తన వెనుక గంటల చప్పుడుతో కదలి వస్తున్న రథాన్ని చూడ కుండా ఉండలేక పోయింది. దానితో స్వామి కోపించినాడు. పెద్ద శబ్దంతో రథం విరిగి చక్రాలు దొరలుకొనివచ్చి క్రింద పడినవి. ఆ ధ్వనికి అమె మూర్ఛిల్లి దొరలి పడి మరణించింది. రథం నుండి విడి పోయిన చక్రాలు ఒకటి గుట్టక్రింద ఉన్న కోనేరులో పడగా, మరొకటి దాని ప్రక్కన పడింది. అనంతర కాలంలో ఆ విధంగా ప్రక్కకు పడిన చక్రాన్నే గర్భంగా చేసికొని ఈ ఆలయాన్ని నిర్మించి, ఆ చక్రంలో శివలింగాన్ని ప్రతిష్ఠించినారు. ఇపుడు గర్భాలయంలో ఆ రథం చప్పుడు విని మూర్ఛిల్లి పడిపోయిన తమ్మళి యువతి యొక్క మాసతిగల్లు కూడ ఉంది.

ఇటువంటిదే మరో కథ కోటప్ప కొండలో ఒక గొల్లత పరంగా చెప్పబడుతుంది. ఈ రెండు కథలలో ఏది మొదటిదో తెలియదు.

ఇది పశ్చిమాభిముఖాలయం. దీనిలో ప్రధానాలయానికి ఎదు రుగా నంది లేదు. పశ్చిమాభిముఖాలయం వృషశూన్యం అంటారు.

ఈ ఆలయ మంటపంలో తక్కిన మూడు వైపులలో రెండేసి చొప్పున ఆరు గదులున్నవి. పూర్వం వీనిలో గూడ శివ ప్రతిష్ఠలు ఉండేవట.

చాళుక్యులు వారి పిమ్మట వచ్చిన కాకతీయులు షట్కాల శివ పూజా ధురంధరులు కాబట్టి ఈ షల్లింగ ప్రతిష్ఠ దాని చిహ్నమో లేదా షట్స్థల చిహ్నమో తెలియదు.

ఈ ఆలయావరణ చాలా పెద్దది. దీనిలో గౌరి, ఆంజనేయ - వీరభద్ర ప్రతిష్ఠలున్నవి. గౌరి ఇక్కడ ప్రతిమగా కాక స్త్రీలు పసుపుతో చేసే విధంగా మలచబడింది. ఇక్కడి హనుమంతుడు శిఖా యజ్ఞోపవీతాలతో ఉన్నాడు. ఆవరణలోగల ఇతర ఆలయాలలో ఒకదానిలో శివలింగం సోమసూత్రంతోపాటు అఖండంగా మలచబడింది. ఇది కూడా అపురూపమే. ఈ ఆవరణలోని నంది మిక్కిలి సుందరంగా ఉంది కాని, విరుగగొట్టబడింది.

ఇదిగాక ఇక్కడ గ్రామంలో చెన్నకేశవాలయం ఉంది. అది గూడ చెప్పదగినదే. ఈ ఆలయం దక్షిణాభిముఖంగా ఉండి, దీని విమానం ద్రావిడ రీతిలో కట్టబడింది. ఇటువంటి విమానం ఈ జిల్లాలో మరొకటి లేదు. ఆలయంలో మూర్తి గూడా పరమ సుందరంగా ఉంది కాని క్రీ. శ. 1950 లో ఎవరో దుష్టులు స్వామివారి చేతి నొకటి విరుగగొట్టినారు.

ఇక్కడ ముఖ్యంగా చెప్పదగినవి కదంబ వృక్షాలు. అవి జీడిచెట్ల వలె ఉన్నవి. శ్రావణంలో పూస్తవి. సన్నని వంకాయ రంగు పూలు ఒక పొడుగాటి కాడ చుట్టు సర్పిలాకారంగా విచ్చుకుంటవి. వీని కాయ కరకవలె వలకలుగా అంగుళంనర పొడవుగా కరకరంగులోనే ఉంటుంది.

సాహిత్యంలో వర్ణింపబడిన కడిమి పూలు మన్మథునికి ఉండ విల్లుగా చెప్పబడినవి. అట్టివి బీహారు రాష్ట్రంలో ఉన్నవి. వీని పూవు లేత పసుపు రంగులో గుండ్రంగా బంతివలె విచ్చుకుంటుంది. కాబట్టి ఇక్కడి కదంబాన్ని పరిశీలించవలసి ఉంది.

ఇక్కడి దొరల వంశంలో తత్వజ్ఞానులు పుట్టినారట. రేమద్దులలో సమాధి చేయబడిన కందూరప్ప ఇక్కడి ప్రభు వంశానికే చెందినవాడు అంటారు.

వనపర్తి దొరసాని రాణీ శంకరమ్మగారు గూడ ఈ గ్రామానికి చెందిన ఆడపడుచు.

వివరాలకు చూ. మూసి. డిసెం. 1982. కందూను.

వేణుగోపాలాలయం - కేశంపేట

కేశంపేటలు గూడ ఈ జిల్లాలో రెండున్నవి. ఒకటి షాద్‌నగర్ తాలూకాలో, మరొకటి గోపాలపేట ఇలాకాలో ఉన్నవి. రెండవదైన ఈ గ్రామం ఇపుడు వనపర్తి మండలంలో ఉంది.

మొదలిక్కడ బెక్కరపల్లె, దాని ప్రక్కన సైదాపేట అనే రెండు పల్లెలున్నవి. గోపాలపేట ప్రభు వంశంలోని పదకొండవ తరంవాడైన రాజా వెంకట లక్ష్మారావు గారి భార్య కేశమ్మగారిక్కడ వేణుగోపాలాలయం కట్టించి గ్రామాన్ని తన పేర మార్చింది.

కేశమ్మగారి పిమ్మట ఆమె కోడలు లక్ష్మీనరసమ్మగారు అధికారానికి వచ్చి ఈ ఆలయాన్ని ఎంతో అభివృది పరచి, దానిముందు ఒక పెద్ద కోనేరును త్రవ్వించింది.

ఈ గుడికి చుట్టూ పెద్ద ప్రాకారం, దీనికి ముఖమంటపం ఉన్నవి. ఈ ప్రాకారానికి నలువైపులా ద్వారాలున్నవి. కాని ప్రస్తుతం తూర్పు ద్వారం ఒక్కటే చక్కగా ఉంది. తక్కినవన్నీ మూసివేసినారు.

ఈ ఆలయంలో స్వామి రుక్మిణీ సత్యా సమేతుడై ఉన్నాడు. అతనికి తామ్ర కవచం ఉంది. ఆలయ విమానంపై ప్రతిమాశిల్పం ఉంది.

లక్ష్మీనరసమ్మగారి పిమ్మట ఆమె కోడలు రంగనాయకమ్మగారు అధికారానికి వచ్చి ఈ స్వామికి తేరు చేయించింది.

ఇక్కడి తేరు చాలా పెద్దది. మంచి పనితనంగలది. ఈ ప్రాంతంలో దాదాపుగా ఇంత పెద్ద తేరు లేదనవచ్చు. దీనికి అయిదు పెద్ద అంతస్తులు, మూడు చిన్న అంతస్తులున్నవి.

గాండ్లు ఎనిమిదడుగులు, ఇరుసు ఆరంగుళాల అడ్డుకొలతలో ఉన్నవి. ఈ యిరుసునానాడు ప్రత్యేకంగా బొంబాయిలో ఆర్డ రిచ్చి చేయించినారట. ఆ కాలంలో ఇలా చేయించటం అంటే మాటలు కాదు.

ఈ తేరును టీరవెల్లి చిన్నగోపాలు, పెద్దగోపాలు అనేవారు చేసినారు. పెద్ద తనంలో ఇక్కడి ఆలయం, దీని ముందుగల కోనేరు, దీని ప్రక్కన ఉన్న రథం పోటీపడుతూ ఉంటవి. వీనికి తగినట్లు పూర్వం ఈ జాతర గూడా అలాగే నెల దినాలు జరిగేది. ఆనాడు చుట్టుప్రక్కల వారికీ జాతరలో దొరకని సరకు లేదు. అందరూ ఏడాదికి సరిపోను కొనేవారు.

ఈ ఉత్సవం చైత్రంలో, ప్రారంభమై అష్టమినాడు అంకు రార్పణం, త్రయోదశినాడు తలంబ్రాలు, పౌర్ణమినాడు తేరు జరుగుతవి.

ఇక్కడ ఆగమంవారు పూజారులుగా ఉన్నారు. పాంచరాత్ర ప్రకారం అర్చన జరుగుతుంది. ఇక్కడి పూజారి ఆగమం వెంకటాచార్యులు గారు మంచి కవి కాని, కావ్యాలేవీ వ్రాయలేదు.

ఇక్కడ ఆలయం, తేరు ఇంత చక్కగా ఉన్నా ఇపుడిక్కడి జాతరను తలుచుకుంటే జాలివేస్తుంది. దీన్ని పునరుద్ధరించుకోవలసిన బాధ్యత గ్రామస్థులది.

రంగనాయకాలయం - గట్లకానాపురం

ఈ జిల్లాలో నాగర్‌కర్నూలు తాలూకాలో ఒక కానాపురం, వన పర్తి తాలూకాలో మరో కానాపురం ఉన్నవి. ఇది గట్ల నడుమ ఉంది కాబట్టి దీన్ని గట్ల కానాపురం అన్నారు. ప్రస్తుతం ఇది పెద్ద మందడి మండలంలో కందూరు రూటులో ఉంది.

ఈ గ్రామంలో రంగనాయకాలయం ప్రసిద్ధి. దీన్ని వెలిదండ రామచంద్రరావుగారనే కరణంగారు కట్టించినారు.

ఈ కరణంగారి పూర్వులు నాగర్ కర్నూలు తాలూకాలోని లింగసానిపల్లె వారు. అక్కడి నుండి వెళ్ళి కానాపురంలో స్థిరపడి, పద్దెనిమిది వందల ఎకరాల భూమిని సంపాదించినారు. రామచంద్ర రావుగారు ఈ ఆలయం కట్టించి తమ సర్వస్వాన్ని దానికి దానం చేసినాడు.

ఈ గ్రామంలో బోయవారెక్కువ. వారు వనపర్తి ప్రభువుల బంటులు. ఈ పరిసరమంతా అరణ్యమయం కాబట్టి ఇక్కడి బంటులు చౌర్యంలో గూడ ఆరితేరినారు.

ఒకపుడు వారు పెద్ద కందనూలు ప్రాంతంలో దౌడు కొట్టినారు. అపుడు వారికి ఒకచోట ఇక్కడి స్వామివారు లభించినాడు. అపుడు వారు అతనిని తెచ్చి ఒక ఇంటిలో దాచగా కరణం వెలిదండ రామ చంద్రరావు గారికా సంగతి తెలిసింది. ఆయన స్వామివారు అలా ఉంచటం బాగా ఉండదని అపుడీ ఆలయం కట్టించి దానిలో ప్రతిష్ఠించి నాడు.

ఈ ఆలయం విశాలంగా ఉంది. గర్భాలయం, ముఖమంటపం, ప్రాకారం, ప్రాకారంలో సామాను గది, హోమశాల మొదలైనవన్నీ ఉన్నవి.

ఇక్కడ వైశాఖ శుద్ధ దశమికి తలంబ్రాలు, పూర్ణిమకు రథోత్స వము జరుగుతవి. ప్రస్తుతం వెల్లటూరి నివాసి గండికోట రాఘవాచార్యులు పూజారిగా ఉన్నాడు.

చెన్నకేశవాలయం - జంగమయ్యపల్లె

జంగమయ్యపల్లె, బలిజెపల్లి రెండు జతగా ఉన్న గ్రామాలు - ఇవి యిపుడు గణపురం మండలంలో ఉన్నవి.

జంగమయ్యపల్లె పాతపల్లె, కొత్తపల్లె అని రెండుగా ఉంది. పూర్వం ఈ ప్రాంతంలో బలిజ దొరలున్నారు. వారీ గ్రామాన్ని తమ గురువుల పేర స్థాపించుకొని అనంతరం తమ గురువులను పిలిచి, వారికి తమ ప్రక్కన ఒక భూదానం చేయగా దానిలో వారు తమ శిష్యుల పేర బలిజెపల్లిని స్థాపించినారు. ఇందుచేత ఈనాడు బలిజెపల్లిలో బలిజలుగాని, జంగమయ్యపల్లెలో జంగాలుగాని లేరు.

ఈ గ్రామంలో పూర్వం వేణుగోపాల - చెన్నకేశవ అని రెండు విష్ణ్వాలయాలున్నవి. వేణుగోపాలాలయం విశాలమైన ప్రాకారంతో గాలి గోపురంతో ఉంది. ఒకపుడు ఈ గ్రామంపై కర్నూలు నవాబు దండెత్తి ఆలయంలోని ఈ మూర్తి యొక్క తలను విరుగగొట్టినాడు.

అది బలిజెపల్లిలోని వారి గురువు చూచినాడు. ఆయన దగ్గర ఒక మంత్ర దండం ఉండేది. దాని ప్రభావంతో ఆయన అక్కడి యాదవులందరిని సమీకరించి, సైన్యంగా చేసికొని నవాబును ఎదుర్కొగా, ఆయన పారిపోయినాడు. కాని ఈ ఆలయంలో మళ్ళీ రెండవ ప్రతిష్ఠ ఏదీ జరుగలేదు.[1]

ఇక్కడి చెన్నకేశవాలయం గూడ చక్కగా ఉంది. దాని కొరకు గ్రామస్థులు ఊరి సమీపంలోని "లంజెగట్టు"పై ఒక పెద్ద స్తంభం తీయించినారు కాని, దాని ప్రతిష్ఠా సమయానికి శిల్పికి మాతృవియోగం కలిగి వెళ్ళిపోయినాడు. దానితో అది ఆగిపోయి ఆ స్తంభం ఇప్పటికీ అక్కడనే ఉండిపోయింది.

పూర్వం ఈ గ్రామంలో భాగవతుల రామక్క అనే విశ్వ బ్రాహ్మణ భక్తురాలున్నది. ఆమె ఈ స్వామికి వెండితో ఒక పెద్ద పళ్ళెం, అభిషేక తీర్థ పాత్రలు, కాయకోలాలు, వింజామరాలు, దీపపు సెమ్మెలు చేయించి సమర్పించింది.

---

1. ఈ మంత్రదండం కథలు ఈ జిల్లాలో తొమ్మిదరేకుల, వెలిదండ గ్రామాలలో కూడ ఉన్నవి.

ఈ గ్రామం వెలుపల ఇపుడొక పెద్ద హనుమంతుడు ఉన్నాడు. అతనికి గుడిలేదు కాని, ఈ స్వామి వ్యాసరాయల ప్రతిష్ఠ అని చెబుతారు.

కొత్త జంగమయ్యపల్లెలో వనపర్తి రామేశ్వరరాయలు ఒక వెంకటేశ్వరాలయం కట్టించినాడు. అది ఇపుడు చక్కగా నడుస్తుంది.

హనుమదాలయం - మున్ననూరు

మున్ననూరులు అచ్చంపేట తాలూకాలో ఒకటి, వనపర్తి తాలూకాలో ఒకటి ఉన్నవి. వనపర్తి తాలూకాలోని ఈ మున్ననూరు ప్రస్తుతం గోపాలపేట మండలంలో ఉంది. దీనికి గూడ పూర్వం మునిపురమనియే వ్యవహారం.

గోపాలపేట ప్రభువులకు వట్టెం అత్తవారిల్లు, ఈ మున్ననూరు దత్తపుత్రుల యిల్లుగా ఉన్నవి.

ఇక్కడ గ్రామానికి దక్షిణంగా "కన్యకలగట్టు", దీని సమీపంలో ఒక బావి ఉన్నవి పూర్వం ఆ గట్టుపై మునులు నివసించి, ఈ బావిలో వారి అనుష్ఠానాలు తీర్చుకునేవారట. అందుచేత దీనికి మునుల బావి అని పేరు.

అరువదేండ్లనాడు ఈ గుట్టపై ఈశ్వరదాసు అనే ఒక యోగి ఉన్నాడు. మున్ననూరులో హనుమదాలయం ప్రసిద్ధి. ఆ స్వామిని పూర్వం కన్యకలగట్టుపై ఉన్న మునులు ప్రతిష్ఠించినట్లుగా చెబుతారు. ఈ స్వామి మిక్కిలి మహిమ గలవాడు. అందుచేత అతనికి ప్రతి శనివారం పల్లకి సేవ జరుగుతుంది. అయితే తన సేవలో ఎప్పుడేలోపం జరిగినా ఆ స్వామి ఆలయం నుండి అలిగి వెళ్ళి, మునుల బావిలో దాగుతూ ఉంటాడు.

కార్తీకం హనుమంతునికి ప్రియమైన మాసం - అందుచేత అపుడాతనికి గ్రామస్థులు ఆకుపూజ చేస్తుంటారు. ఇక్కడ ఆ పూజలో ఏ లోపం జరిగినా స్వామి అలిగి వెళ్ళి పోయి ఎవరికో ఒకరి కావేశమై, నేనిక్కడలేను, వెళ్ళిపోయినాను అని చెప్పుకుంటాడు. అపుడు పూజారి

తమ యింటి నుండి ఒక కలశం తెచ్చి, దాన్ని సేవా పల్లకిలో ఉంచుకొని మేళతాళాలతో కన్యకల బావిదగ్గరకు కొనివెళ్ళి అక్కడి జలంతెచ్చి దానితో స్వామి నభిషేకిస్తాడు. అపుడా జలంలో స్వామి ఆవేశించి వచ్చి మళ్ళీ ఆలయంలోని మూర్తిలో నిలుస్తాడు.

గ్రామస్థులు ఈ కలశం నీటితో తీసికొనివచ్చే అపుడు చాలా బరువుగా ఉంటుందని చెబుతారు.

ఇక్కడి ఆలయం మొదట మట్టితో ఉన్నది. దాన్ని గోపాలపేట ప్రభువు రాజా హన్మంతరావుగారు శిలా మంటపం చేయించినాడు.

ఈ ఆలయంలో ఇప్పటికి అయిదు తరాలనుండి అఖండజ్యోతి వెలుగుతుంది. దీనికి నూనె గోపాలపేట ప్రభువు లిస్తారు. ఇంత పురాతనమైన జ్యోతి ఈ ప్రాంతంలో మరొకటిలేదు. కాబట్టి ఇక్కడ ఇదొక విశేషం.

ఇటీవల మా మిత్రుడు శ్రీ వెలిదండ వెంకటరావుగారు కూడా తమ యింటిలో ఒక అఖండ జ్యోతిని ప్రారంభించినాడు.

సింహళంలోని అనూరాధపురంలో బుద్ధుని కాలం నుండి వెలుగుతూ ఉన్న అఖండజ్యోతి ఉందట.

ఈ గ్రామంలో శ్రావణంలో కన్యకల గుట్టపై పూజ జరుగుతుంది.

అచ్చంపేట తాలూకా మున్ననూరిలో విజయ గోపాలాలయం ఉంది. దాన్ని నంది మల్లారెడ్డి అనే ప్రభువు క్రీ. శ. 1468 లో కట్టించినాడు. సాధారణంగా ఆలయంలో అంతరాళ - భోగ - యాగ - మంటపాదులన్ని ఒక్కరిచేతనే పూర్తికావటం అరుదు కాని ఈ ఆలయంలో అన్నీ ఒక్కరే కట్టించినాడు. కాని ఈనాడు ఆలయం తప్ప దానిలో మరేవీ మిగులలేదు. ఇది మిక్కిలి విశాలమైన ఆలయం కాబట్టి తప్పక ఉద్ధరించదగింది.

ఇక్కడి దీపస్తంభం ఎత్తులో చెప్పదగింది. అది ఒక వైపు కాస్త ఒరిగి నిలిచింది. ఇది దాని విశేషం.

నాయక్ వంశీయులు కట్టించిన గుడులు

ఈ వంశీయులు వనపర్తి విఠలాలయం, యాపర్ల రామాలయం, కృష్ణా స్టేషన్‌లోని దత్తాత్రేయాలయం కట్టించినారు. వీరు దేవీ భక్తులు. దానికి కారణం ఈ విధంగా ఉంది.

వీరు వనపర్తి ప్రభువుల దివాంజీలు. వీరి పూర్వులు బిజాపుర నివాసులు. అక్కడి నవాబుతో కప్పం వసూలుకు పంపబడుతూ కాలాంతరంలో స్థల, జల వాతావరణానికి ముగ్ధులై లోకాయపల్లెలో నిలిచినారు. అక్కడినుండి కాలక్రమంలో ఒక శాఖ వనపర్తికి వచ్చింది.

వనపర్తికి వచ్చిన వీరి మూలపురుషుడు వెంకోబా నాయక్‌గారు. ఆయనకు గోవిందనాయక్, వెంకోబానాయక్ (రెండవ) అని యిద్దరు కుమారులు కలిగినారు. గోవిందనాయక్ గారు వనపర్తి ప్రభువుల దగ్గర దివాంజీగా ఉండగా, ఆయన సోదరుడు వారి మింటును చూసేవాడు. అందుచేత ఆయనను మింటు వెంకోబ నాయక్ అన్నారు.

మింటు అనగా టంకశాల. దానిలో ఆనాడు వనపర్తివారి సిక్కాలు "సూగూర్లు" సిద్ధమయ్యేవి. ఆ మింటు వీరి యింటిలోనే ఉండేది.

గోవిందనాయక్ పెద్ద రామేశ్వరరాయల మంత్రిగా ఉన్నాడు. రామేశ్వరరాయలను ఒకప్పుడు నిజాం నవాబు బందీ చేయగా, గోవింద నాయక్‌గారు తన చాకచక్యంతో ప్రభువును విడిపించుకొని వెళ్ళినాడు.

అపుడాయన హైదరాబాదులో ఉండి ప్రభువును విడిపించటానికి ప్లానంతా సిద్ధం చేసికొని ఇంటికి వెళ్ళి తమ్ముని తగిన సిబ్బందితో గుర్రాలతో పంపినాడు.

ఆనాడు వనపర్తినుండి హైదరాబాదు దారి నేటి మాలవెలిక కట్టపైనుండి ఉండేది. మింటు వెంకోబ నాయక్ తన మందితో వచ్చి ఆ రాత్రి అక్కడ అంబా భవాని ఆలయంలో విడిసినాడు. తెల్లవారిన పిమ్మట ఆయన కనిపించలేదు. సైన్యం పరేషానయ్యింది. మూడు దినాలు వెదకినారు. మూడవనాడు తెల్లవారేవరకు ఆయన మళ్ళీ ఎప్పటి స్థానంలో ప్రత్యక్షమైనాడు. ఆయనకు నాలుక వాచి, ఎక్కడికి వెళ్ళిందీ చెప్పరాలేదు. నోరు తెరచి చూపి ఏదో సైగ చేసినాడు. నాలుకపై ఓంకారం వ్రాయబడి కనిపించింది. ఆనాటినుండి వెలికట్టలోని అంబా భవాని మహిమ అందరికీ తెలిసి వచ్చింది.

రామాలయం - యాపర్ల

యాపర్ల కృష్ణాతీర గ్రామం. ఇది సంస్థానాల కాలంలో గోవింద నాయక్ గారి జాగీరు. ఇపుడు ఇది పెబ్బేరు మండలంలో ఉంది.

క్రీ. శ. 1915 ఆనంద నామ సంవత్సరంలో గోవింద నాయక్ గారు ఇక్కడ పెద్ద సప్తాహం చేసినాడు. దేశంలో అంతటి భారీ సప్తాహం మళ్ళీ జరుగలేదని దాన్ని చూచినవారు చెప్పేవారు.

ఇది శ్రీరామ పట్టాభిషేక సప్తాహం. అందుచేత అపుడాయన అక్కడ ఒక రామాలయం కట్టించినాడు అది కృష్ణాతీరంలో ఉంది. అక్కడి నుండి స్నానానికి దిగటానికి కృష్ణలోనికి మెట్లున్నవి.

ఈ ఆలయం ప్రశాంత వాతావరణంలో చక్కగా ఉంది. ఈ సప్తాహం సందర్భంలో ఆయన గారి భార్య గర్భంతో ఉన్నదట. అందు చేత సప్తాహానంతరం ఆయన గారు తమకు కలిగిన కుమారుని పేరు రామచంద్ర నాయక్ అని పెట్టుకున్నారు.

రామకృష్ణాలయం - రాజనగరం

వనపర్తి రాజధానిగా చేసిన రామకృష్ణరాయలకు గుఱ్ఱం పరుగు పందేలపై ఎక్కువ మక్కువ. అందుచేత ఆయన వనపర్తికి పశ్చిమంగా మూడు మైళ్ళ దూరంలో తనపేర రాజనగరాన్ని ఏర్పరచి, దాని వెలుపల అర మైలు దూరంలో పై పరుగు పందేల స్థలం ఏర్పరచినాడు. అక్కడ ఏటా గుర్రాల పరుగు పందెం నిర్వహింపబడేది.

అలా జరుగుతూ ఉండగా ఒకప్పుడా పందెంలో ఆయన ఒక తీగను కట్టి దానిపైనుండి గుర్రాన్ని దూకించినాడు. అపుడది తీగ కాలికి తగిలి క్రిందపడింది. దానితో ఆయన శా. శ. 1744 చిత్రభాను కార్తీక శుద్ధ పాడ్యమినాడు పరమపదించినాడు.

ఆయన అనంతరం భార్యయైన నాంచారమ్మగారు పతిదేవుని స్మృత్యర్థం ఆయన మరణించిన చోట ఒక శివాలయాన్ని ప్రతిష్ఠించింది. అది శివాలయం కాగా, దానిలోనికి వైష్ణవులెవ్వరూ వెళ్ళకుండా ఉండగా, నాంచారమ్మగారి అనంతరం ఆమె కోడలు శంకరమ్మగారు దాన్ని పునర్వ్యవస్థీకరించి విష్ణుప్రతిష్ఠ చేయించి రామకృష్ణాలయంగా మార్చింది.

ఇపుడా ఆలయం ముందు కఱ్ఱతో చేసిన ధ్వజస్తంభం శిలా స్తంభం రెండూ ఉన్నవి. కఱ్ఱదాని దగ్గర నందీశ్వరుడు శిలాస్తంభం దగ్గర గరుడాళ్వారు ఉన్నారు.

ఆలయం ఎడమవైపున రాజావారి సమాధి ఉంది. దాని పైగల శిలాఫలకంపై అది 1236 హిజరీలో పూర్తి చేయబడినట్లు ఉంది. ఈ శాసనం ఉర్దూ తెలుగు రెండు భాషలలో ఉంది.

ముఖమంటపంలో అరుగుల కింద, ఆలయంలో జంఘల క్రింద గదులున్నవి. ఆలయం రాతిలో, విమానం గచ్చుతో కట్టబడినవి. విమానం పై పూర్వార్ధంలో స్తంభాలు ఉత్తరార్ధంలో ప్రతిమలు తీర్చటం వనపర్తి వారి ప్రత్యేకత.

ఈ ఆలయానికి విశాలమైన ఆవరణ, దానిలో సత్రాలు ఉన్నవి. ఆలయం ముందు ఉత్తరాభిముఖంగా రాజవిలాసం అనే రెండంతరువుల విడిది ఉంది. దానిలో వనపర్తి ప్రభువుల చిత్రాలు, వారి దర్బారు సామాగ్రి ఉంది. అది క్రీ.శ. 1900 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయబడింది

ఇక్కడ ఏటా కార్తీక శుద్ధ చతుర్దశినాడు తలంబ్రాలు, పున్నమ నాడు తేరు జరుగుతవి. ప్రజలు దీన్ని రాజావారి జాతర అంటారు. ఇక్కడి కవి పండిత సభలు పూర్వం ప్రసిద్ధి. అవి క్రీ.శ. 1825 నుండి 1949 వరకు అవిచ్ఛిన్నంగా సాగినవి. ఆ సభలలో ఎందరో పండితులు సన్మానాలందుకున్నారు.

ఈ ఉత్సవం ఇత్తడి సామాగ్రికి ప్రసిద్ధిగా ఉండేది. ఇది విష్ణ్వాలయంగా మారినా ఇంత వరకు దీనిలో తీర్థ పరిగ్రహం జరుగ లేదట. ప్రస్తుతం ఇక్కడ పల్లావారు ప్రధాన పూజారులుగా ఉన్నారు. మొదలీ ఆలయం ఏకాంత ప్రదేశంలోనే ఉన్నా ఇపుడిక్కడ గూడా గ్రామం ఏర్పడింది.

రాజనగరంలో గత శతాబ్దిలో బుక్కా పంచాక్షరి అనే కవి ఉన్నాడు. ఆయన కోట కదిరి చంద్రమౌళీశ్వరస్వామి శిష్యుడు. ఉమా మహేశ్వర సంవాదం పేర తమ గురువుగారి చరిత్రను హరికథా ప్రబంధంగా వ్రాసినాడు. అది ముద్రితం. గ్రంథ వివరాలకు. చూ. సమాలోచన. గురుభక్త విజయం. తే. 1-6-1987.

చెన్నకేశవాలయం - వీరాయపల్లె

ఇది వనపర్తి తాలూకాలో గణపురం రూటులో ఉన్న గ్రామం. ఇపుడు పెద్ద మందడి మండలంలో ఉంది.

ఈ గ్రామంలో బాబాజీగారి మఠం ప్రసిద్ధి. దీన్ని స్థాపించిన వాడు కేసరిగిరి బాబాజీగారు. అయన హైదరాబాదులోని బేగంబజారులో గల దత్తాత్రేయ మఠ నివాసి.

వనపర్తి ప్రభువులలో మొదటి రామకృష్ణారావుగారి భార్య నాంచారమ్మగారు ఒకపుడు హైదరాబాదు వెళ్ళి దత్తాత్రేయ మఠాన్ని సందర్శించటం జరిగింది. అపుడక్కడ ఆమె కేసరిగిరి బాబాగారిని చూచి ఇల్లు చేరిన పిమ్మట అతనిని పిలుపించుకొని తమ సంస్థానంలో ఉండ వలసిందని కోరి వీరాయపల్లెను వారికి దానం చేసింది. అపుడాయన అక్కడ ఒక మఠం ఏర్పాటు చేసికున్నాడు.

ఈ బాబాగారి వంశంలో ఏడవ తరంవాడు రాంబిలాస్ గిరి బాబాగారు. ఆయన అనేకమైన ధర్మ కార్యాలు చేసినాడు. అంతేకాక ప్రస్తుతం అక్కడ ఉన్న చెన్నకేశవాలయం హనుమదాలయం కూడా అయనే కట్టించినాడు. ఇవి శిలా నిర్మితాలు. పూర్వ పద్ధతిలో ఉన్నవి.

రాంబిలాసగిరి ఈ గుడులు కట్టించటమేకాక తమ సమీపంలో ఉన్న పాపకంటి పుల్లమరాజును పిలిచి తాను ప్రతిష్ఠించిన దేవతలపై వీరాయపల్లె మారుతీ విలాసం, చెన్నకేశవ విలాసం అనే ఒక కృతుల కూడ చెప్పించి ముద్రింపించినాడు. మహారాష్ట్రులు హనుమంతుని మారుతి అంటారు.

ఈ ప్రాంతంలో చిన్నదో పెద్దదో ఏదో ఒక ఆలయం కట్టించిన వారు చాలా మంది ఉన్నారు. కాని వానిపై కృతులు చెప్పించిన వారు తక్కువ. కృతి, వ్యక్తి చేసిన ధర్మ కార్యాలకు అక్షర రూపమిస్తుంది.

వీరాయ పల్లెలోనేగాక ఈ బాబాగారి మఠం ఒంటి వనపర్తిలో గూడ ఉంది. అయితే అక్కడ వీరి కాలంలో మఠనిర్మాణం జరుగ లేదు. ఇపుడా స్థలంలో బాబాగారి ఆలయం వెలసింది.

కోదండరామాలయం - వెంకటాపురం

ప్రస్తుతం ఇది వనపర్తి మండలంలో చేరి పానుగల్లు రూటులో ఉంది. వనపర్తి ప్రభువులలో పెద్ద వెంకటరెడ్డి గారి కుమారుడు, ఇమ్మడి వెంకటరెడ్డి ప్రసిద్ధుడు. ఆయన తన పేర వెంకటాపురాన్ని వెలయించి అక్కడ కోదండరామస్వామిని ప్రతిష్ఠించినాడు. ఈ ఆలయం గ్రామానికి పశ్చిమంగా ఉంది. ఈ ప్రభువు క్రీ. శ. 1600 ప్రాంతం వాడు.

ఈ ఆలయం చక్కగా విశాలంగా ఉంది. లోపల స్వామివారు సీతాలక్ష్మణ సమేతుడై ఉన్నాడు. ఈ స్వామివారిపై అష్టభాషా బహిరీ గోపాలరావుగారు రామచంద్రోదయం అనే శ్లేష యమక కావ్యం వ్రాయగా పెన్గలూరి వెంకటాద్రికవి రామోదాహరణం అనే ఉదాహరణ కావ్యం రచించినాడు.

ఇక్కడ ఏటా శ్రీరామ నవమికి ఉత్సవం జరుగుతుంది.

రంగనాయకాలయం - శ్రీరంగాపురం

ఈ గ్రామం వనపర్తికి పదేనుమైళ్ళు ఉంది. ఇపుడిది పెబ్బేరు మండలంలో చేరింది. బస్సులు కూడా ఇక్కడికి ఆ గ్రామంపైనుండే వెళ్ళుతవి. ఇక్కడ రంగనాయకాలయం శిల్పసౌందర్యంలో ప్రసిద్ధి. దీన్ని ఇమ్మడి వెంకటరెడ్డిగారి దత్తపుత్రుడు అష్టభాషా గోపాలరావుగారు కట్టించినాడు.

శ్రీరంగాపురం కంటె మొదలక్కడ కొరివిపల్లె అనే ఊరున్నది. అక్కడ కస్తూరి రంగనాయకాలయం ఉండేదికాని శ్రీరంగాపురం వెలసే నాటికి ది నామమాత్రావశిష్టమయింది.

అష్టభాషా గోపాలరాయలు ఒక పర్యాయం దక్షిణ యాత్రచేసి, శ్రీరంగాన్ని సేవించి యిల్లుచేరగా అతనికి కలలో స్వామి కనిపించి తాను కానయ్యపల్లె సమీపంలోని రంగంపేట దగ్గర ఒక పుట్టలో ఉన్నానని, వెలికి తీయించి ప్రతిష్ఠించ వలసిందని ఆదేశించినాడు.

సాధారణంగా నియమ నిష్ఠలుగల వారికి వచ్చే స్వప్నాలు వ్యర్థం కావు. ఆయన ఆ కలకు అద్భుతపడి మేలుకొని మరునాడు మందిని తీసుకొని వెళ్ళి అక్కడ పుట్టను త్రవ్వించగా స్వామివారి మూర్తి కనిపించింది. అది లక్ష్మీ భూదేవులు పాద సంవాహనం చేస్తుండగా శేషునిపై శయనించి నాభిపద్మంలో బ్రహ్మతో పరమ సుందరంగా ఉన్నది.

ఏ మాత్రం భిన్నంగాకుండా లభించిన ఆ మూర్తిని కొని తెచ్చి స్వామివారి పేర గోపాలరాయలు ఒక గ్రామాన్ని స్థాపించి గ్రామానికి ఉత్తరంగా ఉన్న గుట్టకు గరుడాద్రి అని పేరు పెట్టి దానిపై గుడి కట్టించి స్వామివారిని ప్రతిష్ఠించినాడు. అనంతరం ఆ గుట్ట క్రింద రంగసముద్రం అనే చెరువును త్రవ్వించినాడు.

గోపాలరాయల పిమ్మట పెద్ద రామేశ్వరరాయల భార్య రాణీ శంకరమ్మగారు ఈ ఆలయానికి విమానం, ముఖద్వారంపై గోపురం కట్టించింది. స్వామివారి కోవెలకు ఫర్లాంగు దూరంలో మరో ఆలయాన్ని కట్టించి ఆండాళును ప్రతిష్ఠించి దాని ప్రక్కన మరో కోనేరు త్రవ్వించింది.

ఈ ఆలయంలోని విగ్రహాలు అతి మనోహరమైనవి. చూపరు లెవరైనా తన్మయులై పోతారు.

రాణీ శంకరమ్మగారు అండాళును ప్రతిష్ఠించటమేగాక రంగ సముద్రాన్ని విశాలపరిచి దాని నడుమ శ్రీకృష్ణవిలాసం అనే విశ్రాంతి మందిరాన్ని కట్టించింది. ఈ చలువరాతి భవనం శిల్పనైపుణ్యంలో దానికదే సాటి.

రాణీ శంకరమ్మగారి పిమ్మట రెండవ రామేశ్వర రాయలు ఈ ఆలయాన్ని మరింత విస్తృతపరచి గర్భగుడి ప్రక్కన లక్ష్మీదేవి ఆలయం, దాని కవతల కల్యాణ మంటపం కట్టించినాడు.

ఈ లక్ష్మీదేవి ఆలయంలోని శిల్పం అత్యంత మనోజ్ఞముయింది. శిల్పులు దీనిలో ప్రతి అంగుళం మేర అద్భుతమైన పనితనాన్ని ప్రదర్శించి మయబ్రహ్మను మరపించినారు.

ఈ లక్ష్మీదేవి గుడి ప్రక్కన పన్నిద్దరాళ్వారులు, గర్భాలయాని కెదురుగా ఇరువైపులా విశిష్టాద్వైతమత ప్రవక్త రామానుజాచార్యులవారు వైష్ణవ పీఠాధిపతి వానమామలై స్వాములవారి ప్రతిష్ఠలున్నవి.

ఈవిధంగా ఈ ఆలయం శాస్త్రీయంగాను, సంపూర్ణంగాను సర్వాలంకార శోభితంగాను ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటి వరకు ఇంత సర్వాంగ సుందరమైన ఆలయం మరొకటి లేదు అన్నా అతిశయోక్తి లేదు.

వనపర్తి సంస్థానం వైభవంగా ఉన్న కాలంలో ఇక్కడ ఎన్నో ఉత్సవాలు నడిచేవి. దసరాకు నవరాత్రులు, ముక్కోటి ఏకాదశికి కోతాయి, ఫాల్గుణంలో కల్యాణోత్సవం ఘనంగా నడిచి పండిత సత్కారాలు కూడా జరిగేవి కాని ఈనాడు ఒక్క కల్యాణోత్సవం మాత్రం మిగిలింది. అది ఫాల్గుణ పౌర్ణమి మొదలుకొని ఉగాదివరకు సాగుతుంది.

వివరాలకు చూ. ఆంధ్రప్రభ. వారపత్రిక. 19-6-1963. పు.17; మూసి - మాసపత్రిక. డిసెం. 1980 పు. 12.

ఈ క్షేత్రంపై హోసదుర్గం కృష్ణమాచార్యులుగారు ఉత్తర రంగ మాహాత్మ్యం అనే సంస్కృత కావ్యాన్ని అనువుగా చెప్పినాడు.

గోపాలపేట ఇలాకా కోవెలలు

గోపాలపేట వనపర్తి సంస్థానశాఖ. ఆ సంస్థానానికి చెందిన ఏడవ తరంవాడైన సవై వెంకటరెడ్డి దీన్ని తన పెంపుడు తండ్రి యైన అష్టభాషా బహిరీ గోపాలరావుగారిపేర స్థాపించి, తమ్ముడైన రంగారెడ్డిని పాలకునిగా నియమించినాడు. అతడు 1013 ఫసిలీనాటి వాడని యాద్ గార్ సిల్వర్ జూబ్లి రెండవ భాగంలో చెప్పబడింది.

గోపాలపేటకంటె మొదలక్కడ ల్యాటవెల్లి అనే గ్రామం ఉన్నట్టు స్థానిక కైఫియత్తుల వలన తెలుస్తున్నది. లేటవల్లి, మున్ననూరు, చెన్నవరం, గొల్లపల్లి, చీలికపల్లి, తిరుమలాపురం, సూగూరు మొదలైన గ్రామాలు పూర్వం పానుగంటి తగులు (హవేలీ) లో ఉన్నట్లు, వానికి కొండమరాజువారు అనేవారు కరణాలుగా ఉన్నట్లుగా శ్రీకృష్ణ విలాసం అనే అముద్రిత ప్రబంధంలో చెప్పబడింది.

లేటవెల్లి ఒక గుట్టపై ఉన్న గ్రామం. అందుచేత అక్కడ నీటి వసతి తక్కువగా ఉండేది. గోపాలపేట ప్రదేశం గూడ పూర్వం లింగాయతుల జాగీరే. ప్రస్తుతం అక్కడున్న శివాలయానికి కాలహస్తీ శ్వరాలయమని పేరు. దాని దక్షిణం గోడపై వెలుపలి వైపున శ్రీకాళ హస్తి చిత్రం ఇప్పటికి ఉంది.

ఆ ఆలయాన్ని ఆశ్రయించి పూర్వం శ్రీశైల ప్రాంతీయుడైన చంద్రశేఖరయ్య చంద్రగుండ మఠానికి, బూడిద బసవయ్య విభూతి మఠానికి చెందినవారు. కాలాంతరంలో చంద్రశేఖరయ్య గారక్కడ సొంతమఠం స్థాపించుకున్నాడు కాని, బసవన్న ఊరకనే శివైక్యం చెంది

నాడు. అతని సమాధి గుడి యిపుడు గ్రామానికి దక్షిణంగా రక్షకభట నిలయం వెనుక ఉంది.

ఇక్కడ గ్రామం ఏర్పడిన పిమ్మట లేటవల్లి లేచి వచ్చిందిగాని అది రెండవ గోపాలరాయని వరకు మామూలు గ్రామంగానే ఉంది. ఈ గోపాలరాయలు రంగారెడ్డి నుండి ఏడవ తరంవాడు. ఆయన ఈ గ్రామాభివృద్ధికి శ్రద్ధ వహించి, దానికి ఇపుడున్న రూపాన్ని కల్పించి నాడు.

గోపాలపేటలోని గుడులు

శివ కేశవాలయాలు :

ఇవి ఈ గ్రామంలో ప్రాచీనమైనవి. శివ కేశవాలయాలు రెండూ ఒకే దగ్గర ఉండి దాని నడుమ పుష్కరిణి ఉన్నపుడు దానిని జనమేజయ ప్రతిష్ఠ అనటం ఇక్కడి రివాజు.

ఈ ఆలయాలను మొదట ఒక వైశ్యుడు కట్టించినట్లు చెబుతారు. గోపాలరాయలు ఇక్కడ పట్టణం కట్టించినపుడు ఈ ఆలయాలను కూడా బాగుచేసి వానిపై విమానాలు, చుట్టు ప్రాకారం కట్టించినాడు.

శివాలయం :

ఇక్కడి ఆలయాలన్నిటికంటె ఇది ప్రాచీనమయింది. ఈ గుడి చాళుక్య పద్ధతిలో కట్టబడింది. ఈ ఆలయంలో పైకప్పుకు దక్షిణం దిక్కున మత్స్య, కూర్మ చిహ్నాలు జతగా మలచబడినవి. సరిగా ఇదే రీతిగా ఇంచుమించు ఇంతే పరిమాణంలో తీగెలపల్లి వీరభద్రాలయం కప్పుపై గూడ మలచబడినవి. దీన్నిబట్టి ఈ రెండు ఆలయాలు సమకాలి

కాలు అనటానికి వీలుంది. ఈ శివాలయం విమానంపై గొరగల ప్రతిమ లున్నవి. కాని వారెవరెవరో తెలియుటలేదు. ఏదుట్లలో ఊరి ముందు గల ఆలయంలో కూడా పెద్దల వేషంలో ఉన్న వీరగల్లులు మూడు నాలుగు ఉన్నవి. వీరందరు బహుశః ఒక కాలంలో ఈ ప్రాంతంలో ఉన్న మహనీయులు కావచ్చు.

ఈ శివాలయంలోని నంది మిక్కిలి సుందరంగా ఉంది.

అల్లాడమ్మ గుడి :

ఈ గుడిని అల్లాడమ్మ కట్టించినది అంటారు. ఈమె ఎవరో తెలియటంలేదు కాని, ఈ పేర ఈ జిల్లాలో మరెక్కడా ఇంకొక గుడి ఉన్నట్టు లేదు.

రామాలయం - బండ్లపల్లె

ఇది గోపాలపేట దగ్గరగల చిన్న గ్రామం. కాని ఇది దానికంటె మాత్రం మొదటిది. అక్కడ ఊరిముందు చింతల క్రింద ఒక ఆంజనేయ స్వామి ఉన్నాడు. ఆ స్వామికి గుడి ఏదీ లేకుండగా గోపాలపేట రాణి రంగనాయకమ్మగారి పినతండ్రి నరసింహారెడ్డిగారు ఆ స్వామికి గుడి కట్టించినాడు.

అది చూచిన పిమ్మట రంగనాయకమ్మగారు హనుమంతుడున్న చోట శ్రీరాముడు ఉండకపోవటం బాగుండదని తలచి ప్రస్తుతం అక్కడ ఉన్న కోదండ రామాలయం కట్టించింది. ఇది రాణిగారి పేరుకు తగినట్లు హుందాగా సుందరంగా ఉంది.

రంగనాయకమ్మగారీ ఆలయంలో ఆరు సప్తాహాలు చేయించి ఏడవ సప్తాహానికి సామాగ్రి సిద్ధంచేస్తూ గతించింది.

ఇపుడీ ఆలయంలో యేటా చైత్రశుద్ధ నవమికి తలంబ్రాలు, తేరు నడుస్తవి. ఈ ఉత్సవంలో గిత్తల బలప్రదర్శన ఒక విశేషం. ఇక్కడ ఒక పెద్దబండ ఉంది. దానికి తొలి వేసి గొలుసు కట్టినారు. పోటీదారులు ప్రతి యేటా ఆ బండను తమ ఎద్దులతో లాగిస్తారు. వానిలో ఏ యెద్దు దూరంగా లాగితే ఆ యజమానికి బహుమతి యిస్తారు. ఈ ప్రాంతంలో పోటీదారులు ఇందుకు తమ యెద్దులకు ప్రత్యేక శిక్షణ యిస్తారు.

ఈ గ్రామంలో ఈ పోటీ పూర్వంనుండి నడుస్తుంది అని ఊరి వారు చెబుతారు కాబట్టి దీన్ని పురస్కరించుకొని చూస్తే ఈ గ్రామం మొదట బండపల్లెగా ఉండి క్రమంగా బండలపల్లెగా మారిందేమో అనిపిస్తుంది.

షాద్‌నగర్ తాలూకాలోని దేవసదనాలు

ఈనాటి షాద్‌నగర్ ప్రాంతం మొదట వనపర్తి ప్రభువులకు చెంది ఉండేది. షాద్‌నగర్ కంటె మొదలక్కడ జానంపేట, కేశంపేట అనే గ్రామాలున్నవి. వాటిని వనపర్తి ప్రభువు గోపాలరాయడు తమ తల్లులపేర స్థాపించినట్లు వారి వంశచరిత్రలు చెబుతవి.

జానంపేటను మూడవ వెంకటరెడ్డిగారి కాలంలో గోలకొండ సుబేదారు ఫారుఖ్ అనే అతడాక్రమించుకొని దాన్ని తన పేర ఫారుఖ్ నగర్‌గా మార్చినాడు. ఆనాటినుండి ఇక్కడ నైజాం ప్రభువుల ప్రభావం పడింది. వారి సంబంధీకులైన నవాబులు జాగీర్దార్లు ఇక్కడ స్థలాలు పొంది తమ పేర్లతో గ్రామాలు వెలయించినారు.

మహమ్మద్ కులీకుతుబ్‌షా - సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షాలకు "జిల్-అల్లా" అని బిరుదులున్నవి. ఈ తాలూకాలోని నేటి జిల్లెళ్ళ, వారి బిరుద వాచకాలతోనే వెలసిన గ్రామం అంటారు కాని-

జిల్లెల్ల - మిడిజిల్ల అని జిల్లెడు చెట్లతో వెలసిన గ్రామాలు కూడా వున్నవి.

జానంపేట ఫరూఖ్‌నగర్‌గా మారిన పిమ్మట కొంత కాలానికి అది సర్ కిషన్ ప్రసాదుగారికి జాగీరుగా ఈయబడింది. అపుడాయన తమ గుర్తుగా అక్కడ యిపుడున్న వెంకటేశ్వరాలయం కట్టించినాడు.

ఈ తాలూకాలోని బాలానగర్ కిషన్‌ప్రసాదుగారి తాతగారి పేర స్థాపించబడిందని చెబుతారు. ఇక షాద్‌నగర్ గ్రామం కిషన్‌ప్రసాద్

గారి పేరనే వెలసింది. అపుడు దానికి ప్రసాదనగరమని పేరు. అక్కడ అతని జాగీరు గ్రామాలకు ఒక సొంత తహసీలు కార్యాలయం గూడా ఉన్నది.

ఆ ప్రసాద నగరం ఇపుడు సాదనగరంగా మిగిలింది. అయితే ఇక్కడ ప్రసాదానికి మాత్రం కొదువేమీ ఏర్పడలేదు.

ఇక్కడి జాగీర్దార్లలో సర్దార్ ఆజమల్లీఖాను ఒకడు. అతడు తన పేర నేటి సర్దార్ నగరం నెలకొల్పినాడు.

ఖాజా అహమదుల్లాఖాన్ మరొక జాగీర్దారు. రావికల్లు అతని జాగీరుగా ఉన్నది. ఈనాటి రామేశ్వరం ఆనాడు అతని జాగీరులోనే ఉన్నది. ఈ విధంగా ఇక్కడ మహమ్మదీయ జాగీరుదార్ల యొక్క ప్రభావం ఎక్కువ.

ఈ తాలూకాలోని కొంత భాగం మొదట తంగెడ సీమకు చెంది ఉండేది.

నృసింహాలయం - కొందుర్గు

ఈ గ్రామానికి కోనదుర్గం, కొండదుర్గం అని ప్రాచీన వ్యవహారాలు. ఇపుడిది ఒక మండల కేంద్రం. కేంద్రానికి పది కిలోమీటర్లు ఉంటుంది.

ఇక్కడ నృసింహాలయం, శివాలయం ఉన్నవి. శివాలయం ప్రాచీనమయింది. కాని యిక్కడి నృసింహాలయానికే ప్రశస్తి ఎక్కువ. ఇక్కడ స్వామివారి మూలబేరం గ్రామానికి ఉత్తరంగా మైలు దూరంలో గల ఒక కొండపై ఉన్న గుహలో ఉంది. అక్కడ స్వామి ఒక గుండుకు

వెలసినాడు. తర్వాత భక్తులు ఆ గుహకు ఒక చిన్న ముఖమంటపం కట్టినారు.

మూలస్వామి వెలసిన కొండ గ్రామానికి దూరంగాను దురారోహంగాను ఉండడం వల్ల, స్వామివారి అర్చామూర్తికి గ్రామంలోనే వేరొక ఆలయం కట్టినారు. ఈ ఆలయం చక్కగా విమానంతో ఉంది. దానిలో నిత్య పూజలు కూడ జరుగుతూ ఉంటవి. విశేషోత్సవాలనాడు మాత్రం అర్చకులు మూలబేరం దగ్గరకు వెళ్ళి దీపం వెలిగించి వస్తారు.

ఇది ఒక ప్రాచీన క్షేత్రం. దీనికి గంగన్న గూడెం అనే గ్రామం అగ్రహారంగా ఉంది. మాడభూషివారు వంశ పారంపర్యమైన పూజారులుగా ఉన్నారు.

లక్ష్మీనృసింహాలయం - గిరయ్య గుట్ట

ఇది ఫారుఖ్‌నగర్ మండలంలో ఉడిత్యాలకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గుట్ట కామసానిపల్లెకు చెందుతుంది. అడవిలో ఉంటుంది. దానిపై ఈ నృసింహాలయం ఉంది. ఈ స్వామి బూర్గులవారి యిలవేల్పు. ఈ గుట్టపై రెండు గుండ్లు ఒకదాని కొకటి అని నిలిచి క్రింద గుహ ఏర్పడింది కాబట్టి ఆ గుండ్లపై శిఖరం కట్టి దీనికి ఆలయ రూపం యిచ్చినారు వరవర నరసింహారావుగారు ఈక్షేత్రాన్ని ఉద్ధరించి ఆలయం ముందు రెండు సత్రాలుగూడ కట్టించినాడు.

ఇది చక్కని ఏకాంత ప్రదేశం. తపస్సుకు అనువైన స్థలం.

రామేశ్వరాలయం - చిన్న రామేశ్వరం

ఈ గ్రామం షాద్‌నగర్ మండలంలోని విట్యాల సమీపంలో ఉంది. ఇది షాద్‌నగర్‌కు ఎనిమిది కిలోమీటర్లు ఉంటుంది ఇక్కడగల రామేశ్వరుడు ఈ తాలూకాలో ప్రసిద్ధి.

ఈ స్వామిని శ్రీరాముడే ప్రతిష్ఠించినట్లు ప్రజలు నమ్ముతారు. ఇది స్వయంభూలింగం. నల్లగా నిగనిగలాడుతూ నేరెడు పండులాగ ఉంటుంది. కాకతీయుల కాలంలో ఈ ప్రాంతాన్ని పాలించిన గోనరెడ్లు రామేశ్వర స్వామి భక్తులు కాబట్టి ఇక్కడి స్వామి ఆనాటివాడు కావచ్చు.

ఈ ప్రదేశం మొదట జిల్లెళ్ళ నివాసులైన దేశముఖుల సేరి. వారు రెడ్లు. స్వామి మొదట వారి భూమిలోనే ఒక రేగు చెట్టు క్రింద వెలసినాడు. అది చూచి మొదట ఆ రెడ్డి దొరలే స్వామివారికి మొదటి ఆలయాన్ని కట్టించినారు.

దొరల పిమ్మట ఈ సేరి అహమదుల్లాఖాన్‌గారి జాగీరులో చేరిపోయింది. ఈ ఆలయాన్ని అభివృద్ధిపరచిన వారిలో నరసింహదాసు చెప్పదగినవాడు. ఆయన హుమ్నాబాదు మాణిక్యప్రభు శిష్యుడు. నల్లగొండలో తహశీల్దారుగా పనిచేసి ఉద్యోగ విరమణానంతరం ఆశ్రమ స్వీకారంచేసి ఇక్కడనే నివసించినాడు.

మాణిక్య ప్రభువు ఒక పర్యాయం ఈ ఆలయాన్ని దర్శించినాడంటారు. అందుచేత ఆయన శిష్యుడైన నరసింహదాసు యిక్కడ నివసించినాడు. అతని సమాధి యిపుడక్కడ స్వామివారికి ఎడమ వైపున ఒక గదిలో ఉంది.

ఇది ప్రాఙ్ముఖాలయం. నిరాడంబరంగా ఉంది. చుట్టూ ఆవరణ మాత్రం విశాలంగా ఉంది. దానిలో సత్రాల గదులున్నవి.

ఆలయ ప్రధాన ద్వారంపై చిన్న గోపురం కట్టబడింది. దానిపై సిమెంటుతో శివపట్టాభిషేకం ప్రతిమలు చేయబడినవి. అవి క్రీ. శ. 1960 ప్రాంతంలో వరదరాజులు అనే మద్రాసీ చేసినాడు.

ఈ ఆలయం ముందు కోనేరు వంటి చిన్న మడుగు ఒకటి ఉంది. భక్తులు దానిలో స్నానం చేసి స్వామిని దర్శిస్తారు. అర్చిస్తారు.

ఇది మధ్వల క్షేత్రం. నిత్య జాగృత స్థలం. చాతుర్మాస్యాల లోను, ఇతర పర్వదినాలలోను ఇక్కడ విశేషార్చనలు జరుగుతవి. షాద్‌నగర్ నివాసి డా. వి. రామాచారిగారు రెండు తడవలు యిక్కడ పెద్ద ఎత్తున యజ్ఞాలు చేసినాడు. అంతేకాక, ఏకాదశులు ప్రారంభించి నాడు.

ఈ స్వామిపై బాలానగర్ నివాసి కంబం వీరరామయ్యా గారు క్రీ. శ. 1870 పింగళ సం॥ర మాఘమాసంలో ఆశువుగా శ్రీమద్రామ లింగ శతకం చెప్పినాడు. అది భక్తుల సహాయంతో ముద్రింపబడింది. ఈయన కవిత్వం ప్రౌఢంగా ఉంటుంది.

వీరరామయ్యగారు వ్యాధిచేత కాళ్ళు పడిపోయి నడువలేక బండి కట్టుకొని వెళ్ళి స్వామివారి ఎదుట శతకం చెప్పిన పిమ్మట అచ్చటి నుంచి లేచి నడిచి వచ్చెనట.

రామాలయం - తొమ్మిదిరేకుల

ఇది షాద్‌నగర్ తాలూకాలోని కేశంపేట మండలంలోగల గ్రామం. అప్పకవి దీన్ని నవదళపురం అని పేర్కొన్నాడు. దీనికి దక్షిణం దిక్కున ఒక వాగు ఉంది. అది ఈ గ్రామానికి తూర్పున ఉన్న నేదునూరు గుట్టంలో పుట్టి పారుతుంది దానికి "లింగదొన" అని పేరు. దీని ప్రక్కన ఇపుడదేపేర ఒక గ్రామం గూడా ఉంది. దాన్ని "లింగ దండె" లింగధనం అనికూడ పిలుస్తున్నారు. ఇది తొమ్మిదిరేకులకంటె మొదటి గ్రామం.

పూర్వం అక్కడ ఒక పెద్ద శివాలయం; దానిలో ఒక శివయోగి ఉన్నాడు. ఆయన దగ్గర ఒక మంత్రదండం ఉన్నది. దానికి లింగ దండం అని పేరు. ఈయన శక్తి ఉపాసకుడు.

"లింగదొన" అనే వాగుకు రెండవ వైపున తొమ్మిదిరేవులున్నవి. ఆయన ఆ రేవులలో కూర్చుని శక్తి ఉపాసన చేసేవాడు. అక్కడ ఆయన ఉన్న కాలంలో నేటి నసరుల్లాబాదుపై మహమ్మదీయుల దాడి జరిగింది. అపుడాయన దాన్ని తన మంత్రదండంతో ఎదుర్కొన్నాడు. అది చూచి అక్కడి నుండి మహమ్మదోద్దీన్-కరీముద్దీన్ అనే వలీలు వచ్చి అక్కడ నివసించి ఆయనను జయించినారు. ఇపుడు వారి సమాధు లక్కడున్నవి

స్థానికమైన కైఫియతులలో తొమ్మిదిరేకులను తొమ్మిదిరేవుల అనే వ్యవహరించినారు. ఇపుడక్కడ గ్రామస్థులు రామాలయ నిర్మాణం చేసినారు. దాన్ని స్థానికుడైన కరణంగారు చేయించినాడు. ఏటా రామ నవమికి ఇక్కడ కల్యాణం నడుస్తుంది.

శివాలయం - మామిడిపల్లి

మామిడిపల్లి కొత్తూరు మండలంలోని గ్రామం. ఈ జిల్లాలోని అచ్చంపేట తాలూకాలోగల మామిళ్ళపల్లిలో నృసింహాలయం ఉండగా ఈ గ్రామంలో శివాలయం ఉంది. ఇది గ్రామానికి వెలుపల ఉండి ప్రశాంతమైన వాతావరణంలో వెలసింది. ఈ ఆలయం చాలా పెద్దది. దానికి తగినట్లు ఆలయంలోని శివమూర్తి గూడ మిక్కిలి పెద్దది. ప్రాచీనమయింది. అయితే ఈ శివలింగం అన్నిటివలెగాక దీనిపై అన్ని సన్నని గిరలు తీర్చబడినవి ఇది ఈ శివలింగం యొక్క ప్రత్యేకత.

ఈ ఆలయానికి చుట్టూ ప్రాకారం, దానిలో సత్రాలు గూడ ఉండి యాత్రికులకు వసతిగా ఉంది.

రంగనాయకాలయం - మొగిలిగిద్ద

గిద్దె కన్నడ పదం. దానికి కుంట అని అర్థం. ఇది షాద్‌నగర్‌కు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉంది. దీన్ని రాకమచెర్ల వెంకటదాసు, వెలికట్టె నరసింహాచార్యులుగారలు / కేతకీపురం - కేతకీ తటాకం అని పేర్కొన్నారు.

ఇక్కడ గ్రామానికి వాయవ్యంగా సుమారు మైలు దూరంలో ఒక గుట్ట, దానిపై రంగనాయకాలయం ఉన్నవి. ఆ ఆలయానికి గ్రామానికి నడుమ అక్కడగల మొగుళ్ళకుంట ఉంది. దాన్నిబట్టియే ఆ గ్రామాన్ని మొగిలిగిద్ద అన్నారు.

ఇది చోళులనాటి ఆలయం. దక్షిణాభిముఖంగా ఉంది. రంగనాథాలయాలు ఎక్కడ ఉన్నా దక్షిణాభిముఖంగానే ఉండటం పరిపాటి.

ఈ గ్రామం పూర్వం చించేడు ప్రభువుల మఖ్తా. వారిక్కడ సింగరాయకొండనుండి తిరుమల సామవేదం వారిని తెచ్చి అర్చకులనుగా నిలిపినారు. ప్రస్తుతం ఆ వంశానికి చెందిన రంగాచార్యులుగారు పూజారిగా ఉన్నారు. ఆయన తెలంగాణంలోని అర్చక సమాఖ్యకు ఏకైక ప్రతినిధి.

ఈ వంశంవారు ఈ ఆలయాభివృద్ధికి ఎంతో కృషి చేసినారు. అంతేకాక, అక్కడ ఉడయవరుల ప్రతిష్ఠ గూడ చేయించినారు. ఇక్కడ స్వామివారి మూర్తి, ఉడయవరుల మూర్తి పెద్దగా మిక్కిలి సుందరంగా ఉన్నవి.

ఇక్కడి రంగనాథాలయంలోని ఉడయవరులను, వెలికట్టలోని పోచమ్మను గొల్లపల్లివారు అనే శిల్పులు చేసినట్లు చెబుతారు.

అంబాభవాని ఆలయం - వెలికట్ట

ఇది షాద్‌నగర్ సమీపంలోని గ్రామం; పర్గిరూటులో ఉంది. కేంద్రానికి అయిదు కిలోమీటర్లు ఉంటుంది. ప్రస్తుతం ఇది మాల వెలికట్ట-వెలికట్ట అని రెండు భాగాలుగా ఉంది. వెలికట్ట రోడ్డుకు ఎడమవైపున, మాలవెలికట్ట కుడివైపున రోడ్డుకు కిలోమీటరు దూరంలో ఉంటవి. ఈ వెలికట్టలో అంబా భవాని ఆలయం ప్రసిద్ధి. అది అతి పురాతనమయింది

ఇక్కడ గ్రామానికి దక్షిణంగా మరో కిలోమీటరు దూరంలో ఒక గుట్ట, దానిపై అనంతస్వామి ప్రతిష్ఠ ఉంది. కాని ప్రస్తుతం అక్కడ ఆలయం మాత్రమే మిగిలింది.

వెలికట్టలో అంబా భవాని ఆలయానికి కుడివైపున, ప్రాకారం వెలుపల శివాలయం ఉంది.

ఈ ఆలయాన్ని మాణిక్యరాయలు కట్టించినట్లు చెబుతారు కాని అతడెవరో తెలియదు. వీరు ముగ్గురు సోదరులని, ఒకాయన అక్కడ ఒక పెద్ద మేడ కట్టించినాడని, మరో ఆయన చెరువు వేయించినాడని చెబుతారు.

మూడవ ఆయన మాణిక్యరాయలు గుడి కట్టించినాడు. వీరి యింటి పేరు అంతేవారు. వీరు నారాయణపేట నివాసులు.

ఇక్కడి ఆలయం చోళుల నాటిది కనుక దానిని మాణిక్య రాయలు కట్టించి ఉండడు. బహుశః ఖండస్ఫుటిత జీర్ణోద్ధారం చేసి ఉంటాడు.

వెంకోబా నాయక్ హైదరాబాదు నుండి రామేశ్వరరాయలను విడిపించుకొని వెళ్ళిన పిమ్మట గోవిందనాయక్ గారికి అంబా భవాని మహిమ తెలిసింది. ఆయన స్వయంగా వచ్చి దేవిని దర్శించి యిక్కడ ఉత్సవం ఏర్పాటు చేసినాడు

వెలికట్టలో మాలపోచమ్మ ప్రసిద్ధి. ఆమె గుడికూడా ఈ భవాని ఆలయంలోనే ఉంది. గోవిందనాయక్ వరకు ఈ దేవిని ఒక గుండ్రని రాతిని పెట్టి పూజించే వారు. నాయక్‌గారు ఆమెకు చక్కని మూర్తిని చేయించి గుడి కట్టించినారు.

ఈ భవాని ఆలయం విశాలంగా, గంభీరంగానూ ఉంది. దాని ముందు ఎత్తయిన దిగంబర భైరవమూర్తి ఉంది. అతని ఎదురుగా రెండు రాతికొట్టెలు పాతి ఉన్నవి. పూర్వం వానిలో నవరాత్రి సందర్భాలలో మధుమాంసాలు నింపబడేవట. గోవిందనాయక్ గారు అది మాన్పించి అందులో గుగ్గిళ్ళు నింపే ఆచారాన్ని ప్రవేశపెట్టి ఆ ఉత్సవాన్ని గూడ కొంత మార్చినాడు.

ఈ ఆలయం ముందు దీపస్తంభం, దీపస్తంభం వలె గాక విమానంగా కట్టబడింది. దానిపైకి మెట్లున్నవి. అది మొదట గుడికి ఎడమ వైపున గల కోనేటి దగ్గర ఉండేది. అది కూలిపడగా అదే రాయితో అలాగే యిపుడున్న చోట కట్టినారు.

ఇక్కడ తెలుగువారు పూజారులుగా ఉన్నారు. నవరాత్రి ఉత్స వాలు ఘనంగా జరుగుతవి. ప్రస్తుతం వెంకోబా నాయక్‌గారి వంశం హైదరాబాదులో ఉంది. వారే వచ్చి ఈ ఉత్సవాన్ని నడిపిస్తారు. తమ యింటిలో ఏ చిన్న ప్రయోజనం అయినా వచ్చి ఈ దేవతకు మ్రొక్కి వెళతారు.

ప్రస్తుతం హైదరాబాదులో ఉన్న కార్డియాలజిష్టు సుధీర్ నాయక్ గారు ఇదే వంశానికి చెందుతాడు.

చూ. వివరాలకు-ఆరాధన-ఫిబ్రవరి-1987 మాతంగిక్షేత్రం.

మా జిల్లాలోని కొన్ని వెంకటేశ్వరాలయాలు

మా జిల్లాలో విష్ణువు ముఖ్యంగా కృష్ణుడు - కేశవుడు, నరసింహుడు - నారాయణుడు, రంగనాథుడు, రాముడు, అనే రూపాలలో ఎక్కువగా పూజింపబడినాడు. ఈ మూర్తులలో మళ్ళీ అంతర భేదాలు గూడ విలసిల్లినవి.

ఇక వీటన్నిటికి తోడు "కలౌ వేంకటనాయకః" అని వెంకటేశ్వరుని రూపంలో అందరికంటే ఎక్కువగా పూజింపబడినాడు. కాబట్టి మా జిల్లాలోని ప్రసిద్ధమైన కొన్ని ఆ స్వామివారియొక్క ఆలయాలను గురించి వినండి.

1. అంజనగిరి

దీనికి గట్టుకాడి పల్లె అని సామాన్యుల పేరు. ఇది ఖిల్లా గణపురానికి దక్షిణంగా రెండు కిలోమీటర్ల దూరంలో దేవుని గుట్ట అవతల ఉంది. ఇక్కడ వెంకటేశ్వరాలయం ప్రసిద్ధి.

అంజనగిరి మానాజిపేట జాగీరులోనిది. దాని పాలకులు తూము వారనే రెడ్లు. వారు సాహిత్య ప్రియులు, కవులు, పండితులు.

పూర్వం వారింటి ఆడపడుచు నొకామెను నాగర్ కర్నూలు తాలూకాలోని బిజ్జనపల్లెకు ఇచ్చినారు. ఒకప్పుడా దొరగారి ఇంటికి ఒక గోసాయి వచ్చినాడు. ఆయన వెంట ఒక ఒంటె, ఇద్దరు శిష్యులుండే

వారు. అతడు లక్ష్మీ ఉపాసకుడు. ప్రతి శుక్రవారం తన దగ్గరుండే అసరబ్బీలు పీఠంపై పోసి లక్ష్మీపూజ చేసేవాడు. అది చూచి దొరగారి కన్నుకుట్టింది. ఒక రాత్రి ఆయనను దారుణంగా హింసించి చంపి అవి దక్కించుకున్నాడు.

దొరగారికి బంగారం దక్కింది గాని కోటసేలు దప్పింది. అతని ఉసురు ముట్టి తాను అచిరకాలంలోనే గతించినాడు. ఆయన భార్య విధవయై ఆ ధనంతో తనవారిల్లు చేరి విరాగిణియై తమ ధనాన్ని వెంకటేశ్వరుని కర్పించవలెనని తిరుపతికి ప్రయాణం కట్టగా ఒకనాటి రాత్రి స్వప్నంలో స్వామి "నీవు నా దగ్గరకు రానక్కరలేదు. నేనే మీ దగ్గరకు వస్తాను. నాకు ఒకచోట ఆవాసం ఏర్పాటు చేయ"మని ఆదేశించినాడు. ఆమె మేలుకొని ఆ స్వప్నానికి ఆశ్చర్యపడి స్వామి వారిక్కడ ఎక్కడికి వేంచేస్తారు? నేనెక్కడ గుడి కట్టించవలెనని ఆలోచిస్తుండగా ఒకనాడు అంజనగిరిపై గొఱ్ఱెలకాపరి ఒకనికి స్వామి వారావేశించి, మీ దొరగారి నిక్కడికి రమ్మను నేనిక్కడ వెలసినాను అని పలికించినాడు. అది విని తోటివారు వెళ్ళి మానాజిపేట దొరగారికి చెప్పగా ఆయనవచ్చి చూచినాడు.

ఆ గుట్టపై ఒక విశాలమైన గుండు క్రింద పశ్చిమాభిముఖంగా రాతి గోడకు ప్రకృతి సిద్ధమైన గూటిలో స్వామివారు వెలసి దర్శనమిచ్చినారు. అదిచూచి దొరగారబ్బురపడి అక్కడనే చిన్నగర్భగుడి మంటపం కట్టించి స్వామివారికి నిత్యార్చన, ప్రతి శనివారం మంగళ వాద్యాలతో విశేషార్చన ఏర్పాటు చేసినాడు.

కొంతకాలం జరిగింది. స్వామి వెలసిన చోటికి గుట్టపై ఆరు ఫర్లాంగులు వెళ్ళవలెను. అది యాత్రికులకు కష్టమని స్వామి తనకు గుట్ట క్రిందనే ఒక కోవెల నిర్మించ వలసినట్లుగా మళ్ళీ ఆదేశించినాడు. దానితో ఇపుడక్కడ ఉండే కోవెల ఆమె ధనంతో వెలసింది. తూము రామచంద్రా

రెడ్డి గారు ఈ స్వామిపై అలమేలు మంగా పరిణయం అనే కావ్యం గూడా రచించినాడు.

ఈ ఆలయం ప్రాఙ్ముఖంగాను ప్రాకారద్వారం దక్షిణాభిముఖం గాను వుంటవి. ఆవరణలో యాగశాల, అధ్యయన మంటపం, ఆళ్వారు ప్రతిష్ఠ ఉన్నవి. అవిగాక స్మార్తులకు, వైష్ణవులకు వేర్వేరు వంటశాల లున్నవి. సత్రాలు వివాహాది శుభకార్యాలకు అనుకూలంగా ఉన్నవి.

స్వామివారి మూలబేరం మాత్రం గుట్టపై మొదట వ్యక్తమైన చోటనే ఉంది. ఆలయంలో ఉత్సవబేరం, యాగబేరం, శయ్యాబేరం ఉన్నవి. మూలబేరం పైననే ఉంది కాబట్టి ఇప్పటికి ప్రతిదినం పూజారులు పైకి వెళ్ళి స్వామిని అర్చించి వస్తారు.

క్రింది ఆలయంయొక్క గోపురం శిల్పవిరాజితమై గంభీరంగాను, సుందరంగాను ఉంది. ఇక్కడి ఆళ్వారు ప్రతిష్ఠను ఘటకేశ్వర నివాసి చెన్నయ్యగారు చేయించినాడు. ఈయన ఈ ఆలయాభివృద్ధికి చిత్తశుద్ధితో భూరి విరాళం ఇచ్చినాడు.

ఈ ఆలయంలో మొదటి పూజారులు అర్చకం వారు వారు ఇద్దరు సోదరులుండేవారు. వారు నిస్సంతుగా గతించినారు.

అంతవరకిక్కడ ఉత్సవ సమయంలో తిరుపతినుండి నడాదూరు వారు, పింజమూరి వారనే కుటుంబాలవారు పారాయణకు వచ్చేవారు. వారికి ఇక్కడ కట్టడి ఉండేది. మొదటి పూజారులు గతించడంతో దొరలు స్వామివారి అర్చనకై వారిని ఇక్కడ శాశ్వతంగా నిలిపినారు.

ఇపుడీ ఆలయం వారి ఆధీనంలోనే ఉంది. శ్రీశ్రీ అభినవ రామానుజ బ్రహ్మతంత్ర పరకాల మహాదేశికులవారు దీనికి యజమానులై

తీర్థపరిగ్రహం చేసినారు. ఇపుడు వారివైపునుండి షాపురం రామాచార్యుల వారు ఏజంటుగా ఉండి ఆలయ విధులను, అభివృద్ధిని పర్యవేక్షిస్తున్నారు. శ్రీమాన్ దేశికాచార్యులవారు అర్చకులుగా నున్నారు.

దీనికి గద్వాల, వనపర్తి మొదలైన సంస్థానాలవారందరు యథాశక్తి దానం చేసినారు. మానాజిపేటవారు తమ జాగీరులోని పదకొండు గ్రామాలలో ప్రతిచోట కొంత భూమిని ఇచ్చినారు. మానాజిపేట నివాసి మంగళహారతి అప్పలాచార్యులవారు శివరాజ బహద్దూరుగారి ఎస్టేటులోని షాపురాన్ని జాగీరుగా సంపాదించినాడు.

ఈ షాపురం ఖిల్లా గణపురం దగ్గర గల బంగారుగుండు గట్టు క్రింద ఉంది. కాబట్టి బంగారు షాపురం అని దానికి మరోపేరు. అక్కడ కిళాంబివారనే ప్రసిద్ధమైన వైష్ణవులున్నారు. వారి పూర్వులు కర్ణాటకలోని హుబ్లీ జిల్లానుండి వచ్చినారు.

రాణి శంకరమ్మగారి కాలంలో శివరాజ బహద్దూరుగారి ఎస్టేటును వనపర్తివారు తమ సంస్థానంలో కలుపుకోవటానికి యత్నించినారు. అపుడీ ఆలయం దాని ఆస్తులు అన్నీ వారి చేతిక్రిందికిపోయే ప్రమాదం ఏర్పడింది. అది చూచి షాపురం రంగాచార్యులవారు వనపర్తివారికి అడ్డు తగిలి శివరాజుగారి ఎస్టేటుకు స్వతంత్ర ప్రతిపత్తి నిలిపి తరువాత ఈ ఆలయాన్ని మైసూరులోని పరకాల మఠంవారికి అప్పగించినాడు.

ఇక్కడ మాఘంలో బ్రహ్మోత్సవం నడుస్తుంది. తేరు పెద్దగాను అందంగాను ఉంది. జాతర వైభవంగా నడుస్తుంది. ఇపుడీ గ్రామం వనపర్తి మండలంలో ఉంది.

2. అమడబాకుల

ఇది కొత్తకోట మండలంలోని గ్రామం. ఈ గ్రామ సమీపంలో ఒక గుట్ట ఉంది. దానిపై ఈ ఆలయం కట్టబడింది. ఇది ప్రాచీనాలయాలలో ఒకటి. దీనికి చుట్టుప్రాకారం, గాలిగోపురం ఉన్నవి. ప్రశాంతమైన వాతావరణంలో ఉన్న ఈ ఆలయం చూపరులను చక్కగా ఆకర్షిస్తుంది.

3. ఆమనగల్లు

ఆమనగల్లు కల్వకుర్తి తాలూకాలోని గ్రామం. హైదరాబాదు కల్వకుర్తి దారిలో ఉంటుంది. కల్వకుర్తికి 12 Km. ఉంటుంది. ఇపుడిది ఒక మండల కేంద్రంగా ఉంది.

ఈ గ్రామాన్ని మొదలు పుష్పగుచ్ఛం అని పిలిచేవారట. ఆ తరువాత అది ఖుష్ ఖుషాబాదుగా, ఆ తరువాత ఆమనగల్లుగా నిలిచింది.

మొదలిక్కడ బ్రాహ్మణ దొరలున్నారు. వారు దేశీయులు. ఆ వంశంలో అన్నమ రాయడు అనే అతడు ఇక్కడ మొదట కోట గట్టినాడు. అందుచేత ఇది అన్నమరాయగడము అయి ఆమనగల్లు అయింది.

ఇక్కడ వెంకటేశ్వరాలయం, శివాలయం ఉన్నవి. వెంకటేశ్వరాలయం కడ్తాల దారిలో కిలోమీటరు దూరంలో ఒక గుట్టపై ఉంది. ఇపుడు గ్రామం దాదాపు కలిసిపోయింది. ఇక్కడ వెంకటేశ్వరస్వామి మొదట ఒక గుండు రూపంలో వెలసినాడు. తరువాత దానిప్రక్కన దేవతా రూపమూర్తిని ప్రతిష్ఠించినారు. ఇపుడీ ఆలయం మంచి అభివృద్ధిలో ఉంది. ఇంతటి ఆలయం ప్రస్తుతం ఈ ప్రాంతంలో లేదు.

ఇక్కడ ఫాల్గుణ శుద్ధ షష్ఠినుండి ఏకాదశివరకు ఉత్సవం జరుగుతుంది. అంకురార్పణం, ధ్వజారోహణం, భేరీపూజ, అగ్నిప్రతిష్ఠలు, ఆరాధన, ఎదురుకోలు, గరుడసేవ, హోమం, నాలుగవనాడు కల్యాణోత్సవం, ఆ రాత్రే రథోత్సవం జరుగుతవి. మరునాడు బండ్లు వెళ్ళుతవి. ఆనాడు స్వామి అశ్వవాహనంపై ఊరేగుతాడు. ఆరవనాడు పూర్ణాహుతి జరుగుతుంది. గూడావారు అనే వైష్ణవులు ఇక్కడ పూజారులుగా ఉన్నారు. ఈ స్వామికి ప్రజలు మ్రొక్కుబడుల క్రింద వెండి మీసాలు, ఊగుడు బిల్లలు సమర్పిస్తారు.

4. ఉత్తనూరు

ఇది ఐజ మండలంలోని గ్రామం. గద్వాలకు దక్షిణంగా 40 కిలో మీటర్లు ఉంటుంది. మొదలికల్లు శేషదాసులవారు ఇక్కడ కొంత కాలం తపస్సు చేసినాడు.

ఇది వెంకటేశ్వర ప్రధాన క్షేత్రం. గద్వాల సంస్థానంగా ఉన్న కాలంలో అక్కడి ప్రభువులు ఈ ఆలయానికి సహాయం చేస్తుండేవారు. ఇది సిద్ధ ప్రదేశం అని చెప్పబడుతూ ఉంది.

5. ఎక్లాస్ పురం

ఇది నారాయణపేటకు మూడు మైళ్ళ దూరంలో ఉంది. అదే మండలానికి చెందుతుంది. ఇక్కడి స్వామి తిమ్మప్పగట్టుపై ఒక శిలలో ఆవాహన అయినాడు. దీన్నిబట్టే ఈ గ్రామానికి ఏకశిలాపురం అనే పేరేర్పడి జనుల నోళ్ళలో "ఎక్లాస్‌పురం" అయింది.

నారాయణపేట లక్ష్మమ్మ దొరసానిగారు వెంకటేశ్వరునికి అనన్యమైన భక్తురాలు. ఏటేట వెళ్ళి స్వామిని దర్శించుకొని వచ్చేది. ఒకప్పుడొక భక్తుడు తన కంటికేదో వ్యాధి అంకురించి తిరుపతి వెళ్ళి

స్వామివారిని ప్రార్థించగా అతనికి నారాయణపేట లక్ష్మమ్మగారి దగ్గరకు వెళ్ళమని స్వామివారి ఆదేశమయింది. అతడు వచ్చి లక్ష్మమ్మగారిని దర్శించి తన విషయం చెప్పుకున్నాడు. ఆమె ఏదో మూలికా వైద్యం గూడ చేసేది. కాబట్టి తన దగ్గరకు వచ్చిన భక్తుని కంటికి ఏదో మందు ఇచ్చింది. కన్ను నెమ్మదించింది. ఆ పిమ్మట ఆమె స్వామికి తనపైగల దయకు విస్మయపడి "స్వామీ! వృద్ధురాలనైనాను. మీ దర్శనానికి రాలేను. ఇక్కడనే ఎక్కడనైనా సేవాభాగ్యం ఇప్పించు" అని వేడుకొన్నది. అపుడామెకు స్వప్నంలో "ఫలానాచోట నా చిహ్నాలు కనిపిస్తవి. నేటి నుండి నీవు అవే నేనుగా భావించి సేవించు" అని సెలవిచ్చినాడు. ఆ కలకు అద్భుతపడి ఆమె మరునాడు వెళ్ళి చూడగా తిమ్మప్పగుట్టపై వున్న నిలువురాతిపై శంఖచక్రాలు కనిపించినవి. అంత ఆమె ఆ రాయినే స్వామిగా భావించి దానికి గుడి కట్టించింది.

ఈ ఆలయం సామాన్య పద్ధతిలోనే వుంది. ప్రజలు దీన్ని తిమ్మప్ప గుడి అని పిలుస్తారు. దానికి 16-11-1972 నాడు శ్రీశ్రీశ్రీ జడ సిద్ధప్ప స్వామివారి శిష్యుడు శ్రీయుత కోనేళ్ళ ఆశప్ప మరియు ఆయన సతీమణి అనుమక్కగారలు వైకుంఠద్వారం నిర్మించినారు.

6. కానపురం

ఇది బిజనపల్లె మండలంలోని ఊరు - పాలెం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. పూర్వం ఇక్కడ గ్రామం లేదు. ఇది అంతా పెద్ద అడవి.

వర్ధమానపురం గోన-మల్యాల వారి పిమ్మట "కూచకుళ్ళవారు" అనే రెడ్డి దొరల చేతికి వచ్చింది. అపుడు వారక్కడ కోటగట్టుతూ దూలాలకై ఈ అడవికి వచ్చి అవి కొట్టుకుని బండ్లకు ఎత్తుకుని కొంతదూరం సాగిన పిమ్మట అవి ఆగిపోయినవి. అపుడొక వ్యక్తిపై నిండి ఇక్కడనే

నున్నాను. నన్ను పైకి తీసి ప్రతిష్ఠించండి అని చెప్పుకున్నాడు. అది విని దొరగారక్కడ త్రవ్వించగా సుందరమైన విష్ణు ప్రతిమ ఒకటి బయట పడింది. అపుడు దొరగారక్కడ ఒక పెద్ద గుడి కట్టించి స్వామినందులో ప్రతిష్ఠించినాడు. లోకలు రికార్డులలో ఈ స్వామికి ఆనాడు వెంకటేశ్వరు డనే వ్యవహారం కాని యిపుడు చెన్న కేశవుడంటున్నారు.

పాలెంలోగూడ ఇప్పటి వెంకటేశ్వరునికంటే మొదట మరో వెంక టేశ్వరుడుండేవాడు. వట్టెం, వడ్డవాని పాలెం మొదలైన గ్రామాలలోని ప్రాచీనమైన ఈ శిలా ప్రతిమలన్నీ ఒకే విధంగా ఉన్నవి.

దొరగారిక్కడ ఆలయం కట్టించగానే దాన్ని అనుసరించి ఊరేర్ప డింది. అంతవరకు ఇది అడవి కాబట్టి ప్రజలపుడు ఇక్కడి ఊరును "కానపురం" అన్నారు.

స్వామిని ఇక్కడ ప్రతిష్ఠించిన నాటికి ఈ ప్రాంతంలో పాంచ రాత్రం చదివిన పూజారు లెవరూ లేరు. ఈ గుడికి శాశ్వతమైన పూజారి గూడ లేదు. అపుడు స్వామి మళ్ళీ ఒకసారి ఒకరి కావేశించి తనకు శాశ్వతమైన పూజారిని ఏర్పరచమని కోరుకున్నాడు.

అంతవరకు ఇక్కడి వైష్ణవులంతా ఏటా ఒక పర్యాయం తిరు పతికి వెళ్ళి, శ్రీనివాసుని దర్శనంచేసి, తీర్థప్రసాదాలు తీసికుని వచ్చేవారు కాబట్టి ఆ యేడుగూడ అదే ప్రకారం వెళ్ళగా, వారికి స్వామి కలలో కనిపించి మీకు దారిలో ఇద్దరు వడహాల సోదరులు కనిపిస్తారు. వారిని కొనివెళ్ళి మీ ఆలయాలలో అర్చకులుగా నిలుపుకొండి. మీకు తీర్థప్రసాదా లిచ్చి తరింపచేస్తారని చెప్పినాడు. అది విని వారు ఇంటికి వస్తుండగా ఒకచోట సంచారంకొరకై బయలుదేరిన రంగడు - తిరువెంగళుడు అనే సోదరులు నిత్యకర్మానుష్ఠానాలకై మర్రిఆకులు తెంపుకుంటూ వారికి కని

పించినారు. వారిలో ఇంటికి వస్తున్న వారికి స్వామివారు చెప్పిన లక్షణాలు కనిపించినవి. అది చూచి వారు ఆ సోదరులను ప్రార్థించి తమవెంట కొనివచ్చినారు.

వారు శ్రీరంగపురవాసులైన నంబులు. వారి యింటి పేరు తిరునగరివారు. వారు వచ్చేనాటికి నాగర్‌కర్నూలు తాలూకాకు "నాగోలు సీమ" అని పేరు. వారీ సీమకు వచ్చి "వట్టెం" గ్రామాన్ని తమ నివాసంగా చేసికొని వట్టెం బిజనపల్లె చెన్నకేశవస్వామికి, పాలెం వెంకటేశ్వరస్వామికి, వెల్లగొండ-బాజీపురం-కారుకొండ - లింగసానిపల్లె అంజనేయస్వామికి, మామిళ్ళపల్లి నృసింహస్వామికి, బాదేపల్లి రంగనాయకస్వామికి, వారితోపాటు ఇక్కడి వెంకటేశ్వరస్వామికి గూడ తమ వంశీయులను పూజారులుగా నిలిపినారు. ఈ సోదరులు క్రీ. శ. 1750 ప్రాంతానికి చెందుతారు. కానాపురంలో ప్రస్తుతం వారి వంశమే పూజారులుగా ఉన్నారు.

ఇక్కడి ఆలయం మొదట చాలా పెద్దగా ఉన్నది. ఇంటివైభవం వాకిలే చెబుతుంది. అలాగే ఆలయవైశిష్ట్యం దాని శిఖరం చెబుతుంది. ఆ కాలంలో దీని శిఖరంపై ఉన్నంతటి చక్రం ఈ జిల్లాలో మరెక్కడా లేదు. అది కృష్ణశిలానిర్మితం కావటం దాని విశేషం-కాని కాలాంతరంలో ఈ ఆలయ మంటపం శిఖరం కూలిపోగా అది క్రింద పడిపోయింది. అయినా భిన్నంగాలేదు. దాన్నిపుడు ఆలయంలో ఉంచినారు.

ఆ విధంగా ఎప్పుడో కూలిపడిన ఈ ఆలయాన్ని క్రీ.శ. 1937లో బానూరు లక్ష్మయ్యగారి కూతురు చిదిరె వెంకటరామమ్మగారు మళ్ళీ ఇపుడున్న రీతిలో కట్టించింది. ఈమె భర్త రాజయ్యగారు.

ఇక్కడ దీనితోపాటు చెరువుగట్టున ఒకటి, ఈ ఆలయం ముందొకటి-రెండు హనుమదాలయాలున్నవి. ఈ గుడిముందు కలదాన్ని పోతా

రెడ్డి వల్లెనుండి యిక్కడికి దత్తు వచ్చిన కరణం హనుమంతరావుగారు కట్టించినారు.

ఇపుడీ గ్రామంలో దొరగారైన శ్రీ కూచకుళ్ళ హనుమంతారెడ్డి గారు "దత్తారామ విద్యాలయం" పేర ఒక గురుకుల విద్యాలయాన్ని ప్రారంభించినారు. అదికూడ ఈ మండలంలో చూడదగినవానిలో ఒకటి.

7. కురుమతి

కురుమతి వెంకటేశ్వరాలయం ఒక పెద్ద గుట్టపై సికింద్రాబాదు ద్రోణాచలం లైనులో కురుమతి స్టేషనుకు దక్షిణంగా నాలుగు మైళ్ళ దూరంలో ఉంది. కురుమతి ఇప్పుడు చిన్న చింతకుంట మండలంలో ఉంది.

కురువ గ్రామంలో ఒక కుమ్మరికి వెంకటేశ్వరుడు తన రూపాన్ని చూపి ఇక్కడి గట్టుపై నిలిచినాడట. అందుచేత దీనికి కురుమూర్తి అని పేరేర్పడిందని స్థలపురాణం చెబుతుంది. ఇక్కడి గట్ల వరుసలో తిరుపతికి వలెనే ఏడు గుట్టలున్నవి. వానిలో దేవుని గట్టుపై స్వామివారి కోవెల ఉంది.

ఆయన అక్కడ ఒక గుహలో వెలసినాడు. అతని మూర్తి తిరుమలలో వలెనే నిలిచిన భంగిమలో ఉంది. ఈ స్వామి స్వయం వ్యక్తుడని స్థానికుల అభిప్రాయం. అతడు వెలిసిన గుహను పదునాలుగవ శతాబ్దంలో గర్భగుడిగా రూపొందించినారు. పిమ్మట దానికి ముందు మంటప గోపుర ప్రాకారాలు కట్టబడినవి.

ఆత్మకూరు ప్రభువులకు ఈ స్వామి ఇలవేల్పు. కాబట్టి వారిక్కడ ఎన్నియో నిర్మాణాలు కావించి ఈ క్షేత్రాన్ని మిక్కిలి అభివృద్ధిపరచినారు. గుట్టపైకి మెట్లు కట్టించి సత్రాలు విడుదులు నిర్మించినారు.

ఇక్కడ ప్రతి ఏటా కార్తీక శుద్ధ పాడ్యమి నుండి సప్తమివరకు స్వామివారి బ్రహ్మోత్సవం జరుగుతుంది. అపుడు సప్తమినాడు వడ్డవాని నుండి పంచములు స్వామివారికి ఉద్దాలు తెస్తారు. అది వారు స్వామివారికి చెల్లించే తమవంతు సేవ. అవి తెచ్చే వైభవం చూడ సంబరంగా ఉంటుంది.

ఈ గుట్టపై వెంకటేశ్వరునితోపాటు చెన్నరాయుడు గూడ ఉన్నాడు. వెంకటేశ్వరుని కంటే మొదలిక్కడ చెన్నరాయుడే ఉండెనట. ఒకపుడు శ్రీనివాసుడు కుబేరునకు చెల్లించవలసిన అప్పుకు తప్పుకొని లక్ష్మీదేవితో కృష్ణాతీరం వెంట ఇచటికి వచ్చి అలసిపోయి దీనిపై కొంత సేపు విశ్రాంతి తీసికొనెనట. అందుచేత నాటినుండి ఇది రెండవ వెంకటాచలమయింది.

ఈ క్షేత్రాన్ని గురించి "ఉత్తర వేంకటాచల మాహాత్మ్యం" అని తిరుమల బుక్కపట్టణం బుచ్చి వెంకటాచార్యులు, "శ్రీనివాస విలాసం" అని హొసదుర్గం కృష్ణమాచార్యులు కావ్యాలు వ్రాసినారు.

ఇటీవల శ్రీవైద్యం వెంకటేశ్వరాచార్యుల వారు ఈ క్షేత్రాన్ని గురించిన సమగ్ర చరిత్ర రచించినాడు. అది ముద్రితం.

8. కొత్తకోట

ఇది వనపర్తి తాలూకాలోని గ్రామం. ప్రస్తుతం ఒక మండల కేంద్రం. మొదలిక్కడ గ్రామం ఏదీ లేదు. వనపర్తి సంస్థానానికి మూల పురుషుడైన వీరకృష్ణ భూపతి పెద్దభార్య కొడుకు బసివిరెడ్డి పిత్రార్జిత మైన ఈ భూమిలో మొదట ఒక కోటను కట్టినాడు. అంతవరకు వనపర్తిలో పాతకోట ఉండేది. కాబట్టి ప్రజలు దీన్ని "కొత్తకోట" అన్నారు.

ప్రస్తుతం ఈ గ్రామంలో వెంకటేశ్వరాలయం ప్రసిద్ధంగా ఉంది. ఈ ఆలయాన్ని వనపర్తి ప్రభు వంశంలోని యిమ్మడి వెంకటరెడ్డి కట్టించి, అక్కడ ఒక చెరువు గూడ వేయించి, ఆ స్వామిపేర "వెంకట గిరి" అనే గ్రామాన్ని స్థాపించినాడు. ఈయన ఈ వంశంలోని మొదటి ఆలయ నిర్మాత.

వనపర్తి ప్రభువులలో అష్ట భాషా గోపాలరాయలు ప్రసిద్ధుడు. ఆయన దత్తపుత్రుడు. సవై వెంకటరెడ్డి తన పెంపుడు తల్లి జానమ్మగారి పేర - గోపాలరావుగారి భార్య - జానంపేటను, భార్యపేర కేశంపేటను ప్రతిష్ఠించి జానంపేటలో తన తమ్ముని ఉంచినాడు. ఇవీనాడు షాద్ నగర్ తాలూకాలోని గ్రామాలు.

జానంపేటను స్థాపించిన పిమ్మట దానిపై వెంకటరెడ్డిగారి కాలంలోనే నైజాం ప్రభువు పక్షంగా "ఫారుఖ్" అనే సూబేదారు దండెత్తగా ఆ యుద్ధంలో తమ్ముని పక్షం వెళ్ళి వెంకటరెడ్డి గూడా వీరస్వర్గమందినాడు.

అనంతరం జానంపేట నేటి పారుఖ్‌నగర్‌గా మారింది. ఆ పిమ్మట వెంకటరెడ్డిగారి కుమారుడు రెండవ గోపాలరాయలు కొత్తకోట దగ్గర గ్రామాన్ని అభివృద్ధిపరచినాడు.

ఇపుడిక్కడి వెంకటేశ్వరాలయాన్ని గ్రామస్థులు బాగా అభివృద్ధి చేసినారు. స్వామిని వెంకటగిరి, కొత్తకోట రెండు గ్రామాల ప్రజలు సేవిస్తారు.

9. కొత్తపల్లి - పెద్ద

ఇది కొల్లాపురం తాలూకాలోని గ్రామం. ఇపుడు ఒక మండల కేంద్రంగా ఉంది. ఈ గ్రామంలో వెంకటేశ్వరాలయం ఉంది. అది

ప్రాచీనమయింది. ఇది ప్రాఙ్ముఖాలయం. ఆవరణ విశాలంగా ఉంది. ఆలయం చోళుల నాటిది.

దీనిలో క్రీ. శ. 1975 లో శ్రీ చిక్కేపల్లి రామచంద్రరావు గారు ఆండాళు ప్రతిష్ఠ చేయించినారు.

10. కొమ్ముల గట్టు

ఇది వనపర్తి యిలాకాకు చెందినది. ఈ గుట్టపై నిలిచిన రెండు గుండ్లు దూరానికి దేశవాళీ ఎద్దు కొమ్ములవలె కనిపిస్తవి. అందుచేత దీనిని కొమ్ముల గట్టని పిలిచినారు.

బిజ్జనపల్లె గట్టు నందివలె, గొరిటకు పుల్లగిరికి నడుమ ఉండే గట్టు నిలిచిన గుఱ్ఱంవలె ఉంటవి. ఇవి ఇక్కడి ప్రకృతి పటంపై కనిపించే పర్వత చిత్రాలు. నందిగట్టున సరిగా ప్రొద్దు మూకుతుంది. అపుడు దాని వెనుక ఎఱ్ఱని వెలుగు, దానిపై నల్లని నంది చిత్రం ఎంతో చేయి తిరిగినవాడు వేసిన ఛాయా చిత్రంవలె కనిపించేది. కాని ఈనాడు రాయి తీసేవారు దాని రూపాన్ని చెఱిపివేసినారు.

ఈ ఊరు బిజ్జినపల్లె నుండి వనపర్తి రోడ్డులోని జంగమయ్యా పల్లెకు రెండు మైళ్ళు ఉంటుంది. ఇక్కడి గుట్ట ననుసరించి ఒక చిన్న వాగు పారుతుంది. దాన్ని రాళ్ళవాగు అంటారు. శ్రావణ మాసంలో ఇక్కడి ప్రకృతి మనోహరంగా ఉంటుంది.

ఈ గుట్టపై ఒక ప్రాచీనాలయం, రెండు పాత కోనేర్లున్నవి. ఇది ఒకపుడు మునులు తపం చేసిన స్థలం. ఇపుడు వారి ప్రతిమలిక్కడ పడి ఉన్నవి.

ఇక్కడి మూలస్వామి, గుట్టపైగల ఒక గుండుకే ఆవాహన అయినాడు. దాన్ని ఆధారంగా చేసికొనే ఈ ఆలయం కట్టబడింది. మూల విరాట్టు నెక్కొండ, మన్నెంకొండలలో గూడ ఈ విధంగా కొండరాళ్ళకే ఆవాహన అయినాడు. ఇట్టి వానిని భావనారాయణస్వామి అని పిలుస్తారు.

ఈ ఆలయాన్ని వనపర్తి రాణి శంకరమ్మగారు బాగు చేయించి ఒక విశ్రాంతి మందిరం గూడ గట్టించి ఉత్సవం ఆరంభించింది. అది సంక్రాంతికి మూడు దినాలు జరుగుతుంది. సంక్రాంతికి తెలుగుదేశంలో కోడి పందేలు ప్రసిద్ధి. ఒకప్పుడవి జోరుగా సాగేవి. అంతగా లేకున్నా ఇపుడు గూడ సాగుతున్నాయి.

పూర్వం తేరునాడు ఇక్కడ దానిముందు పదమూడు తోపులు పేల్చేవారు. ఈనాడిది లేదు.

ఈ ప్రాంతంలో వనపర్తి పెద్ద రామేశ్వరరాయల వారెంత పేరు చెందిన ప్రభువో, మియ్యా సాహెబు అంత పేరందిన చోరాగ్రేసరుడు. అతనికీ గట్టు ఆటపట్టుగా ఉండేదట.

ఈ స్వామి గంగవరంలో గల 'నలాదూరు' వారనే వైష్ణవులకు ఇలువేల్పు. వారిది మద్రాసు ప్రాంతమట. వారి మూల పురుషుడైన రాఘవాచార్యులు[1] సంతానం లేక యాత్రాటనం చేస్తూ ఒకపుడీ ప్రాంతానికి రాగా స్వప్నంలో అతనికి ఇక్కడనే ఉండి పొమ్మని స్వామి వారి ఆదేశమయిందట. ఆయన స్వామివారిని నమ్ముకొని ఇక్కడ నిలువగా సంతానం గూడ గలిగింది. కవలలు పుట్టినారు. వారికి వెంకటా చార్యులు, కృష్ణమాచార్యులని పేరు పెట్టుకున్నారు. ప్రస్తుతం వెంకటా

---

1. దేశాటనంలో ఈ రాఘవాచార్యులకు తల జడలుకట్టింది. అందుచేత ఇతనిని జడల రాఘవాచార్యులు అనేవారు.

చార్యుల వంశముంది. ఇప్పటి రాఘవాచార్యులు ఆ వంశంలో పదమూడవ తరంవాడు. ఈ స్వామిపై గోపాలుపేట రాఘవాచార్యుల వారొక శతకం వ్రాసినారు.

11. కోడంగల్లు

ఈ గ్రామం ఇపుడొక మండల కేంద్రం. ప్రాచీనమైన కేశవాలయ శివాలయాలు రెండూ ఉన్నవి. అవిగాక ఇపుడిక్కడ వెంకటేశ్వరాలయం వెలిసింది. అది మా జిల్లాలోనే గాక చుట్టుపట్ల జిల్లాలలో గూడ ప్రసిద్ధి చెందింది. దాన్ని నందారం నివాసియైన నరసింహులు గుప్త అనే వైశ్యుడు కట్టించినాడు.

స్వామి వారెక్కడనైన వెలయదలచినపు డెవ్వరిని ఏ విధంగా నిమిత్తమాత్రులను చేసికుంటాడో ఊహించలేం. అదే ఆయన లీల.

కల్వకుర్తి తాలూకాలోని ఉలపర గ్రామంలో పొంగలవారనే వైశ్యులున్నారు. ఆ వంశంలోని వెంకమ్మగారి కుమారుడు బుచ్చయ్యగారు, ఈయన కుమారుడు నరసింహ గుప్తగారు. ఇది వీరి వంశక్రమం.

నరసింహులుగారికి బాల్యంలోనే పితృ వియోగం కలిగింది. తల్లి గంగమ్మగారు బ్రతుకు దెరువు కొరకు శివారెడ్డిపల్లెకు వచ్చి కులీనుల ఇంట నీళ్ళు మోస్తూ కుమారుని పోషించుకోసాగింది. అపుడామె కష్టం చూడలేక ఊరిపెద్ద రెడ్డిగారు నరసింహులును పిలిచి ఏదైనా వ్యాపారం చేసికొని బ్రతకమని పది రూపాయలు చేతిలో పెట్టినాడు. నరసింహులవి తీసుకొని సంచి భుజాన వేసుకొని కోడంగల్లు అంగడికి వెళ్ళినాడు. అక్కడ అతనికి మిరపకాయ కనిపించింది. దాన్ని తీసుకొని వెళ్ళినాడు. నాలుగు పైసలు కనిపించినవి. దానితో వారం వారం. కోడంగలు అంగడిలో మిరపకాయ కొనివెళ్ళేవాడు. ఆ గ్రామంలో మిడిదుడ్డి

తిప్పయ్యగారనే సెట్టి ఉన్నాడు. అతనికి బుచ్చమ్మ అనే కూతురుండేది. అతని కన్ను నరసింహులుపై పడింది. పిలచి పిల్ల నిచ్చినాడు. నరసింహులు ఒక ఇంటివాడై, శివారెడ్డి పల్లెనుండి నందారం వెళ్ళి, సొంత కాపురం పెట్టినాడు దేవుని నమ్మిన వారికి ఎన్నడూ చెఱుపులేదనే సత్యం ఆయన జీవితం ఋజువు చేసింది.

కొందరికి కాపురం పెరుగుతూ ఉంటే కన్నులు మూసుకుంటుంటవి. కానీ నరసింహులు కట్లా కాలేదు. అవి తెరుచుకోసాగినవి. సంసారంతో పాటు స్వామివారిపై భక్తి గూడ పెరిగి, ఏటేటా తిరుపతి వెళ్ళి స్వామి వారిని సేవించుకో సాగినాడు. రానురాను ఆయనలో భక్తి పరిపక్వం కాసాగింది. ఏడాదికి బదులుగా నెలనెలకు వెళ్ళసాగినాడు. అపుడొకనాడు స్వామివారు కరుణించి, కలలో "ఇక నీవు నా దగ్గరకు రానక్కరలేదు. నేనే అక్కడికి వస్తాను. నాకొక నివాసం కల్పించు" అని ఆదేశించినాడు.

స్వప్న ప్రకారాని కద్భుతపడి మేలుకొన్నాడు. ఆలయమంటే మాటలు కాదు. ఒకనాటి ఒకయేటి ఆర్జన చాలదు. అయినా స్వామివారి ఆజ్ఞను శిరసావహించి తనవారినీ, గ్రామ పెద్దలనూ పిలుచుకొని స్వప్న ప్రకారం వినిపించినాడు. అది విని వారు ప్రోత్సహించినారు. అది కీలక సంవత్సర కార్తీకం. ఆ యేడు నరసింహులుగారికి కలిగిన స్వప్నం గ్రామానికే ఒక కీలక వత్సరమయింది. మరుసటి యేట వైశాఖ శుద్ధ త్రయోదశినాడు సౌమ్యంగా స్వామివారి ఆలయానికి శంకుస్థాపన జరిగి, సాధారణ జ్యేష్ఠ బహుళ త్రయోదశినాడు అసాధారణరీతిలో శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి ప్రతిష్ఠ జరిగిపోయింది.

ఇక్కడి ఆలయం తిరుపతి అంత విశాలమయింది కాకపోయినా స్వామివారి వైభవానికి అలంకారానికి తిరుపతికి తీసిపోదు. ఆలయం గూడ నేత్రపర్వంగాఉండి మహాలక్ష్మి వెంకటేశ్వరాలయం అన్నందులకు

సార్థకంగా లక్ష్మీవైభవం ఉట్టిపడి దర్శన మిస్తుంది అన్ని విధాలుగా ఆధునికమైన హంగులతో ఈ క్షేత్రం ఇపుడు దినదినాభివృద్ధిలో ఉంది.

ఆలయానికి అనుబంధంగా పెద్దసత్రం ఉంది. దానిలో వసతులన్నీ ఉన్నవి. యాత్రికులకు సౌకర్యానికి కొదువ ఉండదు.

ఈ స్వామిపై అష్టావధాని శ్రీ డోకూరి బాలబ్రహ్మచారిగారు, చౌదురి గోపాలరావుగారు చరిత్ర పీఠికలతో గూడిన శతకాలు గూడ వ్రాసినారు. ఆలయ కమిటీవారు భక్తులకొరకు నివేదికలు ప్రచురించినారు.

ఇక్కడ ఈ ఆలయాన్ని కట్టించి చుట్టుపట్లవారికి తిరుపతి ప్రతిబింబాన్ని చూపిన నందారం నరసింహులు గుప్తగారు ధన్యజీవులు.

12. గుండుమళ్ళ :

గుండుమళ్ళ కొడంగలు తాలూకాలోని గ్రామం. ఇపుడు కోసిగి మండలానికి చెంది కేంద్రానికి అయిదు మైళ్ళు ఉంటుంది. గ్రామానికి బస్సు సౌకర్యం ఉంది.

ఇక్కడి వెంకటేశ్వరాలయం ప్రసిద్ధి. ఈ స్వామి మన్నెంకొండ స్వామి కంటె పెద్ద భూస్వామి. ఇతని ఆలయం గ్రామానికి సమీపంలో గల గుట్టపై ఉంది. ఆలయం పెద్దగా అన్ని హంగులతో ఉంది గాని దానిలో స్వామివారికి మాత్రం పూజాదులు లేవు. వేంకటేశ్వరు డెక్కడ ఉన్నా నిత్యార్చన లేకుండా ఉండడు. కాని దీనికి కారణం ఈ విధంగా చెబుతారు :

గుండుమళ్ళ దొరలు రెడ్లు. వారు నంచెర్ల జాగీరుదార్లు. వారి వంశానికి మూలపురుషుడు సింగిరెడ్డి. అతడు మల్కిభరామునికి కోయిల కొండపై దండెత్తినపుడు కోయ దొరలను పట్టించుటకు సాయపడినాడు. అందుచేత ఆ విజయానంతరం ప్రభువతనికి గుండుమళ్ళ ప్రాంతం జాగీరుగా ఇచ్చినాడు.

గుండుమళ్ళ గుడిని ఈ దొరలే కట్టించినారు. అది వారికి కోయిల కొండ విజయానంతరం వచ్చింది. ఆ యుద్ధం క్రీ. శ. 1560 లో జరిగింది. కాబట్టి ఈ ఆలయం క్రీ.. శ. 16 వ శతాబ్ది నాటిది అనవలె.

ఆలయాన్ని కట్టిన శిల్పి దానిలో స్వామి ప్రతిష్ఠను గూడా తన చేతనే చేయించవలెనని కోరినాడు. అది ఆలయం కట్టించిన దొరగారికి ఇష్టంలేదు. కాని పైకి అలాగే అన్నాడు. శిల్పి ముహూర్తంనాడు వస్తానని ఇంటికి వెళ్ళినాడు. ముహూర్తం దినం వచ్చింది. దొరగారు యేర్పాట్లన్ని పూర్తి చేయించి, సమయానికి శిల్పి రాగలడేమో, వస్తే తన అవకాశం పోతుంది అని ముహూర్తానికి కొన్ని నిమిషాల ముందే స్వామిని తాను ప్రతిష్ఠించినాడు. తరువాత తాను చెప్పి వెళ్ళినట్లు శిల్పి ముహూర్త సమయానికి వచ్చేవరకు ప్రతిష్ఠ జరిగిపోయింది. దొరగారు ఏదో సర్ది చెప్పినాడు.

ఎంతో ఆశతో వచ్చిన శిల్పి మనస్సు చివుక్కుమన్నది. అది దొర కావలెనని చేసిన పనే అని అర్థం చేసుకొని, నేటితో ఈ దేవునికి పూజలేదు, ఈ గ్రామానికి పొలిలేదు పొండి అని శపించి వెళ్ళిపోయి నాడు. అందువల్ల ఆలయం ఎంత హంగుగా ఉన్నా యిక్కడి స్వామికి పూజ లేకుండా పోయింది.

ఇపుడు గ్రామంలో ఆలయ కమిటి ఏర్పడి, స్వామివారికి నిత్య పూజ, బ్రహ్మోత్సవాలు చేస్తున్నారు.

నాగర్‌కర్నూల్ తాలూకా పోలుమూరులో గూడా ఒక వెంకటేశ్వ రాలయం ఉంది. ఇక్కడ గ్రామస్థులు ఆంజనేయాలయం కట్టించగా అక్కడ మేరెడ్డి లక్ష్మారెడ్డి అనే సాంఘిక గురువు స్వామిని ప్రతిష్ఠించి నాడు. అది బ్రాహ్మణ ప్రతిష్ఠకాదు. అక్కడ మేడిపూరు దీక్షితులున్నాడు కాని ఆయనచేత జరుగలేదు. అందుచేత స్వామికి పూజ లేకుండా పోయింది అని స్థానికులంటారు.

రఘుపతి పేటలో కటిక లక్ష్మణదాసుచేత ఆంజనేయ ప్రతిష్ఠ చేయించినారు. పాత గుడిని విచ్చి కొత్తగా కట్టించి అతనిచేత ప్రతిష్ఠ చేయించినారు. అతనికి హరంకోరి సాధువని పేరు. ఇతడు చాలా ప్రతిష్ఠలు చేసినాడు కాని అన్ని బ్రాహ్మలచేతనే చేయించినాడు. ఇది మాత్రం తానే చేసినాడు. అయితే దీనితో గ్రామం క్షీణించింది అని అక్కడివారు అంటారు.

13. గుడబల్లూరు

ఇది మక్తల్ తాలూకాలోని గ్రామం. మాగనూరు మండలంలో ఉంది. ప్రజలు సగం కన్నడులు. కనుక ఇక్కడ కన్నడ ప్రభావం ఎక్కువ. ఈ గ్రామం మక్తల్‌నుండి రాయచూరు రోడ్డున ఉంది.

ఇది కృష్ణాతీర ప్రదేశం. పూర్వం దీనికి గుండిలారణ్యమని పేరు. ఒకపుడు మాండవ్య మహర్షి వెంకటాచలానికి వెళ్ళటానికి ఈ మార్గంగా వచ్చినాడు. అపుడు కృష్ణానది నిండుగా పారుతుంది. ఆయన తన తపో శక్తితో దాన్ని దాటగలడు. కాని అంతదానికై తపశ్శక్తి వ్యర్థం చేసు కోవటం ఎందుకనిపించింది. కొంత తగ్గేవరకు అక్కడనే ఒక చోట తపం చేసుకుందామని సమీపంలోని ఒక గుట్టకు గల గుహలో తపం ప్రారంభించాడు.

కొంతకాలానికి చైత్రం వచ్చి ఎండలు ముదరసాగినవి. అప్పటి కాయన తపం గూడ ఫలించి, స్వామి ప్రత్యక్షమై, ఏం కావలెనని అడిగి నాడు. అందుకు మహర్షి స్వామీ, నేను మీ దగ్గరకు రాలేకున్నా మీరు నన్నిక్కడనే అనుగ్రహించినారు. కనుక ఇదే విధంగా ఇక్కడి భక్తుల కెల్ల మీ సన్నిధికి రానవసరం లేకుండ ఇదే గుహలో వేంచేసి దర్శన మీయవలసిందని కోరినాడు. అతని కోరిక నంగీకరించి స్వామి అక్కడ ఒక గుండుకు ప్రత్యక్షమై నిలచినాడు. ఇది దీని స్థలపురాణం.

తరువాత చాలా కాలానికి ఆ గుట్టపై ఒక రెడ్డిదొరలు కోట గట్టు కొని నివసించి అక్కడి గ్రామానికి గుండిలాపురమని పేరు పెట్టుకున్నారు. కొంతకాలానికి వారిపై మహమ్మదీయులు దండెత్తగా వారక్కడినుండి కొల్లూరికి వెళ్ళిపోయినారు. వారు వెళ్ళిన పిమ్మట అక్కడి ప్రజలు గుట్ట దిగి దూరంగా వెళ్ళి మరో గ్రామం కట్టుకున్నారు. అదే ఇప్పటి గ్రామం.

గుడబల్లూరికి ప్రస్తుతం గుడిగల ఊరు, ఆలయం కుడివైపున గల ఊరు, దేవాలయం (పేర) వెలిసిన ఊరు అని అక్కడివారు అర్థాలు చెబుతారు.

ఇక్కడి ఆలయం కొండ గుహలో ఉంది. ప్రదక్షిణ వలయం గూడ దానిలోనుండే ఉంది. అదే గర్భాలయం చేసి ముందుకు మండపం వేసి గుండుపై శిఖరం గట్టి ఆలయాన్ని విస్తరించి ప్రాకారం గట్టినారు.

అక్కడ మాండవ్య మహర్షి తపం చేసినపుడు ప్రతి దినం ఒక గొల్లవాడు పాలు తెచ్చి ఇచ్చేవాడట. అందుచేతనే ఇపుడక్కడ వెలసిన స్వామికి మొదట పూజ గొల్లవారిది. ఆ తరువాత కౌశికస గోత్రులైన మధ్వలు స్వామిని పూజిస్తారు.

ఈ ఉత్సవంలో ఉద్దాలదొక ప్రత్యేకత. మూడేండ్లకొక పర్యాయం నడుస్తుంది. వాటిని రిక్కమోనివారు అనే పంచములు చేస్తారు. మూడేండ్లకొక పర్యాయం ఆ గుట్టకు పులివచ్చి స్వామివారికొరకు ఒక ఆవుసు కొట్టి పోతుందట.

ఈ గుట్టపై అన్నిటికి పైన ఒక పెద్ద గుండుంది. దీని ఉపరితలం సమంగా ఉంది. ఉద్దాలుచేసే ఏడు చైత్రశుద్ధ పాడ్యమినాడు అవి చేసే వాడు సమీపంలోని కృష్ణానదికి వెళ్ళి శుచియై మూడు తట్టల ఇసుక తెచ్చి, ఆ గుండుకు నిచ్చెన వేసుకొని ఎక్కి దానిపై పోసి నెర్పుతాడు.

ఆనాటినుండి పంచములంతా అక్కడే భోజనాలన్నీ ముగించుకుంటూ పరమభక్తితో ఆ గుండుచుట్టూ భజనచేస్తూ గడుపుతారు. ఆ విధంగా గడపగా ఉద్దాలిక రెండు మూడు దినాలకు అవసరం అనగా, గుండుపై గల ఇసుకలో స్వామివారి పాదముద్ర పడుతుంది. అపుడు దాని కొలత తీసుకొని ఆ ప్రకారం అచ్చులు కోసి ఉద్దాలు పూర్తి చేస్తారు. వాటిని వారు రథోత్సవంనాటికి తెస్తారు. ఈ అచారం ఎపుడేర్పడిందో కాని, ఇప్పటికీ అవిచ్ఛిన్నంగా సాగుతుంది. ఒకపుడీ ఆలయాన్ని దర్శించడానికి భండారిగిరి శ్రీ విద్యామాన్యస్వామివారు వచ్చి ఈ ఉద్దాల విషయం విని అక్కడి హరిజనులను, మేమెంత తపంచేసినా మాకు స్వామివారి దర్శనం కలుగదు. మీరెంత పుణ్యాత్ములో మూడేండ్ల కొకసారి ఆయన అడుగు దర్శనం చేసికుంటున్నారని అభినందించినాడు.

ఇక్కడి మరొక విశేషం ఉట్లపండుగ. రథోత్సవంనాడు ఏబది అడుగుల లావుపాటి కఱ్ఱస్తంభాన్ని ఆలయం ముందు పాతి, దానిపై ఒక పీట నమర్చి, నిచ్చెనవేసి, ఆ పీటపై పంచామృత కలశంతో ప్రక్కన చన్నీటికుండతో ఒక వ్యక్తిని కూర్చోబెట్టి తరువాత నిచ్చెనతీసి స్తంభానికి చుట్టూ నూనె అంబలి పూస్తారు. సమర్థులైనవారు జారకుండ ప్రాకి పంచామృతాన్ని అందుకోవలె. ఇది గూడ పూర్వంనుండి నడుస్తుందట. ఇక్కడ ఈ స్తంభం ప్రాకటం చూచే వారికొక వేడుక. దానికి పూసిన నూనె అంబలి జారుతుండగా పైనున్న వ్యక్తి వారిపై నీరు చల్లుతుంటాడు. ప్రాకేవారు కోటికెక్కలేక కుప్పలు కుప్పలుగా జారిపడుతుంటారు. అయినా ఇంతవరకు ఈ పడటంలో ఎవరికి ప్రమాదం జరుగలేదంటారు. అది ఆ స్వామివారి మహిమ.

ఇక్కడ ఈ పంచామృతం అందుకునే భాగ్యం కూడ ఆనువంశికంగా ఏటా ఒక్కరికే - నక్కవారు అనేవారికి దక్కుతుందట.

ఇక్కడ అప్పుడప్పుడు సప్తాహం గూడ నడుస్తుంది. అపుడు భజనపరులు పసుపులో తడిపిన తడిబట్టలతో నిలిచి రెండేసి గంటలకొక ఉద్ది చొప్పున మారుతూ అఖండ భజన చేస్తారు. ఇటువంటి విశేషాలీ క్షేత్రాన్ని గురించి ఇంకా చాలా ఉన్నవి. భవిష్యోత్తరపురాణంలోని కృష్ణామాహాత్మ్యం అనే ఖండంలో గుండిలారణ్య మాహాత్మ్యం రెండు ఖండాలలో ఉంది. దీని చరిత్రను కన్నడంలో శ్రీ జోషి రంగాచార్యుల వారు వ్రాసి ప్రకటించినారు. ఈ స్వామిపై ఒక సుప్రభాతంగూడ ఉంది.

14. గురుముక్కల

ఇది మక్తల్ తాలూకాలోని ధన్వాడ మండలంలోగల గ్రామం. ఇక్కడ గ్రామ సమీపంలో రెండు గుట్టలున్నవి. వానినడుమ ఉత్తర వాహిగా ఒక వాగు ఉంది. ఈ గుట్టలపై పూర్వం ఆవులు ఎపుడూ మేస్తూ ఉండేవి. అలా ఉండగా ఒకినాడొక ఆవు వెళ్ళి ఆ గుట్టపై ఉండే ఒక పుట్టలో పాలు కురియటం ఆరంభించింది. అది చూచి కాపరి ఆశ్చర్యపడినాడు. ఆనాటి రాత్రి స్వామి అతనికి కనిపించి, నేను ఇక్కడికి కడపనుండి వచ్చి వెలసినాను కాబట్టి నన్ను వెలికితీసి ప్రతిష్ఠించమని మీ గ్రామ పెద్దలకు చెప్పు అని ఆదేశించినాడు.

అది విని అతడు మేల్కొని మరునాడు ఊరిపెద్దలకు చెప్పగా వారువచ్చి ఆ పుట్టను త్రవ్వగా దానిలో వారికి ఒక నిలువు రాయి కనిపించింది. వారు దానినే దేవునిగా భావించి నిలిపి పూజలారంభించి నారు. క్రమంగా ఒక చిన్న గుడికూడా వెలసింది.

స్వామి కడపనుండి వచ్చినానని చెప్పుకున్నాడు కాబట్టి అతని నిక్కడ "కడప రాయలు" అంటారు. కడప పట్టణం తిరుపతికి కడప వంటిది కనుక వేంకటేశ్వరుని కొన్ని స్థలాలలో ఆ పేరుతో గూడ పిలుస్తారు.

గురుముక్కులలో పూర్వం యిద్దరు వర్తక సోదరులున్నారు. వారొకపుడు రాగులు కొనగా ధర బాగా తగ్గిపోయి నష్టం కనిపించింది. అపుడు వారు స్వామికి మ్రొక్కుకుని వాటిని నిలువబెట్టినారు. అపుడు ఏడు తిరిగే వరకు వానిలో మళ్ళీ మంచి లాభం వచ్చింది. దానితో వారు స్వామి వారికి ఇపుడున్న మండపం కట్టించినారు.

ఈ గుట్టపైకి ధన్వాడ కరణం రామచంద్రరావు గారు తాను సమితి ప్రెసిడెంటుగా ఉన్నపుడు రోడ్డు వేయించినాడు.

ఈ ఆలయం ఏకాంతమైన సుందర ప్రదేశంలో ఉంది కాబట్టి ఇక్కడికి వచ్చే భక్తులు ఉత్తరవాహినియైన ఇక్కడి వాగులో స్నానంచేసి స్వామిని సేవిస్తుంటారు.

15. గోవిందయ్య పల్లె

గోవిందయ్య పల్లె తాడూరు మండలానికి చెంది సిరసవాడ గ్రామానికి సమీపంగా పరువు దూరంలో ఉంది. ఆ గ్రామంలో కురువ లెక్కువ. అక్కడి ఊరి ననుసరించి ఒక చిన్న గుట్ట ఉంది.

గోవిందయ్యపల్లె గూడ లోకయ్యపల్లె వారిదే. దాన్ని స్థాపించిన వాడు కూచూరి గోవిందయ్యగారనే కరణం. ఆయన ఒక మక్తేదారు. గోవిందయ్య వంశంలోని కృష్ణారావుగారి కాలంలో ఇక్కడ గుట్టపై ఆలయం స్థాపించడం జరిగింది.

సిరసవాడలో పూజాదికం ఆగిపోయిన తర్వాత ఒకనాడు స్వామి ఇక్కడ ఒక కురువకు ఆవేశించి, నేనిక్కడ ఉండను, గోవిందయ్యపల్లె గుట్టపై ఉంటాను అని చెప్పుకున్నాడు. అది విని కృష్ణారావుగారు స్వామి వారిని వేంచేపు చేసుకొని ఇక్కడ గుడి కట్టించి అర్చనాదులు ప్రారంభించినాడు.

ఈ ఆలయం శిల్పశోభితం గాదు. అతి సామాన్యమయింది. అయితేమాత్రమేమి - ఆరంభించిన నాటినుండి నేటివర కవిచ్ఛిన్నంగా ఉత్సవం జరుగుతుంది.

ఈ గ్రామాన్ని స్థాపించిన గోవిందయ్యగారు లోకయ్యపల్లె వారి సంబంధి. తరువాతి కాలంలో అతని వంశంవారికి వనపర్తి ప్రభువులతో స్నేహం ఏర్పడింది. వారు వీరి అవసరాలకు సహాయం చేసేవారు.

ఆ కారణంగా వనపర్తి పెద్ద రామేశ్వర రాయలవారి కాలంలో ఈ గ్రామం వారి వశమయింది. ఆ ప్రభువీ స్వామివారికి రెండు పుట్ల తుకుంపట్టే తరిపొలం ఇచ్చినాడు.

వనపర్తివారికి కొమ్మలగట్టు వెంకటేశ్వరుడు ఇష్టదైవం. ఆ స్వామికి రామేశ్వరరాయల పత్ని రాణి శంకరమ్మగారు ఆలయమంట పాదులు కట్టించి ఒక ఇనుప తేరు చేయించింది. అయితే అది అక్కడ ఉపయోగపడలేదు. ఆ తేరును కృష్ణారావుగారు ఆరువందల గాడీలకు కొని తమ దేవుని కర్పించినాడు. అది ఇటీవల శిథిలం కాగా ఊరిలోని కురువలంతా చందా వేసుకొని మూడువేల రూపాయలతో మళ్ళీ క్రొత్తగా చేయించినారు. ఈ తేరు చక్రాలతో దేఖీలు అంతా ఇనుపదే కావటం దీని ప్రత్యేకత. ఇటువంటి రథం ఈ ప్రాంతంలో మరొకటి లేదు. పూర్తిగా ఇనుపతేరు గట్టు ఇప్పలపల్లిలో ఉంది.

ఇక్కడి ఉత్సవ విగ్రహాలను రఘుపతిపేట నివాసి ఇరువెంటి శేషయ్య గారిప్పించినారు. ఇక్కడ ఉత్సవం చైత్రపున్నమకు సాగుతుంది. ఇది ఆరంభమై ఇప్పటికి రెండు అక్షయచక్రాలు గడిచినవట. నిత్యార్చన బ్రహోత్సవాదులు నిర్విఘ్నంగా నడుస్తున్నవి. ప్రజలు మొక్కుబడులు చెల్లించుకుంటారు. తమ బిడ్డల పెండ్లిండ్లు గూడ ఈస్వామి సన్నిధిలో చేసికుంటుంటారు.

ఇది గుట్ట కాబట్టి ఆలయానికి అనుకూల ప్రదేశమే. దీన్ని శిల్ప శోభితంగా చేస్తే దర్శనీయ స్థలంగా మారగలదు.

16. జగతిపల్లె

ఇది పెద్ద మందడి మండలంలోని గ్రామం. ఆ గ్రామానికి దక్షిణంగా ఒక గుట్ట ఉంది. దానికి కొండలయ్య గట్టు అని పేరు. దానిపై వెంకటేశ్వర ఆంజనేయ ప్రతిష్ఠలున్నవి.

ఈ గుట్ట నానుకొని కోటగట్టు, గుర్రంగట్టు అని మరి రెండు గట్లున్నవి. కోటగట్టుపై రాజుగారి కోట ఉంది. ఒకపుడా కోటపై ఒక తురకనవాబు దండెత్తినాడు. అపుడు భీకరయుద్ధం జరిగి ఎంతో జననష్టం అయింది. ఆ యుద్ధంలో మరణించిన వారి సమాధులన్నీ ఇపుడా గుట్ట క్రిందనే ఉన్నవి.

నవాబు చివరకు ఓడిపోయినాడు కాని అతని తుపాకి కాల్పులలో రాజుగారి గుర్రం కన్నులు పోయినవి. అపుడు రాజుగారు దానికి ఒక ప్రత్యేకశాల రెండవ గట్టుపై కట్టించి పదేండ్లు ఆ శాలలో దాన్ని పోషించినాడు. అందుచేత ఆ గుట్టను ఇపుడు గుర్రం గట్టు అని పిలిచినారు. ఆ గట్టుపై ఆంజనేయ నాగప్రతిష్ఠలతో పాటు శివప్రతిష్ఠ గూడా ఉంది. అయితే శివునికి గుడి గోపురం ఏదీలేదు.

శిల్పి ఆ గుట్టపై గల ఒక పెద్దగుండును రెండుగా చీల్చి మొదటి పచ్చపై శివపట్టాభిషేకం తీర్చి రెండవ పచ్చెను మళ్ళీ ఎప్పటివలె ఎత్తించి ఆ పట్టాభిషేకానికి ఎండ వాన తగులకుండా అడ్డంగా పెట్టించినాడు. ఆ రెండు చెక్కలకు నడుమ ఒక అడుగు ఎడం ఉంటుంది. ఆ సందునుండి మొదటి చెక్కపై నుండే దేవతా మూర్తులు కనిపిస్తవి. ఇదొక విచిత్ర విషయం.

పూర్వం ఈ గుండు దగ్గర ఒక పెద్ద పాము ఉండేది. అది భయంకరంగా ఉన్నా ఎవరిని ఏమీ అనేదికాదు.

మొదటి గట్టుపై ఉండే వెంకటేశ్వరాలయం చక్కగా విశాలంగా ఉంది.

17. జడ్చర్ల

ఈ గ్రామం పాలమూరికి పదారు కిలోమీటర్ల దూరంలో సికింద్రాబాదు ద్రోణాచలం లైనులో జడ్చర్ల స్టేషనుకు మూడు కిలోమీటర్లు ఉంది. దీనికి మొదలు నల్లవాళ్ళపల్లె అని పేరు. అక్కడ నీటి ఎద్దడి ఉండటంవల్ల ఇపుడుండేచోట జలపూర్ణమైన బావి త్రవ్వకొని గ్రామాన్ని అక్కడికి మార్చుకొని జలచర్ల అనే పేరు పెట్టుకున్నారు. అది క్రమంగా ఈనాడు జడ్చర్ల అయింది. ఇది ఇప్పుడొక మండల కేంద్రం.

ఈ గ్రామంలో తిమ్మాజీపేటను స్థాపించిన రుక్మాజీరావు ఒక శివాలయం, వెంకటేశ్వరాలయం కట్టించినాడు. అతడు హి. 1012 నాటి వాడు. రుక్మాజీరావు తన దాన పత్రాలలో శ్రీ వెంకటేశ్వర పాదభక్త అని చెప్పుకున్నాడు.

ప్రస్తుతం ఈ గ్రామంలో వెంకటేశ్వరాలయం ప్రసిద్ధంగా ఉంది. దానిలో మూల విరాట్టు చిన్నగా ఉంటుంది కాని ఆలయం చక్కగా ఉంది. స్థలం మాత్రం విశాలంగా ఉండదు. ఇది ప్రాఙ్ముఖమైన ఆలయం. ఇపుడు దీని వెనుకనుండి ప్రధానమైన రోడ్డు సాగిపోయింది. కనుక ప్రస్తుతం దీనికి రోడ్డువైపున ప్రధాన ద్వారం వేయించినారు.

ఈ ఆలయాన్ని అభివృద్ధిపరచినవారిలో కావరంపేట నివాసి వలకొండ అనంతయ్యగారు ముఖ్యుడు. ఆయన దీని అభివృద్ధికి ఎంతో పాటుపడి ప్రాకార గోపుర ద్వారాలు కట్టించినాడు.

ఇక్కడి ఆలయంపైగల బొమ్మలు చేసినవాడు గొల్లపల్లి మనోహరాచారిగారు. వానిని క్రీ. శ. 1968 లో వలకొండ అనంతయ్య గారు చేయించినారు.

రుక్మాజీరావు మధ్వ కాబట్టి ఇక్కడి ఆలయంలో వంశ పారం పర్యంగా మధ్వలు పూజారులుగా ఉన్నారు. మధ్యకాలంలో వైష్ణవులను గూడ ఏర్పాటు చేసినారు. కాని ప్రథమ పూజ మాత్రం ఇక్కడ మధ్వలదే వుంటుంది.

18. జానంపేట

జానంపేటను ఈనాడు ఫారుఖ్‌నగర్ అంటున్నారు. ఇది షాద్ నగర్ నుండి హైదరాబాదు రోడ్డున ఒక కిలోమీటరు దూరంలో ఉంది. ఇపుడు ఇదొక మండల కేంద్రం.

(షాద్‌నగర్ జడ్చర్లనుండి హైదరాబాదు రోడ్డులో ఉండే తాలూకా కేంద్రం. అది కిషన్ ప్రసాదుగారి పేర స్థాపింపబడిన గ్రామం. దానికి మొదట ప్రసాద్‌నగర్ అని పేరు. అది క్రమంగా షాద్‌నగర్‌గా నిగిలింది.

కిషన్ ప్రసాదు రాజా తోడరమల్లు వంశానికి చెందిన ఖాత్రి. ఆయన మీర్ మహబూబ్ అలీఖాను గారికి మిత్రుడై మంత్రి మండలిలో ఒకడుగా ఉండి క్రీ. శ. 1911 లో ఆయన మరణించగా అతని పిమ్మట వచ్చిన ఉస్మానలీఖాన్ గారికి మొదటి మంత్రిగా ఉన్నాడు. ఆయన చాలా యాత్రలు చేసి ఎన్నో ఆలయాలకు దానధర్మాలు చేసినాడు.)

ఈ ఆలయాన్ని కిషన్ ప్రసాదు నరసింహ ప్రసాదు గారలు కట్టించినట్లు చెబుతారు. ఈయన నిజాం ప్రభువు మీర్ మహబూబ్ అలీఖాన్ గారి మిత్రుడు.

కిషన్‌ప్రసాదుగారి నివాసం అల్వాల. ఇది నేడు హైదరాబాదులోని బొల్లారం దాటిన పిమ్మట ఉంది. జానంపేట అతని జాగీరు గ్రామం.

ఆయన తమ సొంత ఊరిలో ఒకటి, జాగీరు గ్రామంలో ఒకటిగా రెండు ఆలయాలు కట్టించినాడు. ఇవి చాలా పెద్దవి.

జానంపేటలోని ఆలయం పది ఎకరాల వైశాల్యంలో వుంది. ఆలయానికి ముందు రెండు విశాలమైన ప్రాకారాలు వానిలో చుట్టు మంటపాలు ఉన్నవి.

ఇది పూర్వాభిముఖమైన ఆలయం. మొదటి ప్రాకారం చాలా విశాలమై నాలుగు వైపులలో గదులున్నవి. ఒక్కొక్కవైపు పదిగదుల చొప్పున చుట్టు గదులున్నవి. ముఖమండపంపై ఎత్తయిన గోపురం, గోపురం ముందు ద్వారపాలురు, పై అంతస్తులో లక్ష్మి సరస్వతులున్నారు. వీని కమానులు మొగలాయి పద్ధతిలో కట్టబడినవి.

రెండవ ప్రాకారానికి గూడ ముఖమంటపం ఉంది. దీనిలోపల ఉత్తరంవైపు సామాన్యోపయోగమైన సత్రశాల, దక్షిణంవైపు పూజారుల నివాస గృహాలున్నవి. ఆలయం ఈ ప్రాకారంలోపలనే ఉంది.

ఇక్కడి ప్రధానాలయం వెంకటేశ్వరుని గుడి. దానికి కుడివైపున రామాలయం, ఎడమవైపున జగన్నాథాలయం ఉన్నవి.

రామాలయంలో రామలక్ష్మణులతో పాటు లక్ష్మి, విష్ణుప్రతిమలు గూడ ఉన్నవి. జగన్నాథాలయంలో మాత్రం దారుమూర్తులు జగన్నాథ పద్ధతిలోనే ఉన్నవి.

జగన్నాథాలయానికి ఎడమవైపున మరో ప్రాకారం ఉంది. దానిలో దేవి, కాలభైరవ, శివాలయాలున్నవి. శివాలయంలో షణ్ముఖ గణపతి పార్వతి మొదలైన మూర్తులున్నవి. షణ్ముఖ మూర్తికి చాలు తలలుగాక అన్ని తలలు గలిసి ఒకే తలవలె గుండ్రంగా ఉన్నవి. శివాలయంలోని నందిగూడ మంచి పనితనంతో ఉంది.

ఆలయాల కన్నిటికీ విమానాలు, ధ్వజస్తంభాలు ఉన్నవి. ఈ ఆలయం చాలా విశాలంగా ఉండి ఒక కోటవలె ఉంది. కనుక రజాకార్ల కాలంలో వారు దీన్ని ఆక్రమించుకొని ఆవాసంగా చేసుకొని నిర్మాణా లన్నీ పాడుచేసినారు. స్వాతంత్ర్యం వచ్చిన పిమ్మట కర్నాటక నుండి ఇక్కడికి లింగానందస్వామి అనే సన్యాసి ఒకాయన వచ్చి నివసించి ఆలయ దుస్థితిని చూసి గ్రామస్థులతో చందాచేసి పడిపోయిన వసతులన్నీ బాగుచేయించి నివాసయోగ్యంగా చేసి, వానిని అద్దెలకిచ్చి ఆ రాబడితో ఆలయంలోని స్వామికి నిత్యార్చనా ప్రబంధం చేసినాడు.

ఈ ఆలయానికి ఈయన చేసిన ఉద్ధరణ ప్రశంసనీయమయింది. ఈయన క్రీ.శ. 1970 ప్రాంతంలో మరణించినాడు. ఆయన మరణించిన తరువాత దీని నిర్వహణా వ్యవస్థ మళ్ళీ కుంటుపడింది.

ఇక్కడ ప్రతి ఏటా శ్రీరామనవమికి ఉత్సవం జరుగుతుంది. వెంకటేశ్వరాలయానికి పుల్లూరు నివాసి నల్లాన్‌చక్రవర్తుల వారు పూజారిగా, శివాలయానికి హైదరాబాదు నివాసి ఆంజనేయశర్మగారు పూజారులుగా ఉన్నారు.

19. తాటికొండ

ఈ గ్రామం ప్రస్తుతం బూదపుర మండలంలో ఉంది. ఒకప్పుడిది చిన్న సంస్థానం. ఇక్కడి దొరలు పాకనాటిరెడ్లు. వారికి ఆత్మకూరు - గద్వాల - దోమకొండ ప్రభువులతో సంబంధాలున్నవి.

ఈ వంశంలో రామారెడ్డిగారు ప్రసిద్ధుడు. ఆయన గద్వాలకు వచ్చిన తిరుపతి వెంకట కవులను తన ఆస్థానానికి ఆహ్వానించి,వేయినూట పదార్లతో గౌరవించి వారి లక్షణా పరిణయాన్ని కృతి పొందినాడు.

ఈ గ్రామం సంస్థానంగానే గాక నైజాం ప్రభువు సామంతుడై జాగీర్దారుగా ఉన్న శివరాజ బహద్దురుగారి ఎస్టేటుకు తాలూకాగా కూడ ఉన్నది. ఆయన ఎస్టేటులో 27 గ్రామాలున్నవి. వాని అన్నిటికి కలిపి ఇక్కడ మునసబు, తహశీలు, పోలీస్ కార్యాలయాలున్నవి. అయితే, అవి ఇక్కడ గాక ఈ పేరుతో దీని ప్రక్క గ్రామమైన అన్నసాగరంలో ఉన్నవి.

ఈ గ్రామం చుట్టుపట్లలో గుట్టలు చాలా ఉన్నవి. వానిలో ప్రతి దానిపై చిన్నదో పెద్దదో ఏదో ఒక గుడి ఉంది. వానిలో వీరన్న గుడి ప్రసిద్ధంగా ఉంది. ఇదిపుడు గ్రామాన్ని అనుసరించిన గుట్టపై ఉంది. దీని ప్రక్కన ఉన్న చెరువును ఊరివారు వీరన్న చెరువు అంటారు.

ఇక గ్రామంలో శివాలయం, వెంకటేశ్వరాలయం, ఆంజనేయా లయం ఉన్నవి. వీనిని తాటికొండ, అన్నసాగరం రెండు గ్రామాలవారు సమంగా దర్శించి సేవిస్తుంటారు. ఏటా ఈ ఆలయాలలో కల్యాణాలు బ్రహ్మోత్సవాలు నడుస్తుంటవి.

ఈ గ్రామంలో గూడ పాత జంగమయ్య పల్లెలోవలె ప్రతిష్ఠగాని స్తంభం ఒకటి ఉంది. దాన్ని గురించి ఇలా చెబుతారు :

పూర్వం ఇక్కడి ఆలయం కోసం శిల్పితో పెద్ద దీపస్తంభం ఒకటి తీయించినారు. ఆ శిల్పి ఒంటి చేతివాడు. ఒక చేతికి హస్తంలేదు. ప్రతిదినం భార్యతో ఆ చేతికి సుత్తె కట్టించుకుని పనికి వెళ్ళేవాడు. మధ్యాహ్నం ఆమె అన్నం తీసుకువెళ్ళి దూరంగా ఒక చెట్టు క్రింద నిలిచేది. అతడక్కడికి వచ్చి చేతి సుత్తె విడిపించుకుని అన్నంతిని కాస్త విశ్రాంతి తీసుకుని మళ్ళీ సుత్తె కట్టించుకుని గుట్ట ఎక్కేవాడు. ఆమె వెళ్ళిపోయేది. అపుడొకనాడు ఆమె తన భర్త ఒంటిచేత్తో పని ఎలా చేస్తాడో చూడవలెనని సరాసరి గుట్టపైకే అన్నం తీసుకుని వెళ్ళింది.

ఆనాడే అతడు స్తంభాన్ని రాతిదరినుండి విడదీసి వేరు చేసినాడు ఆమె దాని పరిమాణం చూసి "ఇంత పెద్ద స్తంబాన్ని ఒంటిచేత్తో ఎలా తీసినావయ్యా!" అని రిబ్బరించుకున్నది అనంతరం అతడు యథావిధిగా చెట్టు క్రిందికి వచ్చి భోజనంచేసి ఆమెను పంపి మళ్ళీ వచ్చి పనికి ఎక్కి దాన్ని మలుతామని పోగర తీసికుని ఒక్క దెబ్బ పెట్టినాడో లేదో అది పటుక్కుమని నడిమికి విరిగింది. దానితో అతడిక ఆ స్తంభానికి భార్య దిష్టి తగిలిందని దాన్ని తాకలేదు. ఇదిపుడు గాజులపేట దారిలో ఉంది. ఈ స్తంభం సుమారు 30 అడుగు లుంటుంది.

20. తిరుమలాపురం

తెలంగాణంలోని ఆలయాలకు ఒక్కొక్క దానికి ఒక్కొక్క కథ ఉంది. అటువంటి దానిలో ఇది ఒకటి. తీరితే తిరుపతికి వెళ్ళు, తీరకుంటె తిరుమలాపురికి రమ్మని ఇక్కడి దేవుడి పిలుపు. ఈ గ్రామం కొల్లాపురం తాలూకాలో పెద్దకొత్తపల్లెకు పడమరగా మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది.

పూర్వం ఈ గ్రామం లేదు. దీని సమీపంలో "కొప్పురాతిపల్లె" అనే ఊరుండేది. అక్కడ పానుగంటి ప్రభువుల దగ్గర దివాంజీలైన దేశ పాండ్యలున్నారు. ఆ కుటుంబంలో ఒకప్పుడు అంతమరాయడు, చిలుకల రాయడు అనే సోదరులు గడిచినారు. వారిది చాలా పెద్ద కుటుంబం. ఏ పండుగ వచ్చినా ఘనంగా చేసి పదిమందికి పెట్టినారు.

అంతమరాయని భార్యకు విలువైన చంద్రహారం ఉండేది. ఆమె ప్రతిదినం స్నానంవేళ దాన్ని పొయ్యి దగ్గర ఒక ఉట్టికి తగిలించి అనంతరం మళ్ళీ వేసుకొనేది. అలా ఉండగా ఒకపుడు దీపావళి వచ్చింది. ఆమె మామూలుగా స్నానం వేళలో హారాన్ని ఉట్టికి తగిలించి మళ్ళీ వేసుకోవటం మరచి పండుగ సందడిలో మునిగి ఎపుడో యాది వచ్చినపుడు చూసుకుంటే అది లేదు.

ఆ విషయం ఆమె భర్తకుగానీ ఎవరికిగానీ చెప్పలేదు. కాని చింత దాగదు కదా! పండుగ మరునాడు ఇంటి ముందుండే ఎల్లపువారు అనే తలారీలు, అమ్మగారూ, మీరెందుకో నిన్నటి నుండి ఏదో పోగొట్టు కున్నాట్టున్నారు అని అడిగినారు. ఆప్యాయంగా అడిగినందుకు ఆమె దాచుకోకుండా చెప్పింది.

కావలి వారాలోచించినారు ఇది వంటఇంటి వ్యవహారం. ఇతరులకు కాలుపెట్టే మగ్దూరుండదు. ఇంటిలో ఇద్దరు వంట బ్రాహ్మణులున్నారు. బహుశః ఇది వారివనే కావలె అని భావించి ఆ సాయంకాలం వారు వంటవారిని ఏదో మిషపై ఊరి వెలువలికి పిలుచుకొని వెళ్ళి విషయం చెప్పి, ఇది మీరు తప్ప ఇతరుల పనికాదు. తెల్లవారే వరకు ఏదో విధంగా దొరికితే సరి. లేకుంటే మిమ్ములనీ చింతలకు వ్రేలాడదీస్తామని బెదిరించినారు.

వారు ఆ ఇంటిలో చాలాకాలం బట్టి ఉంటున్నారు. మంచి నియమనిష్టాపరులు. ఇంటికి వచ్చి, చేయని నేరానికి బలి కావలసి వస్తున్నదని దిగులు చెందినారు.

ఆ రాత్రి ఇంకేం జరిగిందో తెలియదు. తెల్లవారు జామున మామూలుగా అంతమరాయని భార్య పనికొరకు లేచి వంట ఇంటిలోనికి వచ్చింది. ప్రతిదినం వంటవారా గదిలోనే నిద్రించేవారు. కాని ఆనాడిద్దరిలో ఒకరు లేరు. రెండవ వారి శవం చిన్న పంచెలో దూలానికి వ్రేలాడుతున్నది. ఆమె గాభరాతో వెళ్ళి భర్తను లేపింది. ఆయన వచ్చి చూచి శవాన్ని ఉరినుండి దింపి చేయవలసిన సంస్కారం యథావిధిగా జరిపించి ఇంటికి వచ్చిన పిమ్మట పనివారిని ఒక్కొక్కరిని పిలిచి, ఇది ఎందుకిలా జరిగిందని యిజారా తీసుకోసాగినాడు. కావలివారి వంతు వచ్చింది. వారు చేసిన తప్పు చెబితే తీరుతుందని, వారిని బెదిరించిన తీరు చెప్పి కాళ్ళపై పడినారు. అంతవరకాయనకు తన భార్య చంద్రహారం పోయిన సంగతి గూడ తెలియదు.

విషయం బయటపడింది కాని చంద్రహారం ఎవరి చేతిలోపడింది తేలలేదు. అతనిని దహనం చేసి వచ్చేవరకు చాలాపొద్దుపోయింది. వంట పని ఆనాడు అంతమరాయని భార్య మెడకే పడి, అన్నం మాత్రం చేసి పచ్చడితో ఈ పూటకు సరిపెడదామని మామిడికాయ జాడి దగ్గరకు వెళ్ళి గరిటతో పచ్చడి తీసింది. ఆశ్చర్యకరంగా ఆ గరిటెకు పోయిందనుకున్న చంద్రహారం లేచి వచ్చింది. వెంటనే ఆమెకు పరిస్థితి అంతా అవగత మయింది. ఆ జాడి ఉట్టి క్రిందనే ఉండేది. పండుగ నాడుదయం పిల్ల లెవరో చద్దిలోకి పచ్చడికని కుండవాయి విప్పి ఉంటారు. ఆ సందర్భంలో ఎలాగో ఉట్టికదలి హారం అందులో పడింది. దాన్ని వారు కనలేదు. చంద్రహారాన్ని చూడగానే ఆమెకు 'అయ్యో! ఈ పచ్చడి కుండ పాడుగాను. ఎంత పనిజరిగింది' అనుకొంటూ గరిటెతోవెళ్ళి ఆలాగే పతికి చూపింది. జరిగిపోయిన అన్యాయానికి అందరూ చాలా పశ్చాత్తాప పడ్డారు. మళ్ళీ పిలిపించుకోవటానికి రెండవ వ్యక్తి ఎక్కడ వెళ్ళినాడో జాడ దొరకలేదు.

ఆనాటి నుండి ఇంటిలో యశస్కరం తప్పింది. దొడ్డిలో పశువులు నెగులలేదు. ఇంటి రాజులకేవో పీడకలలు వచ్చేవి.

వారి గురువులు భువనగిరిలో ఉండేవారు. అంతమరాయడు వెళ్ళి ఆచార్యులతో జరిగిన విషయం చెప్పినాడు. అది విని ఆయన 'మీచేత బ్రహ్మహత్య జరిగిపోయింది. కాబట్టి ఒక పరి సకుటుంబంగా దక్షిణ దేశ తీర్థయాత్ర చేయండి' అని ఆదేశించినాడు.

ఆ ఆజ్ఞమేరకు వారిల్లు విడిచి యాత్రలు చేస్తు చేస్తు చివరగా తిరుపతికి వచ్చి గోగర్భం దగ్గిర దిగినారు. అక్కడ ఒకనాడు అంతమరాయనికి మరణించిన వ్యక్తి కలలో కనిపించి 'మీరెక్కడికి

వెళ్ళినా నేను మీ వెంటనే ఉంటాను మీరు నాపేర వెంకటేశ్వర ప్రతిష్ఠ చేసి నిత్య పూజాదులు జరిపించండి. ఏ కీడు లేకుండ ఉంటుంది' అని చెప్పినాడు అది విని వారక్కడ ఒక స్వామి మూర్తిని చేయించుకొని పూజాదులతో ఇంటిముఖంపట్టి మళ్ళీ గురువులవారిని దర్శించి విషయంచెప్పి 'మీరు మా వెంట వచ్చి స్వామివారి అర్చనాదులు నిర్వహిస్తు అక్కడనే ఉండి పొండి' అని కోరినారు. అందుల కాయన అది వీలుకాదని స్వామి వారి అర్చనకై ఆగమం వారనే ఒక పాంచరాత్రుని ఆచార్యత్వానికి, కోయిల్ కందాడ వంశానికి చెందిన భావనాచార్యులనే పురుషుని పంపుతూ 'నేటినుండి మీరిక తీర్థప్రసాదాలు ఇతని చేతనే పొందండి' అని సెలవిచ్చినాడు.

గురువుగారితో సెలవు తీసుకొని వారు తమ ఊరికి కొంతదూరాన ఒక చింతల తోటలో విడిసి ఇల్లు యశస్సు తప్పింది. అంతేగాక ఇక్కడ మన బంధువు లెవ్వరు లేరు. గోదలు సీమలో ఉన్నారు. కాబట్టి నేటి అచ్చంపేట తాలూకాలోని బలుమూరికి వెళ్ళి అక్కడనే స్వామిని ప్రతిష్ఠించుకొని ఉండాలనుకున్నారు. భోజనాంతరం బండ్లు కడితే అవి కదలలేదు. ఒక వ్యక్తికి స్వామి ఆవేశమై తానక్కడనే నిలుస్తానని చెప్పినాడు. అది విని వారిక స్వామి నక్కడనే ఒక చింతక్రింద చిన్న ఆలయం కట్టి ప్రతిష్ఠించుకొని తాము వెళ్ళి మళ్ళీ పూర్వ పదవిలో చేరినారు.

దివాంజీలు మళ్ళీ వచ్చి చేరినందుకు. వారు స్వామిని గూడ తెచ్చినందుకు పానుగంటి ప్రభువులు సంతోషించి ఆ దేవునికి ఇపుడున్న కోవెల ప్రాకారాదులు కట్టించి, ఉత్సవం వగైరా ఏర్పాటు చేసి ఆ ప్రదేశాన్నంతా నిధి నిక్షేపాలతో సహా స్వామివారికి వ్రాసి ఇచ్చి దాని నిర్వహణాధికారం గోపాలుపేట ప్రభువుకు అప్పగించినారు. వారు కట్టించిన ఈ ఆలయం విశాలంగా ప్రాకారం అందంగా ఉంటుంది.

స్వామి ఇక్కడ వెలసిన పిమ్మట క్రమంగా కొప్పురాతిపల్లె లేచి అక్కడికి వెళ్ళింది. అంతమరాయని వంశం ప్రస్తుతం అక్కడుంది. ఆ వంశంలో తిరుమలరాయడు అనే వ్యక్తి పుట్టి, ఆలయ గ్రామాల అభివృద్ధులకు కృషిచేసినాడు. కనుక అతని చిహ్నంగా నేడు గ్రామానికి తిరుమలాపురం అనే పేరు నిలిచింది. అతని వంశంలో కొండలరావు అనే వ్యక్తి ఇపుడున్నాడు, బాగా చితికిన సంసారి.

స్వామివారి వెంట వచ్చిన ఆగమ - కందాళ వంశాలు గూడ ఇపుడున్నవి. కందాళవంశంలో భావనాచార్యులు అనేవారు ప్రసిద్ధులు. ఈ పేర పలువురు వెలసినారు. గోపాలపేట ప్రభువైన వల్లభరాయని కుమారుడు కాశన్న దేశాయి నాగర్‌కర్నూలు తాలూకాలోని ఏదుల దగ్గర తమ తండ్రి పేర వల్లభరావుపేట అనే అగ్రహారాన్ని ఏర్పరచి బంగారు భావనాచార్యులకు దానం చేసినాడు. ఈ సన్నదు క్రి. శ. 1664 నాటిది.

ఇపుడీ అగ్రహారం లేదుగానీ భువనగిరి నుండి వచ్చిన వాడితడే అనుకుంటే ఈ ఆలయం మూడు వందల నాటిది అవుతుంది.

ఈ శాఖలో వరద భావనాచార్యులు అనే వ్యక్తి కొల్లాపురం వెళ్ళి అక్కడ రాజగురువైనాడు.

కొతారు భావనాచార్యులు అనే ఆయన పట్టంలోని తిరునగరి నరసింహయ్య కవిగారితో ఈ స్వామిపై తిరుమంగయాళ్వారు చరిత్ర అనే యక్షగానం వ్రాయించినాడు.

ప్రస్తుత పూజారి అయిన ఆగమం నరసింహాచార్యుల వారి దగ్గర ఉండే సన్నదు సన్ 1297 లో ఒకసారి, 1357 లో ఒకసారి పునరుద్ధరింపబడింది. దాన్ని బట్టి నైజాం ప్రభువులీ ఆలయానికి సాలీనా 180 హాలీలు ఇచ్చేవారని తెలుస్తుంది.

ఇక్కడ స్వామివారి ఉత్సవం మాఘంలో పది దినాలు సాగుతుంది. మఖానక్షత్రం నాడు రథోత్సవం జరుగుతుంది. ఈ గ్రామం ఇపుడు పెద్ద కొత్తపల్లి మండలంలో ఉంది.

21. తెల్లరాళ్ళపల్లి

ఈ గ్రామం ప్రస్తుతం పానగల్లు మండలంలో ఉంది. ఇక్కడ గ్రామం ముందు ఒక చిన్న నది, దానికి రెండువైపుల్లా రెండు గుట్టలున్నవి. ఇక్కడ తెల్లని పలుగురాయి ఎక్కువ గాబట్టి గ్రామాన్ని తెల్లరాళ్ళపల్లె అన్నారు.

ఇక్కడి నదికి కుడివైపున గల గుట్ట కొంత పెద్దది. దానిపైన విఘ్నేశ్వరాలయం ఉంది. ఇది ఇక్కడి మొదటి ఆలయం. దీనిలో శివ వీరభద్ర ప్రతిష్ఠలు గూడ ఉన్నవి.

గ్రామానికి వెలుపల ఏకాంత ప్రదేశంలో గుట్టపై వెలసిన ఈ ఆలయం ప్రశాంతంగా చక్కగా ఉంది.

నదికి ఎడమవైపునగల గుట్టక్రింద విశాలమైన దరి ఉంది. దాని క్రింద ఇంతవరకు హనుమత్ప్రతిష్ఠ ఉండేది. అక్కడ ఇపుడు తిరుమలనాథాలయం వెలిసింది.

ఈ గ్రామం నాగర్‌కర్నూలులో లబ్ధప్రతిష్ఠులైన శ్రీ చిక్కేపల్లి రామచంద్రరావుగారి గ్రామానికి సమీపం కాబట్టి ఆయనకు ఇక్కడ ఈ దరిక్రింద వెంకటేశ్వర ప్రతిష్ఠ చేయవలెనని ఎంతోకాలంనుండి కామన ఉన్నది. అందుచేత క్రీ.శ. 1972 లో ఆయన ఇక్కడ ఈ స్వామిని ప్రతిష్ఠించి ఆలయం కట్టించినాడు. ఇది గూడ మంచి ప్రశాంతమైన స్థలంతో వెలసిన ఆలయం. ఉన్నంతలో హుందాగాను, అందంగాను ఉంది. నిత్యార్చనలతో విరాజిల్లుతూ దర్శించదగినదిగా ఉంది. ఇక్కడ ఏటా బ్రహ్మోత్సవం జరుగుతుంది.

22. దౌలతాబాదు

కోడంగలు తాలూకాలోని ఈ గ్రామం ప్రస్తుతం ఒక మండల కేంద్రం. ఈ గ్రామానికి పడమట ఒక ఫర్లాంగుపై ఒక గుట్ట ఉంది. దానిపై ఈ ఆలయం కట్టబడింది. ఇది ఈ జిల్లాలోని ప్రాచీనాలయాలలో ఒకటి. ఇది ప్రాఙ్ముఖాలయం. దీనిలో వెంకటేశ్వరస్వామి, అతని కుడి వైపున పద్మావతీదేవి ఉన్నారు.

ఈ ఆలయానికి కుడివైపున ఒక చెరువు గూడ ఉంది. దానికి వెంకటేశ్వరుని చెరువని పేరు.

ప్రతిఏటా ఇక్కడ ఎండుకట్టె పున్నమకు జాతర జరుగుతుంది. అపుడు తాండూరు, నారాయణపేట డిపోల వారిక్కడికి బసులు వేస్తారు. ఈ జాతరలో అన్నిరకాల దుకాణాలు పడుతవి. ఉత్సవం వైభవంగా సాగుతుంది.

ఇదిగాక గ్రామానికి తూర్పున ఒక శివాలయం ఉంది. అది ఎత్తుగా అరుగువేసి కట్టబడింది. భక్తులు ప్రతి సోమవారం స్వామి నభిషేకిస్తారు. అదిగాక శివరాత్రికి యిక్కడగూడ ఉత్సవం నడుస్తుంది.

23. దగడ

కొల్లాపురం తాలూకాలోని పీవనగండ్ల మండలంలో చిన్న దగడ, పెద్ద దగడ అని రెండు గ్రామాలున్నవి. పెద్ద దగడ ప్రాచీనమయింది. ఇక్కడ తిరుమలనాథాలయం. శివాలయం రెండూ ఉన్నవి. రెండిటి ముందు కోనేర్లుకూడా ఉన్నవి కాని శివాలయం కోనేరు శిథిలమయింది. వెంకటేశ్వరు డిక్కడ తిరుమలనాథుడుగా ఆరాధింపబడుతున్నాడు.

ఈ తిరుమలనాథాలయం చక్కగా ఉంది. దానిముందు ఉన్న కోనేరులో ఉత్తరాభిముఖమైన గోడలకు కామశిల్పం గూడ ఉంది. ఈ ఆలయం కోనేటికి తూర్పున ఉంది. చక్కగా పూజ నడుస్తుంది.

24. నారద గిరి

ఈ ఆలయం వట్టెం గ్రామానికి వాయువ్యంగా ఉన్న ఒక గుట్టపై ఉంది. ఇది ఒక గుట్టల వరుస. దీనిపై వింధ్యవాసిని, భైరవ, నృసింహ, వెంకటేశ్వర ప్రతిష్ఠలున్నవి.

వింధ్యవాసినిని ఎవరు ప్రతిష్ఠించిరో తెలియదు. గ్రామస్థు లామెను వర్షాధిదేవతగా కొలుస్తారు. జానపదు లీమెను "ఇందిరేశమ్మ" అంటారు. గత శతాబ్దంలో ఈ గ్రామంలో ఉన్న చింతలపల్లివారనే స్మార్తులకు ఈమె కులదేవతగా ఉన్నది.

ఇక్కడి భైరవుని వర్ధమానపురాన్ని పాలించిన గోన గణపిరెడ్డి స్థాపించినాడని చెబుతారు.

నృసింహుని అక్కడి దొరగారైన రెడ్డి రెడ్డిరామన్నయ్యగారి అన్నగారు మోహనయ్యగారు ప్రతిష్ఠించినారు. అనంతరం ఆ స్వామికి స్థానికులైన గుంతవారనే వైశ్యులు మంటపం కట్టించినారు.

ఇక వెంకటేశ్వరుని స్థానికుడైన తిరునగరి లక్ష్మణదాసు ప్రతిష్ఠించినాడు. వీరు నంబివారు. లక్ష్మణదాసుకు ఇద్దరన్నగార్లున్నారు. తలిదండ్రి వివాహం తలపెట్టగా ఆయన అది యిష్టం లేక ఇంటినుండి వెళ్ళిపోయి తిరుపతిలో నివసించగా ఒకనాడు స్వామి కలలో కనిపించి, 'నీ విక్కడెందుకున్నావు, నేనే అక్కడికి వస్తాను పద' అన్నాడు. అది విని మేలుకొని ఆయన ఆ కలకు అద్భుతపడి అక్కడ తనకు పరిచయమైన ఒక సాహుకారితో చెప్పగా ఆయన లక్ష్మణదాసుగారికి లక్ష్మీ వెంకటేశ్వర ప్రతిమ లిప్పించినాడు. అపుడాయన వానిని వేంచేపు చేసికొనివచ్చి గ్రామంలోని చెన్నకేశవాలయంలో ఉంచి పూజించుతూ తొమ్మిదిరేకులనుండి కాసె రామన్నగారిని పిలుచుకువచ్చి ఇపుడున్న

ఆలయం కట్టించి దానిలో స్వామిని క్రీ.శ. 1880 ప్రమాది ఫాల్గుణ శుద్ధ త్రయోదశినాడు ప్రతిష్ఠ చేసినాడు.

ఈయన బ్రహ్మచారి. క్రీ.శ. 20-8-1923 నాడు పరమపదించి నాడు. అపుడు వెలుగొండ రామారావుగారి సమక్షంలో అన్నగారి కుమారుడైన సీతారామదాసును దత్తు తీసికొని ఈ ఆలయం బాధ్యతలు అతని కప్పగించినాడు.

ఈయన కాలంలోనే రామారావుగారికి ప్రథమ కళత్రం మరణించి పిశాచమై ఆయన్ను పీడించసాగింది. అపుడాయన ఒక సంవత్సరం నిష్ఠతో ఈ స్వామిని సేవించి ఆ బాధనుండి విముక్తుడై స్వామివారికి మంటపం, ఇపుడున్న రథశాల కట్టించినాడు.

ఈ ఆలయం గుట్టపై విశాలమైన స్థలంలో ప్రశాంత వాతావరణంలో ఉంది కాబట్టి తప్పక ఉద్ధరించదగింది.

లక్ష్మణదాసు ఫాల్గుణ శుద్ధ నవమినాడు పరమపదించినాడు కాబట్టి ఇపుడిక్కడి ఉత్సవం ఆయన ఆరాధనతో ప్రారంభమవుతుంది.

వీరిది కవికుటుంబం; కాబట్టి లక్ష్మణదాసు ఈ స్వామిపై ఎన్నో కీర్తనలు రచించినాడు. అవి ప్రౌఢమై సరసంగా ఉన్నవి. ఆయన అనంతరం అదే వంశానికి చెందిన నరహరి కవి ఈ స్వామిపై నారదగిరి మాహాత్మ్యం అనే కావ్యం రచించినాడు. అది ముద్రితం.

రామారావుగారి వృత్తాంతం - ఆయనకు ఇద్దరు భార్యలైనారు. ప్రథమ భార్య ఒక కుమారుని కని మరణించి కామినీ పిశాచమై బాధించటం మొదలుపెట్టింది. దినదినం నిద్రలో వచ్చి ప్రక్కలో కూర్చునేది. కొంత కాలానికి ఆయనకు మూత్రంలో రక్తం గూడ పోవటం ప్రారంభమయింది. ఎన్నిమందులు తిన్నా మంత్రాలు వేయించుకున్నా తగ్గక, బ్రతుకుపై ఆశ

వదులుకొని స్వామి సన్నిధిలో మరణింతామని వచ్చి నారదగిరిపై నివసించినాడు. అపుడొకనాడు అతనికి స్వామి కలలో కనిపించి, ఆ గుట్టపై ఒక చోట ఒక మూలికను చూపి దాన్ని మాలగా ధరించమని చెప్పినాడు. ఆ స్వప్నానికి మెలకువ కలిగి అత డాశ్చర్యపడినాడు. కొంత సేపటికి నిద్రపట్టగా మళ్ళీ అదే కల వచ్చింది. అంతేగాక స్వామి అదే రాత్రి సీతారామదాసు కలలో గూడ వెళ్ళి ఆ మూలికను చూపి, దాన్ని రామారావు మెడలో ధరింపచేయమని చెప్పినాడు. ఆయన ఆ స్వప్నానికి అద్భుతపడి తెల్లవారిన పిమ్మట గుట్టకు రాగా ఆ యిద్దరొకరి కలలు ఒకరికి చెప్పుకొని ఆశ్చర్యపడినారు. అనంతరం సీతయ్య అతనిని ఆ గుట్టపై స్వామి చూపిన స్థలానికి తీసికొనివెళ్ళి అక్కడవున్న మూలికను గుర్తించి దాని తీగను త్రెంపి కడియంగా చుట్టి అతని మెడలో వేసినాడు. నాటినుండి ఇక ఆమె అతని ప్రక్కలోనికి రావటం మాని దూరంగా నిలిచి మెడ నుండి దాన్ని తీయమని దీనంగా ప్రార్థించసాగింది. ఆ విధంగా ఒక నెల జరుగగా ఆయన చూదామని దాన్ని మెడనుండి తీసినాడు. ఆమె యథావిధిగా వచ్చి మళ్ళీ అతని ప్రక్కలో కూర్చోసాగింది. అతనికి తిరుగు ముఖం పట్టిన జబ్బు మళ్ళీ తిరుగబెట్టింది. దానితో ఆయన భయపడి స్వామికి క్షమాపణ చెప్పుకుని దాన్ని మళ్ళీ మెడలో ధరించినాడు. అంత ఒకనాడిక ఆమె కలలో అతన్ని పెద్దగా దూషించి వెళ్ళిపోయింది. ఆ విధంగా ఆమె వెళ్ళిన పిదప సీతయ్యగారా మూలిక యొక్క కొంత భాగాన్ని ఒక తాయెత్తులో పొదిగించి అతని మొలకు కట్టించినాడు. అనంతరం ఆయన పూర్తిగా ఆరోగ్యవంతుడై, మళ్ళీ వివాహం చేసికొని సంతానవంతుడై, బ్రతికినంతకాలం బ్రహ్మోత్సవాల సమయంలో స్వామి వారి ఆలయం ముందు ద్వారపాలకుడై నిలిచి సేవించినాడు. ఈయన వంశం ఇపుడు గౌరిటలో ఉంది.

25. నెక్కొండ

నెక్కొండ జడ్చర్ల తాలూకాలోని గ్రామం; అదే మండలంలోనే ఉంది. దుందుభీ తీరంలోనిది. ఇది ప్రాచీన గ్రామాలలో ఒకటి. ఇక్కడికి గంగాపురం నుండి వెళ్ళవలె.

ఈ గ్రామం స్వాతంత్ర్యానికి పూర్వం ఫర్ఖంద్ నవాబుగారి జాంగీరు. ఆయన కిక్కడ నూరు భీగాల భూమి మాత్రమే జాగీరుగా ఉండగా గ్రామ కరణం భాస్కర రావుగారి నాశ్రయించి దానిని నూరెకరాలు చేయించుకున్నాడట.

ఈ గ్రామంలో నవాబుగారి జాగీరేగాక రెడ్డి రెడ్డి దొరలకు సేరీ గూడ ఉంది.

ఇక్కడ ఊరి వెలుపల ఉత్తరంగా పెద్ద కొండ ఉంది. దాని పాదంలో దుందుభీనది విలువంపు తిరిగింది. కొండపై నిలిచి చూస్తే ఈ ప్రదేశం మనోహరంగా కనిస్తుంది. ఇది నదీ పర్వతాల సంగమ స్థలం కాబట్టి దేవతా ప్రతిష్ఠలకు ఎంతో అనువైన ప్రదేశం. అందుచేత పూర్వం ఇక్కడ నెక్కొండ సానువుపై ఆలయం ఉండేది. దాని ప్రక్కన వైజయంతీ పురాన్ని పరిపాలించిన సోమేశ్వరుని పేర్కొనే శాసనం ఉంది. ఈనాడు ఈ ఆలయం లేదు. దాని అవశేషాలు మాత్రం మిగిలినవి.

ఈ కొండ ఒక సుమారైన ఎత్తుగానే ఉంది. దాని శిఖరంపై విశాలమైన చౌరిక ఉంది. దాన్ని గర్భంగా చేసుకొని పూర్వం ఎవరో వెంకటేశ్వరాలయాన్ని ప్రతిష్ఠించినారు. ఇక్కడి స్వామి మన్నెంకొండలో వలె చౌరిక క్రిందనే ఒక గుండుకు వెలసినాడు.

స్వాతంత్ర్యంకంటే మొదలీ గ్రామానికి 'నాగదాసు' అనే ఒక హరిదాసు వచ్చి ఈ ఆలయంలో మకాం పెట్టినాడు. ఎంత చీకటిగాని

ఆలయంలో ఒక్కడే నిర్భయంగా ఉండేవాడు. ఆయన వైశ్యుడు. చుట్టు పట్ల సంచారంచేస్తూ, హరికథలు చెప్పి, వచ్చిన డబ్బుతో ఈ ఆలయాన్ని పునరుద్ధరించినాడు. అంతేగాక, గుట్టపైకివెళ్ళే దారిలో ఒక హనుమదా లయం గూడ కట్టించినాడు.

ఆయన సుమారుగా ఇక్కడ ఒక పుష్కరంపాటు ఉండి వెళ్ళి నాడు. వచ్చినపుడెక్కడినుండి వచ్చినాడో అలాగే వెళ్ళేనాడెక్కడికి వెళ్ళి నాడో ఎవరికీ తెలియదు. కాని నాగదాసు స్వామివారికి నిస్వార్థంగా చేసిన సేవమాత్రం ఈనాడు మనకిక్కడ కనిపిస్తుంది.

అతడు వెళ్ళిన పిమ్మట మళ్ళీ స్వామిని ఎవరూ పలుకరించేవారు లేకుండా అయినారని స్థానికుడైన ఆర్. విష్ణువర్ధనరెడ్డిగారు చెప్పినారు.

26. పడకల్లు

పూర్వం ఈ జిల్లాలో "పడకల్లు"లు రెండున్నవి. వానిలో ఒకటి ఇపుడు రంగారెడ్డి జిల్లాకు పోయింది. దాన్నిపుడు కోళ్ళ పడకల్లు అంటున్నారు. రెండవది యిపుడు కలువకుర్తి తాలూకాలోని తలకొండ పల్లె మండలంలో ఉంది. దీని ప్రక్కన పెద్దూరు అనే గ్రామం ఉంది. అక్కడ వెంకటేశ్వరాలయాన్ని నరసింహారెడ్డి, రంగారెడ్డి అనే సోదరుల పూర్వులు స్థాపించిరట.

ఈ నరసింహారెడ్డి గారు వనపర్తి యిలాకాలో తహశీలుదారుగా ఉండి, ఈ ఆలయాభివృద్ధికి చాలా కృషిచేసి, ఎందరితోనో దీనికి బావులను దానంగా యిప్పించినాడు. ఆ విధంగా ఇది ప్రసిద్ధి చెందింది కాబట్టి దీని ప్రక్కన ఉన్న "పడకల్లు" ఇపుడు 'దేవుని పడకల్లు' అని పిలువబడు తుంది.

ఈ ఆలయం విశాలమైన ఆవరణలో ఉంది, ఆండాళు సన్నిధి కూడా ఉంది. పూర్వం ఈ సన్నిధి ప్రక్కనే శివాలయం కూడ ఉన్నది కాని ఇపుడు దాని ద్వారం వేరుగా చేసినారు.

ఈ ఆవరణంలో కొత్తాయి మంటపం కూడా ఉంది. ఇపుడు "కామన్ గుడ్ ఫండు" నుండి ఆర్థిక సహాయాన్ని గూడ పొంది చక్కగా మూడంతస్తుల గాలిగోపురం గూడ నిలిపినారు.

ఏటా బ్రహ్మోత్సవం వైభవంగా నిర్వహింపబడుతూ ఉంది.

27. పాలమూరు

ఇది పాలమూరిలో దరిపల్లె గేటుదగ్గిర ఒక గుట్టపై ఉంది. పాలమూరు, లోకయ్యపల్లె దొరల గ్రామం. అక్కడ అంతవరకు రుక్కమ్మపేట అనే గ్రామం ఉండేది. దాన్ని శ్యాంరావుగారి భార్య రుక్కమ్మ తన పేర ఏర్పాటు చేసింది. అనంతరం పాలమూరు గూడ వారి కాలంలోనే ఏర్పడింది. అక్కడ వారిది పెద్దకోట ఉండేది. వీరు తిరుపతి వెంకటేశ్వరుని భక్తులు. ఒకనాడు ఆ వంశంలోని ఒక వ్యక్తి తిరుపతికి వెళ్ళి స్వామిని దర్శించి అక్కడినుండి ఒక మూర్తిని వేంచేపు చేసుకొని వచ్చి ఈ గుట్టపై ప్రతిష్ఠించి స్వామివారి పేర దానికి తిరుమల దేవుని గుట్ట అని పేరు పెట్టినాడు.

ఆ కాలంలో దసరా ఉత్సవాలు కాని, మరే సార్వజనికోత్సవం గాని ఈ గుట్టపైననే స్వామి సన్నిధిలో జరిగేవి. ఈ ఆచారం దాదాపు స్వాతంత్ర్యం వచ్చేనాటివరకు నడిచింది.

ఇక్కడి ఆలయం నిరాడంబరంగా సుందరంగా ఉంది. దీనిలో స్వామి వారితోపాటు ఆంజనేయ స్వామి ప్రతిష్ఠ గూడ ఉంది.

ఈ స్వామిపై పెద్దమందడి వెంకట కృష్ణకవి "తిరుమలనాథ స్వామి శతకం" ఒకటి రచించినాడు. అది ముద్రితం.

ఈలాగే బూదపురం దగ్గర గల తిరుమలయ్యపల్లె గుట్టపై గూడ ఒక తిరుమల దేవుడున్నాడు.

28. పాలెం

పూర్వం గ్రామాభివృద్ధికి ఆలయాలు, జాతరలు ఒక ముఖ్య కారణంగా ఉండేవి. ఈనాడాస్థానం విద్యాలయాలు, పరిశ్రమలు ఆక్ర మించినవి. పాలమూరు జిల్లాలో ఆ రెండింటిచేత త్వతర్వరగా అభివృద్ధి చెందిన గ్రామాలలో పాలెం ఒకటి. ఈ పేరుతో అనేక గ్రామాలుండటం కద్దు. ఇది నాగర్ కర్నూల్ తాలూకాలోనిది. అక్కడి ప్రాచీనగ్రామాలలో ఒకటి. ఇపుడు ఇది బిజినపల్లె మండలంలో ఉంది. ఈ గ్రామాభివృద్ధికి కారకుడు శ్రీ తోటపల్లి సుబ్బయ్యగారు. ఆయనగారి ప్రేరణచేతనే ఇక్కడ వెంకటేశ్వరుడు వెలసినాడు.

ఈ గ్రామానికి వెంకటేశ్వరుడు క్రొత్తగాదు. ఇప్పటి ఆలయం కంటె మొదలుగూడ ఇక్కడొక వెంకటేశ్వరాలయమున్న దాఖలా ఉంది. శివాలయంగూడ ఉండేది. కాని కాలక్రమంలో వానిలోని దీపం ఆరిపోయి మళ్ళీ ఈ నూతనాలయావసరం ఏర్పడింది. ఇక్కడి ఆలయాన్ని మనుసాని నీలకంఠయ్యగారి కుమారులు రామలింగయ్య, బాలలింగయ్య గారలు కట్టించినారు. ఇది సిమెంటు నిర్మాణం. దీనికి క్రీ.శ. 1961 లో శంకుస్థాపన జరిగింది. అప్పటి జిల్లా పరిషదధ్యక్షుడు శ్రీ కె. రామ చంద్రారెడ్డిగారు శంకుస్థాపన చేసినారు. ఆరు నెలలు దాటేవరకు ఆలయం ఏర్పడి, క్రీ. శ. 14-5-1962 నాడు స్వామివారి ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఈ ప్రాంతంలో ఇది వనపర్తి ఆలయానికంటె మొదటిది.

స్వామివారి ప్రతిష్ఠానంతరం రెండేండ్లలోపల క్రీ శ.21-9-1964 నాడు ఆలయం కట్టించినవారే పద్మావతిదేవిని గూడ ప్రతిష్ఠించారు. దేవికి ఆ మరుసటి ఏట జిల్లా పరిషత్ చైర్మెన్‌గారి సతీమణి జయ లక్ష్మమ్మగారు శుకనాసం కట్టించింది.

ఈ ఆలయానికి ముందు విశాలమైన మంటపం ఉంది. దానిలో ఒక భాగాన్ని క్రీ. శ. 1977 జనవరిలో మనుసాని శంకరయ్యగారి కుమారుడు రాములుగార్లు ఆళ్వారు ప్రతిష్ఠ చేయించినాడు.

ఈ విధంగా ఈ ఆలయం నేడు సమగ్ర స్వరూపాన్నంటటమే కాక శిల్పశోభితం గూడ అయింది. ఇటీవల ఇక్కడ ఆలయాని కను బంధంగా అన్నసత్రం గూడ ఏర్పడింది.

ప్రతిఏటా మాఘంలో ఇక్కడ బ్రహ్మోత్సవం నడుస్తుంది. రథసప్తమినాడు రథోత్సవం వైభవంగా జరుగుతుంది. ఆ సమయంలో డిపోల వారిక్కడికి ప్రత్యేకమైన బస్సులు గూడ నడుపుతారు.

వెంకటేశ్వరాలయం తరువాత ఇక్కడ శివాలయం గూడ మళ్ళీ ఒకటి స్థాపించబడింది. దాన్ని 9-2-1981 నాడు రామబ్రహ్మేశ్వరాలయం పేర మనుసాని శంకరయ్యగారి కుమారుడు రాములుగారు కట్టించి శివ ప్రతిష్ఠ చేయించినాడు. అదే ఏట జూన్ 14 నాడు మనుసాని శంకరయ్య గారు నవగ్రహ ప్రతిష్ఠగూడ చేయించినారు. ఈ ఆలయాలు వెంకటేశ్వరా లయానికి ఎడమ వైపున ఉన్నవి.

ఇవిగాక ఇక్కడ ప్రాత గ్రామంలో హనుమదాలయం శివాలయం ఉన్నవి. హనుమదాలయాన్ని గ్రామస్థులు పునరుద్ధరించినారు.

ఇవిగాక ఇపుడు కొత్త గ్రామంలో బానూరు నాగన్నగారి ఆలయం కూడా ఒకటి కట్టబడింది. ఈయన ఈ ప్రాంతంలో ఒక

ప్రసిద్ధమైన పాముల మంత్రవేత్త. ఈయన జీవితంపై "నాగమణి" అనే నవలిక ధారావాహికంగా "మూసీ" పత్రిక ప్రకటించింది.

29. పెంట్లవెల్లి

ఈ గ్రామం కొల్లాపురానికి ఐదు మైళ్ళుంది. అదే మండలానికి చెందింది. కొల్లాపురం బస్సు నేరుగా అక్కడికి గూడా వెళ్ళుతుంది. ఇది జటప్రోలు వారికి మూడవ రాజధాని. క్రీ. శ. 1742 లో రాజా చిన్న మాధవరావు గారిక్కడ నుండి పాలించి ఈ గ్రామంలో శివ కేశవాలయాలు కట్టించి బ్రహోత్సవా లేర్పాటు చేసినారు. ఇవిగాక ఇక్కడ రామాలయం, కన్యకాపరమేశ్వరి గుడి కూడా ఉన్నవి. రామాలయం క్రీ. శ. 1950 ప్రాంతంలో కట్టబడిందని చెబుతారు.

ఇక్కడ మాధవరాయలు కట్టించిన కేశవాలయం ప్రస్తుతం వెంకటేశ్వరాలయంగా చలామణి అవుతుంది. స్వామివారికి బ్రహోత్సవాలు కూడా నడుస్తవి.

30. పెద్దదిన్నె

పెద్దదిన్నె గద్వాల అలంపూరుల నడుమ ఇటిక్యాల రైల్వే స్టేషన్‌కు రెండు మైళ్ళ వుంటుంది. కాబట్టి అదే మండలానికి చెందింది. ఈ గ్రామం ఎత్తయిన దిబ్బమీద వుంది. కాబట్టి దీన్ని దిన్నె అంటున్నారు. ఈ గ్రామంలో వెంకటేశ్వరస్వామి ప్రసిద్ధి. శివాలయం గూడ ఉంది.

స్వామివారి మూర్తి మూడున్నర అడుగుల ఎత్తున నిలుచున్నట్టుగా, అమ్మవారి మూర్తి కూర్చున్నట్టుగా వుంటవి. స్వామివారికి గర్భాలయం ఒక కురువ కట్టించెనట. కాబట్టి గర్భాలయ ప్రవేశ ద్వారంపై అతని మూర్తియే చెక్కబడింది.

ఈ కురువలు గద్వాల ప్రభువుల దగ్గర సేనానులుగా ఉన్నారు. వీరు సంస్కారవంతులంటారు.

గద్వాలలో కురువలకు, బోయలకు పదవులు అధికారాలు ఉన్నవి. వారు రాజసేవకులుగా ఉన్నారు. ఈ ఆచారం వారికి హనుమప్పనాయని కాలం నుండి ఏర్పడింది అంటారు. వీరు సైనికులుగా కూడ ఉన్నారు. ఇక్కడ ప్రతి యేటా పుష్య శుద్ధ దశమి నుండి త్రయోదశి వరకు బ్రహ్మోత్సవం జరుగుతుంది. మొదటినాడు కల్యాణం - రెండవ నాడు ప్రభల ఉత్సవం - మూడవనాడు రథోత్సవం - నాలుగవనాడు పారువేట జరుగుతుంది.

ఈ ఉత్సవంలో ఆటల పందేలు ఒక ప్రత్యేకత. అదిగాక ఇక్కడ పశువుల సంత. ఎడ్ల పందెం గూడ ప్రత్యేకాకర్షణ. దీనిలో - 13 × 3 × 3 అడుగుల బండను పశువులతో లాగించి, ప్రథమంగా నెగ్గిన దానికి ఆరు తులాల వెండికడియం, ద్వితీయ బహుమతిగా నాలుగు తులాల వెండి కడియం బహూకరిస్తారు. ఇక్కడి పూజారులు చాత్తాద వైష్ణవులు. స్వామివారి మాన్యాలు వారే అనుభవిస్తారు. దినదినం స్వామికి అభిషేకం, రాత్రికి పవళింపు సేవ నిర్వహిస్తారు.

31. పెద్దపల్లి

ఈ గ్రామం నాగర్‌కర్నూలు నుండి కొల్లాపురం సర్వీసు రూటులో ఉంది. ఇది క్రీ. శ. 1123 నాటి వర్ధమానపురంలోని గోన గణపిరెడ్డి శాసనంలో పేర్కొనబడింది. దీన్ని పూర్వం జిల్లెళ్ళరెడ్డి అనే దేశాయి గారు పాలించినారు. అతడు ఎప్పటివాడో తెలియదు.

ఆయన కాలంలో ఇక్కడికి సంచారవశంగా దేవేంద్రపురి, ఉపేంద్రపురి, నరేంద్రపురి అనే ముగ్గురు సన్యాసులు వచ్చి, ఆ రాత్రి గ్రామానికి పడమరగా ఉండే ఒక విశాలమైన చట్టుపై నిద్రించినారు.

వారికా రాత్రి స్వప్నంలో ఆ సమీపంలో ఒక చోట నేలలో వెంకటేశ్వరు డున్నట్లు, తనను వెలికి తీసి ప్రతిష్ఠించమని చెప్పినట్లు కల వచ్చింది. ఆ కలకు అద్భుతపడి దేవేంద్రపురి మేలుకొని, మరునాడు కొందరు పని వారిని పిలుచుకొని తనకు స్వప్నంలో కనిపించిన స్థలం గుర్తించి త్రవ్వించగా వారికి అక్కడ ఒక వెంకటేశ్వర ప్రతిమ లభించింది. అంతేగాక, ఆ త్రవ్వినచోట ఒక బుగ్గ గూడ బయలుపడింది. అపుడు దేవేంద్రపురి ఆ స్వామికి బుగ్గ వెంకట రమణుడని పేరు పెట్టి, రాత్రి తాము నిద్రించిన చోటనే ఒక చిన్న ఆలయం కట్టించి స్వామిని ప్రతిష్ఠించినాడు.

అది తెలిసి జిల్లెళ్ళరెడ్డి అక్కడికి వచ్చి స్వామిని దర్శించి అతనికి ఒక భూదానం గూడ చేసినాడు. అనంతరం ఉపేంద్రపురి అక్కడ మరొక నూతన గ్రామానికి, నరేంద్రపురి ఒక చెఱువుకు పునాది వోసినారు. ఆ గ్రామం, ఆ చెఱువే ఇపుడిక్కడ ఉన్నవి.

ఇక్కడి స్వామికి మొదట కపిలవాయివారనే విశ్వబ్రాహ్మణు లర్చకులుగా ఉన్నారు. ఆ వంశంలో లక్ష్మయ్య అనే వ్యక్తి స్వామివారికి ఉత్సవమూర్తులు తెప్పించి బ్రహ్మోత్సవం ఏర్పాటుచేసినాడు. ఆ తరువాత కొన్ని తరాలకు ఆ లక్ష్మయ్య వంశీయుడు తెలకపల్లె కిష్టయ్యగారు స్వామివారికి కవచ కిరీటాదులు చేసినాడు. కాని అవి ఈనాడు లేవు.

ఆ కిష్టయ్యగారి సగోత్రీకుడైన కపిలవాయి లింగమూర్తి ఈ స్వామిపై చక్రతీర్థమాహాత్మ్యం అనే కావ్యం రచించినాడు. అది క్రీ.శ. 1980 లో ముద్రింపబడింది.

ఇక్కడ ఏటా మాఘంలో మూడు దినాల ఉత్సవం సాగుతుంది. ప్రస్తుతం వింజమూరివారు పూజారులుగా ఉన్నారు. ఇపుడీ గ్రామం తెలకపల్లె మండలంలో ఉంది.

32. బండ్రవెల్లి

ఈ గ్రామం మన్నెంకొండకు పది కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ కోయిల్‌సాగర్ అలుగు పారుతూ ఉంది. దాని తీరంలో ఇపుడు గ్రామస్థులు ఒక వెంకటేశ్వరాలయం కట్టినారు. ఆధునిక నిర్మాణాలలోని అందమైన ఆలయాలలో ఇది ఒకటి.

ఇక్కడ గ్రామంలో ప్రాచీనమైన హనుమదాలయం గూడా ఉంది. అది కూడా చక్కగా ఉంది.

33. బిజ్జినపల్లి

నాగర్‌కర్నూలు తాలూకాలోని పురాతన గ్రామాలలో ఇది ఒకటి. జడ్చర్ల మార్గంగా వనపర్తి, అచ్చంపేట వెళ్ళే బండ్లన్నీ ఈ గ్రామాన్ని తట్టకుండా వెళ్ళలేవు. ఇది ఒక కూడలి.

ఇక్కడ చెన్నకేశవాలయం, బీరప్ప గుడి, చౌడమ్మ గుడి ఊరికి దక్షిణంగా శివుని గుట్ట, దానిపై పురాతన శివాలయం, భైరవ ప్రతిష్ఠ, నైఋతి దిక్కున ఆనందగిరిపై వెంకటేశ్వరాలయం ఉన్నది. వెంకటేశ్వరాలయం తప్ప తక్కినవన్నీ ప్రాచీనాలు. చౌడమ్మ గుడిలోను, శివుని దగ్గర చిన్న శాసనం ముక్కలు గూడ ఉన్నవి.

శివాలయం ముందు ఓ గుండుపై ఓరుగల్లు ద్వారం, దానిపై త్రిశూలపు గుర్తు చెక్కబడింది. ఈ ఆలయం ప్రక్కన ఒక సామాన్యమైన రాతిబండపై గన్నయరెడ్డి గారిది చిన్న శాసనం ఉంది. గుండుపై ఆ గుర్తుండడం ఎందుకో ఆలోచింపవలసిన విషయం.

వెంకటేశ్వరాలయాన్ని క్రీ. శ. 1940 ప్రమాది శ్రావణ శుద్ధ పాడ్యమి భానువారం నాడు కోటకదిర చంద్రమౌళీశ్వర స్వామి ప్రతిష్ఠించి ఆ గుట్టకు ఆనందగిరి అని నామకరణం చేసినాడు.

స్వామి ఇక్కడ స్వయం వ్యక్తుడు. ఒక రాతిలో కనిపించినాడు. ఈ ఆలయం ఆడంబరరహితంగా, గర్భాలయం ముందు ఒక మంటపం మాత్రం కట్టబడినవి.

పూర్వం ఈ గ్రామంలో ఏటేట గజ్జెల పాపమ్మ జాతర గొప్పగా సాగేది. ఆమె తవాయి వికారి సంవత్సరంలో క్రి. శ. 1900 ప్రాంతంలో వచ్చింది. ఆ దేవి ఆవేశించిన వారికి స్వప్నంలో గజ్జెల కంజరీ చప్పుడు వినిపించేదట. గ్రామదేవతలలో మోడెంపల్లి ఎల్లమ్మ, గజ్జెల పాపమ్మ ఇద్దరూ మధుర పదార్థాలు కోరే దేవతలు. గజ్జెల పాపమ్మ గుడి ఇప్పటికి గాజులకుంట వెనుక ఉంది.

ఆ జాతర పడిపోయిన కొంత కాలానికి మళ్ళీ అదే నెలలో ఆనందగిరిపై బ్రహ్మోత్సవాలారంభమైనవి.

పాలెంలో వెంకటేశ్వరుడు వెలసిన నాటికీ ప్రాంతంలో బిజినపల్లె జాతరకే ఎక్కువ ప్రసిద్ధి. దీనిలో పశువుల సంత జరుగుతుంది. పాలెం జాతర ముగిసే దినాలలో ఇది ఆరంభమవుతుంది.

చంద్రమౌళీశ్వరస్వామి ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించిన పిమ్మట కొన్ని దినాలకు ఈ స్వామికి మళ్ళీ పద్దవాని నరసింహయ్య సిద్ధాంతిగారు సంప్రోక్షణ చేసినాడు. ఆయన వైష్ణవులు. బిజినపల్లె సాతాని బుచ్చయ్యగారు, ఎత్తంగానిపల్లె వడ్ల బాలయ్యగారు, కోటకదిర చంద్రభాగమ్మగారు వీరందరూ ఒక కూటమిగా ఉండేవారు. వీరీ స్వామికి సంప్రోక్షణ చేసిన పిమ్మటనే ఇక్కడ జాతర ప్రబలమయిందని అంటారు.

34. మన్నెంకొండ

మన్నెంకొండ గుట్టలు పాలమూరు నుండి మక్తల్ రోడ్డున ధర్మాపురం దాటిన పిమ్మట కోటకదిర కెదురుగా సుమారు 120 ఎకరాల మేరలో వ్యాపించి ఉన్నవి. వాని ఎత్తు సముద్రమట్టానికి 16 నుండి 17 వందల అడుగుల వరకుంది.

ఈ గుట్టల క్రిందనే చరిత్ర ప్రసిద్ధమైన కందూరు చోళుల తొలి రాజధాని కోడూరు ఉంది. దానిపై చాళుక్యసేనాని మన్యం తిప్పయ్య దండెత్తినాడు. ఆహవమల్ల సోమేశ్వరునిపై దండెత్తిన అధిరాజేంద్రుడు పూడూరు యుద్ధంలో "మణితిప్పె" రాజభవనాన్ని దహించినట్లు తమిళ శాసనాలలో చెప్పబడింది. ఆ మణితిప్పె నేటి మన్నెం కొండయే అని పరిశోధకుల మతం. నేడు స్వామివారి గుట్ట కీశాన్యంగా ఉండే కోట గట్టుపై ఆనాటి చోళుల దుర్గావశేషాలున్నవి.

ప్రస్తుతం దేవుడున్న గుట్టకు మునుల కొండ అని పేరుంది. పూర్వం దీనిపై వారు తపం చేసికునేవారట. ఈ గుట్టకు నైఋతిగా కొంతదూరంలో నందిదొన అనే గట్టు ఉంది. అక్కడ గూడ మునులుండే వారట.

స్వామి కొండకంటె మొదట దీనికి సమీపానగల చౌదరిపల్లెలో ఉండేవాడు. అక్కడ ఒక వ్యక్తికి ఆవేశించి, నేనిక్కడ ఉండను అని చెప్పసాగినాడు. మొదటిసారి అతని మాట లెవరు లెక్క చేయలేదు. కాని ఆవిధంగా రెండవ మూడవ తూరి జరిగే వరకు ఊరివారు, నీవెక్కడుంటావని అడిగినారు. అతడు తొలువని పాదాలు, త్రవ్వని కోనేరు, కట్టని గుడిగల స్థలాన ఉంటానని చెప్పినాడు. అది ఎక్కడని వారడిగినారు. గణాచారి అడవి దారి పట్టి నేటి మన్నెంకొండకు వచ్చినాడు. దానిపై రెండు దరులున్నవి. పైన ఉత్తరం దరి, తూర్పు దరి దానిక్రింద ఉంటవి. ఉత్తరం దరి క్రింద ఒక శివప్రతిష్ఠ ఉంది. దాన్ని ఆ గుట్టపై తపం చేసుకొనే వారెవరు నిలిపినారో తెలియదు.

తూర్పు దరి దానికంటె మరికొంత విశాలంగా ఉంది, ప్రదక్షిణ వలయం గూడ దానిలో ఏర్పడింది. దాని వెన్నుగోడకు ఎడమవైపున శేషుని ఆకారంగా రేఖలు దీరి ఉన్నవి. దానికి సూటిగా ఉత్తరంగా కొండ

క్రింద ఒక కోనే దేర్పడింది. ఇదిగూడ ప్రకృతి సిద్ధమే. ముప్పదడుగుల లోతు ఉందట. దానికి తూర్పు దరి ఏటవాలుగా ఉంది. పడమటి దరికి ధ్యానస్థితుడై కూర్చున్న యోగివలె ఒక బొమ్మ ఏర్పడింది.

ఈ కోనేటికి వెనుక ఉత్తరదక్షిణంగా పెద్ద లోయ ఉంది. దాని తూర్పు దరి నిటారుగా ఉంది. అది శిలామయం. ఆ రాతిపై మిక్కిలి ఉన్నతుడైన వ్యక్తి ఎవరో లోయనుండి పైకి ఎక్కి వచ్చినట్లు స్పష్టంగా మూడు అడుగుజాడలున్నవి. అవి రాతిపై బురదలో దిగినట్లు పడినవి. వీటిని గణాచారి చూపేవరకు ఎవరూ గమనించలేదు. కనుక అతని మాటలలోని సత్యానికి వారి కాశ్చర్యం కలిగి, ఆనాటినుండి కొండపై పూజ ప్రారంభమయింది.

కోటకదిర సమీపంలోని ఒక పల్లెలో "తిరువడివారు" అనే ఈడిగ దంపతులుండేవారు. వారికి చాలాకాలం సంతానం కలుగలేదు. తిరుపతికి వెళ్ళి స్వామిని సేవించుకున్నారు. అతడు వారికి కలలో కనిపించి 'నా అనుగ్రహం చేత మీకు కుమారుడు కలుగుతాడు. అతనిని నా సేవకు అంకితం చేయండి' అని చెప్పి అదృశ్యమయినాడు. స్వప్న ప్రకారానికి వింత జెంది వారిల్లు జేరినాడు. స్వామివారు చెప్పినట్లే వారికి సంతానం కలిగింది. అతనికి వెంకయ్య అని పేరు పెట్టుకున్నారు. కుమారుడు పెద్దవాడైన పిమ్మట తండ్రి అతనికి జన్మవృత్తాంతం, వెంకటేశ్వరుని ఆదేశం చెప్పినాడు. అది విని నాటినుండి వెంకయ్య చౌదరి పల్లెకు వెళ్ళి స్వామికి పూలు, పత్రి ఇచ్చి రాసాగినాడు. అలా ఉండగా అతనికి స్వామి మన్నెంకొండపైకి వచ్చినట్లు తెలిసింది. అతనికి స్వామి మరింత దగ్గరయినందుకు సంతోషం కలిగి, వారం వారం వెళ్ళి ఆయన్ని పూజించడం మొదలు పెట్టినాడు. కొన్ని దినాలకతనికి స్వామికి నిత్య పూజ ఏర్పాటు చేయవలెననే కోరిక కలిగింది.

కోటకదిరలో అళహరి వారనే నంబి కుటుంబం ఉంది. వారు వెంకయ్య కుటుంబానికి గురువులు. ఆ వంశంలోని కేశవయ్య పేద తనంతో ఊరూర భిక్షాటనం చేస్తు, భూవసతి బాగా ఉండేది కాబట్టి వెంకయ్యతో ఒక పర్యాయం, తనకేదైనా ఆశ్రయం చూపమని కోరినాడు. అది విని ఆయన మొదటిసారిగా మన్నెంకొండ వెంకటేశ్వరునికి నాలుగెకరాల భూమిని దానం చేసి, దాన్ని అనుభవిస్తూ స్వామికి నిత్య పూజాదులు నిర్వహించమని చెప్పినాడు.

కేశవయ్యగారి బండి దారిలో పడింది. వెంకయ్యగారికి సంతానం గూడలేదు. ఆయన వ్యవసాయమంతా కేశవయ్యయే అరసికునేవాడు. కాలాంతరంలో ఆ భూమి గూడ వీరికే చెందింది.

స్వామిపూజకు నియమితుడైన పిమ్మట కేశవయ్య క్రమంగా ఆలయాభివృద్ధికి పాటుబడుతూ, తిరుపతికి వెళ్ళి ఇపుడుండే మూర్తిని వేంచేపు చేసుకొని వచ్చినాడు

కేశవయ్యగారి మనుమడు హనుమద్దాసు. అతడు వివాహం చేసుకోలేదు. బ్రహ్మచారిగనే స్వామిని సేవిస్తూ జీవించినాడు. అతడీ ఆలయానికి పూజారి కావటం దాని చరిత్రలో గొప్ప మలుపు.

హనుమద్దాసు గొప్ప భక్తుడు. ఆయన కెందరో శిష్యులు, శిష్యురాండ్రు ఉన్నారు. వారర్పించే కానుకలచేత ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధిపరచినాడు. ఆ గుట్టపై ఎక్కడికక్కడ రాతికడీలు పరచి చదును చేయించి, ఆలయమంటపం, పూజారుల నివాసం, సత్రాలు గదులు ఇంకా ఎన్నెన్నో కట్టించినాడు. దానిపైకి మెట్లు వేయించినాడు. కారణజన్ముడై, స్వామివారిపై ఎన్నో కీర్తనలు రచించినాడు.

హనుమద్దాసుగారి అన్నగారు పాపయ్య. ఆయనకు రామయ్య, అంతయ్య అని ఇద్దరు కుమారులు కలిగినారు. హనుమద్దాసుగారి అనంతరం రామయ్యగారు పూజారి అయినాడు. ఈయన శిష్యుడు హనుమప్ప ఈ స్వామికి మరో అనన్య భక్తుడు.

మన్నెంకొండపై కోనేటిలో తప్ప ఆ చుట్టుపట్ల ఎక్కడా నీరు లేదు. అంచేత అక్కడివారు బావికొరకు మూడు, నాలుగు చోటులలో త్రవ్వినారు. ఎక్కడ త్రవ్వినా బండలే. చివరకు వారు నిరాశులు కాగా, స్వామి ఒకనాడు హనుమప్పకు కలలో కనిపించి, ఒకచోట నేలపై పాదంతో గిరిగీచి 'ఇక్కడ త్రవ్వండి, బావి పడుతుంది' అని చెప్పినాడు. అతడు మేలుకొని అది పనివారికి చెప్పినాడు. వారు నమ్మలేదు. కాని తుది ప్రయత్నంగా ఇదిగూడ చూదామని త్రవ్వగా అక్కడ చక్కని బావి, దానిలో ఇష్టం వచ్చిన నీరు పడింది. ఇపుడా చుట్టు బావులన్నీ ఎండినప్పటికి ఈ బావి పుష్కలంగా నీటితో ఉంటుంది. ఇది ఆ స్వామి మహిమకు మరో నిదర్శనం.

ప్రస్తుత ఆలయానికి అంతయ్యగారి కుమారుడు రామయ్య ధర్మ కర్తగా ఉన్నాడు. ఈయన కాలంలో ఆలయం శిల్పాభిరామమయింది. ముఖమండపాలపై సిమెంటుతో గోపురాలు కట్టి, వానిపై చక్కని ప్రతిమలు తీర్చబడినవి. జిల్లాకంతా మొదటి సారిగా ఆలయమంతా విద్యుదీకరించబడింది. గుట్ట క్రిందనుండి మోటారుతో నీరు పైకెక్కించి కొళాయీ లమర్చబడినవి. ఈనాడు ఆధునికమైన హంగులన్నీ సమకూర్చు కొని ఈ ఆలయం ప్రశాంత వాతావరణంలో ఒక ప్రత్యేకతగా అలరారు తుంద.

ఈ ఆలయం ఆధునికమైన హంగులతో ఇంత అభివృద్ధి కావటానికి కార్యనిర్వాహక వర్గంలోని వారణాసి గోవిందయ్యగారు ముఖ్యుడు. దీన్నిపుడు మూడు కొండల తిరుపతి అంటారు.

శ్రీ గడియారం రామకృష్ణశర్మగారు దీని చరిత్ర రచించినారు కాని, అది యింకా ముద్రించలేదు.

35. మొదలికల్లు

మొదలికల్లుకు ఆది శిలాక్షేత్రం, గిరిశాచలం అని పేర్లు. దీని మాహాత్మ్యం బ్రహ్మాండ పురాణంలో ఉంది. ఇప్పుడిది మధ్వక్షేత్రం. ఈ గ్రామం గద్వాల నుండి ఆదోని-మంత్రాలయం రోడ్డులో పన్నెండు కిలో మీటర్ల దూరంలో ఉంది. ఇప్పుడిది ఒక మండల కేంద్రం.

ఇక్కడ వెలసిన స్వామి స్వయంవ్యక్తుడు. ఒక గుండుపై వెలసినాడు. అక్కడ మూడు గుండ్లు ఒకదానిపై ఒకటి నిలిచి ఉన్నవి. స్వామి వ్యక్తుడైన గుండుకే చిన్న గర్భాలయం కట్టబడింది. ఈ స్వామిని స్థానికులు తిమ్మప్ప అని పిలుస్తారు.

ఇక్కడ దాసకూటంలో అర్జునాంశ సంభూతులుగా ప్రసిద్ధిచెందిన శేషదాసులవారు సిద్ధిని పొందినారు. ఆయన హుస్నాబాదులోని మాణిక్య ప్రభు సమకాలికుడు. ప్రస్తుతం ఇక్కడ స్వామివారికి దక్షిణంగా శేషదాసుల వారి సమాధి, వారిపేర అన్నదాన సత్రంగూడ ఉన్నవి.

ఈ క్షేత్రోద్ధారణకు పాటుపడిన వారిలో గొబ్బూరు సంజన్నగారు ముఖ్యుడు. ఆయన గద్వాలలో ఆదిలక్ష్మీదేవమ్మగారి దగ్గర రెవెన్యూ తహశీల్దారుగా ఉన్నాడు. ఇతడే స్వామిచరిత్రను ఆది శిలాక్షేత్ర మాహాత్మ్యమని పద్యకావ్యంగా రచించి, ఒక శతకాన్ని గూడ వ్రాసి దాని ప్రచారానికి తోడ్పడినాడు.

బీచుపల్లె వలె ఇక్కడ గూడ బోయవారు పూజారులు. వారు వంతుల ప్రకారం వారానికొకరుగా మారుతూ ఉంటారు. స్వామిని పూజించే కాలంలో నిష్ఠావంతులై జీవితం గడుపుతుంటారు.

ఇక్కడ ప్రధానాలయానికి కుడివైపున చిన్న గుడిలో, ఎడమ వైపున మరొక గుడిలో లక్ష్మి ప్రతిష్ఠలున్నవి. త్రికూటాకారమైన మూడడుగుల నడుమ కల్యాణమంటపం కట్టబడింది.

ఇది పూర్వాభిముఖమైన ఆలయం. దీని ముందు నాలుగు ధ్వజ స్తంభాలు, మూడడుగుల ఎత్తు ఏనుగలు ఉన్నవి. ఆలయానికి ఎడమవైపున పుష్కరిణి ఉంది.

ఆలయం యొక్క మహాద్వారం ఉత్తరాభిముఖంగా ఉంది దానిపై ఎత్తయిన గోపురం కట్టబడింది. ఆలయం చుట్టుగల ప్రాకారంలో పద్దెనిమిది మండపాలు కట్టబడినవి. వానిలో నాలుగు మండపాలు యాత్రికుల విడిదికి, నాలుగు అర్చకులకు, ఒకటి కార్యాలయానికి, ఒకటి ఉత్సవమూర్తుల భద్రతకు ఉపయోగింపబడుతూ తక్కినవి ఆలయ సిబ్బంది కీయబడినవి.

ఇక్కడ ప్రతియేటా మార్గశిర పౌర్ణమికి బ్రహ్మోత్సవం జరుగుతుంది. అప్పుడిక్కడికి కర్ణాటకలోని కల్లూరు, కల్వాల, మాన్వి, రాయచూరు, కొప్పల్, హుబ్లీ, ధార్వాడ మొదలైన దూరదూర ప్రదేశాల నుండి భక్తులు వస్తారు.

ఈ ఉత్సవంలో ఎద్దుల జాతర గూడ జరుగుతుంది. దానికి తూర్పు దేశంనుండి గూడ పశువులు వస్తవి. ఈ బ్రహ్మోత్సవమేగాక శ్రావణంలోనూ ఇంకా ఇతర దినాలలోను ఆలయ కమిటివారు విశేషోత్సవాలు జరుపుతుంటారు.

ఈ స్వామి ఎందరికో ఇలువేల్పుగా ఉన్నాడు. వారు తమ ఇండ్లలోని పెండ్లిండ్లు ఇక్కడనే జరుపుకుంటారు.

36. రంగాపురం

ఇది నేడు వంగూరు మండలంలోని గ్రామం. కానీ సన్ 1279 లో ఇది ఆ తాలూకాకు కేంద్రంగా ఉండేది. కానీ ఎంతకాలం తాలూకాగా ఉన్నదో తెలియదు.

పూర్వం అచ్చంపేట తాలూకాలో గున్నదొరలు ప్రసిద్ధులు. వారు రెడ్లు. ఆ శాఖ ఒకటి ఇక్కడ ఉండేది. వారిలో సీతారామరెడ్డిగారు శౌర్య పరాక్రమాలలో వదాన్యంలో భక్తిలో పేరు చెందినాడు. వారి గురువులు మరింగంటివారు. వారి సమీపంలోని కనకల్లులో ఉండేవారు.

ప్రస్తుతం రంగాపురంలో ఉన్న వెంకటేశ్వరాలయం సీతారామ రెడ్డిగారు కట్టించినారు. ఇది విశాలంగా చక్కగా ప్రాచీన పద్ధతిలో ఉంది. ప్రస్తుతం ముడుంబావారు పూజారులుగా ఉన్నారు. ఈ ఆలయంలో ధనుర్మాసం మొదలైన విశేషోత్సవాలన్నీ నడుస్తవి.

ఇక్కడ గల స్వామివారి ఉత్సవ విగ్రహాలు, సిరుసనగండ్ల శ్రీరామునికి ప్రభ, మామిళ్ళపల్లి నృసింహస్వామికి ద్వారకవచం ఇదే గ్రామనివాసియైన చింతోజు వీరయ్యగారు చేసినట్లు చెబుతారు. అవి గున్న సీతారామరెడ్డిగారే చేయించిరట. వీరు కొంకణం వారు అంటారు.

37. రామగిరి

ఇది నాగర్‌కర్నూలు తాలూకాలో తెలకపల్లికి 6 కిలోమీటర్ల దూరంలో దుందుభీ తీరాన ఒక చిన్న గుట్టపై ఉంది. నది నిండుగా ఉన్నపుడిది గోదావరి తీరంలోని భద్రాచలం వలె భాసిస్తుంది.

పాలమూరు జిల్లాలో చరిత్ర ప్రసిద్ధమైన సురభిపట్టణం పూర్వం ఇక్కడనే ఉన్నది కాబట్టి ఆ కాలంలో ఈ క్షేత్రానికి సాటిలేదు. గట్టు తుమ్మెన - మామిళ్ళపల్లి - రామగిరి ఆలయాలను గోకర్ణ మహారాజు కట్టించినట్లు చెబుతారు. అతడు ఏరువ వంశానికి చెందినవాడు.

ఇక్కడి గుట్టపై విశాలమైన ఆవరణలో రెండు ఆలయాలు జతగా ఉన్నవి. ఒకదానికి ద్వారపాలకులుగా కత్తి డాలు ధరించిన నరనాగ ప్రతిమ లున్నవి. అవి గోడలకే మలువబడినవి.

పూర్వం ఈ ప్రాంతంలో జైనం వర్ధిల్లినది. ఇంద్రకల్లులో జైన ప్రతిమలు చాలా బయటపడినవి. ఆ మతంలో పార్శ్వనాథుని చిహ్నం సర్పం కాబట్టి ఇది మొదలు పార్శ్వనాథాలయం కావచ్చు.

జైనుల నణచిన వారిలో శైవులు ముఖ్యులు. వారిక్కడి జైన మూర్తులను భగ్నం చేసి దుందుభీ తీరంలో పడవేసి, దీనిలో శివ-గణపతి, మహిషమర్దని మూర్తులను ప్రతిష్ఠించినారు.

అపుడు ఇక్కడ ఉన్న శివునికి భీమేశ్వరుడని, ఈ గుట్టకు శివగిరి అని పేరు. వారు దీని వెనుక పెద్ద మారేడువనం వేయించినారు. ఆనాడు వారు స్థాపించిన బృహదీశ్వరమూర్తి ఒకటి ఇప్పటికీ దీనికి కుడివైపున గల గుట్టపై ఆలయం లేకుండా ఉంది. ఆ కాలంలో దీన్ని విభూతి గౌరయ్య దర్శించినాడు.

జటప్రోలును అళియ రామరాయలతో పొందిన కుమార మాదా నాయని తండ్రి మల్లానేడు నల్లగొండను విడిచిన పిమ్మట కొంతకాలం ఈ క్షేత్రంలో ఉండి, దీని అభివృద్ధికి కృషి చేసినట్లు స్థానిక వృత్తాంతాల వల్ల తెలుస్తుంది.

ఆ తర్వాత ఇక్కడ "రామయోగి" అనే ఒక మహనీయుడు నివసించి, దీని ఉద్ధరణకు చాలా పాటుపడినాడు. అపుడతని పేర దీన్ని రామగిరి అని పిలిచినారు. ఆ పేరు ఇక నేటికి ఆలాగే నిలిచిపోయింది. ఈయన కథను మిత్రులు శ్రీ యం. రంగారావుగారు ఒక చిన్న ఖండ కావ్యంగా రచించినారు. అది అముద్రితం.

ఆయన పిమ్మట మహమ్మదీయు లీ క్షేత్రాన్ని ప్రవేశించి, యిక్కడి ప్రతిష్ఠలను పెకలించి విరుగగొట్టి పారవేసిపోయినారు. ఆనాటి మహిష మర్దని మూర్తి మిక్కిలి సుందరంగా ఉంది. అదిపుడు విరిగి గుట్ట క్రింద పడి ఉంది. ఆకాలంలో ఇక దీన్ని చూచినవారు లేరు. అలా ఉండగా హి. 1223 లో సంచారవశంగా సూర్యాపేట నుండి బయలుదేరిన

చక్రవర్తుల ముడుంబ తిరుమలాచార్యులు ఈ క్షేత్రానికి వచ్చి రెండు మూడు దినాలు నివసించినాడు. అది వేసవి.

అపుడాయనకు గుట్ట క్రింద ఉన్న కోనేటిలో నీరు బాగా ఇంకి ఒక విష్ణు ప్రతిమ కనిపించింది.

ఏరువ వంశంలో రెండవ గోకర్ణుని సామంతుడు సగోత్రుడు అయిన తాండ, కారుపాముల, రాకొండ-లింగాల గ్రామాలలో ఆలయాలు కట్టించి, ఒక్కొక్కచోట ఒక ప్రతిష్ఠ చేయించినాడు. వానిలో రాకొండ గుట్టపై లక్ష్మీనారాయణ ప్రతిష్ఠ ఉన్నది. ఆ గుట్ట ఉప్పరపల్లె రాకొండ గ్రామాలకు సరిహద్దుగా ఉన్నది. కాబట్టి ఒకపుడు ఆతగాదాలో అక్కడి వారీ ఆలయాన్ని కూలగొట్టి స్వామి మూర్తిని కొనివెళ్ళి రామగిరి కోనేటిలో వేసినారు. అదిపుడు ఈ తిరుమలాచార్యులకు కనిపించింది.

దైవికంగా ఆనాడు ఆ దారిని నల్లగొండకు సర్కారు పని మీద వెళ్ళిన సురభి తిమ్మారెడ్డిగారు గుర్రాన్ని ఎక్కివచ్చినాడు. ఆయన్ను చూడగానే తిరుమలాచార్యుడు ఎదురుగా వెళ్ళి నమస్కరించి "అయ్యా, రాత్రి నేనిక్కడ ఆలయంలో నిద్రించగా ఈ కోనేటిలో ఉన్న స్వామి నా కలలో కనిపించి నన్నిక్కడ ప్రతిష్ఠించు; రేపు నీకు సహాయం చేయగల ఒక పురుషుడు వస్తాడు". అని చెప్పినాడు. అని అతనిని తీసుకొనివెళ్ళి కోనేటిలో కనిపించే మూర్తిని చూపినాడు. అపుడది చూచి ఆయన ఆశ్చర్యపడి ఆ మూర్తిని బయటికి తీయించి అతనితో నీవిక ఈ స్వామినిక్కడ ప్రతిష్ఠించి పూజారిగా ఉండుమని చెప్పి వెళ్ళిపోయినాడు.

తిరుమలాచార్యుడు రామోపాసకుడు. అందుచేత ఆయన ఆ మూర్తికి శ్రీరాముడని పేరుబెట్టి, ఇంతవరకు ఉన్న ప్రతిష్ఠను తొలగించిన ఆలయంలో నిలుపటానికి మనసు అంగీకరించక, దానిపై ఒక మట్టి గదిని కట్టించి, దానిలో స్వామిని నిలిపి పూజించసాగినాడు.

అపుడొకనాడాయనకు పందుగులలో ఒక వైశ్యుని యింట చేద బావిలో ఉత్సవమూర్తులున్నట్టు కలవచ్చింది. దానితో ఆయన రంగాపురం వెళ్ళి, అక్కడ ఉన్న గున్న సీతారామరెడ్డిగారితో ఆ విషయం చెప్పి, ఆ మూర్తులను తమకు ఇప్పించవలసినదిగా కోరినాడు.

అప్పటికి రంగాపురం తాలూకాగా ఉన్నది. సీతారామ రెడ్డి దొరగారు. ఆ తాలూకాలో ఆయన మాటకు తిరుగులేదు. ఆయన తిరుమలా చార్యుని స్వప్న వృత్తాంతం విని పందుగులకువచ్చి వారి యింటి బావిలో, ఒక మనుష్యుని దింపి వెతికించగా నిజంగానే అందులో ఉత్సవమూర్తులు లభించినవి. ఆయన వానిని కొనివచ్చి ఆ యేటినుండి అక్కడ శ్రీరామ కల్యాణం గూడ ఆరంభించి, అనంతరం రాజా చందూలాల్‌గారితో ఆ స్థలాన్ని అగ్రహారంగా పొందినాడు.

అప్పటికి ఆయనకు ఇంకా సంతానంలేదు. అది ఒక చింతగా ఉన్నది. అపుడు ఒకనాడాయన భార్య రామచూడమ్మగారికి కలలో ఒక వైష్ణవ వటుడు కనిపించి, అయిదు పాయసం ముద్దలు, అయిదు తులసీ దళాలు, ఒక బంగారు గజ్జె యిచ్చినాడు. ఆమె నాలుగు పాయసం ముద్దలు తిన్న పిమ్మట మెలకువ వచ్చింది. ఆమె వెంటనే పతిని మేలుకొలిపి ఆ వృత్తాంతం చెప్పింది. ఆయన విని తమపై శ్రీరాముని అనుగ్రహం కలిగింది అనుకున్నాడు.

అనంతరం ఆయనకు అయిదుగురు కుమారులు కలిగి వారంతా పెద్ద పెద్ద పదవులు పొందినారు. వారిలో నాలుగవవాడైన లక్ష్మణా చార్యుడు మాత్రం ఎక్కడికి వెళ్ళక తండ్రిగారివలెనే స్వామిని సేవించు కుంటూ ఉండి, ఆలయానికి చుట్టు ప్రాకారం కట్టించి చక్ర ప్రతిష్ఠ చేయించినాడు. అనంతరం మళ్ళీ ఆయన కుమారులు గూడ ఉద్యోగాలకు వెళ్ళి ఆలయం వేతనం పూజారుల చేతిలోపడింది. ఆ దినాలలో ఒకపుడు

రథోత్సవంనాడు ఒక అరబ్బుమూక వచ్చినారు. తేరుపై స్వామిని వేంచేపు చేసి పూజారి కూర్చున్నాడు. అది లాగుతూ ఉండగా వారికి సరదా అనిపించింది. తాము పూజారితోపాటు తేరుపై కూర్చోవటానికి వారితో ఘర్షణపడి తుపాకులు పేల్చినారు. అపుడు దైవికంగా ఒకగుండు పూజారికి తగిలింది. దానితో ఆయేటి నుండి ఇక ఉత్సవం ఆగిపోయింది.

అది చూచి కొంత కాలానికి రఘుపతిపేట కరణంగారు దాన్ని మళ్ళీ పునరుద్ధరించవలెనని తలచి, ప్రారంభించి రెండేండ్లు సాగించినాడు. కాని పిమ్మట ఆయన గూడ గతించినాడు. అపుడు ఇక ఈ ఆలయ పునరుద్ధరణ కొరకు సుబ్బశాస్త్రిగారి కుమారుడు రామేశ్వర శర్మగారు ముందుకు వచ్చి, ఒక కమిటిని ఏర్పరచినాడు. అపుడు దాని ఆధ్వర్యంలో క్రీ.శ. 1973 పరీధావి మాఘశుద్ధ దశమినాడు దానిలో శ్రీ రామలింగేశ్వర, లక్ష్మీగణపతి, శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ ప్రతిష్ఠలు, వానితోపాటు "కలౌ వేంకట నాయకః" అని సూక్తి కనుక శ్రీ వేంకటేశ్వర స్వామిని అప్పటి ఎండోమెంట్ కమీషనర్ శ్రీ కే. వాసుదేవరావు గారిచేత ప్రతిష్ఠ చేయించినాడు.

ఇక అప్పటి నుండి మళ్ళీ ఇది పూర్వరీతిగా నిత్యార్చనలతో విరాజిల్లుతూ ఉండిగాని, ఇది ఇంకా ఎంతగానో అభివృద్ధి పరచవలసిన క్షేత్రం. అభివృద్ధి పరచితే ఇది మరో భద్రగిరి అనిపించగలదు.

ఈ క్షేత్రంలో వెంకటేశ్వరుడు క్రి శ. 1973 లో వెలసినాడు గాని ఆయనను గురించి క్రి.శ. 1948 కంటె ముందే రఘుపతిపేటలోని మరిగంటి నరసింహాచార్యుల కుమారుడు రాఘవాచార్యులు ఈ స్వామిపై ఒక హరికథను రచించినాడు.

వివరాలకు - ఆరాధన - అక్టో - 1983.

38. లాలుకోట

ఇది ఆత్మకూరు తాలూకాలోని చిన్న చింతకుంట మండలంలో గల గ్రామం. ఇక్కడి మట్టి ఎరుపు. పూర్వం ఇక్కడి కోట ఆ మట్టితోనే కట్టబడింది. కాబట్టి దీన్ని లాలుకోట అన్నారు. ఇక్కడ శివ - కేశవ - వెంకటేశ్వర - ఆంజనేయాది ఆలయాలున్నవి. ఇవి అన్ని గూడ ప్రాచీనమైనవే.

శివాలయంలో ప్రాచీనం నుండి వీరశైవులు పూజా పురస్కారాలు నడుపుతున్నారు. తక్కిన వానిలో శ్రావణంలో పల్లకీ సేవ జరుగుతుంది.

ఇక్కడి కేశవాలయంలో చాత్తాదులు పూజారులు. ఈ వెంకటేశ్వరునిపై పినగలూరి వెంకటాద్రి కవి ఒక సీస శతకం రచించినాడు. ఇది మధ్యకాలపు ఆలయం. ఈ ఆలయంలో మున్నూరు కాపులు పూజారులు. వారు ఇపుడు నంబులతో పూజ చేయిస్తారు.

ఇది బ్రాహ్మణులనుండి వీరికి స్వాధీనమయింది. ప్రస్తుతం మున్నూరు కురుమయ్యగారు దాని నిర్వహణ చూస్తున్నారు.

ఇక్కడ అన్ని ఉత్సవాలు సంక్రాంతికి నడుస్తవి.

39. వనపర్తి

తాలూకా కేంద్రమైన వనపర్తిలో ప్రస్తుతం వెంకటేశ్వరాలయం ప్రసిద్ధంగా ఉంది. అది వల్లభనగరం కాలనీలో ఉంది. ఆ కాలనీ అయలూరి వారి స్థలం.

అయలూరి వారి ఇంటి పేరు గోవర్ధనం వారు. వారు మాతామహుల ఆస్తికి దత్తు వచ్చి అయలూరి వారైనారు. అయలూరి వారికి ఆనాడది ప్రభువులిచ్చిన భూమి.

ప్రస్తుతం వెంకటేశ్వరాలయం ఉన్నచోట మొదట అయలూరి శ్రీనివాసాచార్యులు ఒక హనుమదాలయం కట్టించినాడు. ఆ స్వామి మిక్కిలి మహిమగలవాడని చెబుతారు. స్థానికుడైన బోయ మశన్న అనే కంట్రాక్టరు భార్యకు ఆరోగ్యం సరిగా లేకున్నది ఆ స్వామికి మొక్కుకోగా అది బాగుపడింది. దానితో ఆయన స్వామికి మంటపం కట్టించి ఇంకా ఇతరమైన కైంకర్యాలు గూడ చేయించినాడు. ఈ ఆలయానికి కారంచేడు శ్రీనివాసాచార్యులు పూజారిగా ఉన్నారు. ఆయన దీని అభివృద్ధికి చాలా కృషిచేసినాడు.

ఈ స్వామివారికి మెడలో వెండి దండ, వెండి కవచం, పాదాలు, బంగారు గోర్లు భక్తులు తమ కోరికలు తీర్చినందువలన చేయించినారు.

ఇక్కడ ప్రస్తుతం ఉన్న అశ్వత్థ, నింబ వృక్షాలు పూజారి శ్రీనివాసాచార్యులు గారే వేసి పెంచినారు. వీటికి వివాహం గూడ జరిగింది.

ఇపుడు ఆ హనుమదావరణంలోనే వెంకటేశ్వరాలయం వెలిసింది. శ్రీనివాసాచార్యుల కుమారుడు నరసింహాచార్యులుగారు దానికి స్థలం ఇచ్చినారు.

ఈ ఆలయానికి వెంగళరెడ్డి తహశీల్దారు, మద్దూరు కృష్ణారెడ్డి, బోయ మశన్న కంట్రాక్టరు, జగన్నాథరెడ్డి వకీలు, ముత్యాలరెడ్డిగారలు ముఖ్యకారకులు. వారు కమిటీగా ఏర్పడిన తర్వాత స్థలదాతకు కొంత ప్రతిఫలం యిచ్చినారు.

ఈ ఆలయం అధునికమైన హంగులతో ఇపుడు గ్రామానికే ఒక అలంకారంగా ఉంది. ఇక్కడి హనుమదాలయంలో ఏటా శ్రీరామ కల్యాణం జరిగేది. అదిగూడ యిపుడీ ఆలయంలోనే నిర్వహింపబడు

తుంది. ఇక్కడ కల్యాణానికి ఉత్సవమూర్తులు లేవు. ఏటా హైదరాబాదు నుండి మట్టి మూర్తులను తెచ్చి కల్యాణానంతరం వానిని విసర్జిస్తుంటారు.

ఈ ఆలయంపై నరసింహాచార్యులు "వెంకటేశ్వరావిర్భావ కథనం" అనే గ్రంథం రచించినాడు. అది ముద్రితం.

40. వెంకన్నకొండ

వట్టెం గ్రామానికి ఆగ్నేయంగా మరో గట్టు ఉంది. అది గండ్ల నర్వ, వట్టెం గ్రామాలకు నడుమ అడ్డంగా ఉంది. కాబట్టి అడ్డగట్టు అన్నారు. దానిపై ఒక చోరికలో పురాతనమైన లింగప్రతిష్ఠ ఉంది. ఆ దేవుని పేర పూర్వం గుట్ట క్రింద లింగాపురం ఉన్నది. దాని క్షేత్ర పాలకుడుగా వెంకటేశ్వరుడు ఆ గుట్టపై ఉన్నాడు. అందుచేత దానికి క్షేత్రపాలకుని గుట్ట అనికూడ పేరు.

లింగాపురం అనంతర కాలంలో లేచివచ్చి వట్టెం గ్రామంగా మారింది. ఆ గ్రామంలో ఉన్న ఖండవల్లి వారనే స్మార్తులకు ఈ స్వామి కుల దైవంగా ఉన్నాడు.

గుడ్లనర్వలో ఈ జిల్లాకు భగవన్నామ ప్రచారకుడైన చింతకుంట నరసింహరావున్నాడు. ఆయన ఆశ్రమం కొరకు ఆ గట్టుపై ఉన్న స్థలాన్ని తీసికుని, దానిప్రక్కన శ్రీ కుసుమ హరనాథ బాబా ఆశ్రమాన్ని నెలకొల్పినాడు. అనంతరం అతనికి పాలెంలో వెంకటేశ్వరుడున్నాడు కాబట్టి అక్కడ పద్మావతిని ప్రతిష్ఠించవలెననే సంకల్పం కలిగి, అప్పటి కలెక్టరు శ్రీ జి. నారాయణరావు గారి నడుగగా ఆయన ప్రభుత్వం పురాతనాలయాలు ఉద్ధరించటానికి ఆర్థిక సహాయం చేస్తుందికాని క్రొత్త వానికి చేయదు అని చెప్పినాడు.

అది విని నరసింహారావుగారు అక్కడ ఉన్న క్షేత్రపాలకుని గుడినే ఉద్ధరింపదలచి ఆలయ నిర్మాణం తలపెట్టి తిరుపతిదేవస్థానంలో మొదటి గ్రాంటు సంపాదించినాడు కాని అది అతని తలకు మించిన పని అయింది. అది చూచి నారాయణరావుగారు మీరు దీనికి గ్రామస్థుల సహాయాన్ని అర్థించండి అని చెప్పినాడు. అది విని ఆయన గ్రామస్థుల నా గుడి విషయమై ఒక పర్యాయం సమావేశపరచినాడు.

పట్టెంలో సందడి రంగారెడ్డిగారు ప్రసిద్ధుడు. ఆయన P.W D. శాఖలో ఇంజనీరుగా A క్లాసు కంట్రాక్టరుగా ఉన్నాడు. వ్యక్తికి చాలా పదవులు ఉండవచ్చుగాని దానికి తగిన గుణం ఉండటం అరుదు.

రంగారెడ్డిగారు ధార్మిక చింతనగలవాడు. దైవభక్తిపరుడు. అన్నిటికిమించి వితరణశీలి. ఆయనకు చాలాకాలంగా ఎక్కడనైన వెంకటేశ్వరుని ప్రతిష్ఠించవలెననే సంకల్పం నిగూఢంగా ఉన్నది. కాబట్టి నరసింహారావు సంకల్పం వినటంతో స్వామివారే తన సన్నిధికి వచ్చినట్లయింది. ఇక భారాన్నంతా తన భుజస్కంధాలపైకి ఎత్తుకున్నాడు. తత్ఫలితంగా ఇపుడక్కడి వెంకటేశ్వరాలయం జిల్లాలో మకుటాయమానంగా రూపొందుతుంది.

క్రీ.శ. 4-11-1982 నాడు దుందుభి ఆశ్వీయుజ బహుళ తదియ గురువారంనాడు ఆంధ్రప్రదేశ్ చేనేత శాఖామాత్యులు శ్రీ పాలువాయి గోవర్ధనరెడ్డిగారితో దీనికి శంకుస్థాపన జరిగింది. ఆనాడు శ్రీ ఆర్. రామదేవరెడ్డి దేశ్‌ముఖ్‌గారు, శ్రీ జి. నారాయణరావు I.A.S. గారు, శ్రీ జి. రాజయ్యగారు పత్నీసమేతులై, శ్రీ పల్లెర్ల రామచంద్రశాస్త్రిగారి ఆధ్వర్యంలో మంగునూరు పురోహితులు కార్యక్రమం నిర్వహించగా వాస్తుపూజ చేసినారు.

అనంతరం శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్నజీయ్యరుగారి కరకమలాలతో ఇక్కడ 19-5-1986 నాడు పాంచరాత్రాగమోక్తాను సారంగా స్వామివారి ప్రతిష్ఠామహోత్సవం నడిచింది.

ఈ ఆలయానికి హైదరాబాదు నివాసి బాదం రామస్వామిగారు రోడ్డు దగ్గర మహాద్వారం వేయించగా, కొల్లాపురం తాలూకా గోపాలపేట నివాసి శ్రీ ఎం. ప్రతాపరెడ్డిగారు మంటపం కట్టించినారు.

స్వామివారికి కుడివైపున విశాలమైన సత్రశాల కట్టించగా, ఎడమ వైపున హైదరాబాదు నివాసి శ్రీ కపిలవాయి రాధాకృష్ణగారు హనుమ త్ప్రతిష్ఠ 16-2-1990 నాడు చేయించినారు. దాని కుడివైపున ఇపుడు యాగశాల కట్టించినారు. ఇవి ఇప్పటివరకు అక్కడ జరిగిన పనులు.

నారదగిరిపై వెంకటేశ్వరుడు లక్ష్మీదేవితో వెలయగా, ఇక్కడ పద్మావతితో వెలసినాడు.

ఆలయ నిర్వాహకులు 'ఇది 75 లక్షల ప్రణాళిక. మేము దీన్ని పూర్తిగా 15 సంవత్సరాలలో పూర్తి చేయవలసిఉంది' అని చెబుతారు. ఇప్పటికి అక్కడ 15 లక్షల పని జరిగింది. ఒకనాడు కాలిబాటలేని ఆ కొండపైకి ఈనాడు జీపులు, కార్లు వెళ్ళుతున్నవి. విద్యుత్సౌకర్యం, నీటి వసతి ఏర్పరచబడింది.

యాత్రికుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని యిక్కడ ఇంకా చాలా వసతులేర్పడుతున్నవి. కాబట్టి అచిరకాలంలోనే ఇది ఈ జిల్లాలో సాటిలేనిది కాగలదు.

41. వెల్లూరు

క్రీ. శ. 9వ శతాబ్దం నాటి రామాజివల్లె శాసనంలో ఒక వెల్లూరు పేర్కొనబడింది. అది బహుశా ఇదే కావచ్చు. సురభి వంశంలో పన్నెండవ వాడైన వెంకట లక్ష్మారావు జటప్రోలు సీమ నిక్కడి నుండి

పాలించినాడు. అతనిపై మగతల నుండి నాగన గౌడు దండెత్తగా, అతనిని ఓడించి లక్ష్మారాయుడు కొల్లాపురంలో కోటగట్టి రాజధానిని అక్కడికి మార్చినాడు. ఈ గ్రామం ఇపుడు కొల్లాపురం మండలంలో ఉంది.

ఈ గ్రామంలో వెంకటేశ్వరాలయం ఊరి వెలుపల ఉంది. దాన్ని రంగప్ప అనే ఆయన కట్టించినట్లు తెలుస్తుంది. అతడు నందవరీకుడు. ఇంటిపేరు ముత్యాలవారు. కానీ ఏ కాలం వాడో తెలియదు. ఒకప్పు డాయన వెంకటేశ్వరుని దర్శనానికి సపరివారంగా వెళ్ళుతూ కృష్ణాతీరం లోని బొల్లవరంలో మజిలీ చేయగా ఆ రాత్రి స్వామి కలలో కనిపించి తనకు వెల్లూరిలోనే ఒక ఆలయం కట్టించమని చెప్పినాడు.

అపుడతడు తిరిగి వచ్చి తమ గ్రామంలో ఈ ఆలయం తలపెట్టి నాడు. దానిలో గర్భాలయం, మంటపం, హోమశాల, వాహనశాల మొదలైనవన్ని కట్టించి స్వామివారిని అలిమేలుమంగా సహితంగా ప్రతిష్ఠించి గరుడాళ్వారును ఆళ్వారు సన్నిధిని ఏర్పాటు చేసి నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, వత్సరోత్సవాలను ఏర్పాటు చేసినాడు.

చూ. చూతపురి విలాసం. పీఠిక పేజి 11 నుండి.

వెల్లూరిలో ఇపుడు రంగప్పగారి వంశం ఉందిగాని ఆనాడాయన ఆలయంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలన్నీ ఇపుడు లేవు. ఆలయం మాత్రం చెక్కు చెదరకుండా రంగప్పగారి భక్తికి నిదర్శనంగా నిలిచింది.

ఈ స్వామికి అంకితంగా రంగప్ప వంశంలోని వాడైన వెల్లూరి నరసింగకవి భర్తృహరి త్రిశతిని కందాలలో అనువదించినాడు. వాటిని కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక ప్రకటించింది. ఇదిగాక ఇక్కడ గుట్టపై ఒక వీరభద్రాలయం కూడా ఉంది.

వాసవీ కన్యకాంబ ఆలయాలు

వివాహం కాకుండా నిలిచిన స్త్రీలను కన్యకలనటం పరిపాటి. దక్షిణ భారతదేశంలో కన్యాకుమారి అగ్రంలో నిలిచిన కన్యాకుమారి మొదటి కన్యక. ఈమె పార్వతి అంశ అని పురాణం ఉన్నా దాని వెనుక ఈమె ఒక జాలరి కన్య అని ప్రజలు చెప్పుకుంటారు

1) ఆమె ప్రియుడు తనను కోరిన యువతితో వివాహం జరుగ బోతుంది కాబట్టి ఆనాడు మరిన్ని ఎక్కువ చేపలు పట్టుకొనివచ్చి కులం వారికి విందు చేయవలెనని మహోత్సాహంతో తన పడవను వేసికొని సముద్రంలోనికి చాలా దూరం వెళ్ళినాడట. అంతే- అతడిక తిరిగిరాలేదు. అతని కొరకు ఆమె తన ప్రియుడు ఈనాడు వస్తాడు, రేపు వస్తాడు అని సముద్రతీరంలో నిరీక్షిస్తూ జీవితాంతం ఆలాగే నిలిచిపోయిందట. అనంతరం ఆమె దేవత అయింది.

2) ఈలాగే బ్రాహ్మణ స్త్రీలు కొలిచే కామేశ్వరీ దేవి మరో కన్య. ఆమె లక్ష్మి అంశతో పుట్టిందట. తపస్సుచేసి శ్రీరాముని ప్రత్యక్షం చేసికొని, తనను వివాహమాడమని కోరగా, ఈ జన్మలో నేను ఏకపత్నీ వ్రతుడను అని నిరాకరించి కృష్ణావతారంలో నిన్ను వివాహమాడతానని చెప్పినాడట. దానితో ఆమె ఆలాగే నిలిచిపోయి దేవత అయింది.

3) వీరి పిమ్మట వైశ్య వంశంలో వెలసిన వాసవి మూడవ కన్యక. ఆమె పెనుగొండ పట్టణంలో కుసుమాంబ, కుసుమ సెట్టి అనే దంపతులకు జన్మించింది. ఆమె నవయువతి అయిన కాలంలో చాళుక్య కుబ్జవిష్ణువర్ధనుడు దిగ్విజయయాత్రలో ఆ గ్రామానికి వచ్చి, ఆమె సౌందర్యాన్ని విని తలిదండ్రిని ఆ కన్యను తన కిమ్మని అడిగినాడు.

వైశ్యుల ఇండ్లలో అప్పటికి మేనరికం తప్పని ధర్మం. రెండవది అది వర్ణాంతర వివాహం. అందుచేత తలిదండ్రి రాజుగారి కోరిక నంగీకరించలేదు. అది తెలిసి మహారాజు కోపించి ఆ కన్యను బలవంతంగా తీసికొని రావలసిందని భటులను పంపినాడు.

వైశ్యులలో మొత్తం 714 గోత్రాలవారున్నారు. అపుడు కుల పెద్దలంతా ఒకచోట చేరి ఆలోచించినారు కాని రాజుగారికి ఎదురు చెప్పే ధైర్యం ఎవరికీ లేకపోయింది. అందుచేత వారిలోనుండి 612 గోత్రాల వారు తూష్ణీభావం వహించి తప్పుకున్నారు. 102 గోత్రాలవారు మాత్రం ఆమె పక్షంగా నిలచినారు. అపుడామె తమ వారి స్థితి, రాజుగారి దౌర్జన్యం చూసి మహారాజు దగ్గరకు వెళ్ళి, తనను అగ్నిసాక్షిగా వివాహ మాడమని కోరింది.

మహారాజు అప్పటికే వివాహితుడు. ఆయనకు పట్టపురాణి ఉన్నది. కాబట్టి వాసవి కోరిక నతడంగీకరించలేదు. అపుడామె తన వారికి కలుగ బోయే ఆపదను చూచి అగ్నిప్రవేశం చేసింది. అపుడామెతోబాటు 102 గోత్రాల వారిలో కూడ కొందరాహుతియైనారు.

ఈ అగ్ని ప్రవేశానంతరం ఆమె తనవారికి ప్రత్యక్షమై, వైశ్యుల కులాచార ధర్మాలు, వివాహ పద్ధతులు తెలిపి అదృశ్యమై పోయింది.

ఆమె శాపంతో కుబ్జవిష్ణువర్ధనుడు ఆ దిగ్విజయయాత్ర నుండి యిల్లు చేరగనే మరణించినాడు. పిమ్మట సింహాసన మెక్కిన అతని కుమారుడు రాజరాజనరేంద్రుడు తండ్రిగారి అకృత్యానికి పశ్చాత్తాప పడి, వాసవి సోదరుడు విరూపాక్ష సెట్టిని పెనుగొండకు యువరాజుగా అభిషేకించినాడు.

ఈ కన్యక గౌరీఅంశ కాబట్టి ఆనాడామె పక్షం వహించిన వారిపుడు "గౌరిసెట్టు" లనబడుతున్నారు.

(4) నాలుగవ ఆమె జగత్ప్రసిద్ధమైన తత్త్వవేత్తయగు వీర బ్రహ్మేంద్రు మనుమరాలు ఈశ్వరమ్మగారు. ఈమె ఆయనగారి రెండవ కుమారుడైన గోవిందయ్యగారి కూతురు. మిక్కిలి సౌందర్యవతి. అపుడామె సౌందర్యాన్ని చూసి రాజంపేట తాలూకాలోని నాగిరిపాడు జమీందారుగారి కుమారుడు రంగరాజు ప్రేమించి వివాహమాడడానికి ముందుకు వచ్చినాడు. అతడు కష్టపడి తమ తండ్రి జగ్గరాజుగారి నేవిధంగానో వప్పించినాడు. కాని, అది వర్ణాంతర వివాహం కాబట్టి ఈశ్వరమ్మగారి తండ్రి గోవిందయ్యగారు దానికి అంగీకరించలేదు. దానితో రంగరాజు భగ్నప్రేమికుడై అగ్నిప్రవేశం చేసినాడు.

అది తెలిసిన అనంతరం ఈశ్వరమ్మగారు గూడ సంసార విరక్తయై విద్యావతియై ఆధ్యాత్మ విద్యలో తాతగారికి వారసురాలయింది.

అయిదవ ఆమె శరన్నవ రాత్రులలో స్త్రీలు కొలిచే బ్రతుకమ్మ. ఈమె వెనుక కూడ వదినల ఆరళ్ళకు బలియైపోయిన ఒక కన్యక ఉంది. కాబట్టి వీరిని ఇపుడు పంచకన్యలనవచ్చు. వీరందరికి తెలుగుదేశంలో గుడులున్నవి. పురాణాలుగూడ ఏర్పడినవి.

వీరిలో వైశ్యులు కుబేర పుత్రులు కాబట్టి కన్యకాలయాలీనాడు ఎక్కడున్నా అవి వైభవానికి కొదువ లేకుండా అలరారుతున్నవి. కాబట్టి వానిని కొన్నిటిని పరికించండి.

పాలమూరు జిల్లాలో స్థానికంగానేకాక పెంట్లవెల్లి, కొల్లాపురం, నాగర్‌కర్నూలు, వనపర్తి, జడ్చర్ల, కావరంపేట మొదలైన గ్రామాలలో కన్యకాపరమేశ్వరి ఆలయాలున్నవి.

ఈ ప్రాంతంలోనికెల్లా పెంట్లవెల్లి ఆలయం ప్రాచీనంగా కనిపిస్తుంది. అది కొల్లాపురానికంటే చాలా మొదటిదంటారు. ఈ ఆలయం విశాలంగా ఉండి వైశ్యులకు ఆలయంగానేగాక అన్ని హంగులతో కల్యాణ మంటపంగా గూడ ఉపయోగపడుతుంది.

కొల్లాపురంలో ఈ ఆలయంకొరకు స్థలం కొన్నవాడు కొప్పరపు పట్టాభిరామయ్యగారు; ఆలయనిర్మాణంలో శ్రద్ధవహించింది శ్రీ గుడిపాటి రంగయ్యసెట్టిగారు అని చెబుతారు. ఇది రాజవీథిలో ఉంది.

నాగర్‌కర్నూలులోని ఆలయం గత శతాబ్దంలో కొండూరు శాయన్నగా రారంభించినారు. అది సగం అయిన పిమ్మట ఆనాటి మహమ్మదీయ ప్రభుత్వం అనుమతించక ఆగిపోయింది. దాన్ని మళ్ళీ ఇటీవల క్రీ.శ. 1971 లో స్థానిక వైశ్యసంఘంవారు పూర్తి చేసినారు. ఇది పూర్తిగా శిలానిర్మితమై, వెలుపలివైపు ధర్మశాలయుక్తంగా ఉంది.

వనపర్తిలో కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి కృష్ణయ్య సెట్టిగారు కారకులు.

కావేరమ్మపేటలో వలకొండ బాలయ్య, అనంతయ్య, వెంకటయ్య సోదరులు కారకులు. ఇది చాలా పెద్ద ఆలయం. దీని ఆవరణలో కన్యకా పరమేశ్వరియేగాక వీరభద్ర, వినాయక, శ్రీకృష్ణ, శ్రీరామ, నవగ్రహ ప్రతిష్ఠలు, అంబా భవాని ఉన్నవి. ఈ గుడిలో అంబా భవానియే ప్రసిద్ధి. ఏటా శివరాత్రికి పార్వతీకల్యాణం నడుస్తుంది.

పాలమూరులోని ఆలయం క్రీ.శ. 1955 ప్రాంతంలో కట్టబడింది. అది సిమెంటు నిర్మాణమై, శిల్పవిరాజితంగా ఉంది. ఇది చాలా పెద్ద ఆలయం. దీనిలో శివ, గణపతి నవగ్రహ ప్రతిష్ఠలున్నవి.

కొన్ని వీరబ్రహ్మేంద్రుని ఆలయాలు

మౌనేశ్వరుడు - వీరగురుడు - మల్లనయోగి - సనారీ విశ్వేశ్వరుడు - శివరామబ్రహ్మేంద్రుడు - ఈ అయిదుగురు విశ్వకర్మలలో పంచ బ్రహ్మలు.

ఆంధ్రప్రదేశంలో పదేడవ శతాబ్దంలో వెలసిన మహా పురుషులలో పోతులూరి వీరబ్రహ్మంగారు ప్రసిద్ధులు. ప్రజలాయన్ను వీరగురుడని కూడ అంటారు. అతడు విశ్వకర్మ కులీనుడు. తెలుగు దేశంలో ఇతని వలె కాలజ్ఞానం చెప్పినవారు మరొకరు లేరు.

"చెప్పలేదంటనక పొయ్యేరు - నరులార గురుని
చేరి మ్రొక్కితె బ్రతుక నేర్చేరు"

అని ఆయన చెప్పిన కాలజ్ఞానం ఈనాడు దేశమంతటా దాఖలాలు కనిపించినవి; కనిపిస్తున్నవి. కాలజ్ఞానం చెప్పటమే కాక ఆయన మత వైషమ్యాలలో పడి కొట్టుమిట్టాడుతున్న జనానికి ఒక చక్కని తత్వ మార్గాన్ని చూపినాడు. కనుక వారసురాలైన మనుమరాలు ఈశ్వరమ్మ గారు తాత్వికుల కారాధనా మూర్తులైనారు. ఆ కారణంగా అందరు దేవతలకు వలెనే అతనికి గూడ అక్కడక్కడ ఆలయాలు, ఆరాధనలు వెలసినవి. అట్టివానిలో ఈ క్రిందివి కొన్ని.

1. అచ్చంపేట

పాలమూరు జిల్లాలో అచ్చంపేట గ్రామం మొదటిది. అక్కడ స్థానికులైన విశ్వకర్మ వంశీయులు దాసోజి భోజయ్య, చింతోజు దక్షిణా మూర్తి, కపిలవాయి కృష్ణయ్యాచారి గారలు ప్రయత్నించి, గ్రామం వెలుపల గల కోటలో స్థలాన్ని తీసుకొని ఆలయం కట్టించి

అనుమనుగిరి శివరామ బ్రహ్మేంద్రస్వాములవారి పీఠాధిపతి శ్రీ గురు బ్రహ్మంగారి ఆధ్వర్యంలో స్వామివారి ప్రతిష్ట జరిపించినారు.

ఇక్కడ ఏటా వైశాఖంలో ఆరాధన నడుస్తుంది.

2. కారువంగ

నాగర్ కర్నూల్ తాలూకాలోని కారువంగ గ్రామంలో శ్రీ దొంతోజు నారాయణాచారిగారు హనుమదాలయావరణంలో కొంత స్థలం తీసుకొని గుడి కట్టించి, క్రీ.శ. 1956 దుర్ముఖి మాఘశుద్ధ విదియ నాడు స్వామివారి మూర్తిని ప్రతిష్ఠించినాడు. ఈ ఆలయాన్ని కట్టించిన వారిలో ముఖ్యుడు తాళ్ళపల్లి చంద్రయ్యగారు.

ఇక్కడ ఏటా వైశాఖ శుద్ధ దశమినాడు కల్యాణోత్సవం నడుస్తుంది.

నారాయణాచారిగారు ఈ ప్రాంతంలో తాత్వికుడుగా పేరందిన వాడు. ఇపుడు స్వామివారి ఉత్సవాన్ని ఆయన కుమారులు సాగిస్తున్నారు.

ఈ గ్రామం వెలుపల ఒక ప్రాచీనమైన శివాలయం ఉంది. కాకతిరుద్రుని సేనానులు సురభిని దహించిన పిమ్మట అక్కడి శివాలయాన్ని తెచ్చి యిక్కడ కట్టినారు అని ప్రజల కథనం. దీనిముందు ఒక శాసనం గూడ ఉంది.

మధ్యకాలంలో ఇది కూలిపడగా, దీన్ని పొన్నగంటి మామిళ్ళరెడ్డి గారు మళ్ళీ నిలబెట్టించినాడు.

ఈ ఆలయంలో సూర్య ప్రతిష్ఠ గూడ ఉంది. ఈ ప్రతిమ ఎఱ్ఱని రాయితో మలచబడింది. సూర్యుడు అరుణుడు కనుక ఇక్కడ ఎఱ్ఱని రాతితో ఈ స్వామిని ప్రతిష్ఠించటం విశేషమే. దీనికి వంగార్క మందిరం అని పూర్వం వ్యవహారమటకాని ఈనాడు ఇక్కడ స్వామి మాత్రమే మిగిలినాడు; గుడి పూర్తిగా మిగులకుండాపోయింది.

ఈ సమీపంలో దుందుభీనదిలో నల్లవాగు కలుస్తుంది; కాబట్టి పూర్వం ఈ నదీ సంగమస్థానంలో సూర్యగ్రహణ కాలంలో స్నానాలు చేసి ఈ స్వామిని అర్చించేవారట.

3. కొత్తకోట

ఇది వనపర్తి తాలూకాలోని గ్రామం. ఇక్కడ మౌనయ్యాచారి, కృష్ణయ్యాచారి గారు అనే వారు బ్రహ్మంగారి ఆలయం కట్టించినారు. ఇంతవరకు ఇటువంటి నిర్మాణం ఈ ప్రాంతంలో జరుగలేదు. ఇది క్రీ.శ. 1980 ప్రాంతంలో జరిగింది.

ఇపుడు జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి గ్రామాలలో పెద్ద ఎత్తున ఈ ఆలయాల నిర్మాణాలు చేపట్టినారు.

4. గౌరెడ్డిపల్లె

గత శతాబ్దంలో నాగర్‌కర్నూలు తాలూకాలోని గౌరెడ్డి పల్లెలో వీరశేఖరం గారనే మయబ్రహ్మ ఉన్నాడు. ఆయన, ఆయన మిత్రుడు సన్యాసి పాపయ్యగారు ఇద్దరూ కలిసి ఒకప్పుడు మఠం వెళ్ళి, స్వామి వారి సమాధిని దర్శించి అక్కడి నుండి ప్రసాదాన్ని విబూదిని తెచ్చి కమ్మరెడ్డిపల్లె సివారులోని సూరినేనివారి మామిడితోటలో కొంతస్థలం తీసుకొని చిన్న గుడికట్టి అందులో వీరగురుని ప్రతిష్ఠించినారు. ఇది దాదాపుగా ఈ ప్రాంతానికి మొదటి గుడి అనవలె. దీన్ని ప్రతిష్ఠించిన వీరశేఖరం పాపయ్యగారలిద్దరు ఉపాసకులు. క్రీ.శ. 1860 ప్రాంతంవారు.

చుట్టుపట్ల గ్రామాలలో వారిక్కడ వైశాఖంలో ఒకనాడు స్వామిని ఆరాధిస్తారు.

5. జిల్లాపురం

విశ్వబ్రాహ్మణేతరులు కట్టించిన వీరగురుని ఆలయాలలో జిల్లాపురం గుడి ఒకటి. ఈ గ్రామం అలంపూరు తాలూకాలో జాతీయ

రహదారిపై వుంది. ఈ గ్రామంలో బ్రహ్మంగారి జీవితాన్ని ప్రదర్శించే నాటక సమాజం ఉంది. వారు తమ ప్రదర్శనలో వచ్చిన ధనంతో ఇక్కడ క్రీ.శ. 1986 లో ఈ ఆలయాన్ని కట్టించి, స్వామివారి ప్రతిష్ఠ చేయించినారు. ఇక్కడి మూర్తులను బైరోజు దామోదరాచారి గారు చేసినారు. వీరగురుని నాటకంతో అతనిపై భక్తి కుదిరి, అది ఆలయం వరకు సాగటం, అందునా పంచాననేతరులు దానికి పూనుకోవటం ఇక్కడి విశేషం.

6. తెలకపల్లె

నాగర్‌కర్నూలు తాలూకాలో తెలకపల్లె ప్రసిద్ధమైన గ్రామం. ప్రస్తుతం ఒక మండలానికి కేంద్రం. ఈ గ్రామంలో త్వష్టబ్రహ్మ లెక్కువ. వారిలో రజితమూర్తి జగదీశ్వరయ్య, మయబ్రహ్మ నరసింహులు, విశ్వబ్రహ్మ అనంతరాములుగారలు ప్రయత్నించి ఊరి వెలుపల ఒక ఆలయం కట్టించి క్రీ. శ. 1980 సిద్ధార్థి కార్తీక బహుళ పంచమినాడు స్వామివారి ప్రతిష్ఠ జరిపించినారు. ఇక్కడ ప్రతి ఏటా ఉగాదికి ఆరాధన జరుపుతారు.

7. పెబ్బేరు

ఇది వనపర్తి తాలూకాలోని గ్రామం. కృష్ణానది ఇక్కడికి దగ్గర. దాన్ని కన్నడంలో పేరేరు, సామాన్యులు పెద్దేరు అంటారు. కాబట్టి ఈ గ్రామం ఆ నది పేరు యొక్క రూపాంతరం.

ఈ గ్రామంలో కమ్మరి బ్రహ్మయ్యగారు క్రీ.శ. 1972 ప్రాంతంలో బ్రహ్మంగారి ఆలయం కట్టించినాడు. దీనిలో బ్రహ్మంగారు, గోవిందమ్మ గారు, సిద్ధయ్యగారి మూర్తులు ప్రతిష్ఠింపబడినవి. ఈ విగ్రహాలను నంది కొటుకూరు నివాసి తుపాకుల సుబ్బరాయుడాచారి గారు చేసినారు.

ఏటా ఇక్కడ వైశాఖంలో కల్యాణోత్సవం, మాఘంలో ఆరాధన జరుగుతవి.

8. మహబూబ్‌నగర్

ఇక్కడ స్థానికులైన విశ్వకర్మ వంశీయులు ఇటీవల క్రీ. శ. 1986 మార్చిలో పాంచ్‌రస్తా దగ్గరగల హనుమదాలయావరణంలో ఆలయం కట్టి, స్వామివారిని ప్రతిష్ఠించినారు. ఈ స్థలంలో మొదటగా బ్రహ్మంగారిని ప్రతిష్ఠించవలెనని నాందిపలికినవాడు హనుమద్దాసు అనే ఈడిగ. అతడు ఎక్కడివాడో తెలియదు. కాని తన భక్తికొలది వీర గురుని అతడొక గుండుపై మలచుకొని పూజించినాడు.

ఇపుడు సిమెంటుతో గుడికట్టబడి శాస్త్రీయంగా స్వామివారి ప్రతిష్ఠ జరిగింది. ఇక్కడి మూర్తులను పెంట్లవెల్లి నివాసి బైరోజు దామోదరాచారి గారు చేసినారు. ప్రతిష్ఠకు అనుమనగిరి పీఠాధిపతి శ్రీ రామడుగు బ్రహ్మేంద్రస్వాములవారు అధ్యక్షుడుగాను, కలువకొలను నివాసి (రాయచూరు) కపిలవాయి కృష్ణయ్య ప్రధాన పురోహితుడుగాను ఉన్నారు. ఈ ప్రతిష్ఠ 1986 మార్చి 20 నాడు జరిగింది.

ఈ ఆవరణంలో ఒక ఆంజనేయ ప్రతిష్ఠ గూడా ఉంది. దాన్ని నిజామాబాద్ నివాసులు సి. రాజయ్య, జె. లక్ష్మమ్మ, పద్మ అనేవారు 1980 లో కట్టించినారు.

9. సింగాయపల్లె

ఇది గోపాలపేటనుండి కొల్లాపురం వెళ్ళే సర్వీసు రూటులోని గ్రామం. అక్కడ తూముకుంట నివాసి రాయచూరు లక్ష్మయ్య,మల్కిదాసు గారల ప్రోత్సాహం చేత త్వష్టబ్రహ్మలైన చెన్నయ్య, బుచ్చయ్యగారలు కట్టించినారు.

ఈ ఆలయం శిలానిర్మితం. గర్భాలయం, దానిముందు మంటపం ఉన్నవి. లోపల స్వామివారి పేర సామాన్యమైన ప్రతిష్ఠ మాత్రం ఉంది.

రాయచూరు లక్ష్మయ్యగారు మల్కిదాసుగారు ఇద్దరు గూడ అనుమనగిరి శివరామ బ్రహ్మేంద్రులవారి శిష్యులు. లక్ష్మయ్యగారి భార్య నాగమ్మగారు. ఆమె గూడ భర్తవలెనే తాత్వికురాలు. లక్ష్మయ్యగారి అనంతరం పెబ్బేరు హరికథల సిరిజంగం బాలస్వామి ఆమెగారి దగ్గర కారణం పొందినాడు. అతడిపుడు వారి గ్రామమైన చెన్నవరంలో నాగమ్మ లక్ష్మయ్యగారలకు సమాధులు కట్టించి, వాటిపై లింగ ప్రతిష్ఠలు చేయించి ఏటా వారి వర్ధంతి కూడా జరుపుతున్నాడు.

మన గ్రామదేవతలు

భారతీయులకు గ్రామదేవతలు ఈనాటివారు కాదు. లంకకు వెళ్ళినపుడు హనుమంతుని లంకిణి అనే దేవత ఎదుర్కొన్నది. కుశావర్తంలో ఉన్నపుడు కుశునికి అయోధ్యాదేవి కనిపించి, తన దైన్యస్థితిని చెప్పుకున్నది. కాబట్టి ఈ గ్రామదేవతలు మనకు రామాయణ కాలం నుండియే ఉన్నారనవలె.

ఈ జిల్లాలో దాదాపుగా 32 విధాల గ్రామదేవతలు కొలువబడుతున్నారు. వారిలో ప్రతివారికి ఒక చరిత్ర ఉంది. ఇపుడీ జిల్లాలోని గ్రామదేవతలపై శ్రీ జనార్దన భట్టుగారు పరిశోధన చేస్తున్నారు.

ఇపుడు గ్రామాలలో సాధారణంగా ఇదమ్మ-ఎల్లమ్మ - పోశమ్మ-మశమ్మ లేదా మైసమ్మ అనే వారిలో ఎవరో ఒకరు ఉండని ఊరు కనిపించదు.

ఇదమ్మను వైదికులు ఇడాదేవత అంటారు కాని సామాన్యులిపుడు కొలిచే ఈమె మాంధాత మహారాజు భార్యగా చెప్పబడుతుంది. ఈమెకు ప్రోలులేనే వైధవ్యం కలిగిందట. కాబట్టి ఈ మాంధాత యవనాశ్వుని కుమారుడుగాడు. ఈమె కథను పంబలవారు చెబుతారు.

ఎల్లమ్మను గూడ పండితులు పలురకాలుగా ఊహిస్తున్నారు. "ఎల్ల" అనగా సీమ లేదా పొలిమేర, కాబట్టి ఎల్లమ్మను సీమాధి దేవతగా భావించి పోలేరమ్మ అని అంటున్నారు. ఇది పొలిమేర అమ్మయొక్క రూపం.

'ఎల్ల' అనగా సమస్తం కాబట్టి ఈ సమస్త జగత్తుకు అధిదేవత అని ఆ విధంగా గాక ఎల్లరకు అనగా అన్నిజాతుల వారికి అమ్మ అని అంటున్నారు. వారీమెను ఎల్లర + అమ్మ ఎల్లమ్మ అనిపిలుస్తారు.

ఇక జానపదు లీమెను జమదగ్ని మహర్షి భార్యయైన రేణుకగా చెబుతారు. అపుడీమె ఛిన్నమస్తగా ఆరాధింప బడుతుంది. ఈ దేవి నుపాసించిన వారిలో శ్రీ గణపతి మునీంద్రులు ప్రసిద్ధులు.

ఎల్లమ్మ అని రెండు విధాలుగా కొలువబడుతుంది. గ్రామ దేవత లలో గజ్జెల పాపమ్మ, మాడెంపల్లి ఎల్లమ్మ - ఈ యిద్దరు మధురాహార ప్రియులు. ఆమనగంటి ఇదమ్మ, పానుగంటి ఇదమ్మ బలిని కోరేవారు. ఈ ఎల్లమ్మ కథను బవినీలు చెబుతారు.

మూడవ ఆమె పోశమ్మ. ఈమెను జానపదులు అమ్మవారు, లేదా అమ్మతల్లి అని విశ్వసిస్తారు. అమ్మవారిలో పెద్దపోత, చిన్నపోత అని రెండు భేదాలున్నవి. పెద్దపోతను చికెన్‌పాక్స్, చిన్నపోతను స్మాల్‌పాక్స్ అంటారు. అపుడు బాలుర శరీరంపై బొగ్గలు కనిపిస్తవి. సన్నపోతను 'మొలుపు' అంటారు. శరీరంపై బొగ్గలను పోసేతల్లి కాబట్టి ఈమెను కొందరు పోసే + అమ్మ = పోసెమ్మ, పోసెవ్వ అని గూడా అంటారు. సన్నపోతకు సుంకు అని మరో పేరు గాబట్టి "సుంకులమ్మ" అని కూడా అంటారు. ప్రజలీ దేవికి పెరుగుచద్దిని నివేదిస్తారు.

ఆగ్రజాతులీమెను శీతలాదేవిగా ఉపాసిస్తారు. ఈమె గార్దభవాహన. గోరఖ్‌పూర్‌లోని గోరక్షుని ఆలయంలో ఈమె గుడి కూడ ఉంది. ఈ దేవిని ప్రజలు వేసవిలోనే పూజిస్తారు. "ఎండకాలం పోశమ్మవోలె" అని ఈమెపై ఒక జాతీయం గూడ ఉంది.

నాలుగవ ఆమె మశమ్మను మైసమ్మ అని గూడ అంటారు. ఇది మహిషమర్దని రూపం. మహిషుని మర్దించినపుడు పార్వతికి "దుర్గ" అని పేరు. దుర్గం అంటే కోట కాబట్టి సాధారణంగా మైసమ్మను కోట నాశ్రయించే ప్రతిష్ఠిస్తారు. అపుడీమెను కోట మైసమ్మ అనే పిలుస్తారు. ఈ దేవికి దున్నను బలియిస్తారు.

ఈ గ్రామదేవతలు మనకు రెండు విధాలుగా ఏర్పడినారు. మొదటివారు పురాధిదేవతలు; రెండవవారు ఏదో కారణంగా వీర మరణం పొందినవారు. పూర్వం కోటలకు, చెరువులకు నిర్మాణ కాలంలో మానవులను బలియిచ్చే ఆచారం ఉండేది. అటువంటి కథలు మనకు చాలానే ఉన్నవి.

అదిగాక ఆనాడు గ్రామాలలో బందిపోట్లు పడినపుడు వారిపై యుద్ధాలలో మరణించినవారు, తమంతగా తాము దేవతలకు బలియైనవారు మతయుద్ధాలలో చచ్చినవారు దేవతలై వెలసిన ఉదంతాలు గూడ ఉన్నవి. ఈనాడు తెలంగాణంలో ఒకటి అరా వీరగల్లుండని గ్రామాలు అరుదు. వాని వెనుక ఎంతెంతో చరిత్రలున్నవి. కాబట్టి అటువంటి కొందరి ఉత్సవాలని పరికించండి.

వివరాలకు చూ. పరిశీలన 1-12-1975 మన జిల్లాలోని కొన్ని వీరగల్లులు.

ఇదమ్మ జాతరలు

1. ఖిలాగణపురం

ఈ గణపురాన్ని గురించి వర్ధమానసీమలో చెప్పినాను. ఇక్కడ ఇదమ్మదేవికి చక్కని ఆలయం ఉంది. అక్కడ ఏటా సంక్రాంతికి ఈ దేవికి వారందినాలపాటు ఉత్సవం సాగుతుంది. వనపర్తి సమీపంలోని పానుగల్లులో గూడ ఇదమ్మ ప్రసిద్ధంగా ఉంది.

2. నడిగడ్డ

నడిగడ్డ దుందుభినది పాయల నడుమ ఉన్న గ్రామం. పూర్వం ఇది సురభికి చెందిన భూమి అంటారు. ఇపుడిది తెల్కపల్లి మండలంలో ఉంది. ఈ గ్రామంలో ఇదమ్మ దేవత మిక్కిలి ప్రసిద్ధి.

ఇదమ్మ మాంధాత చక్రవర్తి భార్య అని, ఆమె ప్రోలులోనే విధవ అయిందని ఈమె కథను పంబలవారు చెబుతారు.

ఇక్కడి ఆలయంలో నిలువెత్తుగల ఇదమ్మ-మాంధాతల ప్రతిమలున్నవి. అవి గచ్చుతో చేయబడినవి. ఆనాటి గచ్చు ఈనాటి సిమెంటు కంటె గూడ గట్టి.

ఈ ఆలయం ప్రాచీనమే కాని చోళులనాటి నిర్మాణం కాదు. మధ్యకాలానికి చెందింది. స్తంభాలపై దూలాలు వేసి, కడీలుపరచి, పైన గచ్చుతో మేలుముద్ద వేసినారు.

ఈ ఇదమ్మ ప్రత్యక్ష దైవమని ఇక్కడి వారికి నమ్మకం. పూర్వం ఈమె చుట్టుపట్ల చెలుకల వారికి తెల్లచీర కట్టుకొని దర్శనమిచ్చేదట.

ఏటేట ఈమెను పూర్వం రఘుపతిపేట జీనిగరులు రంగులతో అలంకరించేవారు. అపుడీమె చూపరులకు భయంకరంగా ఉండేది. గడచిన అరువది ఏండ్లవరకు ఈమె జాతర చాలా గొప్పగా జరుగుతూ దూరదూరాల నుండి ప్రజలు బండ్లు కట్టుకొని వచ్చేవారు అపుడాలయం చుట్టూ ఎటుచూసినా అర్ధపరువు దూరం బండ్లే బండ్లు నిండి ఉండేవి. ప్రతి శుక్రవారం భోగం గూడా జరిగేది.

ఆ కాలంలో ఈ దేవత క్రింద ఏదో యంత్రమున్నదట. దాని ప్రభావంచేత మొక్కుబడులు చెల్లించనివారి గడ్డివాములు కాలిపోతూ ఉండేవట. అలా ఉండగా ఇపుడా దేవి క్రిందనుండి యంత్రాన్ని తీసివేసినారని అంటారు. ఇపుడా దేవికి నడుము దగ్గర ఒక రంధ్రం ఉంది. దానినుండి యంత్రాన్ని బయటికి లాగినారని ప్రజల నమ్మకం. అది తీసిన నాటినుండి ఇక ఆ దేవతలో మహిమ తగ్గిందట.

ఇపుడీ దేవికి శ్రావణంలో బోనాలు మాత్రం సాగుతవి.

3. పానుగల్లు

పానుగల్లులు నల్లగొండ జిల్లాలో ఒకటి, ఈ జిల్లాలో ఒకటి ఉన్నవి. నల్లగొండ పానుగల్లు పండితారాధ్యుని యాత్రతో చరిత్రలో ప్రసిద్ధి చెందింది. ఇక ఇది బాలనాగమ్మ కథతో ప్రజలలో ప్రసిద్ధంగా ఉంది. దీనికి ఖిల్లా పానుగల్లు అని చరిత్రలో ప్రసిద్ధి. ఇదిపుడు వనవర్తి తాలూకాలో ఉంది.

ఈ గ్రామంలో గూడ ఇదమ్మ దేవత ప్రసిద్ధి. ఈమె జంతు బలిని కోరుతుంది అని ప్రజలు నమ్ముతారు. శ్రావణంలో ఈ దేవిని కొలుస్తారు.

4. ముష్టిపల్లి

ఇది నాగర్‌కర్నూలు తాలూకాలోని గ్రామం. ఇపుడు పెద్దకొత్తపల్లి మండలంలో ఉంది. ఇది ఒకపుడు బోయల గ్రామం. ఈ గ్రామంలో గూడ ఇదమ్మ దేవత ప్రసిద్ధంగా ఉంది.

ఆలయంలో ఈ దేవతామూర్తి కూర్చున్న భంగిమనే ఎనిమిదడుగులు ఉంది. ఇంత పెద్ద ప్రతిమ ఈ తాలూకాలో మరొకటి లేదు. ఈ దేవతకు సంక్రాంతినాడు బండ్లు వెళ్ళుతవి. ఆ పిమ్మట ఒక నెలవరకు ప్రతి మంగళవారం ఉత్సవం జరుగుతుంది.

ఈ ఇదమ్మ గుడియేకాక గ్రామంలో ఇంకా చెన్నకేశవ - శివ - ఆంజనేయాలయాలు, పోశమ్మ, మశమ్మ దేవతల గుడులు కూడా ఉన్నవి.

ఈ గ్రామానికి ఉత్తరంగా పెద్ద గుట్ట ఉంది. దీనికి కన్యకల గుట్ట అని పేరు. ఆ గుట్టపై కన్యకలమ్మ గుడి ఉంది. శ్రావణంలో ఆ దేవిని గ్రామస్థులు పూజించి వస్తారు.

ఎల్లమ్మ జాతరలు

1. తిరుమలాపురం

ఈ జిల్లాలో తిరుమలాపురాలు చాలా ఉన్నవి. ఈ తిరుమలాపురం అమరాబాదు పట్టీలో కేంద్రానికి ఆమెడన్నర దూరంలో ఉంది. అచ్చం పేట నుండి ఇప్పుడిక్కడికి బస్సులు నేరుగా వెళ్ళుతవి.

ఈ గ్రామంలో కురువ లెక్కువ. వారంతా పూర్వం గుల్బర్గా జిల్లా నుండి వచ్చి స్థిరపడినారు. వారు ఇండ్లలో కన్నడం మాటాడుతారు.

ఈ గ్రామంలో ఎల్లమ్మ దేవత ఈ పీఠభూమికంతా ప్రసిద్ధంగా ఉంది. ప్రతి మంగళవారం వందలాది మంది ఆమె దర్శనానికి వెళ్ళుతుం టారు. భక్తులు ఈ దేవికి వెండితో రూపు - రేఖ - కండ్లు ఎక్కువగా చేయించి అర్పిస్తుంటారు.

2. తుమ్మెనపేట

ఇది అచ్చంపేట తాలూకాలోని బలుమూరు మండలంలో ఉన్న గ్రామం. ఈ గ్రామంలో రామేశ్వరాలయం ఉంది. అది ప్రాచీనమయింది. ఆలయం విశాలంగా చక్కగా ఉంది.

ప్రస్తుతం ఉన్న ఎల్లమ్మ గుడి దానికి ప్రక్కగానే ఉంది. ఈ దేవతను శ్రావణంలో చుట్టుప్రక్కల వారంతా దర్శించి మ్రొక్కులు చెల్లించి వెళ్ళుతూ ఉంటారు.

3. రంగాపురం

రంగాపురాలు, లక్ష్మీపురాలు, శివపురాలకు ప్రతిగా వెలసిన గ్రామాలు. ఈ పేరుగల గ్రామాలు తాలూకాకు ఒకటి రెండైనా తగులుతుంటవి. ఈ గ్రామం ప్రస్తుతం కలువకుర్తి తాలూకాలో ఉంది. ఇక్కడ ఎల్లమ్మ దేవత ప్రసిద్ధి. అందుచేత ఈ గ్రామాన్ని ఎల్లమ్మ రంగాపురం అనే పిలుస్తారు. ఇక్కడికి కలువకుర్తి నుండి సర్వీసు ఉంది. ఈ దేవతకు పూర్వం పుట్టెడు బియ్యం అన్నం కుంభం పోసి, 100 యాటలు కోసి, 1000 దీపాలు పెట్టేవారట.

ఎల్లమ్మ మిక్కిలి ప్రాచీన దేవత. ఈమె జమదగ్ని భార్యయైన రేణుకా దేవి యని పురాణం చెబుతుంది. ఆ విధంగా గాక ఈమె ఎల్ల సీమాధి దేవత అని కొందరు, సృష్టి సమస్తానికి జనని అని కొందరు, ఎల్లరకు అమ్మ అని కొందరు చెబుతారు.

ఎల్లమ్మకు మంగళవారం ప్రియమైన దినం.

ఈ గ్రామంలో రావికంటి ఎల్లమ్మ, మోదంపల్లి ఎల్లమ్మ అని రెండు దేవతల గుడులున్నవి. రావికంటి ఎల్లమ్మను అగ్రజాతులు పూజిస్తే రెండవ ఆమెను తక్కిన జనం అంతా పూజిస్తారు. మహాత్మ్యం ఈ దేవతకే ఎక్కువ అని ప్రజల నమ్మకం.

ఈమె గుడి మొదట గ్రామానికి ఉత్తరంగా ఉండేది. కాలాంతరంలో అది శిథిలమై ప్రతిమను ఎవరో ఎత్తుకపోగా ఇపుడు ఊరివారు కొత్తగా ఊరికి దగ్గరగా దక్షిణం దిక్కున మరో గుడి కట్టించి, శిలా ప్రతిమను చేయించి నిలిపినారు.

ఎల్లమ్మ జాతర ఒకటి అమరాబాదు తిరుమలాపురంలో గూడ జరుగుతుంది. అది గూడ అక్కడ బాగా ప్రసిద్ధి.

4. బెక్కెరపల్లె

ఇది నర్వమండలంలోని మరో గ్రామం. ఇక్కడ ఎల్లమ్మ దేవత ప్రసిద్ధి. ఐదేండ్ల కొకసారి ఇక్కడ మాఘంలో పున్నమనుండి తదియ వరకు మహాఘనంగా ఆమె ఉత్సవం జరుగుతుంది. ప్రజలు అపుడు ఆమెను నీరు నింపిన మృత్కలశాలతో అనగా మట్టి కడవలతో ఆహ్వానిస్తారు. అపుడు యిక్కడ 'పుటము కట్టుకొనుట' అనే ఒక క్రొత్త రకమైన ఆచారం కనిపిస్తుంది. మ్రొక్కుబడి గల స్త్రీలు అపుడే వస్త్రాన్ని ధరించక, ఒంటి నిండా వేపాకు కప్పుకొని మేళతాళాలతో ఊరేగుతూ దేవిని పూజించటానికి గుడికి వెడతారు. ఈ ఆచారం ఇక్కడ తప్ప మరెక్కడా కనిపించదు. ఇదొక విశిష్టమైన పద్ధతి.

కర్ణాటకలోని వరదానదీ తీరంలో ఉన్న చంద్రగుత్తి అనే గ్రామంలో ప్రతియేట మార్చి మొదటి వారంలో ఎల్లమ్మ ఉత్సవం జరుగుతుందట. ఆ ఉత్సవంలో ఇప్పటికీ స్త్రీ, పురుషులు దిగంబరులుగా వెళ్ళి దేవతను పూజిస్తారని శ్రీ వసంతరావు రామకృష్ణారావుగారు తమ విశాఖపట్టణ దేవాలయాలలో చెప్పినారు. ఈ సందర్భంలో అలంపురంలో ఎల్లమ్మ పేర ఒక నగ్న కబంధం స్త్రీలతో ఆరాధింపబడుతూ ఉండటం గమనార్హం.

మైసమ్మ జాతరలు

1. కరకలపాడు

ఇది కల్వకుర్తి నుండి హైదరాబాదు రోడ్డున వాస్తాపురం దగ్గర ఉంది. దీన్నిపుడు మైసిగండి అని పిలుస్తున్నారు. ఇక్కడ గ్రామం ఏదీ లేదు. కాని దేవి మాత్రమే వెలిసింది. ఇది ప్రాచీనమయిన జాతర.

ఇక్కడ దేవి ప్రతిమ నిలువెత్తుగా ఉంది. అది సిమెంటుతో చేయబడి భీకరంగా ఉంది. ఇది గూడ అరణ్యక క్షేత్రం. పూర్వం ఇక్కడ అన్నీ కరక చెట్లు ఉండేవి. అందుచేత దీన్ని కరకలపాడు అన్నారు. ఇపుడిది ఆమనగల్లు మండలంలో ఉంది. ఈ దారిని వెళ్ళే బండ్లన్నీ ఈ దేవతకు మ్రొక్కి వెళ్ళుతూ ఉంటవి.

2. నాయనేనిపల్లి

ఈ గ్రామం నాగర్‌కర్నూలు నుండి కొల్లాపురం రూటులో పెద్ద కొత్తపల్లె దగ్గర ఉంది. ప్రస్తుతం ఇక్కడ దేవి ఊరి ముందు గల ఒక గొల్లవాని చెలుకలో వెలిసింది

మశమ్మ మహిష మర్దని రూపం. ఇక్కడ దేవికి ఆలయం ఇంకా ఏర్పడలేదు. ఆమె ఒక పుట్టలో వెలిసింది. దానికే ఇపుడు పూజ జరుగుతుంది. ఇక్కడి పూజారులు కుమ్మరివారు.

ఈ దేవి దగ్గరకు ప్రతి ఆదివారం నాడు జనం విశేషంగా వెళ్ళుతారు. ఇక్కడ జంతుబలి-ముఖ్యంగా కోళ్ళు, మేకలు బలి ఇవ్వడం విధిగా ఉంది. శ్రావణంలో జనం మరీ విపరీతంగా వెళ్ళుతారు కాబట్టి దాన్ని బట్టి ఇది అభివృద్ధి పరచదగినదిగా ఉంది.

3. పత్తేపూరు

మైసమ్మ మహిషాసురమర్దనికి సంక్షిప్తమైన తెలుగు పేరు. ఈ దేవి ఆలయం మహబూబ్‌నగర్ నుండి నవాబుపేట రోడ్డున బోయపల్లి-పత్తేపురం నడుమ రెండు గుట్టల నడుమ గల గండి ప్రదేశంలో ఉంది. ఇంతవరకక్కడ దేవి గుడి ఒక్కటి మాత్రమే ఉండేది. కాని ఇటీవల సత్రాలు గూడ ఏర్పడినవి.

ఇక్కడి ఆలయం ప్రాచీనమయింది. లోపల ఉన్న అమ్మవారి ప్రతిమ కూడ శిలామూర్తి. ఈ దేవి కూడ పెద్దగా భయంకరంగానే ఉంది. ఈమె మిక్కిలి మహిమగల దేవి అని ప్రజల నమ్మకం. అందుచేత ప్రతి మంగళవారం ఇక్కడ ఒక ఉత్సవంవలెనే ఉంటుంది. అంతేకాక, దేవికి పుష్యపూర్ణిమకు ప్రత్యేకమైన ఉత్సవం జరుగుతుంది. అపుడు బండ్లు వెళతవి. రథోత్సవం గూడ జరుగుతుంది.

ఇది అరణ్య ప్రదేశమైనా ఇక్కడ నీటి వసతి బాగా ఉంది. ప్రజలు ఎందరు వచ్చినా స్థలం సంకోచం అనే ప్రసక్తి ఉండదు.

దేవతా క్షేత్రంగానే గాక ఇది ప్రకృతి దృశ్యంలో కూడ చూడదగిన ప్రదేశంగానే ఉంది.

ఇతర దేవతల జాతరలు

1. జంబులమ్మ జాతర - జమ్మిచేడు

జమ్మిచేడు గద్వాల తాలూకాలోని గ్రామం. గద్వాలకు అయిదు మైళ్ళు ఉంటుంది. అది పూర్వం నంద్యాలవారనే వైష్ణవుల అగ్రహారం.

ఇక్కడ ఊరి వెలుపల చెరువు గట్టున ఒకపెద్ద జమ్మిచెట్టు, దాని క్రింద ఆ దేవత గుడి ఉన్నవి. జమ్మిచెట్టు క్రింద వెలసినందుకు ఆమె జంబులమ్మ అయింది. ఆ దేవికి ఏటా మాఘ శుద్ధమందు అయిదు దినాలు పెద్ద ఉత్సవం జరుగుతుంది. అపుడు ఇక్కడికి స్పెషల్ బస్సులు గూడ నడుస్తవి.

కొల్లాపురం సమీపంలోని పెంట్లవెల్లిలో గూడ జంబులమ్మ గుడి ఉంది.

2. మంత్రాలమ్మ జాతర - జనుంపల్లె

జనుంపల్లె తీగలపల్లె ప్రక్కన గల గ్రామం. తీగలపల్లె గుట్టల వరుస అలాగే ఈ గ్రామం మీది నుండి సాగిపోయింది. ఇక్కడి ఆ గుట్టపై ఒక చొరికలో ఈ దేవత వుంది. దేవతకు గ్రామస్థులు గుడి కట్టినారు. ఈమెకు గుడి విశేషంగా లేదు. కాని ఉత్సవం మాత్రం బాగానే జరుగుతుంది.

తీగలపల్లి వీరభద్రుని ఉత్సవం ముగియగానే ఈ జాతర ప్రారంభ మవుతుంది. కాబట్టి అక్కడ అంగళ్ళవారు, ప్రజలు అలాగే ఇక్కడికి వస్తారు.

ఈ జాతరలో సిడి తిరగడం ప్రత్యేకత. సిడిని వల్లభరాయలు క్రీడాభిరామంలో వర్ణించినాడు. ఒక బండిపై దూలం నిలిపి దానికి అడ్డంగా ఒక వాసం నాటి, ఆ వాసానికి ఇనుప కొక్కెం వ్రేలాడదీస్తారు. పూర్వం ఆ కొక్కెం సిడి వ్రేలే స్త్రీలు తమ వెన్నెముకకు గ్రుచ్చుకొని అడ్డంగా గాలిలో వేలాడేవారు. వారావిధంగా వేలాడుతుండగా అది నిలిపిన బండి ఆలయ ప్రదక్షిణ చేసేది. ఒకపుడీ సంఘటనలో ఒకామె మరణించింది కనుక, ఈనాడు మనిషిని కొక్కానికి వ్రేలాడదీసే ఆచారం పోయింది. వ్యక్తి కేవలం దాన్ని పట్టుకొని వ్రేలాడుతాడు. ఆ విధంగా బండి ఒక చుట్టు తిరిగిన తరువాత తక్కిన రెండు చుట్లు దానికి మేక పోతును కట్టి తిప్పుతారు.

3. చౌడమ్మ జాతర - తిప్పడంపల్లి

ఇది ఆత్మకూరు మండలంలోని గ్రామం. అంతేగాక దానికి ఒకప్పటి రాజధాని గూడ.

ఇక్కడ చౌడమ్మ గుడి ఉంది. ఈ దేవతను చౌడేశ్వరి అనిగూడ పిలుస్తారు ఈమె సింహవాహన.

పూర్వం ఒకపుడీ జిల్లాలో సింహ పద్మావతి అనే ఒక దేవత కొలువబడేది కాబట్టి ఆమె ఈమె ఒక్కటే అగునో కాదో పరిశీలించ వలసి ఉంది. ఈమెను తొగటలు, నందవరీకులు అనే రెండు తెగలవారు కొలుస్తారు.

తొగటలు బలిజలలో ఒక భేదం. వీరు తూముకుంట, పెంట్లవెల్లి పెబ్బేరు, అనంతాపురం, కల్వరాల గ్రామాలలో ఎక్కువగా ఉన్నారు. మాఘ పౌర్ణమికి ఈ దేవిని కొలుస్తారు. అపుడు "జ్యోతులు" అనే ఉత్సవం జరుగుతుంది. గోధుమ పిండితో ఒక పెద్ద ప్రమిదను చేసి, దానిలో నేయిపోసి, పెద్ద వత్తివేసి ముట్టించి, ఒక పళ్ళెంలో ఉంచి, దాన్ని

ఒక వ్యక్తి తలపై పెట్టి, మహాకోలాహలంగా భజనతో ఖడ్గాలతో ఊరేగుతూ దాన్ని దేవి సన్నిధికి కొనిపోతారు.

కొల్లాపురం తాలూకాలో నందవరీకు లెక్కువ. వారిలో ఎందరో కవికుటుంబాల వారు గూడ ఉన్నారు. వారీదేవిని చైత్ర శుద్ధ అష్టమికి పూజిస్తారు.

4. నల్లజానమ్మ గుడి - మక్తలు

ఈమె మక్తలు యొక్క గ్రామదేవత. ఈ దేవతపై భజన కీర్తనలు, పాటలు మొదలైన స్థానిక సాహిత్యం ఇక్కడ విరివిగా వ్యాప్తిలో వుంది. ఈ దేవత మహారాష్ట్ర నివాసి యట. అక్కడినుండి ఈమెను భక్తులు కొల్లాపురం తీసుకొని వస్తుండగా దారిలో ఇక్కడికి వచ్చేవరకు బండి విరిగి దేవత తానిక్కడనే నిలుస్తానని చెప్పుకున్నదట. అది విని ఆమెకు భక్తు లిక్కడనే గుడికట్టి నిలిపినారు.

ఈ దేవతకు ఇక్కడ దేవాంగులు పూజారులుగా ఉన్నారు. దసరా నాడీ దేవికి పల్లకీ సేవ జరుపుతారు.

5. నంద్యాలమ్మ జాతర-లింగనవాయి

లింగనవాయి అలంపూరు తాలూకాలోని గ్రామం. కేంద్రానికి నాలుగు మైళ్ళుంటుంది.

అలంపురంలోని ఆలయాలు రససిద్ధులు కట్టించినట్లు స్థలపురాణం చెబుతుంది. వారు ఆ నిర్మాణాలు ముగిసిన పిమ్మట ఇక్కడ ఒక బావిని త్రవ్వించి, తమ చెంత ఉండే రస లింగాన్ని దానిలో నిక్షేపించి ఒక నందిని ప్రతిష్ఠించినారట. అందుచేత ఈ గ్రామానికి లింగంబావి అని పేరు. నందిపేర సంద్యాలమ్మ జాతర ఏర్పడింది. లింగంబావి వ్యవహారంలో లింగనవాయి అయింది.

ఇక్కడి నంద్యాలమ్మ జాతర చాలా పురాతనమయింది. ఈ దేవతకు గుడిగాని గోపురంగాని ఏదీ లేదు. మూడేండ్ల కొక పర్యాయం చైత్రమాసంలో ఇక్కడ సిద్ధులు త్రవ్వించిన బావిలో ఒక కుండ పైకి తేలివస్తుంది. అది చూచి గ్రామస్థులు మరో క్రొత్త కుండను అలంకరించి పూజించి మేళ తాళాలతో ఊరేగించి తీసుకువెళ్ళి బావిలో పైకి వచ్చిన కుండ జతన విడుస్తారు.

అపుడు రెండూ కలసి నీటిలో కలిసిపోతవి. ఈ వింతను వంద లాది మంది ఆశ్చర్యంగా తిలకిస్తారు.

ఈ ఉత్సవం మహావైభవంగా మూడు దినాలు జరుగుతుంది. దీనిలో మాదిగ (మాతంగ) వారు పూజారులుగా వ్యవహరిస్తారు. ఇది వారికి వంశపారంపర్యంగా వస్తుంది.

6. గెలువలమ్మ జాతర - వంగూరు

వంగూరు కలువకుర్తి తాలూకాలోని గ్రామం. అక్కడికి కలువకుర్తి నుండి నేరుగా బస్సులున్నవి.

ఈ గ్రామంలో గెలువలమ్మ జాతర ప్రసిద్ధి. గెలువలమ్మ విజయ దుర్గకు తెలుగు రూపం. వంగూరు క్రీ. శ. ఆరవ శతాబ్దంలో ఒక విషయానికి కేంద్రం. దాన్ని చాళుక్య పులకేశి నుండి కాంచీపుర పల్లవులు వశపరచుకోగా పులకేశి అనంతరం అతని కుమారుడు విక్రమాదిత్యుడు పదమూడేండ్లు పల్లవులతో పోరాడి ఆ సీమను మళ్ళీ గెలుచుకున్నాడు. అపుడనేక దాన ధర్మాలు ప్రతిష్ఠలు చేసినాడు. కనుక ఈ గెలువలమ్మ ఆనాడు విక్రమాదిత్యుడు నిలిపిన దేవత అనవలె.

ఈమె మిక్కిలి మహిమ గలది. దేవరకొండ పతనానంతరం అక్కడి వాడైన మాచినేడు వచ్చి ఇక్కడనే నివసించినాడు. అత

దొకపుడు తన దండయాత్రలో లోకయ్యపల్లెవారిపైకి వెళ్ళి వారి ఆవులను తోలుకొని వచ్చినాడు. అది తెలిసి వారు సేనను పంపగా, దండెత్తి వచ్చి గ్రామాన్ని ముట్టడించినారు.

అపుడు మాచినేనికి వారిని గెలవడం దుస్తరమనిపించింది. తాను తోలుకొని వచ్చిన ఆవులను గెలువలమ్మ గుడి ఆవరణలో తోలి, ఈ యుద్ధంలో తన పరువు నిలిపితే ఏటా నీకు ఉత్సవం సాగిస్తానని మ్రొక్కినాడు.

గ్రామాన్ని ముట్టడించిన లోకయ్యపల్లె వారి దండు మరునాడు కోట తలుపులు పగులగొట్టుకొని లోపల ప్రవేశించి, దేవి ఆలయావరణంలో ఉండే తమ ఆవులను చూసినారు. అవి రంగుమారి తమవి కానట్టుగా కనిపించినవి. అందులకు వారు ఒక వీరునితో అనవసరంగా యుద్ధానికి సిద్ధపడినామని పశ్చాత్తాపపడి, మాచినేనికి క్షమాపణ చెప్పుకొని వెళ్ళి పోయినారు. ఆనాడు వారు దండెత్తివచ్చిన దినం శ్రావణ బహుళ పంచమి. కాబట్టి వారు వెళ్ళిపోగానే మాచినేడు నాటినుండి గెలువలమ్మకు గ్రామం వారందరూ బోనం ఎక్కించి ఉత్సవం సాగించే ఏర్పాటు చేసినాడు. అది ఇప్పటికీ నడుస్తోంది.

ఈదేనికి పూజారులు విశ్వబ్రాహ్మణులు. గ్రామంలో కమిటీ ఏర్పడి, ఆలయాన్ని బాగుచేసి మంటపం గట్టినారు. అమ్మవారికి వెండి తొడుగు కూడ చేయించినారు.

ఈ జాతరను ఊరివారందరూ పండుగలా చేసుకొని, తమ అల్లుండ్రను ఆడుబిడ్డలను పిలుచుకుంటారు. ఈ ప్రాంతంలో ఇంత మాసర దేవతాఉత్సవం లేదు.

7. మూర్తి కొండయ్య ఆలయం - ఆలూరు

ఆలూరు జడ్చర్లకు దక్షిణంగా మూడుమైళ్ళలో ఉంటుంది. ఇక్కడికి జడ్చర్ల నుండి, జిల్లా నుండి బస్సులున్నవి.

ఈ గ్రామంలో మూర్తి కొండయ్య ఆలయం బాగా ప్రసిద్ధి. ఇది గ్రామానికి దక్షిణంగా మూడు ఫర్లాంగుల దూరంలో ఉంది

పూర్వం కొండయ్య అను రైతు తమ పొలం దగ్గరగల కొండపై వున్న శివలింగాన్ని తీసుకొని నాగలిపై బరువుగా పెట్టి, పొలం దున్నుకునే వాడు. ఈవిధంగా అతడు ప్రతిదినం చేసేవాడు. అతడు నాగలి విడిచిన పిదప శివలింగం వెళ్ళి మళ్ళీ తన స్థానంలో నిలిచేది.

గ్రామస్థులకా విషయం తెలిసి అద్భుతపడి కొండయ్య అనంతరం ఆ లింగానికి ఒక గుడి కట్టించి, మూర్తి కొండయ్య అని పేరు పెట్టినారు. ప్రతియేటా సంక్రాంతికి ఇక్కడ ఉత్సవం జరుగుతుంది. సంక్రాంతినాడు తేరు వెళ్ళుతుంది. ఆనాడు దేవాలయం చుట్టూ ఎద్దులను బండ్లను అలంక రించి త్రిప్పుతారు. స్వామికి కొబ్బరి కాయలతోపాటు గుమ్మడి కాయలు గూడ కొడతారు.

ఇది చాలా పురాతనమైన స్థానిక ఉత్సవం. గత శతాబ్దంలో ఇక్కడ ఓరుగంటి శివరామయ్య అనే కవి ఉన్నాడు.

8. వీరప్పయ్య గుడి - దేవరకదిరె

వీరప్పయ్యగారు వనపర్తి సంస్థానంలో గల కందూరులో జనించిన ఒక జాత్యంధుడు. అంధులకు ప్రాపంచిక దృష్టి ఉండదు కాబట్టి వారి అంతర్నేత్రం అలౌకిక లోకాలను దర్శింపగలుగుతుంది. అందుచేత వీరప్పయ్య గొప్ప శివభక్తుడై, తన నాశ్రయించిన వారి సంకటాలను తన మహిమలో మాన్పుచుండెనట. ఈయన జంగం దేవర. ఇక్కడ ఆయన సమాధి ఉంది. దానికి భక్తులు ఆలయం కట్టినారు. సుమారుగా

అరువదేండ్ల నుండి ఈ సమాధికి చైత్ర శుద్ధ పంచమి నుండి ఏకాదశి వరకు ఉత్సవం జరుగుతుంది.

అపుడిక్కడ భజనలు, సప్తాహాలు నడిపి, అన్న సంతర్పణం చేస్తారు. మ్రొక్కుకున్న భక్తులు ఈ స్వామికి గండాదీపం కూడా మోస్తారు. మ్రొక్కుబడులు చెల్లిస్తారు.

పూర్వం ఇదొక శైవమఠమని ప్రతీతి. దీనికి ఇరువది నాలుగు ఎకరాల భూమి కూడా ఉంది. ఇక్కడ యాత్రికులకు సత్రాలు బావి వసతి ఉంది.

ఇది కాక ఈ గ్రామంలో ప్రాచీనమైన శివాలయం గూడా ఉంది.

ఇక్కడ బుధవారంనాడు పెద్ద ఎద్దుల సంత జరుగుతుంది. ఆ సంతకు వచ్చినవారెవరైనాసరే, వీరప్పయ్యగారికి టెంకాయకొట్టకుండా వెళ్ళరు.

ఇక్కడ శివాలయం ఉంది. మిక్కిలి ఎత్తుపై విశాలంగా ఉంది. ఈ ఆలయానికి ఉత్తరంగా వీరప్పయ్యగుడి ఉంది. ఇది ఉత్తరాభిముఖం. ఇది శిలామంటపం. శివాలయం చాలా పెద్దది.

9. శ్రీపతిరాయని గుడి - మంథెనగోడు

ఇది మగతల తాలూకాలో అదే మండలంలో ఉన్న ఊరు.

ఇక్కడ గ్రామానికి రెండు ఫర్లాంగుల దూరంలో ఒక గుట్ట ఉంది. దానిపై ఉండే ఒక శిలకు ప్రకృతిసిద్ధంగా ఒక దేవతామూర్తి రూపం ఏర్పడింది. అది చూచి భక్తులు దానికి ఆలయం కట్టినారు. ఈ స్వామిని "శ్రీపతిరాయడు" అని పిలుస్తారు.

ఇక్కడ స్థానికులైన "జోస్యులవారు" ఆలయ అర్చకులుగా ఉన్నారు. సుమారు రెండు వందల ఏండ్లకు పూర్వం వారి మూల

పురుషునికి పురందరదాసులవారు స్వప్నంలో దర్శనమిచ్చి, "దండెడ" అనే తన తంత్రీవాద్యం యిచ్చినారట. అప్పటినుండి యిక్కడ ఆ వాయిద్యానికి అర్చన జరుగుతుంది.

ప్రతి ఏట పుష్యంలో అమావాస్యనాడు పురందరదాసులవారి ఉత్సవం జరుగుతుంది. అపుడిక్కడికి పలు ప్రాంతాల నుండి భక్తులు వస్తారు. ఉత్సవాన్ని జోస్యంవారి కుటుంబీకులే నిర్వహిస్తారు.

ఇక్కడ శ్రీపతిరాయని ఆలయం ప్రక్కననే హనుమదాలయం గూడా ఉంది.

10. చింతల మన్నెప్ప - వీరులదిన్నె

నర్వ మండలంలోని గ్రామం. ప్రస్తుతం దీన్ని ఈర్లదిన్నె అని పిలుస్తున్నారు.

ఈ గ్రామానికి సమీపంగా ఒక కొండ ఉంది. దానిపై చింతల మన్నెప్ప శిలా విగ్రహం ప్రతిష్ఠించబడింది. వీరారాధన తెలుగువారికి క్రొత్తకాదు. సాధారణంగా ఒకటో అరో వీరగల్లులు లేని గ్రామం కూడా తెలంగాణంలో అరుదే. అయితే అందరు వీరులకు పూజమాత్రం యిపుడు లేదు.

ఈ మన్నెప్ప ఆనాడు ఏ సాహస కార్యం చేసినాడో లేదా ఏ మహిమ చూపినాడో తెలియదు. ఇపుడితనికి యిక్కడ చైత్ర బహుళంలో విదియ తదియ రెండు దినాలు ఉత్సవం నడుస్తుంది. అపుడు భక్తులు మన్నెప్పకు అభిషేకం కూడా చేస్తారు. రథోత్సవం కూడా ఉంటుంది.

భక్తులీ స్వామికి వెండిగంటలు, గజ్జెలు, తొట్టెలు మ్రొక్కుబడి క్రింద సమర్పిస్తుంటారు.

ఉత్సవ సందర్భంలో పశుబలి కూడా ఉంటుంది. ఇక్కడి పూజారి కాపు కులీనుడు. కాపువారు ఇక్కడ తప్ప మరెక్కడా పూజారులుగా లేరు. ఇదొక అపురూప విషయం.

ఇక్కడ లింగమయ్య పేర మరో గుడి ఉంది. దానిలోనిది శివలింగమే అయినా ఈ స్వామికి గూడా కరిమేకను బలి యిస్తారు. ఇది ఒక మహాత్ముని ఆలయం కావచ్చునని శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యుల మతం. ఇతడు మహాత్ముడు అనుటకంటె మన్నెప్పవశె మరో వీరుడే కావచ్చు. పూర్వం ప్రసిద్ధులు మరణించినపుడు వారి పేర లింగప్రతిష్ఠలు చేయటం ఆనవాయితీ, "వీరులు దివ్యలింగములు" అని పలనాటి చాటువులలో శ్రీనాథుడీ విషయం సూచించినాడు.

ఇక్కడ ఈ ఉత్సవం మార్గశిరంలో జరుగుతుంది. అప్పుడు మహమ్మదీయులు మహబూబ్ సుబానీ దర్గా ఉర్సు కూడా జరుపుతారు.

ఆశ్రమాలు-మఠాలు-సమాధులు

వ్యక్తి ఆరాధన హిందువుల కీనాటిదిగాదు. అది త్రేతాయుగం నుండియే ఉంది. ఆనాడు ప్రతిమకు బదులు ఆ స్థానంలో తమ యిష్టమైన వారిని కూర్చోబెట్టియే ఆరాధించేవారు. కాని కాలక్రమంలో ఆ వ్యక్తులలో అహమహమిక బయలుదేరి ఈర్ష్యాసూయలు చోటుచేసికోగా అపుడిక వారిని విడిచి వారి ప్రతిరూపాలైన ప్రతిమలను నెలకొల్పుకున్నారు. అయితే యిప్పటికీ ఆ విధంగా పూజించదగిన మహాత్ములు అరుదుగానైనా లేకపోలేదు.

అటువంటి వారు ఏకాంతంగా తమ తపస్సుకొరకు, ధ్యాననిష్ఠల కొరకు ఏర్పాటు చేసికొన్న ప్రదేశాలు ఈనాడు మనకు ఆశ్రమాలైనవి. వారు మరణించినపుడు సమాధిచేసి తర్వాతి కాలంలో వానిపై మందిరాలు కట్టబడినవి. అటువంటి వానిని మఠాలు అని పిలిచినారు.

ఈ మఠాలు రెండు విధాలుగా నున్నవి.

గురుస్థానంలో ఉండి ప్రజలకు జ్ఞానోపదేశం చేస్తు వేర్వేరు పేర్లతో పీఠాలను ఏర్పరచిన వారున్నారు. అటువంటి పీఠాలను గూడ ఇపుడు మఠాలనే పిలుస్తారు.

ఇవిగాక మరణించిన వారిపై కట్టిన మందిరాలను గూడ మఠాలనియే పిలుస్తారు. అయితే వీనిలో వారి వారి సమాధులు గూడ ఉంటవి కాబట్టి వీటిని సమాధి మఠాలు అంటారు. అటువంటివి ఇక కొన్ని పరికించండి.

1. కుసుమ హరనాథ బాబా ఆశ్రమం - అడ్డగట్టు

ప్రస్తుతం పట్టెం సమీపంలోని అడ్డగట్టుపై వెంకటేశ్వరాలయం వెలయటానికి ఈ ఆశ్రమమే ప్రాతిపదిక. దీని స్థాపకుడైన నరసింహారావు గారిక్కడ మొదలు ఆశ్రమం కట్టుకున్న పిమ్మటనే ఆలయరంగంలోనికి కాలు పెట్టినాడు.

గుట్టపైన గుడి - గుట్టక్రింద ఈ ఆశ్రమం రెండూ అన్యోన్యాశ్రయంగా ప్రస్తుతం వర్ధిల్లుతున్నవి.

ఈ ఆశ్రమానికి ఎదురుగా ఒక తోట పెంచబడుతుంది. దానిలో వివిధములైన మల్లెలు, మందారాలు, గొజ్జంగులు వేయబడినవి. ఈ తోట చక్కగా పెరిగిన నాటికి ఇది కుసుమ హర నామానికి సార్థకంగా నిలువ గలదు.

2. వైకుంఠాశ్రమం - గొల్లపల్లి

ఇది కేశంపేటకు సుమారు మైలున్నర దూరంలో గొల్లపల్లి కేశంపేటల నడుమ ఉంది. ఈ ఆశ్రమాన్ని ఉప్పరపల్లె కృష్ణదాసు శిష్యుడు వెంకటదాసు క్రీ. శ. 1977 లో స్థాపించుకున్నాడు. ప్రస్తుతం దీనిలో ఒక శివప్రతిష్ఠ, ఒక పూజా మందిరం ఉన్నవి. ఇక్కడ బొల్లిగట్టుపై గుడి ఉంది. దాన్ని వెంకటదాసు కట్టించినాడు. ఇతడు వెలమ. సంకీర్తన కవి.

ఉప్పరపల్లె కృష్ణదాసు నంబి. ఆతడు గూడ ఈ ప్రాంతంలో పేరు చెందిన ఆధ్యాత్మికవేత్త. అయన చరిత్రను చిన్నగా హరికథా రూపంలో వెల్లగొండ జ్ఞానదేవు రచించినాడు. అది ముద్రితం.

3. ఆనందాశ్రమం - మహదేవుని పేట

ఈ గ్రామం నాగర్‌కర్నూలు తాలూకాలోనిది. బిజినపల్లె నుండి వనపర్తి రూటులో వుంది. ఇక్కడి ఈ ఆశ్రమాన్ని స్థాపించినవాడు శ్రీ మదచల ఋషి మల్కిదాస దేశిక స్వామివారు.

మల్కిదాసుగారు నెల్లూరు జిల్లా ఉదయగిరి తాలూకాలోని అయ్యవారిపల్లె గ్రామస్థుడు. సయ్యద్ వంశానికి చెందినవాడు. బాల్యం నుండీ విరక్తుడై, పదకొండవ ఏట ప్రకాశం జిల్లాలోని అనుమనిగిరి బిలాంతర్గత మత స్థాపకులైన శ్రీ చెరుకూరి శివరామ బ్రహ్మర్షిగారి కూతురు కడియంపాటి గోవిందమాంబగారి శుశ్రూషచేసి అనుగ్రహాన్ని పొంది దేశాటనం చేస్తూ మహదేవుని పేటకు వచ్చి, అక్కడ ఆనందాశ్రమాన్ని స్థాపించుకొని, ముప్పది ఏండ్లనుండి నివసించి రక్తాక్షి పుష్య పౌర్ణమినాడు నిర్యాణం పొందినాడు.

ఈయన మహమ్మదీయుడైనా సిద్ధయ్యగారి వలె హిందూమతానుయాయియై ఆశ్రమాన్ని స్థాపించి సర్వమత సమన్వయాన్ని చూపినాడు. అందుచేత భక్తులితనికి సమాధికట్టి ఆరాధన ఏర్పాటు చేసినారు.

ప్రతి ఏటా పుష్యమాసంలో ఈ ఆశ్రమంలో మూడు దినాల ఉత్సవం జరుగుతుంది.

4. ఆనందాశ్రమం - మున్ననూరు

ఈ గ్రామం గోపాలపేట సంస్థానంలోనిది. ఇక్కడ గ్రామానికి తూర్పుగా ఒక కిలోమీటరు దూరంలో కనికలగట్టు అనే గుట్ట, "మునుల బావి" అనే బావి ఉన్నవి. గ్రామానికి గట్టుకు నడుమ పై ఆశ్రమం ఉంది. దాని స్థాపకుడు శ్రీ నిత్యానంద స్వామివారి శిష్యుడు ప్రణవానంద స్వామి.

నిత్యానంద స్వామిగారు తిరునల్వేలి జిల్లాలో గల చిన్న నగర నివాసి. బాల్యంలోనే సన్యసించి పరమహంస పరివ్రాజకాచార్యులై దేశాటనం చేస్తూ వచ్చి అలంపూరు తాలూకాలోని నంగినవాయి గ్రామంలో క్రీ. శ. 1960 శ్రీ వికారి సరక చతుర్దశీ పర్వదినంనాడు సమాధిని పొందినాడు. ఆయనకీ ప్రాంతంలో చాలామంది శిష్యు లేర్పడినారు. వారిలో మున్ననూరు నివాసి విశ్వకర్మకులీనుడైన గజ్జెలయ్య మయాచారి గారు ముఖ్యుడు. గజ్జెలయ గజ్జల పాపమ్మ పేరు.

ఆయనకు గూడ బాల్యంనుండే వైరాగ్యభావం ఉండేది. చిన్న తనంలోనే వివాహం జరిగింది. అనంతరం ఇల్లు విడిచి వెళ్ళి నిత్యానంద స్వామి వారి నాశ్రయించినాడు. కొంతకాలాని కాయన కతడు వివాహితుడని తెలిసింది. అపుడాయన అతనితో నీవు కొంతకాలం గృహస్థాశ్రమం గడిపి ఆ తరువాత ఆశ్రమ స్వీకారం చేయమని ఆదేశించి తన పాదుకలు, శాటి, ఒక బెత్తం ఇచ్చినాడు. అవి గ్రహించి ఆయన గురువుగారి ఆదేశం ప్రకారం ఇంటికి వచ్చి ఏకపుత్ర పర్యంతం భార్యతో కాపురం చేసి తరువాత సన్యసించి ప్రణవానందస్వామియై క్రీ శ. 1956 నుండి ఇక్కడ ఆశ్రమం స్థాపించి నడుపుతున్నాడు. ప్రస్తుతం దానిలో నిత్యానంద స్వామిగారి శ్రీపాదుకలు, శాటి పూజింపబడుతున్నవి.

ప్రణవానంద స్వామివారి కుమారుడు - ఆనందాచారిగారు సంస్కృతంలో యం. ఏ. చేసినాడు. మంచి చేయి తిరిగిన చిత్రకారుడు. హైదరాబాదులో ఉన్నాడు.

5. శంకరమ్మగారి ఆశ్రమం - వేముల

ఇది కలువకుర్తి తాలూకాలోని గ్రామం. జడ్చర్ల నుండి కల్వకుర్తి రూటులో వెలిజాల పిమ్మట ఉంది. ఇది ఈ తాలూకాలోని ప్రాచీన గ్రామాలలో ఒకటి.

ఈ గ్రామంలో మనువంశీయురాలైన శంకరమ్మగారి ఆశ్రమం ప్రసిద్ధి. ఈమె చీకటిమామిడి రాఘవాచార్యుల శిష్యకోటిలోనిది. రాఘవాచార్యులుగారు గత శతాబ్దంలో పేరందిన హరికథకుడు. ఆధ్యాత్మిక వేత్త. ఆయనకు తెలంగాణంలో చాలామంది శిష్యులున్నారు. వారిలో పాలమూరుజిల్లాలో శంకరమ్మగారు చెప్పదగింది. శ్రీరామ ఉపాసకురాలు. చీకటిమామిడి నల్లగొండ జిల్లాలోనిది.

ఆత్మకు లింగభేదం లేదు. అయినా మధ్యకాలంలో స్త్రీలను విజ్ఞాన రంగానికి దూరంగా ఉంచినారు. అయితే ఆ విధంగానే ఉంచినంత మాత్రాన వారు దూరం కారనటానికి జిల్లెళ్ళమూడి అమ్మ, ఆనెగొంది మాణిక్యేశ్వరి వంటివారు నిదర్శనం. ఆ కోవకు చెందిన ఈమె ప్రస్తుతం మన జిల్లాలో ఏకైక ప్రతినిధిగా నిలిచింది. ఈమె తండ్రిగారు విశ్వనాథుని భక్తుడు. ఈమె ఆశ్రమం గ్రామానికి దూరంగా ఏకాంత వాతావరణంలో ఉంటుంది. విశ్వనాథ మందిరం, వెంకటేశ్వర మందిరం, హనుమాన్ మందిరం, గురు మందిరం ఉన్నవి. వైశాఖ శుద్ధ దశమిన దైవసాక్షాత్కారం యాదగిరిలో ఆమెకు జరిగింది. కాశీవిశ్వనాథ కల్యాణం ఆనాడు అనగా వైశాఖ శుద్ధ దశమినాడు జరుపుతారు. ఆరాధన కూడా ఆనాడే ఉంటుంది.

6. మళయాళ స్వామి ఆశ్రమం - షాద్‌నగర్

షాద్‌నగర్ యొక్క మొదటి పేరు ప్రసాద్‌నగర్. ఇది కిషన్ ప్రసాదుగారి పేర స్థాపించబడిన గ్రామం. ఈనాడు షాద్‌నగర్‌గా మిగిలింది.

ఇక్కడ బస్ స్టాండుకు ఉత్తరంగా కొంత దూరంలో ఈ ఆశ్రమం ఉంది. పాలమూరు జిల్లాలో ఆశ్రమాలు చాలా తక్కువ. ఉన్న వానిలో సువ్యవస్థితంగా నడిచేవానిలో ఇది చెప్పదగింది. అంతేగాక

స్వామి వారి ఆశ్రమాలలో ఇది మొదటిది. దీనికి ప్రేరకుడు, కారకుడు డా. రామాచారిగారు.

మళయాళ స్వామివారు కేరళ దేశంలోని నారాయణ గురుదేవుల పంథాకు చెంది, వారివలె తెలుగు దేశంలో తనదైన పద్ధతిలో ఒక వేదాంత విద్యాశ్రమాన్ని స్థాపించి, శుష్క వేదాంతాన్ని తన విజ్ఞాన భాస్కరునిచే రూపుమాపి, యథార్థ భారతిని జిజ్ఞాసువుల కందుబాటులోకి తెచ్చిన మనీషి.

ఈ ఆశ్రమానికి క్రీ.శ. 1979 లో శంకుస్థాపన జరిగింది. స్వామి చిన్మయానందగిరిగారు దీని ప్రారంభకులు మరియు సంచాలకులు.

దీనికి స్థాపకుడైన పరవట్ల వజ్రలింగం గుప్తగారు 1050 గజాల స్థలదానం చేసినారు. ఆ స్థలంలో జడ్చర్ల నివాసియైన బి. రఘునాథరెడ్డి గారు గురుమందిరమనే స్వామివారి ప్రతిష్ఠాగదిని, కీ. శే. రుద్రంగి వెంకయ్యగారి సంస్మరణార్థం వారి ధర్మపత్ని లక్ష్మీనరసమ్మగారు సాధునిలయం పేర రెండు గదులను, స్థానికుడైన బిక్కుమళ్ళ కృష్ణయ్యగారు అన్నపూర్ణనిలయం పేర వంటశాలలను, కీ॥ శే॥ ఆగరు చంద్రయ్యగారు భోజనాలయాన్ని, చిలుకూరి రాఘవశర్మగారు గీతా నిలయాన్ని, కజ్జం సరస్వతమ్మగారు తులసీబృందావనాన్ని కట్టించినారు. తోట ఎల్లయ్య గుప్తగారు ప్రయాగతీర్థం పేర బావిని త్రవ్వించినారు.

ఈ ఆశ్రమంలో స్వామివారు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం మా జిల్లాలో మళయాళస్వామివారి ధార్మిక ప్రచారానికి ఇదే ప్రధాన కేంద్రంగా ఉంది.

మఠాలు

1. ఓంకారమఠం - కలువాల

ఇది సర్వ మండలంలోని గ్రామం.

ఈ గ్రామంలో ఆలయమేదీలేదు. కాని గ్రామానికి పడమట అర మైలు దూరాన క్రీ. శ. 1955 లో ఒక మఠం కట్టబడింది. స్థానికుడైన మాలిపటేలు కుమారరెడ్డిగారు దానికి ఒక ఎకరం పొలం గూడా యిచ్చినాడు.

2. శంభునాథమఠం - గద్వాల

ఇది నాథ సంప్రదాయానికి చెందిన మఠం. గద్వాలలోని హర్కార్ పేటలో ఉంది. దాన్నిపుడు శంభునాథ్ మందిర్ అంటున్నారు. దాన్ని స్థాపించిన శంభునాథుడు కాశీ నివాసి. నల్ల సోమనాద్రి కాలంలో కర్ణాటకలోని హుబ్లీ జిల్లాలోగల హండీ బగళానాథ్ మఠాన్ని దర్శించటానికి వెళ్ళి తిరిగి వచ్చేటప్పుడు మార్గమధ్యంలో ఇక్కడ ఆగి, తపస్సు చేసుకుంటూ సిద్ధిపొందినాడు అని చెబుతారు.

ఈ మఠంలో ఇప్పుడు అంబా భవాని, ఆంజనేయ, భైరవనాథ మందిరాలు, గోరక్షనాథ దత్తాత్రేయపీఠాలు ఉన్నవి. నే నెరిగినంతవరకు నాథ సంప్రదాయ మందిరం ఇక్కడనే కనిపిస్తుంది. ఈ మఠంలో ప్రస్తుతం ఎనిమిదవతరంవాడైన "దశరథనాథ్" అనే పీఠాధిపతి ఉన్నాడు. దీని శాఖ ఒకటి ఆదోనిలో భైరవపీఠం పేర ఉంది.

ఇక్కడి మఠంలో పీఠారాధన భాద్రపద శుద్ధ నవమి నుండి ప్రారంభమై, దసరా నవరాత్రుల పిమ్మట ముగుస్తుంది.

3. మఠం - జక్కనాలపల్లె

ఇది కలువకుర్తి తాలూకాలో ఊరుకొండపేట ఉత్తరంగా ఉంది. ఇక్కడ గుట్టకు ఒక మఠం ఉంది. ఇది గోళకిమఠం అని స్థానికులు అంటారు.

ఆయనగంటి దగ్గర దొంగలపోలెపల్లి ఉంది. దానికి కసిరెడ్డివారు ప్రభువులు. వారి సేనాని జక్కన నాయకుడు. జక్కి అనగా గుర్రం - ఈయన ఎప్పుడూ ఒక పెద్ద గుర్రాన్ని ఎక్కి తిరిగేవాడట. అందుచేత అతనిని జక్కనాయకుడన్నారు. ఆ నాయకుని గురువు పేర ఈ మఠం వెలసింది. ఇది శిలానిర్మితం. ముఖద్వారంపై ద్వాదశార చక్రం ఉంది.

చక్రం బౌద్ధచిహ్నం - కనుక పూర్వం ఇది ఒక బుద్ధసన్యాసుల మఠం కావచ్చు.

4. అవధూత మఠం - నారాయణపేట

నారాయణపేటలో గుడులతోపాటు మఠాలు కూడ మిక్కిలిగానే ఉన్నవి. ఇది వానిలో ఒకటి. యోగీశ్వరమఠం దగ్గర ఉంది. ఇవిగాక గ్రామంలో బాబాజీమఠం ఒకటి ఉంది. ఈ పేర పాలమూరు జిల్లాలో చాలా మఠాలున్నాయి. కాని ఈ బాబాలెవరో తెలిసిరాలేదు.

బాబాజీమఠంలో పద్మశాలీలు ఎక్కువగా భజనలు చేస్తుంటారు. వారు ఏటా ఒక పర్యాయం సమారాధన కూడ జరుపుతారు.

5. బాబాజీ మఠం

ఇక్కడి మఠాలలో బాబాజీ మఠం ప్రసిద్ధి గాంచింది. ఈ మఠంలో ఒక సమాధి ఉంది. అది నరసింహావధూతగారి సమాధి అని చెబుతారు కాని, ఆయన ఎవరో - ఎక్కడివాడో తెలియదు.

ఈ మఠంలో ఎల్లప్పుడూ సాధువులుంటారు. ఈ గ్రామంలోని పద్మశాలీలు దీనిలో ఎక్కువగా భజనలు చేస్తూ కార్తీకంలో పెద్ద సమారాధన జరుపుతారు.

బొప్పల మఠం

ఇది లింగాయతులకు సంబంధించిన మఠం. వారు ఇందులో భజనలు చేస్తుంటారు. "విభూతి" పత్రికా సంపాదకులైన చిదిరెమఠం వీరభద్రశర్మగారు మొదట ఇదే మఠంలో ఉండేవారు. వారు ఇక్కడి నుండియే కాశీకి వెళ్ళిపోయినారు.

6. యోగీశ్వర మఠం

ఇది నారాయణపేటలో గ్రామానికి ఉత్తరంగా బారం బావి దగ్గర ఉంది. బారం బావి నారాయణపేటలో బాగా ప్రసిద్ధి. దాని దగ్గర మనోహరేశ్వర - అవ్వన్నేశ్వర - లింగేశ్వరాలయాలు, అమ్మణ్ణి గుడి వున్నవి. ఇవన్నీ వ్యక్తుల పేర్లతో వెలసినవే. కాని వారేయే కాలాలకు చెందినవారో ఎవరో ఆ చరిత్రలేవీ తెలియవు. వానిలోనే ఈ యోగీశ్వర మందిరం ఒకటి.

యోగీశ్వరుని పూర్తి పేరు శివానంద యోగీశ్వరుడని, ఆయన మహారాష్ట్ర నివాసి యని చెబుతారు. లోకయ్యవల్లె ప్రభువులు మహారాష్ట్రులు కనుక ఇతడు వారి ఆశ్రితుడు కావచ్చు. ఈ మహనీయుడు క్రీ. శ. 1895 వైశాఖ బహుళ సప్తమినాడు అందరు చూచుచుండగనే జీవ సమాధిలో ప్రవేశించెనట. ఇపుడాయన సమాధిపై చక్కని మందిరం కట్టబడింది.

7. కృష్ణయోగిమఠం - పగిడాల

పగిడాల గుండేడు మండలంలోని గ్రామం. గత శతాబ్దంలో ఇక్కడ కృష్ణయోగి అనే సాధువున్నాడు. ఆయన మహిమలను గురించి అనేకులు చెబుతారు అతనికి బొంబాయి వంటి దూర దూర ప్రదేశాలలో గూడ భక్తులున్నారు. ఆయన ఇప్పటికి నలువదేండ్ల క్రింద అనగా సుమారు 1950 ప్రాంతంలో జీవసమాధి అయినాడు. అప్పుడు భక్తులాయన సమాధిపై లింగప్రతిష్ఠ చేసినారు. అనంతర కాలంలో ఇప్పుడు ఆలయం కూడా ఏర్పడింది. ఏటా మాఘ బహుళ పంచమికి మూడుదినాల ఉత్సవం జరుగుతుంది. అప్పుడు మహబూబ్‌నగర్ కోసిగినుండి ఇక్కడికి బస్సులు నడుస్తవి సుమారు పదివేల మంది ఈ ఉత్సవానికి వస్తారు.

8. కొట్రయ్యగారి మఠం - బలిజెపల్లి

జంగమయ్యపల్లె, బలిజెపల్లి రెండు గ్రామాలకు బండ్ల బాటే అడ్డంగా ఉంది. జంగమయ్య పల్లెలో బలిజలు, బలిజెపల్లిలో జంగాలు కనుక మేము మా గురువుల పేర దీన్ని కట్టుకున్నా మంటారు. జంగాలు ఇది మా శిష్యుల గ్రామం అంటారు. ఇది ఈ గ్రామాల విశేషం.

విరూపాక్షయ్యగారు ఒక జంగంగారు. ఆయన మఠం గ్రామ సమీపంలో దక్షిణంగా ఉంది దానిలోనే ఆయన సమాధిగూడా ఉంది. విశాలంగా ఉండి శిఖరం, ప్రాకారం ఉన్నవి.

జంగమయ్య పల్లెలో చెన్నకేశవాలయం ఉంది,

9. మఠాలపట్టు - మారుమునగాల

ఇది కృష్ణాతీర గ్రామం. అలంపురానికి పదునైదు మైళ్ళ దూరంలో వుంది. ఇది మార్కండేయ క్షేత్రం. అతడు యముని బాధ తప్పించుకోవటానికి ఇక్కడనే తపం చేసినాడని ప్రజల నమ్మకం.

ఈ గ్రామంలో తిమ్మగురుని మఠం, సిద్ధయ్య మఠం, గోవిందయ్య మఠం, కన్నయ్య మఠం, యాదవ మఠం అని అయిదు మఠాలున్నవి. వీనిలో తిమ్మగురుడు విశ్వకర్మ, సిద్ధయ్య జంగం, గోవిందయ్య బ్రాహ్మణుడు, కన్నయ్య హరిజనుడు, యాదవయ్య మఠం గొల్లవారిది. ఈ అయిదుగురు తత్వవేత్తలు మహిమోపేతులని ప్రజల నమ్మకం.

ఈ మఠాలలో తిమ్మగురుని మఠానికే ఎక్కువ ప్రాముఖ్యం వుంది. ఇతడు తింత్రిణీక్షేత్రంలోని మౌనీశ్వరుని శిష్య సంతతివాడు. మౌనప్పయ్య శిష్యుడు గంగప్పయ్యగారు. గంగప్పయ్యగారి శిష్యుడు ఈ తిమ్మగురుడు అని చెబుతారు. ఇతని ఉత్సవం చైత్ర బహుళ దశమి నుండి ద్వాదశివరకు జరుగుతుంది. మొదటినాడు నందికోల్ సేవ, రెండవ నాడు తీర్థావళి నడుస్తవి. ఇతనిపై "తిమ్మ గురుని లీల" అని శ్రీ జి. గోవిందప్పగారు చక్కని కావ్యమును రచించిరి.

ఇవిగాక ఇక్కడ మార్కండేయ, చెన్నకేశవ, ఆంజనేయ ఆలయాలున్నవి. వానిలో అన్నిటికంటే మార్కండేయ స్వామి ఆలయానికి ప్రాముఖ్యం ఉంది. కాని ఈ గ్రామం నేడు శ్రీశైలం మునకలో పోయింది. గ్రామస్థులు ఊరు కొత్తగా కట్టుకున్నారు.

సమాధులు

1. చంద్రమౌళీశ్వరస్వామి సమాధిమఠం - కోటకదిర

ఇది పాలమూరు నుండి దేవరకదిర రోడ్డున మన్నెంకొండకు ఎదురుగావున్న గ్రామం. రోడ్డుకు అటు మన్నెంకొండ, ఇటు కోటకదిర దాదాపు సమానంగానే ఉంటవి.

ఈ గ్రామంలో ఉండే చంద్రమౌళీశ్వర స్వామివారి సమాధి ఈ ప్రాంతం వారికి రాఘవేంద్ర స్వామిగారి బృందావనం వంటిది. అక్కడ ఏటేటా ఆషాఢ బహుళ విదియనుండి నవమివరకు భాగవత సప్తాహం జరుగుతుంది. చివరినాడు రథోత్సవం, అవబృథస్నానంగూడ నడుస్తవి. చుట్టుపట్ల నుండి ఎందరో భక్తులు, మ్రొక్కుబడులవారు వచ్చి, తమ ఆధిభౌతిక ఆధ్యాత్మిక తాపాలను పోగొట్టుకుంటారు.

చంద్రమౌళీశ్వర స్వామివారి పేరు చందన్న. ఈయన కొడంగల్లు తాలూకాలోని చిలుముల మైలవరంలో గిరిజాంబా, శేషగిరి అనే విప్ర దంపతులకు కాశీశ్వరుని అనుగ్రహం వలన కలిగినాడు.

తండ్రి చందన్నకు చిన్నతనంలోనే వడుగు, యుక్త వయస్సులో వివాహం గూడ చేసినాడు. కాని ఆయన మనస్సు సంసారంలో చిక్కలేదు. రామకృష్ణ పరమహంసవలె భార్యతో కొంతకాలం కలిసి జీవించినా సంసారసుఖం చూడలేదు. బాల్యం నుండీ వైరాగ్య భావం ఉండేది. భాగవతం తన్మయుడై చదువుతూ ఉండేవాడు.

ఈ విషయం తండ్రిగారు తన బావగారితో చెప్పినాడు. ఆయన పేరు రాజయోగి. అతడు మంచి సాధకుడు. చందన్న విషయం విని ఆశ్చర్యం వేసి, చదువుకొరకు తమ ఇంటికి తీసుకొని వెళ్ళి, యోగ

రహస్యాలన్నీ బోధించినాడు. కాల క్రమంలో అవి చందన్న జీవితంలో ఫలించి ఆయన్ను చంద్రమౌళీశ్వరుని చేసినవి.

చివరిదశలో ఆయన కృష్ణవేణి తీరంలోని - శ్రీ రామావధూత మఠ నివాసులైన వాసుదేవానంద సరస్వతితో పూర్ణదీక్షను తీసుకొని బిజ్జనపల్లి గుట్టపై దానికి ఆనందగిరి అని పేరుపెట్టి వట్టంలోని నారద గిరికి ప్రతిగా తన పీఠాన్ని స్థాపించినాడు. ఈయన కా ప్రాంతంలో శిష్య సంతతి గూడ చాలా ఉంది.

ఇతడు తన నాశ్రయించిన వెంకటదాసుకు వాసుదేవ ద్వాదశి, చెన్నకృష్ణమాంబకు రామపంచాక్షరి, గోపాలపేట నివాసి వాడకట్ట గజ్జెల దాసుకు నారాయణాష్టాక్షరి, ధర్మాపురం కృష్ణదాసుకు త్రయోదశి, మేనల్లుడైన కృష్ణదాసుకు శివ పంచాక్షరి, ఆవంచ పుల్లయ్యా గారికి రామ తారకం, రాజనగరం నివాసి వావిళ్ళ పంచాక్షరికి మహావాక్యం, గుడిగాని పల్లె పురుషోత్తమదాసుకు రామతారకం - ఈవిధంగా వారి వారి యోగ్యతలను బట్టి ఎందరెందరికో ఎన్నో ఉపదేశించినాడు.

ఈయన సోదరి సణ్ణమ్మను కోట కదిర కిచ్చినారు. చివరిదశలో ఈయన అక్కడికి వెళ్ళి కైవల్య మందినాడు. అపుడు భక్తు లాయనను అక్కడనే సమాధి చేసినారు. దానికి ఆళ్ళ ఆసిరెడ్డిగారు స్థలమిచ్చినారు.

సణ్ణమ్మగారికి తమ అన్నగారిపై భక్తివిశ్వాసం బాగా ఉండేది అందుచేత తరువాతి కాలంలో ఆమె కోడలు చంద్రభాగమ్మగారు స్వామి వారి కక్కడ మఠం కట్టించి, ఏటేటా ఆరాధన ఏర్పాటు చేసింది.

ఈ మహనీయుడు క్రీ. శ. 1912 విరోధికృతు సంవత్సర ఆషాఢ బహుళ అష్టమినాడు పరమదించినాడు. చనిపోయేనాటికి ఆయనకు తొంబది ఏండ్లు. కనుక క్రీ. శ. 1822 ప్రాంతం ఆయన జననం అయి ఉంటుంది.

ఈయన యొక్క సంపూర్ణ జీవిత చరిత్రను జడ్చర్ల నివాసి శ్రీ కాశీ రామశర్మగారు "పురుషోత్తమానంద విజయం" అనే పేర కావ్యంగా, ఆధ్యాత్మిక జీవిత చరిత్రను వావిళ్ళ పంచాక్షరిగారు "ఉమా మహేశ్వర సంవాదం" అని హరికథా రూపంగా రచించినారు. పంచాక్షరి కృతి ముద్రితం. ఇతని కవిత్వం సరసంగా, సలక్షణంగా ఉంటుంది. కాబట్టి ఇది పరిష్కరణతో పునర్ముద్రించవలసిన కృతి.

కోటకదిరలో ఈ మఠమేగాక ఒక శివాలయం గూడ ఉంది. శివునికి ఎడమవైపున గణపతి, కుడివైపున రంగనాయక మూర్తి ప్రతిష్ఠింప బడినారు. దానిలో మహిషమర్దని సప్తమాతృకామూర్తులు గల అఖండ శిలగూడ ఉన్నవి. ఈ ఆలయం లోని మహిషమర్దని ప్రాచీనమైనదిగా తోస్తుంది.

2. గురులోకమసానంద్ ప్రభు సమాధి-తిమ్మారెడ్డిపల్లె

తిమారెడ్డి పల్లె కొడంగలు తాలూకాలోని గ్రామం. కాని ఇక్కడికి మహబూబ్‌నగర్ నుండి గూడ ప్రత్యేక బస్సులు వెళ్ళుతవి.

ఈ గ్రామంలో గురులోక మసానంద ప్రభు సమాధి బాగా పేరు చెందింది. ఇది ఇండియాలోనే రెండవది అని అంటారు. ఈ సమాధి సామాన్యమయిందే కాని జాతర మాత్రం చాలా పెద్దగా నడుస్తుంది. అది ప్రతి ఏటా వైశాఖంలో జరుగుతుంది. ఈ ఉత్సవానికి కర్నాటక నుండే గాక మధ్యప్రదేశ్ నుండి గూడ భక్తులు దండిగా వస్తారు.

విశేషించి ఈ ఉత్సవంలో లంబాడీ లెక్కువ పాల్గొంటారు. వారు ఈ మహనీయుని తమ గురువుగా మన్నిస్తారు.

3. కిషన్ ప్రభువుగారి సమాధి మఠం – తొమ్మిది రేకుల

ఇది షాద్‌నగర్ తాలూకాలోని గ్రామం. అప్పకవి పేర్కొన్న నవదళపురి. అక్కడికి షాద్‌నగర్, జడ్చర్ల గ్రామాలనుండి బస్సులున్నవి.

కిషన్ ప్రభువు బొందిలి కుటుంబానికి చెందినవాడు. గొప్ప తత్వవేత్త. మహిమోపేతుడు, సిద్ధుడు. చాలా దేశాలు తిరిగినాడు. ఇబ్రహీంపట్నం తాలూకాలోని దన్నారం అనే గ్రామం దగ్గర ఒక పెద్ద మట్టి తొట్టిలో చాలా కాలం తపంచేసి, అక్కడ నుండి బయలుదేరిన తరువాత తొమ్మిది రేకులతో స్థిరపడినాడు. ఆయన నూటా పన్నెండేండ్లు బ్రతికినట్లు చెబుతారు. ఒక భాద్రపద శుద్ధ ఏకాదశినాడు కైవల్యం చెందినాడు.

భక్తులు ఆయన నివసించిన స్థానంలోనే అతనిని సమాధిచేసి, ఒక మఠం కట్టించినారు. ఇది గ్రామానికి వెలుపల నైఋతి దిశన వుంది. ఈ సమాధి నేలమాళిగ. దాని లోపలికి దిగటానికి మెట్లున్నవి. ఈ సమాధి ఆవరణలో వాయువ్య దిశన వుంది. దక్షిణంగా ఆయన ప్రతిష్ఠించి పూజించిన శివాలయం ఉంది. ఈ ఆలయం చక్కగా ఉంది.

ప్రతి ఏటా ఇక్కడ భాద్రపద శుద్ధ ఏకాదశికి ఆరాధన జరుగుతుంది. కిషన్ ప్రభువుగారి జీవిత విశేషాలకు చూ. పరిశీలన 9 ఆగష్టు 1977.

మా జిల్లాలో కొన్ని దర్శనీయ స్థలాలు

భక్తులకు దేవాలయాలవలె, చరిత్రకారులకు చారిత్రక స్థలాలు, విలాసవంతులకు మనోహర స్థలాలు ముఖ్యమైనవి; కాబట్టి ఆఖరున ఆలయాలతోపాటు వాటిని గూడ కొన్ని తిలకించండి.

ఈ జిల్లాలో కోడూరు, కందూరు, వర్ధమాని, పూడూరు, గంగాపురం, ఆవంచ వైజయంతీ చాళుక్యులకు, వారి సామంతులైన కందూరు చోళులకు రాజధానులుగా, రాజప్రతినిధి పురాలుగా ఉన్నవి.

కోడూరు ఇపుడు మహబూబునగర్ నుండి మఖ్తల్ రోడ్డున ధర్మారం దగ్గర ఉంది. ఇది తెలంగాణంలోనికి ప్రవేశించిన ఏరువ చోళులకు మొదటి రాజధాని. ఇక్కడ వారి దుర్గ చిహ్నాలు, యుద్ధ చిహ్నాలు కూడ ఉన్నవి.

కోడూరును విడిచిన పిమ్మట వారు కందూరు నాశ్రయించి కందూరు చోళులైనారు. ఈ గ్రామం ఇపుడు వనపర్తి తాలూకాలో ఉంది. దీన్ని గురించి ఇదివరకే చెప్పినాను. ఇది చోళులకంటె మొదలు చాళుక్యులకు రాజప్రతినిధి పురంగా ఉన్నది. ఇది ఆనాడు పదకొన్నూటిగా చెప్పబడింది.

కందూరును విడిచిన పిమ్మట ఉదయనచోడుడు ఆయన కుమారులు భీమగోకర్ణ చోడులు వర్ధమానినుండి కందూరునాడును పాలించినారు. ఈ గ్రామాన్నిపుడు నందివడ్డెమాను అంటున్నారు. ఇది నాగర్‌కర్నూలు

తాలూకాలో ఉంది. ఇది క్రీ. శ. 9 వ శతాబ్ది నుండి చరిత్రలో ఏన్నూటిగా కనిపిస్తుంది. ఈ గ్రామంపై వాసా ప్రభావతిగారు పరిశోధన చేసినారు.

కందూరులోను, ఈ గ్రామంలోను పురాతనాలయాలు చాలా ఉన్నవి. పూడూరికి పుండ్రపురమని శాసనాలలో పేరు. ఇది పూర్వం పశ్చిమ చాళుక్యుల సామంతులకు రాజధానిగా, అనంతరం గద్వాల ప్రభువులకు మొదటి కేంద్రంగా ఉన్నది. ఈ గ్రామం ఇపుడు గద్వాల తాలూకాలో ఉంది. ఇక్కడ గూడ శిథిలమైన చారిత్రక సంపద చాలా ఉంది.

గంగాపురం చాళుక్యులకు వైజయంతీ పురం పిమ్మట రెండవ రాజధానిగా ఉన్నది కాబట్టి ఇక్కడ వారిది పెద్ద కోట. చెన్నకేశవాలయం ఇంకా ఇతరమైన ఆలయాలున్నవి. దీని సమీపంలోని ఆలవానివల్లెలో ప్రభుత్వం త్రవ్వకాలు జరిపింది. ఎన్నో ప్రాచీనావశేషాలు బయట పడినవి.

ఇవిగాక కొల్లాపురం యొక్క మొదటి రాజధాని జటప్రోలు - ఈనాడు శ్రీశైలం మునకలో ఉంది. వనపర్తి మొదటి రాజధాని సూగూరు కూడ చూడదగినది.

ఇక్కడి గిరి దుర్గాలలో ప్రతాపరుద్ర కోట, పానగల్లు కోట, గణపురం కోట, కోయలకొండ కోట ముఖ్యమైనవి

1. కోయలకొండ మహబూబ్‌నగర్‌కు 22 కి. మీ. ఉంటుంది. ఇక్కడి కోట ఒక ఎత్తయిన కొండపై ఉంది. అది చుట్టుపట్లకంటె 244 మీ. ఎత్తు ఉంటుంది. ఈ కోటను కోయదొరలు కట్టించినారు. దీన్ని 16వ శతాబ్దంలో కులీకుతుబ్‌షా గెలుచుకొని, నిర్మాణాన్ని పటిష్ఠం చేసినాడు. దీనిపై ఈ దండయాత్రను ఇతివృత్తంగా తీసికొని శ్రీ బడారు శ్రీనివాస

రావుగారు 'ఆశాదోషం' అనే నవల రచించినాడు కాని, అది అముద్రితంగానే చేతులు మారి ఈనాడు కనిపించకుండా పోయింది.

2. గణపురం ఈనాడు ఒక మండల కేంద్రం. ఇక్కడ గ్రామానికి ఈశాన్యంగా ఒక పెద్ద గుట్టల వరుస ఉంది దానిలో 9 గుట్టలున్నవి. వానిలో రెండు గుట్టలను కలిపి వర్ధమాన పురాన్ని పాలించిన గోన గణపిరెడ్డి ఒక కోట కట్టినాడు. అందుచేత దాన్నిపుడు దుర్గంగట్టు అంటున్నారు. దీని వైశాల్యం 480 ఎకరాలు. ఇది ఆరు ఫర్లాంగుల ఎత్తు ఉంది అంటారు.

ఈ కోటకు ఒకదాని పిమ్మట ఒకటిగా మూడు గవనులు ఉన్నవి. మూడవగవని విశాలంగా ఉండి, దాని కప్పు గుంబదు కప్పువలె ఉంది.

కోటలోపల ఆనాటి రాజభవనం, మంత్రుల నివాసాలు, కోనేటి వంటి పెద్ద బావి, ఒక కుంట, ఇంకా ఇతరుల గృహాల అవశేషాలున్నవి.

ఈ కోటకు కుడివైపున మైలారదేవర, ఎడమవైపున నృసింహస్వామి ప్రతిష్ఠలున్నవి. వివరాలకు. చూ. ఆంధ్రపత్రిక భారతి సారస్వతానుబంధం. 25-2-1987.

3. పానగల్లు ఖిల్లా ఇపుడు వనపర్తి తాలూకాలో ఉంది. ఇది చాళుక్యుల నాటి నుండి ప్రసిద్ధి పొందింది. దీని కొరకు రేచర్ల వారికి విజయనగర ప్రభువులకు, ఫీరోజ్‌షాకు విజయనగర ప్రభువులకు, సుల్తాన్ కులీకుతుబ్‌షాకు విజయనగర ప్రభువులకు యుద్ధాలు జరిగినవి.

విజయనగర రాజుల కాలంలో దీన్ని కాశ్మీర బ్రాహ్మణుడైన గడియంక భీముడు పాలించినాడు. ఇది శ్రీశైలానికి పశ్చిమ ద్వారంగా కూడా చెప్పబడింది. ఇది వనపర్తికి 88 కి.మీ. ఉంటుంది.

ఈ కొండ సముద్రమట్టానికి 548 మీటర్ల ఎత్తు ఉంది. దీనిపై ఉన్న కోట రెండున్నర కి.మీ. పొడవు, ఒకటిన్నర కి.మీ. వెడల్పు ఉంది. దానికి ఏడు ప్రాకారాలు, ఏడు బురుజులున్నవి.

4. ప్రతాపరుద్ర కోటకు పటాల భద్రత కోట అని మరో పేరు. ఇది రంగాపురం నుండి మున్ననూరి ఘాటు రోడ్డులో మూల మలుపుపై సూటిగా నెత్తిమీద ఉంది. పూర్వం దీనికి రంగాపురం వైపునుండి, కురువ మీద మాచారం వైపునుండి దారులున్నవి. దీని కోటగోడ ఆ పీఠ భూమినంతా చుట్టుతూ రెండు కొనలు తూర్పున కృష్ణవరకు సాగినవి. దీనిపొడవు 140 మైళ్ళు.

ఈ కొండ సముద్రమట్టానికి 2780 అడుగుల ఎత్తు ఉంటుంది. దీనిపై ఈనాటి మూలమలుపు దగ్గర కోటలో పూర్వం రాజుగారి పట్టణం ఉన్నది. దాని వెనకవైపు ద్వారం ఈ గుట్టపై దారి వేసినపుడు నష్టమై పోయింది. ఇపుడు దాని శిలాద్వారం మనకు మూలమలుపు ఎక్కినపిమ్మట కొంత దూరంలో కనిపిస్తుంది. దాన్ని తలుపుల కురువ అంటారు. పూర్వం దాని నుండి ఉమామహేశ్వరానికి, అచ్చంపేటకు దారులుండేవట.

దీని రాజద్వారం మాచారం వైపు ఉండేది. కాబట్టి ఆవైపు బండ్లదారి ఉంది కాని ఇపుడు అడవి బలిసిపోయింది

ఈ కోటలో ఆనాటి రాజభవనం, అతని అనుచర వర్గం యొక్క ఇండ్లు, ఒక వేణుగోపాలాలయం, చిన్న కుంట గూడ అవశేషాలుగా ఉన్నవి.

5. ఈ జిల్లాలో చారిత్రకులు ఈ ప్రదేశాలు తప్పక దర్శింప దగినవి: కోయలకొండకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో కోయిల్‌సాగర్

ప్రాజెక్టు ఉంది. ఇది ఒక మధ్యతరహా ప్రాజెక్టు. వనపర్తి తాలూకాలోని పెద్ద వాగుకు కట్టబడింది.

దీని చుట్టు కొండలు, పచ్చని చెట్లు ఉన్నవి. కనుక ఇది నిండినపుడు ఈ స్థలం దర్శనీయంగా ఉంటుంది. కాబట్టి ఇది విద్యార్థులకు చక్కని విహారయాత్రా కేంద్ర మనవచ్చు.

6. నృసింహ సాగరం-సింగపట్నం చెరువుకు నృసింహసాగరం అని పేరు. దీనికి మొదటి కొమ్మున నృసింహాలయం, రెండవ కొమ్మున రాజుగారి విడిది భవనం, గుట్టపై లక్ష్మీదేవి ఆలయం, ఈ చెరువు వెనుక పిల్ల కాలువలు, పచ్చని వరిచేలు మనోహరంగా కనిపిస్తవి.

7. రాజోలిబండ ప్రాజెక్టు - ఇది గద్వాల తాలూకాలోని గ్రామం. ఇది డైవర్షన్ స్కీము ప్రాజెక్టు - ఇక్కడ కృష్ణకు అడ్డుకట్ట వేసి, నీరు మళ్ళించి భూములకు యిచ్చినారు. కాబట్టి చూడదగిన వానిలో ఇది ఒకటి.

8. వ్యూవ్‌పాయింట్ - ఇది అచ్చంపేట తాలూకాలోని అప్పర్ ప్లాటుపై శ్రీశైలం రోడ్డున వరహాబాదుకు ఏడెనిమిది కిలోమీటర్లపై ఉంది. ఇది రక్షితారణ్య ప్రాంతం కాబట్టి అటవీశాఖాధికారుల అనుమతి తీసికుని వెళ్ళవలసి ఉంటుంది. ఇక్కడ అటవీశాఖవారి విశ్రాంతి భవనం ఉంది. అది రెండంతస్తులు ఉంటుంది.

ఇక్కడ నిలిచి క్రిందికి చూచినపుడు అచ్చంపేట తాలూకాలోని కొండనాగుల, బలుమూరు, లింగాల మొదలైన గ్రామాలన్నీ కనిపిస్తవి. కోపులవారు తమ కట్టెను ఇక్కడి నుండి గుట్ట క్రిందికి విడుస్తారు. అది జారుడుబండవలె ఉంది కాబట్టి దూలాలవంటి మొద్దులు సులభంగా సమతలానికి వచ్చి నిలుస్తుంటవి.

ఇక్కడి అడవి చూడ తగినట్లుగా ఉంటుంది.

9. సరళాసాగర్ మరొక వనవిహార ప్రదేశం. ఇది వనపర్తి తాలూకాలో శంకరమ్మపేట దగ్గర ఉంది రాణి శంకరమ్మగారు మొదలక్కడ ఒక చెరువు వేయించగా, ఆమెగారి కోడలు సరళాదేవిగారు దాన్ని సైఫన్ పద్ధతి చెరువుగా మార్పించింది ఇది ఆసియా ఖండంలో రెండవది అంటారు. దీని కొరకు రాజాగారు ఇంజనీర్లను రష్యాకు పంపినాడు. వారక్కడికి వెళ్ళి దీని పద్ధతిని నేర్చుకొని వచ్చినారు. పిమ్మట 35 లక్షల వ్యయంతో సరళాదేవిగారు దీన్ని నిర్మింపజేసింది.

ఈ నిర్మాణానికి శంకుస్థాపన ఆనాటి హైదరాబాదు గవర్నరు శ్రీ జె.ఎన్. చౌదరిగారు 15-9-1949 నాడు చేసినారు. దీని నిర్మాణం మాత్రం 1947 జూలైలోనే ప్రారంభమై 1959 నవంబరులో ముగిసింది.

దీని ఎర్త్‌డాం 3537, రాతికట్ట 520, సైఫన్ 391 అడుగుల పొడవున్నవి. ఇది 499 అడుగుల ఎత్తుంది. దీని క్రింద పది గ్రామాల భూములు సాగు అవుతవి. ఇది నిండి సైవన్ పని చేస్తున్నపుడు చూడ తగినట్లుగా ఉంటుంది.

10. బూదపురం-ఇది జడ్చర్ల తాలూకాలోని గ్రామం. ఇపుడొక మండల కేంద్రం. పూర్వం గంగాపురం ఆవంచ రాజధానులుగా ఉన్నపుడు ఆ ప్రభువులకు పంపే పాలకుండలు ఇక్కడ నిలువచేసేవారు. అందుచేత దీన్ని బూదపురం అన్నారు.

వర్ధమాన పురాన్ని పాలించిన మల్యాల గుండయకిది రెండవ కేంద్రంగా ఉన్నది. అందుచేత ఆయన దీన్ని అభివృద్ధిపరచి, ఇక్కడనే మరణించినాడు. అపుడాయన భార్య కుప్పమ్మగారు ఆయన పేర గుండేశ్వర ప్రతిష్ఠ చేసి ఆలయం కట్టించింది. అది యిపుడు పాత గ్రామంలో ఉంది.

ఈ గ్రామం ఏడవ జాతీయ రహదారిపై ఉంది. మహబూబ్‌నగర్ ఇక్కడికి 8 కిలోమీటర్లు ఉంటుంది.

ఈ గ్రామంలో పోల్కంపల్లి తూము లక్ష్మీనరసింహారెడ్డిగారు "శ్రీ సత్యసాయి గురుకులం" నడుపుతున్నారు. అది యీ జిల్లాలో చూడ దగిన పాఠశాల.

11. పిల్లలమఱ్ఱి - ఇది మహబూబ్‌నగర్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక పెద్ద మఱ్ఱిచెట్టు. దక్షిణ దేశంలోని పెద్ద పెద్ద మర్రిలో ఇది ఒకటి. మద్రాసులోని అడయారు మఱ్ఱి తర్వాత చెప్పదగింది.

ఇక్కడ క్రీ. శ. 7-12-1975 నాడు మహావీరుని 2500 వ వర్ధంతి సందర్భంగా అప్పటి ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ ఓబులరెడ్డిగారితో ఒక ప్రదర్శనశాల ప్రారంభింపబడింది. దానిలో ఈ జిల్లాలోని ఆవంచ - ఇంద్రకల్లు - గంగాపురం - పూడూరు - వడ్డమాను - కలువకొలను మొదలైన ప్రాచీన స్థలాలలోని శిల్పాలన్ని ఉంచబడినవి కాబట్టి దాన్ని చూస్తే ఈ జిల్లాలో వర్ధిల్లిన జైన - బౌద్ధ హిందూ సంస్కృతి, వికసించిన చాళుక్య - చోళ - కాకతీయ శిల్పకళారీతులు అన్ని ఒకేచోట విశ్వరూపం చూసినట్లు అవగతమవుతవి.

మరోసారి మీతో....

మా గ్రామం చిన్న పల్లెటూరైనా నాకు చిన్నతనం నుండియే గ్రామాభిమానం ఎక్కువ. దానితోపాటు స్థలచరిత్రలపై గూడ మక్కువ. అది ఎందుకో చెప్పలేను. నేను క్రీ. శ. 1954 లో ఉద్యోగంలో చేరినాను. అయితే అంత వరకూ నాకు చరిత్రపై మక్కువ ఉన్నా అది కార్యరూపం ధరించలేదు. 1959 లో మొదటిసారిగా విజయపురి త్రవ్వకాలు చూడటానికి వెళ్ళినాను. అప్పుడు నాకు ఆవిధంగా చూచిన చారిత్రక విశేషాలు ఊరకనే పోనీయరాదనిపించింది. నాటినుండి యిక ఎక్కడికి వెళ్ళినా ఆ స్థలానికి సంబంధించిన చారిత్రక విశేషాలు తెలిసికుంటూ వానిని వ్రాసిపెట్టుకోసాగినాను

ప్రాచీన గ్రామాలు, ప్రసిద్ధ క్షేత్రాలు, ప్రసిద్ధ వ్యక్తులు, వారి వంశాలు ఇవి నన్నెక్కువగా ఆకర్షించినవి కాబట్టి పనిమీద వెళ్ళినపుడు, పనిగట్టుకుని వెళ్ళినపుడు అక్కడి ప్రసిద్ధ స్థలాలను చూచి వ్యక్తులను కలిసి లేదా వారిని గురించి విని తెలిసిన విశేషాలు నోటు చేసికోసాగినాను. అవిప్పుడు కొన్ని ఈ చరిత్రకు గూడ ఉపకరించినవి.

కొన్ని ప్రదేశాలు నేను మొదట చూచిన నాటికి ఈనాటికి ఎంతో మారినవి. అక్కడ నేను గుర్తించుకున్న శిల్పసంపద ఈనాడు లేదు. ఇంద్రకల్లు - వడ్డవాని వంటి కొన్ని స్థలాలవి. పిల్లలమర్రికి కొనివెళ్ళగా మరికొన్ని స్థలాలలోని అపురూప దేవతలను నిశాచరులు చెరపట్టుకొని వెళ్ళినారు. ప్రాచీనాలయాలెన్నో ఈనాడు మూషకాసురుల బారిని పడుతున్నవి.

ఇటీవల దినపత్రికలు జిల్లా అనుబంధాలను విడిగా ప్రచురిస్తున్నవి కాబట్టి విలేఖరు లెక్కువైనారు. పత్రికల సంఖ్య గూడా పెరిగి ఔత్సాహిక రచయిత లెక్కువైనారు. కాబట్టి స్థానిక విశేషాలు చాలానే బయటపడుతున్నవి.

ఏదో పత్రికలో ఎపుడో ఏదో స్థల విశేషాన్ని గురించి ఎవరో వ్రాస్తారు. అది విన్నపుడు "ఓసీ యింతేనా!" అనిపించినా అవసరమైన నాటికి మళ్ళీ ఆ విషయం దొరకదు. అట్లని కనిపించిన ప్రతి కాగితం దాచటం సాధ్యంగాదు. కాబట్టి ఈ విషయంలో "కలనాటి ధనము లక్కరగల నాటికి దాచ కమలగర్భుని వశమా!" అనే పెద్దనగారి మాట ఎంతో అనుభవపూర్వకంగా కనిపిస్తుంది.

ఇప్పటికి దాదాపు మన ఆంధ్రదేశంలోని స్థల చరిత్రలన్నీ కావ్యాలుగానో పత్రికాముఖంగానో దాదాపుగా అన్నీ ఎపుడో ఒకపుడు వెలువడనే వెలువడినవని నేను భావిస్తున్నాను. అయితే అవన్నీ ఒకదగ్గర లేవు కాబట్టి విశ్వహిందూ పరిషత్తు వంటి సంస్థ ఆ చరిత్రలన్నీ ఆయా రచయితల నుండి సేకరించి జిల్లాలవారిగా కాని లేదా అన్ని కలిపి ఒకటిగాగాని వేసినట్లయితే మన ఆంధ్ర దేశానికి సమగ్రమైన క్షేత్ర చరిత్ర లేనిలోటు తీరుతుంది. అవి వ్రాసినవారికి ఆదొక ప్రోత్సాహంగా కూడా ఉంటుంది. తెలుగులో యాత్రా చరిత్రలు వచ్చినవి కాని గుంటూరు మండల సర్వస్వం, నెల్లూరు జిల్లా శాసన సపుటాలు, కడపజిల్లా సంస్కృతి - దర్శనీయ స్థలాలు, రాయలసీమలో రమణీయ ప్రదేశాలు. విశాఖపట్టణ దేవాలయాల వంటి జిల్లాలవారి రచనలు తెలంగాణా జిల్లాలను గురించి రాలేదు. తెలుగు అకాడమీ వారు కొన్ని జిల్లాల మాండలిక పదకోశాలు ప్రకటించినారు. కాని, వారి దృష్టి ఇంకా చరిత్రపైకి మళ్ళలేదు.

మిత్రులు శ్రీ బి. ఎన్. శాస్త్రిగారు ఇటీవల నల్లగొండజిల్లా సర్వస్వం ఆదిలాబాద్ జిల్లా సర్వస్వం ఇంకా ఏడు పెద్ద పెద్ద శాసన సంపుటాలు మూడు సంపుటాలుగా ఆంధ్ర దేశ చరిత్ర సంస్కృతి ఒక చేతి మీదుగా ప్రకటించినారు. ఇది చాలా పెద్ద పని.

తెలంగాణా జిల్లాలలో పాలమూరు జిల్లా చాలా పెద్దది. శ్రీశైలానికి సంబంధించిన ఉత్తర పశ్చిమ ద్వారాలు రెండీ జిల్లాలో ఉన్నవి కాబట్టి ఇక్కడ ప్రాచీన శిల్ప సంపద అపారంగా ఉంది. దాన్ని పర్యాటకులకు తెలుపవలసిన అవసరం గూడా ఉంది. అందుచేత శ్రీ బి ఎన్. శాస్త్రిగారి వంటి కృషి ఈ జిల్లాపై గూడ ఎవరైనా చేయవలసిన అవసరం ఉంది. ఆ దృష్టితో ఇది నేను చేసిన ఒక చిన్న ప్రయత్నం.

ఈ జిల్లాలో తాలూకాలు మూడు నాలుగు సార్లు మారినవి. ఇపుడు మండలాలు వచ్చి వాటిని మళ్ళీ కలగాపులగం చేసినవి కాబట్టి ఈ మార్పులలో సరిహద్దు గ్రామాలు తరుచుగా అటూ ఇటూ అవుతూ ఉండటం సహజం. నేను క్రీ. శ. 1962 నాటి సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశాన్ననుసరించి బీచుపల్లి రాజోలు బోరవెల్లి గ్రామాలు గద్వాలలోనే చేర్చినాను. కాని, అవి యిటీవల అలంపూరుకు మారినవని శ్రీ గడియారం రామకృష్ణ శర్మగారు తెలిపినారు. అలాగే గోపాలపురాన్ని గురించి శ్రీ S.V.రామారావుగారు తెలిపినారు. వారికి నా కృతజ్ఞతలు. ఈలాగే శ్రీశైలం ప్రాజెక్టులో కృష్ణాతీరంలోని ఆలయాలు మునకకు గురి అయినవి. అయితే ప్రభుత్వం వానిని విడుతలు విడుతలుగా తరలించింది. కాబట్టి ఏవి ఎప్పుడు తరలించినారో గూడ నాకు స్పష్టంగా తెలియలేదు అందుచేత అటువంటి వాని ఉనికిని గురించి ఇందులో పొరపాట్లు కొన్ని దొరలినవి.

ఉనికి మారినా ఊరు మారదు, ఊరు మారినా ఉన్న స్థితి మారదు అన్న నమ్మకంతో నేను ఇందలి గ్రామాలను, క్షేత్రాలను గురించి తెలిపినాను కాబట్టి ఇందులో దొరలిన పొరపాట్లను పాఠకులు సవరించుకుంటారని ఆశిస్తున్నాను.

—రచయిత.

రచయిత పరిచయం

తెలంగాణంలో మహబూబ్‌నగర్ జిల్లా చారిత్రక సాహితీరంగాల్లో చాలా ప్రాధాన్యం వహించింది. అన్నంభట్టు, అప్పకవి వంటి సంస్కృతాంధ్ర మహా పండితు లెందరో యిక్కడ జన్మించినారు. ఇపుడుగూడ కవి పండితు లనేకులీ మండలంలో ఉన్నారు. శ్రీ కపిలవాయి లింగమూర్తిగారికి ఈ జిల్లా జన్మభూమి. పరిశోధనా కార్యక్షేత్రం.

శ్రీ లింగమూర్తిగారు స్వయంకృషితో సాధించినదే ఎక్కువ. తెనుగు సాహిత్యములోని లోతులను తెలిసి ఆయా పద్ధతులపై అభినివేశమున్నవారు. చక్కని చిక్కనైన పద్య గద్య రచన చేయగలరు. పరిశీలన పత్రికలో (76 జూన్ నుండి 80 జూన్ వరకు) అనుస్యూతంగావచ్చిన వీరి రచనలు చారిత్రిక, సాహితీ సునిశిత పరిశీలనకు తార్కాణాలు.

వీరు నిత్య జీవితమునందు ఎంత నిరాడంబరులో రచనా జీవితమున కూడా అంతే. శ్రమను లెక్కచేయని పట్టుదలగల మనిషి. వీరిని చిదిమినచో మహబూబ్‌నగర్ జిల్లాలోని సాహిత్య చారిత్రక విశేషాలు గడగడా వినిపిస్తవి. వేటి ఆడంబరాలు, ఆర్భాటాలు, ప్రచారాలులేని పరిశోధకమూర్తి. రచనాధర్మాన్ని చేపట్టి చేతనయినంత మేరకు చదువుల తల్లికి ఊడిగం చేస్తున్నారు. ఈయన "ఈ నా పదార్పితక్షోణి నేరాజు ధర్మాసనంబుండి స్మృత్యర్థమనెనో" అనుకుంటూ ఆయా చారిత్రక ప్రదేశాల్లో తిరగడం స్వయంగా తెలిసినవాణ్ణి.

ఇప్పటికీ ఒకే ధ్యేయంతో నిరంతర నిరాడంబర సాహితీ క్షేత్ర కృషీవలునిగా శ్రీ లింగమూర్తిగారున్నారు.

డా॥ ఎన్. శ్రీరంగాచార్య (పాలెం)

381

ఈ రచయిత కృతులు - పరిష్కృతులు

		వెల
1.	పండరినాథ విఠల శతకం - ఏకప్రాస ఉత్పలాలు	5.00
2.	ఆర్యా శతకం - శబ్దార్థ చిత్రకందాలు-వివరణ సహితం	1.50
3.	చక్రతీర్థ మాహాత్మ్యం - అయిదాశ్వాసాలు గల స్థల చారిత్రక కావ్యం	4.00
4.	చూతపురీ విలాసం - ఎల్లూరి నరసింగకవి కృతం - పరిష్కృతం - యక్షగాన ప్రబంధం	10.00
5.	తిరుమలేశ శతకం - వ్యంగ్యవైభవంగల సీసాలు	5.00
6.	పరమహంస శతకం - సంపాదనం - పరిష్కరణం	2.00
7.	మహాక్షేత్రం మామిళ్ళపల్లి - స్థల చరిత్ర-వచనం	6.00
8.	శ్రీమద్భాగవత మాహాత్మ్యం - బోయినపల్లి వెంకటాచార్య కృతం - మూడాశ్వాసాల ప్రబంధం - సంపాదనం	12.00
9.	ఉప్పునూతల కథ - పిల్లల నవల	8.00
10	శ్రీ మత్ప్రతాపగిరి ఖండం - ఆరు ఆశ్వాసాలుగల స్థల చారిత్రక కావ్యం	18.00
11.	రామోదాహరణం - పెన్గలూరి వెంకటాద్రి కృతం సంపాదితం	2.00
12.	సాలగ్రామ శాస్త్రం - ప్రాచీన కృతి - సంపాదనం పరిష్కరణం	15.00
13.	దుర్గా భర్గ శతకాలు - అలంకారాలు - యతిప్రాసలు గల శతకద్వయం	5.00
14.	భువనమోహినీ విలాసం - పెన్గలూరి వెంకటాద్రి కృతం ద్విపద ప్రబంధం - సంపాదనం	12.00

15. క్షేపాల గంగోత్రి - తూమువంశ రెడ్ల చరిత్ర 20.00
16. సావిత్రి చరిత్ర - ప్రెగడరాజు చెన్నకృష్ణకవి కృతం
సువ్వాల ప్రబంధం - సంపాదనం 15.00
17. భాగవత కథాతత్త్వం - భాగవతంలోని పది కథలకు
విశేషార్థంతో కూడిన వివరణ 50.00
18. శ్రీ భైరవ కోన క్షేత్ర మాహాత్మ్యం - వచనం 5.00
19. శ్రీ రామ వచనాలు - ప్రాచీనకృతి - సంపాదనం 12.00
20. పాలమూరు జిల్లా దేవాలయాలు - చరిత్ర 100.00

384

Ship via Visakhapatnam Port

* For quick turn round of ships.
* For better labour productvity.
* For Cost-effective cargo handling.
* For Fast Clearance of cargoes.
* For better Industrial Relations.
* For concessional levy on export cargoes; and
* For regular container traffic feeder service.

* The leading port on the East Coast of India.
* Crossed 21 million tonnes in total traffic during 1989 - 90.
* Poised to handle 45.6 million tonnes by the turn of the century.

"A Growth Oriented Port"

Visakhapatnam Port Trust

Visakhapatnam

389

With Best Compliments From :

VISAKHAPATNAM DOCK LABOUR BOARD

VISAKHAPATNAM

ACHIEVEMENTS :

* Efficient performance of dock work.
* Cordial relations with labour.
* Nominal rates of levy for handling all export bulk cargoes excepting coastal cargoes.
* Operation of interchange ability schemes thereby assurence of supply of workers in full.

KABA103B141



మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KABA103B141
పుస్తకం పేరు	పాలమూరుజిల్లాదేవాలయాలు
తారీఖు	23 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	429
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	ci,xxviii,60b,106b,108b,112b,
లేని పేజీలు	41 to 44
తయారు చేసినది	saranya
పేజీలు విడదీసినది	saranya
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	prathyusha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	

blanks:114b,148b,188b,198b,375,bci